603

వాల్మీకి

రామాయణము

యుద్ధకాండ

అనువాదకుడు:

శ్రీ శ్రీనివాస శిరోమణి

శ్రీ. డి: రామలింగం గారిచే
సుందరయ్య ... కేంద్రానికి
బహూకరించనది

త్రివేణి పబ్లిషర్సు

పట్టణము - 1 — మద్రాసు - 1

తృతీయ ముద్రణము : 1966

Cod-12058
294.5922
27861

వెల : రూ. 6-00

సర్వహక్కులు అనువాదకునివి

త్రివేణి ప్రెస్
మచిలీపట్టణము

వాల్మీకి

రామాయణము

యుద్ధకాండ

౧

హనుమంతుడు చెప్పింది అంతా విని రాముడు సంతో
షముతో "ఓ వానరులారా, హనుమంతుడు ఈ భూమిమీద
దుర్లభము అయిన మహాకార్యాన్ని చేసినాడు. మరి ఒకడు
ఎవడూ చేయకలడు అని మనస్సులో నయినా అనుకోలేని మహాకా
ర్యము అది. వాయుదేవుడూ గరుత్మంతుడూ ఇప్పుడు ఈ హను
ఆ పాప[illegible]తుడూ తప్ప మరి ఒకడు ఎవడున్నూ మహాసముద్రాన్ని దాటి
చేయవ[illegible]తలిగట్టుకు పోవడము ఎరగము. ఇకన్ను చూడము. [illegible]న
ఆ రావణ[illegible]నవ యక్ష రాక్షసులకు ఎవరికీ ఎదిరించ నలవి కాకుండా రావణా
నీవు ఆల[illegible]డు ఏలుతూఉన్న లంకాపట్టణానికి ఎవడు అయినా పోయి
ఆ లంకా[illegible]ణాలతో తిరిగిరాగలడా. తిరిగి రావడము అట్లా ఉండనీయండి.
ములో [illegible]పార చూడటానికి అయినా అలవి కాకుండా రాక్షసులు
సేతువు [illegible]పాడుతూ ఉన్న ఆ లంకాపట్టణానికి హనుమంతుడు అంతటి
దేవేంద్రు[illegible]వంతుడు తప్ప మరి ఒకడు ఎవడు అయినా పోకలడా. సుగ్రీవు
కొట్టలేరు.[illegible] హనుమంతుడు చేసిన భృత్యకార్యము చాలా దొడ్డది. అట్లా
జయించిన[illegible]హాకార్యాన్ని నెరవేర్చడమే కాకుండా తన పరాక్రమానికి
రూపులూ[illegible]నుగుణముగా బలాన్ని ప్రదర్శించినాడు. ఆజ్ఞాపించిన దుర్ఘట
పట్టణాన్ని [illegible]ర్యాన్ని సాధించడమే కాకుండా ఆ కార్యానికి అనుకూలము
యిన తక్కిన పనులను అన్నిటినీ చక్కపెట్టుకొని వచ్చినాడు.

"ప్రభువంటివాణ్ణే భృత్యులలో ఉత్తముడు అంటాడు. సమర్థుడూ
పాడుచేస్తుం[illegible]హనుమంతుడూ అయినప్పటికిన్ని ఆజ్ఞాపించిన కార్యాన్ని
పోగొట్టుతు[illegible]మాత్రము నెరవేర్చి తన ఏలికను సంతోషపెట్ట తక్కిన పనుల

చేయకుండా వచ్చే భృత్యుణ్ణి మధ్యముడు అని అంటారు. సమర్థుడూ ఉత్సాహవంతుడూ హెచ్చరిక కలవాడూ అయినప్పటికిన్నీ తన ఏలిక ఆజ్ఞాపించిన కార్యాన్ని సాధించనివాణ్ణి అధముడు అంటారు. హనుమంతుడు ఆజ్ఞాపించిన కార్యాన్ని సాధించడమే కాకుండా తన గొప్పతనాన్ని చూపించినాడు. సుగ్రీవుణ్ణి సంతోషపెట్టినాడు. స్వామిభక్తితో ఆ వైదేహిని చూడటముచేత నన్నూ మహాబలవంతుడు అయిన లక్ష్మణుణ్ణీ మా రఘువంశాన్నీ కాపాడినాడు. ఈ సంతోషవార్త చెప్పిన ఈ హనుమంతుణ్ణి ఇప్పుడు నా ఈ దీనావస్థలో తగినట్టు సత్కరించలేకుండా ఉన్నాను. ఇందుకు నేను మరింత దుఃఖపడుతున్నాడు. ఈ సమయాన ఈ మహాపరాక్రమశాలికి నేను ఇవ్వకలిగింది నా కౌగిలింతే. ఇదే నా సర్వస్వము" అంటూ సంతోషములో పులకాంకితుడు అయినాడు. కృతకృత్యుడు అయి వచ్చిన ఆ మహాపరాక్రమశాలిని హనుమంతుణ్ణి కౌగలించుకున్నాడు.

అంతట రాముడు ఆలోచిస్తూ వానరేశ్వరుడు సుగ్రీవుడు వింటూ ఉండగా "సీతాదేవిని వెతకటము మాత్రము అన్నివిధా చక్కగా జరిగింది. కాని సముద్రాన్ని తలచుకొంటూ ఉంటే మనస్సు కలవరపడుతూ ఉంది. దాటనలవికాని ఆ మహాసముద్రాన్ని ఈ వానరులు అందరూ ఎట్లా దాటి దక్షిణతీరం పోతారు. సీతాదేవి క్షేమవృత్తాంతము అయితే తెలిసింది. ఈ వానరులు అందరూ సముద్రము అవతలిగట్టు చేరే ఉపాయం ఏమిటి" అని అడిగినాడు.

అంతట ఆ మహాబాహువు ఆ శత్రుసంహారకుడు రాముడు దుఃఖములో కలవరపడిపోయి ఆలోచించసాగినాడు.

౨

అట్లా దిగులుపడుతూ ఉన్న రాముణ్ణి ఆ శ్రీమంతుడు సుగ్రీవుడు చూచి "ఓ ప్రభూ, నీవు వీరుడవు. సామాన్యమానవుడివలె దిగులుపడడము ఏమిటి. కృతఘ్నుడు స్నేహాన్ని వదలిపెట్టుతాడు. నీవు దుఃఖాన్ని వదలిపెట్టు. సీతా

వృత్తాంతమూ శత్రువుల ఉనికిపట్టూ మనకు ఇప్పుడు తెలిసినవి. నీవు దిగులుపడవలసిన కారణము నాకు కనపడడములేదు. ఓ ప్రభూ, నీవు మహామతిమంతుడవు. శాస్త్రవిదుడవు. ఉహాపోహలలో సమర్థుడవు. పండితుడవు. ఆత్మవేత్తవు. అందువల్ల అపవర్గాన్ని వదిలిపెట్టేట్టు ఉత్సాహాన్ని చెడగొట్టే ఈ ఆలోచనను వదిలిపెట్టు. మేము మహాసముద్రాన్ని లంఘించి లంకాపట్టణానికి పోతాము. నీ శత్రువును రావణాసురుణ్ణి మేము నాశనము చేసి వేస్తాము కూడానూ.

"నిరుత్సాహములోనూ దైన్యములోనూ దుఃఖములోనూ కలవరపడిపోతూ ఉంటే అన్ని పనులూ పాడు అయిపోతవి. అంతేకాకుండా ఆపదలపాలు కావడమున్నూ సంభవిస్తుంది. ఈ మన వానరసేనానాయకులు శూరులు. సమర్థులు. వీండ్లు అందరూ నిన్ను సంతోషపెట్టడానికి అత్యుత్సాహములో అగ్నిహోత్రములోనయినా దూకుతారు. వీండ్ల ఉత్సాహము నాకు తెలుసును. ఈ విషయములో నా ఊహ యథార్థము. నేను నా పరాక్రమములో ఆ పాపకర్ముణ్ణి సంహారముచేసి సీతాదేవిని తీసుకొని వచ్చేట్టు నీవు చేయవలెను. ఓ రామా, మహాసముద్రానికి సేతువు కట్టేట్టూ ఆ రావణాసురుడి లంకాపట్టణాన్ని వానరులు అందరూ చూచేట్టూ నీవు ఆలోచించి చేయవలెను. త్రికూటపర్వతముమీద ఉన్న ఆ లంకాపట్టణము కనపడితే చాలును. ఆ రావణాసురుడు యుద్ధములో చచ్చిపోయినాడు అనే అనుకో. మహాసముద్రములో సేతువు కట్టకపోయేట్లయితే సురాసురులు అందరూ ఏకము అయి దేవేంద్రుడివెంట బయలుదేరినప్పటికిన్నీ ఆ లంకాపట్టణాన్ని కొట్టలేరు. లంకాపట్టణముదాకా సేతువు కట్టితే వానరసైన్యము జయించినట్టే. అంతేకాదు. యుద్ధములో శూరులూ కామరూపులూ అయిన మన వానరులు రాక్షసులతోకూడా ఆ లంకాపట్టణాన్ని పెళ్ళగించి తేకలరు. ఈ వానరులు అంతటి శక్తిమంతులు.

"ప్రభూ, నీవు దిగులుపడవద్దు. దిగులే సమస్తపనులనూ పాడుచేస్తుంది. దిగులే ఈ లోకములో మానవుడి శౌర్యాన్ని పోగొట్టుతుంది. రామా, నీవు మహాప్రాజ్ఞుడవు. శౌర్యము అవలం

బించు. ధైర్యముతో పరాక్రమముతో నీవు ఇప్పుడు నిలువవలెను. నీవంటి శూరులూ మహాత్ములూ అయినవారు అగపడకుండా ఉన్న దానికోసమూ చెడిపోయినదానికోసమూ దుఃఖపడేటట్లయితే సమస్త కార్యాలూ నాశనము అయిపోతవి.

"ఓ రామా, నీవు బుద్ధిమంతులలో ఉత్తముడవు. సర్వ శాస్త్రార్థకోవిదుడవు. నావంటి సచివులతో కూడా శత్రువులను జయించడానికి బయలుదేరడమే కర్తవ్యము. నీవు ధనుర్ధరుడవు అయి నిలుచుంటే రణరంగములో నీఎదుట నిలవకలవాడు ఎవడూ ముల్లోకాలలోనూ లేడు. వానరులు నీకార్యాన్ని నిర్వహిస్తారు. వానరులమీద ఉంచే ఏపనీ పాడు అయిపోదు. ఓ రామా, సముద్రాన్ని దాటి త్వరలోనే నీవు సీతాదేవిని చూస్తావు. ఇంతవరకూ దుఃఖపడ్డది చాలు. కోపము అవలంబించు. ఏప్రయత్నమూ చేయకుండా నిరుద్యోగులుగా ఉండే క్షత్రియులు మందభాగ్యులు. భయంకరుడికి అందరూ భయపడుతారు. నదులు అన్నీ వచ్చిపడే సముద్రము ఇప్పుడు భయంకరముగానే ఉంటుంది. నీది సూక్ష్మబుద్ధి. ఆ సముద్రాన్ని దాటిపోయే ఉపాయము మా అందరితోనూ ఇక్కడనే యోజించు. సముద్రము దాటి నా సైన్యము అంతా లంకకు చేరేటట్లయితే నీకు జయము సిద్ధించినట్లే. శూరులూ కామ రూపులూ అయిన వానరులు యుద్ధములో రాళ్లవానా చెట్లవానా కురిపించి రాక్షసులను రూపుమాపివేస్తారు.

"ఓ రామా, నీవు యుద్ధము కావలెను అనుకొంటున్నావు. అందువల్ల మనము ఏదోవిధముగా ఆ సముద్రాన్ని దాటి పోతాము. ఆ రావణాసురుణ్ణి సంహారము చేసివేసినట్టే తలుస్తున్నాను.

"ప్రభూ, ఎన్నో మాటలు ఎందుకు. నీవు అన్నివిధాలా జయిస్తావు. నాకు శుభనిమిత్తాలు కనపడుతున్నవి. నా మనస్సులో సంతోషముగా ఉంది" అని సుగ్రీవుడు చెప్పినాడు.

౩

ఇట్లా యుక్తియుక్తముగా సుగ్రీవుడు చెప్పింది ఆ పరమార్థ వేత్త రాముడు అంగీకరించినాడు. హనుమంతుణ్ణి చూచి "ఓ

వీరుడా, సేతువును కట్టికానీ సముద్రాన్ని ఎండకొట్టికానీ తపో బలముతోకానీ సముద్రాన్ని దాటిపోయే సామర్థ్యము నాకు ఉంది. చొరనలవికాని ఆ లంకాపట్టణములో ఎన్నికోటలు ఉన్నవి. సైన్య పరిమాణము ఎంత. ద్వారాలలోనుంచి లోపలికి పోనీయకుండా ఎట్లా కావలికాస్తూ ఉందీ ఆ పట్టణ ప్రాకార పరిఘాదులు ఎట్లా నిర్మించిందీ చెప్పు. రాక్షసుల గృహాల సన్నివేశాన్ని గురించిన్నీ తెలుసుకోవలెను అనుకొంటున్నాను.

"ఓ హనుమంతుడా, నీవు సమర్థుడవు. నీవు లంకాపట్టణాన్ని అంతా సావధానముగా చక్కగా చూచిఉంటావు. నీవు చూచింది చూచినట్టు సర్వమూ నాకు చెప్పు" అని రాముడు అడిగినాడు.

అంతట ఆ వాక్యకోవిదుడు హనుమంతుడు "ఓ ప్రభూ, చొరబడడానికి అలవికాకుండా లంకాపట్టణము ఎట్లా గుప్తముగా ఉందీ సైన్యాలు ఎట్లా కాపాడుతూ ఉందీ రాక్షసులు ఎటువంటి స్వామిభక్తితో ఉంటూ ఉందీ చెప్పుతాను. రావణాసురుడి ప్రభా వమునుంచి ఆ లంకాపట్టణసర్వసమృద్ధినిగురించీ భయంకరము అయిన సముద్రాన్నిగురించీ సైన్యవిభాగాన్నిగురించీ రథ గజ తుర గాది వాహనాలనుగురించీ చెప్పుతాను. వినవలసింది.

"ప్రభూ, ఆ లంకాపట్టణములో ప్రజలు అందరూ మహా సంతోషముతో ఉంటున్నారు. మదపుటేనుగులూ గొప్పరథాలూ గుర్రాలూ సమృద్ధముగా ఉన్నవి. లెక్కలేని అంత మంది రాక్షసులు అక్కడ నివసిస్తూఉన్నారు. ఆ లంకాపట్టణానికి నాల్గు దిశలా నాల్గు పెద్ద పెద్ద ద్వారాలు గట్టి గట్టి తలుపులతో ఉన్నవి. ఆ తలుపులకు పెద్ద పెద్ద గడియలు ఉన్నవి. ఆ ద్వారాలదగ్గర పెద్ద పెద్ద బాణమోచకయంత్రాలు శిలామోచకయంత్రాలూ ఉన్నవి. శత్రుసైన్యాలు అక్కడికి వచ్చినప్పుడు ఆ యంత్రాలలో నుంచి బాణాలూ శిలలూ వర్షముగా కురిపించి వెనకకు మళ్ళకొట్టు తారు. ఆ ద్వారాలదగ్గర పరమపరాక్రమవంతులు అయిన రాక్షసయోధులు సమూహాలు సమూహాలుగా ఉన్నారు. ఇను ముతో చేసిన భయంకరము అయిన శతఘ్నులు అక్కడ వందల

కొద్దీ అమర్చి ఉన్నవి. ఆ శతఘ్నులను ప్రయోగిస్తే ఒక్కొక్క శతఘ్నికి ఒక్కొక్క వందమంది చచ్చిపోతారు.

“ఆ లంకాపట్టణము చుట్టూ సువర్ణమయము అయిన ప్రాకారము ఉంది. అది ఎంతో ఎత్తుఅయింది. దానికి అక్కడక్కడ పద్మరాగ ప్రవాళ వైడూర్య ముక్తామణులు అలంకారముగా అమర్చి ఉన్నవి. ఆ ప్రాకారాన్ని ఆనుకొని పెద్ద అగడ్త ఉంది. అందులో నీళ్లు ముట్టుకోవడానికి వీలుకానంత చల్లగా ఉంటవి. మహాగ్రాహాలూ మహామీనాలూ ఆ అగడ్తలో తిరుగుతూ ఉంటవి. ఆ నాల్గుద్వారాలకున్నూ ఆ అగడ్తమీదనుంచి విశాలము అయిన వంతెనలు ఉన్నవి. అవి దారువులతో చేసినవి. ఆ వంతెనలను అవసరము అయినప్పుడు ఎత్తివేయడానికి దించివేయడానికీ అక్కడనే పెద్దపెద్ద యంత్రాలు ఉన్నవి. ఆద్వారాలను కావలి కాసేవారి గృహాలున్నూ అక్కడనే ఉన్నవి. శత్రుసైన్యాలు వచ్చినప్పుడు ఆ వంతెనలను ఎత్తివేస్తారు. అప్పుడు ఆ అగడ్తను దాటి లోపలికి పోవడము అశక్యము. ఆ లంకాపట్టణానికి అట్లా ఉన్న ఆ వంతెనలలో కదిలించడానికి అలవికాని బలిష్ఠము అయిన బంగారుస్తంభాలమీద ఒక వంతెన ఉంది. ఆ వంతెనమీద శోభాయమానము అయిన అరుగులు ఉన్నవి.

“ఓ ప్రభూ, రావణాసురుడిది చలనములేని స్వభావము. ఏమరుపాటు లేనివాడు. ఎప్పుడూ యుద్ధము చేయవలెను అనే కోరికతో ఆ రావణాసురుడు జాగరూకతతో స్వయముగా తన సైన్యాలను చూచుకొంటూ ఉంటాడు.

“ఆ లంకాపట్టణము త్రికూటపర్వతముమీద ఉంది. ఆ పర్వతముమీదికి పోవడానికి ఆధారము ఏమీ లేదు. దేవతలు సహితమూ అక్కడికి పోలేరు. ఆ పట్టణములోకి పోవడానికి నాలుగు అడ్డంకులు ఉన్నవి. ఆ పట్టణము చుట్టూ ఎప్పుడూ జలాలు సమృద్ధముగా ప్రవహించే నదులు ఉన్నవి. అది జలదుర్గము దాన్ని దాటితే పర్వతపంక్తులు ఉన్నవి. అది పర్వతదుర్గము. వాటిని దాటితే పెద్ద అడవులు ఉన్నవి. అది వనదుర్గము. వాటిని దాటితే చుట్టూ ప్రాకారమూ అగాధము అయిన అగడ్తా ఉంది. ఇది

కట్టిన దుర్గము. ఈ విధముగా నాలుగు దుర్గాల మధ్యను ఆ లంకా పట్టణము ఉంది. ఆ పట్టణము విశాలము అయిన సముద్రానికి అవతలగట్టున ఉంది. ఆ సముద్రములో ఓడదారి లేదు. అక్కడి వారికి ఏ దేశమువారి వార్తలూ తెలిసే అవకాశము లేదు.

అది దేవేంద్రుడి అమరావతీ పట్టణమువంటిది. పర్వతాగ్రము మీద ఉండడమునుంచి అది పరమదుర్జయముగా ఉంది. అందుకు అనుగుణముగా అగడ్తలోనూ బాణశిలామోచకాది నానావిధ యంత్రాలలోనూ అది అజేయముగా ఉంది.

ఆ లంకాపట్టణపు తూర్పువాకిటిదగ్గర ఎదిరించ నలవికాని రాక్షసయోధులు పదివేలమంది ఉంటున్నారు. వాండ్లు శూల పాణులు. వాండ్లు యుద్ధములో ఖడ్గాలతో పోరాడుతారు. దక్షిణ ద్వారముదగ్గర చతురంగ సైన్యాలతో ఒక లక్షమంది రాక్షస యోధులు ఉంటున్నారు. వాండ్లు అందరూ పరమసమర్థులు. మరి పదిలక్షలమంది రాక్షసయోధులు డాళ్ళతోనూ ఖడ్గాలతోనూ పశ్చిమద్వారముదగ్గర కావలికాస్తూ ఉంటారు. వాండ్లు అందరూ సర్వాస్త్రకోవిదులు. ఉత్తరద్వారముదగ్గర నూరుకోట్లమంది రాక్షసయోధులు ఉన్నారు. వారిలో కొందరు రథికులు. కొందరు అశ్వికులు. కొందరు గజసాదులు. వారు అందరూ గొప్ప వంశాలలో పుట్టినారు. వాండ్లను రావణాసురుడు ఎప్పుడూ గౌరవిస్తూఉంటాడు. వాండ్లే కాకుండా ఎదిరించ నలవికాని రాక్షసయోధులు వందలకొద్దీ వేలకొద్దీ ఒక కోటిమంది పట్టణము మధ్యను ఉంటున్నారు.

"ఓ ప్రభూ, నేను ఆ అగడ్తమీద వంతెనలు పగులకొట్టి నాను. ఆ అగడ్తను పూడ్చివేసినాను. ఆ పట్టణాన్ని దహించి వేసినాను. ఆ ప్రాకారాన్ని పడకొట్టినాను. ఆ రావణాసురుడి సైన్యములో కొంతభాగాన్ని—మహాపరాక్రమవంతులు అయిన రాక్షసవీరులను కొంతమందిని—నేను చంపివేసినాను. ఏదో ఒక విధముగా సముద్రాన్ని దాటిపోవచ్చును. లంకాపట్టణాన్ని అంతా వానరులు నాశనము చేసివేస్తారు అని నమ్మవలసింది. అంగదుడూ ద్వివిదుడూ మైందుడూ జాంబవంతుడూ పనసుడూ నలుడూ సేనా నాయకుడు నీలుడూ పోతే చాలును. తక్కిన వానరసైన్యములో

పని లేదు. ఆకాశమార్గాన పోయి పర్వతాలలోనూ వనాలలోనూ ప్రాకారాలలోనూ బహిర్ద్వారాలలోనూ అగడ్తలలోనూ ఉన్న ఆ మహాపట్టణాన్ని పెళ్ళగించి తెస్తారు. వానరసైన్యానికి అంతటికీ సారభూతులుగా ఉన్న అంగదాదులను వెంటనే పొమ్మని ఆజ్ఞాపించు. జైత్రయాత్రాయోగ్యము అయిన ముహూర్తము నిశ్చయించు" అని చెప్పినాడు.

౪

హనుమంతుడు చెప్పింది అంతా యథాక్రమముగా ఆ మహాతేజోవంతుడు ఆ సత్యపరాక్రముడు రాముడు విని "ఓ హనుమంతుడా, భయంకరుడు అయిన ఆ రావణాసురుడి లంకాపట్టణాన్ని నేను త్వరలోనే మథించి వేస్తాను. నిజము.

"ఓ సుగ్రీవుడా, ఈ ముహూర్తములోనే మనము ప్రయాణము అయిపోవలెను. దివాకరుడు దివామధ్యానికి వస్తూ ఉన్నాడు. ఇది అభిజిన్ముహూర్తము. ఇదే తగిన ముహూర్తము. ఈ ముహూర్తములో ప్రయాణము అయిపోయేటట్లయితే మనకు జయము అవుతుంది. ఇదే విజయముహూర్తము. సీతాదేవిని ఎత్తుకొనిపోయిన ఆ రావణాసురుడు ఎక్కడికిపోయినా వాణ్ణి పట్టుకొని చంపివేస్తాను. నేను ప్రయాణము అయి వస్తూ ఉన్న సంగతి సీతాదేవి వింటుంది. బాధపడుతున్నవాడు విషముతాగి చావబోతున్న సమయాన చేతికి అమృతకలశము అంది బ్రతికినట్టుగా నేను వస్తూ ఉన్నాను అనే వర్తమానము తెలిసి సీతాదేవి జీవిస్తుంది.

"ఓ సుగ్రీవుడా, ఇవ్వేళ ఉత్తరఫల్గునీ నక్షత్రము. నేను పునర్వసూ నక్షత్రములో పుట్టినాను. కాబట్టి ఇది నాకు సాధన తార. రేపు హస్తానక్షత్రము. అది నాకు నైధవతార అవుతుంది. అందువల్ల సమస్తసైన్యాలతోనూ ఇవ్వేళనే మనము బయలుదేరి పోవలెను. నాకు ఇప్పుడు శుభనిమిత్తాలు తోస్తున్నవి. నేను ఆ రావణాసురుణ్ణి సంహరించి వేస్తాను. జానకిని తీసుకొనివస్తాను. నా మనోరథము సిద్ధిస్తుంది అని తెలియచెప్పతున్నట్టు నా కంటి పైభాగము అదురుతూ ఉంది" అని చెప్పినాడు.

ఇట్లా ఆ ధర్మాత్ముడు రాముడు చెప్పగానే లక్ష్మణుడూ సుగ్రీవుడూ అతనిని అభినందించినారు. అంతట ఆ కార్యకోవిదుడు రాముడు మళ్ళీ "ఓ సుగ్రీవుడా, బలవంతులు అయిన వానరవీరులను ఒక లక్షమందిని వెంటపెట్టుకొని నీలుడు దారితీస్తూ ముందుగా పోవలెను. ఓ నీలుడా, నీవు స్వచ్ఛజలాలూ స్వాదుఫల మూలాలూ తేనె సమృద్ధముగా దొరికే చల్లని అడవులలోనుంచి పోయేదారిన త్వరగా సేనను తీసుకొనిపో. దురాత్ములు రాక్షసులు మన రాక తెలుసుకొని దారిలో దొరికే ఫలమూలోదకాలలో విషము మొదలుఅయినవి కలుపుతారు. అందువల్ల నీవు ఎప్పుడూ ఏమరుపాటు లేకుండా సన్నద్ధుడవు అయి ఉండి రాక్షసులు అట్లా చేయకుండా చూడవలెను. పల్లపు ప్రదేశాలలోనూ జలమునుంచి పోనలవికాని ప్రదేశాలలోనూ మహారణ్యాలలోనూ శత్రుసేనలు దాగుకొని ఉండి హఠాత్తుగా మనసైన్యాలపయిన పడవచ్చును. వానర వీరులు ఆకాశానికి ఎగిరి ఆ యా ప్రదేశాలలో శత్రుసైన్యము ఉందీ లేందీ కనిపెట్టి వానరసైన్యాన్ని నడిపించవలెను.

"ఓ సుగ్రీవుడా, మనము భయంకరము అయిన పనికి పూనుకొన్నాము. ఇందుకు పరాక్రమమే అవసరము. సారములేని ఏ కొంచెము సైన్యము అయినా ఉన్నట్లయితే దానిని మనము ఇక్కడనే వదిలిపెట్టిపోవలెను. ఆ సైన్యము ఇక్కడివారికి ఉపయోగిస్తుంది. మహాబలవంతులు అయిన సింహాలవంటి వానర వీరులు వందలకొద్దీ వేలకొద్దీ సముద్రము పొంగి పొర్లుతున్నట్టు భయంకరము అయిన అగ్రసేనలో పోవలెను. పర్వతాకారుడు అయిన గజుడూ మహాబలవంతులు అయిన గవయుడూ గవాక్షుడూ ఆవులమందకు ముందు గర్వముతో పోయే ఆబోతులవలె సైన్యానికి ముందు నడువవలెను. ఎగిరిపోయేవారిలో శ్రేష్ఠుడు అయిన ఋషభుడు సైన్యాన్ని కుడిప్రక్కను కాపాడుతూనూ ఎదిరించ నలవికాని మదపుటేనుగువంటి గంధమాదనుడు సైన్యాన్ని ఎడమ ప్రక్కను కాపాడుతూనూ రావలెను.

"దేవేంద్రుడు ఐరావతము ఎక్కిపోయేట్టు నేను ఈ హనుమంతుణ్ణి ఆరోహించి సైనికులను పురికొల్పుతూ సేనామధ్యాన

వస్తాను. కుబేరుడు సార్వభౌమము అనే ఉత్తరదిగ్గజాన్ని ఎక్కిపోయేట్టు యముడివంటి ఈ లక్ష్మణుడు అంగదుణ్ణి ఆరోహించి వస్తాడు. భల్లూకరాజూ మహాబలవంతుడూ అయిన జాంబవంతుడూ సుషేణుడూ వేగదర్శి అనే ముగ్గురున్నూ సేనామధ్యభాగాన్ని కాపాడుతూ రావలెను " అని చెప్పినాడు.

ఈ విధముగా రాముడు చెప్పగానే ఆ వానర వాహినీపతి సుగ్రీవుడు మహాపరాక్రమవంతులు అయిన వానరవీరులను అందరినీ వారి వారి సైన్యాలతో ప్రయాణము అయి రావలెను అని ఆజ్ఞాపించినాడు. అంతట ఆ వానరసమూహాలు యుద్ధోత్సాహముతో ఎగిరి గంతులువేస్తూ పర్వతశిఖరాలమీదనుంచీ గుహాలలోనుంచీ వచ్చినవి.

అప్పుడు ఆ ధర్మాత్ముణ్ణి రాముణ్ణి లక్ష్మణుడూ సుగ్రీవుడూ పూజించినారు. మహావానరసేనాసమూహము కదిలింది. రాముడి ముందు వెనకలనూ ప్రక్కలనూ ఏనుగులవంటి వానరసైనికులు వందలకొద్దీ వేలకొద్దీ లక్షలకొద్దీ నడిచినారు. సుగ్రీవుడు ఏలుతూ ఉన్న ఆ వానరయోధులు గర్వముతోనూ సంతోషముతోనూ గంతులువేస్తూనూ గర్జిస్తూనూ సింహనాదాలు చేస్తూనూ పరుగులెత్తుతూనూ గుత్తులు గుత్తులుగా పూలుపూసిన చెట్లకొమ్మలు పట్టుకొని కమ్మని తేనెలు తాగుతూనూ ఫలమూలాలు తింటూనూ దక్షిణదిక్కుగా సాగిపోయినారు.

గర్వముతో నడుస్తూ ఉన్న ఆవానరులలో కొందరు కొందరిని పైకి ఎత్తినారు. ఆ పైకి ఎత్తినవారిని కొందరు కింద పడతోసినారు. కింద పడతోసినవారిని కొందరు ఆక్షేపించినారు. కొందరు తమను పడతోసినవారిని తిరిగి కింద పడతోసినారు. "మనము రావణాసురుణ్ణి చంపివేయవలెను. రాక్షసులను అందరినీ రూపుమాపవలెను" అంటూ రాముడి సమీపములో వానరవీరులు అరిచినారు.

నీలుడు ఋషభుడూ కుముదుడూ అనే ముగ్గురూ అనేకమంది వానర వీరులతో ముందుగా దారిచేస్తూ పోయినారు. అమితబలవంతులూ పరమభయంకరులూ అయిన వానరవీరుల మధ్యను

సుగ్రీవుడూ రామలక్ష్మణులూ పోయినారు. శతవలి అనే పరమ పరాక్రమవంతుడు ఒక్కడూ పదికోట్లమంది వానరవీరులతో ఆ వానరసైన్యాన్ని అంతా కాపాడుతూ నడిచినాడు. నూరుకోట్ల పరివారము కల కేసరీ పనసుడూ గజుడూ అర్కుడూ అనే మహా బలవంతులు ఆ వానరసైన్యాన్ని ఒక పార్శ్వాన కాపాడుతూ నడిచినారు. పరమపరాక్రమవంతుడూ ఎగిరిపోయేవారిలో శ్రేష్ఠుడూ సమస్త వానరసేనానాయకుడూ అయిన నీలుడు ఆ వానర సైన్యాన్ని అన్నివైపులా తిరిగి చూచుకొంటూ నడిచినాడు. దధిముఖుడు ప్రజంఘుడూ రంభుడూ రభసుడూ అన్నివైపులా తిరిగి చూస్తూ వానరవీరులు త్వరత్వరగా నడవవలెను అని ప్రోత్సహించినారు.

సముద్రము పొంగి పొర్లిపోతూ ఉన్నట్టు నడుస్తూఉన్న ఆ వానరసైన్యము భయంకర కోపుడు అయిన రాముడు ఆజ్ఞాపించినందువల్ల గ్రామాలప్రక్కకుకానీ నగరాల ప్రక్కకుకానీ పోకుండా సముద్రముకన్నా భయంకరముగా ఘోషిస్తూ ముందుకు సాగిపోయింది. మంచి రౌతు నడిపించే ఉత్తమజాతి గుర్రాలవలె ఆ కపికుంజరులు అందరూ అమితవేగముతో రాముడి ప్రక్కను నడిచినారు. హనుమంతుడూ అంగదుడూ మోసుకొనిపోతూఉన్న ఆ మానవోత్తములు రామలక్ష్మణులు అప్పుడు రాహు కేతువులు సగము మింగిన సూర్యచంద్రులవలె కనిపించినారు.

గోళ్ళూ కోరలూ ఆయుధాలుగా పోరాడే వానర భల్లూక వీరులతో ఉన్న ఆ మహాసేనాసమూహము భూమిని అంతా ఆవరించి నడుస్తూ ఉంటే రేగిన దుమ్ము సూర్యప్రభలను కనపడకుండా చేసివేసింది. అంతే కాదు. ఆ దుమ్ము అతిభయంకరముగా లోకము అంతటా కమ్ముకొంది. ఆకాశాన్ని మహామేఘాలవలె భూమినీ భూమిమీద ఉన్న పర్వతాలనూ వనాలనూ ఆ దక్షిణ దిక్కును అంతానూ భయంకరము అయిన ఆ వానరవాహిని కమ్మివేస్తూ పోయింది. ఆ వానరబలము ఆ విధముగా బారులు కట్టి అమితవేగముతో పోతూఉంటే మహానదులూ మహాపర్వతాలూ ఎన్నో యోజనాల దూరము వెనకకు పరుగులెత్తుతున్నట్టు కనిపించినవి.

ఆ వానరసైన్యము దారిలో నిర్మలోదకాలు ఉన్న సరస్సులు అడ్డము అయినప్పుడు ప్రక్కనుంచీ చెట్లు క్రిక్కిరిసి పెరిగిన పర్వతాలు అడ్డము అయినప్పుడు అడుగునుంచీ మిట్టపల్లాలు లేని సమప్రదేశము అడ్డము అయినప్పుడు అంతటా వ్యాపించిన్నీ ఫలవంతము అయిన వనాలు అడ్డము అయినప్పుడు మధ్యనుంచిన్నీ పోయినవి. అట్లా సంతోషాతిశయముతో ఆ మహాసైన్యములో వీరులు అందరూ వాయువేగముతో నడుస్తూ రామకార్యార్థము ప్రతిఒక్కరూ తమకు ఉన్నదానికన్నా అధికపరాక్రమము తెచ్చుకొంటూ తమ తమ సంతోష పరాక్రమ బలాతిశయాలను ఒకండ్లకు ఒకండ్లు చూపించుకొంటూ యౌవనోత్సుకతతో తమ తమ దర్పాన్ని వివిధ విధాలా ప్రదర్శించుకొంటూ సాగిపోయినారు. అప్పుడు ఆ వానర సేనలో కొందరు అమితవేగముతో నడిచినారు. కొందరు ఎగురుతూ పోయినారు. అరణ్యవాసులు అయిన కొందరు కిలకిల ధ్వనులు చేస్తూ పరుగులెత్తినారు. కొందరు మహాధ్వని అయ్యేట్లు తమ తోకలను ఝాడించి నేలమీద కొట్టినారు. కొందరు నేల అదిరిపోయేట్లు కాళ్ళతో తొక్కినారు. కొందరు చేతులుచాచి కొండరాళ్ళను పెకలించినారు. కొందరు పెద్దపెద్ద చెట్లను విరిచి వేసినారు. కొండలమీద తిరిగే వానరులు కొందరు అప్పుడు పర్వతశిఖరాలు ఎక్కుతూ మహానాదాలు చేసినారు. కొందరు సింహనాదాలు చేసినారు. కొందరు తమ ఊరువుల వేగముతో రకరకాల లతలనూ తెంపివేసినారు. కొందరు పరాక్రమవంతులు విజృంభించి రాళ్ళతోనూ పెద్దపెద్ద చెట్లతోనూ ఆటలాడినారు. భయంకరులు అయిన ఆ వానరులు నూర్లు నూర్లుగానూ వేలు వేలుగానూ లక్షలు లక్షలుగానూ గుంపులుకట్టి కొట్లకొద్దీ పోతూ ఉంటే భూమి కనపడలేదు. సుగ్రీవుడు అందరినీ అన్నివిధాలా కాపాడుతూ ఉంటే ఆ మహావానరవాహిని సంతోషముతోనూ ఉత్సాహముతోనూ అహోరాత్రములు ఎడతెగకుండా నడిచింది. సీతాదేవిని విడిపించుకొని రావడానికి యుద్ధము చేయవలెను అనే సంతోషముతో ఎక్కడనూ ఒక్క ముహూర్తముసేపు అయినా ఆగకుండా అమితవేగముతో ఆ మహాసైన్యము సాగిపోయింది.

నానావిధ వృక్షలతాదులతో ఉన్న సహ్యపర్వతమూ మలయమహీధరమూ ఉన్నచోటికి ఆ వానరవాహిని పోయింది. ఆ సహ్య మలయ పర్వతాలమీద ఉన్న నానావిధ అరణ్యాలను నదులనూ సెలయేళ్ళనూ రాముడు చూస్తూ నడుస్తున్నాడు. మనోహరము అయిన ఆ పర్వతశిలలమీద ఉన్న నానావిధ వృక్షాలూ గాలికి కదిలి ఆ వానరసేనాసమూహముమీద పూలు వెదచల్లినవి. ఆ అడవులలోనుంచి గాలి మధుగంధాన్ని గుబాళిస్తూనూ తుమ్మెదల ఝుంకారము అనే పాటలు పాడుతూనూ చందనమువలె చల్లగా దేహానికి సోకుతూ హాయిగా వీచింది. మనోహరము అయిన ఆ పర్వతసానువులలో విరగపూసిన మొగలిపొదలూ తెల్లవావిలి చెట్లూ గురివిందచెట్లూ మాధవీలతలూ దుంపరాశ్మచెట్లూ మొల్ల చెట్లూ కానుగుచెట్లూ ఇప్పచెట్లూ పొగడచెట్లూ వేగిసచెట్లూ తుమ్మికిచెట్లూ బొట్టుగుచెట్లూ నాగకేసరచెట్లూ మామిడిచెట్లూ కలిగొట్టుచెట్లూ కాంచనముచెట్లూ ఖర్జూరచెట్లూ ఏడుమద్దిచెట్లూ ఇరుగుడుచెట్లూ అడవిమల్లెలూ ఎర్రగోరింటచెట్లూ ఈతచెట్లూ నేమిచెట్లూ కడిమిచెట్లూ నీలాశోకచెట్లూ ఉలిమిరిచెట్లూ ఊడుగు చెట్లూ పద్మకవృక్షాలూ వానరసైన్య కోలాహలానికి కదలి పోయినవి.

ఆ సహ్యపర్వతముమీద నిర్మల శీతలోదకాలతో నడబావులూ నీళ్ళు నిలచిన పల్లాలూ జలాశయాలూ కనిపించినవి. వాటి సమీపములో చక్రవాకపక్షులూ కారండవపక్షులూ నీటి కాకులూ క్రౌంచపక్షులూ తిరుగుతున్నవి. అక్కడి వనాలలో అడవిపందులూ తరక్షువులూ సింహాలూ పెద్దపులులూ భయంకరము అయిన అనేక దుష్టసర్పాలూ నివసిస్తున్నవి. ఆ జలాశయాలలో కమలాలూ చెంగల్వలూ తెల్లకలువలూ నల్లకలువలూ ఇంకా వివిధజల పుష్పాలూ మనోహరముగా వికసించినవి. ఆ పర్వతసానువులలో నానావిధ పక్షిగణాలూ పాటలు పాడుతూఉన్నవి. వానరులుఅందరూ ఆ పర్వతముమీదికి పోయి ఆ జలాశయాలలో దిగి ఒకరిమీద ఒకరు నీళ్లు చల్లుకొంటూ ఆటలాడుతూ స్నానము చేసినారు. అక్కడ చెట్లను పండిన అమృతమువంటి ఫలాలనూ అక్కడి మూలాలనూ తిన్నారు. అక్కడి పూతేనెను తాగినారు. మదోత్కటులు

అయినారు. మధుపింగళవర్ణులు అయిన ఆ వానరులు వేళ్లాడుతూ ఉన్న తేనెతుట్టెలలో ఉన్న ద్రోణము ద్రోణము (కుండెడు కుండెడు) తేనెను తాగి సంతోషపడ్డారు. అంతట ఆ వానరపుంగవులు పెద్ద పెద్ద చెట్లను విరిచివేసినారు. లతలను తెంపివేసినారు. పర్వతాలను పగులగొట్టినారు. వారిలో కొందరు తేనెతాగిన మత్తుతో కేకలు వేసినారు. కొందరు చెట్లమీదికి ఎక్కినారు. కొందరు పెద్ద పెద్ద చెట్లమీదినుంచి గబుక్కున నేలమీదికి దూకినారు. కొందరు చెట్లులేని బయళ్లలో యథేష్టముగా తిరిగినారు. అట్లా వానరులు అందరూ పండిన వరిపైరువలె అక్కడి భూమిఅంతటా కనిపించినారు.

అక్కడనుంచి ఆ రాజీవలోచనుడు రాముడు ఆ మహావానర సైన్యముతో మహేంద్రపర్వతానికి బయలుదేరిపోయినాడు. నానా విధ వృక్షాలతో అలంకారముగా ఉన్న ఆ మహేంద్రపర్వతాగ్ర భాగానికి పోయినాడు. అక్కడనుంచి సముద్రాన్ని చూచినాడు. సమస్తము అయిన వారినీ సంతోషపెట్టే ఆ రాముడు లక్ష్మణుడితోనూ సుగ్రీవుడితోనూ ఆ పర్వతశిఖరముమీదినుంచి దిగి వెంటనే ఆ సముద్రతీరానికి పోయినాడు.

అమితవేగముతో అలలు పైకిలేచి తీరాన ఉన్న తెల్లటి రాళ్ళను కడిగివేస్తూ ఉన్న ఆ సముద్రతీరాన్ని సమీపించి రాముడు సుగ్రీవుణ్ణి చూచి "ఓ సుగ్రీవుడా—మనము ఈ సముద్రముదగ్గరకు వచ్చినాము. మనము వెనుక ఆలోచించిందే—సముద్రాన్ని దాటి పోయే ఉపాయము ఏమిటి అనే ఆలోచనను—ఇప్పుడు ఆచరణలో పెట్టవలసిన అవసరము వచ్చింది. నదులు అన్నిటికీ పెనిమిటిగా ఉన్న ఈ సముద్రాన్ని ఏదో ఉపాయము లేకుండా దాటి పోవడము అశక్యము. ఇందుకు మనము ఏదో ఉపాయము ఆలోచించవలెను. కాబట్టి మనము ఇక్కడనే విడిది చేదాము. మన సైన్యాన్ని అవతలిగట్టుకు చేర్చే ఆలోచన చేద్దాము.

"ఓ సుగ్రీవుడా, సమస్తసేనలూ ఈ సముద్రతీరాన్నే దిగవలెను. ఎవరున్నూ తన సైన్యాన్ని వదిలిపెట్టి ఎక్కడికిన్నీ పోకూడదు. సేనానాయకులు ఇక్కడను అంతటా తిరుగుతూ ఉండవలెను. మనలను కనిపెట్టడానికి శత్రువులు ఇక్కడను ఎక్కడను

అయినా దాగుకొని ఉండవచ్చును. అటువంటివారిని మన సేనా నాయకులు కనిపెట్టవలెను" అని ఆజ్ఞాపించినాడు.

రామాజ్ఞను శిరసావహించి సుగ్రీవుడు లక్ష్మణుణ్ణి తోడు చేసుకొని ఆ సముద్రతీరాన నానావిధవృక్షాలూ ఉన్నచోట ఆ మహా వానరసైన్యాన్ని విడిది చేయించినాడు. అట్లా ఆ సముద్రతీరాన విడిది చేసిన ఆ మహాసైన్యము మధు పాండు వర్ణము అయిన మరిఒక మహాసముద్రమువలె విరాజిల్లింది. విడిది చేస్తూ ఉన్న వానరసైన్య సన్నాహధ్వనులలో సముద్ర మహాఘోషము వినిపించకుండా పోయింది. రామకార్యార్థము బయలుదేరివచ్చిన సుగ్రీవుడి ఆ మహా సైన్యము అప్పుడు అక్కడ మూడు విధాలుగా (వానరవీరులు అందరూ ఒక చెంపనూ గోలాంగులవీరులు అందరూ ఒక చెంపనూ భల్లూకవీరులు అందరూ ఒక చెంపనూ) విడిది చేసింది.

వాయువేగానికి ఎగిరి పడుతూ ఉన్న ఆ సముద్రాన్ని చూచి ఆ వానరవాహిని అంతా సంతోషపడ్డది.

ఆ సముద్రానికి అవతలిగట్టు ఎక్కడ ఉందో తెలియదు. కొలత వేయడానికి అలవికాదు. దానిని రాక్షసులు సేవిస్తున్నారు. అది వరుణదేవుని నివాసస్థానము. ఎటువంటి మృగాలను అయినా పట్టుకొని మింగివేసే భయంకరము అయిన నక్రాలు అందులో నివసిస్తూ ఉన్నవి. పగలు అయిపోయి చీకటి పడుతూ ఉంటే అది భయంకరముగా కనపడుతుంది. తెల్లటి నురుగుతో అది నవ్వుతున్నట్లుగానూ ఎంతో ఎత్తున లేచే తరంగాలతో అది నృత్యము చేస్తున్నట్లుగానూ ఉంటుంది. చంద్రోదయముతో అది ఉప్పొంగి పోతుంది. అంతట చంద్రప్రతిబింబాలు అంతటా తేజరిల్లుతూ ఉంటవి. ప్రచండ వాయువేగముతో నక్రగ్రాహాలూ తిమితిమింగి లూలా అందులో విజృంభిస్తూ ఉంటవి. పడగలమీది మణులతో మంటలు మండే మహాసర్పాలు కన్నులు మిరుమిట్లు కొలుపుతూ ఉంటవి. ఆయా మహాజలజంతువులనుంచీ అందులో ఉన్న నానావిధ పర్వతాలనుంచీ చొరనలవికాదు. అందులో ఒక నౌకామార్గము లేదు. అది అగాధము. అటువంటి వరుణాలయాన్ని ఆ రాక్షసాలయాన్ని వానరసేనానాయకులు పరిశీలించి చూచినారు. దాన్ని

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

[illegible]

సీతాదేవిని ఎప్పుడు చూస్తానో. పద్మమువంటి ఆమె ముఖాన్ని కొంచెము పైకి ఎత్తి సొగసు అయిన దొండపండ్లవంటి ఆమె పెదవులలోనుంచి రేగి రసాయనాన్నివలె ఆమె అధరామృతాన్ని నేను ఎప్పుడు తాగుతానో. ఒకదానితో ఒకటి ఒరసుకొని పోయిన తాటిపండ్లవంటి పీన స్తనాలు వణికిపోతూ ఆమె నన్ను ఎప్పుడు కౌగలించుకొంటుందో. నేను నాథుణ్ణి అయి ఉండిన్ని ఆ అసితాపాంగి నా గతి నాథుడు లేనిదానివలె రాక్షసుల మధ్య పడిపోయి కాపాడే దిక్కు లేకుండా ఉంది. నా ప్రియురాలు జనక మహారాజు కూతురు—దశరథమహారాజు పెద్దకోడలు—ఆమె రాక్షసాంగనల మధ్యను ఎట్లా నిద్రపోగలుగుతున్నదో. నల్లని మేఘాలను తొలగతోసుకొని బయటపడే శరచ్చంద్రరేఖవలె శోభ పెట్టనలవికాని రాక్షసులను తొలగతోసుకొని ఆమె ఎప్పుడు నా ఎదటికి వస్తుందో. ఆమె నైసర్గికముగ బక్కపలుచనిది. దేశకాల విపర్యయమువల్లనూ దుఃఖమువల్లనూ ఉపవాసాదులవల్లనూ ఆమె ఇప్పుడు మరింత కృశించి పోయిఉంటుంది. నిజము.

"లక్ష్మణా, నేను నా మనోదుఃఖము వదిలిపెట్టి ఆ రాక్షసుడి వక్షఃస్థలాన్ని బాణముతో భేదించి సీతాదేవిని తిరిగి తెచ్చుకోవడము ఎప్పుడు జరుగుతుంది? దేవకన్యవంటి ఆ సాధ్వి తహతహలాడుతూ నా కంఠాన్ని కౌగలించుకొని ఆనందబాష్పాలు ఎప్పుడు వదులుతుంది! మలినవస్త్రాన్ని విడిచివేసేటట్టు సీతావియోగమువల్ల వచ్చిన ఈ భయంకరదుఃఖాన్ని నేను ఎప్పుడు వదిలిపెట్టుతాను!" అంటూ ఆ బుద్ధిమంతుడు రాముడు విలపిస్తూ ఉంటే దినాంతము అయింది. దివాకరుడి కాంతులు మందగించినవి. సంధ్యాకాలము ఐంది. దుఃఖముతో వ్యాకులముతో ఆ కమలపత్రాయతాక్షిని సీతాదేవిని తలచుకొంటూ రాముడు సాయంసంధ్యను ఉపాసించినాడు.

సంధ్యావందనము పూర్తి చేసిన లక్ష్మణుడు రాముణ్ణి చూచి "అన్నా, నీవు అచిరకాలములోనే సీతాదేవిని చూస్తావు. రావణాసురుణ్ణి సంహారము చేసివేస్తావు. నీ కోరికలు అన్నీ ఈడేరుతవి. సర్వసమృద్ధార్థము అయిన అయోధ్యనగరానికి తిరిగి పోతావు. నీకు కార్యసిద్ధి అవుతుంది అని తెలియచెప్పడానికి ఇప్పుడు భూమి

మీదనూ ఆకాశములోనూ మహాశుభనిమిత్తాలు కనపడుతున్నవి. వాయువు శుభకరముగానూ హితకరముగానూ మృదువుగానూ సేనలమీద వీస్తూ ఉంది. మృగాలూ పక్షులూ మధురధ్వనులు చేస్తూ ఉన్నవి. దిశలు అన్నీ ప్రసన్నముగా ఉన్నవి.

"ఓ రామా, నీ వెనుక శుక్రుడు ప్రసన్నకాంతులతో ప్రకాశిస్తున్నాడు. పరిశుద్ధులు అయిన సప్తర్షులు కాంతిమంతులుగా ధ్రువుడికి ప్రదక్షిణము చేస్తున్నారు. మన ఎట్టఎదుట ఇక్ష్వాకు వంశీయుడూ మన పితామహుడూ రాజర్షి అయిన త్రిశంకువు పురోహితుడు అయిన వసిష్ఠమహర్షితో కూడా నిర్మలముగా భాసిస్తున్నాడు. మన ఇక్ష్వాకువంశనక్షత్రము అయిన విశాఖ నిర్మలముగా నిరుపద్రవముగా తేజరిల్లుతూ ఉంది. నిర్‌ఋతిదేవతాకమూ రాక్షసుల నక్షత్రమూ అయిన మూలానక్షత్రాన్ని దాని ప్రక్కను ఉన్న ధూమకేతువు పొగలు కమ్ముకొన్నవి. ఇవి అన్నీ రాక్షసుల వినాశకాలము ఆసన్నమవుతున్నట్టు సూచిస్తున్నవి.

"అన్నా, ఇక్కడి జలాలు స్వచ్ఛముగా ఉండడమే కాకుండా రుచ్యముగా ఉన్నవి. వనాలు అన్నీ ఫలపూర్ణముగా ఉన్నవి. ఋతూచితముగా పూచిన వృక్షాలమీదినుంచి సుగంధము గుబాళిస్తూ ఉంది.

"ప్రభూ, వ్యూహాలు వ్యూహాలుగా ఉన్న ఈ వానర సైన్యాలు పూర్వము తారకాసురసంహారానికి బయలుదేరి పోయిన దేవసేనలవలె తేజరిల్లుతూ ఉన్నవి. ఓ పూజ్యుడా, నీవు ఇవి అన్నీ చూచి సంతోషపడవలెను. దిగులు పడనక్కరలేదు" అంటూ లక్ష్మణుడు సంతుష్టుడు అయి రాముణ్ణి ఊరడించినాడు.

౬

దేవేంద్రుడివంటి పరాక్రమముతో హనుమంతుడు ఆ లంకా పట్టణములో ఘోరమూ భయావహమూ అయిన పనులు చేసి పోయినాడు. అందుకు రాక్షసేంద్రుడు రావణాసురుడు సిగ్గుపడి పోయినాడు. కొంచెము తల వంచుకొని రాక్షసులను అందరినీ చూచి "ఓ రాక్షసవీరులారా, ఇంతవరకూ ఎవరికీ లోపలికి రానలవి

కాకుండా ఉన్న మన లంకాపట్టణానికి ఒక కోతివాడు రావడమే కాకుండా జనకరాజపుత్రిని చూచి ఎవరినీ లెక్కచేయకుండా అందరినీ అవమానించి పోయినాడు. వాడు చైత్యప్రాసాదాన్ని పగుల కొట్టినాడు. రాక్షసవీరులను చంపివేసినాడు. లంకా పట్టణాన్ని అంతా వ్యాకులపెట్టినాడు. ఇకను ఇప్పుడు మనము ఏమి చేయవలెనో మీరు అందరూ ఆలోచించిచెప్పవలెను.

"ఓ రాక్షసులారా, మీరు మహాబలవంతులు. మంచి ఆలోచనాపరులు. జయము మంత్రమూలము అని పెద్దలు చెప్పుతూ ఉంటారు. అందువల్ల మీరు ఆలోచించి చెప్పవలెను. రాముణ్ణి ఏమి చేయవలెనో ఆలోచించండి. చెప్పండి. నేను వినవలెను అనుకొంటున్నాను. ఈ లోకములో పురుషులు అందరూ ఉత్తములూ మధ్యములూ అధములు అనే మూడు విధాలుగా కనపడుతున్నారు. అయితే వాండ్ల భేదము తెలుసుకోటము కష్టము. వారి గుణదోషాలు నేను చెప్పుతాను. వినవలసింది.

"తమ మేలు కోరే నేర్పరులు అయిన మంత్రులతో కానీ తమతోపాటు సరిసమానముగా సుఖదుఃఖాలు అనుభవించే మిత్రులతో కానీ తమ మేలు కోరే పెద్దలతో కానీ చక్కగా ఆలోచించి అదృష్టాన్ని నమ్మి ఆరంభించి పనులు చేసేవాణ్ణి ఉత్తముడు అంటారు. తాను ఒక్కడే ఆలోచించి అదృష్టముమీద మనస్సు ఉంచి కార్యనిశ్చయము చేసేవాణ్ణి మధ్యముడు అంటారు. మంచిచెడ్డలు ఆలోచించకుండా అదృష్టాన్ని లెక్కచేయకుండా తాను ఒకపని చేయవలెను అనుకొని ఆ పని చేయకుండా ఉపేక్షించేవాణ్ణి అధముడు అంటారు.

ఇదే విధముగా మంత్రాంగమున్నూ ఉత్తమ మధ్యమ అధమములు అనే మూడు విధాలుగా ఉంది. మంత్రులలో భిన్నాభిప్రాయాలు లేకుండా శాస్త్రదృష్టితో చేసే ఏకనిర్ణయము ఉత్తమ మంత్రాంగము. మంత్రులు అందరూ భిన్నాభిప్రాయాలతో ఉంటూ కార్యావసరాన్నిపట్టి చేసే ఏకనిర్ణయము మధ్యమమంత్రాంగము. మంత్రులు అందరూ పరస్పర విరుద్ధాభిప్రాయాలతో ఉంటూ ఎవరికి తోచినట్టు వారు చెప్పుతూ ఎన్నడూ ఏకాభిప్రాయానికి రాకపోవడము అధమ మంత్రాంగము.

"ఓ మంత్రిసత్తములారా, మీరు అందరూ చక్కగా ఆలోచించి ఏమిచేయవలెనో చెప్పవలెను. రాముడు వీర్యవంతులు అయిన అనేకవేలమంది వానరవీరులతో మనమీదికి యుద్ధానికి వస్తాడు. అతడు మహాబలవంతుడు. తనపరాక్రమముతో సముద్రాన్ని ఎండకొట్టి వేయకలడు. లేదా మరి ఒక విధముగా చేయకలడు. ఏమి అయినప్పటికిన్నీ తమ్మునితోనూ బలవంతులు అయిన అనుచరులతోనూ రాముడు అనాయాసముగా సముద్రాన్ని దాటి వస్తాడు. సందేహము లేదు. అతడు వానరసైన్యముతో వస్తే మన లంకాపట్టణానికిన్నీ మన రాక్షససైన్యాలకున్నూ కీడు మూడకుండా క్షేమముగా ఉండేటందుకు ఏది అయినా ఉపాయము మీరు అందరూ చక్కగా ఆలోచించవలెను" అని చెప్పినాడు.

౩

ఇట్లా రావణాసురుడు అడిగిన మాటలకు నీతిబాహ్యులూ బుద్ధిహీనులూ అయితే మహాబలవంతులూ అయిన ఆ రాక్షసులు అందరూ శత్రుపక్ష బలాబలాలు తెలుసుకోకుండానే చేతులు జోడించి "ఓ రాజా, పరిఘలతోనూ శక్తులతోనూ ఋష్టి శూలాలతోనూ పట్టిసాలతోనూ ఇంకా వివిధాయుధాలతోనూ మనకు గొప్ప సైన్యము ఉంది. నీవు ఎందుకు దిగులు పడుతున్నావు!

"ఓ రాజా, నీవు భోగవతీపట్టణానికి పోయి యుద్ధముచేసి పన్నగులను అందరినీ జయించినావు. ఓ ప్రభూ, మహేశ్వరుడితో సఖ్యము చేసి అందరిపొగడ్తలు అందుకొని అనేకమంది యక్షులతో కైలాసశిఖరముమీద నివాసము పెట్టుకొన్న ఆ మహాబలవంతుణ్ణి లోకపాలకుణ్ణి కుబేరుణ్ణి నీవు కోపము వచ్చి యుద్ధము చేసి జయించినావు. యక్షసమూహాలను పట్టుకొని కొట్టి నానాబాధలూ పెట్టి పుష్పకవిమానాన్ని ఆ కైలాసశిఖరముమీదినుంచి తెచ్చుకొన్నావు. ఓ రాజా, నీ భయమునుంచి దానవేంద్రుడు అయిన మయుడు నీతో చెలిమిచేయవలెను అనుకొని తన కూతురిని మండోదరిని నీకు భార్యగా సమర్పించినాడు. ఓ ప్రభూ, పరమపరాక్రమవంతుడూ దురాసదుడూ అయిన మధువు అనే దానవుణ్ణి నీవు

27561

యుద్ధములో జయించి వశపరచుకొన్నావు. నీ చెల్లెలు కుంభీనసిని పెండ్లిచేసుకొని సుఖపెట్టేట్టు చేసినావు.

"ఓ మహాబాహూ, నీవు రసాతలానికి పోయి నాగరాజులు అయిన వాసుకినీ తక్షకుణ్ణీ శంఖుణ్ణీ జటినీ జయించి లోపరచుకొన్నావు. నీవు శత్రుసంహారకుడవు. చచ్చిపోకుండా ఉండడానికి బ్రహ్మదేవుడి వరాలు సంపాదించిన మహాబలవంతులూ శూరులూ అయిన కాలకేయాదిరాక్షసులతో ఒకసంవత్సరము నీవు యుద్ధము చేసి జయించి వశపరచుకొన్నావు. ఆ కాలకేయాదులమాయలు అన్నీ నీవు నేర్చుకొన్నావు. మహాబలవంతులు అయిన లోకపాలకులను జయించినావు. అక్కడినుంచి దేవలోకము పోయి నీవు దేవేంద్రుణ్ణికూడా జయించినావు. ఓ రాజా, శూరులూ బలవంతులూ అయిన వరుణదేవుడి పుత్రులను వారి చతుర్విధసేనలతోనూ నీవు జయించినావు.

"ఓ రాజా, యమదండమే మహాగ్రాహముగానూ శాల్మల్యాయుధాలు అలంకరించిన మహావృక్షాలుగానూ యమపాశము మహాతరంగముగానూ యమకింకరులు సర్పాలుగానూ ఉండే యమసైన్యసముద్రములోకి పోయి నీవు యముణ్ణి తోసివేసి గొప్ప జయము సంపాదించినావు. అక్కడ నీవు చేసిన యుద్ధానికి సర్వలోకాలూ సంచలించిపోయినవి. దేవేంద్రుడితో సరిసమానము అయిన పరాక్రమవంతులు అనేకమంది క్షత్రియులు పరమదుర్జయులుగా ఈ భూమిమీద మహావృక్షాలు వలె ఉన్నవారిని అందరినీ నీవు కొట్టినావు. వీర్యోత్సాహాది గుణాలలో ఆ క్షత్రియులతో రాముడు సరిమానము అయినవాడు కాడు.

"ఓ రాజా, నీవు ఊరికే ఉండు. నీవు శ్రమ పడడము ఎందుకు. మహాబాహువు ఇంద్రజిత్తు ఒక్కడూ ఆ వానరులను అందరినీ సంహారము చేసివేయకలడు. మహారాజా, సర్వోత్కృష్టము అయిన యజ్ఞము చేసి ఇంద్రజిత్తు మహేశ్వరుణ్ణి మెప్పించి ఈ లోకములో పరమదుర్లభము అయిన వరము సంపాదించినాడు. శక్తితోమరాద్యాయుధాలు చేపలుగానూ పెదచల్లిన పేగులు నాచుగానూ ఏనుగులు తాబేళ్ళుగానూ గుర్రాలు

కప్పలుగానూ ఏకాదశరుద్రులూ ద్వాదశాదిత్యులూ మహాగ్రాహాలుగానూ సప్తమరుత్తులూ అష్టవసువులూ మహాసర్పాలుగానూ రథాలూ గుర్రాలూ ఏనుగులూ జలసమూహాలుగానూ కాలిబంట్లు ఇసుక దిబ్బలుగానూ ఉన్న దేవతలసైన్యము అనే మహాసముద్రానికి పోయి ఇంద్రజిత్తు దేవేంద్రుణ్ణి పట్టుకొని ఈ లంకాపట్టణానికి తీసుకొని వచ్చినాడే. ఓ ప్రభూ, నీవు బ్రహ్మదేవుడు చెప్పినందువల్ల ఆ దేవేంద్రుణ్ణి వదిలిపెట్టించినావు. అట్లా కదా సర్వదేవతలూ నమస్కరించే ఆ దేవేంద్రుడు వృత్రాసురుణ్ణీ శంబరాసురుణ్ణీ వధించిన ఆ దేవేంద్రుడు స్వర్గలోకానికి పోయింది. మహారాజా, నీవు ఇంద్రజిత్తును వదిలిపెట్టు. అతడు వానరసైన్యాన్ని అంతా రాముడితో కూడా నాశనముచేసి వేస్తాడు.

"ఓ రాజా, హనుమంతుడు అల్పుడు. వాడివల్ల వచ్చిన ఆపదనుగురించి ఆలోచించడము అనవసరము. నీవు అది మనస్సులో నయినా ఆలోచించవద్దు. నీవు రాముణ్ణి వధించి వేస్తావు" అని చెప్పినారు.

౮

ఇట్లా రాక్షసులు అందరూ చెప్పినతరువాత నీలమేఘము వంటివాడూ శూరుడూ రాక్షససేనాధిపతీ అయిన ప్రహస్తుడు వినయముతో "ఓ ప్రభూ, దేవ దానవ గంధర్వులకుకానీ పిశాచపతగోరగులకుకానీ యుద్ధములో నిన్ను ఎదిరించే శక్తి లేదు. ఇకను వానరులా నిన్ను జయించేది. లంకాపట్టణములో తమను ఎవరూ ఏమీ చేయలేరు అనే నమ్మకములో రాక్షసులు ఉంటూఉన్న సమయములో హనుమంతుడు వచ్చినాడు. పయిగా రాక్షసులు అందరూ భోగపానపారవశ్యములో ఉన్నారు. అటువంటి అప్పుడు హనుమంతుడు మోసము చేసినాడు. నేనే ఎదుర్కొన్నట్టయితే ప్రాణాలతో వాణ్ణి పోనిచ్చి ఉండేవాణ్ణికాను.

"రాజా, నీవు నన్ను ఆజ్ఞాపించు. సముద్రము పొలిమేరగా పర్వతాలతోనూ వనాలతోనూ మహారణ్యాలతోనూ ఉన్న ఈ భూమిమీద ఎక్కడనూ ఒక్కవానరుడు అయినా ఉండకుండా

చంపివేస్తాడు. నీ అపరాధానికి దుఃఖపడవద్దు. వానరులనుంచి నిన్ను నేను కాపాడుతాను'' అని చెప్పినాడు.

అంతట దుర్ముఖుడు అనే రాక్షసవీరుడు మహాకోపముతో లేచి ''ఓ రాజా, హనుమంతుడు మనలను అందరినీ అవమానించినాడు. వాడువచ్చి మనపురాన్నీ అంతఃపురాన్నీ రాక్షసేంద్రుడవు అయిన నిన్నూ చికాకుపెట్టినాడు. ఇది ఎంతమాత్రమూ క్షమించడానికి వీలులేదు. నేను ఒక్కణ్ణే ఇప్పుడు పోతాను. ఆ వానరులు అందరూ సముద్రములో చొరబడ్డా ఆకాశానికి ఎగిరినా పాతాళ లోకములోకి పోయి దాగుకొన్నా వాళ్ళను అందరినీ పట్టుకొని చంపివేసి తిరిగివస్తాను'' అని చెప్పినాడు.

అంతట మహాబలవంతుడు వజ్రదంష్ట్రుడు అనే రాక్షసవీరుడు మరింత క్రుద్ధుడు అయి నెత్తురూ మాంసమూ అంటుకొని పరమ భయంకరముగా కనపడుతూ ఉన్న పరిఘాయుధాన్ని చేతిలో పట్టుకొని ''ఓ రాజా, రాముడు ఎదిరించనలవికానివాడు. వాడు లక్ష్మణుడితోనూ సుగ్రీవుడితోనూ ఉంటూఉన్నాడు. దీనుడూ నీచుడూ అయిన హనుమంతుడితో మనకు పనిఏమిటి. నేను ఒక్కణ్ణే పోయి నా ఈ ఇనుపగుదియతో ఆ రాముణ్ణి సుగ్రీవుడితోనూ లక్ష్మణుడితోనూ చంపివేస్తాను. వానర సైన్యాన్ని చికాకుపరచి వస్తాను.

''ఓ రాజా, ఉపాయకుశలుడూ జాగరూకుడూ అయినవాడే శత్రువులను జయించ కలుగుతాడు. కావలెను అంటే మరిఒక ఉపాయము చెప్పుతాను. వినవలసింది. కామరూపులూ శూరులూ భయంకరాకారులూ అయిన రాక్షసులు ఒకవెయ్యిమంది పని చక్కపెట్టడానికి మానవరూపము ధరించి రాముడిదగ్గిరకు పోవలెను. వాండ్లు తడపడకుండా రాముడితో తమను భరతుడు పంపించినాడు అనీ అతడు ఇంకా సైన్యాలతో వెనకనుంచి వస్తున్నాడు అనీ చెప్పవలెను. ఇంతలో మేము కొందరము శూలాలతోనూ ఈటెలతోనూ ఖడ్గాలతోనూ గదలతోనూ విల్లంబులతోనూ పోయి ఆకాశములో గుంపులు గుంపులుగా చేరి ఆ వానర సైన్యముమీద వివిధాయుధాలనూ రాళ్ళనూ వానగా కురిపిస్తాము. అప్పుడు ఆ

వానరసైన్యము అంతా యమసదనానికి పోతుంది. ఆ ఆపత్సమయములో ఆ రామలక్ష్మణులకు ఏమి చేయడానికి తోచకుండా పోతుంది. అంతట వాండ్లు అవశ్యమూ ప్రాణాలు వదలుతారు" అని చెప్పినాడు.

అప్పుడు కుంభకర్ణుడి కొడుకు మహాపరాక్రమవంతుడూ వీరుడూ అయిన నికుంభుడు అనేవాడు పరమక్రుద్ధుడుఅయి లేచి "ఓ రాజా, నీవు లోకాలను అన్నిటినీ గగ్గోలు పెట్ట కలవాడవు. నీవు ఈ రాక్షసులు అందరితోనూ ఇక్కడనే ఉండు. నేను ఒక్కణ్ణే పోయి రాముణ్ణీ లక్ష్మణుడితోకూడా సుగ్రీవుణ్ణీ హనుమంతుణ్ణీ వారు వీరు ఏమిటి అందరినీ చంపివేసి వస్తాను" అని చెప్పినాడు.

అంతట పర్వతాకారుడు వజ్రహస్తుడు అనే రాక్షసవీరుడు క్రుద్ధుడు అయి నాలుకతో పెదవులు నాకుతూ "ఓ రాక్షసులారా, మీరు అందరూ నిర్భయముగా యథేష్టముగా మీ మీ పనులు చేసుకొంటూ ఇక్కడనే ఉండండి. నేను ఒక్కణ్ణే పోయి ఆ వానర సమూహాలను అన్నిటినీ భక్షించి వేస్తాను. మీరు నిశ్చింతగా స్వస్థముగా మద్యపానము చేస్తూ క్రీడిస్తూ ఉండండి. నేను ఒక్కణ్ణే లక్ష్మణుడితోకూడా సుగ్రీవుణ్ణీ అంగదుణ్ణీ హనుమంతుణ్ణీ రణకుంజరుడు అయిన ఆ రాముణ్ణీ చంపివేస్తాను" అని చెప్పినాడు.

౯

అంతట నికుంభుడూ రభసుడూ మహాబలవంతుడు అయిన సూర్యశత్రువూ సుప్తఘ్నుడూ యజ్ఞహుండూ మహాపార్శ్వుడూ మహోదరుడూ దుర్ధర్షుడు అయిన అగ్నికేతువూ రశ్మికేతువూ మహాతేజోవంతుడూ మహాబలవంతుడూ రావణాసురుడి పుత్రుడూ అయిన ఇంద్రజిత్తూ ప్రహస్తుడూ విరూపాక్షుడూ మహాబలవంతుడు అయిన వజ్రదంష్ట్రుడూ ధూమ్రాక్షుడూ అతికాయుడూ దుర్ముఖుడూ అనే రాక్షసవీరులు పరిఘలూ పట్టిసాలూ ప్రాసాలూ శక్తులూ శూలాలూ గండ్రగొడ్డళ్లూ విల్లంబులూ మహానిశిత ఖడ్గాలూ పట్టుకొని చెంగున లేచి రావణాసురుడివంక చూచి "ఓ ప్రభూ, మేము పోయి రాముణ్ణీ లక్ష్మణుణ్ణీ సుగ్రీవుణ్ణీ మన

లంకాపట్టణాన్ని చెదరకొట్టి పోయిన నీచుణ్ణి హనుమంతుణ్ణి చంపి వేసి తిరిగివస్తాము" అని చెప్పినారు.

అట్లా ఆయుధాలతో లేచినవారినిఅందరినీ అప్పుడు విభీషణుడు ఆపి వారిని అందరినీ కూర్చుండపెట్టి చేతులు జోడించి రావణాసురుణ్ణి చూచి "అన్నా, సామదానభేదాలు అనేమూడు ఉపాయాలతోనూ కార్యము సాధించలేకపోయేట్లయితే దండోపాయము ఉపయోగించవలెను అనీ అందుకు తగిన సమయాలు ఉన్నవి అనీ పెద్దలు చెప్పుతూ ఉంటారు. మనము ఇంకా సామాదులను ఉపయోగించలేదు. కాబట్టి దండానికి ఇది అదనుకాదు.

"ఓ అన్నా, విషయాసక్తులు అయి ఏమరుపాటుతో ఉన్న వారినీ విరక్తులు అయిన వారినీ ఒకరితో ఒకరు పోట్లాడుకొంటున్న రాజులనూ దైవము ప్రతికూలము అయినవారినీ బాలురనూ వృద్ధులనూ దీర్ఘరోగులూ మొదలుఅయినవారినీ రాజనీతిప్రకారము చక్కగా ఆలోచించి దండోపాయము ప్రయోగిస్తే కార్యము సిద్ధిస్తుంది.

"ఓ రాక్షసులారా, రాముడు ఏమరుపాటులేనివాడు. అతడు విజిగీషువు. బలవంతుడు. కోపాన్ని జయించినాడు. దురాధర్షుడు. అంటువంటివాణ్ణి మీరు ఎట్లా ఎదిరించవలెను అనుకొంటున్నారు. మహాభయంకరము అయిన సముద్రాన్ని హనుమంతుడు దాటి వచ్చినాడు. అట్లా ఎవడు అయినా ఎప్పుడు అయినా సముద్రాన్ని దాటి రాకలడు అని మీరు ఎవరుఅయినా ఎప్పుడు అయినా అనుకొన్నారా. శత్రువులు ఎటువంటి బలవంతులో ఎటువంటి పరాక్రమవంతులో మనకు తెలియదు. ఏది ఏమి అయినప్పటికిన్నీ ముందు వెనకలు ఆలోచించకుండా తటాలున శత్రువుల మీదికి పోవడము మంచిదికాదు. వారిని చులకన చేయడమున్నూ తగినపనికాదు. జనస్థానమునుంచి ఆ రాముడి భార్యను మన ఏలిక ఎత్తుకొని వచ్చినాడే—అతడు ఆ యశస్వి రాముడు ఏమి అపకారము చేసినాడు. ఖరుణ్ణి చంపినాడు అంటారా. ఖరుడే దుర్మార్గముగా రాముడి మీదికిముందుగా పోయినాడు. యుద్ధములో రాముడి చేతిలో చచ్చిపోయినాడు. ప్రతిప్రాణీ తనప్రాణా

లను తన శక్తికొద్దీ కాపాడుకొంటూ ఉండడము నైసర్గికము. ఒకవేళ రాముడు అపకారము చేసి ఉన్నట్లయితే అతనిమీదికి మనము అప్పుడే యుద్ధానికి పోయి ఉండవలసింది.

"ఓ రాక్షసులారా, పరదారలను తడవడము ఘోరము అయిన తప్పిదము. ఆ పని సమస్తపాపాలకు పుట్టినిల్లు. అందు వల్ల అపకీర్తి వస్తుంది. ఆయువు క్షీణిస్తుంది. ధనము నాశనము అయిపోతుంది. ఆ వైదేహినుంచి మనకు ఇప్పుడు ఈ భయము వచ్చింది. రాముడితో కలహము పెట్టుకోవలెను అనుకొనేట్లయితే ఆ సీతాదేవిని తేవడము ఎందుకు. ఆమెను విడిచి పెట్టవలెను. ఆ రాముడు పరామపరాక్రమవంతుడు. అంతేకాదు. అతడు ధర్మాను వర్తి. అటువంటివాడితో వైరము పెట్టుకోడము ప్రయోజనము మాలిన పని. అది మనకు తగదు. ఏనుగులతో గుర్రాలతో అనేకరత్నాలతో నిండిఉన్న ఈ లంకాపట్టణానికి ఆ రాముడు వస్తాడు. అతడు తన బాణాలతో ఈ పట్టణాన్ని పడకొట్టక పూర్వమే అతనికి సీతాదేవిని ఇవ్వవలెను. ఎదిరించనలవికాని భయంకరము అయిన మహావానరసైన్యము వచ్చి ఈ లంకాపట్ట ణాన్ని ముట్టడించే లోపలనే సీతాదేవిని రాముడికి ఇచ్చివేయవలెను. ఆ రాముడికి అతని ప్రియభార్యను స్వయముగా ఇవ్వకపోయేట్లయితే ఈ లంకాపట్టణము నాశనము అయిపోతుంది. రాక్షసవీరులు అందరూ హతము అయిపోతారు.

"ఓ ప్రభూ, నీకూ నాకూ ఉన్న బంధుత్వమునుంచి నిన్ను నేను వేడుకొంటున్నాను. నేను చెప్పినట్టు చేయవలసింది. నేను నీ మేలుకోసము యథార్థము చెప్పుతున్నాను. రాముడికి నీవు ఆ మైథిలిని ఇచ్చివేయవలెను.

"ప్రభూ, ఆ రాజకుమారుడు కొత్త కొత్త కొనలతోనూ పిడులతోనూ గట్టివిన్నీ అమోఘము అయినవిన్నీ శరత్కాలకిరణాల వంటివిన్నీ బాణాలను నిన్ను చంపివేయడానికి వదలక పూర్వమే మైథిలిని నీవు ఆ దాశరథికి ఇచ్చివేయవలెను. కోపమువల్ల ధర్మమూ సుఖమూ నాశనము అయిపోతవి. అందువల్ల కోపాన్ని వదిలిపెట్టు. ధర్మాని భజించు. నీ కీర్తి అధికము అవుతుంది.

నీ సంతోషము వృద్ధిఅవుతుంది. అనుగ్రహించు. మనము సపుత్ర బాంధవముగా బ్రతికి ఉందాము. ఆ దాశరథికి ఆ మైథిలిని ఇచ్చి వెయ్యి" అని చెప్పినాడు.

ఇట్లా విభీషణుడు చెప్పినమాటలను ఆ రాక్షసేశ్వరుడు రావణాసురుడు విని రాక్షసులను అందరినీ పంపించివేసి తన అంతఃపురములోకి పోయినాడు.

౧౦

ఆ రాత్రి కడచిపోయింది. ప్రాతఃకాలము అయింది. ఆ మహాద్యుతిమంతుడు ఆ వీరుడు విభీషణుడు ధర్మార్థాలను నిశ్చయించినాడు. రావణాసురుడికి మేలు చేయడము అనే భయంకరము అయిన పనిచేయడానికి బయలుదేరినాడు.

రావణాసురుడి గృహము పర్వతశిఖరసమూహాలవంటి గోపురాలతో పర్వతశిఖరమువలె ఎంతో ఎత్తుఅయింది. ఆ గృహములో మహాకక్ష్యలు అన్నీ చక్కగా విభజించి నిర్మించినవి. మతిమంతులూ స్వామిభక్తిపరాయణులూ అయిన మహామంత్రులూ వేద వేదాంగాలు అభ్యసించిన మహాజనులూ ఆ గృహావరణములోనే నివసిస్తూఉన్నారు. ఆప్తులూ సమర్థులూ అయిన రాక్షసులు అక్కడ అంతటా కావలి ఉంటూ ఉన్నారు.

అప్పుడు మదపుటేనుగుల నిట్టూర్పులతో గాలి సుళ్లు సుళ్లుగా వీస్తూఉంది. శంఖఘోష మహానాదమూ వాద్యధ్వనులూ ప్రతిధ్వనిస్తూఉన్నవి. ప్రమదాజనము కిటకిటలాడుతూ ఉంది. అక్కడి మహాపథములో కలకలధ్వనులు చెలరేగుతున్నవి.

ఉత్తమాభరణాలతో అలంకరించిన తోరణాలతోనూ బంగారు తిన్నెలతోనూ గంధర్వనివాసమువలెనూ దేవతల నికేతనమువలెనూ రత్నసమూహాలతో సర్పరాజుల భవనమువలెనూ ఉండే ఆ రాక్షసాధిపతి భవనములోకి మహామేఘాలలోకి పోయే సూర్యుడివలె దేహకాంతులతో తేజరిల్లుతూ విభీషణుడు పోయినాడు. వేదవేత్తలు రావణాసురుడి విజయముకోసము పఠిస్తున్న పుణ్యాహ మంత్రధ్వనులు వింటూనూ మంత్రవేదవిదులు అయిన బ్రాహ్మణులను

పూజించి ఇచ్చిన దధిపాత్రలనూ ఘృతపాత్రలనూ అక్షతలనూ పూలదండలనూ మోస్తూనూ రాక్షసులు తనను కొనియాడుతూ ఉంటే స్వతేజముతో దేదీప్యమానముగా వెలుగుతూ విభీషణుడు లోపలికిపోయి సింహాసనముమీద విరాజిల్లుతున్న కుబేరుడి తమ్ముణ్ణి తన అగ్రజుణ్ణి రావణాసురుణ్ణి చూచినాడు. నమస్కారము చేసినాడు.

ఆ విభీషణుడు ఆచారకోవిదుడు. అందువల్ల ఆ సమయ మర్యాదను అనుసరించి "జయ జయలు" చెప్పినాడు. రావణాసురుడి కన్ను సంజ్ఞలనుపట్టి బంగారముతో అలంకరించిన ఆసనముమీద కూర్చున్నాడు. అప్పుడు అక్కడ మంత్రులుతప్ప మరి ఎవరూ లేకుండా ఉండటము చూచినాడు. అంతట ఆ మహాపరాక్రమశాలికి రావణాసురుడికి అనేక హేతువులతో నిశ్చయించిన హితకరముఅయిన మాట చెప్పడానికి ఉద్యుక్తుడు అయినాడు. విభీషణుడు ఈ లోకములో మంచి నెబ్బరలు అన్నీ తెలిసినవాడు. దేశకాలాలనుపట్టి కార్యాకార్యాలను నిశ్చయించే సామర్థ్యము కలవాడు. అంతేకాదు. ఎప్పుడు ఏది చెప్పవలెనో చక్కగా ఎరిగినవాడు. అందువల్ల అన్నగారిని స్తోత్రాదులతో ప్రసన్నుణ్ణిగా చేసుకొన్నాడు. అంతట సాంత్వనముగా "అన్నా, ఆ వైదేహిని సీతాదేవిని నీవు లంకాపట్టణానికి తెచ్చింది మొదలు అన్నీ అశుభ నిమిత్తాలే కనపడుతున్నవి. హోమద్రవ్యాలతో సమంత్రకముగా వేలుస్తూ ఉంటే అగ్నిహోత్రము అగ్నికణాలతో కొద్దిగా మంటలు లేస్తూ పొగలు కమ్ముకొంటున్నదేకాని ప్రజ్వరిల్లడము లేదు. అగ్నిహోత్ర గృహాలలోనూ వంటఇండ్లలోనూ ఇంకా వేదాధ్యయన స్థలాలలోనూ పాములు కనపడుతున్నవి. హవిస్సులకు చీమలు పట్టుతున్నవి. ఆవులకు పాలు ఎండిపోతున్నవి. మదపుటేనుగులు మదజలము కార్చడము మానివేసినవి. గుర్రాలు దైన్యముతో ఇకిలిస్తున్నవి. ఒంటెలూ కంచరగాడిదలూ గాడిదలూ రోమాలు నిక్కపొడుచుకొని (నక్కుడుపోయి) కన్నీళ్ళు కారుస్తున్నవి. వైద్యులు ఆలోచించి చికిత్స చేస్తూఉన్నప్పటికిన్నీ ఈ జంతువులు ఎప్పటి మాదిరిగా ఉండడము లేదు. మాలకాకులు ఎటు చూచినా గుంపులు గుంపులుగా మూగి ఘోరముగా అరుస్తున్నవి. విమాన

గృహశిఖరాలమీద గుంపులు గుంపులుగా మూగుతున్నవి. గద్దలు గుంపులుకట్టి ఇంటి ఇంటి మీదనూ వాలుతున్నవి. తొలి మలి సందెలలో నక్కలు పట్టణసమీపానికి వచ్చి అమంగళముగా అరిచి పోతున్నవి. కుక్కలూ మాంసముతినే క్రూరమృగాలూ మన లంకాపురద్వారాల దగ్గిరకు వచ్చి పిడుగుల మోతలతో అరుస్తున్నవి.

"అన్నా, ఇందుకు తగినట్టు లంకాదహనాదులు సంభవించినవి. కాబట్టి సీతాదేవిని రాముడికి ఇచ్చివేయడము ప్రాయశ్చిత్తముగా నాకు తోచింది. మహారాజా, నేను అజ్ఞానమువల్లనో బ్రతుక వలెను అనే ఆశవల్లనో ఇట్లా చెప్పుతున్నాను. ఇది దోషముగా తలచవద్దు. దుశ్శకునదోషము రాక్షసస్త్రీలకూ పురుషులకూ అంతఃపురములోనివారికీ—వారికీ వీరికీ ఏమిటి— ఈ లంకాపట్టణ ములో సమస్తము అయిన వారికిన్నీ తెలుసును. అయితే నీకు భయపడి ఈ ఆలోచన నీకు ఎవరూ చెప్పలేకుండా ఉన్నారు. నేను నీ తమ్ముణ్ణి. అందువల్ల నేను చూచిందీ విన్నదీ నీకు ఆవశ్యమూ చెప్పవలెను. కనుక చెప్పినాను. కాబట్టి నీవు ఆలోచించి ఏది న్యాయమో అది చేయవలెను" అని చెప్పినాడు.

ఇట్లా మృదువుగా యుక్తియుక్తముగా భూతభవిష్యద్వర్త మాన కాలాలలో మేలుచేసే మాటలు విభీషణుడు మంత్రుల మధ్యను కూర్చుని ఉన్న రావణాసురుడితో చెప్పినాడు. ఆ మహాపరాక్రమ శాలికి చెడ్డకోపము వచ్చింది. తనపట్టు వదలకుండా "ఓ విభీషణుడా, నాకు ఏ భయమూ లేదు. రాముడు సీతాదేవిని ఎన్నటికీ తీసుకొని పోలేడు. దేవేంద్రుడితోకూడా దేవతలు అందరూ ఏకము అయి వాడికి సాయము వచ్చినా రాముడు యుద్ధములో నా ఎదుట నిలువ లేడు" అని దేవసేనలను నాశనముచేసివేసిన ఆ మహాబలవంతుడు రణరంగములో ప్రచండపరాక్రమముతో పోరాడే ఆ రావణాసురుడు చెప్పినాడు. అట్లాచెప్పి తనకు మంచి చెప్పిన తమ్ముణ్ణి పంపించి వేసినాడు.

౧౧

మైథిలీకామమోహితుడు అయిన ఆ పాపాత్ముడు రావణా సురుడు తాను చేసిన పాపకృత్యమువల్లనూ సుహృదుల అనాదరము

వల్లనూ వాడిపోయినాడు. యుద్ధము విషయము అమాత్యుల తోనూ స్నేహితులతోనూ ఆలోచించవలసిన సమయము ఆసన్నము అయింది అనుకొన్నాడు. అంతట ఆ మహారథుడు రావణాసురుడు బంగారు కిటికీలతోనూ రత్నాలతోనూ పగడాలతోనూ అలంకరించిన రథానికి ప్రదక్షిణము చేసినాడు. ఆ రథము ఎక్కినాడు. శిక్షపొందిన గుర్రాలు పూంచిన ఆ మహారథము అప్పుడు మహామేఘనిస్వనాలతో రాజసభాభవనమువైపు నడిచింది.

ఖడ్గాలూ డాళ్ళూ వివిధాయుధాలూ ధరించిన రాక్షసయోధులు కొందరు ఆ రథానికి ముందు నడిచినారు. వివిధవికృతవేషాలతోనూ వివిధభూషణాలతోనూ అలంకరించుకొన్న కొందరు రాక్షసయోధులు ఆ రథానికి ఇరు ప్రక్కలనూ వెనకనూ నడిచినారు. అతిరథులు అయిన రాక్షసులు కొందరు రథాలమీదనూ కొందరు మదపుటేనుగులమీదనూ కొందరు ఆటగుర్రాలమీదనూ ఎక్కి రావణాసురుడి రథమువెంట పోయినారు. గదలూ ఇనుపగుదియలూ పట్టుకొని కొందరూ గండ్రగొడ్డళ్ళు పట్టుకొని కొందరూ శూలాలు పట్టుకొని కొందరూ నడిచినారు. ఆ మహారథచక్రనేమిధ్వనికి దిక్కులు మారుమోగి పోయినవి. సమస్త సంపన్నము అయిన రాజవీధిలోకి ఆ మహారథము పోయింది. అది సభాభవనము దగ్గిరకు పోగానే వేలకొద్దీ వాద్యధ్వనులు మోగినవి. శంఖమహాఘోషము భూనభోంతరాళాలు నిండిపోయింది. ఆ రాక్షసేంద్రుడికి రాక్షసులు పట్టిన శ్వేతచ్ఛత్రము పూర్ణచంద్రుడివలె తేజరిల్లింది. నడుమ బంగారు పూలగుత్తులతో స్ఫటికాలవలె స్వచ్ఛకాంతులతో వింజామరలు ఆ రావణాసురుడి ఉభయ పార్శ్వాలా విరాజిల్లినవి. రథముమీద ఉన్న ఆ రాక్షసోత్తముడికి నేలమీద నిలుచున్న రాక్షసులు అందరూ తలలు ఒగ్గి నమస్కారము చేసినారు. జయ జయ ధ్వనులు చేసినారు. ఆశీర్వదించినారు. స్తోత్రము చేసినారు. ఆ మహాతేజోవంతుడు ఆ శత్రుసంహారకుడు రావణాసురుడు ఆ మహారథము దిగి మనోహరము అయిన ఆ సభాభవనములోకి పోయినాడు. వెండి బంగారు స్తంభాలతోనూ స్ఫటికాలు పొదిగిన మధ్యప్రదేశాలతోనూ విశ్వకర్మ నిర్మించిన ఆ సభాభవనాన్ని ఆరు వందల పిశాచులు కావలి కాస్తున్నారు. అక్కడ వైడూర్య

మణులు పొదిగిన పరమాసనముమీద ప్రియకచర్మాస్తరణము కప్పి దిండ్లు పెట్టి ఉన్నవి. ఆ ఉత్తమాసనముమీద ఆ మహాతేజోవంతుడు రావణాసురుడు కూర్చున్నాడు.

అంతట రావణాసురుడు అమితవేగముగా పోయే దూతలను చూచి "ఇప్పుడు ఒక మహాకార్యము వచ్చింది. దానిని నిర్వహించవలెను. మీరు పోయి రాక్షసనాయకులను అందరినీ వెంటనే వెంటపెట్టుకొని రావలెను" అని ఆజ్ఞాపించినాడు. అప్పుడు ఆ దూతలు విహారస్థలాలలోనూ శయనస్థలాలలోనూ ఉన్న వారి దగ్గరకు నిర్భయముగా పోయి రావణాసురుడి ఆజ్ఞను తెలియచెప్పినారు. అంతేకాదు. ఆ దూతలు ఇంటి ఇంటికీ పోయి రాజాజ్ఞను వెల్లడించినారు. ఆ వర్తమానము వినగానే లంకాపట్టణములో ఉంటూఉన్న రాక్షసులు అందరూ బయలుదేరినారు. కొందరు రథాలమీదనూ కొందరు పొగరుఎక్కిన గుర్రాలమీదనూ కొందరు మదపుటేనుగులమీదనూ సభాభవనానికి ప్రయాణము అయినారు. ఆ యా వాహనాలు లేనివారు పాదచారులు అయి పోయినారు. అట్లా ఆ లంకాపట్టణములో గుంపులు గుంపులుగా రథాలూ గుర్రాలూ ఏనుగులూ ఆ యా వాహనాలూ పోతూఉంటే పక్షిసంఘాలు బారులుకట్టి ఆకాశములో పోతున్నట్టుగా తోచింది. ఆ రాక్షసులు అందరూ ఆ సభాభవనద్వారముదగ్గిర వారి వారి వాహనాలు దిగి సింహాలు గిరిగుహాలోకి పోయేట్టు ఆ సభాభవనములోకి పోయినారు. వారు అందరూ రావణాసురుడి పాదాలకు నమస్కారము చేసినారు. ఆ రాక్షసేంద్రుడు వారిని అందరినీ సమ్మానించి కొందరిని కాంచనాసనాలమీదనూ కొందరిని దర్భాసనాలమీదనూ మిగిలినవారిని నేలమీదనూ కూర్చుండ నియమించినాడు. అట్లా రాక్షసనాయకులు అందరూ వారి వారి యోగ్యతలనుపట్టి రావణాసురుడి సమీపములో కూర్చున్నారు. ఆ యా కార్యాలు నిశ్చయించడములో పండితులు అయిన ముఖ్యమంత్రులూ సర్వజ్ఞులూ గుణవంతులూ బుద్ధిదర్శనులూ అయిన అమాత్యులూ వందలకొద్దీ ఇతరులున్నూ అక్కడ చేరినారు.

బంగారముతో విచిత్రముగా చేసిన రథముమీద అప్పుడు ఆ సభాభవనానికి విభీషణుడు వచ్చినాడు. అతడు అన్నగారికి

తన పేరు చెప్పుకొని పాదాభివందనము చేసినాడు. అదేవిధముగా శుకుడూ ప్రహస్తుడూ నమస్కారము చేసినాడు. అప్పుడు ఆ ముగ్గురికీ వారి వారి యోగ్యతలకు తగినట్టు రావణాసురుడు ఆసనాలు చూపించినాడు. అట్లా నానామణిభూషణాలతోనూ మంచి మంచి వస్త్రాలతోనూ శ్రేష్ఠము అయిన చందనాగరు మైపూతలతోనూ వచ్చి కూర్చున్న రాక్షసులు ధరించిన పూల మాలికల సుగంధము ఆ సభాభవనము అంతటా గుబాళించింది. ఆ సభికులు రొదపెట్టలేదు. వారిలో ఒక్కడున్నూ అబద్ధము ఆడడు. వారు ఎవరూ బిగ్గరగా మాట్లాడరు. అందరూ తమ ప్రయోజనాలు ఈడేరినవారు. అందరూ భయంకరులు. పరాక్రమవంతులు. వారు అందరూ తమ ఏలికవంక చూడసాగినారు.

ఆ సభలో ఆయుధధారులూ బలవంతులూ ధీరహృదయులూ అయిన ఆ రాక్షసుల మధ్యను కూర్చున్న ఆ ధీరహృదయుడు రావణాసురుడు వసువుల మధ్యను కూర్చున్న దేవేంద్రుడివలె తేజరిల్లినాడు.

౧౨

అప్పుడు ఆ జయశీలి రావణాసురుడు ఆ సభను అంతా కలయ చూచి ప్రహస్తుడితో "ఓ సేనాధిపతీ, నీవు ఇప్పుడు వివిధాయుధవిద్యలూ అభ్యసించిన మన చతుర్విధయోధులనూ నగరరక్షణానికి ఎప్పటికన్నా ఎక్కువ హెచ్చరికతో ఉంచవలెను" అని ఆజ్ఞాపించినాడు.

అంతట ప్రహస్తుడు రాజశాసనాన్ని ఆచరణలో పెట్టడానికి సైన్యములో కొంతభాగాన్ని రాజమందిరము దగ్గరనూ కొంత సైన్యాన్ని నగరము వెలుపలనూ కొంతసైన్యాన్ని నగరము అంతటానూ ఉండ నియమించి రాజసమ్ముఖానికి వచ్చి "రాజా, మన బలగాన్ని అంతా మన నగరానికి లోపలనూ వెలుపలనూ రాజమందిరము దగ్గరనూ ఉంచినాను. ఇకను చేయవలసిన పని యథేష్టముగా స్వస్థముగా చేసుకోవచ్చును" అని విన్నవించి కూర్చున్నాడు.

అంతట ఆ రాజ్యహితాసక్తుడు రావణాసురుడు తన సుఖాన్నే కాంక్షిస్తూ స్నేహితులతో "ఓ సభాసదులారా, ధర్మార్థకామాలకు సంబంధించిన సంకటము వచ్చినప్పుడు మీరు ప్రియాప్రియాలూ సుఖదుఃఖాలూ లాభాలాభాలు కీడుమేళ్లూ తెలుసుకోగలరు. మీరు అన్నివిధాలా ఆలోచించి నిశ్చయించి నా చేత ఆరంభించి చేయించిన సమస్తకార్యాలూ సఫలము అయినవి. ఏ ఒక్క కార్యమూ ఎన్నడూ విఫలము అయిపోలేదు. సూర్యచంద్రులూ గ్రహనక్షత్రాలూ దేవతలూ తోడుపడినందువల్ల దేవేంద్రుడు జయలక్ష్మిని సంపాదించినాడు. ఆదేవిధముగా మీరు అందరూ తోడ్పడేట్లయితే నాకు జయలక్ష్మి లభ్యము అవుతుంది.

"ఇప్పుడు నేను చెప్పబోయే విషయము మీకు అందరికీ ఇదివరకే తెలియచెప్పవలెను అనుకొన్నాను. అయితే మహాబలవంతుడూ సర్వాస్త్రకోవిదుడూ అయిన నా తమ్ముడు కుంభకర్ణుడు నిద్రపోతున్నందువల్ల చెప్పలేదు. వాడు ఆరుమాసాలనుంచి నిద్రపోయి ఇప్పుడు లేచి వచ్చినాడు. అందువల్ల, కుంభకర్ణుడి సమక్షములో చెప్పుతున్నాను.

"ఓ స్నేహితులారా, నేను రాక్షసులు సంచరించిన దండకారణ్యమునుంచి జనకరాజపుత్రిని రాముడి పట్టమహిషిని సీతాదేవిని లేవనెత్తుకొని వచ్చినాను. ఆ సీతతో సరిసమానము అయిన అందకత్తె మరిఒకతె ముల్లోకాలలోనూ లేదు ఆ అలసగామిని నాతో శయనించడానికి ఇంతవరకూ ఇష్టపడలేదు. ఆ తనుమధ్య ముఖము శరత్కాలచంద్రబింబమువలెనూ ఆ పృథుశ్రోణి బంగారుబొమ్మవలెనూ అసమాన సౌందర్యవతి. ఆమె మయుడు సృష్టించిన మాయ (ఆశ్చర్యరూపము) వంటిది. మంచి ఎర్రని అరకాళ్ళతో ఎర్రని గోళ్ళతో సమముగా నేలమీద మోపే ఆమె మృదుపాదాలనూ వేల్చిన అగ్నిహోత్రజ్వాలవలెనూ సూర్యప్రభలవలెనూ తేజరిల్లే ఆమె దేహకాంతులనూ చూస్తూఉంటే మన్మథుడు నన్ను దహించివేస్తున్నాడు. ఉన్నతము అయిన ముక్కూ వెడల్పాటి అందము అయిన కన్నులూ సుందరవదనమూ చూచి నేను కామపరవశుడను అయిపోయినాను. కోపములోఉన్నా సంతోషములో

ఉన్నా దేహవ్యథలోఉన్నా మనోవ్యథలోఉన్నా విడిచి పెట్టకుండా బాధపెట్టి దేహాన్ని వివర్ణముచేసే మన్మథుడు నన్ను కలవర పెట్టు తున్నాడు. ఆ భామిని తన పెనిమిటి రాకను ఎదురుచూస్తూఉంది. అందుకోసము ఆ విశాలనేత్రి నన్ను ఒక సంవత్సరకాలము గడువు అడిగింది. ఆ చారునేత్రి కోరికను నేను అంగీకరించినాను. నేను బహుదూరము నడిచిన గుర్రమువలె కామభారమువల్ల అలసిపోయి ఉన్నాను.

"ఓ స్నేహితులారా, తిమి తిమింగలాది బహు జలజంతువులతో నిండిపోయి కలత పెట్టడానికి అలవికాని సముద్రాన్ని వానరులు ఎట్లా దాటివస్తారు. ఆ రామలక్ష్మణులు ఎట్లా దాటివస్తారు. వారు సముద్రాన్ని దాటిరారు అనుకోడానికిన్ని వీలులేదు. ఒక్క వానరుడు వచ్చి మనతో యుద్ధముచేసినాడు. ఏ ఏ పనులు ఎట్లా జరుగుతవో ముందుగా తెలుసుకోలేము. అందువల్ల ఈ విషయములో మీ బుద్ధికి తోచింది చెప్పవలెను. మీ అందరి సాయముతో దేవాసుర యుద్ధములో నేను జయించినాను. ఆదేవిధముగా అప్పటినుంచి ఇప్పటివరకూ నాకు సహాయులుగా ఉంటున్నారు. దేవతలను జయించిన నాకు మానవులు అంటే భయము ఏమిటి. అయినప్పటికిన్ని మీరు అందరూ ఈ విషయము ఆలోచించవలెను. రామలక్ష్మణులూ సుగ్రీవుడూ మొదలుఅయినవారు సీతాదేవి ఉన్నచోటు తెలుసుకొన్నారు. వారు ఇప్పుడు ఈ సముద్రము అవతలిగట్టుకు వచ్చి చేరినారు. సీతాదేవిని ఇవ్వకుండా ఆ రామలక్ష్మణులను చంపివేసే ఉపాయము మీరు జాగ్రత్తగా ఆలోచించి నిశ్చయించవలెను. వానరులను సాయము చేసుకొని సముద్రాన్ని దాటి వచ్చే సామర్థ్యము వారికి లేదు అనుకొంటున్నాను. నేను తప్పకుండా జయించకలను అనుకొంటున్నాను" అని చెప్పినాడు.

రావణాసురుడు కామపరీతుడు అయి ఇట్లా పరిదేవనము చేయడము చూచి కోపము వచ్చి కుంభకర్ణుడు "ఓ రాజా, నీ అంతట నీవు రాముడి భార్యను బలవంతముగా తెచ్చుకొన్నావు. నీవు ఎవరినీ ఆలోచించలేదు. ఆలోచించిన తర్వాత ఏపనిని అయినా చేయవలెను. పని చేసినతర్వాత ఆలోచించి ప్రయో

జనము ఉండదు. నీవు ఈ పని చేయడానికి ముందుగా మమ్ములను ఆలోచించి ఉన్నట్లయితే యామున పర్వతము యమునానదిని వలె నీకు ఏ మనఃక్షోభమూ రాకుండా ఉపాయము చెప్పిఉండే వాండ్లము. పనిచేసి ఇప్పుడు ప్రాణముమీదికి వచ్చినప్పుడు విచారపడ్డందువల్ల ప్రయోజనము ఏమిటి. ముందుగా ఆలోచించి నిశ్చయించి పనులు చేసే రాజు తరువాత పరితపించడు. కార్యనీతి ఎరగనివాడు ముందు చేయవలసినపనులు వెనుకా వెనుక చేయవలసినపనులు ముందూ చేస్తూ ఉంటాడు. బలవంతుడు అయినప్పటికిన్నీ యుద్ధములో జయించ నలవికానివాడు అయినప్పటికిన్నీ బుద్ధిస్థిమితము లేకుండా నియమము తప్పి పనులు చేసే వాడిలో లోపము కనిపెట్టి శత్రువులు సులభముగా జయిస్తారు. క్రౌంచపర్వతము దాట నలవికానిది అయినప్పటికిన్నీ హంసలూ మొదలుఅయిన పక్షులు ఆ క్రౌంచపర్వత రంధ్రములోనుంచి అవతలికీ ఇవతలికీ పోతూ వస్తూ ఉంటవి.

"అన్నా, నీవు ఆలోచించకుండా పెద్ద పని చేసినావు. నీవు చేసింది దోషయుక్తము అయిన పని. విషము కలిసిన మాంసమువంటిది. నిన్ను ఆ రాముడు దైవవశమువల్ల ఇంతవరకూ చంపివేయలేదు. ఎవరూ చేయలేని దుష్కార్యము నీవు తలపెట్టి చేసివేసినావు. నీవు నాతోబుట్టువు. కాబట్టి నేను నీతో నిలవక తప్పదు. అయిపోయినదానికి విచారపడి ప్రయోజనములేదు. నిన్ను కాపాడకలిగిన వాణ్ణి నేనే. నేను శత్రువులను చంపివేసి నీవు చేసిన ఈ తప్పుపనిని సరిదిద్దుతాను.

"అన్నా, నీ శత్రువులు ఇంద్ర సూర్యులు అయినా అగ్ని వాయువులు అయినా కుబేర వరుణులు అయినా నేను యుద్ధముచేసి సంహారము చేసి వేస్తాను. తీక్ష్ణదంష్ట్రలతోనూ పర్వతాకారముతోనూ ఉన్న నేను పెద్ద ఇనుపగుదియ తీసుకొని సింహనాదము చేస్తే దేవేంద్రుడు అయినా వెరచి పారిపోతాడు. ఆ రాముడు నామీద ఒక బాణము వదిలి రెండవ బాణము తీసే లోపల నేను వాడి నెత్తురు తాగివేస్తాను. అన్నా, నీవు యథేష్టముగా హాయిగా ఇక్కడ ఉండు. నేను ఆ రాముణ్ణి సంహారముచేసి నీకు జయము

సంపాదిస్తాను. నీవు సుఖపడేట్టు చేస్తాను. ఆ రామలక్ష్మణులను సంహారము చేసివేసిన తరువాత వానరశ్రేష్ఠులను అందరినీ నమిలి వేస్తాను. నీవు యథేష్టముగా ఇక్కడ క్రీడిస్తూ ఉండు. నిర్భయముగా నీ ఇష్టము వచ్చిన పనులు చేసుకొంటూ ఉండు. నేను ఆ రాముణ్ణి యమసదనానికి పంపించి వేస్తాను. సీతాదేవి చాలా కాలము నీ స్వాధీనములో ఉంటుంది" అని చెప్పినాడు.

౧౩

కుంభకర్ణుడు తెలియచెప్పిన నీతిని తెలుసుకోలేక రావణాసురుడు క్రుద్ధుడు అయిపోయినాడు. ఆ సంగతి మహాబలవంతుడు మహాపార్శ్వుడు కనిపెట్టినాడు. ఒక క్షణము ఆలోచించినాడు. అంతట చేతులు జోడించి "ప్రభూ, పెద్దపులులూ మొదలు అయిన క్రూరమృగాలూ మహావిషసర్పాలూ ఉన్న వనములోకి పోయి అక్కడ దొరికిన తేనెను తాగకుండా వచ్చేవాడు మూర్ఖుడు. రాజా, నీవు శత్రు సంహారకుడవు. సర్వనియంతవు. నీకు మరి ఒక నియంత ఎవడు ఉన్నాడు. శత్రువుల తలతన్ని నీవు ఆ వైదేహిని క్రీడించు. నీవు మహాబలవంతుడవు. కోడి మాదిరిగా బలవంతముగా ఆమెను ఆక్రమించు. ఆమెను వశపరుచుకో. అనుభవించు. సంతోషించు. నీ కోరిక నెరవేర్చుకొన్న తరువాత భయము ఏమిటి ఉంటుంది. ఒకవేళ ఏది అయినా చిక్కు వచ్చేట్లయితే ప్రతీకారము చేయవచ్చును. వజ్రాయుధము తీసుకొని దేవేంద్రుడు ఆ రాముడికి సాయము వచ్చినా మాతోకూడా కుంభకర్ణుడూ ఇంద్రజిత్తూ ఉండేట్లయితే చాలు. మేము వాడిని చంపివేస్తాము. యుద్ధము చేయడము చేతకానివాండ్లు సామదానభేదోపాయాలు అనే మాటని ఏర్పరచినారు. దండోపాయము వల్లనే కార్యసిద్ధి అవుతుంది. ఓ రాజా, నీవు మహాబలవంతుడవు. ఇక్కడికి శత్రువులు వస్తే శస్త్రబలముతో వశపరచుకొంటాము. సందేహించవద్దు" అని చెప్పినాడు.

ఇట్లా చెప్పిన ఆ మహాపార్శ్వుణ్ణి రావణాసురుడు మెచ్చుకొని "ఓ మహాపార్శ్వుడా, నాకు సంబంధించిన రహస్యము ఒకటి ఉంది.

ప్రహస్తుడు చెప్పిన అహితము విని రాజు మేలుకోరే ఆ పూజ్యుడు విభీషణుడు ధర్మార్థకామాలను మూడింటినిగురించీ చక్కగా ఆలోచించి "ఓ ప్రహస్తుడా, ధార్మికుడు కానివాడు స్వర్గానికి పోవడము అశక్యము. అదేవిధముగా రావణుడూ మహాపార్శ్వుడూ కుంభకర్ణుడూ ఏ ఏ పనులు చేయవలెను అనుకొన్నారో అవి అన్నీ అట్లా రాముడి విషయములో చేయడము అశక్యము. ఓ ప్రహస్తుడా, తెప్పకొయ్య అయినా లేనివాడు సముద్రాన్ని ఎట్లా దాటలేడో అదేవిధముగా నీవుకానీ నేనుకానీ రాక్షసులు అందరూకానీ ఆ రాముణ్ణి చంపివేయడము ఉత్తది. రాముడు మహారథుడు. పరమపరాక్రమవంతులు పుట్టిన ఇక్ష్వాకు వంశములో పుట్టినాడు. అతడు పరమధార్మికుడు. మహాసమర్థుడు. జనరంజకుడు. యుద్ధములో దేవతలు సహితము ఆ రాముడి ఎదుట మూగారు అయిపోతారు.

"ప్రహస్తుడా, ఆ రాముడు తీక్ష్ణము అయిన బాణాలు వదులుతాడు. కంకపక్షి రెక్కలతోనూ వంగిన కణుపులతోనూ అవి దురాసదముగా ఉంటవి. అవి నీ దేహాన్ని భేదించుకొని పోనంతవరకూ నిన్ను నీవు పొగడుకొంటూ ఉంటావు. రాముడు యుద్ధములో దేవేంద్రుడితో సరిసమానము అయినవాడు. మా అన్న రావణుడుకానీ మహాబలవంతుడు అయిన త్రిశీర్షుడుకానీ కుంభకర్ణుడుకానీ వాడి కొడుకు నికుంభుడుకానీ ఇంద్రజిత్తుకానీ నీవుకానీ యుద్ధములో రాముణ్ణి ఓర్చుకోలేరు. దేవాంతకుడుకానీ నరాంతకుడుకానీ అతిరథుడూ మహాబలవంతుడూఅయిన అతికాయుడుకానీ పర్వతసమానబలవంతుడుఅయిన అకంపనుడుకానీ యుద్ధములో రాముడి ఎదుట నిలువలేరు.

"ఓ ప్రహస్తుడా, మా అన్న రావణుడు స్వభావసిద్ధముగా ఉగ్రుడు. ఇప్పుడు స్త్రీవ్యసనానికి లొంగిపోయినాడు. ఆలోచించకుండా ఈ పని చేసినాడు. రాక్షసులు అందరూ నాశనము అయిపోయేపని ఇప్పుడు తలపెట్టుతున్నాడు. మంత్రులు అయిన మీరు అందరూ శత్రువులవలె ప్రవర్తిస్తున్నారు. మిమ్ములను అతడు అనుసరిస్తున్నాడు. రామవైరము అనే వెయ్యితలలతో అంతులేని

దేహముతో మహాభయంకరమూ బలవంతమూ అయిన మహాసర్పము రావణుణ్ణి గట్టిగా చుట్టవేసుకొన్నది. మీరు ఈ మహాసర్పమునుంచి రావణుణ్ణి విడిపించవలెను. భయంకర భూతావిష్టుడు అయిన వాని తలవెంట్రుకలను పట్టుకొని బయటికి ఈడ్చేటట్టు దుర్మార్గానికి ఒడికట్టిన రాజును పరిపూర్ణకాములు అయిన మిత్రులు అందరూ సన్మార్గము పట్టించవలెను. లక్ష్మణుడు అనే అగాధము అయిన సముద్రములో మునిగి రాముడు అనే బడబానలాగ్నిముఖాన పడి పోతున్న ఈ రావణుణ్ణి మీరు అందరూ ఏకము అయి ఆ సముద్రములోనుంచి దాటించవలెను. సీతాదేవిని రాముడికి వెంటనే ఇచ్చివేసేటట్లయితే మనరాజుకూ మన బంధుమిత్రులకూ సమస్త రాక్షసులకూ క్షేమకరముగా ఉంటుంది. నేను బాగా ఆలోచించి చెప్తున్నాను. మంత్రి అయిన వాడు తన బలపరాక్రమాలనూ తన రాజు స్థానాన్నీ వృద్ధిక్షయాలనూ శత్రువుల స్థానాన్నీ వారి వృద్ధిక్షయాలనూ విమర్శించి ఆలోచించి తన స్వామికి మేలు అయ్యేది చెప్పవలెను" అన్నాడు.

౧౩

బుద్ధికి బృహస్పతి అంతటివాడు విభీషణుడు. అతడు చెప్పిన మాటలు వినలేక వినలేక విని రాక్షసయోధులలో ముఖ్యుడున్నూ మహాధైర్యవంతుడున్నూ అయిన ఇంద్రజిత్ తన తండ్రి రావణుణ్ణిచూచి "నాయనా, నీ తమ్ముడు విభీషణుడు బాగా భయపడినట్టు ఉంది. వట్టి పనికిమాలిన మాటలు చెప్పినాడు. ఏమిటి ఇది. ఈ పులస్త్యవంశములోనే కాదు—మరి ఏ ఇతర వంశములో పుట్టినవాడు ఎవడూ ఇటువంటి మాటలు చెప్పనే చెప్పడు. ఇట్లా చేయమనడు. ఈ మనవంశములో ఈ విభీషణుడు ఒక్కడే బలమూ సామర్థ్యమూ పరాక్రమమూ శౌర్యమూ ధైర్యమూ లేనివాడు పుట్టినాడు.

"ఓ విభీషణుడా, నీవు రాక్షసుడవు అయి ఉండిన్నీ మానవమాత్రులను అందులో రాజు పిల్లకాయలను ఏమిటో పొగడుతున్నావు. మనలో ఏ ఒక సామాన్యుడు అయినా వాండ్లను

చంపివేయకలడు. ఓ పిరికివాడా, మమ్ములను ఎందువల్ల భయ పెట్టుతున్నావు. ఓయీ, త్రిలోకనాథుడూ దేవరాజూ అయిన దేవేంద్రుణ్ణి నేను ఈ భూమిమీదికి లాగుకొని వచ్చి చెరసాలలో పెట్టినాను. నేను ఐరావతాన్ని నేల పడతోసినాను. అది వికృతస్వరముతో అరుస్తూ ఉంటే బలవంతముగా దాని రెండు దంతాలు ఊడపెరికినాను. సమస్తదేవతలూ నాకు భయపడి గుంపులు గుంపులుగా దశదిశలా పరుగులెత్తి పారిపోయినారు. నేను దేవతల దర్పాన్ని అణచివేసినాను. దైత్యనాయకులను దుఃఖాలపాలు చేసినాను. అటువంటి పరాక్రమవంతుణ్ణి నేను మానవులను అందులో సామాన్యులను ఆ రామలక్ష్మణులను జయించలేనా" అని అడిగినాడు.

దేవేంద్రతుల్యుడూ దురాసదుడూ మహాతేజోవంతుడూ అయిన ఇంద్రజిత్తు అన్నమాటలు ఆయుధధారులలో శ్రేష్ఠుడుఅయిన విభీషణుడు విని అధికారముగా "నాయనా, ఆలోచించి ఇది సరి అయింది అనే నిశ్చయించే శక్తి నీకులేదు. నీవు పిల్లవాడవు. ఇంకా నీ బుద్ధి పరిపక్వము కాలేదు. నీవు నీ నాశనానికి అర్థము లేనిమాటలు అధికముగా పేలినావు. ఓ ఇంద్రజిత్తా, రాముడివల్ల సర్వమూ నాశనము అయిపోతుంది అని నేను మా అన్నతో చెప్పతూ ఉంటే నీవు నీ అజ్ఞానమువల్ల ఈ విధముగా మాట్లాడి నీ తండ్రి నాశనము అయిపోవడానికి నీవు ఒప్పుకొంటు న్నావు' నీవు మా అన్న రావణుడికి పుత్రముఖవైరివి. ఇట్లా పితృనాశనాన్ని కోరుతున్న నిన్ను చంపివేయవలెను. నీవు బాలుడవు. సాహసివి. దుర్మతివి. ఇటువంటి నిన్ను మంత్రాంగము చేసే ఈ సభలోకి తీసుకొనివచ్చినవాడినికూడా చంపివేయవలెను.

"ఓ ఇంద్రజిత్తా, నీవు మూర్ఖుడవు. నీకు అణకువ లేదు. నీది తీక్ష్ణస్వభావము. అల్పబుద్ధివి. గర్విష్ఠివి. దురాత్ముడవు. నీవు నీ క్రూరతనమునుంచి ఏమీ తెలియకుండా మాట్లాడినావు. బ్రహ్మదండమువలెనూ యమదండమువలెనూ జ్వలిస్తూ రాముడి బాణాలు మృత్యురూపముతో వచ్చి పడుతూఉంటే ఎవడు ఓర్చుకో కలడు" అంటూ రావణుణ్ణి చూచి విభీషణుడు "ఓ రాజా,

ధనాన్ని రత్నాలనూ ఆభరణాలనూ దివ్యము అయిన వస్త్రాలనూ చిత్ర విచిత్రము అయిన మణులనూ సీతాదేవినీ రామునికి సమర్పించు. నిర్భయముగా సుఖముగా ఉందాము'' అని చెప్పినాడు.

౧౬

విభీషణుడు చక్కగా ఆలోచించి చెప్పిన హితవాక్యాలను రావణాసురుడు విన్నాడు. అతనికి కాలము ముంచుకొని వస్తూఉంది. అందువల్ల అతిపరుషముగా ''ఓ విభీషణుడా, కుపిత విషసర్పాలలో నివసింపవచ్చును. శత్రువులతో స్నేహము చేయవచ్చును. కాని స్నేహితులవలె ఉంటూ శత్రువులను సేవించేవారిని మాత్రము దరిచేరనీయకూడదు. ఓ రాక్షసుడా, ఈ లోకములో జ్ఞాతుల స్వభావము నేను ఎరుగుదును. తమ వారికి కష్టాలువస్తే జ్ఞాతులు సంతోషిస్తారు. అంతేకాదు — తమలో ప్రధానుడు అయినవాణ్ణి కార్యసాధకుణ్ణి విద్వాంసుణ్ణి ధార్మికుణ్ణి శూరుణ్ణి జ్ఞాతులు ఎప్పుడూ అవమానిస్తారు. తిరస్కరిస్తారు. జ్ఞాతులు ఎప్పుడూ ప్రచ్ఛన్నహృదయులుగా ఉంటారు. పయికి ఒకటి మాట్లాడుతూ మనస్సులో మరి ఒకటి ఆలోచిస్తూ ఉంటారు. అన్యోన్యస్నేహముతో ఉంటూ ఉన్నట్టు ఉండి కష్టకాలము వచ్చినప్పుడు ద్రోహము చేస్తారు. జ్ఞాతులు భయంకరులు. భయావహులు.

''ఓ విభీషణుడా, పద్మకవనములో ఒకప్పుడు ఒకచోట తమను పట్టుకోడానికి పాశహస్తులు అయి వచ్చిన మనుష్యులను చూచి ఏనుగులు కొన్ని శ్లోకాలు పాడినవి. ఆ శ్లోకాలలో విషయము నేను చెప్పుతాను. విను. 'అగ్నిహోత్రము మనలను ఏమీ చేయలేదు. పాశాలు అంతకన్నా మనలను ఏమీ చేయలేవు. మానవులు స్వప్రయోజనముకోసము వెంటపెట్టుకొని వచ్చే మన జ్ఞాతులు అయిన ఏనుగులుమాత్రము మనకు ఘోరము అయిన అపకారము చేస్తవి. మానవులు మనలను పట్టుకొని పోవడానికి ఉపాయము చెప్పేవి మన జ్ఞాతులు అయిన ఏనుగులే. సందేహములేదు. అందువల్ల మనజ్ఞాతులను చూచి మనము భయ

పడవలెను. భయాలు అన్నిటికన్నా జ్ఞాతిభయము చాలా గొప్పది. ఇది అందరికీ తెలిసిన విషయమే. సంపద అంతా ఆవులలో ఉంది. ఇంద్రియనిగ్రహము బ్రాహ్మణులలో ఉంది. చాపల్యము స్త్రీలలో ఉంది. అపకారము అంతా జ్ఞాతులలో ఉంది' అని ఆ ఏనుగులు చెప్పినవి.

"ఓ విభీషణుడా, నీవు సౌమ్యుడవు అనుకొన్నాను. నన్ను లోకము అంతా పూజించడమూ నేను సమస్తైశ్వర్యాలూ అనుభవించడమూ జ్ఞాతులలో ముఖ్యుణ్ణిగా ఉండడమూ నీకు ఇష్టములేదు అని తెలుస్తున్నది. తామరాకులలో పడ్డ నీటి బిందువులు ఒక దానితో ఒకటి కలియవు. అదేవిధముగా ఎంత స్నేహము చేసినా జ్ఞాతి అయినవాడు దుష్టుడు అయితే తనవారితో కలసి ఉండడు. తుమ్మెదలు పూలలోనుంచి తమకు కావలసినంత తేనను తాగుతవి. ఆ తరువాత ఆ పూలదగ్గిర ఉండకుండా పోతవి. అదేవిధముగా నానుంచి నీవు సమస్త సౌఖ్యాలూ అనుభవించినావు. ఇప్పుడు నీవు తుమ్మెదలవలె ప్రవర్తిస్తున్నావు.

"ఓ విభీషణుడా, ఏనుగు ముందుగా స్నానముచేస్తుంది. ఆ తరువాత తొండముతో దుమ్ము తీసుకొని ఒంటినిండా కొట్టుకొంటుంది. అదేవిధముగా దుష్టుడు ముందుగా చాలా స్నేహము చేస్తాడు. ఆ తరువాత ఆ స్నేహాన్ని వాడే చెడగొట్టుకొని పోతాడు. శరత్కాలములో మేఘాలు వాన కురిసేటట్టు ఉరుములు ఉరిమి చినుకులు పడతవేకాని నేలమీద తేమ అయినా ఉండదు. అదేవిధముగా దుష్టుడు అయిన స్నేహితుడు ఉపకారము చేస్తూ ఉన్నట్టు గర్జిస్తూ ఉంటాడు కాని ఉపకారము చేయడు. ఓ నిశాచరుడా, నీవు నాకు తమ్ముడవు అయిపోయినావు. అన్యుడవు అయినట్లయితే నీ నోట ఇటువంటి మాటలు వెలువడిన ఉత్తరక్షణాన నీ ప్రాణాలు ఎగిరిపోయి ఉండేవి. నీవు కులపాంసనుడవు. ఛీ. ఛీ. అవతలికి పో" అన్నాడు.

ఇట్లా రావణాసురుడు పరుషవాక్యాలు అనగానే ఆ న్యాయవాది విభీషణుడు గద చేతిలో పట్టుకొని తన సచివులు అయిన నల్గురు రాక్షసులతోకూడా ఆకాశానికి ఎగిరినాడు. ఆ కాంతి

మంతుడికి విభీషణుడికి కోపమువచ్చి అంతరిక్షానికిపోయి నిలుచుని రావణాసురుణ్ణి చూచి "ఓ రాజా, నీవు ఇంకా ఏమేమి అనవలెను అనుకొంటున్నావో అవి అన్నీ అను. నేను నీకు బదులు చెప్పను. నీవు నాకు జ్యేష్ఠుడవు. తండ్రితో సరిసమానము అయినవాడవు. మాన్యుడవు. అయితే నీవు ధర్మమార్గము తప్పినావు. నన్నుగురించి నీవు అన్నది అంతా అబద్ధము. నీ పరుషవాక్యాలను మాత్రము నేను మన్నించలేను. ఓ దశాననుడా, నీ మేలు కోరి నేను జాగ్రత్తగా ఆలోచించి నిశ్చయించింది నీకు చెప్పినాను. బుద్ధిస్థైర్యము లేనివారూ మృత్యువశంగతులూ మంచిమాటలు వినరు. ఓ రాజా, సంతోష పెట్టే మాటలు చెప్పేవారూ వినేవారూ ఎప్పుడూ సులభముగా దొరుకుతూనే ఉంటారు. అప్రియము అయినప్పటికినీ హితము చెప్పేవారూ వినేవారూ దొరకటము దుర్లభము. కాలపాశబద్ధుడవు అయి నాశనము కాబోతున్న నిన్ను చూచినాను. మండుతూ ఉన్న ఇంటినిచూచి ఊరకుండలేనట్టు నేను నీకు మేలు అయ్యే ఆలోచన చెప్పినాను. మండే మంటలవంటి నిశితము అయిన బంగారు బాణాలు నీమీద రాముడు వదులుతూ ఉంటే చూడడము నాకు ఇష్టములేదు. శూరులూ బలవంతులూ అస్త్రవేత్తలూ అయినవాండ్లు కాలము ముగించుకొని వచ్చినప్పుడు మహాప్రవాహానికి ఇసుకతో వేసిన ఆనకట్టవలె యుద్ధములో కూలిపోతారు. నీవు నాకు అన్నవు. అయినందువల్ల నేను నీ మేలుకోరి చెప్పినాను. అందుకు నీవు నన్ను మన్నించవలెను.

"ఓ అన్నా, నీవు ఇక అన్నివిధాలా నిన్ను కాపాడుకో. ఈ లంకాపట్టణాన్నీ రాక్షసులనూ రక్షించుకో. నీకు నేను స్వస్తి చెప్పుతున్నాను. నేను వెళ్ళిపోతున్నాను. నేను ఉండను కనుక నీవు సుఖముగా ఉండు.

"ఓ నిశాచరుడా, నేను నీ మేలు కోరి నిన్ను నివారించవలెను అనుకొన్నాను. నా మాటలు నీకు రుచించలేదు. ఆయువు అయిపోయినవారు చచ్చిపోయినవారితో సరిసమానము. చచ్చిపోయినవారు స్నేహితులు చెప్పేమాటలు వినడము ఉండదు" అన్నాడు.

౧౭

విభీషణుడు రావణాసురుడితో అట్లా అంత పరుషముగా మాట్లాడి ఆ క్షణమే తన నల్గురు మంత్రులనూ వెంటపెట్టుకొని రామలక్ష్మణులు ఉన్నచోటికి వచ్చినాడు.

కన్నులు చెదిరిపోయే మెరుపులవలెనూ మేరుపర్వత శిఖరమువలెనూ ఆకాశములో వస్తూఉన్న ఆ విభీషణుణ్ణీ అతడి అనుచరులనూ భూమిమీదఉన్న వానరులు అందరూ చూచినారు. ఒక్కడే కాకుండా మరి నల్గురు రాక్షసులను వెంటపెట్టుకొని వస్తూ ఉన్న ఆ రాక్షసుణ్ణి వానరవాహినీపతి సుగ్రీవుడు చూచినాడు. ఆ దుర్ధర్షుడు ఆ బుద్ధిమంతుడు సుగ్రీవుడు ఆ రాక్షసులనుగురించి వానరులతో ఆలోచించినాడు. స్వయముగా కొంచెము సేపు ఆలోచించి హనుమంతుడు మొదలు అయిన వానరవీరులను చూచి "ఓ వీరులారా, రాక్షసుడు తనతోపాటు మరి నల్గురితో వస్తున్నాడు. వాండ్లు సమస్తాయుధాలూ ధరించినారు. మనలను చంపివేయడానికి వస్తున్నారు" అన్నాడు. సుగ్రీవుడు ఈ మాటలు అనే అనడముతో వానరులు అందరూ చేతులలో రాళ్ళూ చెట్లూ తీసుకొని "రాజా, ఆజ్ఞాపించు. మేము ఆ దురాత్ములను చంపివేస్తాము. వాండ్లు అల్పతేజస్కులు. మేము వాండ్లను హతమారుస్తాము. నేలమీదికి పడగొట్టుతాము" అన్నారు.

అట్లా వానరవీరులు అన్యోన్యము మాట్లాడుకొంటూ ఉండగా విభీషణుడు ఆ సముద్రము ఉత్తరతీరానికి చేరినాడు. ఆకాశములో నిలుచుని ఆ మహాప్రాజ్ఞుడు ఆ పూజ్యుడు విభీషణుడు సుగ్రీవుణ్ణీ వానరవీరులనూ చూచి పెద్దగొంతుతో "ఓ వానరవీరులారా, రాక్షసరాజు రావణాసురుడు అనేవాడు ఒకడు ఉన్నాడు. వాడు దురాచారుడు. నేను వాడి తమ్ముణ్ణి. నా పేరు విభీషణుడు. వాడు ఆ రావణాసురుడు జటాయువును చంపివేసి జనస్థానమునుంచి సీతాదేవిని దొంగతనముగా లేవనెత్తుకొని వచ్చినాడు. ఆ దీనురాలిని ఆ వివశను సీతాదేవిని రాక్షసాంగనల కాపలాలో ఉంచినాడు. ఆమెను నిర్బంధపెట్టినాడు. రావణాసురుడితో సీతాదేవిని రాముడికి ఇచ్చివేయవలసింది అని నేను ఎన్నో

హేతువులతో అనేకవిధాల చెప్పినాను. నానావిధాలా బ్రతిమలాడినాను. వాడికి కాలము ముగించుకొని వస్తూఉంది. చావపోయేవాడికి మందులు ఇమడనట్టు నేను ఎన్నివిధాల చెప్పినా వాడికి నా మాటలు నచ్చలేదు. నా హితవాక్యాలను వినకపోవడమే కాకుండా నన్ను నానా మాటలూ అన్నాడు తన బానిసనువలె నన్ను అవమానించినాడు. అందువల్ల నేను నా భార్యాపుత్రులను వదిలిపెట్టి రాముణ్ణి శరణము వేడడానికి వచ్చినాను. ఆ మహాత్ముడికి ఆ సర్వలోకశరణ్యుడికి ఆ రఘువంశలలాముడికి రాముడికి నేను విభీషణుణ్ణి శరణము వేడడానికి వచ్చినాను అని మీరు వెంటనే చెప్పకోరుతున్నాను'' అని చెప్పినాడు.

ఈ మాటలు సుగ్రీవుడు విన్నాడు. వెంటనే రామలక్ష్మణుల దగ్గరకు పోయి "రామప్రభూ, రావణాసురుడి తమ్ముడు విభీషణుడు అనే వాడు మరి నల్గురు రాక్షసులతో వచ్చినాడు. వాడు నీ శరణము అడుగుతున్నాడు. ఓ పరంతపా, నీవు ఇప్పుడు సావధానచిత్తముతో ఆలోచించవలెను. కార్యాకార్యవిచారము లోనూ సేనలను వ్యూహము పన్నడములోనూ రాజనీతిప్రకారము సామాద్యుపాయాలు ప్రయోగించడములోనూ గూఢచారులను నియమించడములోనూ నీవు జాగరూకుడవు. శత్రువులవల్ల నీ వాండ్లు అయిన వానరులకు కీడు మూడకుండా మేలు అయ్యేట్టు ఆలోచించి ప్రవర్తించవలెను. నీకు శుభము అవుతుంది. ఈ రాక్షసులు కంటికి కనపడకుండా తిరుగుతూ ఉంటారు. వీండ్లు ఇచ్ఛాధీనరూపులు. ఎవరికీ తెలియకుండా అనిష్టాలు చేస్తారు. మహామాయావులు. వీండ్లను ఎప్పుడూ ఎంతమాత్రమూ నమ్మకూడదు. ఇప్పుడు ఇక్కడికి వచ్చిన ఈ విభీషణుడు రావణాసురుడి గూఢచారుడు అయిఉంటాడు. వీడు మనలో చేరి మనతో కలసి మెలసి ఉండి మనలో మనకు తగాదాలు పెట్టడానికి వచ్చి ఉంటాడు. సందేహము లేదు. అట్లా కాకపోయేట్లయితే మనలో కలిసి మెలిసి ఉంటూ మనలోపాలను అన్నిటినీ తెలుసుకొని ఎప్పుడో ఒకప్పుడు మనలను తానే దెబ్బతీయడానికి వచ్చి ఉంటాడు.

"ఓ రామప్రభూ, మిత్రులు పంపించిన సైనికులనూ అడవులలోనుంచి వచ్చిన సైనికులనూ జీతానికి వచ్చే సైనికులనూ మనము చేర్చుకోవచ్చును. కాని శత్రుపక్షములోనుంచి వచ్చిన వాణ్ణి మాత్రము మనము దరి చేరనీయకూడదు. ప్రభూ, వీడు నీ శత్రువు అయిన రాక్షసరాజు రావణాసురుడి తమ్ముడు. శత్రుపక్షమునుంచి వచ్చినాడు. వీణ్ణి నమ్మడము ఎట్లాగు. వీణ్ణి ఎంతమాత్రమూ నమ్మకూడదు. ఓ రామా, నీవు క్షమావంతులలో శ్రేష్ఠుడవు. అందువల్ల చెప్పుతున్నాను. వీడు ఈ విభీషణుడు రావణాసురుడి వేగులవాడు. వీణ్ణి నిగ్రహించవలెను అని నేను అనుకొంటున్నాను.

" ఓ రామా, రావణాసురుడు కపటబుద్ధితో వీణ్ణి పంపించి ఉంటాడు. వీడు శరణాగతుణ్ణి అనే మాయవేషము వేసుకొని వచ్చినాడు. నిన్ను నమ్మిస్తాడు. ఆ తరువాత దెబ్బతీస్తాడు. ప్రాజ్ఞుడు అయిన శత్రువు తన సంగతి ఎవరికీ తెలియనీయకుండా శత్రుసైన్యంలోచేరి వారి లోటుపాట్లు తెలుసుకొని గుడ్లగూడ కాకులనువలె చంపివేస్తాడు. వీడు క్రూరుడు అయిన రావణాసురుడి తమ్ముడు. అందువల్ల వీణ్ణి వీడి మంత్రులనూ తీవ్రముగా దండించి చంపివేయడము కర్తవ్యము" అని చెప్పినాడు.

ఇట్లా ఆ వాక్యజ్ఞుడు వానరవాహినీపతి సుగ్రీవుడు కోపాటోపముతో రాముడికి చెప్పి మెదలకుండా ఊరకున్నాడు. సమయోచితముగా మాట్లాడే ఆ మహాయశుడు రాముడు అప్పుడు దగ్గర ఉన్న హనుమంతుడు మొదలు అయిన వానరవీరులను అందరినీ చూచి "ఓ వానరవీరులారా, ఇప్పుడు సుగ్రీవుడు రావణాసురుడి తమ్ముణ్ణి విభీషణుణ్ణిగురించి సహేతుకముగానూ సప్రయోజనముగానూ చెప్పింది అంతా మీరు అందరూ విన్నారు. కార్య సంకట సమయములో బుద్ధిమంతుడూ సత్పురుషుడూ సమర్థుడూ శ్రేయస్కాముడూ అయిన ఒక్క మిత్రుడు చెప్పినాడు అని తక్కిన మిత్రులు ఊరకుండరాదు. మిత్రులు అయినవారు అందరూ ఎవరికితోచిన అభిప్రాయాన్ని వారు చెప్పవలెను. మీరు అందరూ ఇప్పుడు ఈ విషయములో మీ మీ అభిప్రాయాలను చెప్పవలెను" అని అడిగినాడు.

ఆ హితచికీర్షువులు అందరూ గౌరవపూర్వకముగా వెంటనే "ఓ ప్రభూ, ముల్లోకాలలోనూ నీకు తెలియంది ఏమీ లేదు. నీకు సమస్తవిషయాలూ తెలిసినప్పటికిన్నీ మేము నీ స్నేహితులము అయినందువల్ల మమ్ములను గౌరవించడానికి నీవు అడుగుతున్నావు. నీవు సత్యవ్రతుడవు. ధార్మికుడవు. పరమపరాక్రమశాలివి. ఏపనిని అయినా చక్కగా ఆలోచించకుండా నీవు చేయవు. నీవు మరుపులేని వాడవు. నీవు సర్వజ్ఞుడవు అయినప్పటికిన్నీ మిత్రాధీనుడను అని తెలియచెప్పడానికి మమ్ములను అడుగుతున్నావు. నీ సచివులు బుద్ధిసంపన్నులు. సమర్థులు. ఒక్కొక్కరే తమ తమ అభిప్రాయాలను సహేతుకముగా చెప్పవలెను" అన్నారు.

ఇట్లా వానరవృద్ధులు రాముడితో చెప్పగానే మతిమంతుడు అంగదుడు లేచి "ప్రభూ, ఈ విభీషణుడు శత్రువు దగ్గరనుంచి వచ్చినాడు. అందువల్ల వీణ్ణి మనము అన్నివిధాలా సందేహించవలసిందే. వీణ్ణి ఎంతమాత్రమూ నమ్మకూడదు. కపటచిత్తులు తమ మనస్సులో అభిప్రాయాలను ఏమాత్రమూ పయికి తెలియనీయకుండా కలసి మెలసి ఉంటూ సమయము దొరకగానే దెబ్బతీస్తారు. అది గొప్ప అపాయము అవుతుంది. ఏ విషయములోనయినా గుణదోషములను ఆలోచించి గుణాలు ఎక్కువగాఉంటే తీసుకోడమూ దోషాలు ఎక్కువగాఉంటే వదిలిపెట్టడమూ చేయవలెను. అదే విధముగా ఈ విభీషణుడిలో సద్గుణాలు ఎక్కువగా ఉండి దుర్గుణాలు తక్కువగా ఉండేట్లయితే మనతో ఉంచుకోవచ్చును. దోషిఅయ్యేట్లయితే వదిలివేద్దాము. అందువల్ల వీణ్ణి మనలో చేర్చుకొని పరీక్షించవలెను" అని చెప్పినాడు.

అంతట శరభుడు ఆలోచించి విభీషణుణ్ణి తమలో చేర్చుకొని పరీక్షించేట్లయితే అపకారము జరుగవచ్చును అనుకొని అంతకన్నా సులభోపాయముగా "ప్రభూ, ఈ విభీషణుడిదగ్గరకు వెంటనే ఒక గూఢచారుణ్ణి పంపించవలెను. వాడు సూక్ష్మబుద్ధితో పరీక్షించి వీడి గుణదోషాలు తెలుసుకొన్నతరువాత వీణ్ణి మనలో చేర్చుకోడమో చేర్చుకోకపోవడమో చేయవలెను" అని చెప్పినాడు.

అంతట జాంబవంతుడు లేచినాడు. అతడు వృద్ధుడు. విచక్షణాజ్ఞానము కలవాడు. ఏది అయినా నీతిశాస్త్రము ప్రకారము

ఆలోచిస్తాడు. జాంబవంతుడు "ఓ రామా, రావణాసురుడు బద్ధవైర ముతో మనలను జయించవలెను అనుకొన్నాడు. పయిగా వాడు పాపాత్ముడు. వాణ్ణి వదిలిపెట్టి ఈ విభీషణుడు ఇక్కడికి వచ్చినాడు. వీడు ఇక్కడికి రావడానికి తగిన కారణము చెప్పలేదు. తన అన్న రావణాసురుడు తనను తిట్టినాడు అనీ అందువల్ల వాణ్ణి వదిలిపెట్టి వచ్చినాను అనీ చెప్పినాడు. వీడు రావడానికి అది అంత గొప్ప కారణముగా తోచడములేదు. వీడు ఇదివరకు ఎన్నడూ నీ ముఖము చూచి ఎరగడు. అందువల్ల వీడు వెతుకుకొంటూ ఇంతదూరము నీకోసము రావడము నమ్మడానికి వీలులేకుండా ఉంది. తన మాట వినని అంత మాత్రాన అందులో ఆపత్కాలములో ఉన్న అన్నను వదిలిపెట్టి శత్రువుదగ్గరకు రావడము అంతకన్నా నమ్మడానికి వీలు లేకుండా ఉంది. అందువల్ల వీడు రాకూడని సమయములో రాకూడని దేశానికి వచ్చినాడు. వీణ్ణి నమ్మడానికి వీలులేకుండా ఉంది. కాబట్టి వీణ్ణి మనలో చేర్చుకోవద్దు" అని యుక్తియుక్త ముగా నిరపాయముగా ఉండడానికి చెప్పినాడు.

ఏపని నీతియుక్తమో ఏపని నీతియుక్తముకాదో తెలిసిన మైందుడు ఆలోచించి సమయోచితముగా "ఓ రామప్రభూ, విభీషణుడిదగ్గరకు గూఢచారుడుపోయి ముచ్చటలాడుతూ మాటల ధోరణిలో రావణాసురుడినిగురించి వీడి అభిప్రాయాన్ని కనిపెట్ట వలెను. మాటలలో వీడి విషయము అంతా తెలిసిపోతుంది. వీడు దుష్టుడు అని తోస్తే దండించడమూ యోగ్యుడు అని తోస్తే మనలో చేర్చుకోడమూ అప్పుడు చేయవచ్చును" అని చెప్పినాడు.

అంతట మంత్రులలో ఉత్తముడూ సకలశాస్త్రజన్యజ్ఞాన సంపన్నుడూ అయిన హనుమంతుడు లేచి "ఓ ప్రభూ, నీవు మతి మతిమంతులలో శ్రేష్ఠుడవు. ఆ యా కార్యనిర్ణయములో సమర్థు డవు. నీవు నిర్ణయించిన పనులనుగురించి వచ్చచెప్పడములో నీఅంత నేర్పరి మరి ఒకడు లేడు. నిన్ను అతిశయించి మాట్లాడే శక్తి ఆ బృహస్పతికి అయినా లేదు. నేను నీకు ఉపదేశించగల వాణ్ణి కాను. అయినప్పటికిన్నీ నాకు తోచింది చెప్పుతున్నాను. ఇది నా తర్కకౌశలము తెలియడముకోసము చెప్పడములేదు.

తక్కిన మంత్రులు చెప్పింది తప్పు అని ఋజువు చేయడానికోసము చెప్పడములేదు. నా అంత ఆలోచనాపరుడు ఎవరూ లేడు అని తెలియచెప్పుకోడానికి చెప్పడములేదు. వీడు ఈ విభీషణుడు లంకాపట్టణములో నాకు అనుకూలముగా మాట్లాడినాడు అనే పక్షపాతమువల్లనూ చెప్పడములేదు. ఓ రామప్రభూ, నీమీద నాకు ఉన్న గౌరవమునుంచి నాకు యథార్థము అని తోచింది చెప్పుతున్నాను.

"ప్రభూ, మంత్రులలో ఒకరు విభీషణుని గుణదోషాలను చక్కగా పరీక్షించినతరువాత మనలో చేర్చుకోడమో చేర్చుకోకపోవడమో చేయవలెను అని చెప్పినాడు. ఇందులో ఒక తప్పు కనపడుతున్నది. ఏది అయినా గొప్ప రాజ్యకార్యము నిర్వహిస్తేనే తప్ప ఒకడి గుణదోషాలు తెలియవు. గుణదోషాలు తెలిసిఉంటేనే తప్ప ఒకడిని గొప్ప రాజ్యకార్యము నిర్వహించడానికి నియోగించము. అందువల్ల గుణదోషాలు పరీక్ష చేసి చేర్చుకోడము అనే పద్ధతికి అన్యోన్యాశ్రయదోషము పట్టింది.

"ఒక మంత్రి ఆ వచ్చినవాడివగ్గరకు గూఢచారుణ్ణి పంపించి వాడి గుణదోషాలను తెలుసుకోవలెను అని చెప్పినాడు. అదిన్నీ సమంజసముగా లేదు. ఎక్కడనో దూరదేశములో ఉన్నవాణ్ణి గురించి తెలుసుకోడానికి గూఢచారుణ్ణి పంపిస్తే వాడు అక్కడికి పోయి సమస్తమూ విచారించి తెలుసుకొని రాకలుగుతాడు. కాని ఎట్టఎదట కనపడుతున్నవాడిదగ్గరకు పోయి ఏమి కనుక్కోకలుగుతాడు.

"ఒక మంత్రిసత్తముడు ఈ విభీషణుడు అకాలములో అనుచిత ప్రదేశానికి వచ్చినాడు అని చెప్పినాడు. ఇదిన్నీ సమంజసముగా లేదు. ఓ ప్రభూ, వీడు ఈ విభీషణుడు తన అన్న పురుషాధముడు అనీ నీవు పురుషోత్తముడవు అనీ మనసా విమర్శించి తెలుసుకొని ఉంటాడు. రావణుడు సీతాదేవిని అపహరించడమూ తాను మంచి చెప్పినా వినకపోవడమూ మొదలు అయినవి స్వయముగా ఎరుగును. నీవు ఖరదూషణాదులను వధించడమూ వాలిని సంహారము చేసి సుగ్రీవుడికి పట్టము కట్టడమూ మొదలు అయిన

Vignana
Ac. No.........................

నీ పరాక్రమాదులను తెలుసుకొని ఉంటాడు. అంతేకాదు. దాట నలవికాని మహాసముద్రాన్ని దాటిపోయి లంకాపట్టణాన్ని ముట్ట డించడానికోసము నీవు ఇక్కడికి ఇప్పుడు రావడమున్నూ తెలుసు కొని అందువల్ల నిన్ను చేరడానికి ఇప్పుడు ఇక్కడికి వచ్చినాడు. ఈ విభీషణుడు రావడానికి ఇదే సమయమూ—ఇదే సముచిత ప్రదేశము కూడామా.

"ఒక మంత్రి విభీషణుడిదగ్గరకు గూఢచారుడు పోయి ఆయా ప్రశ్నలు వేసి మాటలధోరణిలో అతడి గుణదోషాలను తెలుసు కోవలెను అని చెప్పినాడు. అది పొసగదు. ఈ విభీషణుడు బుద్ధి మంతుడు. కాబట్టి పూర్వపరిచయము లేనివాడు ఒకడు ఏది అయినా ప్రశ్నించినప్పుడు ఏమి బదులు చెప్పితే ఏమి అవుతుందోను అనే సందేహముతో బదులే చెప్పకపోవచ్చును. లేదా అర్థము కాకుండా ఉండే జవాబు చెప్పవచ్చును. సరిఅయిన సమాధానము చెప్పలేదు కనుక దోషి అని ప్రశ్నలు అడిగినవాడు అనుకోవచ్చును. అడిగినవారికి అందరికీ తమ విషయము తేటతెల్లముగా చెప్పవలెను అనే నియమము ఎవరికీ ఉండదు. ఇంతకూ మనము అంతా శత్రువు లలో భేదము కలగచేసి వారిలో కొంతమందిని చీలతీసి మనలో కలుపుకోవలసిన ప్రయత్నము చేయవలసి ఉండగా వాండ్లలో వాండ్లు పోట్లాడుకొని వాడిఅంతట వాడు వస్తే వాణ్ణి ఏవేవో ప్రశ్నలు వేయడము తెలివితక్కువ. అందువల్ల మిత్రలాభము చెడిపోతుంది. ఇది నీతిశాస్త్రసమ్మతము కాదు.

"ఓ ప్రభూ, ఈ లోకములో మనసు యిచ్చి మాట్లాడితేనే ఎదటివారున్నూ మనసు యిచ్చి మాట్లాడుతారు. కపటముగా మాట్లాడితే ఎదటివారున్నూ కపటముగానే మాట్లాడుతారు. తమకు ఉన్న తెలివితేటలు ఎదటివారికి ఉండవు అనుకోడము బుద్ధితక్కువ. కుత్ర ప్రశ్నలకు బుద్ధిమంతులు కుత్రసమాధానాలే చెప్పతారు. అందువల్ల ఈ ప్రయత్నము నిరర్థకము. ప్రభూ, ఇంగితమూ ఆకారమూ చేష్టలూ భాషా అనే నాల్గింటినిపట్టి ఎదటివారి మనశ్శుద్ధిని తెలుసుకొంటూ ఉంటాము. ఈ విభీషణుడు మాట్లాడి నప్పుడు దుష్టభావము ఏమీ తోచలేదు. అందువల్ల వీడు దుష్టుడు కాడు అని ఇంగితమువల్ల తెలుస్తున్నది. వీడి ముఖములో ఏ వికా

రమూ లేకుండా ప్రసన్నముగా కనిపించినాడు. అందువల్ల వీడి ఆకారము శుద్ధముగా ఉంది. మోసగాడు ఏ జంకూ గొంకూ లేకుండా ఇంత దూరము నిర్భయముగా వచ్చి ఇంత నిబ్బరముగా మాట్లాడలేడు. అందువల్ల వీడి చేష్టలలో లోపము కనిపించలేదు. వీడు అన్న వాక్యాలలో తొందరపాటుకానీ సందిగ్ధాలుకానీ లేవు. అందువల్ల వీడి భాషాశుద్ధిలో లోపము ఏమీ కనిపించలేదు.

"ప్రభూ, మోసము చేయడానికి వచ్చినవాడు తన మనోగతాభిప్రాయాన్ని ఎంత దాచిపెట్టినా దాగదు. అది ఎట్లాగో ఎప్పటికి అప్పుడు బయటపడుతూనే ఉంటుంది. ఓ రామప్రభూ, నీవు కార్యవిదులలో శ్రేష్ఠుడవు. నీకు నేను చెప్పవలసిన పనిలేదు. దేశకాలాలనుపట్టి చేసేపని త్వరగా సఫలము అవుతుంది.

"ఓ ప్రభూ, వీడు ఈ విభీషణుడు నీ నిరుపమానపరాక్రమాన్ని గురించీ నీ ధార్మికతనుగురించీ తెలుసుకొన్నాడు. తన అన్న రావణుడు చేసే మాయవ్యాపారాలను అన్నిటినీ స్వయముగా చూచినాడు. నీవు వాలిని చంపివేసి సుగ్రీవుణ్ణి వానరరాజును చేయడము విన్నాడు. ఇప్పుడు తనకు లంకారాజ్యము ఇప్పించమని ప్రార్థించడానికి వచ్చినాడు. వీడు నీ శరణాగతుడు. వీణ్ణి నీవు దగ్గరకు తీయవలెను.

"ప్రభూ, నాకు తెలిసినంతవరకూ ఈ విభీషణుడు నిర్దోషి. నా బుద్ధికి గోచరించింది అంతా చెప్పినాను. ఇక మిగతా పని చేయవలసిన వాడవు నీవు" అని మనోహరముగానూ మధురముగానూ అర్థవంతముగానూ చెప్పినాడు.

౧౮

సర్వమూ తెలిసిన ఆ దుర్ధర్షుడు రాముడు హనుమంతుడు చెప్పింది అంతా విన్నాడు. సంతుష్టుడు అయినాడు. అంతట తన మనస్సులో ఉంది చెప్ప తలచుకొని "ఓ వానరులారా, నేను కూడా ఈ విభీషణుణ్ణిగురించి నాకు తోచింది చెప్పతాను. మీరు అందరూ నా శ్రేయస్సు కోరేవారు. కనుక వినవలసింది. విభీషణుడిలో దోషము ఉన్నప్పటికిన్నీ ఇక్కడికి మనదగ్గిరకు మిత్రభావముతో వచ్చినాడు. మిత్రభావముతో వచ్చినాడు కనుక

ఏమి అయినప్పటికిన్నీ వీణ్ణి నేను కాదు అనను. దగ్గరకు తీస్తాను. మైత్రి చేయడానికి వచ్చినవాణ్ణి దగ్గర చేర్చుకోడము పెద్దలు అంగీకరించిన ధర్మము'' అన్నాడు.

రాముడు చెప్పిన ఈ మాటలు విని సుగ్రీవుడు ఆలోచించి "రామా, ఈ రాక్షసుడు దుష్టుడు అయితే నేమి—కాకపోతే నేమి; అది అట్లా ఉండనివ్వు. ఆపత్కాలములో తన అన్నను వదిలిపెట్టి వచ్చిన వీణ్ణి ఎటువంటివాడు అని అందాము. ఆ అన్న ఎటువంటి వాడు అయినా కావచ్చును. తమ్ముడు అయినవాడు అటువంటి సమయములో ఆ అన్నను వదిలిపెట్టి రాకూడదు'' అన్నాడు.

వానరాధిపతి సుగ్రీవుడు అన్నమాటలు సాకల్యముగా ఆ సత్యపరాక్రముడు రాముడువిని వానరులు అందరివంకనూ చూచి పుణ్యలక్షణుడు అయిన లక్ష్మణుణ్ణి చూచి మందహాసము చేస్తూ "ఓవానరులారా, శాస్త్రాధ్యయనముచేసి పెద్దలను సేవించేవాడు చెప్పేమాటలు వానరాధిపతి సుగ్రీవుడు చెప్పినాడు. అయితే ఈ విషయములో ప్రత్యక్షమూ లౌకికమూ అయిన ధర్మసూక్ష్మము ఒకటి ఉంది. ఇరుగు పొరుగున ఉండే రాజులూ జ్ఞాతులూ రాజుకు కష్టకాలము వచ్చినప్పుడు దెబ్బతీస్తూ ఉంటారు. అందువల్లనే ఇరుగు పొరుగు రాజులనూ జ్ఞాతులనూ బుద్ధిమంతులు అయిన రాజులు తమ శత్రువులుగా పరిగణిస్తూ ఉంటారు. ఇప్పుడు విభీషణుడు తన జ్ఞాతి అయిన రావణాసురుణ్ణి దెబ్బతీయడానికి మన దగ్గరకు ఇక్కడికి వచ్చినాడు. యోగ్యులు అయిన రాజులు తమకు మేలుచేసే జ్ఞాతులను గౌరవిస్తూ ఉంటారు. అట్లా అయినప్పటికిన్నీ సమర్థులు అయిన జ్ఞాతులను నమ్మరాదు. ఈ విభీషణుణ్ణి రావణాసురుడు శంకించి ఉంటాడు. వాడికీ వీడికీ విరోధము వచ్చి ఉంటుంది. అందువల్ల వీడు ఇక్కడికి వచ్చినాడు.

"ఓ సుగ్రీవుడా, శత్రుబలాన్ని స్వీకరించే విషయములో నీవు చెప్పిన దోషాన్ని యథాశాస్త్రముగా చెప్పుతాను విను. మనము రాక్షసవంశీయులము కాము. వారి దాయాదులము కాము. మనకు రాక్షసరాజ్యములో నిమిత్తము లేదు. అందువల్ల విభీషణుడు మనలను ద్వేషించడు. ఈ రాక్షసుడు రాజ్యకాంక్షతో వచ్చినాడు.

వీడు మనలను వదిలిపెట్టడు. రాక్షసులు వైరివాండ్లు కారు. వాండ్లలో పండితులు ఉన్నారు. విభీషణుడు అటువంటివాడు. అందువల్ల అతనిని మనము చేర్చుకోవలెను. జ్ఞాతులు పరస్పర కలహాలు లేకుండా సంతుష్టులుగా కలిసిమెలిసి ఉండరు. ఎప్పుడూ విరోధముతో ఉంటూ ఉంటారు. ఈ విభీషణుడికి ఆ రావణుడితో విరోధము వచ్చిఉంటుంది. అందువల్లనే ఈతడు మనదగ్గరకు వచ్చినాడు.

"నాయనా, సుగ్రీవుడా, తోబుట్టువులు అందరూ భరతుడి మాదిరిగా ఉండరు. తండ్రికి నావంటి కొడుకులున్నూ పుట్టరు. నీ వంటి స్నేహితులు ప్రతివారికి దొరకరు. అందరూ మన మాదిరిగా ఉంటారు అనుకోవద్దు" అని చెప్పినాడు.

రాముడు ఇట్లా చెప్పగానే ఆ మహాప్రాజ్ఞుడు లేచి నమస్కారముచేసి "ఓరామా, నీవు క్షమావంతులలో శ్రేష్ఠుడవు. ఈ విభీషణుణ్ణి ఆ రావణాసురుడే రహస్యముగా చెప్పి పంపించిఉంటాడు. వీణ్ణి నిగ్రహించడము మంచిది అని నేను అనుకొంటున్నాను. ఓ రామా, నీవు పుణ్యాత్ముడవు. నీకు తెలియదు. రావణాసురుడు కుటిలోపాయముతో మనలను దెబ్బతీయడానికి ఈ విభీషణుణ్ణి పంపించినాడు. వీణ్ణి మనము నమ్మేటట్టుగా వీడు ప్రవర్తిస్తాడు. ఏమరుపాటుతో ఉన్నప్పుడు వీడు మనలను దెబ్బతీస్తాడు. మనలను అందరినీ ప్రచ్ఛన్నముగా చంపివేయడానికి వీడు ఇక్కడికి వచ్చినాడు. ఆ రావణాసురుడు పరమక్రూరుడు అని అందరికీ తెలిసిన విషయమే. వీడు వాడి తమ్ముడు. వీణ్ణి వీడి మంత్రులతోకూడా చంపివేయవలెను" అని చెప్పినాడు.

ఇట్లా ఆ వానరరాజు రాముడితో చెప్పి ఊరకున్నాడు. రాముడు ఆలోచించినాడు. సుగ్రీవుడితో శుభకరముగా "ఓ మిత్రుడా, ఈ విభీషణుడు క్రూరుడు అయితే నాకు ఏమిటి—కాక పోతే నాకు ఏమిటి. వీడు నాకు ఏవిధము అయిన కీడూ చేయలేడు. ఈ భూమిమీద ఉన్న రాక్షసులనూ పిశాచులనూ దానవులనూ నేను తలచుకొంటే నా గోటికొనతో చంపివేయగలను. వీడు ఈ విభీషణుడు నన్ను ఏమి చేస్తాడు.

"ఓ సుగ్రీవుడా, ఒక పావురాయిని దాని శత్రువు వచ్చి శరణము అడిగినాడు. ఆ శత్రువు సామాన్యుడు కాడు. ఆ పావురాయి భార్యను చంపివేసిన బోయవాడు. శరణాగతుడు అయినందువల్ల ఆ పావురాయి ఆ బోయవాణ్ణి గౌరవించింది. వాడి భోజనానికి తన దేహములో మాంసాన్ని సమర్పించింది. ఇది అందరికీ తెలిసిన కథే. ఇక నావంటివాడు శరణాగతుణ్ణి కాపాడవలెను అని వేరే చెప్పవలెనా. కణ్వమహర్షి పుత్రుడు కండువు అనే అతడు సత్యవాది. పరమర్షి. అతడు పూర్వము పరమధర్మబోధకము అయిన గాథను చెప్పినాడు. అది చెప్పతాను విను.

"ఓ పరంతపా, చేతులు జోడించి భయములో శరణము వేడుతున్నవాణ్ణి శత్రువు అయినప్పటికిన్నీ తనలో క్రౌర్యము లేదు అని తెలియచేయడానికోసము చంపివేయకూడదు. ఆర్తుడు అయినా గర్వి అయినా శత్రుపక్షములోనుంచి వచ్చినా శరణము అడిగినవాణ్ణి ఆత్మవేత్త తన ప్రాణాన్ని వదలుకొని అయినా కాపాడవలెను. అట్లా శరణాగతుడు అయిన శత్రువును భయమువల్లకానీ మోహమువల్లకానీ కాపాడక పోయేటట్లయితే పాపము వస్తుంది. తన శక్తికొద్దీ కాపాడకపోవడము లోకనిందిత కార్యము. కాపాడనందువల్ల శరణాగతుడు నాశనము అయిపోయేట్లయితే శరణాగతుడి పాపాలు కాపాడనివాణ్ణి చుట్టుకొంటవి. కాపాడనివాడి పుణ్యాన్ని అంతాతీసుకొని శరణాగతుడు ఉత్తమలోకానికి పోతాడు. శరణాగతుణ్ణి కాపాడకపోయేట్లయితే ఇంత మహాపాపము వస్తుంది. అందువల్ల స్వర్గాది పుణ్యలోకాలు నశించిపోతవి. అపకీర్తి వస్తుంది. బలమూ పరాక్రమమూ నష్టము అయిపోతవి. ఇది యథార్థము. ఇట్లా కండుమహర్షి చెప్పినాడు. నేను ఆ మహర్షి చెప్పినట్లు చేయ నిశ్చయించుకొన్నాను. ఇది ధర్మము. ఇందువల్ల నాకు కీర్తివస్తుంది. అభ్యుదయము అవుతుంది. నాకు పుణ్యలోకాలు సంప్రాప్తము అవుతవి.

"ఓ సుగ్రీవుడా, నేను నీవాణ్ణి నీ శరణాగతుణ్ణి అని ఒక్క మారు నన్ను యాచించే ఎవడినిఅయినా నేను కాపాడుతాను. సమస్త భూతకోటినుంచి భయము లేకుండా శరణాగతుణ్ణి

కాపాడడమే నా వ్రతము. ఈ వచ్చినవాడు విభీషణుడుకానీ స్వయముగా రావణాసురుడేకానీ నీవు తీసుకొనిరా. నేను వీడికి అభయము ఇచ్చినాను" అని చెప్పినాడు.

రాముడు అన్న ఈ మాటలను రాముడివలెనే ప్రేమాతిశయముతో "ఓ ప్రభూ, నీవు ధర్మజ్ఞుడవు. లోకనాథులకు సుఖాన్ని ఇచ్చేవాడవు. సువ్రతుడవు. సత్పథగామివి. నీవు ఇటువంటి పూజ్యము అయిన మాట చెప్పడములో ఆశ్చర్యము ఏమీ లేదు.

"ఆ విభీషణుడు పరిశుద్ధుడు అని నా అంతరాత్మకుకూడా తోస్తున్నది. నా అనుమానాలను నివారించుకోవడముకోసము నిన్ను ఇన్ని విధాల పరీక్ష చేసినాను. రామా, విభీషణుణ్ణి ఇప్పుడే తీసుకొని వస్తాను. ఆ మహాప్రాజ్ఞుడున్నూ మాలో ఒకడు అవుతాడు. నీకు స్నేహితుడున్నూ అవుతాడు" అని సుగ్రీవుడు చెప్పినాడు.

౧౯

రాముడు అభయము ఇవ్వగానే విభీషణుడు సంతుష్టుడు అయినాడు. అంతట ఆ మహాప్రాజ్ఞుడు స్వామిభక్తిపరాయణులు అయిన తన నల్గురు మంత్రులతోనూ వినయవిధేయతలతో నేలవంక చూస్తూ ఆకాశమునుంచి కిందికి దిగినాడు. ఆ ధార్మికుడు విభీషణుడు తన రక్షకుణ్ణి రాముణ్ణి వెతుక్కొంటూవచ్చి నల్గురు మంత్రులతో కూడా సాష్టాంగనమస్కారము చేసినాడు.

అప్పుడు విభీషణుడు సుగ్రీవాదులతో చెప్పినట్టుకాకుండా ధర్మయుక్తముగానూ మహాయోగ్యముగానూ "ప్రభూ, నేను రావణుడి తమ్ముణ్ణను. నన్ను వాడు అవమానించినాడు. నేను సర్వభూతశరణ్యుడవు అయిన నీ శరణము వేడడానికి వచ్చినాను. ఇప్పుడు నీ శరణు చొచ్చినాను. నేను లంకాపట్టణాన్ని నా మిత్రులనూ నా ధనాన్ని వదిలిపెట్టి నీ దగ్గరకు వచ్చినాను. ఇక నా రాజ్యము నా ప్రాణము నా సమస్తసౌఖ్యాలూ నీ అధీనము" అని చెప్పినాడు.

ఈ మాటలు విని రాముడు మంచి మాటలతో విభీషణుణ్ణి ఊరడించి ప్రసన్నదృష్టితో "ఓ విభీషణుడా, రాక్షసుల బలాబలాలనుగురించి యథార్థము చెప్పు" అని అడిగినాడు.

ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసివేసే రాముడితో "ఓ రామప్రభూ, రావణాసురుడు గంధర్వాసురరాక్షసులచేత కానీ సమస్తభూతాలచేత కానీ చావకుండా ఉండే వరము బ్రహ్మదేవుణ్ణి మెప్పించి సంపాదించినాడు. అందువల్ల వాడు ఎవడిచేతిలోనూ చావని వీరుడు అయినాడు. వాడి తరువాతవాడు నాకన్నా పెద్ద వాడు కుంభకర్ణుడు ఉన్నాడు. వాడు మహాపరాక్రమవంతుడు. అమిత తేజోవంతుడు. యుద్ధములో దేవేంద్రుడితో సరిసమానము అయిన బలవంతుడు.

రావణుడి సేనాధిపతి ప్రహస్తుడు కైలాసపర్వతముమీద కుబేరుడి సేనానాయకుణ్ణి మాణిభద్రుణ్ణి జయించినాడు. ఆ ప్రహస్తుణ్ణి గురించి మీరు వినేఉంటారు. రావణుడి కొడుకు ఇంద్రజిత్తు గోధాంగుళీత్రాణము ధరించి అభేద్యము అయిన కవచము తొడుగు కొని పెద్ద ధనుస్సుతో యుద్ధరంగములోకి వస్తాడు. ఇరుపార్శ్వాలా వ్యూహాలు ఏర్పడగానే వాడు అగ్నిహోత్రుణ్ణి తృప్తిపరుస్తాడు. ఆ ప్రభావముతో వాడు కంటికి కనపడకుండా మాయము అయి పోయి శత్రువులను చంపివేస్తాడు.

"మహోదరుడూ మహాపార్శ్వుడూ అకంపనుడూ అనే ముగ్గురూ రావణుడి సైన్యములో మహావీరులు. వాండ్లు యుద్ధ ములో దిక్పాలకులతో సరిసమానముగా పోరాడే శక్తిమంతులు. మాంసశోణితాహారులూ కామరూపులూ అయిన రాక్షసయోధులు పదివేలకోట్లమంది లంకాపట్టణములో ఉన్నారు. వాండ్లను అందరినీ వెంటపెట్టుకొని రావణాసురుడు దేవతలతో యుద్ధము చేసినాడు. జయించినాడు" అని చెప్పినాడు.

విభీషణుడు చెప్పిన ఈ మాటలు ఆ దృఢపరాక్రమవంతుడు రాముడు విన్నాడు. మనసా ఆలోచించి "ఓ విభీషణుడా, రావణా సురుడి ఇదివరకటి శౌర్యకృత్యాలనుగురించే చెప్పినావు. వాటిని అన్నిటినీ నేనూ విన్నాను. నేను ఆ దశగ్రీవుణ్ణి సబాంధవముగా ప్రహస్తుడితోకూడా చంపివేసి 'నిన్ను లంకాపట్టణానికి రాజును చేస్తాను. సత్యముగా చెప్పుతున్నాను. రావణుడు రసాతలానికి పోయినా పాతాళలోకానికి పోయినా బ్రహ్మలోకానికి పోయినా

వాణ్ణి ప్రాణాలతో వదిలిపెట్టను. వాడి ప్రాణాలు తీయకుండా ఊరుకోను. యుద్ధములో వాణ్ణి వాడి పుత్రులనూ వాడి బంధువులనూ వాడి చతురంగబలాలనూ సంహారము చేయకుండా నేను తిరిగి అయోధ్యాపట్టణానికి పోను. నా ముగ్గురి తమ్ములమీద ఒట్టుపెట్టుకొని చెప్పుతున్నాను" అన్నాడు.

రాముడు ఈ మాటలు అనీ అనడముతోటే ఆ ధర్మాత్ముడు విభీషణుడు సాష్టాంగనమస్కారము చేసి లేచి "ఓ రామప్రభూ, లంకాపట్టణాన్ని ముట్టడించడములోనూ రాక్షసులను చంపివేయుడములోనూ రాక్షససైన్యములో చొరబడి యుద్ధము చేయడములోనూ నా శక్తికొద్దీ నీకు సాయపడుతాను" అని చెప్పుతూ ఉంటే రాముడు సంతోషాతిశయములో విభీషణుణ్ణి కౌగలించుకొని లక్ష్మణుణ్ణి చూచి "తమ్ముడా, నీవు కులగౌరవము కాపాడడములో శ్రేష్ఠుడవు. ఇప్పుడు నేను సంతోషముగా చెప్పుతున్నాను. నీవు ఇప్పుడే సముద్రజలాలను తీసుకొనిరా. ఈ మహాప్రాజ్ఞుణ్ణి ఈ విభీషణుణ్ణి రాక్షసులకు రాజుగా సముద్రజలాలతో అభిషేకించు" అని చెప్పినాడు.

అంతట లక్ష్మణుడు రాజశాసనాన్ని శిరసావహించి ఆ వానర వీరుల మధ్యను విభీషణుణ్ణి రాక్షసరాజుగా రాజ్యాభిషేకము చేసినాడు. రామానుగ్రహమువల్ల విభీషణుడు రాక్షసరాజు అయినందుకు వానరవీరులు అందరూ రాముణ్ణి ఉద్దేశించి "బాగుంది. బాగుంది" అని కేకలువేసినారు. కోలాహలధ్వనులు చేసినారు.

ఆ తరువాత సుగ్రీవుడూ హనుమంతుడూ విభీషణుణ్ణి ఏకాంతముగా చూచి "ఓ విభీషణుడా, అక్షోభ్యము అయిన ఈ మహాసముద్రాన్ని మనము అందరమూ వానరసైన్యముతో దాటి అవతలికి పోవడము ఎట్లాగో మాకు తెలియలేదు. ఆ ఉపాయము నీవే మాకు చెప్పవలెను" అని అడిగినారు.

"ఓ మిత్రులారా, మన రామప్రభువు సముద్రుణ్ణి శరణము అడగవలెను. పూర్వము సగరచక్రవర్తి తవ్వించినందువల్ల ఈ సముద్రము ఇంత అంత అని కొలతవేయుడానికి అలవి కాకుండా పోయింది. సముద్రుడు మహామతిమంతుడు. రామకార్యముకాబట్టి తప్పకుండా సాయపడుతాడు" అని విభీషణుడు చెప్పినాడు.

విభీషణుడు చెప్పింది విని సుగ్రీవుడు రామలక్ష్మణులదగ్గరకు పోయినాడు. ఆ విపులగ్రీవుడు సుగ్రీవుడు రాముడితో సముద్రాన్ని ఉపాసించవలెను అని విభీషణుడు చెప్పిన మంగళకరము అయిన మాటను రాముడికి చెప్పినాడు. స్వభావసిద్ధముగా పరమ ధార్మికుడు అయిన రాముడికి ఆ మాట నచ్చింది. ఆ మహాతేజోవంతుడు ఆ కార్యదక్షుడు రాముడు లక్ష్మణుణ్ణి సుగ్రీవుణ్ణి సమ్మానించడానికి వారిని చూచి మందహాసము చేస్తూ "లక్ష్మణా, విభీషణుడు చెప్పిన ఆలోచన నాకు నచ్చింది. సుగ్రీవుడు పండితుడు. ఆలోచించడములో నీవు సమర్థుడవు. మీరు ఇద్దరున్నూ ఆలోచించండి. మీకున్నూ నచ్చేట్లయితే చెప్పండి" అన్నాడు.

అప్పుడు ఆ వీరులు ఇద్దరూ గౌరవపూర్వకముగా "ప్రభూ, ఏమీ తోచకుండా ఉన్న ఈ సమయములో విభీషణుడు చక్కని ఉపాయము చెప్పినాడు. సురాసురులు అందరూ ఏకము అయి దేవేంద్రుడితో వచ్చినా సేతువు కట్టకుండా ఈ సముద్రాన్ని దాటి అవతలికి పోవడము అశక్యము. విభీషణుడు చెప్పినట్టు చేయవలసిందే. కాలయాపనము ఎందుకు ? మన సైన్యముతో కూడా లంకాపట్టణము చేరడానికి నీవు సముద్రుణ్ణి శరణు అడుగు" అని చెప్పినారు.

అప్పుడు రాముడు ఆ సముద్రతీరాన దర్భశయ్య ఏర్పరుచుకొని దానిమీద వేదిలో అగ్నిహోత్రుడివలె పడుకొన్నాడు.

౨౦

రావణుడి వేగులవాండ్లలో సమర్థుడు అయిన శార్దూలుడు అనే రాక్షసుడు అప్పుడు ఆ సముద్రతీరానికి వచ్చి సుగ్రీవుడి సైన్యాలను అన్నిటినీ జాగ్రత్తగా చూచినాడు. వాడు వెంటనే లంకాపట్టణానికి పోయి రావణాసురుణ్ణి చూచి "రాజా, వానరసైన్యము ఇంత అంత అని లెక్కవేయడానికి అలవి కాకుండానూ లోపలికి చొరబడి చూడడానికి వీలుకాకుండానూ మరి ఒక సముద్రము మాదిరిగా సముద్రతీరానికి వచ్చింది. రామలక్ష్మణులు ఉభయులూ ఉత్తమాయుధాలు ధరించి వానరసైన్యాలను వెంటపెట్టుకొని

సీతాదేవి ఉన్నచోటికి వస్తారు ఆ కాంతిమంతులు ఇప్పుడు సముద్రము ఉత్తరతీరాన విడిది చేసినారు. ఎటు చూచినా పది యోజనాల దూరము ఆ వానరసైన్యము భూమిమీద కనిపించింది. రాజా, యథార్థము చెప్పుతున్నాను. నీవు ఇప్పుడే దూతలను పంపించు. సామమో దానమో భేదమో వెంటనే ప్రయోగించవలెను. దండోపాయానికి తావులేదు" అని చెప్పినాడు.

ఇట్లా శార్దూలుడు చెప్పింది రావణాసురుడు విన్నాడు. వెంటనే చేయవలసిన పనిని గురించి కలవరపడకుండా ఆలోచించి నిశ్చయించినాడు. కార్యవేత్తలలో ఉత్తముడు అయిన శుకుడు అనే రాక్షసుణ్ణి చూచి "శుకుడా, నీవు ఇప్పుడేపోయి వానరరాజు సుగ్రీవుణ్ణి చూడు. నేను చెప్పే మాటలు నీవు తడపడకుండా ఇంపుగా మెత్తగా నేను చెప్పినట్టు చెప్పు.

"ఓ వానరుడా, నీవు మహారాజువు. సత్కులములో పుట్టినావు. మహాబలవంతుడవు. బ్రహ్మదేవుని పుత్రుడు అయిన ఋక్షరజుడికి నీవు పుత్రుడవుగా పుట్టినావు. కాబట్టి నీవు నాకు తోబుట్టువువంటి వాడవు. రాముడితో చేరినందువల్ల నీకు వచ్చే లాభము ఏమీ లేదు. చేరకుండా నీదారిన నీవు పోయేట్లయితే నీవు నష్టపడేది ఏమీ లేదు. ఓ సుగ్రీవుడా, నేను రాముడి భార్యను లేవనెత్తుకొని వస్తే నీకు ఏమి సంబంధము. నీవు బుద్ధిమంతుడవు. కాబట్టి ఆలోచించు. నీవు హాయిగా కిష్కింధకు పో. ఈ లంకా పట్టణానికి దేవతలూ గంధర్వులూ అయినా రాలేరు. ఇక నరులూ నీ వానరులూ రాలేరు అని నేను వేరే నీకు చెప్పవలెనా—ఓ శుకుడా, ఈ మాటలు సుగ్రీవుడితో చెప్పు" అన్నాడు.

అంతట శుకుడు పక్షిరూపము ధరించి అప్పటికి అప్పుడు ఆకాశానికి ఎగిరినాడు. సముద్రానికి కొంచెము ఎత్తుగా ఆ దూరము అంతా ఎగిరిపోయి ఆకాశములో నిలుచుని సుగ్రీవుణ్ణి చూచి రావణాసురుడు చెప్పిన మాటలు యథాతథముగా చెప్పినాడు. అట్లా మాట్లాడుతున్న ఆ శుకుణ్ణి పట్టుకోడానికి వానరులు చటుక్కున ఆకాశానికి ఎగిరినారు. వాణ్ణి బలాత్కారముగా ఒడిసి పట్టుకొని పిడికిళ్ళతో పొడిచి నేలమీదికి పడతోసినారు. వానరులు కొట్టి

రెక్కలు విరిచివేస్తూఉంటే ఆ రాక్షసుడు "ఓ రామప్రభూ, ధార్మికులు ఇట్లా దూతను చంపివేయరు. నీవు ఈ వానరులను గట్టిగా నివారించవలెను. లేకపోతే వీండ్లు నన్ను చంపివేస్తారు తన స్వామి చెప్పి పంపించిన మాటలూ తన స్వామి అభిప్రాయమూ చెప్పకుండా తన స్వంతమాటలూ తన అభిప్రాయమూ చెప్పే దూతను చంపివేయవచ్చును. నేను అట్లా చేయలేదు. నా స్వామి చెప్పి పంపించిన మాటలే నేను చెప్పినాను" అని అరిచినాడు.

శుకుడి మొత్తుకోళ్లు విని రాముడు వానరులను చూచి "ఆ రాక్షసుణ్ణి చంపివేయవద్దు" అని చెప్పినాడు. రాముడు అభయము ఇచ్చినందువల్ల శుకుడు ఆకాశానికి ఎగిరినాడు. అక్కడ నిలుచుని "ఓ సుగ్రీవుడా, నీవు శక్తి సంపన్నుడవు. మహాబలవంతుడవు. లోకాలను గగ్గోలు పెట్టించే ఆ రావణాసురుడితో నన్ను ఏమి చెప్పమంటావు" అని అడిగినాడు.

అప్పుడు సుగ్రీవుడు ఆ రాక్షసదూతతో "ఓయీ! మీ రావణాసురుడితో నేను ఇట్లా చెప్పినాను అని చెప్పు. "ఓ రావణుడా—నీవు నాకు స్నేహితుడవు కావు. నీవు నాకు ఏమీ ఉపకారము చేసినవాడవు కావు. నాకు ఇష్టుడవున్నూ కావు. నీవు నీ బంధువులు అందరితోకూడా నా స్నేహితుడు అయిన రాముడికి విరోధివి. నా శత్రువు అయిన వాలికి నీవు మిత్రుడవు. కాబట్టి నీవు నాకు పరమవిరోధివి. నిన్ను కనికరించకూడదు. వాలినివలె నిన్ను చంపివేయవలెను. ఓ రావణుడా, నిన్ను నీ కొడుకులతోనూ నీ బంధువులతోనూ నీ జ్ఞాతులతోనూ చంపివేస్తాను. అచిరకాలములోనే నీ లంకాపట్టణానికి నా మహాసైన్యముతో వస్తాను. నిన్నూ నీ పట్టణాన్ని భస్మము చేసివేస్తాను. ఓ రావణుడా, నీవు మూఢుడవు. దేవేంద్రుడూ దేవతలూ నిన్ను దాచిపెట్టినా నీవు సూర్యపథానికి పోయినా పాతాళలోకానికి పోయినా రాముడు నిన్ను చంపకుండా వదలిపెట్టడు. ముల్లోకాలలోనూ నిన్ను కాపాడేవాడు ఎవడూ ఉండడు. ఇక పిశాచాలు కానీ రాక్షసులుకానీ అసురులుకానీ నిన్ను రాముడినుంచి రక్షించడము అనేది ఏమి ఉంటుంది. ముసలివాడు అయి శక్తి ఉడిగిపోయిన జటాయువును చంపివేసినావు. సీతాదేవిని తెచ్చు

కొన్నావు. రాబోతున్న కష్టము ఎరుగకుండా ఉన్నావు. రాముడు కానీ లక్ష్మణుడుకానీ సమీపములో లేనప్పుడు నీవు ఆ విశాలాక్షిని సీతాదేవిని దొంగిలించుకొని వచ్చినావు. ఆ మహాబలవంతుడు ఆ మహాత్ముడు దేవతలు అయినా ఎదిరించలేని ఆ రఘువంశ లలాముడు రాముడువచ్చి నీ ప్రాణాలు తీసివేస్తాడు అని నీవు ఎరుగవు.

"ఓ రాక్షసుడా, నేను సుగ్రీవుణ్ణి ఇట్లా చెప్పినాను అని రావణాసురుడితో చెప్పు" అన్నాడు.

అంతట వానరశ్రేష్ఠుడు అంగదుడు సుగ్రీవుణ్ణి చూచి "మహారాజా, వీడు ఈ రాక్షసుడు దూతకాడు. వీడు గూఢ చారుడు అని నాకు తోస్తున్నది. వీడు ఇక్కడ అంతరిక్షములో ఉన్నట్టు ఉండి మన సేనలను తూకము వేస్తున్నాడు. వీణ్ణి ఇప్పుడే పట్టుకోవలెను. వీణ్ణి లంకాపట్టణానికి పోనీయడము నాకు ఇష్టము లేదు" అని చెప్పినాడు.

సుగ్రీవుడు ఆజ్ఞాపించినందువల్ల వానరులు ఆకాశానికిఎగిరినారు. అనాథుడువలె ఏడవడము మొదలుపెట్టిన ఆ శుకుణ్ణి పట్టుకొని కట్టిపడవేసినారు. భయంకరాకారులు అయిన ఆ వానరులు అందరూ కొట్టుతూ ఉంటే శుకుడు "రామప్రభూ, రక్షించు" అని పెద్దపెట్టున ఏడుస్తూ "ప్రభూ, ఈ వానరులు నా రెక్కలు ఊడకొట్టుతున్నారు. నా కళ్లు పెరికి వేస్తున్నారు. నన్ను చంపివేస్తున్నారు. నేను ఇక బ్రతుకడము ఉత్తది. నన్ను ఇట్లా వానరులు ఇక్కడ చంపి వేసేట్లయితే నేను పుట్టింది మొదలు నా ప్రాణాలు పోయేటంత వరకూ నేను చేసిన పాపాలు అన్నీ నిన్ను చుట్టుకొంటవి. ఓ రామా, నన్ను రక్షించు" అని ఏడ్చినాడు.

ఆ ఏడ్పు విని రాముడు ఆ దూతను చంపవద్దు అని వానరులతో చెప్పినాడు.

౨౧

ఆ మహోదధితీరాన ఆ అరిందముడు రాముడు దర్భ శయ్యను అమర్చుకొన్నాడు. ప్రాఙ్ముఖుడు అయి చేతులు జోడించి సముద్రుడికి నమస్కారము చేసినాడు. పాము శరీరము వంటి తన మృదుబాహువును తలగడగా పెట్టుకొని పడుకొన్నాడు.

అయోధ్యానగరములో ఉన్నప్పుడు రత్నఖచితకాంచనాభరణాలతోనూ ముక్తామయాభరణాలతోనూ బంగారు బాహుపురులతోనూ శోభించిన ఆ దక్షిణబాహువును ఉత్తమాంగనలు స్నానాలంకరణాదిసమయాలలో చందనాగరు గంధాలు నలుగుపెట్టి రక్తచందనాదులు మైపూతలుగా పూసినందువల్ల బాలసూర్య ప్రభలతో ధగధగలాడుతూ చందనాగరు సువాసనలతో గుబాళించిన ఆ దక్షిణబాహువును, శయ్యమీద పడుకొన్నప్పుడు గంగాజలాలలో తక్షకసర్పకాయమువలె భాసించిన ఆ దక్షిణబాహువును, సీతాదేవి తలగడగా చేసుకొని తన శిరము పెట్టుకొని పడుకొన్నప్పుడు అమితముగా శోభించిన ఆ దక్షిణబాహువును, శత్రువులను అధికముగా దుఃఖపెట్టిన కాడివంటి ఆ దక్షిణబాహువును, స్నేహితులను అమితముగా సంతోషపెట్టిన ఆ దక్షిణబాహువును, సముద్రము పొలిమేరగా ఉన్న భూమండలానికి అంతటికీ ఆధారము అయిన ఆ దక్షిణబాహువును, ప్రదక్షిణముగా బాణాలు వదిలేటప్పుడు అల్లెత్రాటి దెబ్బలకు చర్మము కాయలుకాసిన ఆ దక్షిణబాహువును, ఆ మహాబాహువు రాముడు అప్పుడు తలగడగా పెట్టుకొని తనకు సముద్రతరణమో లేక మరణమో తప్పదు అని నిశ్చయించుకొని కాయికనియమములోనూ మనోనియమములోనూ వాచికనియమములోనూ ఆ మహోదధితీరాన శాస్త్రోక్తముగా దర్భశయ్యమీద పడుకొన్నాడు.

ఆ నీతిజ్ఞుడు ఆ ధర్మవత్సలుడు రాముడు ఆ సముద్రతీరాన దర్భశయ్యమీద పడుకొని సముద్రుణ్ణి ఉపాసిస్తూ మూడు అహోరాత్రములు కడపినాడు. అంత నియమములో అట్లా ఆరాధించినప్పటికిన్నీ రాముడికి ఆ సముద్రుడు సాక్షాత్కారము కాలేదు. అందుకు రాముడికి కోపము వచ్చింది. కడకన్నులు ఎర్రపడిపోయినవి. సమీపములో ఉన్న తమ్ముణ్ణి పిలిచి "లక్ష్మణా నాకు సముద్రుడు ఇంతవరకూ దర్శనము ఇయ్యలేదు. వీడు ఎంతో గర్వములో ఉన్నాడు. శాంతమూ ఓర్పూ నిష్కాపట్యమూ ప్రియభాషణమూ మొదలు అయిన సద్గుణాలను గుణహీనుడు అసామర్థ్యలక్షణాలుగా భావిస్తాడు. తనను తాను పొగడుకొంటూ అందరినీ తరుమ

కొట్టుతూ వంచనము చేస్తూ మంచి చెడ్డలు అనే భేదము లేకుండా నిర్దయతో అందరినీ దండించే దుష్టుణ్ణి ఈ లోకము గౌరవిస్తుంది. శమదమాది సద్గుణసంపన్నుణ్ణి ఈలోకము అగౌరవిస్తుంది. లక్ష్మణా, ఈలోకములో బలవంతుడు అనే కీర్తి కానీ పరాక్రమవంతుడు అనే యశస్సు కానీ మంచితనమువల్ల రావు. అంతేకాదు. సామోపాయముతో యుద్ధములో జయము సంపాదించడమున్నూ అశక్యమే. దండమే అన్నిటికీ సాధనము.

"లక్ష్మణా, ఈ మకరాలయముమీద నేను ఇప్పుడు నిశిత బాణాలు వదులుతాను. నా బాణాలకు ఈసముద్రములో ఉంటున్న మకరాలు అన్నీ ఛిన్నాభిన్నము అయి పయికి తేలుతవి. ఈ సముద్రజలాలు స్తంభించిపోతవి. మహాకాయాలతో సర్పాలు తొండాలు తెగిపోయిన ఏనుగులవలె మత్స్యాలూ ముక్కలు ముక్కలు అయిపోయి పైకి తేలుతవి. నేను వదిలే బాణాలకు ఈ సముద్రజలాలు ఇంకిపోతవి. శంఖాలూ మత్స్యాలూ మకరాలూ కుప్పలు కుప్పలుగా బయటపడుతవి. తమ్ముడా, ఇంతవరకూ ఓర్పుతో ఉండడమువల్ల ఈ సముద్రుడు నన్ను అసమర్థుణ్ణిగా భావించినాడు. అందువల్ల నన్ను ఉపేక్షించినాడు. ఈ సముద్రుడి దగ్గర ఓర్పు ఏమాత్రమూ పనిచేయదు. సామోపాయముతో నాకు సాక్షాత్కారము కాదు.

"తమ్ముడా, నా బాణాలనూ ధనుస్సునూ తెచ్చిపెట్టు. క్రూరవిషసర్పాలవంటి బాణాలు వదిలి ఈ సముద్రాన్ని ఎండ కొట్టుతాను. వానరులు అందరూ అవతలి గట్టుకు నడిచిపోయేట్టు చేస్తాను. ఎవరికిన్నీ క్షోభపెట్టడానికి అలవి కాకుండా ఉన్న ఈ సముద్రాన్ని నేను ఇప్పుడు క్షోభ పెట్టుతాను. నాలుగుపక్కలా ఎల్లగా ఏర్పరచిన చెలియలికట్టను దాటకుండా అలలతో రేగుతూ ఉన్న ఈ సముద్రము ఇప్పుడు నా బాణాల దెబ్బకు హద్దులు దాటి భూమిమీద వరదలు అయి పారేట్టు చేస్తాను. దానవసమూహాలతోకూడా ఈ సముద్రాన్ని ఇప్పుడు నేను క్షోభ పెట్టుతాను" అంటూ ధనుస్సు చేతితో తీసుకొన్నాడు. సముద్రము వంక తేరి పారచూచినాడు. కుపితుడు అయినాడు. ప్రళయకాలాగ్ని

హోత్రమువలె జ్వలిస్తూ దుర్ధర్షుడు అయినాడు. భయంకరము అయిన ఆ ధనుస్సు నడుమను పిడికిటితో గట్టిగా పట్టుకొన్నాడు. ధనుస్సును సజ్యము చేసినాడు. ఆ ధనుష్టంకారానికి ఈ జగత్తులో ఉన్న జంతువులు అన్నీ గజగజ వణికిపోయినవి. దేవేంద్రుడు వజ్రాయుధాలనువలె మహోగ్ర బాణాలను సముద్రముమీద వదిలినాడు.

అగ్నిశిఖలవంటి ఆ బాణాలు అమితవేగముతో పోయి సముద్రములో పడ్డవి. అందులో ఉన్న జలజంతువులు అన్నీ బెదరి పోయినవి. భయంకరధ్వనితో గాలి వీచింది. పెద్ద పెద్ద అలలు లేచినవి. నక్రాలూ మకరాలూ క్షోభపడిపోయినవి. అలలు సుళ్లు తిరగడము మొదలుపెట్టినవి. శంఖాలూ ముత్తెపుచిప్పలూ ఆ అలలతో పైకివచ్చినవి. అగ్నిజ్వాలలతో పోయి పడ్డ బాణాలలో నుంచి అలలతో పొగలు పయికి లేచినవి. ఆ బాణాలు పాతాళము వరకూ పోయినవి. ఆ పాతాళలోకములో ఉన్న మహాపరాక్రమ వంతులు అయిన దానవులు బాధపడిపోయినారు. మిల మిల మెరిసే పన్నగుల ముఖాలు మంటలు మండుతూ విషము కక్కుతూ క్షోభపడిపోయినవి. అప్పుడు ఆ సముద్రములో అలలు వందలకొద్దీ మొసళ్లతోనూ మత్స్యాలతోనూ వింధ్య మందర పర్వతాల అంత ఎత్తున పైకి లేచినవి.

అంతట రాముడు మరింత కోపముతో నిట్టూర్పులు విడుస్తూ మహోగ్రవేగముతో పోయే బాణాన్ని వింట ఎక్కుపెట్టి వదల పోవడము లక్ష్మణుడు చూచి "వద్దు; వద్దు" అంటూ పోయి ఆ వింటిని పట్టుకొన్నాడు.

౨౨

అప్పుడు ఆ రఘువంశశ్రేష్ఠుడు రాముడు సముద్రుణ్ణి ఉద్దేశించి "ఓ సముద్రుడా, నిన్ను ఇప్పుడు పాతాళము వరకూ ఎండ కొట్టు తాను. నా బాణాలకు నీ జలాలూ జలజంతువులూ దగ్ధము అయిపోతవి. నీవు ఎండిపోతావు. పెద్దదుమ్ము లేస్తుంది. నా వింటిలో నుంచి కురిపించే బాణాలతోనే సేతువు కట్టుతాను. నా వానర సైన్యము అంతా అవతలిగట్టుకు కాలినడకనే పోయి చేరుతుంది.

"ఓ సముద్రుడా, నీలో దానవులు అందరూ నివసిస్తూ ఉన్నారు. వారి సహవాసదోషమువల్ల నీవు నా బలాన్నికానీ నా పరాక్రమాన్నికానీ ఆలోచించి కనుక్కో లేకుండా ఉన్నావు. నేను నిన్ను సంతాపపెట్టుతాను అని తెలుసుకోలేకుండా ఉన్నావు" అని భయంకరముగా చెప్పినాడు. అంతట ఆ మహాబలవంతుడు రాముడు బ్రహ్మదండమువంటి అస్త్రాన్ని తీసినాడు. బ్రహ్మాస్త్ర మంత్రముతో దానిని అభిమంత్రించి తన మేటివింటికి ఎక్కించి ఆకర్ణాంతమూ లాగినాడు. ఆ ధనుష్టంకారానికి భూమ్యాకాశాలు పగిలిపోయినట్టుగా తోచింది. అప్పుడు ఆ ధ్వనికి పర్వతాలు కంపించి పోయినవి. లోకముఅంతా చిమ్మచీకట్లు కమ్ముకొన్నవి. దిక్కులు తెలియకుండా పోయినవి. ఆ క్షణాన సమస్తనదులూ సరస్సులూ క్షుభితము అయిపోయినవి. నక్షత్రాలతోకూడా సూర్యచంద్రులు వెనుకకు నడిచినారు. ఆ అంధకారములో సూర్య కిరణాలు ఆకాశములో వందలకొద్దీ ఉల్కలవలె (కొరవులవలె) అగుపించినవి. అంతరిక్షమునుంచి మహాధ్వనులతో పిడుగులు పడ్డవి. ఆకాశమునుంచి వాయువు పంక్తులు పంక్తులుగా ప్రచండ ముగా వీచింది. ఆ వాయుప్రసారానికి అప్పటికి అప్పుడు ఆకాశము అంతటా మేఘాలు కమ్ముకొన్నవి. మహావృక్షాలు నేలకూలినవి. పర్వతాగ్రభాగాలూ పర్వతశిఖరాలూ అల్లల్లాడి పోయినవి. మేఘాలు మహాభయంకరముగా ఉరుములు ఉరిమినవి. మెరుపులు నిప్పులు కక్కడము మొదలు పెట్టినవి. ఆ పిడుగుల ధ్వనులకు కంటికి అగుపించే ప్రాణికోట్లు పెడబొబ్బలతో ఏడ్చినవి. కంటికి అగుపించని పిశాచాది భూతకోట్లు మహాభయంకరముగా అరిచినవి. నిద్రపోతున్న ప్రాణులుఅన్నీ లేచి భయములో గడగడ వణుకుతూ కదలలేకుండానూ మెదలలేకుండానూ ఎక్కడవి అక్కడ నిలుచుండి పోయినవి.

ఆ మహాత్ముడు రాముడు అదివరకు వదిలిన అగ్నిశిఖలవంటి బాణాలు పోయి పడే పడడములో ఆ మహోదధిజలాలూ ఆ జలాలలో ఉంటూఉన్న సమస్తప్రాణులూ తల్లడిల్లి పోయినవి. ఆ సముద్రము వెల్లువవలె లేచింది. ఆ వెల్లువ చెలియలికట్టను వదలి

పెట్టి ఒక్క యోజనము దూరము వెనకకు పోయింది. ఎన్నడూ చెలియలికట్టను వదిలిపెట్టిపోని ఆ సముద్రము పైకి పొంగి వెనకకు పారిపోతూ ఉంటే శత్రుసంహారకుడు రాముడు తాను ఎక్కుపెట్టిన బ్రహ్మాస్త్రాన్ని వదలకుండా నిలుచుండి పోయినాడు.

మహామేరుపర్వతముమీద ఉదయించే సూర్యుడివలె అప్పుడు ఆ సముద్రము మధ్యమునుంచి సముద్రుడు స్వయముగా పయికి లేచినాడు. స్నిగ్ధవైడూర్య కాంతులతో తేజరిల్లుతున్న శరీరముతోనూ తామరరేకులవంటి కన్నులతోనూ ఎర్రటి వస్త్రాలతోనూ ఎర్రటి పూలదండలతోనూ జంబూనదిలో పుట్టిన బంగారము గనులలోనుంచి తీసిన బంగారము—కరగించిన బంగారము మొదలయిన రంగు రంగుల బంగారములతో చేసిన సొమ్ములతోనూ తనలో పుట్టిన ఉత్తమరత్నాలు పొదిగిన రత్నహారాలతోనూ ఒంటిపేట ముత్యాలహారముమధ్యను కౌస్తుభమణికి తోబుట్టువు అయి పాటలప్రభలతో విశాలవక్షఃస్థలాన తేజరిల్లుతూఉన్న నాయకమణితోనూ గైరికాదిధాతువులతో ధగ ధగలాడే హిమవత్పర్వతమువలెనూ ముఖాలు మంటలు మండుతూఉన్న పాములతోనూ సముద్రుడు కనిపించినాడు. అప్పుడు ఆ సముద్రములో అలలు ఆకాశాన్ని అంటుతూ పయికి లేచినవి. అంతటా మహామేఘాలు కమ్ముకొన్నవి. గాలి విపరీతముగా వీచింది. ఆ సముద్రము పయిన మొసళ్లు మొదలు అయినవి తిరుగుతూనూ ఉరగులు లోపల క్షోభపడుతూనూ వివిధ దేవతాస్వరూపలు అయిన గంగా సింధు మొదలు అయిన నదులు చుట్టూ తిరుగుతూనూ ఉండగా ఆ వీర్యవంతుడు సముద్రుడు రాముడిదగ్గరకు వచ్చినాడు.

ఆ బాణపాణిని రామున్ని సముద్రుడు చూచి చేతులు జోడించి ముందుగా సంబోధించి "ఓ పుణ్యాత్ముడా, పృథివీ వాయువూ ఆకాశమూ జలమూ అగ్నిహోత్రమూ (అనే పంచభూతాలూ) తమ మర్యాదను ఎప్పుడూ తప్పకుండా ఉంటూ ఉన్నవి. అట్లా మర్యాదను తప్పకుండా ఉండడము వాటి సహజస్వభావము. (పృథివి గట్టిగా ఉండడమూ వాయువు అడ్డదిడ్డముగా తిరగడమూ ఆకాశము ఎడము ఇవ్వడమూ జలము లోతుగా ఉండడమూ అగ్ని

హోత్రజ్వాలలు పైకి లేవడమూ వాటి వాటి సహజస్వభావాలు) అందువల్ల నేను అగాధముగానూ నన్ను ఎవరూ దాటి పో నలవి కాకుండానూ ఉంటున్నాను. ఇది నా సహజస్వభావము. నేను ఈ స్వభావాన్ని వదిలిపెట్టడానికి వీలులేదు. లోతులేకుండా ఉండడము నా స్వభావానికి విరుద్ధము. అగ్నిహోత్రము ఎప్పుడు అయినా చల్లగా ఉంటుందా. ఉండదు. అదేవిధముగా నేను లోతు లేకుండా ఉండను. ఓ రామప్రభూ, నేను నీకు యథార్థము చెప్పుకొంటున్నాను.

"ఓరామా, నీవు రాజపుత్రుడవు. అందువల్ల సమస్త మర్యాదలనూ నీవు సుస్థిరముగా ఉంచవలెను. నా జలాలలో నక్రాలూ గ్రాహాలూ మొదలు అయినవి ఎన్నో జీవిస్తూ ఉన్నవి. నేను స్తంభించి పోయేట్లయితే (గడ్డకట్టుకుని పోయేట్లయితే) అవి అన్నీ బాధపడిపోతవి. అందువల్ల ఏమి అయినప్పటికిన్నీ కామము వల్లకానీ లోభమువల్లకానీ భయమువల్లకానీ నేను స్తంభించి పోను. అయితే నా చేతనయిన పని మాత్రము చేసి నీకు సాయ పడుతాను. ఈ సముద్రాన్ని దాటి అవతలిగట్టుకు పోయేటంత వరకూ నీ సైన్యాన్ని నక్రాలూ గ్రాహాలూ మొదలుఅయినవి బాధపెట్టకుండా చేస్తాను. ఓ రామప్రభూ, నీ వానరసైన్యము అంతా అవతలిగట్టుకు పోవడానికి నీవు ఈ సముద్రములో సేతువు కట్టవలెను. అందుకు నేను మెరక చేస్తాను" అని చెప్పినాడు.

ఇట్లా చెప్పిన ఆ సముద్రుణ్ణి చూచి రాముడు "ఓ సము ద్రుడా, నేను అమోఘము అయిన మహాబాణాన్ని వింట సంధించి నాను. అది బ్రహ్మాస్త్రము. దాన్ని వదలకుండా ఊరక ఉండ డానికి వీలులేదు. దానిని ఇప్పుడు ఎక్కడ వదిలిపెట్టమంటావో నీవే చెప్పు" అని అడిగినాడు.

ఆ మహాతేజోవంతుడు సముద్రుడు ఆ మహాశరాన్ని చూచి "రామప్రభూ, జగత్ప్రసిద్ధికెక్కిన ద్రుమకుల్యము అనే మనోహరము అయిన ప్రదేశము ఇక్కడికి దగ్గరలోనే ఉత్తరదిక్కున ఉంది. ఆ ప్రదేశములో అనేకమంది దస్యులూ (దొంగలూ) అభీరులూ (గొల్ల వాండ్లు) నివసిస్తూ ఉన్నారు. వాండ్లు భయంకరులు. భయంకరము

అయిన పనులు చేస్తూ ఉంటారు. వాండ్లు అందరూ పాపాత్ములు. ఆ పాపిష్టివాండ్లు అందరూ ఆ ద్రుమకుల్యములో నేను కల్పించిన స్వాదుజలాలు తాగి బ్రతుకుతున్నారు. ఆ పాపాత్ముల సంసర్గము నేను సహించలేకుండా ఉన్నాను. అమోఘము అయిన నీ శరోత్తమాన్ని ఆ ద్రుమకుల్యముమీద వదిలిపెట్టు. వాండ్లు అందరూ నాశనము అయిపోతారు" అని చెప్పినాడు.

అంతట రాముడు ఆ ద్రుమకుల్యముమీద మంటలు మండుతూ ఉన్న బ్రహ్మాస్త్రాన్ని వదిలిపెట్టినాడు. ఆ శరము పిడుగు వలె మంటలు మండుతూ పోయి ఆ ప్రదేశములో పడ్డది. మహా ధ్వనితో భూమిని చీల్చుకొంటూ ఆ బాణము రసాతలములోకి పోయింది. అప్పుడు ఆ రసాతలమునుంచి బాణము పోయిన కలుగుగుండా జలము పైకి ఉబికిన కూపము వ్రణకూపము అని ప్రసిద్ధికెక్కింది. ఆ వ్రణకూపములోనుంచి నిరంతరమూ స్వాదు జలము పైకి వస్తూ ఉంటుంది. ఆ జలము సముద్రజలమువలె ఎప్పుడూ పట్టిపోకుండా ఉంటున్నది.

రామబాణమునుంచి ఆ ద్రుమకుల్యము మధ్యభాగాన పల్లాలలో ఉన్న జలాలు ఎండిపోయినవి. ఆ పల్లాలలో జలాలే అక్కడివారికి అందరికీ జీవనాధారముగా ఉంటూ ఉండేవి. ఆ నీళ్ళను ఎండగొట్టడమే కాకుండా ఆ మహాపరాక్రమవంతుడు ఆ రణ పండితుడు రాముడు వదలిన బ్రహ్మాస్త్రము అక్కడ నివసిస్తూ వచ్చిన పాపాత్ములను అందరినీ దగ్ధము చేసివేసింది.

ఆ ద్రుమకుల్యము అప్పటినుంచి మరుకాంతారము అని ముల్లోకాలలోనూ ప్రసిద్ధికెక్కింది. ఆ మరుకాంతారములో జనులు అరోగులుగా నివసించేటట్టుగానూ పశువులకు కావలసినంత పచ్చిగడ్డి దొరికేటట్టుగానూ అక్కడ సమృద్ధముగా క్షీరాలూ కందమూలఫలాలూ తియ్యని తేనెలూ సుగంధము గుబాళించే ఓషధులూ దొరికేటట్టుగానూ రాముడు వరము ఇచ్చినాడు. ఆ వర ప్రభావమువల్ల అది అప్పటినుంచి మంగళకరము అయిన ప్రదేశము అయింది.

సముద్రుడు తన కుక్షిలో ఉన్న ఆ ద్రుమకుల్యము దగ్ధము అయిపోగానే ఆ సర్వశాస్త్రజ్ఞుణ్ణి రాముణ్ణి చూచి "ఓ శాంతుడా,

నీ వానరసైన్యములో నలుడు అనే వాడు ఒకడు ఉన్నాడు. వాడు విశ్వకర్మ పుత్రుడు. వాడి తల్లికి విశ్వకర్మ తనఅంతటి పుత్రుడు పుట్టుతాడు అనే వరము ఇచ్చినాడు. వాడు ధైర్యవంతుడు. మహోత్సాహి. వాడు సేతువు కట్టకలడు. వాడు కట్టే సేతువును కదిలిపోకుండా నేను నిలుపుతాను'' అని చెప్పి అంతర్ధానము అయి పోయినాడు.

సముద్రుడు ఇట్లా చెప్పి అదృశ్యుడు అయిపోగానే ఆ వాన రోత్తముడు ఆ మహాబలవంతుడు నలుడు లేచి చేతులు జోడించి ''రామప్రభూ, సముద్రుడు చెప్పింది యథార్థము. నా తండ్రి విశ్వకర్మ నాకు ఇచ్చిన సామర్థ్యములో నేను ఈ సముద్రములో సేతువు కట్టకలను. ఓ వానరులారా, ఈ లోకములో దండో పాయమే శ్రేష్ఠము అయింది అని నా అభిప్రాయము. కృతజ్ఞత లేని వాండ్లదగ్గర క్షమకానీ .సామదానోపాయాలుకానీ పనిచేయవు. మన రామప్రభువు పూర్వీకుడు సగరచక్రవర్తి సముద్రుణ్ణి వృద్ధి చేసినాడు. ఆ ఉపకారము సముద్రుడు మరిచిపోయినాడు. ఇప్పుడు రామప్రభువు దండిస్తాడు అనే భయములో పరుగెత్తుకొని వచ్చి సేతువు కట్టుకోడానికి మెరక చేస్తాను అని చెప్పిపోయినాడు.

''ఓ రామప్రభూ, మందరపర్వతముమీద నా తల్లికి విశ్వకర్మ తన అంతటి పుత్రుడు పుట్టేట్టు వరము ఇచ్చినాడు. నేను ఆ విశ్వకర్మ ఔరసపుత్రుణ్ణి. శిల్పవిద్యలో నేను నా తండ్రి అంతటి వాణ్ణి. ఈ విషయము ఎవరూ చెప్పనందువల్ల ఈ పని నేను చేయ కలను అని నా అంతట నేను చెప్పలేదు. ఇప్పుడు సముద్రుడు ఈ సంగతి గుర్తుకు తెచ్చినాడు. నేను సేతువు కట్టకలను. నీవు కావలెను అనేట్లయితే ఇప్పుడే ఈ వానరుల సాయములో సేతువు కట్టడము ఆరంభిస్తాను'' అని చెప్పినాడు.

ఈ మాటలు నలుడు చెప్పగానే రాముడు సేతువును వెంటనే నిర్మించవలసింది అని ఆజ్ఞాపించినాడు. అంతట వానరులు సంతోష ముగా లక్షలు లక్షలుగా అన్నివైపులా అడవులకు పోయినారు. ఆ పర్వతాకారులు వానరయూథపతులు ఆయా అరణ్యాలలో ఏరుమద్దిచెట్లనూ ఇనుమద్దిచెట్లనూ చంద్రచెట్లనూ కొండమల్లె

చెట్లనూ తాటిచెట్లనూ బొట్టుగుచెట్లనూ తిమిశచెట్లనూ మారేడు చెట్లనూ ఏడాకులఅరటిచెట్లనూ పూచినకొండగోగుచెట్లనూ మామిడిచెట్లనూ అశోకచెట్లనూ వెదుళ్ళనూ ఇంకా నానావిధ వృక్షాలనూ పెళ్ళగించి సముద్రతీరానికి చేర్చినారు. ఆ చెట్లను కొన్నిటిని సమూలముగానూ కొన్నిటిని విమూలముగానూ ఇంద్ర ధ్వజాలవలె లేవనెత్తి సముద్రములో పడవేసినారు. ఈ చెప్పిన వాటినేకాకుండా కొబ్బరిచెట్లనూ తాండ్రచెట్లనూ పొగడచెట్లనూ తుమ్మచెట్లనూ వేపచెట్లనూ తెచ్చి ఆ సముద్రములో వానరులు పడవేసినారు. ఆ మహాకాయులు ఏనుగులు అంత అంత వానరులు పెద్ద పెద్ద రాళ్ళను పర్వతాలలోనుంచి పెళ్ళగించి బండ్లమీద వేసి ఆ సముద్రతీరానికి తీసుకొని వచ్చినారు. అట్లా ఎంతో శ్రమపడి తెచ్చిన ఆ రాళ్ళను తటాలున సముద్రములో పడవేస్తూఉంటే జలాలు ఆకాశము ఎత్తున పయికి లేచినవి. ఆ వానరులలో కొందరు నూలుతాడు పట్టుకొంటూ నూరు యోజనాల దూరము పోయి నారు. కొందరు వానరులు కొలతబద్దలు పట్టుకొని పనిచేయడము మొదలు పెట్టినారు. కొందరు వానరులు ఎక్కువ తక్కువలు రాకుండా మట్టము కట్టసాగినారు. కొందరు వానరులు పర్వత పాషాణాలను గబగబా పట్టుకొని రావలసింది అని బెదరించసాగి నారు. అట్లా ఆ సముద్రములో పదియోజనాల వెడల్పునా నూరు యోజనాల పొడుగునా నలుడు సేతువును కట్టడము మొదలు పెట్టినాడు.

రామాజ్ఞను శిరసావహించి వందలకొద్ది వానరులు నలుడు కట్టుకొంటూ పోతూఉన్న ఆ సేతువుమీద మేఘాలవంటి పర్వత శిఖరశిలలనూ కొయ్యలనూ పచ్చిగడ్డినీ వేసి కట్టినారు. పూచిన చెట్లకొమ్మలను తీసుకొనివచ్చి ఆ సేతువుమీద పరిచినారు. ఏనుగులు అంతటివానరులు కొండలుఅంతటి రాతిబండలను పెళ్ళగించి పట్టుకొని పరుగెత్తుకొంటూ వచ్చినారు. ఆ బండలను సముద్రములో పడవేస్తూ ఉంటే దిక్కులు పిక్కటిల్లి పోయేట్లు మహాధ్వనులు బయలుదేరినవి.

ఏనుగులువంటి ఆ మహాకాయులు వానరులు సంతోషముగా మొదటిరోజున పధ్నాలుగు యోజనాలదూరము సేతువు కట్టినారు.

ఆ మహాబలవంతులు ఆ మరునాడు అమితవేగముతో ఇరవై యోజనాలదూరము సేతువు నిర్మించినారు. ఆ మహాకాయులు మూడవనాడు ఇరవైఒక్క యోజనాలదూరమూ నాల్గవనాడు మహావేగముతో ఇరవైరెండు యోజనాలదూరమూ ఐదవనాడు అంతకన్నా అమితవేగముతో ఇరవైమూడుయోజనాల దూరమూ సువేలాద్రి హద్దుగా చేసుకొని సేతువు కట్టినారు.

ఆ మహాబలవంతుడు ఆ ధైర్యవంతుడు వానరముఖ్యుడు నలుడు అతని తండ్రి విశ్వకర్మవలె ఆ సముద్రములో కట్టిన సేతువు ఆకాశములో స్వాతిపథమువలె రమణీయముగానూ కాంతిమంతముగానూ కనిపించింది. ఆ అద్భుతసేతువును గంధర్వులూ దేవతలూ సిద్ధులూ పరమర్షులూ అప్పుడు ఆకాశములో నిలుచుని చూచినారు. అట్లా మకరాలయములో సేతువును కట్టవచ్చును అని అదివరకు ఎవరూ మనస్సులోనయినా అనుకోలేదు. ఓర్చనలవికాని అంత కష్టము అయిన పనిని అంత సులభముగా చేయవచ్చును అని ఎవరూ ఊహించనయినా లేదు. అది అద్భుతము అయిన సేతువు. దాన్ని చూస్తే ఒళ్లు గగురుపొడుస్తుంది. ఆ సేతువును సమస్తప్రాణికోటులూ చూచినవి. అబ్బుర పడిపోయినవి. అట్లా ఆ సేతువును కట్టుతూ కోట్లకొద్దీ వానరులు ఆ మహోదధి అవతలిగట్టుకు పోయినారు. మిట్టపల్లాలు లేకుండానూ వంకరటింకరలు లేకుండానూ సూటిగానూ శోభాయమానముగానూ నిర్మించిన ఆ సేతువు ఆ సముద్రానికి పాపటబొట్టువలె భాసించింది.

విభీషణుడు చేతిలో గదపట్టుకొని తన మంత్రులతోకూడా ఆ సముద్రము దక్షిణగట్టున శత్రువులు వచ్చి పైనపడితే కొట్టడానికి కావలి ఉన్నాడు. అప్పుడు సుగ్రీవుడు రాముణ్ణి చూచి "ఓ సత్యపరాక్రముడా, నీవు ఈ హనుమంతుణ్ణి ఆరోహించు. లక్ష్మణుడు అంగదుణ్ణి ఆరోహిస్తాడు. మొసళ్లకు ఉనికిపట్టు అయిన ఈ సముద్రములో మనము చాలాదూరము పోవలెను. మీరు నడువవద్దు. ఈ వానరులు ఇద్దరూ ఆకాశగాములు. అందువల్ల అట్లా మిమ్ములను మోసుకొని పోకలరు" అని చెప్పినాడు.

అప్పుడు ఆ శ్రీమంతుడు ఆ ధర్మాత్ముడు రాముడు ధనుర్ధరుడు అయి లక్ష్మణుడితోనూ సుగ్రీవుడితోనూ ఆ సైన్యానికి అగ్రభాగాన

పోయినారు. కొందరు పక్కలను నడిచినారు. కొందరు జలాలలో పడి లేచినారు. దారి చాలనందువల్ల కొందరు తీరాన కనిపెట్టుకొని ఉన్నారు. కొందరు గరుత్మంతుడివలె ఆకాశంలో ఎగిరిపోయినారు. భయంకరముఅయిన ఆ వానరవాహిని సింహనాదాలు చేస్తూనూ కోలాహలధ్వనులు చేస్తూనూ ఆ సముద్రాన్ని దాటి పోతూఉంటే సముద్రఘోషము వినిపించకుండా అణగిపోయింది.

నలుడు నిర్మించిన ఆ సేతువుమీద ఆ వానరవాహిని రామలక్ష్మణ సుగ్రీవులతో కూడా ఆ సముద్రాన్ని దాటి అవతలిగట్టుకు పోయింది. అక్కడ ఫలమూలాలూ రుచ్యముఅయిన నీరూ దొరికేచోట విడిదిచేసినారు.

ఆ దుర్ఘటకార్యానికి ఆశ్చర్యపడిపోయి రాముణ్ణి చూడడానికి దేవతలూ సిద్ధులూ చారణులూ మహర్షులూ అక్కడికి వచ్చినారు. వారు అందరూ మంగళజలాలతో వేరేవేరే రాముణ్ణి అభిషేకించినారు. నరులూ దేవతలూ పూజించే ఆ రాముడితో "ఓ రామా, నీవు నరులకు దేవుడవు. నీ శత్రువులను అందరినీ జయించు. సముద్రవలయితము అయిన ఈ భూమండలాన్ని బహుకాలము పరిపాలించు" అంటూ వివిధమంగళవాక్యాలతో ఆ వచ్చిన వారు అందరూ స్తోత్రము చేసినారు.

౨౩

అప్పుడు రాముడు జరగపోయే కార్యాన్ని సూచించే నిమిత్తాలను చూచినాడు. ఆ యా నిమిత్తాలను అతడు లక్ష్మణుడికన్నా బాగా ఎరుగును. లక్ష్మణుణ్ణి కౌగలించుకొని "లక్ష్మణా, ఈ వనములో ఫలమూలాలూ శీతలోదకాలూ సమృద్ధముగా ఉన్నవి. ఈ సైన్యాన్ని చక్కగా విభజించి గరుడవ్యూహముగా ఇక్కడనే ఉంచుదాము. ఈ కనపడుతున్న నిమిత్తాలనుపట్టి జనక్షయకరమూ భయంకరమూ అయిన యుద్ధము త్వరగా జరుగుతుంది. మహా పరాక్రమవంతులు అయిన అనేకమంది రాక్షసులూ వానరులూ యుద్ధములో హతము అయిపోతారు.

"తమ్ముడా, చూడు. దుమ్మురేగుతూ గాలి వీస్తూ ఉంది. భూమి కంపిస్తున్నది. పర్వతాగ్రాలు అల్లల్లాడుతూ ఉన్నవి. మహా

వృక్షాలు నేల కూలుతున్నవి. గంభీరధ్వనులుచేసే మహామేఘాలు కర్ణకఠోరముగా తోడేళ్ళవలె అరుస్తున్నవి. అంతేకాదు. మేఘాలు భయంకరముగా కనిపిస్తున్నవి. రక్తబిందువులతో వానపడుతున్నది. రక్తచందనకాంతులతో పరమదారుణముగా సంధ్యాకాలము కనపడుతున్నది. సూర్యమండలములో మంటలు మండుతూ ఉన్నవి. ఆ సూర్యమండలములోనుంచి అగ్నిపిండాలు క్రింద రాలుతున్నవి. దీనాకారాలతో మృగాలూ పక్షులూ సూర్యుడికి ఎదురుగుండా పోయి క్రూరస్వరాలతోనూ దీనస్వరాలతోనూ అరుస్తూ భయము పుట్టిస్తున్నవి.

చంద్రుడు కాంతులు మాసిపోయి తాపము ఎత్తిస్తున్నాడు. ప్రళయకాలములోవలె చంద్రుడి పరివేషము (గాలిగుడి) కొన నల్లటి ఎర్రటి కాంతులతోనూ మధ్యను పొట్టిగా మరింత ఎర్రని కాంతుల తోనూ భయంకరముగా కనపడుతున్నది. నిర్మలము అయిన సూర్య బింబములో నల్లని మచ్చ కనపడుతున్నది. నక్షత్రాలు దుమ్ము కొట్టుకున్నట్టుగా కనపడుతూ యుగాంతకాలాన్ని సూచిస్తున్నవి. కాకులూ గద్దలూ రాబందులూ మొదలుఅయినవాటిని దుర్బల పక్షులు చంపివేస్తున్నవి. నక్కలు భయంకరముగా అమంగళ ముగా అరుస్తున్నవి.

"లక్ష్మణా, యుద్ధము జరుగుతుంది. ఆ యుద్ధములో రాక్షసులమీద వానరులు విసరివేసే కొండలు మొదలుఅయినవాటి వల్లనూ రాక్షసులు వానరులమీద ప్రయోగించే శూలఖడ్గాద్యాయుధాలవల్లనూ ఈ భూమి అంతా రక్తమాంసాలతో బురద బురద అయిపోతుంది.

"తమ్ముడా, మనము ఇప్పుడే సుగ్రీవుడూ అంగదుడూ హనుమంతుడూ మొదలుఅయిన వానరముఖ్యులను వెంటపెట్టుకొనిపోయి రావణాసురుడు పరిపాలిస్తున్నందువల్ల ఎదిరించడానికి అలవికాకుండాఉన్న లంకాపట్టణాన్ని చూదాము" అని చెప్పినాడు.

అంతట ఆ ధర్మాత్ముడు రాముడు ధనుర్ధరుడు అయి సంగ్రామోత్సాహములో లంకాపట్టణాభిముఖుడు అయి అందరికన్నా ముందుగా నడిచినాడు. అప్పుడు లక్ష్మణుడూ విభీషణుడూ

సుగ్రీవుడూ ఇంకా తక్కిన వానరవీరులూ శత్రువులను చంపివేయ వలెను అనే నిశ్చయముతో రాముణ్ణి వెంబడించినారు. వానర వీరులు అట్లా పోతూ రాముణ్ణి సంతోషపెట్టడానికి లోకలు ఆడిస్తూ కుప్పిగంతులువేస్తూ సింహనాదాలుచేస్తూ నడిచినారు. వారి యుద్ధోత్సాహానికి రాముడు సంతోషించినాడు.

౨౪

ఆ వానరవీరసమితితో రాముడు విడిదిచేసిన అక్కడి ఆ వనము శరత్కాలపున్నమినాటి రాత్రి శుభనక్షత్రాలతో చంద్రుడు వచ్చిన ఆకాశమువలెనే ఎంతో శోభించింది. ఆ వాహినీపాదఘట్టన లకు అప్పుడు భూమి జడుసుకొన్నట్టుగా కంపించింది. ఆ వానర సైన్యము అక్కడ దిగి విడుదులు ఏర్పరచుకొని సద్దుమణిగిన తరు వాత లంకాపట్టణములో మోగుతూఉన్న భేరీ మృదంగధ్వనులూ రాక్షసయోధుల కోలాహలధ్వనులూ వినిపించినవి. ఆ ధ్వనులు విని వానరయోధులు సహించలేకపోయినారు. ఆ కోలాహల ధ్వనులకన్నా అధికముగా వానరయోధులు సింహనాదాలు చేయ డము మొదలుపెట్టినారు. అందుకు వానరయూథపతులు అందరూ సంతోషించినారు. ఆకాశములో మేఘాలవలె వానరులు విర్రవీగి చేసిన గంభీరధ్వనులు లంకాపట్టణములో రాక్షసులు అందరూ విన్నారు.

చిత్రవిచిత్రము అయిన ధ్వజాలతోనూ పతాకాలతోనూ శోభిస్తూ ఉన్న లంకాపట్టణాన్ని అప్పుడు రాముడు చూచినాడు. అతని మనస్సు సీతాదేవిమీదికి పోయింది. అతనికి దుఃఖము వచ్చింది. అంగారకగ్రహము చెరపెట్టిన రోహిణివలె రావణాసురుడి చెరలో ఉన్న ఆ మృగశాబాక్షిని సీతాదేవిని తలచుకొన్నాడు. దుఃఖము భరించలేకపోయినాడు. పెద్ద పెద్ద వేడి వేడి నిట్టూ ర్పులు విడిచినాడు. లక్ష్మణుణ్ణి చూచి సమయోచితముగా "తమ్ముడా, విశ్వకర్మ మనసా సంకల్పించి ఈ లంకాపట్టణాన్ని ఈ చిత్రకూటపర్వతముమీద నిర్మించినాడు. ఈ పట్టణము ఎంతో ఎత్తున ఆకాశాన్ని అంటుతూ ఉంది. తెల్లటి మేఘాలు కమ్ము కొన్న ఆకాశమువలె విమానాకారగృహాలతో ఈ లంకాపట్టణము

శోభాయమానముగా ఉంది. పుష్పఫలభరితవృక్షాలతోనూ మధుర గానము చేస్తూ ఉన్న నానావిధ పక్షిసంఘాలతోనూ ఈ లంకాపట్టణము కుబేరుడి చైత్రరథ వనమువలె నేత్రపర్వముగా ఉంది. ఈ లంకాపట్టణ వనాలలో పండ్లూ కాయలూ తిని పక్షులు మత్తువెక్కి పాటలు పాడుతూ వున్నవి. ఎప్పుడూ పూచే రకరకాల పూలలో దొరికే తియ్యని తేనెలు తాగి తుమ్మెదలు కదలకుండానూ మెదలకుండానూ ఉన్నవి. చిగురుటాకులు తింటూ కోకిలలు వృక్షసమూహాలను వదిలిపెట్టకుండా శ్రవణపేయముగా కేకలు వేస్తూ ఉన్నవి" అని రాముడు చెప్పినాడు.

ఆ వానరసైన్యాన్ని రాముడు అంతట చక్కగా విభజించినాడు. ఆ సైన్యము వ్యూహాకారముగా ఏర్పడ్డది. అప్పుడు ఆ వానరసైన్యముతో ఆ భూమి మేఘాలు సంచారము చేస్తున్న ఆకాశమువలె శోభించింది. మహాతేజోవంతుడు రాముడు అప్పుడు సుగ్రీవుడితో "ఓ వానరరాజా, మనసైన్యాన్ని వ్యూహాకారములో ఉంచడము అయిపోయింది. ఇకను ఇప్పుడు శార్దూలుణ్ణి వదిలిపెట్టవచ్చును" అని చెప్పినాడు. రామాజ్ఞను శిరసావహించి ఆ వానరేంద్రుడు ఆ రాక్షసదూతను శార్దూలుణ్ణి విడిచిపెట్టినాడు.

వానరులు పెట్టిన బాధలకు భయపడిపోయిన శార్దూలుడు హుటాహుటి రావణాసురుడిదగ్గరకు పోయినాడు. వాణ్ణి చూచి రావణాసురుడు నవ్వుతూ "ఏమిరా, నీ రెక్కలు విరిగిపోయి కనపడుతున్నావు. నీవు ఆ చపలచిత్తుల చేతులలో చిక్కినావా" అని అడిగినాడు.

శార్దూలుడు తనను నిష్ప్రయోజకుడు అని రావణాసురుడు ఏమి చేస్తాడోను అనే భయముతో తడపడుతూ "రాజా, నేను ఇక్కడనుంచి సముద్రము ఉత్తరతీరానికి పోయినాను. సుగ్రీవుణ్ణి చూచి మంచి మాటలతో నీవు చెప్పింది అంతా ఎక్కువ తక్కువలు లేకుండా చెప్పినాను. నన్ను చూచే చూడటముతో వానరులు అందరూ క్రుద్ధులు అయిపోయినారు. చటుక్కున ఆకాశానికి ఎగిరి నన్ను ఒడిసిపట్టుకొని నేలమీదికి పడతోసినారు. పిడికిళ్ళతో పొడిచినారు. నన్ను చచ్చేట్టు కొట్టినారు. రాజా, వాండ్లతో

మాట్లాడటానికి వీలులేకపోయింది. వాండ్లను అడిగి తెలుసుకోడము అంతకు ముందే అశక్యము అయిపోయింది. ఆ వానరులు స్వాభావికముగా కోపిష్ఠివాండ్లు.

"ప్రభూ, వాండ్లు సముద్రానికి సేతువు కట్టినారు. ఆ సేతువు మీదుగా వాండ్లు అందరూ సముద్రము దాటి ఇవతలిగట్టుకు వచ్చినారు. విరాధుణ్ణి ఖరుణ్ణి కబంధుణ్ణి వధించిన ఆ రాముడు ఇప్పుడు ధనుర్ధరుడు అయి సుగ్రీవుడితోకూడా సీతాదేవి ఉన్నచోటు వెతకడానికీ రాక్షసులను తృణీకరించడానికీ వస్తున్నాడు.

"రాజా, ఆ వానర భల్లూక సైన్యములో ఉన్నవాండ్లు అందరూ పర్వతాకారులు. మహామేఘాలవంటివాండ్లు. వేలకువేలు ఈ భూమి కనపడకుండా మూగినారు. ఈ వానరసేనలకూ రాక్షససేనలకూ సంధి కుదరదు. వానరసైన్యాలు ముందుగా మన లంకాపట్టణ ప్రాకారాలమీద పడుతవి. రాజా, సీతాదేవిని ఇచ్చివేయడమో గొప్పయుద్ధము సాగించడమో వెంటనే నిర్ణయించవలెను. ఆలస్యము చేయవద్దు" అని చెప్పినాడు.

శార్దూలుడు చెప్పిన ఈ మాటలకు రావణాసురుడికి కోపము వచ్చింది. కన్నులు ఎర్రపడిపోయినవి. ఆ కన్నులలోనుంచి నిప్పుకణాలు రాలుస్తూ "దేవ దానవ గంధర్వులు ఏకముఅయి యుద్ధముచేయడానికి వచ్చినా సమస్తలోకాలూ నామీదికి వచ్చినా నేను సీతను ఎంతమాత్రమూ రాముడికి ఇవ్వను. నా బాణాలు పనిలేకుండా అమ్ములపొదులలో ఉంటూ ఉన్నవి. వసంతకాలములో పూచిన చెట్లను మదము ఎక్కిన తుమ్మెదలు ముసురుకొనేట్టు నా బాణాలు రాముణ్ణి ముసురుకొంటవి. మంటలతో ధగధగలాడుతూ నా కార్ముకములోనుంచి వెలువడే బాణాలు కొరవులు ఏనుగును అరికట్టేట్టు రాముణ్ణి నిగ్రహిస్తవి. ఉదయసూర్యుడు సర్వనక్షత్రగ్రహకాంతులనూ రూపుమాపేట్టుగా నేను నా మహత్తర సైన్యములో వానరబలాన్ని రాముణ్ణి రూపుమాపివేస్తాను. నాకు సముద్రమువంటి వేగమూ వాయువువంటి గమనమూ ఉన్నట్టు ఆ రాముడికి తెలియదు. అందువల్లనే వాడు నాతో యుద్ధము చేయవలెను అనుకొంటున్నాడు. నా తూణీర

ములో ఉన్న తీక్షణ విషసర్పాలవంటి బాణాలతో నేను యుద్ధము చేయడము ఇదివరకు ఎప్పుడూ రాముడు చూడలేదు. అందుచేతనే వాడు నామీదికి యుద్ధానికి వస్తూ ఉన్నాడు. పోరాటములో నా పరాక్రమము వాడు ఎరగడు. నేను శత్రుసేనలు అనే నాట్యరంగములోకి పోయి కొదుపులతో వీణతంతులను మోగించేట్టు నేను వింట బాణాలు ఎక్కుస్తూ అల్లెతాటిని మోగిస్తాను. నా ధనుష్టంకారానికీ బాణపాతానికీ సర్వమూ నాశనమైపోతూ ఉంటే నేను వినోదము అనుభవిస్తాను. శరాగ్నితో ఆ సహస్రాక్షుడు దేవేంద్రుడుకానీ వరుణదేవుడుకానీ యమధర్మరాజుకానీ నన్ను ఎదిరించలేకపోయినారు. ఇక తక్కినవాండ్లనుగురించి చెప్పేది ఏమిటి'' అన్నాడు రావణాసురుడు.

౨౫

రాముడు వానరసైన్యాన్ని వెంటపెట్టుకొని సముద్రాన్ని దాటి ఇవతలికి వచ్చినాడు అని తెలియగానే ఆ ధైర్యవంతుడు రావణాసురుడు తన మంత్రులను శుకసారణులను చూచి "మంత్రి పుంగవులారా, ఇదివరకు కనీ వినీ ఎరగని సేతువును సముద్రము మీద రాముడు కట్టించినాడు అనీ ఇంతవరకు ఎవరికీ రానలవి కాకుండా ఉన్న మన పట్టణానికి వానరసైన్యముతోకూడా సముద్రాన్ని దాటి వచ్చినాడు అనీ తెలిసింది. సముద్రానికి సేతువు కట్టడము అనేది నేను నమ్మలేకుండా ఉన్నాను. అదేకాకుండా ఆ దాటి వచ్చిన వానరసైన్యము ఎటువంటిదో తెలుసుకోవలెను అనుకొంటున్నాను. కాబట్టి మీరు ఉభయులూ ఎవరికీ తెలియకుండా ఆ వానర సైన్యములోకి పోయి ఆ సైన్యపరిమాణము ఎంతో ఆ వానరుల పరాక్రమము ఎటువంటిదో వారిలో ముఖ్యులు ఎవరో ఆ రాముడి మంత్రులు ఎవరో సుగ్రీవుడి మంత్రులు ఎవరో యుద్ధసమయములో ఆ వానరసైన్యములో ముందు నిలిచేవారు ఎవరో వారిలో శూరులు ఎవరో మీరు తెలుసుకొని రావలెను. అంతేకాకుండా మహా సముద్రానికి వారు సేతువు ఎట్లా కట్టిందిన్నీ ఆ మహాబలవంతులు వానరులు అందరూ ఏయే దేశాలవారో ఇప్పుడు రాముడి ప్రయత్నము ఏమిటో వాడి పరాక్రమము ఎటువంటిదో వాడు ఏయే ఆయుధాలు

ఉపయోగిస్తాడో వాడితమ్ముడు లక్ష్మణుడి పరాక్రమము ఎటువంటిదో ఆ వానరులకు సేనానాయకుడు ఎవడో ఆ ఈ విషయాలు అన్నీ ఉన్నవి ఉన్నట్టుగా తెలుసుకొని మీరు వెంటనే ఇక్కడికి రావలెను" అని చెప్పినాడు.

ఆ శుకసారణులు ఇద్దరూ అంతట వానరవేషాలు వేసుకొని ఎవరికీ తెలియకుండా ఆ వానరసైన్యములోకి పోయినారు. ఆ సైన్యాన్ని అంతా చూచినారు. అది అచింత్యముగా తోచింది. ఆ సైన్యపరిమాణానికి వాండ్ల ఒళ్ళు గగుర్పొడిచింది. ఇంత అంత అని లెక్కవేయడము వారికి అలవికాకపోయింది. ఆ వానర సైన్యము పర్వతశిఖరాల మీదనూ కొండచరియలలోనూ సముద్ర తీరానను వనాలలోనూ ఉద్యానవనాలలోనూ దిగి ఉంది. కొంత సైన్యము అప్పుడే సముద్రాన్ని దాటి వచ్చింది. కొంత సైన్యము సముద్రాన్ని దాటి వస్తూ ఉంది. మరికొంత సైన్యము సముద్రాన్ని దాటి రావడానికి అవతలి ఒడ్డున సిద్ధముగా ఉంది. అట్లా ఆ వానర సైన్యము భూమిఅంతటా నానావిధాలుగా వ్యాపించిఉంది. అక్కడ విడిది చేసిన మహాబలవంతులు సింహనాదాలు చేస్తూ ఉన్నారు. ఆ మహాసైన్యము క్షోభపెట్టనలవికాని మహాసముద్రమువలె శుకసారణులకు తోచింది.

ఆ శుకసారణులు వానరబలాన్ని అంతా పరిశీలించినారు. వాండ్లు ఎంతో ప్రచ్ఛన్నముగా తిరిగినారు. అయినప్పటికిన్నీ మహా తేజోవంతుడు విభీషణుడు వాండ్లను పట్టుకొన్నాడు. అంతట వాండ్లను రాముడికి ఒప్పగించి "ఓ రామా, నీవు పరపురంజయుడవు. వీండ్లు ఇద్దరూ రావణాసురుడి మంత్రులు. వీడి పేరు శుకుడు. వీడు సారణుడు. వీండ్లు మన రహస్యాలను తెలుసుకొనిపోవడానికి గూఢచారులుగా వచ్చినారు" అని చెప్పినాడు. అప్పుడు ఆ రాక్షసులు ఇద్దరూ రాముణ్ణి చూచి భయపడిపోయినారు. తమ ప్రాణాల మీద ఆశవదలుకొన్నారు. భయముతోనూ దిగులుతోనూ చేతులు జోడించి "ఓ పుణ్యాత్ముడా, ఈ వానరబలాన్ని చూచి ఇక్కడి సంగతులు అన్నీ తెలుసుకొని రమ్మని మమ్ములను మా ఏలిక రావణాసురుడు పంపించినాడు. మేము అందుకోసమే ఇక్కడికి వచ్చినాము" అని చెప్పినారు.

సర్వప్రాణికోటినీ ఎప్పుడూ కాపాడే ఆ రాముడు వాండ్లను ఇద్దరినీ చూచి నవ్వుతూ "మా బలాన్ని అంతా చూచినట్లయితే మమ్ములను చక్కగా పరీక్షించి ఉన్నట్లయితే మీ ప్రభువు రావణాసురుడు మీకు చెప్పిన విషయాలు అన్నీ తెలుసుకొని ఉన్నట్లయితే మీ దారిన మీరు యథేష్టముగా పొండి. అట్లా కాకపోయినట్లయితే—ఏ కొంచెము అయినా చూడకపోయినట్లయితే అంతా చక్కగా చూచి మరీ పొండి. ఈ విభీషణుడే మా సేనను అంతా సాకల్యముగా మీకు చూపిస్తాడు. మీరు మాకు పట్టుపడ్డందుకు భయపడవద్దు. మీకు ప్రాణభయము ఏమీ అవసరములేదు. ఆయుధాలు లేనివాండ్లనూ దూతలనూ చంపివేయ కూడదు. మేము మిమ్ములను చంపము.

"ఓ విభీషణుడా, సామాద్యుపాయాలతో శత్రుపక్షాన్ని ఆకర్షించకలము అనుకొని వీండ్లు ఇక్కడికి వచ్చినారు. అట్లా వచ్చిన వీండ్లు ఇప్పుడు మనలను వేడుకొంటున్నారు. కాబట్టి వీండ్లను వదిలివేయవలసిందేను. "ఓ రాక్షసమంత్రులారా, మీరు లంకాపట్టణము పోయి మీ ఏలికకు నేను చెప్పే ఈ మాటలు ఎక్కువ తక్కువలు లేకుండా చెప్పండి.

"ఓ రావణాసురుడా, నీవు ఏ బలముతో నా భార్యను సీతను ఎత్తుకొని పోయినావో ఆ బలాన్ని అంతా నీవు ఇప్పుడు చూపించవలెను. నీ సేనలనూ నీ బంధువులనూ సమకూర్చుకొని యుద్ధానికి సిద్ధముగా ఉండు. నేను రేపు ప్రాతఃకాలాన నీ లంకాపట్టణబహిర్ద్వారాలనూ ప్రాకారాలనూ బద్దలుకొట్టి నీ రాక్షససేనను అంతా ధ్వంసము చేసివేస్తాను. చూచుకో. ఓ రావణుడా, దేవేంద్రుడు వజ్రాయుధాన్ని వదిలేట్టు భయంకరము అయిన బాణాలు నేను నీమీద రేపు ఉదయము వదులుతాను. నా కోపాన్ని తీర్చుకొంటాను. నీవు నీ బలముతో సిద్ధముగా ఉండు" అని శుకసారణులతో చెప్పినాడు.

ఆ మాటలకు అప్పుడు ఆ ధర్మవత్సలుణ్ణి రాముణ్ణి జయించమని అభినందించి ఆ శుకసారణులు లంకాపట్టణానికి పోయినారు. వాండ్లు అంతట రావణాసురుడిదగ్గరకు పోయి "రాజా, మేము

పోయి వానరబలాలను అన్నిటినీ చూచినాము. మమ్ములను విభీషణుడు పట్టుకొన్నాడు. ఆ ధర్మాత్ముడు ఆ మహాత్ముడు రాముడు మమ్ములను వదిలిపెట్టించినాడు. రాజా, ఆ కాంతిమంతుడూ అతని తమ్ముడు లక్ష్మణుడూ మీ తమ్ముడు విభీషణుడూ మహాతేజోవంతుడూ దేవేంద్రుడివంటి పరాక్రమవంతుడూ అయిన సుగ్రీవ దిక్పాలకులవంటివారు. శూరులు. అస్త్రవేత్తలు. దృఢపరాక్రము ఆ నల్గురు ఏకము అయినారు. వానరసేనలను అట్లా ఉంచు రామ లక్ష్మణ విభీషణ సుగ్రీవులు నలుగురే లంకాపట్టణాన్ని బహిర్ద్వారాలతోనూ ప్రాకారాలతోనూ పెళ్ళగించివేయకలరు.

"ఓ రాజా, మేము రాముడి ఆకారాన్ని చూచినాము. అతని ఆయుధాలను చూచినాము. లక్ష్మణ విభీషణ సుగ్రీవులు ముగ్గురూ అక్కరలేదు. రాముడు ఒక్కడే ఈ లంకాపట్టణాన్ని అంతా సంహారము చేసివేయకలడు. రామ లక్ష్మణ సుగ్రీవులు కాపాడుతూ ఉన్న ఆ వానరబలముమీదికి సురాసురులు అందరూ ఏకముఅయి దేవేంద్రుడితో కూడా ఎత్తివచ్చినా ఏమీ చేయలేరు. రాజా, పది యోజనాల వెడల్పునా నూరు యోజనాల పొడుగునా సముద్రానికి సేతువు కట్టినారు. మేము ఆ సేతువును కన్నులారా చూచినాము. ఆ సేతువుమీదినుంచే వానరబలముఅంతా సముద్రాన్ని దాటి వచ్చింది. రాముడు ఇప్పుడు సముద్రతీరాన విడిది చేసి ఉన్నాడు. వానరబలము చాలాభాగము సముద్రాన్ని దాటి వచ్చింది. ఇంకా కొంత వానరసేన సముద్రాన్ని దాటి వస్తూఉంది. ఆ వానరసేనలకు అంతు కనపడలేదు. ఓ రాజా, వానరవీరులు అందరూ మహాబలవంతులు. అందరూ యుద్ధోత్సాహముతో ఉన్నారు. ఏక్షణము అయినా యుద్ధము చేయకలరు. వాండ్లతో యుద్ధము వద్దు. నీవు కోపము వదిలిపెట్టు. శాంతించు. రాముడికి సీతాదేవిని ఇవ్వు" అని శుకసారణులు చెప్పినారు.

౨౬

శుకసారణులు నిర్భయముగా చెప్పిన మంచిమాటలు విని రావణాసురుడు "ఓ మంత్రులారా, దేవదానవగంధర్వులు అందరూ ఏకము

అయి యుద్ధము చేయడానికి వచ్చినా సమస్తలోకాలు వచ్చి నన్ను బెదిరించినా నేను సీతను రాముడికి ఇవ్వను. ఓ సారణుడా, నీవు మెత్తనివాడవు. నిన్ను వానరులు కొట్టినారు ఏమో. నీవు బాగా భయపడిపోయినావు. అందువల్ల సీతను మళ్ళీ ఇచ్చివేయమని చెప్పుతున్నావు. ఏశత్రువు నన్ను యుద్ధములో జయించకలడో నీవు చెప్పు'' అని అడిగినాడు.

ఇట్లా కఠినముగా మాట్లాడి ఆ కాంతిమంతుడు రావణాసురుడు కుపితుడు అయిపోయి శుకసారణులను వెంట ఉంచుకొని ఆ వానర సేనలను చూడవలెను అనుకొని మంచుమాదిరిగా తెల్లగా ఎన్నో తాటిచెట్ల ఎత్తున ఉన్న తన ప్రాసాదము ఎక్కినాడు. సముద్ర ప్రాంతములోనూ పర్వతాలమీదనూ వనాలలోనూ భూమి అంతటానూ ఉన్న వానరసైన్యాన్ని చూచినాడు. లెక్కవేయడానికి అలవికాకుండా అపారముగా ఉన్న ఆ వానర మహాసైన్యాన్ని చూచి సారణుడితో ''ఓ సారణుడా, ఈ వానరముఖ్యులలో శూరులు ఎవరు? వీరిలో మహోత్సాహములో ముందుగా పోరాటానికి వచ్చేవారు ఎవరు? సుగ్రీవుడు ఎవరిమాట వింటాడు? సేనానాయకులకు సేనానాయకుడు అయినవాడు ఎవడు? సారణుడా, ఈ వానర వీరులలో ముఖ్యులు అయినవాండ్లు ఎవరు? ఉన్నది ఉన్నట్లు చెప్పు'' అని అడిగినాడు.

ఆ వానరులలో ముఖ్యులు అయిన వారిని అందరినీ తెలుసుకొని వచ్చిన ఆ సారణుడు ''ఓ రాజా, అడుగో నీలుడు. వేలకు వేలమంది చుట్టూ ఉన్నారు. లంకాభిముఖుడు అయి సింహనాదము చేస్తున్నాడు. వాడి మహాఘోషానికి లంకాపట్టణబహిర్ద్వారాలూ ప్రాకారాలూ పర్వతాలూ వనాలూ పట్టణము అంతానూ చలించి పోతున్నవి. మహాబలవంతుడు అయిన సుగ్రీవుడు సేనాముఖాన ఉన్నాడు. వీడు. ఈ నీలుడే వానరసేనానాయకుడు.

''అడుగో పరమపరాక్రమవంతుడు అంగదుడు. చేతులు పయికిఎత్తి లంకాభిముఖుడు అయి కోపములో విజృంభించి నేల మీద నడిచి వస్తూఉన్నాడు. పర్వతశిఖరము అంత ఎత్తున పద్మకింజల్కవర్ణములో కనబడుతున్నాడు. దశదిశలూ మారుమోగి

పొడవైన తోకను అమితవేగముతో పదే పదే నేలకువేసి కొట్టుతున్నాడు. ఈ అంగదుణ్ణి వానరరాజు సుగ్రీవుడు యువరాజుగా అభిషేకించినాడు. వీడు వాలి పుత్రుడు. తండ్రితో సరిసమానము అయిన పరాక్రమవంతుడు. సుగ్రీవుడికి ఎప్పుడూ ఇష్టుడు. దేవేంద్రుడికి పనిచేసిపెట్టడానికి వరుణదేవుడివలె రామకార్యార్థము పరాక్రమించి నిన్ను యుద్ధానికి ఆహ్వానిస్తున్నాడు.

"అదుగో వాడే జనకాత్మజను సీతాదేవిని చూడవచ్చిన రామహితైషి హనుమంతుడు. ఈ వానరసైన్యము అంతా ఇక్కడికి రావడానికి వాడే కారకుడు. ఆ వీర్యవంతుడు ఆ దుర్జయుడు అనేక వానరయూథాలతో నీమీదికి రావడానికి సిద్ధపడుతున్నాడు.

"అంగదుడి వెనుక అదుగో నలుడు. వాడే సముద్రానికి సేతువు కట్టినవాడు. వీరుడు. తన సేనలతో యుద్ధానికి సంసిద్ధముగా ఉన్నాడు. చందనవనములో నివసించే పరాక్రమవంతులు అయిన వానరులు అందరూ ఆ నలుడివెంట వచ్చినారు. వాండ్లు అందరూ దేహాలు నిగిడ్చి సింహనాదాలు చేస్తూఉన్నారు. ఈ పదివేలకోట్ల ఎనిమిదిలక్షల వానరులూ భయంకరులు. క్రూరులు. చండపరాక్రములు. ఈ నలుడు తాను ఒక్కడే లంకాపట్టణాన్ని నాశనము చేస్తాను అని చెప్పినాడు.

"అదుగో శ్వేతుడు అనేవాడు. వెండివలె తెల్లగాఉన్నాడు. వాడు యుద్ధచపలుడు. భయంకరపరాక్రముడు. బుద్ధిమంతుడు. ముల్లోకాలలోనూ పరమపరాక్రమవంతుడు అని ప్రసిద్ధికెక్కినాడు. అదుగో వాడు ఆ శ్వేతుడు సుగ్రీవుడిదగ్గరకు గబగబా పోయి వానర బలాన్ని విభజిస్తున్నాడు. యోధులను ప్రోత్సాహపరుస్తున్నాడు. అదుగో వాడు అక్కడినుంచి మళ్ళీ ఎక్కడికో పోతున్నాడు చూడు.

"అదుగో కుముదుడు. వాడు గోమతీనదీతీరాన వివిధ శిఖరాలతోనూ మనోహరముగా ఉండే సంకోచనము అనే పర్వతము మీద నివసిస్తూ అక్కడి వానరరాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. ఈ కుముదుడు ఒకకోటి వానరవీరులతో వచ్చినాడు. అదుగో వాడి తోకవెంట్రుకలు పొడుగుగానూ ఎర్రగానూ పచ్చగానూ తెల్లగానూ ఉన్నవి. ఆ తోక రంగురంగులతో కనబడుతున్నది.

ఈ కుముదుడున్నూ తన సేనలతో లంకాపట్టణాన్ని నాశనముచేసి వేయ నిశ్చయించుకొన్నాడు.

"ఓ రాజా, అదుగో రంభుడు. సింహసమానపరాక్రమవంతుడు. కపిలవర్ణముతో దీర్ఘనేత్రాలతో నిశ్చలముగా నిలుచుని ఉన్నాడు. తన నేత్రాలతో దహించివేసేటట్టుగా లంకాపట్టణము వంక చూస్తున్నాడు. మూటముప్ఫయిలక్షలమంది వానరవీరులతో వచ్చినాడు. ఆ వానరులు అందరూ శూరులు. క్రూరులు. చండపరాక్రములు. ఈ రంభుడు వింధ్యపర్వతమూ సహ్యాపర్వతమూ కృష్ణగిరి అనే మూడు పర్వతాలమీద ఉంటూఉన్న వానరులను పరిపాలిస్తూఉన్నాడు.

"అదుగో. శరభుడు అనే వానరయూథపతి. వాడి చెవులు నిక్కపొడుచుకొని ఉన్నవి. మాటిమాటికీ వాడు ఆవలిస్తూ ఉన్నాడు. ఈ శరభుడు చావుకు వెరవుడు. యుద్ధములో ఎటువంటి సమయములోనయినా పరుగెత్తి పారిపోడు. కోపములో వణకిపోతూ పదే పదే ఎగా దిగా చూస్తూ ఉన్నాడు. తన తోకను తిప్పుతూ సింహనాదము చేస్తున్నాడు. మహాబలవంతుడు. భయము అనేది ఎరగడు. మనోహరము అయిన సాల్వేయపర్వతముమీద ఉన్న వానరులకు అందరికీ వీడు రాజు. రాజా, ఈ శరభుడి చేతికింద విహారులు అనే ప్రసిద్ధవానరోత్తములు ఒక నలభైలక్షలమంది ఉన్నారు. వాండ్లు అందరూ మహాబలవంతులు.

"అదుగో పనసుడు. పర్వతాకారుడు. ఆకాశాన్ని ఆవరించిన మేఘము ఉరుములు ఉరిమేట్టుగా వీడు భేరీలవంటి ధ్వనితో భయంకరముగా సింహనాదము చేస్తూ ఉన్నాడు. వీడు యుద్ధాన్ని కాంక్షిస్తున్నాడు. దేవతల మధ్యను దేవేంద్రుడివలె వానరోత్తముల మధ్యను కూర్చుని ఉన్నాడు. వీడు భయంకరుడు. యుద్ధములో ఎదిరించ నలవికానివాడు. వీడికన్నా వీరుడు ఇంకొకడు లేడు. వీడు పారియాత్రపర్వతముమీద వానరులను ఏలుతున్న రాజు. వీడి కింద ఏభైలక్షలమంది వానరోత్తములు వేరే వేరే యూథాలుగా ఉన్నారు.

"అదుగో వినతుడు. సముద్రతీరాన రెండవ సముద్రమువలె మహాభయంకరముగా వస్తూఉన్న సేనాసమూహముతో శోభిస్తూ

ఉన్నాడు. వీడు దర్దురపర్వతముతో సరిసమానము అయినవాడు. పర్ణాసా నదీప్రాంతములో వానరులను పరిపాలించే రాజు. వీడి సైన్యములో అరవై లక్షలమంది వానరవీరులు ఉన్నారు.

"అదుగో క్రోధనుడు. నిన్ను యుద్ధానికి పిలుస్తున్నాడు. వీడితో పరాక్రమవంతులూ బలవంతులూ అయిన వానరులు యూథాలు యూథాలుగా ఉన్నారు.

"అదుగో, గవయుడు. బలదర్పితులు అయిన వానరులను అందరినీ తృణీకరించి యుద్ధోత్సాహముతో తన ఎర్రటి దేహాన్ని పెంచుతున్నాడు. పరమ తేజోవంతుడు. కోపిష్ఠివాడు. నీమీద పడవలెను అనుకొంటున్నాడు. వీడికింద 'డెబ్బయిలక్షలమంది వానరవీరులు ఉన్నారు. వీడు తన సేనతో వచ్చి లంకాపట్టణాన్ని అంతా నాశనముచేయ నిశ్చయించుకొన్నాడు.

"రాజా, ఈ వానరయూథపతులు అందరూ జయించనలవి కాని శూరులు. బలవంతులు. కామరూపులు. వీండ్లకు ఒక్కొక్కరికి ఒక్కొక్క గొప్పసైన్యము ఉంది.

౨౭

"రాజా, రామకార్యార్థము తమ ప్రాణాలనుఅయినా లెక్కచేయకుండా పరాక్రమముతో పోరాడే వానరయూథపతులను గురించి చెప్పుతాను చూడు. అదుగో హరుడు. బాగా పొడుగాటి తోకతో ఉన్నాడు చూడు. ఆ తోకమీద వెంట్రుకలు పొడుగుగా పెరిగినవి. ఆ వెంట్రుకలు ఎర్రగా తెల్లగా పసుపుగా నిగనిగలాడుతూ ఉన్నవి వాడు ఆ తోకను పయికి ఎత్తుతూఉంటే సూర్యుడు తన కిరణాలను నేలమీద వెదజల్లుతున్నట్టుగా ఉంది. వీడు యూథపతి. వీడూ వీడి సైనికులూ ఆ వానరరాజు సుగ్రీవుని కింకరులు. ఈ వానరులు వందలకొద్దీ వేలకొద్దీ చెట్లను పట్టుకొని లంకాపట్టణము ఎక్కడానికి ఈ హరుడి వెనుక గబగబా వస్తూ ఉన్నారు. హరుడు వెయ్యికోట్లమంది వానరులతో వచ్చినాడు. నిన్ను తానే జయించవలెను అనుకొంటున్నాడు.

"రాజా, అదుగో భల్లూకవీరులు. నీలమేఘాలవలెనూ కాటుకకొండలవలెనూ వస్తూఉన్నారు. వారిని లెక్కవేయడానికి

అలవికాకుండానూ ఇంతదూరమువరకూ ఉన్నారు అని నిర్దేశించడానికి వీలుకాకుండానూ మహాసముద్రమువలె వస్తున్నారు చూడు. వీండ్లు పర్వతప్రదేశాలలోనూ నిమ్నోన్నత ప్రదేశాలలోనూ నదీతీరాల లోనూ నివసిస్తూఉన్నారు. వీండ్లు అందరూ పరమభయంకరులు. నిన్ను ఎదిరించడానికి వస్తున్నారు

"అదుగో చూడు—నీలమేఘాలమధ్యను పర్జన్యుడివలె భల్లూక వీరులమధ్యను ఉన్నవాడు ధూమ్రుడు. వాడే సమస్త భల్లూక వీరులకున్నూ అధిపతి. నర్మదానదీజలాలు తాగుతూ వాడు ఋక్షవంతము అనే పర్వతముమీద నివసిస్తూఉన్నాడు. అదుగో వాడి పక్కనే పర్వతాకారుడు మరి ఒక భల్లూకవీరుడు కనపడుతున్నాడు. వాడు ధూమ్రుడి తమ్ముడు. రూపములో అన్నను పోలి ఉన్నాడు. అయితే పరాక్రమములో అన్నకన్నా అధికుడు.

"వాడే జాంబవంతుడు. మేటి సేనానాయకుడు. మహా పరాక్రమవంతుడు. గురుశుశ్రూష చేసినాడు. యుద్ధములో వాణ్ణి ఎవరూ ఎదిరించలేరు. వాడు బుద్ధిమంతుడు. దేవాసురయుద్ధములో దేవేంద్రుడికి చాలాసాయముచేసి ఈ జాంబవంతుడు దేవేంద్రుణ్ణి మెప్పించి ఎన్నో వరాలు సంపాదించినాడు.

"మహాకాయాలతో ఉన్న ఈ భల్లూకవీరులు అందరూ రాక్షసులవంటి వాండ్లు. పిశాచాలవంటి వాండ్లు. అగ్నిహోత్రుడితో సరిసమానము అయిన తేజోవంతులు. అయితే పెద్ద పెద్ద రోమాలతో నల్లగా కనపడుతున్నారు. పర్వతాల పయికి ఎక్కి పెద్ద పెద్ద మేఘాలవంటి రాళ్ళను కిందికి ఇప్పుడు పడదోస్తూఉన్నారు. వీండ్లకు చావుఅంటే భయములేదు.

"రాజా, అదుగో ఎగురుతూ ఉన్నాడు దంభుడు అనేవాడు. వానరసమూహాలు ఆశ్చర్యముతో వాణ్ణి చూస్తూఉన్నవి. ఈ దంభుడు మహాబలసంపన్నుడు. వానర సేనానాయకులలో ముఖ్యుడు. వీడు వీడి సైన్యముతో దేవేంద్రుణ్ణి మెప్పించినాడు.

"రాజా, అదుగో సన్నాదుడు అనే వానరవీరుడు. వాడు వానరులకు అందరికీ పితామహుడు. వాడు ఒక్క అడుగులో ఒక్క యోజనముదూరము పర్వతాన్ని దాటిపోగలడు. ఆదేవిధముగా

పయికి ఒక్క యోజనము ఎత్తున దేహముతో లేవకలడు. చతుష్పాద జంతువులలో దేనికిన్నీ వీడికన్నా పెద్దదేహము లేదు. పూర్వము వీడు దేవేంద్రుడితో యుద్ధము చేసినాడు. ఓడిపోలేదు. వీడు అపరాజితుడు. దేవేంద్రుడితో సరిసమానము అయిన పరాక్రమవంతుడు. దేవాసురయుద్ధములో దేవతలకు తోడుపడడానికి వీడు అగ్నిహోత్రుడికీ ఒక గంధర్వకన్యకూ పుట్టినాడు.

"అడుగో క్రథనుడు అనే వానరవీరుడు. వాడు యుద్ధాసక్తుడు. యుద్ధములో అపజయము ఎరగడు. వెయ్యికోట్లమంది వానరులతో వచ్చినాడు. వీడు హిమాలయాపర్వతముమీద కిన్నరులు సేవిస్తూ మీా అన్న కుబేరుడు విహరిస్తూనూ ఉండే జంబూవనములో ఉంటూ ఉన్నాడు. వీడు ఒక్కడూ తన సైన్యముతో నిన్నూ నీ లంకాపట్టణాన్నీ నాశనము చేసివేయవలెను అనుకొంటున్నాడు.

"ఇదుగో, ప్రమాథి అనే వానరవీరుడు. వీణ్ణి చూడు. పూర్వము శంబసాదనుడు అనే రాక్షసుడు గజరూపము ధరించి మునిజనులను బాధ పెట్టసాగినాడు. అప్పుడు ఆ మునిజనులు నియోగించినందువల్ల ఆ గజాకారరాక్షసుణ్ణి కేసరి అనేవాడు చంపివేసినాడు. అప్పుడు ఏనుగులకున్నూ వానరులకున్నూ వైరము వచ్చింది. ఆ వైరాన్ని పురస్కరించుకొని ఇప్పటికిన్నీ ఈ ప్రమాథి కనపడ్డ మదపుటేనుగులను పట్టుకొని పర్వతానికి వేసికొట్టి చంపివేయడమో పర్వతాన్నే ఏనుగులమీాద వేసికొట్టి చంపివేయడమో పెద్ద పెద్ద వృక్షాలను పెళ్ళగించి వాటితో ఏనుగులను కొట్టడమో ఏనుగులనే చెట్టుకు వేసికొట్టి చంపడమో చేస్తూఉంటాడు. వీడు గంగానది సమీాపాన మందరపర్వతమువంటి ఉశీరబీజము అనే పర్వతముమీాద దేవలోకములో దేవేంద్రుడివలె విహరిస్తూఉంటాడు. ఆ గిరిగుహాలలో నివసిస్తూ ఆ గంగానదీతీరాలలో తిరుగుతూ పోరాడుతూ ఉంటాడు. వీడు వెయ్యిలక్షలసైన్యముతో వచ్చినాడు. చూడు, వీడి సైనికులు అందరూ మహాబలవంతులు. ఉత్సాహముతో పరాక్రమముతో గర్వముతో గర్జిస్తున్నారు. వీడి సైనికుల సంరంభము నుంచి గాలికి దుమ్ము ఎర్రగా వివిధవర్ణాలతోనూ పయికి లేగుతూ ఉంది. ఆ మహాసైన్యముమధ్యను ప్రమాథి మహామేఘమువలె కనపడుతున్నాడు.

"రాజా, అడుగో, గోలాంగూలాధీశ్వరుడు గవాక్షుడు. ఒక కోటిమంది గోలాంగూలవీరులను వెంటపెట్టుకొని సేతువుమీది నుంచి వస్తూఉన్నాడు. తెల్లనిముఖాలతో వస్తూఉన్న ఆ బలవంతులను చూడు. ఈ ప్రమాథి తాను ఒక్కడే తన సేనలతో లంకా పట్టణాన్ని సర్వనాశనము చేసివేస్తాను అని చెప్పినాడు.

"ఓ రాజా, ఏపర్వతముమీద తియ్యని పూవుతేనెలు తాగడానికి తుమ్మెదలు ఎప్పుడూ మూగుతూ ఉంటవో ఏపర్వతము మీద ఫలవృక్షాలు కోరుకొన్న పండ్లు అన్నీ పండుతూ ఉంటవో ఏపర్వతముమీదకి పోగానే సూర్యుడు ఆ పర్వతమువలె స్వర్ణ రూపము ధరిస్తాడో ఏపర్వతముమీద మృగాలూ పక్షులూ జంతువులూ సమస్తప్రాణులూ బంగారురంగుతో భాసిస్తూ ఉంటవో ఏపర్వతనెత్తాలలో మహర్షులు ఎప్పుడూ నివసిస్తూ ఉంటారో ఏపర్వతముమీద ఏటికి ఏడాదీ ఫలవృక్షాలుఅన్నీ అతిరుచ్యము అయిన పండ్లను కాస్తూ ఉంటవో రాజా, నీవు రాక్షసులమధ్యను ఉంటూఉన్నట్టు అరవైవేల బంగారుకొండలమధ్యన ఏపర్వతము ఉంటూఉందో ఆ కాంచనపర్వతముమీద ఎప్పుడూ విహరించే వానరముఖ్యులకు అందరికీ ముఖ్యుడు అయిన కేసరి అడుగో, వాడి వెంటవచ్చిన వానరులనుచూడు. కపిలముఖాలతోనూ శ్వేతముఖాల తోనూ తామ్రముఖాలతోనూ మధుపింగళముఖాలతోనూ తీక్ష్ణము అయిన కోరలతోనూ ఆయుధాలుగా ఉపయోగించే నఖాలతోనూ నాలుగు కోరల సింహాలవలెనూ దగ్గరకుపోనలవికాని పెద్దపులుల వలెనూ కనపడుతున్నారు. వాండ్లు అందరూ అగ్నిహోత్రముతో సరిసమానము అయిన తేజోవంతులు. మంటలుమండే విషముకక్కే మహాసర్పాలవంటి వాండ్లు పెద్ద పెద్ద తోకలతో మదపుటేనుగుల వలెనూ మహాపర్వతాలవలెనూ గుండ్రని ఎర్రని కన్నులతో భయంకరులకు భయంకరులుగానూ భయంకరవేగముతో మేఘ గంభీరధ్వనులతో సింహనాదాలు చేస్తూఉన్నారు.

"రాజా, అడుగో విఖ్యాతవీరుడు శతవలి అనేవాడు. ఆ కనపడుతున్న వానరవీరులమధ్యన ఉన్నాడు. ఆ పరాక్రమవంతుడు జయముకోసము ఎప్పుడూ సూర్యుణ్ణి ఉపాసిస్తూ ఉంటాడు. వాడు

శూరుడు. బలవంతుడు. పౌరుషాన్ని ఏమాత్రమూ వదలడు. రాముణ్ణి సంతోషపెట్టడానికి తన ప్రాణాన్నిఅయినా వదిలిపెట్టుతాడు. వాడున్నూ తన సేనతో నీ లంకాపట్టణాన్ని కొట్టడానికి నిశ్చయించుకొన్నాడు.

“రాజా, అదుగో, గజుడూ గవాక్షుడూ గవయుడూ నలుడూ నీలుడూ. వాండ్లకు ఒక్కొక్కరికి పదికోట్ల సేన ఉంది. వాండ్లే కాకుండా వింధ్యపర్వతముమీద నివసిస్తూఉన్న వానరులు అనేక మంది వచ్చినారు.

“మహారాజా, ఈ వానరులు అందరూ మహాప్రభావులు. పర్వతాల అంతటి దేహాలతో కనపడుతున్నారు. అందరూ క్షణములో పర్వతాలను పగులకొట్టి ఈ భూమిఅంతటా వెదచల్లకలరు” అని సారణుడు చెప్పినాడు.

౨౮

ఈ విధముగా సారణుడు చెప్పడము అయిపోగానే శుకుడు రావణాసురుణ్ణి చూచి “రాజా, మదపుటేనుగులవలెనూ గంగాతీరాన మర్రిచెట్లవలెనూ హిమవత్పర్వతముమీది మద్దిచెట్లవలెనూ ఎట్టఎదుట మహాకాయాలతో కనపడుతూఉన్న వానరులను చూడు. వాండ్లు దుర్జయులు. మహాబలవంతులు. కామరూపులు. పోరాటములో దైత్యదానవులతో సరిసమానము అయినవాండ్లు. దేవతలవంటి పరాక్రమవంతులు. “ఈ వానరులు తొమ్మిదివేలకోట్లు ఏడువేలకోట్లు అనేకవేలశంఖాలూ అనేకవందలబృందాలుగా అంతులేకుండా ఉన్నారు. వీండ్లు అందరూ సుగ్రీవుడి అనుచరులు. దేవతలకూ గంధర్వులకూ వీండ్లు అందరూ పుట్టినారు. పుట్టుకతోనే కామరూపులు.

“దేవా, అదుగో ఇద్దరు యువకులు. తీర్చిదిద్దిన రూపాలతో కనపడుతున్నారు. చూడు. వాండ్లనే మైంద ద్వివిదులు అంటారు. పోరాటములో వాండ్లతో సరిసమానము అయినవాండ్లు ఎవరూ లేరు. బ్రహ్మానుగ్రహమువల్ల వాండ్లు ఉభయులూ అమృతపానము చేసినారు. యుద్ధములో వాండ్లు తమ పరాక్రమముతో లంకాపట్టణాన్ని కొట్టవలెను అని కాంక్షిస్తున్నారు.

"ప్రభూ, అదుగో, మరి ఇద్దరు—పర్వతాలు అంతటి మహాకాయులు. వారి చుట్టూ పదికోట్ల సైన్యము ఉంది. చూడు. వాండ్లు ఇద్దరూ లంకాపట్టణమువంక చూస్తున్నారు. వాండ్లనే సుముఖుడూ దుర్ముఖుడూ అంటారు. వాండ్లు ఇద్దరూ మృత్యుదేవుని పుత్రులు. తండ్రితో సరిసమానము అయినవాండ్లు.

"రాజా, అదుగో, చూడు. మదపుటేనుగువలె నిలుచుని ఉన్నాడు. వాడు ఇదివరకు లంకాపట్టణానికి వచ్చి సీతాదేవిని చూచి నీతో మాట్లాడిపోయినాడు. ఇప్పుడు మళ్ళీ వచ్చినాడు. వీడు కేసరి భార్యకు తొలిచూలు బిడ్డ. వాయుదేవుని పుత్రుడు. హనుమంతుడు అని ప్రసిద్ధికెక్కినాడు. మొట్టమొదట సముద్ర లంఘనము చేసిన వానరవీరుడు. వీడు క్రుద్ధుడు అయ్యేట్లయితే తన బలముతో సముద్రాన్నిఅయినా క్షోభపెట్టకల సమర్థుడు. వీడు వీడి చిత్తము వచ్చిన రూపము ధరించగలడు. బలవంతుడు. రూపసి. వాయుదేవుడివలె ఎక్కడికిఅయినా అనివార్యముగా పోతూఉంటాడు.

"ఈ హనుమంతుణ్ణి బాగా ఎరిగినవాడు నాకు ఒక ఆప్తుడు ఉన్నాడు. వాడు చెప్పింది చెప్పుతాను విను. వీడు పుట్టడమే ఎంతో బలముతోనూ దర్పముతోనూ పుట్టినాడు. వీడి పసితనములో ఒకనాడు ఉదయము వీడికి మంచి ఆకలివేసింది. ఉదయిస్తూ ఉన్న సూర్యబింబాన్ని చూచి అది ఒక పండు అనుకొన్నాడు. ఆ పండును తిని తన ఆకలి పోగొట్టుకోవచ్చును అనుకొని అప్పటికి అప్పుడు మూడువేల యోజనాలు పయికి ఎగిరిపోయినాడు. దేవతలూ మహర్షులూ సమీపించలేని సూర్యుణ్ణి వీడు పట్టుకోవలెను అనుకొన్నాడు. అయితే అప్పుడు వీడు అక్కడనుంచి ఉదయగిరిమీద పడిపోయినాడు. ఆ పడడము ఒక రాతిబండమీద పడ్డాడు. వీడి హనువు (చెక్కిలి పై భాగము) కొంచెము చితికిపోయింది. అందువల్ల వీణ్ణి హనుమంతుడు అన్నారు. వీడి అంతటి బలవంతుడు మరి ఒకడు లేడు. వీడి ఆకారమువంటి ఉన్నతాకారము మరి ఎవడికీ లేదు. వీడు మహాప్రభావము కలవాడు. వీడు మాట్లాడేటట్టు ఎవడూ మాట్లాడలేడు. వీడు ఒక్కడే ఎవరి సహాయమూ లేకుండా లంకాపట్టణాన్ని కొట్టవలెను అనుకొంటున్నాడు.

"ప్రభూ, అదుగో, హనుమంతుడి సమీపములో ఉన్న ఆ శూరుణ్ణి చూడు. అతడి దేహము శ్యామముగా ఉంది. నేత్రాలు పద్మపత్రాలుమాదిరిగా ఉన్నవి. అతడే ఇక్ష్వాకువంశములో పుట్టిన అతిరథుడు రాముడు. ఈ లోకములో పరాక్రమానికి ప్రసిద్ధి కెక్కినాడు. ఎవరు ఏమిచెప్పినా ధర్మము తప్పడు. వేదాధ్యయనము చేసినాడు. వేదవేత్తలలో ఉత్తముడు. బ్రహ్మాస్త్రము మొదలు అయిన సమస్త దివ్యాస్త్రాలు తెలిసినవాడు. తన బాణాలతో ఆకాశాన్ని భేదించివేయకలడు. ఆ బాణాలతోనే పర్వతాలను పగలగొట్టివేయకలడు. కోపానికి మృత్యువువంటివాడు. పరాక్రమానికి దేవేంద్రుడువంటివాడు. నీవు జనస్థానమునుంచి ఎత్తుకొని వచ్చిన సీత ఈతని భార్య. ఇప్పుడు నీతో యుద్ధముచేయడానికి వస్తూఉన్నాడు.

"ఈ రాముడికి కుడిపక్కను బంగారురంగులో ఉన్నవాడు ఈతని తమ్ముడు లక్ష్మణుడు, చూడు. విశాలముఅయిన వక్షస్థలము, ఎర్రని కన్నులు, ఉంగారాలు తిరిగిన నల్లని తలవెంట్రుకలు. ఈతడు రాముడికి ప్రాణప్రియుడు. నీతిజ్ఞుడు. యుద్ధకుశలుడు. సర్వాస్త్ర విశారదుడు. మహాకోపిష్టి. దుర్జయుడు. జయశీలి. బుద్ధిమంతుడు. రాముడి కుడిభుజము. అతడి బహిఃప్రాణము. వీడు రాముడి కోసము తన ప్రాణాన్నిఅయినా వదులుతాడు. యుద్ధములో సమస్త రాక్షసులను తానే సంహారము చేయవలెను అని వీడు అనుకొంటున్నాడు.

"రాజా, రాముడి ఎడమపక్కను విభీషణుడు తన నల్గురు మంత్రులతోనూ ఉన్నాడు చూడు. ఆ రాజరాజు ఆ శ్రీమంతుడు రాముడు విభీషణుణ్ణి లంకారాజ్యాధిపతిగా రాజ్యాభిషేకము చేసినాడు. అందువల్ల ఈ విభీషణుడు ఇప్పుడు మహాసంరంభముతో నీమీదికి యుద్ధానికి వస్తూఉన్నాడు.

"దేవా, అదుగో రాముడికి మధ్యను పర్వతమువలె అచలముగా నిలుచుని ఉన్నాడు. సర్వవానరరాజులకూ రాజు అయిన సుగ్రీవుడు. పర్వతాలు అన్నిటిలోనూ హిమవత్పర్వతమువలె ఈ సుగ్రీవుడు వానరరాజవంశములోపుట్టి తేజోబలముతోనూ జ్ఞానబలము

తోనూ వానరరాజులను అందరినీ అతిశయించినాడు. గుహారూపము అయిన కిష్కింధానగరములో చుట్టూ వనాలతోనూ వానర యూథపతులతోనూ పర్వతదుర్గములో ఉంటున్నాడు. చూడు. సుగ్రీవుడి వక్షస్థలముమీద లక్ష్మీప్రదము అయిన నూరు కమలాల కాంచనమాల శోభిస్తూఉంది. ఈ సుగ్రీవుడు రాముడిచేత వాలిని చంపించి దేవతలకూ మానవులకూ దుర్లభము అయిన ఆ కాంచనమాలనూ (వాలి భార్య అయిన) తారనూ సుస్థిరము అయిన వానరరాజ్యాన్నీ సంపాదించినాడు. రాజా, ఆ కాంచన మాలను ధరించేవాడు ఎన్నడూ యుద్ధములో ఓడిపోడు.

"ఓ ప్రభూ, నూరులక్షలు ఒకకోటి అనీ నూరువేలకోట్లు ఒకశంఖము అనీ నూరువేలశంఖాలు ఒక మహాశంఖము అనీ నూరు వేల మహాశంఖాలు ఒకబృందము అనీ నూరువేలబృందాలు ఒక మహాబృందము అనీ నూరువేల మహాబృందాలు ఒకపద్మము అనీ నూరువేలపద్మాలు ఒకమహాపద్మము అని, నూరువేలమహాపద్మాలు ఒకఖర్వము అనీ నూరువేలఖర్వాలు ఒకమహాఖర్వము అనీనూరువేల మహాఖర్వాలు ఒకసముద్రము అనీ నూరువేలసముద్రాలు ఒక ఓఘము అనీ నూరువేలఓఘాలు ఒకమహౌఘము అనీ పెద్దలు చెప్పతారు.

"రాజా, ఇప్పుడు వానరరాజు సుగ్రీవుడు నీ తమ్ముడు విభీషణుణ్ణీ అతని నలుగురు మంత్రులనూ కోటిమహౌఘాల వానర సేనను వెంటపెట్టుకొని నీమీదికి యుద్ధానికి వస్తున్నాడు.

"ఓ మహాప్రభూ, జ్వలిస్తూ ఉన్న గ్రహగోళమువలె వానర వాహిని వస్తూఉంది చూడు. మనము జయించేట్టు శత్రువులు ఓడి పోయేట్టు పెద్ద ప్రయత్నము వెంటనే చేయవలెను" అని శుకుడు చెప్పినాడు.

౨౯

శుకుడు చెప్పింది అంతా రావణాసురుడు విన్నాడు. రాముణ్ణీ అతని సమీపములో ఉన్న తన తమ్ముణ్ణి విభీషణుణ్ణీ రాముడి కుడి భుజమువంటివాడూ మహాపరాక్రమవంతుడూ అయిన లక్ష్మణుణ్ణీ భయంకరపరాక్రముడూ సర్వవానరరాజూ అయిన సుగ్రీవుణ్ణీ వానర

యూథపతులనూ చూచినాడు. కొంచెము కలవరపడ్డాడు. కోపము వచ్చింది. చేతులు జోడించి నేలవంక చూస్తూఉన్న శుకసారణులను ఉద్దేశించి కోపమువల్ల గద్గదస్వరముతో పరుషముగా "ఓ శుకుడా, ఓ సారణుడా, నిగ్రహానుగ్రహసమర్థుడు అయిన ప్రభువును ఆశ్రయించుకొని జీవించే మంత్రులు తమ ప్రభువుకు అప్రియవార్తలను ఎంతమాత్రమూ చెప్పకూడదు. ప్రతికూలముగా యుద్ధానికి వస్తూ ఉన్న శత్రువులను—అందులో యుద్ధారంభసమయములో స్తోత్రము చేయడము ఎంతమాత్రమూ తగినపని కాదు. రాజనీతిలో ముఖ్యము అయిన భృత్యధర్మము మీకు తెలియలేదు. ఆచార్యులనూ గురువులనూ వృద్ధులనూ మీరు సేవించింది అంతా వృథా అయిపోయింది. మీరు ఒకవేళ నీతిశాస్త్రము గట్టిగా చదివినప్పటికిన్నీ దాని అర్థము మీకు బోధపడలేదు. ఒకవేళ అర్థము బోధపడ్డప్పటికిన్నీ దానిని మీరు ఆచరణలో పెట్టలేదు. జ్ఞానభారాన్ని మాత్రము మోస్తున్నారు. మీరు మూర్ఖులు. మీరు నాకు మంత్రులు అయినారు. మీవల్ల నేను శత్రువుల చేతిలో ఎప్పుడో చచ్చిపోయి ఉండవలసింది. దైవయోగమువల్ల బ్రతికి ఉన్నాను.

"నేను ఆజ్ఞాపిస్తే—నా నోటిలోనుంచి మాటలు వెలువడే లోపలనే శుభాశుభాలు అన్నీ జరిగిపోతవి. అటువంటి నాతో మీరు కఠినముగా మాట్లాడినారు. మీకు మృత్యుభయము లేదో ఏమో! అడవిలో కార్చిచ్చుకు కొన్ని చెట్లు తగలబడిపోకుండా ఉంటే ఉంటవేమో! కాని నా కోపానికి గురి అయిన అపరాధులు క్షేమముగా ఉండడము మాత్రము ఉత్తది. మీరు ఇదివరకు చేసిన ఉపకారమునుంచి నా కోపము మెత్తపడుతున్నది. శత్రుపక్షాన్ని స్తోత్రముచేసే పాపిష్ఠులను మిమ్ములను నేను చంపివేసి ఉండేవాణ్ణి. మీరు మీ పదవులు వదలిపెట్టి పొండి. మిమ్ములను చంపివేయడము నాకు ఇష్టములేదు. మీరు ఇదివరకు చేసిన ఉపకారాలు జ్ఞాపకమువచ్చి మిమ్ములను మన్నించినాను. మీరు కృతఘ్నులు. నామీద మీకు ఉన్న స్నేహము ఇప్పుడు పెడముఖము అయింది. నిజముగా మిమ్ములను చంపివేయవలెను. కాని వదలివేస్తున్నాను" అంటూ రావణాసురుడు భయపెట్టినాడు.

ఈ మాటలకు ఆ శుకసారణులు ఇద్దరూ సిగ్గుపడిపోయినారు. రావణాసురుడు జయించవలెను అని స్తోత్రము చేసి వెళ్ళిపోయినారు. అప్పుడు రావణాసురుడు మహోదరుణ్ణి చూచి నీతిశాస్త్రవిశారదులు అయిన వేగులవాండ్లను పిలిపించవలసింది అని చెప్పినాడు. అతడు 'అట్లాగేను' అని చెప్పి వెంటనే వేగులవాండ్లు రావణాసురుడిదగ్గరకు రావలెను అని అజ్ఞాపించినాడు. రాజశాసనాన్ని శిరసావహించి గూఢచారులు అప్పటికి అప్పుడు రావణాసురుడిదగ్గరకు పోయి జయము ఆశీర్వదించి చేతులుజోడించి నిలుచున్నారు ఆ గూఢ చారులు విశ్వసనీయులు. శూరులు. రాజభక్తిపరాయణులు. శత్రు భయము లేనివాండ్లు. రాక్షసాధిపతి రావణాసురుడు వాండ్లను అందరినీ చూచి "ఓ చారులారా! మీరు ఇక్కడనుంచి ఇప్పుడే వానరసైన్యములోకి పోవలెను. రాముడి యుద్ధప్రయత్నము ఏమిటో పరిశీలించి మీరు తెలుసుకోవలెను. అతనికి మంత్రులు ఎవరో ఆ మంత్రులలో అతని అంతరంగికులు ఎవరో అతడు ఎవరితో ఎక్కువ స్నేహముతో ఉంటున్నాడో కనిపెట్టవలెను. ఆ రాముడు ఎట్లానిద్రపోతాడో ఆ యా పనులు అతడు ఎట్లాచేస్తాడో ఇంకా అతనినిగురించిన సమస్త సంగతులూ నిశ్శేషముగా తెలుసుకొని మీరు తిరిగి రండి—ఓ చారులారా, బుద్ధిమంతులు అయిన రాజులు తమ చారులవల్ల సమస్తసంగతులూ తెలుసుకొని అతిస్వల్ప ప్రయత్నముతో శత్రువులను జయిస్తూఉంటారు. కాబట్టి మీరు ఇప్పుడు మీ ప్రజ్ఞతో సర్వమూ తెలుసుకొని రావలెను" అని చెప్పినాడు.

"అట్లాగేను" అని చెప్పి ఆ గూఢచారులు పరమసంతోష ముతో శార్దూలుడివెనక రావణాసురుడికి ప్రదక్షిణముచేసి రామ లక్ష్మణులు ఉన్నచోటికి ప్రయాణముఅయి పోయినారు. ప్రచ్ఛన్న ముగా సుగ్రీవవిభీషణులనూ రామలక్ష్మణులనూ చూచినారు. వానరసైన్యాన్ని ఆ నలుగురినీ చూచి కలవరపడిపోయినారు. అట్లా వాండ్లు ప్రచ్ఛన్నముగా ఆ వానరసైన్యములో తిరుగుతూఉండగా హఠాత్తుగా విభీషణుడు వాండ్లను పట్టుకొన్నాడు. వాండ్లలో శార్దూలుడు పరమపాపిష్ఠివాడు అని వాణ్ణి వానరులకు ఒప్పగించి

నాడు. వానరవీరులు తక్కినవాండ్లనుకూడా పట్టుకొన్నారు. ఆ పరమ పరాక్రమవంతులు వానరులు ఆ రాక్షస గూఢచారులను చంపివేయపోతూఉంటే రాముడు అడ్డుపడి వాండ్లను అందరినీ విడిపించివేసినాడు. ఆ రాక్షస గూఢచారులు అట్లా వానరులచేత దెబ్బలుతిని నిట్టూర్పులు విడుస్తూ విమనస్కులు అయిపోయి మళ్ళీ లంకాపట్టణానికి వచ్చినారు.

ఆ యా వృత్తాంతాలు తెలుసుకొనేటందుకు ఎప్పుడూ బయట తిరుగుతూఉండే ఆ మహాబలవంతులు ఆ నిశాచరగూఢచారులు సువేలపర్వతప్రాంతములో వానరసైన్యముతో ఉన్న ఆ భీమబలుణ్ణి రాముణ్ణిగురించి విన్నవించడానికి రావణాసురుడిదగ్గరకు పోయినారు.

౪౦

క్షోభపెట్ట నలవికాని వానరసైన్యముతో రాముడు సువేల పర్వతప్రాంతములో ఉన్నాడు. అని ఆ గూఢచారులు రావణాసురుడికి తెలియచెప్పినారు. అది విని రావణాసురుడు కొంచెము కలవరపడి శార్దూలుణ్ణిచూచి "ఓ నిశాచరుడా, నీ ముఖము ఎప్పటి మాదిరిగా లేదు. దీనముగా ఉన్నావు. క్రుద్ధులు అయిన శత్రువుల చేతులలో నీవు చిక్కలేదుకదా" అని అడిగినాడు.

ఆ శార్దూలుడు భయవిహ్వలుడు అయిపోయి రాక్షసరాజ శార్దూలాన్నిచూచి మెల్లగా "ప్రభూ, ఆ వానరపుంగవుల మధ్యకు పోయి వాండ్లనుగురించి విచారించి తెలుసుకోడము వేగులవాండ్లకు అలవిఅయ్యేపని కాదు. వాండ్లు అందరూ పరాక్రమవంతులు, బలవంతులు. పయిగా వాండ్లను అందరినీ రాముడు కాపాడుతున్నాడు. వాండ్లతో మాట్లాడడము అశక్యము. ఇక వాండ్లను పరీక్షించడము అనేది అసలే లేదు. మార్గాలు అన్నిటిలోనూ పర్వతాలవంటి వానరులు కావలికాస్తున్నారు. ఆ వానరసైన్యములోకి మేము పోయినాము. నేను అటూ ఇటూ అయినా తిరగలేదు. నన్ను గుర్త పట్టినారు. విభీషణుడి సచివులు నన్ను పట్టుకొన్నారు. బలవంతముగా నన్ను నేలమీద పొర్లించినారు. వానరులు క్రుద్ధులు అయిపోయినారు. వాండ్లు నన్ను పిడికిళ్ళతో పొడిచినారు. కోరలతో

కొరికినారు. అరచేతులతో చరిచినారు. కాళ్ళతో తన్నినారు. కొట్టినారు. గుద్దినారు. సైన్యము అంతటా నన్ను తిప్పినారు. నా దేహము అంతటా నెత్తురు కమ్ముకొన్నది. నా అవయవాలు స్వాధీనము తప్పిపోయినవి. వాండ్లు నన్ను చావకొట్టుతూ ఉంటే నేను చేతులు జోడించి ప్రార్థించినాను. అంతట వాండ్లు నన్ను రాముడిదగ్గిరకు తీసుకొనిపోయినారు. ఆ రాముడు నన్ను కాపాడినాడు. నేను ఎట్లాగో బ్రతికి బయటపడ్డాను.

"రాజా, ఆ రాముడు మహాసముద్రానికి రాళ్లు వేసి సేతువు కట్టించినాడు. ఆ సేతువుమీదనుంచే సముద్రాన్ని దాటి వానర సైన్యముతో వచ్చినాడు. ఇప్పుడు సువేలపర్వతముమీద ససైన్యముగా సాయుధుడుగా ఉన్నాడు. అతడు ఇదివరకు నన్ను వదిలిపెట్టించక పూర్వమే వానరసైన్యాన్నిఅంతా గరుడవ్యూహాకారముగా ఉంచినాడు. రాముడు లంకాపట్టణానికి రావడానికి సిద్ధముగా ఉన్నాడు. అచిరకాలములోనే వచ్చి పట్టణప్రాకారాలను పడకొట్టుతాడు. నీవు సీతనుఅయినా ఇచ్చివేయవలెను లేదా గొప్పయుద్ధముఅయినా చేయవలెను. ఈ రెండింటిలో ఏదోఒకటి వెంటనే చేయవలెను" అని చెప్పినాడు.

శార్దూలుడు ఇట్లా చెప్పగానే ఆ మహాపరాక్రమవంతుడు రావణాసురుడు "ఓ నిశాచరుడా, దేవ దానవ గంధర్వులు అందరూ ఏకముఅయి ఎత్తివచ్చినా సమస్తలోకాలలోవారూ ఏకముఅయి నన్ను ఎదిరించినా నేను సీతను రాముడికి ఇవ్వను. అది అట్లా ఉండనివ్వు. నీవు వానరసేనను అంతా తిరిగి చూచినావు. కాబట్టి వాండ్లలో శూరులు ఎవరో చెప్పు. వాండ్లలో దురాసదులు ఎవరో చెప్పు. అసలు వాండ్లు ఎటువంటివాండ్లు. వాండ్ల ప్రభావము ఎటువంటిది. వాండ్ల తండ్రులు ఎవండ్లు. తాతలు ఎవండ్లు, వివరముగా చెప్పు. నీవు చెప్పేదానినిపట్టి నాకు వాండ్ల బలాబలాలు తెలుస్తవి. ఎవరెవరి విషయములో ఏమి ఏమి చేయవలసింది నేను నిర్ణయిస్తాను. యుద్ధము చేయతలచుకొన్నవాండ్లు శత్రుబలాన్ని గురించి అవశ్యమూ తెలుసుకోవలెను" అని చెప్పినాడు.

శార్దూలుడు గూఢచారులలో శ్రేష్ఠుడు. వాడు అంతట రావణుడితో "రాజా, సుగ్రీవుడు ఋక్షరజుడి పుత్రుడు. వాణ్ణి

ఆ సుగ్రీవుణ్ణి యుద్ధములో జయించడము అలవికాని పని. జాంబవంతుడు గద్గదుడి కొడుకు. ధూమ్రుడు అనేవాడు ఆ జాంబవంతుడి తమ్ముడు. పోరాటములో అనేకమంది రాక్షసులను చంపివేసిన హనుమంతుడు కేసరి అనేవాడి పుత్రుడు. ఆ కేసరి బృహస్పతి పుత్రుడు.

"ప్రభూ, మహాపరాక్రమవంతుడూ ధార్మికుడూ అయిన సుషేణుడి తండ్రి వరుణదేవుడు. దధిముఖుడు అనేవాడు సౌమ్యుడు. వాడి తండ్రి చంద్రుడు. వానరసైన్యములో సుముఖుడూ దుర్ముఖుడూ వేగదర్శి అనేవాండ్లు ముగ్గురూ ముఖ్యులు. వాండ్లను వానరరూపమృత్యుదేవతలుగా బ్రహ్మదేవుడు స్వయముగా సృష్టించినాడు. వానరసేనానాయకుడు నీలుడు. వాడు అగ్నిహోత్రుడికి పుట్టినాడు. కేసరి కొడుకు అని చెప్పిన హనుమంతుడు వాయుదేవుడికి పుట్టినాడు. అంగదుడు యువకుడు. వాణ్ణి ఎవరూ ఎదిరించలేరు. వాడు వాలి పుత్రుడు. దేవేంద్రుడి మనుమడు. మైందద్వివిదులు అశ్వినీదేవతలకు పుట్టినారు. గజుడూ గవాక్షుడూ గవయుడూ శరభుడూ గంధమాదనుడూ అనే అయిదుగురున్నూ కాలాంతకుడివంటివాండ్లు. వాండ్లు యముడికి పుట్టినారు. శ్వేతుడూ జ్యోతిర్ముఖుడూ అనేవాండ్లు ఇద్దరూ సూర్యుడికి పుట్టినారు. వరుణదేవుడికి హేమకూటుడు అనే మరిఒక పుత్రుడు ఉన్నాడు. మహావీరుడు నలుడు విశ్వకర్మకు పుట్టినాడు. దుర్ధరుడు వసువు పుత్రుడు. రాజా వానరులు పదికోట్లమంది ఉన్నారు. వాండ్లు అందరూ దేవతలకూ పుట్టినారు. కాంతిమంతులు. శూరులు. వాండ్లు అందరిపేర్లూ చెప్పలేను. వాండ్లు అందరూకూడా యుద్ధాన్ని కాంక్షిస్తున్నారు.

"ప్రభూ, ఖరదూషణత్రిశిరులను సంహారము చేసివేసిన రాముడు సుందరాకారుడు. యువకుడు. అతడితో సరిసమానము అయిన పరాక్రమవంతుడు మరిఒకడు ఈ భూలోకములో లేడు. విరాధుణ్ణి యముడివంటి కబంధుణ్ణి జనస్థానములో రాక్షసులను అందరినీ రాముడు ఒక్కడే వధించివేసినాడు. అతడి బాణాల తాకిడికి దేవేంద్రుడుఅయినా నిలువలేడు. చచ్చిపోతాడు. అతడు మహావీరుడు. అంతేకాదు. అటువంటి గుణవంతుడు మానవులలో

మరొకడు కనపడడు. అతడు ధర్మాత్ముడు. అతని తమ్ముడు లక్ష్మణుడు మదపుటేనుగులలో శ్రేష్ఠము అయిన మదపుటేనుగు వంటివాడు.

"ప్రభూ, ఆ రాముడు నీ తమ్ముణ్ణి విభీషణుణ్ణి లంకాధిపతిగా రాజ్యాభిషేకము చేసినాడు. అందువల్ల అతడు ఇప్పుడు రామకార్య ధురంధరుడు అయినాడు. రాముడికి మేలు చేయడానికి పూను కున్నాడు. రాజా, సువేలపర్వతముమీద విడిదిచేసిన వానర సైన్యాన్నిగురించీ రాముడి ప్రయత్నాన్నిగురించీ చెప్పినాను. ఇక మిగతాపనికి నీవే కర్తవు" అని చెప్పినాడు.

౩౧

సువేలపర్వతముమీద వానరసైన్యముతో క్షోభపెట్టడానికి అలవికాకుండా విడిదిచేసిన రాముణ్ణిగురించి గూఢచారులు చెప్పింది అంతా లంకాధిపతి రావణాసురుడు విన్నాడు. కొంచెము భయ పడ్డాడు. తన మంత్రులను చూచి తాము ఆలోచించవలసిన సమయము ఆసన్నము అయింది అనీ మంత్రులు అందరూ హెచ్చరి కతో సమావేశము కావలెను అనీ ఆజ్ఞాపించినాడు. అతడి ఆజ్ఞ ప్రకారము మంత్రులు అందరూ సమావేశము అయినారు. ఆ దుర్ధర్షుడు వారి అందరితోను చక్కగా ఆలోచించి ఆ తరువాత చేయవలసిన పనిని నిర్ణయించినాడు. ఆ మంత్రులను అందరినీ పంపించివేసి రావణాసురుడు అంతట తన భవనములోకి పోయినాడు.

రావణుడు మహామాయలమారివాడు. మాయపనులు చేయడములో మహాసమర్థుడూ మహాబలవంతుడూ అయిన విద్యు జ్జిహ్వుణ్ణి పిలిచినాడు. జనకాత్మజను సీతాదేవిని మాయచేసి మోసపుచ్చవలెను అనీ అందుకోసము రాముడి శిరస్సునూ రాముడు ఉపయోగించే పెద్దవింటినీ అంబునూ మాయతో కల్పించి అశోక వనానికి తెమ్మని విద్యుజ్జిహ్వుడితో చెప్పినాడు. వాడు 'అట్లాగేను' అన్నాడు. అందుకు రావణాసురుడు సంతోషాతిశయముతో వాడికి ఒక ఆభరణము బహుమానముగా ఇచ్చినాడు.

అంతట రావణాసురుడు సీతాదేవినిచూడటానికి అశోకవనము లోకి పోయినాడు. ఎన్నడూ దైన్యము అనుభవించవలసినది కాని

ఆ సీతాదేవి దైన్యముతో తలవంచుకొని భర్తనుగురించి ధ్యానము చేస్తూ పరమ దుఃఖముతో నేలమీద కూర్చుని ఉంది. ఆమెకు అటూ ఇటూ భయంకరాకారలు అయిన రాక్షసాంగనలు కావలి కాస్తున్నారు. రావణాసురుడు అప్పుడు ఆమెకు సంతోషవార్త చెప్పేవాడివలె ఆమెను సమీపించి "ఓ మంగళరూపిణీ, నేను నిన్ను ఎంత మంచిగా వేడుకొన్నా నా మాట నీవు వినలేదు. ఏమి ఏమో వాగినావు. నీ భర్త—ఖరాదులను చంపివేసిన నీ భర్త రాముడు యుద్ధములో చచ్చిపోయినాడు. నీ మూలాధారాన్ని తెగవేసినాను. నీ దర్పాన్ని అణచివేసినాను. ఇంకా దుఃఖము ఎందుకు. నా భార్యవు కా.

"ఓ మూఢురాలా, రాముడు తప్ప నీకు మరొకడు భర్తగా పనికిరాడు అనుకొన్నావు. ఆ ఆలోచన వదులుకో. చచ్చిపోయిన భర్తతో ఏమి చేస్తావు. ఓ మంగళరూపిణీ, నీవు ఇక నా భార్యలకు అందరికీ అధికారిణివి కా. ఓ సీతా, నీవు బుద్ధిలేని దానవు. నీకు ఏమీ తెలియకపోయినప్పటికిన్నీ సమస్తమూ తెలుసును అను కొంటున్నావు నీవు ఇదివరకే దక్కించుకోవలసిన అవకాశాన్ని పోగొట్టుకొన్నావు. నీవు దురదృష్టవంతురాలవు. ఇప్పుడు ఏమి చేస్తావు. వృత్రాసురుణ్ణివలె నీ భర్తను భయంకరముగా చంపి వేసినారు. ఎట్లా జరిగిందీ చెప్పుతాను. విను.

"రాముడు నన్ను చంపివేయవలెను అనుకొని వానరరాజు సుగ్రీవుణ్ణి అతడి మహాసైన్యాన్ని వెంటపెట్టుకొని సముద్రతీరానికి వచ్చినాడు. అప్పుడు సూర్యాస్తమయము అయింది. ఆ మహా సైన్యము మహాసముద్రము ఉత్తరతీరాన దిగింది. బహుదూరము నుంచి నడిచి వచ్చినందువల్ల సైన్యాలు అన్నీ అలసిపోయినవి. అందరూ సొమ్మసిల్లి నిద్రపోతున్నారు. అర్ధరాత్రము అయింది.

రాముడు వానరసైన్యముతో వస్తూఉన్నాడు అని మాకు ముందుగానే గూఢచారులవల్ల తెలిసింది. ప్రహస్తుడు నా మహా సైన్యాన్ని తీసుకొని వారు దిగిన తావుకు పోయినాడు. రామ లక్ష్మణులూ వానరసైన్యమూ సొమ్మసిల్లి నిద్రపోవడము చూచినాడు. పట్టిసాలూ పరిఘలూ చిన్న చిన్న చక్రాయుధాలూ పెద్ద పెద్ద ఇనుపదండాలూ ఖడ్గాలూ శూలాలూ తళతళలాడే కూటముద్గరాలూ

తోమరాలూ ఈటెలూ పెద్ద పెద్ద చక్రాయుధాలూ ముసలాలూ బాణాలూ తీసుకొని రాక్షసులు ఆ అర్ధరాత్రమప్పుడు వానరసైన్యము మీద పడ్డారు.

"ఖడ్గప్రహారణములో ఆరితేరిన ప్రహస్తుడు నిద్రపోతున్న రాముణ్ణి చూచినాడు. చటుక్కున తన మహాఖడ్గముతో రాముడి శిరస్సును తెగవేసినాడు.

"అప్పుడు విభీషణుడు ఆకాశానికి ఎగిరి పోయినాడు. కాని వాణ్ణి రాక్షసులు పట్టుకొన్నారు. లక్ష్మణుడూ వానరులూ దశదిశలా పరిగెత్తి పారిపోయినారు. సుగ్రీవుడు గ్రీవము తెగి పడి పోయినాడు. హనుమంతుడు హనువులు పగిలి చచ్చిపోయినాడు. జాంబవంతుడు ఎగిరిపోతూ ఉంటే రాక్షసులు వాడి మోకాళ్లు తెగ వేసినారు. వాడు ఆ జాంబవంతుడు మోకాళ్లు తెగిపోయి మొదలు నరికిన చెట్టువలె నేల కూలినాడు. అరినిషూదనులూ దీర్ఘదేహులూ అయిన మైందద్వివిదులు కత్తివేట్లకు నడుములు తెగి తుండ్లు తుండ్లుగా నేలమీదపడి నెత్తుటిలో పొర్లాడుతూ నిట్టూర్పులు విడుస్తూ ఏడుస్తూ ప్రాణాలు వదిలినారు. పనసుడు పనసపండుమాదిరిగా నేలమీద రాలినాడు. దరీముఖుడు అనేక బాణాలు గుచ్చుకొని ఒక గుహలో పడిపోయినాడు. మహాపరాక్రమవంతుడుఅయిన కుముదుడు చడీ చప్పుడు లేకుండా చచ్చిపోయినాడు. అంగదుడు బాహువులు తెగి నెత్తురు కక్కుతూ నేల కూలినాడు. ఏనుగుల కాళ్లతొక్కిడికి నిద్రపోతున్న వానరులు కొందరు చచ్చిపోయినారు. మహామేఘాలవలె వాయువేగముతో పోయే గుర్రాల కాళ్లకింద పడి కొందరు వానరులు చచ్చిపోయినారు రాక్షసులు కపటోపాయముతో కొందరు వానరులను చంపివేసినారు. కొందరు వానరులు భయపడి పరుగెత్తి పారిపోయినారు. అట్లా వానరులు పరుగులెత్తుతూ ఉంటే ఏనుగుల వెంట సింహాలవలె వాండ్ల వెంట రాక్షసులు పడ్డారు. ఆ వానరులను రాక్షసులు చంపివేసినారు. కొందరు వానరులు సముద్రములో పడిపోయినారు. కొందరు వానరులు ఆకాశానికి ఎగిరిపోయినారు. భల్లూకవీరులు వానరవృత్తిని అవలంబించి పెద్ద పెద్ద చెట్లు ఎక్కినారు. రాక్షసులు ఆ సముద్రతీరప్రదేశాలలోనూ అక్కడి పర్వతాలమీదనూ

వనాలలోనూ వానరులను వెదికి వెదికి పట్టుకొని చంపివేసినారు. నీ పెనిమిటిని రాముణ్ణి వానరసైన్యముతో కూడా నా సైన్యము చంపివేసింది.

"ఓ సీతా, నెత్తురులో తడిసి దుమ్ముకొట్టుకొని ఉన్న నీ పెనిమిటి శిరస్సును తెచ్చినారు" అంటూ ఆ పరమదుర్ధర్షుడు రాక్షసరాజు రావణాసురుడు ఒక రాక్షసాంగనతో సీతాదేవి వినేటట్టుగా "యుద్ధములోనుంచి రాముడిశిరస్సు స్వయముగా తెచ్చిన ఆ క్రూరకర్ముణ్ణి విద్యుజ్జిహ్వుణ్ణి పిలుచుకొని రా" అన్నాడు.

అప్పుడు విద్యుజ్జిహ్వుడు రాముడి శిరస్సునూ ధనుస్సునూ తీసుకొనివచ్చి రావణాసురుడి ఎట్టఎదుట ఉంచి సాష్టాంగ నమస్కారము చేసినాడు. పెద్దనాలుకతో సమీపములో నిలుచుని ఉన్న ఆ విద్యుజ్జిహ్వుడితో "ఓ నిశాచరుడా, రాముడి శిరస్సును నా ఎదుట కాదు. ఈ సీతాదేవి ఎదుట ఉంచు. ఈ దరిద్రురాలు తన పెనిమిటి చరమావస్థను చక్కగా చూస్తుంది" అన్నాడు. విద్యుజ్జిహ్వుడు చూడ ముచ్చటగొలిపే రాముడి శిరస్సును సీతాదేవి ఎట్టఎదుట ఉంచి అవతలికి పోయి నిలుచున్నాడు. ముల్లోకాలలోనూ ప్రసిద్ధికెక్కిన ఆ ధనుస్సును రావణుడు పట్టుకొని "ఓ సీతా, ఇదిగో నీ పెనిమిటి కార్ముకము. ఇంతకూ నీ పెనిమిటి మానవమాత్రుడు, అర్ధరాత్రమప్పుడు ప్రహస్తుడు చంపివేసినాడు. నీ పెనిమిటి శిరస్సునూ అల్లెతాటితోకూడా ఈ ధనుస్సునూ ఇక్కడికి తెచ్చినారు" అని చెప్పి విద్యుజ్జిహ్వుడిచేత ఆ శిరస్సునూ ఆ ధనుస్సునూ నేలమీద అవతల పారవేయించి ఆ యశస్వినిని జనకాత్మజను సీతాదేవిని చూచి "ఇక నీవు నా వశవర్తినివిగా ఉండు" అని చెప్పినాడు.

౩౨

సీతాదేవి ఆ శిరస్సునూ ఉత్తమోత్తమము అయిన ఆ ధనుస్సునూ చూచింది. హనుమంతుడు అక్కడికి వచ్చినప్పుడు తనకు చెప్పిన రామసుగ్రీవుల స్నేహాన్ని గురించి స్మరించింది. ఆ మొండి తలను చూస్తూ ఆ ముఖకాంతినీ ఆ కన్నులనూ ఆ తల వెంట్రుకలనూ ఆ చూడామణినీ ఆ లలాటాన్నీ పరిశీలించింది. ఆ గుర్తులనుపట్టి అది రాముడి శిరమేను అనుకొన్నది. ఆమెకు అప్పుడు పెద్దపెట్టున

దుఃఖము వచ్చింది. లేడిపిల్లవలె అరిచింది. "ఓ కైకా, నీ కోరిక ఈడేరింది. ఇక్ష్వాకుకులనందనుడు రాముడు హతము అయిపోయినాడు. ఇకను నీ కలహాశీలముతో ఇక్ష్వాకువంశము అంతా నాశనము అయిపోతుంది. తప్పదు. ఓ పూజ్యురాలా, నీకు ఏమి అపకారము చేసినాడు అని రాముడిచేత వల్కలాలు కట్టించి నేను కూడా వెంబడించేట్టు అడవులకు పంపించినావు" అంటూ ఆ తపస్విని ఆ చిన్నది వైదేహి గజగజ వణకిపోతూ నరికివేసిన అరటిచెట్టువలె నేలమీద కూలింది. తెలివి తప్పిపోయింది. ఒక ముహూర్తము సేపటికి తెప్పరిల్లి ఆ శిరమువంక చూస్తూ "ఓ మహాబాహూ, నీవు శత్రువులను జయించవలెను అనే వీరవ్రతము పట్టినావు. నేను నాశనము అయిపోయినాను. అయ్యో—నేను నీ చరమావస్థ చూడ వలసి వచ్చింది. ఇందుకా నేను బ్రతికిఉన్నది. నేను విధవను అయినాను. ఓ సదాచారసంపన్నుడా, భార్య గుణహీనతనుంచి భర్త ముందుగా పోతాడు అని పెద్దలు చెప్పుతూ ఉంటారు. నీవు నా కన్నా ముందుగా పోయినావు ఏమిటి. నేను సదాచారము తప్పలేదే. దుఃఖముమీద దుఃఖము ముంచుకొని వచ్చి నేను దుఃఖ సముద్రములో మునిగిపోతూ ఉంటే నీవు నన్ను కాపాడటానికి వచ్చి చచ్చిపోయినావే.

"రామా, మా అత్త కౌసల్యాదేవి దూడను ప్రేమించే గోవు వంటిది. నీవు చనిపోయినందువల్ల దూడకాస్తా పోయిన గోవువలె అయిపోయింది. ఓ రామా, నీది ఊహించనలవికాని పరాక్రమము. అంతేకాదు. నీది దీర్ఘాయుర్దాయము అని జ్యోతిష్కులు చెప్పినారే. అది అంతా అనృతము అయిపోయిందా. నీవు అల్పాయుష్కుడవు అయిపోయినావా. నీ అంతటి పరాక్రమ వంతుడికి కాలపరిపాకము ఇట్లా అయిపోయినప్పుడు ఆ జ్యోతిష్కుల బుద్ధిబలముకూడా భ్రంశము అయిపోయిందికాబోలు. నీవు నీతి శాస్త్రవిదుడవు. నీకు సమస్తోపాయాలూ తెలుసును. ఎటువంటి కష్టాలు అయినా రాకుండా చూచుకునే సామర్థ్యము నీకు ఉందే. ఎందువల్ల ఈ మాత్రము తెలుసుకోకుండా చనిపోయినావు. నా కారణమునుంచి (నేను విధవను కావలసిన కారణమునుంచి) ఓ కమలలోచనుడా, భయంకరమూ అతిక్రూరమూ అయిన కాళరాత్రి

నిన్ను కౌగలించుకొన్నది. అది కనికరము లేకుండా నిన్ను మింగివేసింది. ఓ పురుషపుంగవా, ఓ మహాబాహూ, నీకోసము నిరంతరము తపస్సుచేస్తూ ఉన్న నన్ను వదిలిపెట్టి నీ ప్రియురాలిని వలె పృథివిని కౌగలించుకొని పడుకొన్నావా.

"ఓ వీరుడా, ఈ కాంచనాలంకృత ధనుస్సు నాకు ఎంతో ప్రియము అయింది. నీవూ నేనూ గంధమాల్యాదులతో పూజించిన ఈ ధనుస్సు ఇప్పుడు ఇట్లా అయిపోయింది. ఓ రామా, నీవు పుణ్యాత్ముడవు స్వర్గములో నీ తండ్రీ నా మామగారూ అయిన దశరథమహారాజుతోనూ నీ పితృదేవతలతోనూ చేరిపోయినావు. నీవు ఆ స్వర్గములో నక్షత్రరూపము ధరించిఉంటావు. మహాత్కర్మలు చేసిన ఇక్ష్వాకువంశరాజర్షులనూ ఇంకా చూడవలసిన పుణ్యాత్ములనూ చూస్తూ ఉంటావు.

"రామా. నేను చిన్నదానను. చిన్నతనమునుంచీ నేను నీదగ్గర ఉంటూ వచ్చినాను. నేను నీ భార్యను. నీ సహచారిణిని. నన్ను చూడవు ఏమిటి. నాతో మాట్లాడవు ఏమిటి. నీవు నా పాణిగ్రహణ సమయంలో ఎప్పుడూ నాతోనే ఉంటాను అని ప్రమాణము చేసినావు. జ్ఞాపకము తెచ్చుకో. ఇట్లా ఇంత దుఃఖములో ఉన్న నన్నుకూడా నీతోపాటు తీసుకొనిపో. ఓ రామా, ఉత్తమ లోకానికి పోయేవారిలో నీవు ఉత్తముడవు. నిన్ను వదిలిపెట్టి నేను దుఃఖములో వున్నాను. నేను నీ ప్రియురాలిని. నన్ను వదిలిపెట్టి ఎందుకు ఈ లోకమునుంచి ఆ లోకానికి పోయినావు.

"ఓ రామా, మంగళద్రవ్యాలు అయిన చందనాదులు పూసిన నీదేహాన్ని నేను ఇదివరకు కౌగలించుకొంటూ ఉండేదాన్ని. ఆ నీ దేహాన్ని ఇప్పుడు నక్కలూ కుక్కలూ మొదలయినవి ఈడ్చుకొని పోతున్నవా. ఆప్తదక్షిణలు యిచ్చి అగ్నిష్టోమాది యజ్ఞాలు చేసి ఆ వైదికాగ్ని సంస్కారాములు లేకుండా చనిపోయినావు ఎందుచేత.

"ఓ రామా, అరణ్యవాసానికి వచ్చిన ముగ్గురిలో మిగిలిన ఒక్క లక్ష్మణుణ్ణే చూచి మీ అమ్మ కౌసల్యాదేవి శోకముతో మనస్సు చలించిపోయి ఏమి ఏమో అడుగుతుంది. అప్పుడు ఆమెకు లక్ష్మణుడు నిన్నూ నీ మిత్రుడి సుగ్రీవుడి సైన్యాన్నీ రాత్రిపూట

చంపివేసినారు అని చెప్పుతాడు. నిద్రపోతున్న నిన్ను రాక్షసులు చంపివేయడమూ నేను రాక్షసగృహములో ఉండడమూ వినే వినడముతో ఆమె గుండె పగిలిపోతుంది. ఆమె బ్రతుకదు. ప్రాణాలు వదిలివేస్తుంది. ఇంతకూ నేను దురదృష్టవంతురాలను. నా నిమిత్తము ఆ మహాబలవంతుడు రాముడు సముద్రాన్ని దాటి వచ్చినాడు. గోవుపాదము అంతటి గుంటలో పడిపోయినట్లు అనర్థముగా ఒక క్షుద్రుడి చేతిలో చనిపోయినాడు. నానుంచి తన వంశము నాశనము అయిపోతుంది అని తెలియక నన్ను పెండ్లి ఆడినాడు. ఆ పూజ్యుడికి రాముడికి భార్యే మృత్యువు అయింది. ఓ రామా, నేను పూర్వజన్మలో ఏ సత్కన్యాదానమో చెడగొట్టి ఉంటాను. అందువల్ల పరమధర్మాత్ముడు అయిన రాముడికి భార్యను అయినప్పటికీన్నీ ఇప్పుడు ఇక్కడ ఇటువంటి దుఃఖము అనుభవిస్తున్నాను.

"ఓ రావణుడా, వెంటనే నన్ను ఆ రాముడిమీద పడవెయ్యి. భార్యను భర్తతో చేర్చు. మంగళప్రదము అయిన ఈ పని చెయ్యి. ఓ రాక్షసరాజా, రాముడి శిరస్సుతో నా శిరస్సును చేర్చు. అతని కాయముతో నా కాయాన్ని చేర్చు. మహాత్ముడు అయిన నా పెనిమిటివెంట నేనూ పోతాను" అని చెప్పుతూ ఆ విశాలాక్షి మాటిమాటికీ ఆ తలనూ ఆ వింటినీ చూస్తూ దుఃఖముతో తపించిపోతూ విలపించింది.

సీతాదేవి అట్లా ఏడుస్తూ ఉండగా రాక్షసద్వారపాలకుడు ఒకడు అక్కడికి వచ్చి చేతులు జోడించి రావణాసురుణ్ణి చూచి జయము ఆశీర్వదించి సాష్టాంగనమస్కారముచేసి సవినయముగా "ప్రభూ, సేనానాయకుడు ప్రహస్తుడు మంత్రులు అందరితోనూ వచ్చి కనిపెట్టుకొనిఉన్నాడు. తమదర్శనము చేయడానికి వచ్చినాడు, అందుకోసము నన్ను పంపించినాడు. మహాప్రభూ, కష్టసాధ్యము అయిన కార్యము ఒకటి వచ్చింది అనీ రాజాజ్ఞకోసము కనిపెట్టుకొని ఉన్నాము అనీ ఇప్పుడే దర్శనము ఈయవలెను"అనీ చెప్పినాడు.

ఆ ద్వారపాలకుడు చెప్పింది విని రావణాసురుడు అశోకవనములోనుంచి బయలుదేరినాడు. అతడు అవతలకు పోగానే రాముడి శిరస్సూ ధనుస్సూ అంతర్ధానము అయిపోయినవి.

రావణాసురుడు అప్పుడు తన సభాభవనములోకి పోయినాడు. రాముడి పరాక్రమాన్నిగురించి తెలుసుకొన్నాడు. భయంకర పరాక్రములు అయిన తన మంత్రులలో రామున్నిగురించి ఆలోచించినాడు. ఏ ఏ పనులు ఎట్లా చేయవలసిందీ నిర్ణయించినాడు. మృత్యువుతో సరిసమానము అయిన ఆ రావణాసురుడు తన మేలు కోరే సేనాధ్యక్షులను అందరినీ చూచి "దృఢదండముతో భేరిని మోగించండి. వెంటనే మన సైన్యాలను అన్నిటినీ రావించండి. కారణము చెప్పవద్దు" అని ఆజ్ఞాపించినాడు.

సేనానాయకులు అందరూ "అట్లాగేను" అనిచెప్పి తమ తమ మహాసైన్యాలను రావించినారు. సైన్యాలు అన్నీ సన్నద్ధము అయి వచ్చినవి అని సేనానాయకులు ఆ యుద్ధకాముడికి రావణాసురుడికి విన్నవించినారు.

౩౩

దుఃఖపారవశ్యములో ఒళ్లు ఎరగకుండా పోయిన సీతాదేవిని సరమ చూచింది. ఆమె విభీషణుడి భార్య. సీతాదేవిని కాపాడడానికి ఆమెను అదివరకు రావణాసురుడు నియమించినాడు. ఆ సరమ స్నేహశీలి. దృఢవ్రత. ఆమెతో సీతాదేవి స్నేహము చేసింది. సీతాదేవికి ఆమె ఇష్టురాలూ ఆప్తురాలూ అయింది.

సీతాదేవిని రావణాసురుడు మోసము చేయడము సరమ చూచింది. బడలిక పోగొట్టుకోడానికి నేలమీద పడి పొర్లాడి దుమ్ముకొట్టుకొని లేచిన ఆడుగుర్రము మాదిరిగా కనిపించిన సీతాదేవిదగ్గరకు పోయి ఆ మృదుభాషిణి సరమ "ఓ వైదేహీ ఊరడిల్లు. మనోవ్యథ పడవద్దు. నీతో రావణాసురుడు మాట్లాడిందీ నీవు అందుకు అతడికి బదులు చెప్పిందీ నీమీద నాకు ఉన్న స్నేహాతిశయమునుంచి రావణాసురుడికి భయపడకుండా ఇక్కడ చెట్లచాటున నిర్జనప్రదేశములో ఉండి నేను విన్నాను.

"ఓ సీతా నీవు పిరికిదానవు. ఓ విశాలాక్షీ, రావణాసురుడు అంత కలవరపడి ఇక్కడినుంచి ఎందుకు వెళ్ళిపోయినాడో నీవు గమనించలేదు. నేను పోయి అదిన్నీ తెలుసుకొని వచ్చినాను. రామప్రభువు చనిపోలేదు. అతడు సమస్తమూ తెలిసినవాడు.

ఆ మహానుభావుడు ఎప్పుడూ మైమరచి నిద్రపోడు. ఒకవేళ రామప్రభువు నిద్రపోయేట్లయితే లక్ష్మణుడు ఎంతమాత్రమూ నిద్రపోడు. అందువల్ల నిద్రపోతూ ఉండగా రాముణ్ణి చంపివేసినారు అని చెప్పింది అంతా అబద్ధము. ఆ పురుషవ్యాఘ్రాన్ని ఎవరూ వధించలేదు. దేవతలను దేవేంద్రుడివలె వానరులను అందరినీ ఆ రామప్రభువు కాపాడుతూ ఉన్నాడు. పయిగా ఆ వానరులు అందరూ చెట్లను ఆయుధాలుగా చేసుకొని పోరాడుతారు. వాండ్లను రాక్షసులు ఏమి చేస్తారు. ఏమీ చేయలేరు. వారు అందరూ సురక్షితముగా ఉన్నారు. నేను తెలుసుకొని వచ్చినాను.

"ఓ సీతా, ఆ అజానుబాహువును ఆ విశాలవక్షుణ్ణి ఆ మహాధన్విని జగత్ప్రసిద్ధికెక్కిన ఆ పరమపరాక్రమవంతుణ్ణి ఆ ధార్మికుణ్ణి ఆ నీతిశాస్త్రవిదుణ్ణి రాముణ్ణి చంపివేయకలవాడు ఎవరూ ఈ జగత్తులో లేడు. ఆ మహాత్ముడి బలము అచింత్యము. పౌరుషము అచింత్యము. అతడు శత్రుసేనాసమూహాలను చంపివేస్తాడు. కాని శత్రువుల చేతులలో చచ్చిపోడు. ఆ శ్రీమంతుడు తననూ తన తమ్ముడు లక్ష్మణుణ్ణీ తక్కినవారినీ కాపాడుకొంటూ కుశలముగా ఉన్నాడు.

"రావణుడు సర్వభూతవిరోధి. భయంకరుడు. మాయావి. అయోగ్యము అయిన బుద్ధితో నిన్ను మోసము చేయడానికి రాముడి మాయశిరస్సునూ మాయధనుస్సునూ తెప్పించినాడు."

"ఓ సీతా, నేను నీకు ప్రియము చెప్పుతున్నాను. దుఃఖము అంతా తీరిపోయింది. నీకు శుభము అవుతుంది. నీవు ఐశ్వర్యము అనుభవించపోతున్నావు. నిజము. ఆ రామప్రభువు తన తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణీ వానరసైన్యాన్నీ వెంటపెట్టుకొని సముద్రాన్ని దాటి ఈ దక్షిణదిశకు వచ్చినాడు. ఇప్పుడు సముద్రతీరాన లక్ష్మణుడితోనూ వానరసైన్యముతోనూ విడిది చేసినాడు. సుఖముగా ఉన్నాడు. నేను చూచినాను. రావణాసురుడు పంపించిన చారులు ఈ సంగతి తెలుసుకొని వచ్చినారు. ఆ చారులు శీఘ్రగాములు. వాండ్లు వచ్చి రామప్రభువు సముద్రము దాటి వచ్చిన వృత్తాంతము చెప్పినందువల్లనే ఇక్కడనుంచి రావణాసురుడు వెళ్ళిపోయినాడు. ఆ వృత్తాంతాన్నిగురించే

రావణాసురుడు ఇప్పుడు మంత్రులు అందరితోను ఆలోచిస్తున్నాడు" అని చెప్పింది.

ఇట్లా సరమ సీతాదేవితో చెప్పుతూ ఉండగా రాక్షస సైన్యాలు యుద్ధసన్నద్ధము అవుతూ ఉన్నందువల్ల భైరవధ్వని వినిపించింది. దృఢదండాలతో మ్రోగిస్తూ ఉన్న భేరీల మహా స్వరము వింటూ ఆ మధురభాషిణి సరమ సీతాదేవితో "ఓ భీరూ, సైనికులు యుద్ధసన్నద్ధులు కావలెను అని తెలియచేయడానికి మహాభైరవముగా భేరీలను మ్రోగిస్తున్నారు. ఈ భేరీల ధ్వని మేఘగర్జనమువలె వినపడుతున్నది. ఏనుగులను యుద్ధానికి సిద్ధము చేస్తున్నారు. రథాలకు గుర్రాలను కట్టుతున్నారు. వేలకువేలు అశ్వికులు ఈటెలు తీసుకొని సంతోషముగా గుర్రాల మీద బయలుదేరుతున్నారు. ఆ యా ప్రదేశాలనుంచి గుంపులు గుంపులుగా పదాతులు బయలుదేరి వస్తూఉన్నారు. అద్భుతముగా అమితవేగముతో మహాధ్వనులు చేస్తూ సైన్యాలు రాజవీధులలోనుంచి మహాప్రవాహాలు సముద్రములోకి పోయేట్టుగా పోతున్నవి. రాక్షసయోధులు ధరించిన కవచాల ధగధగలతోనూ డాలువాళ్ల మిలమిలలతోనూ ఆయుధాల తళతళలతోనూ రథాలకూ గుర్రాలకూ ఏనుగులకూ అలంకరించిన ఆభరణకాంతులతోనూ ఎండాకాలములో అడవిని దహించుకొంటూ పోయే కార్చిచ్చువలె వివిధవర్ణాలతోనూ రాక్షససైన్యము సాగిపోతూ ఉంది.

"అవిగో విను. ఘంటలు మ్రోగుతున్నవి. రథచక్రాలు మహాధ్వనులు చేస్తూఉన్నవి. గుర్రాలు సకిలిస్తున్నవి. వాద్యధ్వనులు మిన్ను అంటుతున్నవి. ఎప్పుడూ రావణాసురుణ్ణి వెంబడించే రాక్షసయోధులు చేతులలో ఆయుధాలు పట్టుకొని చూచేవాండ్లకు ఒళ్ళు గగురు పుట్టేటట్టు యుద్ధసన్నద్ధులు అవుతున్నారు.

"ఓ సీతా, రాక్షసులకు భయము వచ్చిపడ్డది. నీవు భయపడ వద్దు. నిన్ను జయలక్ష్మి వరించపోతున్నది. నీకు ఇక దుఃఖము లేదు. ఆ అచింత్యపరాక్రమవంతుడు ఆ కమలపత్రాక్షుడు రామప్రభువు దేవేంద్రుడు దైత్యులనువలె రాక్షసులను అందరినీ సంహారము చేసివేస్తాడు. ఓ శుభాంగీ, దేవేంద్రుడితో

విష్ణుమూర్తివలె లక్ష్మణుడితోకూడా నీ పెనిమిటి రామప్రభువు రావణాసురుణ్ణి విక్రమించి నిన్ను చేరుతాడు. నిన్ను కౌగలించుకొంటాడు. నీవు అప్పుడు ఆ మహానుభావుడి విశాలవక్షఃస్థలాన్ని ఆనందబాష్పాలతో తడిపివేస్తావు.

"ఓ సీతా, చాలా మాసాలనుంచీ నీ జఘనాలవరకూ జడకట్టుకొని పోయిన నీ తలవెంట్రుకలు ఆ మహాబలవంతుడి రాకతో చిక్కు వీడిపోతవి. అచిరకాలములో నీవు ఉదయిస్తున్న పూర్ణచంద్రబింబమువంటి ఆ రామప్రభు ముఖబింబాన్ని చూస్తావు. నీ దుఃఖాన్ని పాము దాని కుబుసాన్నివలె వదిలిపెట్టుతావు.

"ఓ మైథిలీ, రామప్రభువు సుఖము అనుభవించవలసినవాడు. అచిరకాలములో రావణాసురుణ్ణి యుద్ధములో చంపివేస్తాడు. పరిపూర్ణమనోరథుడు అవుతాడు నీవు అతని ప్రియురాలవు. నీతో సుఖము అనుభవిస్తాడు. వానకు భూమిమీద పైరువలె ఆ మహాత్ముడి పరాక్రమానికి నీవు ఎంతో సంతోషిస్తావు.

"ఓ సీతా, మేరుపర్వతముచుట్టూ గుర్రమువలె గుండ్రముగా తిరిగే ఆ దేవుణ్ణి దినకరుణ్ణి నీవు వెంటనే ప్రార్థించు. ఆ సూర్యుడే ప్రజలకు అందరికీ కాంతిని ఇచ్చేవాడు" అని చెప్పింది.

౩౪

సరమ అట్లా చెప్పింది. మండుటెండలకు ఎండిపోయిన భూమి వానకు చల్లపడ్డట్లు సీతాదేవి సరమమాటలకు సంతోషపడ్డది. సరమ సమయజ్ఞురాలు. సమయానుకూలముగా మాట్లాడింది. సీతాదేవిని తన స్నేహితకయాన సంతోషపెట్టవలెను అనుకొన్నది. మంద హాసముచేస్తూ మధురముగా, "ఓ సీతా ఆధారములేని ఆకాశమార్గాన పోయేశక్తి నాకు ఉంది. నా అంత వేగముగా గరుత్మంతుడు కానీ వాయుదేవుడుకానీ ఆకాశములో సంచారము చేయలేడు. నేను ఎవరికీ తెలియకుండా రామప్రభువుదగ్గరకు పోయి నీ క్షేమసమాచారము చెప్పి రావలెను అనుకొంటున్నాను." అని సరమ అన్నది.

ఇట్లా మనోహరముగా సరమ చెప్పిన మాటలు సీతాదేవి విన్నది. అంతవరకూ దుఃఖపడుతూ ఉన్న ఆ సీతాదేవి సరమను

చూచి "ఓ సరమా, ఆకాశములోకానీ పాతాళలోకములోకానీ పోయే సామర్థ్యము నీకు ఉంది అని నాకు తెలుసును. నా విషయములో ఎవరూ చేయలేని పని నీవు చేయకలవు అనికూడా నాకు తెలుసును. నీవు నిజముగా గట్టిగా నన్ను సంతోషపెట్ట తలచుకొన్నట్లయితే నీవు ఇప్పుడు ఇక్కడనుంచి పోయి ఆ రావణాసురుడు ఏమి చేస్తున్నాడో తెలుసుకొనివచ్చి చెప్పు. ఆ క్రూరుడు ఆ దుష్టాత్ముడు ఆ శత్రురావణుడు రావణుడు తన మాయాబలముతో నన్ను మద్యముతాగి మతిపోయినదానినిగా చేసివేస్తున్నాడు. నాకు కావలి ఉంచిన రాక్షసాంగనలు నన్ను ఎప్పుడూ భయపెట్టుతూనూ బెదిరిస్తూనూ ఉండేట్టు చేసినాడు. నేను ఈ అశోకవనములో ఎప్పుడూ శోకమే అనుభవిస్తున్నాను. ఆ రావణుడు ఎప్పుడు వచ్చి నన్ను ఏమిచేస్తాడోననే భయముతో బాధపడుతున్నాను. నన్ను బ్రతుకనిస్తాడో లేదోనని శంకిస్తున్నాను. నాకు ఏమాత్రము మనస్స్వాస్థ్యమూ లేకుండా పోయింది. ఆ రావణుడు నన్ను ఏమి చేయతలచుకొన్నదీ నీవు పోయి తెలుసుకొనివచ్చి నాకు చెప్పేట్లయితే నీవు నాకు ఎంతో మేలుచేసినదానవు అవుతావు" అని చెప్పింది.

ఇట్లా చెప్పి కన్నీళ్ళు కారుస్తూ ఉన్న ఆ సీతాదేవి కన్నీళ్లను ఆ మధురభాషిణి సరమ తుడుస్తూ "ఓ జానకీ, నీ కోరిక ఇదా, అట్లా అయినట్లయితే ఇప్పుడే పోయి వస్తాను. నీ శత్రువు అభిప్రాయము ఏమిటో కనుక్కొంటాను. వెంటనే వచ్చివేస్తాను. చూడు" అని చెప్పి రావణాసురుడు ఉన్న చోటికి పోయింది. అతడు అప్పుడు మంత్రులతో మాట్లాడుతున్నది అంతా విన్నది. వారి వారి నిశ్చయాలను గుర్తించడములో ఆమె నేర్పరి. ఆ దురాత్ముడి నిశ్చయము తెలుసుకొన్నది. వెంటనే అశోకవనానికి వచ్చింది. తన రాకకు ఎదురుచూస్తూఉన్న సీతాదేవిదగ్గరకు పోయింది. పద్మాసనము వదిలిపెట్టిన మహాలక్ష్మీదేవివంటి ఆ సీతాదేవి లేచి ఆ సరమను కౌగలించుకొన్నది. ఆమెకు స్వయముగా ఆసనము ఇచ్చి "ఓ సరమా, సుఖముగా కూర్చో, ఆ దురాత్ముడు రావణుడు ఏమి నిశ్చయించినాడో చెప్పు. ఉన్నది ఉన్నట్టు చెప్పు" అని అడిగింది.

అట్లా అడిగి గజగజ వణుకుతూ ఉన్న సీతాదేవితో ఆ మధుర భాషిణి సరమ "ఓ వైదేహీ, రావణాసురుడితో అతని తల్లీ అవిద్ధుడు అనే వృద్ధమంత్రీ నిన్ను వదిలిపెట్టవలసింది అని ఎంతో బోధించినారు. ఆ మనుజేంద్రుణ్ణి రాముణ్ణి సత్కరించి మైథిలిని ఇచ్చివేయవలెను అని చెప్పినారు. అట్లా చేయకపోయేట్లయితే సర్వనాశనము అయిపోతుంది అన్నారు. జనస్థానములో అంతమంది రాక్షసులను అంత అద్భుతముగా రాముడు సంహారము చేయడమే అందుకు నిదర్శనము అని చెప్పినారు. అంతటితో వారు ఊరుకోలేదు. హనుమంతుడు సముద్రలంఘనము చేసి లంకాపట్టణానికి రావడమూ నీ దర్శనము చేయడమూ ఈ భూమిమీద ఎప్పుడుఅయినా ఎవడు అయినా చేసినాడా అని వారు అడిగినారు. ఇట్లా ఆ రావణాసురుడి తల్లీ మంత్రివృద్ధుడు అవిద్ధుడూ ఏమి అడిగినప్పటికిన్నీ ధనాశాపరుడు ఏమి అయినప్పటికిన్నీ తన ధనాన్ని వదులుకోడానికి ఒప్పుకోనట్టు ఆ రావణాసురుడు నిన్ను వదలిపెట్టడానికి ఒప్పుకోలేదు.

"ఓ సీతా, రావణాసురుడు చచ్చిపోతేనేతప్ప బ్రతికిఉండగా నిన్ను వదలిపెట్టడు. ఆ క్రూరుడూ వాడి మంత్రులూ ఇట్లా నిశ్చయించినారు. చచ్చిపోవడానికే వాండ్లు ఈ విధముగా నిశ్చయించినారు. భయపడి నిన్ను రావణాసురుడు వదిలిపెట్టడు. యుద్ధములో రాక్షసులు అందరూ చచ్చిపోయినా నిన్ను వదిలిపెట్టడు' వాడు కూడా చచ్చిపోయిన తరువాతనే నిన్ను వదిలిపెట్టుతాడు.

"ఓ సీతా, నీవు భయపడవద్దు. నీ నల్లని కన్నులు నాకు చెప్పుతున్నవి. యుద్ధములో రాముడు తనతీక్ష్ణబాణాలతో రావణాసురుణ్ణి చంపివేస్తాడు. నిన్ను అయోధ్యకు తీసుకొనిపోతాడు" అని చెప్పింది.

ఇట్లా సరమ చెప్పుతూ ఉండగా వానరసైన్యాలు భూమి అంతా కంపించిపోయేట్టుగా భేరీలు మ్రోగిస్తూనూ శంఖాలు పూరిస్తూనూ సింహనాదాలు చేయడము వినిపించింది.

ఆ వానరసైన్యాల మహాధ్వనులు వినపడగానే లంకాపట్టణములో రాక్షసరాజభృత్యులముఖాలలో కళకాంతులు మాసిపోయినవి. అందరినీ దైన్యము ఆవరించింది. ఆ మహాధ్వనులకు నిశ్చేష్టులు అయిపోయినారు. రాజు తప్పిదమునుంచి తమకు చావు తప్పదు అని రాక్షససైన్యము అనుకొన్నది.

3౫

శంఖఘోషలతోనూ భేరీభాంకారాలతోనూ ఆ మహాబాహువు ఆ పరపురంజయుడు ఆ రఘువంశలలాముడు రాముడు లంకాపట్టణము మీదికి బయలుదేరినాడు.

రాక్షసేశ్వరుడు రావణాసురుడు ఆ మహాధ్వనులు విన్నాడు. ఒక ముహూర్తము సేపు ఆలోచించినాడు. మంత్రుల వంక చూచినాడు. జగత్తును అంతా తాపము ఎత్తించే ఆ నిర్దయుడు ఆ మహాబలవంతుడు రావణుడు అప్పుడు ఆ సభాభవనము దద్దరిల్లి పోయేట్లుగా "ఓ సచివులారా, రాముడు సముద్రము దాటి రావడాన్ని గురించీ అతని పరాక్రమాన్ని గురించీ వానరసైన్యాన్ని గురించీ మీరు చెప్పిందంతా నేను విన్నాను. మీరు అందరూ సత్యపరాక్రములు అయి ఉండిన్నీ మీకు అందరికీ రాముడి పరాక్రమాన్ని గురించి తెలిసి ఉండిన్నీ ఇప్పుడు మీరు ఒకరిని ఒకరు చూచుకొంటూ గుడ్లు మిటకరించి ఊరక ఉండడమున్నూ చూస్తున్నాను" అని నిందించినాడు.

అట్లా మంత్రులను అందరినీ నిందిస్తూ ఉండగా రావణాసురుడి తల్లికి పినతండ్రి అయిన మాల్యవంతుడు అనే మహాప్రాజ్ఞుడు రావణాసురుణ్ణి చూచి "ఓరాజా, (అన్వీక్షకీ-త్రయీ-వార్తా-దండనీతి అనే నాలుగు) విద్యలలోనూ సుశిక్షితుడు అయి రాజనీతిని అనుసరించి రాజ్యపాలనముచేసే రాజు చిరకాలమూ ఐశ్వర్యము అనుభవిస్తాడు. శత్రువులను వశపరచుకొంటాడు. అటువంటి రాజు కాలాన్ని పట్టి శత్రువులతోనయినా సంధి చేసుకొంటాడు. కాలాన్ని పట్టి యుద్ధము చేస్తాడు. స్వపక్షాన్ని వృద్ధిచేసుకొని మహదైశ్వర్యము అనుభవిస్తాడు. ఏ రాజు అయినా తన బలము తక్కువగా ఉన్నప్పుడున్నూ శత్రువు తనతో సరిసమానము అయిన బలవంతుడు అయినప్పుడున్నూ సంధి చేసుకొంటాడు. శత్రువుకన్నా తాను అధికబలవంతుడు అయిఉన్నప్పుడే శత్రువును తిరస్కరించి యుద్ధము చేయడము కర్తవ్యము.

"ఓ రావణుడా, నీవు ఇప్పుడు రాముడితో సంధి చేసుకోవటము మంచిది అని నా అభిప్రాయము. నీకు రాముడితో విరోధానికి కారణము సీత. నీవు ఆమెను అతడికి ఇచ్చివేసేట్లయితే ఆ

విరోధము పోతుంది. యుద్ధము జరగదు. దేవర్షులూ గంధర్వులూ మొదలుఅయినవారు అందరూ రాముడి జయాన్ని కాంక్షిస్తున్నారు. నీకు అతడితో విరోధమువద్దు. సంధి చేసుకో. అది మంచిది.

"ఓ రావణుడా, భగవంతుడు బ్రహ్మదేవుడు సురాసురులూ ధర్మాధర్మాలూ అనే రెండు జంటలను సృష్టించినాడు. ధర్మము సురలనూ అధర్మము అసురులనూ ఆశ్రయించింది. మహాత్ములు అయిన దేవతలకు ధర్మము సాయపడుతున్నది అనీ అసుర రాక్షసులకు అధర్మము సాయపడుతున్నది అనీ వింటున్నాము. ధర్మము అధర్మాన్ని మింగివేసినప్పుడు కృతయుగము అనీ అధర్మము ధర్మాన్ని మింగి వేసినప్పుడు కలియుగము అనీ అంటూ ఉంటారు. నీవు దిగ్విజయము కోసము లోకాలలో తిరిగేటప్పుడు ధర్మాన్ని ధ్వంసము చేసి వేసినావు. అధర్మాన్ని అవలంబించినావు. అందువల్ల శత్రువులు (ధార్మికులు) ఇప్పుడు మనకన్నా బలవంతులు అయినారు. నీ అజాగ్రత్త వల్ల అధర్మము అభివృద్ధి అయింది. ధర్మము మనలను మింగివేస్తున్నది. అది (ధర్మము) దేవతలకు అనుకూలము చేస్తూఉంది. ధర్మము వారికి సాయపడుతున్నది.

"ఓ రావణుడా, నీవు విషయాసక్తుడవు అయిపోయినావు. ఏ కించిత్కారణమువల్లనో (మునిపత్నులనూ మునికన్యలనూ అపహరించుకొని వచ్చినందువల్లనో ఏమో) అగ్నిహోత్రాలవంటి మహర్షులకు నీవు మహామనస్తాపము కలుగచేసినావు. ఆ మహర్షుల ప్రభావము ఎదిరించ వలవికాకుండా మంటలు మండే అగ్నిహోత్రము వంటిది. వారు యథాశాస్త్రముగా అగ్నిహోత్రాలు వేలుస్తున్నారు. వేదాలను గట్టిగా చదువుతున్నారు, రాక్షసులు పారిపోయేట్టు వారు బ్రహ్మఘోషము చేస్తున్నారు. గ్రీష్మకాలములో మేఘాలవలె రాక్షసులు అందరూ ఆ యా దిక్కులకు పారిపోతున్నారు. అగ్నిహోత్రాల వంటి ఆ మహర్షుల అగ్నిహోత్రాలలోనుంచి లేస్తూఉన్న పొగలు దశదిశలూ వ్యాపించి రాక్షసుల తేజాన్ని అణచి వేస్తూవున్నవి. మహర్షులు ఆ యా పవిత్రప్రదేశాలలో దృఢనియమాలతో తపస్సు చేస్తున్నారు. ఆ తపస్సే రాక్షసులను తాపము ఎత్తిస్తున్నది.

"ఓ రాజా, నీవు దేవ దానవ యక్షులూ మొదలు అయిన వారివల్ల చావురాకుండా ఉండే వరము సంపాదించినావు. అయితే ఇప్పుడు మహాసైన్యముతో బలవంతులూ దృఢవిక్రములూ అయిన నరులూ వానరులూ వచ్చినారు. వారితో ఇంకా భల్లూకవీరులూ గోలాంగూలవీరులూ వచ్చి సింహనాదాలు చేస్తున్నారు. అంతే కాదు. ఇప్పుడు అనేక ఉత్పాతాలు భయంకరముగా అంతరిక్షములోనూ భూమిమీదనూ కనపడుతున్నవి. రాక్షసులు అందరూ నాశనము అయిపోతారేమో ననిపిస్తూ ఉంది. వికృతరూపముతో మేఘాలు తీక్ష్ణముగానూ భయంకరముగానూ గర్జిస్తూ లంకా పట్టణము అంతటా వేడి వేడి నెత్తురు వాన కురుస్తున్నవి. గుర్రాలూ ఏనుగులూ కన్నీళ్ళు కారుస్తూ ఏడుస్తున్నవి. దుమ్ముకొట్టుకొని ధ్వజాలువన్నె మాసిపోయినవి. అవి ఇదివరకటివలె భాసించడము లేదు. తోడేళ్ళూ నక్కలూ గద్దలూ ఎప్పుడు పడితే అప్పుడు లంకాపట్టములోనికి వచ్చి భయంకరముగా అరుస్తున్నవి. నల్లటి స్త్రీలు మాటలతో బెదిరిస్తూ ఆ యా వస్తువులు ఇండ్లలోనుంచి దొంగిలించుకొని పోతూ ఎదురు అయినవారిని చూస్తూ తెల్లటి పళ్ళు బయటపడేట్టు నవ్వుతూ కలలలో కనపడుతున్నారు. ఇండ్లలో పూజచేయడానికి ఉంచుకొన్న హవిస్సును కుక్కలు వచ్చి తిని పోతున్నవి. ఆవులకు గాడిదలు పుట్టుతున్నవి. ముంగిసలకు ఎలుకలు పుట్టుతున్నవి. పిల్లులు పెద్దపులులతోనూ ఊరపందులు కుక్కలతోను చేరుతున్నవి. కిన్నరులు రాక్షసులతోనూ మనులతోనూ కలుస్తున్నారు. తెలుపూ ఎరుపూ పాదాలతో పావురాళ్ళు రాక్షసవినాశాన్ని సూచిస్తూ దైవికముగా తిరుగుతూ ఉన్నవి. ఇండ్లలో పెంచుకొంటూ ఉన్న గోరువంకలు మధురముగా కూయడము మానివేసి వీచి కూచి మని క్రూరముగా అరుస్తున్నవి. పక్షులూ మృగాలూ పోట్లాడుకొని పక్షులు ఓడిపోయినవి. మళ్ళీ గుంపులు గుంపులుగా మృగాలమీదికి పక్షులూ పక్షులమీదికి మృగాలూ పరుగులెత్తుతున్నవి. అవి అన్నీ సూర్యుడివైపు ముఖము పెట్టి ఏడుస్తున్నవి.

మృత్యువు పురుషరూపము ధరించి గొరిగించుకొన్న తలతో వికలాంగముతో భయంకరాకారముతో ఆ యా ఆకాలాలలో

అందరి ఇండ్లూ చూస్తూ ఉంది. ఇవే కావు. ఇంకా ఇతర దుష్టనిమిత్తాలు కనపడుతున్నవి. ఓ రాజా, ఆలోచించు. ఇక ముందు ఏ బాధా రాకుండా ఉండడానికి ఏమి చేయవలెనో నిశ్చయించు" అని చెప్పినాడు.

ఈ విధముగా ఆ ఉత్తమోత్తమపౌరుషవంతుడు ఆ బలవంతుడు మాల్యవంతుడు చెప్పి రావణాసురుణ్ణి పరిశీలించి చూచినాడు. తన మాటలు అతనికి అయిష్టము అయినట్లు తెలుసుకొని ఊరక ఉన్నాడు.

౩౬

ఆ దుష్టాత్ముడు రావణుడు మృత్యువు చేతికి చిక్కిపోతున్నాడు. మాల్యవంతుడు చెప్పిన మంచిమాటలు సహించలేక పోయినాడు. అంతేకాదు. ఆ మాటలకు అతడికి కోపము వచ్చింది కూడాను. కోపములో కనుబొమ్మలు ముడివేసి కనుగుడ్లు తిప్పుతూ మాల్యవంతుణ్ణి చూస్తూ "ఓ ముసలివాడా, నీవు శత్రుపక్షాన చేరినావు. నాకు ఏదో మేలు చేయడముకోసము అన్నట్టు పౌరుషముగా మాట్లాడినావు. నీవు నన్ను మోసము చేయలేవు. ఇటువంటి మాటలు నా చెవికి ఎక్కవు.

"ఓ మాల్యవంతుడా, వాడు మానవుడు. నీచుడు. ఏకాకి. కోతులు వాడికి ఆశ్రయము ఇచ్చినవి. వాణ్ణి వాడి తండ్రి వెళ్లగొట్టినాడు. అడవే వాడికి ఆవాసము అయింది. వాణ్ణి ఆ రాముణ్ణి సమర్థుడు అని ఎందుకు అనుకొంటున్నావో చెప్పు. నేను సమస్తరాక్షసులకున్నూ ప్రభువును. పరమపరాక్రమశాలిని. నన్ను చూచి దేవతలు భయపడుతున్నారు. నేను ఎందులో తక్కువవాణ్ణి అనుకొంటున్నావో చెప్పు. రాక్షసవంశములో పరాక్రమవంతుడు అయినవాడు ఉండడము ఓర్వలేకనో శత్రుపక్షపాతమువల్లనో కాక శత్రువుల ప్రోత్సాహమువల్లనో నీవు నాతో పరుషముగా మాట్లాడినావు అనుకొంటున్నాను. శత్రువుల ప్రోత్సాహమే లేకపోయినట్లయితే పండితుడూ శాస్త్రతత్వజ్ఞుడూ అయిన నీబోటివాడు ఎవడూ రాజ్యాధికారములో ఉన్న

వాడితో అందులో నిగ్రహానుగ్రహసామర్థ్యము ఉన్నవాడితో పరుషముగా మాట్లాడదు.

"ఓ మాల్యవంతుడా, పద్మాసనము లేని మహాలక్ష్మిదేవి వంటి సీతను నేను అడవిలోనుంచి తెచ్చుకొన్నాను. నేను రాముడికి ఎందుకు ఇస్తాను. భయమువల్లనా—నాకు అటువంటిది లేదు. నేను కొద్దిరోజులలోనే ఆ రాముణ్ణి ఆ లక్ష్మణుణ్ణి ఆ సుగ్రీవుణ్ణి చంపివేస్తాను. వాండ్లు వెంటతెచ్చుకొన్న వానర సైన్యాన్ని నాశనము చేసివేస్తాను. నీవు చూస్తావు. దేవతలు అయినా ద్వంద్వయుద్ధములో నాఎదట నిలువలేరు. అటువంటి నేను యుద్ధానికి భయపడటము ఎందుకు. నా శిరస్సు ఛేదించినప్పటికిన్నీ నేను ఒకడికి లొంగిపోను. అది నా స్వభావము. అది దోషము అయితే కావచ్చును. సహజస్వభావాన్ని ఎవడూ అతిక్రమించలేడు. రాముడు యాదృచ్ఛికముగా సముద్రానికి సేతువు కట్టి ఉండ వచ్చును. అందుకు నీవు ఎందుకు భయపడవలెను. అందులో ఆశ్చర్యము ఏమి ఉంది. ఆ రాముడు వానరసైన్యముతో సముద్రాన్ని దాటి వచ్చినాడేకాని ప్రాణాలతో తిరిగిపోవడము ఉత్తది. నేను వాస్తవము చెప్పుతున్నాను. శపథము చేసి చెప్పుతున్నాను" అన్నాడు.

ఈ విధముగా ఇంత గర్వముతో మాట్లాడిన రావణాసురుణ్ణి చూచి అతడికి కోపము వచ్చింది అని మాల్యవంతుడు తెలుసుకొన్నాడు. తాను అతడితో అట్లా మాట్లాడినందుకు సిగ్గుపడి పోయినాడు. రావణాసురుడు అడిగిన మాటలకు జవాబుచెప్పకుండా యథోచితముగా జయము ఆశీర్వదించి రావణాసురుడి అనుజ్ఞతో మాల్యవంతుడు అక్కడనుంచి తన ఇంటికి పోయినాడు.

అంతట రావణుడు తన మంత్రులతో ఆలోచించినాడు, విమర్శించినాడు. లంకాపట్టణానికి అసమానము అయిన రక్షణము ఏర్పాటు చేసినాడు. తూర్పుద్వారముదగ్గర ప్రహస్తుణ్ణి ఉండమనీ దక్షిణద్వారముదగ్గర మహోదరుణ్ణి మహాపార్శ్వుణ్ణి ఉండమనీ పశ్చిమద్వారముదగ్గర మహామాయావి అయిన తన కొడుకును ఇంద్రజిత్తును అనేకమంది రాక్షసయోధులతో ఉండమనీ ఉత్తర ద్వారముదగ్గర శుకసారణులను ఉండమనీ ఆజ్ఞాపించినాడు. తానూ

స్వయముగా ఆ ఉత్తరద్వారము దగ్గరనే ఉంటాను అని చెప్పినాడు. పట్టణమధ్యములో మహాబలవంతుడు అయిన విరూపాక్షుడు అనే రాక్షసుణ్ణి అనేకమంది రాక్షసయోధులతో ఉండమని ఆజ్ఞాపించినాడు.

ఈ విధముగా ఆ రాక్షసపుంగవుడు రావణుడు లంకాపట్టణాన్ని కాపాడడానికి ఏర్పాట్లు చేసి కాలము మురించుకొని వస్తూ ఉన్నందువల్ల తాను కృతకృత్యుడు అయినట్టు భావించుకొన్నాడు.

అట్లా ఆ లంకాపట్టణానికి రావణాసురుడు సమగ్రము అయిన రక్షణ సంవిధానము ఏర్పాటు చేసినాడు. మంత్రులు అందరూ అతనికి జయము ఆశీర్వదించి పూజించినారు. అంతట ఆ సంపన్నుడు రావణుడు మంత్రులను వదలిపెట్టి తన అంతఃపురములోకి పోయినాడు.

౩౮

రామలక్ష్మణులూ వానరరాజు సుగ్రీవుడూ వాయుపుత్రుడు హనుమంతుడూ భల్లూకరాజు జాంబవంతుడూ రాక్షసరాజు తమ్ముడు విభీషణుడూ వాలి పుత్రుడు అంగదుడూ శరభుడు సుషేణుడూ అతని బంధువులూ మైందుడూ ద్వివిదుడూ గజుడూ గవాక్షుడూ కుముదుడూ నలుడూ పనసుడూ లంకాపట్టణముదగ్గరకు పోయినారు. ఇకను అప్పుడు జరగవలసిన కార్యాన్నిగురించి ఆలోచించ సాగినారు.

"ఇదిగో, రావణాసురుడు ఏలుతూఉన్న లంకాపట్టణము. ఎట్టఎదుట కనపడుతున్నది. సురాసురోరగగంధర్వులకు ఎవ్వరికీ జయించ నలవికాకుండా ఉంది. ఇక్కడ ఈ పట్టణములో రాక్షసాధిపతి రావణాసురుడు ఎప్పుడూ సన్నిహితుడుగా ఉంటున్నాడు. కాబట్టి మనకు కార్యసిద్ధి అయ్యే ఉపాయము ముందుగా ఆలోచించవలెను" అని రాముడు చెప్పినాడు.

అప్పుడు విభీషణుడు పొందిక అయిన మాటలలో అధికార్థముగ "ప్రభూ, నా మంత్రులు అనలుడూ శరభుడూ సంపాతీ ప్రఘసుడూ అనే నలుగురున్నూ పక్షులరూపము ధరించి లంకాపట్టణములోకి పోయి శత్రుసైన్యములో చొరబడి రావణాసురుడు చేసిన ఏర్పాట్లను అన్నిటినీ చూచి తిరిగి వచ్చినారు. ప్రభూ, ఆ దురాత్ముడు రావణాసురుడు నగరరక్షణముకోసము చేసిన ఏర్పాట్లను అన్నిటినీ

నా నలుగురు మంత్రులూ నాకు చెప్పినారు. వారు చెప్పింది అంతా నేను చెప్తాను. వినవలసింది. ప్రహస్తుడు వాడి సైన్యాలతో తూర్పుద్వారాన్ని మహాబలవంతులు అయిన మహాపార్శ్వుడూ మహోదరుడూ వాండ్ల సైన్యాలతో దక్షిణద్వారాన్ని రావణాసురుడి కొడుకు ఇంద్రజిత్తు పట్టిసాదిధానుష్కులతోనూ కూటముద్గరపాణుల తోనూ ఇంకా నానావిధాయుధధారులు అయిన శూరులతోనూ పశ్చిమద్వారాన్ని కావలి కాసే ఏర్పాటు రావణాసురుడు చేసినాడు.

"రావణాసురుడు స్వయముగా నిర్భయముగా ఉత్తరద్వారములో ఉన్నాడు. వేలకు వేలు రాక్షసయోధులు ఆయుధపాణులు అయి అతనిచుట్టూ ఉన్నారు. యోధులేకాకుండా ప్రధానము అయిన రాక్షసులు అందరూ అక్కడనే ఉన్నారు. శూలాలూ ఖడ్గాలూ ధనుస్సులూ ధరించిన మహాసైన్యమూ ప్రధాన రాక్షసులూ లంకాపట్టణమధ్యగుల్మములో విరూపాక్షుడితో ఉన్నారు.

ఒక వెయ్యి మంది గజసాదులూ పదివేలమంది రథికులూ ఇరవై వేలమంది ఆశ్వికులూ ఒక కోటిమంది పదాతులూ రావణాసురుడివెంట ఎప్పుడూ ఉంటారు. వాండ్లు అతడికి ఇష్టులు. వాండ్లు అందరూ బలవంతులు. పరమపరాక్రమ వంతులు. యుద్ధములో క్రూరులు. వాండ్లకు ఒక్కొక్కళ్లకు ఒక్కొక్క లక్ష పరివారము ఉంది. వాండ్లు ఎప్పుడూ యుద్ధానికి సంసిద్ధులుగా ఉంటారు" అని చెప్పి లంకాపట్టణము పోయి వచ్చిన తన నలుగురు మంత్రులనూ విభీషణుడు రాముడికి చూపించినాడు. ఆ నలుగురు రాక్షసమంత్రులున్నూ లంకాపట్టణములో ఏర్పాట్లను అన్నిటినీ రాముడికి స్వయముగా తెలియచెప్పినారు.

ఆ శ్రీమంతుడు విభీషణుడు మళ్ళీ ఆ కమలపత్రాక్షుణ్ణి రాముణ్ణి చూచి "రామా, రావణుడు కుబేరుడిమీదికి యుద్ధానికి పోయినప్పుడు పదిలక్షలమంది రాక్షసయోధులను వెంట తీసుకొని పోయినాడు. వాండ్లు అందరూ ఆ దురాత్ముడితో సరిసమానము అయిన పరాక్రమవంతులు. బలవంతులు. తేజోవంతులు. ధైర్యములోకానీ దర్పములోకానీ వాండ్లు తమ ఏలికకు తీసిపోరు.

ఇట్లా చెప్పుతున్నందుకు నన్ను కోపపడవద్దు. నిన్ను భయ పెట్టడానికి నేను ఇట్లా చెప్పడము లేదు. నీకు రోషము వచ్చి వెంటనే రావణాసురుణ్ణి సంహారము చేయడానికోసము చెప్పు తున్నాను. ఓ ప్రభూ, నీవు నీ పరాక్రమముతో దేవతలను అయినా నిగ్రహించ కలవు. నీకు ఆ సామర్థ్యము ఉంది. ఇప్పుడు నీ చుట్టూ ఉన్న మహావానరసైన్యాన్ని నాలుగు అవయవాలుగా వ్యూహము పన్ను. రావణాసురుణ్ణి వధించు" అని చెప్పినాడు.

ఈ విధముగా విభీషణుడు చెప్పిన తరువాత రాముడు శత్రుసంహారము చేయడానికి వానరయూథపతులను చూచి "ఓ వానరవీరులారా, మీలో నీలుడు వానరయోధులను వెంటపెట్టు కొని ఈ లంకాపట్టణ తూర్పుద్వారములో ఉన్న ప్రహస్తుడితో పోరాడవలెను. వాలి పుత్రుడు అంగదుడు వానరసైన్యముతో పోయి దక్షిణద్వారములో ఉన్న మహోదరుడితోనూ మహా పార్శ్వుడితోనూ యుద్ధము చేయవలెను. అప్రమేయబలుడు హనుమంతుడు వానరసైన్యముతో పోయి పశ్చిమద్వారాన్ని పడ కొట్టవలెను.

"దైత్యదానవసంఘాలకున్నూ మహాత్ములు అయిన మహర్షు లకున్నూ అపకారము చేసిన ఆ క్షుద్రుణ్ణి బ్రహ్మదేవుడి వరదానము వల్ల బలవంతుడు అయి ప్రజలను హింసిస్తూ ఉన్న ఆ క్రూరుణ్ణి సమస్తలోకాలలోనూ యథేష్టముగా తిరుగుతూ ఉన్న ఆ రాక్షసాధిపతిని రావణాసురుణ్ణి స్వయముగా నేనే సంహారము చేయ నిశ్చయించుకొన్నాను. ఆ రావణాసురుడు వాడి సైన్యాలతో ఉన్న ఉత్తరద్వారముదగ్గరకు నేను నా తమ్ముడు లక్ష్మణుడితో పోయి పోరాడుతాను.

"వానరరాజు సుగ్రీవుడూ భల్లూకరాజు జాంబవంతుడూ రాక్షసరాజు తమ్ముడు విభీషణుడూ ఆకాశమార్గాన పోయి లంకా పట్టణ మధ్యగుల్మములో పోరాడవలెను.

"ఈ యుద్ధములో వానరులు ఇప్పుడు ఉన్నట్టు మనుష్య రూపము ధరించకూడదు. వానరరూపముతోనే ఉండవలెను. అదే మన సైనికులు అని తెలియడానికి గుర్తు. మహాపరాక్రమ వంతుడు నా తమ్ముడు లక్ష్మణుడూ నేనూ నీలుడూ అంగదుడూ

హనుమంతుడూ సుగ్రీవుడూ మన స్నేహితుడు విభీషణుడూ మొత్తము మేము ఏడుగురమూ మనుష్యరూపములో యుద్ధము చేస్తాము" అని చెప్పినాడు.

ఆ మతిమంతుడు రాముడు కార్యసిద్ధికోసము ఈ విధముగా నిర్ణయించినాడు. రమణీయము అయిన సువేలపర్వతతటాన్ని చూచినాడు. ఆ ప్రదేశానికి ఎక్కి పోవలెను అనుకొన్నాడు.

అంతట ఆ మహాబుద్ధిమంతుడు ఆ మహాధైర్యవంతుడు రాముడు మహత్తరము అయిన వానరసైన్యము ఆ సువేలపర్వత ప్రాంతభూమిని అంతా ఆవరించి వెంటవస్తూ ఉండగా పరమసంతోషములో లంకాపట్టణముమీదికి పోయినాడు.

౩౮

రాముడు లక్ష్మణుడితో ఆలోచించినాడు. అంతట ఆ సువేల పర్వతశిఖరముమీదికి పోవడానికి నిశ్చయించుకొన్నాడు. ధర్మజ్ఞులూ మంత్రజ్ఞులూ కార్యవిధిజ్ఞులూ అనురక్తులూ అయిన సుగ్రీవుణ్ణీ విభీషణుణ్ణీ చూచి మధురముగా "ఓ మిత్రులారా, నానావిధధాతువులలో ధగధగలాడుతూ ఉన్న ఈ సువేలపర్వతశిఖరముమీదికి మనము అందరమూ పోదాము. ఇప్పుడు లంకాపట్టణము ఎట్లా ఉందీ మనకు అక్కడనుంచి కనబడుతుంది. మనము అందరమూ ఈరాత్రి అక్కడనే ఉండిపోదాము.

"వాడు ఆ రావణుడు తన చావుకోసము నా భార్యను ఎత్తుకొనిపోయినాడు. వాడు ధర్మాధర్మాలు ఆలోచించలేదు. సదాచారాన్ని పాటించలేదు. పులస్త్యవంశగౌరవాన్ని గణించలేదు. రాక్షససాధారణము అయిన నీచబుద్ధితో నింద్యము అయిన పరదారాపహరణము చేసినాడు. ఆ నీచుడి అపరాధమునుంచి ఇప్పుడు రాక్షసులకు అందరికీ చచ్చిపోయే దురవస్థ వచ్చింది. ఆ రాక్షసాధముడి పేరు చెప్పితే నాకు కోపము వస్తుంది. ఒక్కడు కాలపాశవశంగతుడు అయి అపచారము చేస్తాడు. ఆ నీచుడి అపచారము నుంచి వాడి వంశము అంతా నాశనము అయిపోతుంది" అని కోపములో చెప్పుతూనే రాముడు ఆ రాత్రి ఉండడానికి సువేల పర్వతముమీదికి నడువ సాగినాడు. హెచ్చరికతో మహాచ్ఛరము

తీసుకొని ఆ పరమపరాక్రమవంతుడు లక్ష్మణుడు రాముణ్ణి వెంబడించినాడు. ఆ లక్ష్మణుడి వెనక సుగ్రీవుడున్నూ తన నల్గురు మంత్రులతో విభీషణుడున్నూ నడిచినారు.

హనుమంతుడూ అంగదుడూ నీలుడూ నలుడూ మైందుడూ ద్వివిదుడూ గజుడూ గవాక్షుడూ గవయుడూ శరభుడూ గంధమాదనుడూ పనసుడూ కుముదుడూ హరుడూ రంభుడూ జాంబవంతుడూ సుషేణుడూ ఋషభుడూ శతవలి మొదలు అయిన వానరయూథపతులూ ఇంకా తక్కిన వానరయోధులూ ఆ రాముడి వెంట సువేల పర్వతముమీదికి వాయువేగముతో పోయినారు. అచిరకాలములో ఆ సువేలపర్వతశిఖరముమీదికి ఎక్కిపోయినారు.

ఆ సువేలపర్వతానికి ఎట్టఎదుట త్రికూటపర్వతశిఖరముమీద ఆకాశములో వేళ్ళాడుతున్నట్టు కనిపిస్తూ ఉన్న లంకాపట్టణాన్ని వారు అందరూ చూచినారు. అందము అయిన బహిర్ద్వారాలతోనూ ఎత్తు అయిన ప్రాకారాలతోనూ రాక్షససమూహాలతోనూ శోభిస్తూ ఎత్తు అయిన ప్రాకారముమీద నల్లటి రాక్షసులతో మరి ఒక ప్రాకారముగా ఉన్న ఆ లంకాపట్టణాన్ని వానరయూథపతులు అందరూ చూచి యుద్ధోత్సాహులు అయినారు. రాముడి అనుమతితో నానావిధ సింహనాదాలు చేసినారు.

అప్పుడు సంధ్యాకాలము అయినందువల్ల సూర్యుడు ఎర్రపడి పోయినాడు. అంతట అస్తమించినాడు. అప్పుడు పూర్ణచంద్రుడితో శోభాయమానముగా వెన్నెల వచ్చింది. రాత్రి అయింది. ఆ వానరవాహినులు శత్రువుల చేతిలో పడకుండా ఉండే ఏర్పాట్లను అన్నిటినీ చేసిన రాముణ్ణి విభీషణుడు అభినందించినాడు. పూజించినాడు. అంతట ఆ రాత్రి ఆ వానరవీరసమూహాల నడుమను ఆ సువేలపర్వతముమీద రాముడు లక్ష్మణుడితోకూడా హాయిగా నిద్రపోయినాడు.

౪౯

ఆ వానరవీరులు ఆ రాత్రి అంతా ఆ సువేలపర్వతముమీద హాయిగా కాలము గడిపినారు. వనదుర్గముగా ఉన్న మహావనాలనూ ఉద్యానవనాలనూ తెల్లవారుతూనే చూచినారు. అవి అన్నీ

మిట్టపల్లాలు లేని సమప్రదేశములో (సువేలపర్వతమునుంచి త్రికూటపర్వతమువరకూ) ఎంతో దూరము విశాలముగాను రమణీయముగానూ నేత్రపర్వముగానూ కనిపించినవి. ఆ వనాలనూ ఆ ఉద్యానవనాలనూ వానరులు అందరూ చూచినారు.

ఆ వనాలలో సంపెంగిచెట్లూ సురపొన్నచెట్లూ మద్దిచెట్లూ నేల కనపడకుండా కానుగు తోపులూ పంక్తులు పంక్తులుగా నాగకేసరచెట్లూ అశోకవృక్షాలూ తాటిచెట్లూ మద్దిచెట్లూ ఏరుమద్దిచెట్లూ కడిమిచెట్లూ పూచిన ఏడాకుల అరటిచెట్లూ కొండగోగుచెట్లూ కలిగొట్టుచెట్లూ కనిపించినవి. ఆ యా మహోన్నతవృక్షాలకు రకరకాల లతలూ అల్లుకొన్నవి. అట్లా అల్లుకొన్న ఆ లతలూ ఆ చెట్లూ పూలు పూసినవి. అందువల్ల ఆ వృక్షాల చివరను ఎర్రటి రంగుతో చిగుళ్ళూ చిత్రవిచిత్రము అయిన రంగులతో పూలూ కనిపించినవి. చుట్టూ చిత్రవిచిత్రము అయిన వనాలతోనూ ఉద్యానవనాలతోనూ పచ్చికబయళ్ళతోనూ జలాశయాలతోనూ ఆ లంకాపట్టణము దేవేంద్రుడి అమరావతీపట్టణమువలె శోభాయమానముగా కనిపించింది. మధురవాసనలు గుబాళించే మహారమణీయము అయిన పూలతోనూ పండ్లతోనూ ఆ యా వృక్షాలు చందనచర్చ చేసుకొని ఆభరణాలను అలంకరించుకొన్న దేవతలవలె కనిపించినవి.

ఆ మహావనము సర్వఋతువులలో తుమ్మెదలు మూగే రమ్యమూ మనోజ్ఞమూ అయిన కుబేరుడి చైత్రరథవనమువలెనూ దేవేంద్రుడి నందనోద్యానవనమువలెనూ తోచింది. ఆ మహావనములో సెలవేళ్లదగ్గర నీరుకోళ్ళూ చీకుకొక్కెరలూ తిరుగుతూనూ నెమళ్ళు నాట్యము చేస్తూనూ కోకిలలు మధురగానము చేస్తూనూ ఉండడము ఆ వానరవీరులు అందరూ గమనించినారు. ఆ యా పక్షుల పాటలు విన్నారు. సంతోషాతిశయముతో ఆ కామరూపుల దేహాలు ఉప్పొంగిపోయినవి.

ఆ యా పుష్పఫలభరితవృక్షాలమీద మదించిన పక్షులు పాటలు పాడుతూనూ తుమ్మెదలు పూలతేనెలు తాగుతూనూ (భృంగరాజాలు) గండు తుమ్మెదలు ఝుంకారము చేస్తూనూ వృక్షసమూహాలలో కోకిలలు పాటలు పాడుతూనూ కౌజుపిట్టలూ బెగ్గురు

పక్షులూ మధురధ్వనులు చేస్తూనూ ఉన్న ఆ లంకాపట్టణప్రాంత వనాలలోకి వానరవీరులు పోయినారు. ఆ వనాలలో పుష్పసంసర్గము వల్ల సుగంధము గుబాళించే వాయువు చల్లగా హాయిగా వీచినందు వల్ల ఆ వానరవీరుల ఘ్రాణేంద్రియాలు తృప్తిచెందినవి. అప్పుడు కొంతమంది వానరయూథపతులు సుగ్రీవుడి అనుజ్ఞతో లంకా పట్టణాన్ని చూచిరావడానికి ముందుగా బయలుదేరి పోయినారు.

అమితవేగముతో బయలుదేరి పోయిన ఆ వానరవీరుల పాద ఘట్టనలకు భూమి అదిరిపోయింది. భూమిమీదినుంచి లేచిన దుమ్ము ఆకాశాన్ని కనపడకుండా ఆవరించింది. వారి సింహ నాదాలకు ఆ లంకాపట్టణప్రాంతవనాలలో ఉన్న పక్షులూ జింకలూ ఏనుగులూ ఎలుగుబంట్లూ అడవిపందులూ అడవిదున్నలూ సింహాలూ బెదిరిపోయి దశదిశలా పరుగులెత్తినవి. ఆ మహాధ్వనికి లంకాపట్టణము అంతా సంచలించిపోయింది.

(ఆ లంకాపట్టణానికి చుట్టూఉన్న సముద్రము జలదుర్గము. అదిదాటిన తరువాత సువేలపర్వతము పర్వతదుర్గము. ఆ పర్వత దుర్గము దాటిన తరువాత వనదుర్గము. ఆ వనదుర్గము దాటిన తరు వాత త్రికూటపర్వతముమీద లంకాపట్టణము ఉంది.) ఆ త్రికూట పర్వతశిఖరము చాలా ఎత్తు అయింది. అది ఆకాశాన్ని స్పృశిస్తున్నట్టుగా కనిపించింది. అంతటా పూలు కమ్ముకొని అది బంగారము వన్నెలో ధగధగ లాడుతూ ఉంది. రమణీయముగానూ నేత్రపర్వముగానూ తోచింది. ఆ ఎత్తుకు పక్షులు సయితము ఎగిరి పోలేవు. అక్కడికి పోగలము అని మనస్సులోనయినా ఎవరూ అనుకోలేరు. కాలి నడకను అక్కడికి పోవడము ఉత్తది అని వేరే చెప్ప నక్కరలేదు.

ఆ త్రికూటపర్వతశిఖరముమీద రావణాసురుడు ఏలుతూ ఉన్న లంకాపట్టణము నూరుయోజనాలు పొడుగునా ముప్పయి యోజనాలు వెడల్పునా ఉంది. ఆ లంకాపురద్వారాలు తెల్లటి మేఘాలవలె చాలా ఎత్తునఉన్నవి. ప్రాకారాలు వెండి బంగారు కాంతులతోనూ తేజరిల్లుతూ ఉన్నవి. ఆకాశమధ్యములో వర్షా కాలపు మేఘాలవలె అక్కడి ప్రాసాదగృహాలూ విమానగృహాలూ శోభిస్తూ ఉన్నవి. కైలాసశిఖరమువలె అక్కడ వెయ్యిస్తంభాలతో

ప్రాసాదభవనము ఆకాశములోకి చొరుచుకొని పోతున్నట్లుగా కనిపించింది. అక్కడ మార్లకొద్దీ రాక్షసులు కావలి కాస్తూ ఉన్నారు. ఆ రాక్షసేంద్రుడి చైత్యప్రాసాదభవనము ఆ లంకా పట్టణానికి ఒక ఆభరణము వంటిది.

మధురగానము చేస్తూఉన్న రకరకాల పక్షులతోనూ వివిధ మృగాలతోనూ ఆ త్రికూటపర్వతప్రాంతాన ఉన్న మహారణ్యాలనూ వివిధధాతువులతో ధగధగలాడుతూ ఉన్న అక్కడి క్రీడాపర్వతాలనూ మనోహరము అయిన ఉద్యానవనాలనూ వత్తుగా ఉన్న మహాగృహాలనూ పంక్తులు పంక్తులుగా ఉన్న ప్రాసాదగృహాలనూ వివిధాకారాలలో ఉన్న రాక్షసులనూ నానావిధరక్షణలతోనూ గొప్ప యంత్రాలు అమర్చిన బహిర్ద్వార కవాటాలతోనూ సమస్త ద్రవ్య సమృద్ధముగా ఆ త్రికూటపర్వతముమీద ఉన్న లంకాపట్టణాన్ని ఆ శ్రీమంతుడు పరమపరాక్రమవంతుడు రాముడు లక్ష్మణుణ్ణీ వానర యూథపతులనూ వెంటపెట్టుకొని సువేలపర్వతముమీదినుంచి చూచి ఆశ్చర్యపడిపోయినాడు.

౪౦

ఆ సువేలపర్వతముమీద రెండు యోజనాల వలయములో ఉన్న వానరసైన్యముతోనూ వానరయూథపతులతోనూ సుగ్రీవుడితోనూ లక్ష్మణుడితోనూ రాముడు ఒక ముహూర్తముసేపు దశ దిశలూ పరిశీలించి చూచినాడు. మనోహరము అయిన త్రికూట పర్వతముమీద రమణీయము అయిన వనాలతో విశ్వకర్మ నిర్మించిన ఆ లంకాపట్టణాన్నీ ఆ పట్టణగోపురశిఖరముమీద ఉన్న రావణాసురుణ్ణీ రాముడు అప్పుడు చూచినాడు.

ఆ రావణాసురుడికి ఇరువైపులా పరిచారికలు తెల్లటి వింజామరలతో వీస్తున్నారు. జయసూచకము అయిన ఛత్రము పట్టినారు. ఒంటినిండా రక్తచందనము పూసి ఉంది. మెడలోనుంచి వేళ్ళాడుతూ ఉన్న రత్నాభరణాలు మెరుపులవలె తళతళలాడుతూ ఉంటే అతడు నీలమేఘమువలె కనిపించినాడు. అతని వక్షఃస్థలముమీద ఐరావతము కొమ్ములతో గీరిన గాయాల మచ్చలు కనిపించినవి. బంగారు జరీ ఉత్తరీయము వేసుకొన్నాడు. కుందేటినెత్తురువంటి ఎర్రటి

వస్త్రము కట్టుకొన్నాడు. ఆకాశములో సంధ్యారాగము అలము కొన్న మహానీలమేఘమువలె తోచినాడు.

అట్లా కనిపించిన ఆ రాక్షసరాజును రావణాసురుణ్ణి రామ లక్ష్మణులూ వానరవీరులు అందరూ చూస్తూ ఉన్నారు. ఆ రాక్షస రాజును చూచే చూడటములో సుగ్రీవుకికి పట్టరాని కోపము వచ్చింది. ఆ ధైర్యవంతుడు ఆ బలవంతుడు హఠాత్తుగా లేచి నాడు. ఆ సువేలపర్వతశిఖరముమీదినుంచి ఎగిరి ఇట్టే రావణా సురుడు ఉన్న గోపురముమీదికి పోయినాడు. ఆ రావణాసురుణ్ణి ఒక క్షణముసేపు తేరిపార చూచినాడు. అతణ్ణి ఒక గడ్డిపోచగా భావించి నిర్భయముగా పరుషముగా "ఓ రాక్షసుడా, నేను లోక నాథుడు రాముడి దాసుణ్ణి. ఆ మహానుభావుడు మాత్రము నన్ను తన స్నేహితుడు అని చెప్పుతూ ఉంటాడు. ఆ రామప్రభు తేజము నాలో ఉంది. నీవు ఇప్పుడు నన్ను తప్పించుకొని పోలేవు" అంటూ సుగ్రీవుడు ఠటాలున పయికి ఎగిరి ఆ రావణాసురుడి కిరీటాన్ని లాగి నేలమీద పారవేసినాడు.

అంతవేగములో తనమీదికి వస్తూఉన్న సుగ్రీవుణ్ణి చూచి ఆ రాక్షసరాజు రావణాసురుడు "ఓరీ, నీవు నాకు కనపడనంత వరకూ సుగ్రీవుడవు (మంచి మెడకలవాడవు) ఇప్పుడు నీవు హీన గ్రీవుడవు (మెడలేనివాడవు)" అంటూ లేచి తన రెండుచేతుల తోనూ సుగ్రీవుణ్ణి నేలమీద పడవేసినాడు. నేలమీద పడ్డ సుగ్రీవుడు బంతివలె పయికి ఎగిరి తన రెండు చేతులతోనూ రావణా సురుడిమీద కలియపడ్డాడు.

అప్పుడు ఆ ఉభయుల దేహాలనుంచీ చెమటలు కారినవి. ఉభయుల దేహాలనిండా నెత్తురు కమ్ముకొన్నది. ఒకరిని ఒకరు పెనవేసి పట్టుకొని క్షణముసేపు కదలకుండా మెదలకుండా నిలుచు న్నారు. అప్పుడు ఒకరు పూచిన బూరుగు చెట్టువలెనూ ఒకరు పూచిన మోదుగుచెట్టువలెనూ కనిపించినారు.

ఆ వానరరాజూ ఆ రాక్షసరాజూ ఒకరిని ఒకరు పిడిగుద్దులు గుద్దుకొన్నారు. అరచేతులతో బాదుకొన్నారు. మోచేతులతో పొడుచుకొన్నారు. గోళ్ళతో గిచ్చుకొన్నారు. సహించలేని బాధలో ఒకరితో ఒకరు పోట్లాడినారు.

ఆ గోపురపు తిన్నెల మధ్యను ఆ ఇద్దరు మహాబలవంతులూ భయంకర వేగముతో చేతులతో పట్టుపట్టినారు. ఒకరిని ఒకరు పయికి ఎగరవేసినారు. ఒకరిని ఒకరు కిందకు పడలాగినారు. ఒకరి దేహాన్ని ఒకరు వంగటీసినారు. ఉభయులూ ఆ గోపురవేదికలకు పాదాలు తన్నిపట్టి ఒకరిని ఒకరు పడలాగినారు. ఒకరి దేహాన్ని ఒకరు చేతులతో పెనవేసి పట్టుకొన్నారు. ప్రాకారానికీ అగడ్తకూ మధ్యను ఉన్న నేలమీద ఇద్దరూ పడ్డారు. ఇద్దరూ పయికి ఎగిరి ఒక క్షణముసేపు బుసలుకొట్టి ఒకరిని ఒకరు పెనవేసి పట్టుకొన్నారు.

అంతట ఆ ఇద్దరూ అభ్యాసబలముతోనూ సహజబలముతోనూ చెలరేగి సింహాలవలెనూ పెద్దపులులవలెనూ పోతుటేనుగులవలెనూ తిరుగుతూ వివిధపద్ధతులలో పోరాడినారు. ఒకరికి ఒకరు ఎదురుగుండా పోయి నిలుచున్నారు. ఎదురు రొమ్ములతో ఒకరిని ఒకరు కొట్టుకొన్నారు. ఏకకాలాన నేలమీద పడ్డారు. ఒక్కసారిగా ఉభయులూ నేలమీదనుంచి లేచినారు. ఒకరిని ఒకరు కొట్టుతూ అనేకవిధాల పోరాడినారు.

వారు ఉభయులూ బలవంతులుమాత్రమే కారు. ఉభయులూ వ్యాయామశిక్ష పొందినవారు. ఉభయులూ చక్కగా సాము చేసినవారు. ఉభయులూ మదపుటేనుగులవంటివారు. ఏనుగుల కట్టుస్తంభాలవంటి తమచేతులతో ఎంతసేపు పెనుగులాడినా వారిలో ఒక్కరున్నూ అలసిపోలేదు. ఉభయులూ అమిత వేగముతో గుండ్రముగా తిరుగుతూ ఎంతోసేపు పోరాడినారు. సుగ్రీవుణ్ణి రావణుడు చంపివేయవలెను అనుకొన్నాడు. రావణుణ్ణి సుగ్రీవుడు చంపివేయవలెను అనుకొన్నాడు. ఎలుకకోసము పొంచి ఉండే పిల్లిమాదిరిగా ఇద్దరూ సమయముకోసము కనిపెట్టుకొని ఎప్పటికి అప్పుడు ఒకరిమీదికి ఒకరు దూకడానికి సిద్ధము అయినారు.

ఆ వానరరాజు సుగ్రీవుడూ రాక్షసరాజు రావణాసురుడూ మల్లయుద్ధవిశారదులు. వివిధవిధాల పోరాటములోనూ ఆరితేరినవారు. వారు విచిత్రము అయిన మండలాకారముగా-వైష్ణవమూ వైశాఖమూ మండలమూ ప్రత్యాలీఢమూ ఆలీఢమూ అనే స్థానాలలో నిలుచుంటూనూ గోమూత్రికమువలె వంకరటింకరగా విచిత్రముగా దగ్గరకు పోతూనూ వెనకకు పోతూనూ పక్కకుపోతూనూ

ఒకరి దెబ్బలు ఒకరు తప్పించుకోడానికి సవ్యాపసవ్యముగా తిరుగుతూనూ పారిపోతున్నట్టు పరుగెత్తి ఎదురుగుండా దగ్గరకు వచ్చి నిర్భయముగా నిలుచుంటూనూ పరాఙ్ముఖులు అయినట్టు వెనకకు పోతూనూ తమ తమ కాయాలను సంకోచించి వంగి ఎదిరిపట్టు తప్పించుకొంటూనూ ఎదిరిని కాలితో తన్నడానికి పయికి ఎగురుతూనూ ఎదిరి చెయ్యి పట్టుకోవస్తూ ఉంటే తన చెయ్యి ముడుచుకొంటూనూ పోరాడినారు.

అంతలో రావణాసురుడు తన మాయలు చూపించడానికి మొదలుపెట్టినాడు. సుగ్రీవుడు అది కనిపెట్టినాడు. అతడు అప్పటికి ఏమాత్రమూ అలసిపోలేదు. జయశాలిగానే ఉన్నాడు. అయితే రావణాసురుడి ఆలోచన తెలుసుకొన్నాడు. అతగాణ్ణి మోసము చేయవలెను అనుకొన్నాడు. ఇట్టే ఆకాశానికి ఎగిరినాడు. అప్పుడు రావణాసురుడు తెల్లపోయి అక్కడనే నిలుచున్నాడు.

రావణాసురుడు అలసి సొలసి పోయేటంతవరకూ సుగ్రీవుడు పోరాడినాడు. ఆ సూర్యపుత్రుడు సుగ్రీవుడు అంతట అతివిశాలము అయిన ఆకాశాన్ని లంఘించి వానరవీరుల మధ్యను ఉన్న రాముడి పార్శ్వానికి చేరవలెను అనుకొన్నాడు. రాముడికి యుద్ధోత్సాహము వృద్ధిచేయడానికి అంతట సుగ్రీవుడు వాయువేగముతో సంతోషముగా వానరసేనాసమూహములోకి వచ్చి వాలినాడు.

౪౧

రామలక్ష్మణులు గాయాలతో వచ్చిన సుగ్రీవుణ్ణి చూచినారు. ఆ వానరరాజును రాముడు కౌగలించుకొని "మిత్రుడా, నీవు నాతోకూడా ఆలోచించకుండా సాహసము చేసినావు. ఇటువంటి సాహసపు పనులు రాజులు ఎవరూ చేయరు. నీవు వీరుడవు. సాహసప్రియుడవు. నేనూ ఈ విభీషణుడూ ఈ వానరసైన్యమూ నీవు ఏమి అయిపోతావోను అనే సందేహముతో బాధపడ్డాము. నీవు చిక్కు తెచ్చిపెట్టే సాహసము చేసినావు. ఓ సుగ్రీవుడా, నీవు ఇప్పుడు చేసినట్టుగా ఇకను ఎప్పుడూ నాతో ఆలోచించకుండా చేయవద్దు.

"ఓ మహాబాహూ, నీవు శత్రువులను వధించగలవు. నాకు తెలుసును. కాని నీకు ఏ ఆపద అయినా వచ్చేట్లయితే నాకు సీతతో కాని భరతుడితో కాని లక్ష్మణశత్రుఘ్నులతో కాని చివరకు నా శరీరముతో కాని నాకు ఏమీ పనిలేదు. మిత్రుడా, నీవు దేవేంద్రుడు అంతటి పరాక్రమవంతుడవు. వరుణదేవుడు అంతటి సాహసివి. నేను నిన్ను ఎరిగి ఉన్నప్పటికిన్ని నీవు తిరిగి వచ్చేటంతవరకూ ఏమి ఆపద వస్తుందోను అని భయపడ్డాను.

"ఓ బలవంతుడా, నేను యుద్ధములో ఆ రావణాసురుణ్ణి పుత్ర బంధు సైన్య సమేతముగా సంహారము చేసివేసి లంకాపట్టణములో విభీషణుడికి రాజ్యాభిషేకము చేసి అయోధ్యానగరానికి పోయి భరతుడికి రాజ్యము ఒప్పగించి దేహము చాలించవలెను అనుకొంటున్నాను" అని చెప్పినాడు.

ఇట్లా రాముడు చెప్పిన మాటలు విని సుగ్రీవుడు "రామా, నీవు మహావీరుడవు. నీకు నేను ఏమి అని చెప్పేది. నీ భార్యను ఎత్తుకొనిపోయిన రాక్షసుణ్ణి చూచినాను. నేను సహించలేక పోయినాను. నేను పౌరుషము కలవాణ్ణి. నిలువలేకపోయినాను. అయితే, వాణ్ణి నీవే వధించవలెను. కాబట్టి నేను వాణ్ణి చంపి వేయకుండా తిరిగి వచ్చినాను" అని చెప్పినాడు.

రాముడు ఆ వీరుణ్ణి సుగ్రీవుణ్ణి కౌగలించుకొని అభినందించినాడు. అంతట లక్ష్మణుణ్ణి చూచి "లక్ష్మణా, చల్లని జలాలతోనూ రుచ్యము అయిన ఫలాలతోనూ ఉన్న ఈ వనములోనే ఈ సేనా సమూహాలను చక్కగా విభజించి వ్యూహాలుగా ఏర్పాటు చేయవలెను. లోకక్షయకరమూ భయంకరమూ అయ్యే ఋక్షవానర రాక్షసవధ జరుగుతుంది అని నాకు తోస్తున్నది. భయనిమిత్తాలు కనపడుతున్నవి. చూడు గాలి దేహాన్ని పెల్లగొట్టుతున్నది. భూమి కదులుతూ ఉంది. పర్వతశిఖరాలు వణుకుతూ ఉన్నవి. చెట్లు విరిగి పడిపోతున్నవి. మేఘాలు క్రూరము అయిన పక్షుల వలె భయంకరముగా గర్జిస్తున్నవి. రక్తబిందువులతో మహాభయంకరముగా వాన కురుస్తున్నది. రక్తచందనకాంతులతో సంధ్య పరమదారుణముగా కనపడుతున్నది. సూర్యమండలమునుంచి అగ్నికణాలు రాలిపడుతున్నవి. భయంకరము అయిన మృగ పక్షి

సమూహాలు అమంగళముగా సూర్యుడికి ఎదురుగుండా నిలుచుని ఏడుస్తున్నవి. మహాభయము పుట్టేట్టు అరుస్తున్నవి. ప్రళయ కాలములోవలె చంద్రుడు కాంతిహీనుడు అయిపోయి నలుపూ ఎరుపూ కిరణాలతో రాత్రిపూట దేహతాపము ఎత్తిస్తున్నాడు. అంతే కాదు. చంద్రుడి గాలిగుడి కురచ అయిపోయింది. రక్త వర్ణముతో భయంకరముగా కనపడుతున్నది. పగలు సూర్య మండలములో నల్లటిమచ్చ కనపడింది. నక్షత్రాలు ఎప్పటిమాదిరిగా కనపడడములేదు. చూడు, కాకులు డేగలతోనూ గద్దలు చిన్న చిన్న పిట్టలతోనూ కలుస్తున్నవి. నక్కలు పెద్దపెట్టున అమంగళ ముగా అరుస్తున్నవి. మనము వెంటనే ఇప్పుడే ఈ వానరసైన్యాన్ని వెంటపెట్టుకొని లంకాపట్టణానికి పోదాము. ఆ పట్టణము ఇంతవరకూ ఎవరికీ ఎదిరించ నలవికాకుండా ఉంది. మనము వేగముగా ముట్ట డించడము మంచిది'' అని చెప్పినాడు.

ఆ మహాబలవంతుడు ఆ పరమపరాక్రమవంతుడు రాముడు ఇట్లా లక్ష్మణుడితో చెప్పి అప్పటికి అప్పుడు ఆ పర్వతశిఖరము మీది నుంచి కిందికి దిగినాడు. దుర్ధర్షము అయిన వానరసైన్యాన్ని చూచినాడు. ఆ కాలజ్ఞుడు ఆ ధర్మజ్ఞుడు రాముడు అంతట సుగ్రీవుడి సాయముతో ఆ వానరసైన్యాన్ని యుద్ధసన్నద్ధము చేసినాడు.

ఆ మహాధానుష్కుడు రాముడు ప్రాతఃకాలాన ఆ అనంత వానరవాహినిని వెంటపెట్టుకొని లంకాపట్టణానికి ఎదురుగుండా నడువ సాగినాడు. అప్పుడు ఆ మహానుభావుడివెంట విభీషణుడూ సుగ్రీవుడూ లక్ష్మణుడూ హనుమంతుడూ జాంబవంతుడూ సుషే ణుడూ నడిచినారు. వారి వెనుక భల్లూకవీరులతోనూ వానరవీరుల తోనూ ఆ మహావానరవాహిని భూమిని అంతా ఆవరించి నడిచింది. ఏనుగులవంటి వానరవీరులు పెద్ద పెద్ద చెట్లనూ కొండరాళ్ళనూ చేతులలో పట్టుకొని అడ్డగించ నలవికాకుండా నడిచినారు. పతాక పంక్తులతోనూ ఎంతో ఎత్తు అయిన ప్రాకారముతోనూ బహిర్ద్వా రాలతోనూ దేవతలకు అయినా చొర నలవికాకుండానూ ఉన్న లంకాపట్టణము దగ్గరకు పోయినారు.

ఆ లంకాపట్టణోత్తరద్వారము పర్వతశిఖరము అంత ఎత్తున ఉంది. ఆ ద్వారాన్ని రావణాసురుడు కాస్తున్నాడు. భయంకరా

కారులూ వివిధాయుధధారులూ అయిన రాక్షసులు అక్కడ అంతటా యుద్ధసన్నద్ధులుగా ఉన్నారు. అది వరుణదేవుడు పరిపాలించే భయంకరము అయిన మహాసముద్రమువలెనూ దానవులు కాపాడే పాతాళలోకమువలెనూ కనిపించింది. ఆ ద్వారాన్ని సామాన్యులు చూస్తే దద్దరిల్లిపోతారు. ఆ ఉత్తరద్వారాన్ని కొట్టే సామర్థ్యము రాముడికి తప్ప మరి ఎవరికీ లేదు. ఆ ఉత్తరద్వారములో ఉన్న రాక్షసయోధులు ఉపయోగించే వివిధాయుధాలనూ వారు తొడుగుకొనే కవచాలనూ రాముడు చూచినాడు.

వానరసేనానాయకుడూ పరమపరాక్రమవంతుడూ అయిన నీలుడు మైందద్వివిదులతో తూర్పుద్వారముదగ్గర నిలచినాడు. మహాబలవంతుడు అంగదుడు ఋషభుడితోనూ గవాక్షుడితోనూ గజుడితోనూ గవయుడితోనూ దక్షిణద్వారముదగ్గర నిలచినాడు. హనుమంతుడు ప్రమాథీ ప్రఘసుడూ మొదలు అయిన వానరవీరులతో పశ్చిమద్వారముదగ్గర నిలచినాడు. ఉత్తర పశ్చిమ ద్వారాల మధ్యను గరుత్మంతుడితోనూ వాయుదేవుడితోనూ సరిసమానము అయిన వేగముతో పోరాడే వానరయూథపతులతోనూ ముప్పయి ఆరుకోట్లమంది వానరయోధులతోనూ సుగ్రీవుడు నిలచినాడు. అది ఆ సైన్యానికి మధ్య గుల్మము.

అప్పుడు రామాజ్ఞను శిరసావహించి లక్ష్మణుడూ విభీషణుడూ ఒక్కొక్క ద్వారముదగ్గర ఒక్కొక్క కోటిమంది వానరవీరులను ఉంచినారు. బహుసైన్యముతో జాంబవంతుడు సుగ్రీవుడి సమీపములో నిలచినాడు. ఆ వానరయోధులు అందరూ పెద్దపులులవలె గోళ్ళతోనూ కోరలతోనూ పోరాడుతారు. ఆ వానరయోధులు అప్పుడు సంతోషముతో పర్వతశిఖరాలవంటి పెద్ద పెద్ద రాళ్ళు పట్టుకొనీ చెట్లు పట్టుకొనీ యుద్ధానికి సంసిద్ధము అయినారు.

ఆ వానరయోధులు అందరూ తమ తమ తోకలు పైకి ఎత్తినారు. కోపముతో నేత్రాలూ ముఖాలూ ఎర్రచేసినారు. గోళ్ళతో చీల్చివేయడానికీ కోరలతో కొరికివేయడానికీ సంసిద్ధులు అయినారు. చిత్రవిచిత్రము అయిన దేహాలతోనూ వికృతాననాలతోనూ ఆ వానరులు అందరూ లంకాపట్టణాన్ని ముట్టడించడానికి సంసిద్ధముగా నిలుచున్నారు.

ఆ వానరులలో కొందరు పది ఏనుగుల బలము కలవారు. కొందరు నూరు ఏనుగుల బలము కలవారు. కొందరు వెయ్యి ఏనుగుల బలము కలవారు. కొందరు వానరయూథపతులు ఓఘసంఖ్యాకము అయిన ఏనుగుల బలము కలవారు. కొందరు అంతకు నూరంతలు బలము కలవారు. కొందరు ఇంత అంత అని లెక్క వేయనలవికాని బలవంతులు. అప్పుడు అక్కడ ఆ వానరసైన్యము మిడుతలదండువలె విచిత్రముగా కనిపించింది. అట్లా ఆ లంకాపట్టణముదగ్గర ఉన్న వానరులే కాకుండా ఇంకా వెనకనుంచి ఆకాశమార్గాన ఎగిరి వస్తూ ఉన్న వానరులలోనూ భూమిమీద నడిచి వస్తూ ఉన్న వానరులతోనూ అటు ఆకాశమూ ఇటు భూమీ కనిపించకుండా పోయినవి. అదివరకు నియమించిన వానరయోధులే కాకుండా ఒక్కొక్క ద్వారముదగ్గర ఒక్కొక్క కోటిమంది భల్లూకవీరులూ ఇంకా ఇతర వానరయోధులూ వచ్చి చేరినారు. ఆ యా ద్వారాల దగ్గరనే కాకుండా ఆ లంకాపట్టణము చుట్టూ కోట్లకొద్దీ వానరులు నిలిచినారు. అట్లా వానరసమూహాలు చుట్టూ మూగడమునుంచి ఆ లంకాపట్టణములోనికి గాలి చొరపడి వీచలేకపోయింది.

అంత వేగముగా అంతమంది వానరులు మహామేఘాలు కమ్ముకొన్నట్టు ఆ లంకాపట్టణాన్ని ముట్టడించడము చూచి రాక్షసులు విస్మయపడిపోయినారు. ఆ వానరసేనాసమూహాలు అట్లా వస్తూ ఉంటె సముద్రము చెలియలికట్టను తెంచుకొని మహాధ్వని చేస్తూ ప్రవహిస్తున్నట్టుగా తోచింది. ఆ మహాధ్వనికి లంకాపట్టణ ప్రాంతవనాలూ ప్రాకారాలూ బహిర్ద్వారాలూ అవీ ఇవీ ఏమిటి ఆ పట్టణము పట్టణము అంతా చలించిపోయింది. దేవాసురులు అందరూ ఏకము అయినా ఎదిరించ నలవికాని ఆ వానరసైన్యము రామ లక్ష్మణ సుగ్రీవులతో నిలచింది.

లంకాపట్టణాన్ని ముట్టడించడానికీ రాక్షసులను అందరినీ సంహారము చేయడానికీ వానరసైన్యము సంసిద్ధము అయింది. ఆ యా కాలానుగుణముగా సామాద్యుపాయాలను ప్రయోగించే క్రమము తెలిసిన రాముడు తదనంతర కార్యక్రమాన్ని గురించి మంత్రులతో [illegible] పదిసార్లు ఆలోచించినాడు. విభీషణుడితో

సంప్రదించినాడు. రాజధర్మము పాటించవలసిందేను అని నిశ్చయించి అంగదుణ్ణి పిలిచి "నాయనా, అంగదుడా, నీవు ఇప్పుడు నిర్భయముగా ఏ దిగులూ లేకుండా ఆకాశమార్గాన లంకాపట్టణములో దశగ్రీవుడిదగ్గరకు పోయి నేను చెప్పినట్టు ఈ మాటలు వాడితో నీవు చెప్పవలెను.

"ఓ రాక్షసుడా, నీ ఐశ్వర్యము అయిపోయింది. నీ రాజరికము అంతరించిపోయింది. నీ తెలివితేటలు అడుగుఅంటి పోయినవి. నీవు చావపోతున్నావు. బ్రహ్మదేవుడు ఇచ్చిన వరము నుంచి నీవు మదముఎక్కి మహర్షులనూ దేవతలనూ గంధర్వులనూ అప్సరసలనూ నాగులనూ యక్షులనూ వారూ వీరూ ఏమిటి— సమస్తము అయిన వారిని హింసించినావు. ఒళ్లు ఎరగకుండా సమస్త పాపకార్యాలూ చేసినావు. నేటితో నీ దర్పము అంతము అయిపోతుంది. వాస్తవము. నేను దండధరుణ్ణి. నిన్ను దండించడానికి వచ్చినాను. ఇప్పుడు నీ లంకాపట్టణ ద్వారముదగ్గర చిపెట్టుకొని ఉన్నాను. నిన్ను చంపివేస్తాను. ఓరాక్షసుడా, నీవు నా చేతిలో చచ్చిపోతావు. కనుక నీ పాపాలు అన్నీ నాశనము అయిపోయి మహర్షులూ రాజర్షులూ మొదలుఅయినవారు పోయే లోకానికి పోతావు.

"ఓ రాక్షసాధముడా, నీవు నన్ను అవతలకు పోనిచ్చి ఏ బలముతో సీతను అపహరించి తెచ్చుకొన్నావో ఆ బలము అంతా ఇప్పుడు చూపించు. లేదా నీవు ఇప్పుడు మైథిలిని తీసుకొని వచ్చి నాకు ఇచ్చి నన్ను శరణము వేడుకో. నీవు ఇట్లా చేయకపోయేట్లయితే నా తీక్ష్ణబాణాలతో నిన్ను చంపివేస్తాను. ఈ లోకము అంతటా అరాక్షసము చేసివేస్తాను. రాక్షసోత్తముడూ ధర్మాత్ముడూ అయిన విభీషణుడు నా శరణు చొచ్చినాడు. ఇకను ఆ శ్రీమంతుడు అకంటకము అయిన లంకాధిపత్యము వహిస్తాడు. సందేహము లేదు. నీకు ఏమీ తెలియడము లేదు. నీకు మూర్ఖులు సహాయులు అయినారు. నీవు పాపిష్టివాడవు. ధర్మహాని చేసినవాడవు. నీవు ఒక్క క్షణము అయినా రాజుగా ఉండడానికి వీలు లేదు.

"ఓ రాక్షసుడా, ధైర్యము తెచ్చుకో. శౌర్యముతో ప్రవర్తించు. యుద్ధానికి దిగు. నా బాణాలతో నిన్ను చంపివేస్తాను. నీవు పవిత్రుడవు అయిపోతావు. అట్లా కాకుండా నీవు పక్షి రూపము ధరించి వాయువేగముతో తప్పించుకొని తిరగ తలచు కొన్నావు ఏమో. ముల్లోకాలలో నీవు ఎక్కడ నా కంటపడినా బ్రతుకడము ఉత్తది.

"ఓ రాక్షసుడా, నీకు హితము చెప్పుతాను. విను. నీవు ఇకను చూడపోయేది ఉండదు. కనుక ఇప్పుడే లంకాపట్టణము అంతా చక్కగా తిరిగి చూడు. నీ ఔర్ధ్వదైహిక క్రియలు నీవే చేసుకో. నీకు నేను అవకాశము ఇస్తున్నాను.

"ఓ అంగదుడా, ఈ నా మాటలు ఎక్కువ తక్కువలు లేకుండా రావణాసురుడితో చెప్పు. వాడు ఏమి చెప్పుతాడో విని రా" అని చెప్పినాడు.

రామాజ్ఞను తలదాల్చి అంగదుడు అప్పటికి అప్పుడు ఆకాశానికి ఎగిరినాడు. ఆకారము ధరించిన అగ్నిహోత్రమువలె ఆకాశమార్గాన పోయి ఒక్కముహూర్తములో ఆ కాంతిమంతుడు రావణాసురుడి మందిరములో ప్రత్యక్షము అయినాడు. ఏమరుపాటు లేకుండా మంత్రులతో కూర్చున్న రావణాసురుణ్ణి చూచినాడు. అంతట ఆ కనకాంగదుడు అంగదుడు రావణాసురుడి సమీపానికి నేలమీద నడిచి పోయి భగభగ మంటలు మండుతున్న అగ్ని హోత్రమువలె నిలుచున్నాడు. అట్లా మంత్రులతో కూర్చుని ఉన్న రావణాసురుడితో తననుగురించి తానే చెప్పుకొని రాముడు చెప్పి పంపించిన మాటలు ఎక్కువ తక్కువలు లేకుండా చెప్పతలచుకొని "ఓ రాక్షసరాజా, కోసలదేశాధిపతి రామప్రభువు నన్ను పంపించి నాడు. నేను ఆయన దూతగా వచ్చినాను. నా పేరు అంగదుడు. నేను వాలి పుత్రుడను. నీవు నా పేరు వినేఉంటావు. రఘువంశ లలాముడు రాముడు నిన్ను ఉద్దేశించి ఈ విధముగా చెప్పినాడు.

"ఓ క్రూరుడా, నీకు పౌరుషము ఉంటే ఇప్పుడు బయటకి వచ్చి నాతో పోరాడు. నిన్నూ నీ పుత్రులనూ నీ జ్ఞాతులనూ నీ బంధువులనూ చంపివేయడానికి వచ్చినాను. ముల్లోకాలలోనూ

నీ భయము లేకుండా చేసివేస్తాను. నీవు దేవతలకూ దానవులకూ కంటకుడవు అయిపోయినావు. నేను నిన్ను ఇప్పుడు వధించివేస్తాను. నీవు బ్రతుక తలచుకొన్నట్లయితే ఇప్పుడు నీవు నా పాదాలు పట్టుకొని నమస్కారముచేసి నన్ను సత్కరించి వైదేహిని నాకు ఇవ్వవలెను. అట్లా చేయకపోయేట్లయితే నిన్ను చంపివేస్తాను. నీ రాజ్యము విభీషణుడికి ఒప్పగిస్తాను. ఈ విధముగా రామప్రభువు చెప్పమన్నాడు" అని పూర్తిచేసినాడు.

ఇంత పరుషముగా అంగదుడు చెప్పతూఉంటే రావణాసురుడు రోషతామ్రాక్షుడు అయి మంత్రులను చూచి "ఈ బుద్ధిహీనుణ్ణి పట్టుకోండి. చంపివేయండి" అని పదేపదే అరిచినాడు. రావణాసురుడు అట్లా అనే అనడములో జ్వలిస్తూ ఉన్న అగ్నిహోత్రాల వంటి భయంకరాకారులు నల్గురు రాక్షసులు అంగదుణ్ణి పట్టుకో వచ్చినారు. అప్పుడు అక్కడ ఉన్న రాక్షసులకు అందరికీ తన బలమూ సామర్థ్యమూ చూపించడానికి ఆ ధైర్యవంతుడు ఆ పరమ పరాక్రమవంతుడు అంగదుడు ఆ రాక్షసులకు నలుగురికీ పట్టు పడి పోయినాడు. అట్లా తన రెండు బాహువులను పట్టుకొన్న నల్గురు రాక్షసులనూ పక్షులవలె తన బాహుద్వయములో ఇరుకించుకొని పర్వతము అంత ఎత్తున ఉన్న ఆ ప్రాసాదశిఖరముమీదికి ఎగిరి పోయినాడు. రాక్షసేశ్వరుడు రావణాసురుడూ తక్కిన రాక్షసులూ చూస్తూఉండగా అమితవేగముతో అంతరిక్షమునుంచి నేలమీదికి ఆ నల్గురు రాక్షసులను అంగదుడు విసరివేసినాడు. అంతట ఆ ప్రతాపవంతుడు అంగదుడు ఆ ప్రాసాదశిఖరముమీదికి పోయినాడు. దేవేంద్రుడు హిమవత్పర్వతశిఖరాన్నివలె అంగదుడు తన పాదఘాతములో ఆ ప్రాసాదశిఖరాన్ని పగులకొట్టడము మొదలుపెట్టినాడు. తనపేరు రాక్షసులకు అందరికీ తెలియడానికోసము ప్రాసాదశిఖరాన్ని పగులకొట్టుతూ సింహనాదము చేసి ఆకాశానికి ఎగిరి పోయినాడు.

అట్లా రాక్షసులను అందరినీ వ్యథపెట్టి వానరులను సంతోషపెట్టడానికి అంగదుడు వానరసైన్యము మధ్యన ఉన్న రాముడి పార్శ్వానికి పోయి నిలుచున్నాడు. రావణాసురుడు తన ప్రాసాదాన్ని

అంగదుడు పగులగొట్టినందుకు పరమ కుపితుడు అయిపోయినాడు. తనకు వచ్చిన కీడునుగురించి ఆలోచించుకొంటూ నిట్టూర్పులు విడిచినాడు.

రాముడు తనవెంట ఉన్న వానరవీరులు అందరూ సంతోషాతిశయముతో సింహనాదాలు చేస్తూ ఉంటే యుద్ధసన్నద్ధుడు అయినాడు.

మహాపరాక్రమశాలీ పర్వతాకారుడూ దుర్ధర్షుడూ అయిన సుషేణుడు సుగ్రీవాజ్ఞను శిరసావహించి వానరవీరులను అందరినీ వెంటపెట్టుకొని నక్షత్రాలలో చంద్రుడివలె లంకాపట్టణానికి ఉన్న నాల్గుద్వారాలూ తిరిగి చూచినాడు.

రాక్షసులు అందరూ లంకాపట్టణముచుట్టూ సముద్రాన్ని మించి నిలిచిన వానరాక్షౌహిణీశతాలను చూచి ఆశ్చర్యచకితులు అయినారు. కొందరు భయపడిపోయినారు. కొందరు యుద్ధోత్సాహముతో సంతోషపడ్డారు. ప్రాకార పరిఖల మధ్యప్రదేశము అంతటా వ్యాపించి వానరులు వానరమయప్రాకారముగా కనపడుతూ ఉంటే రాక్షసులు అందరూ చూచినారు. దీనులు అయిపోయినారు. భయముతో ఒళ్లు ఎరగకుండాపోయి హాహాకారాలు చేసినారు.

ఆ రాక్షసరాజధానీనగరములో రాక్షసయోధులు మహాయుధాలు ధరించి మహాభయంకరము అయిన కోలాహలధ్వనులతో ప్రళయకాలవాయువులవలె అప్పుడు సంచరించినారు.

౪౨

అంతట రాక్షసయోధులు రాజమందిరములోకి పోయి తమ ఏలికను రావణాసురుణ్ణి చూచి రాముడు వానరసైన్యాలతో వచ్చి లంకాపట్టణాన్ని ముట్టడించినాడు అని చెప్పినారు. ఆ మాట వినే వినడముతో ఆ నిశాచరరాజుకు కోపము వచ్చింది. తత్క్షణమే నగరరక్షణపు ఏర్పాట్లను అదివరకటికన్నా రెట్టింపు చేయించినాడు. అంతట తన ప్రాసాదముమీదికి పోయినాడు.

రాముడు సంతోషముగా తన వానరసైన్యాలతోకూడా లంకాపట్టణప్రాకారాన్ని అంతా తిరిగి చూచినాడు. రాక్షసులు ఆ నగరాన్ని ఎట్లా కాపాడుతూ ఉందీ గమనించినాడు. ధ్వజాల

తోనూ పతాకాలతోనూ శోభాయమానముగానూ ఎదిరించ నలవి_
కాకుండానూ ఉన్న ఆ లంకాపట్టణాన్ని చూస్తూఉండగా ఆ మహాను
భావుని మనస్సు సీతాదేవిమీదికి పోయింది. తనకోసము
ఆ మృగశాబాక్షి ఆ జనకరాజతనయ సీతాదేవి నిద్రాహారాలు
లేకుండా కృశించిపోయి కటిక నేలమీద పడుకొంటూ దుఃఖపడుతూ
ఉంటుంది అని ఆమెను రాక్షసులు బాధపెట్టుతూ ఉంటారు అని
విచారపడి పోయినాడు. ఆ వైదేహినిగురించి అట్లా ఆ ధర్మాత్ముడు
కొంచెముసేపు ఆలోచించినాడు. అంతట లంకాపట్టణాన్ని
ముట్టడించవలసింది అని వానరసైన్యాలను ఆజ్ఞాపించినాడు.

రాముడు ఏ పనిని అయినా నిరాటంకముగా చేసివేస్తాడు.
అటువంటి ఆ రాముడు ఆజ్ఞాపించగానే వానరసేనాసమూహాలు
మేము అంటే మేము అని పోటీపడి సింహనాదాలు చేసినవి. కొనలు
తేలిన పెద్ద పెద్ద రాళ్ళతోనూ పెద్ద పెద్ద చెట్లతోనూ పిడికిటి
గుద్దులతోనూ ఆ లంకాపట్టణాన్ని పిండి పిండి చేయవచ్చును అని
వానరసేనానాయకులు అనుకొన్నారు. అంతట వానరవీరులు
కొనలుతేలిన పెద్ద పెద్ద రాళ్ళనూ పెద్ద పెద్ద చెట్లనూ ఇంకా పెద్ద
పెద్ద బండలనూ పెళ్ళగించి తెచ్చి యుద్ధసన్నద్ధులు అయి
నిలుచున్నారు.

అట్లా తన ప్రసాదముమీదికి పోయిన రావణుడు ఆ లంకాద్వీప
పర్వతాలమీదనూ వనాలలోనూ ఉద్యానవనాలలోనూ లెక్క
వేయ నలవికాకుండా అన్నివైపులా యుద్ధకాంక్షతో కమ్ముకొని
ఉన్న వానరసేనాసమూహాలను చూచినాడు. అట్లా భూమిని
అంతా కనపడకుండా కబళించివేసిన ఆ వానరవాహినీసమూహాలను
అన్నిటినీ నాశనము చేసివేయడము ఎట్లాగా అని చాలాసేపు ఆలో
చించినాడు. ధైర్యము తెచ్చుకొన్నాడు. తన విశాలనేత్రాలు
తెరిచి తేరిపార చూచినాడు.

ఆ రావణాసురుడు అట్లా చూస్తూ ఉండగానే వానరసైన్యాలు
భాగాలు భాగాలుగా ఏర్పడి తన పట్టణప్రాకారముమీదికి ఎక్కడము
మొదలుపెట్టినవి. వానరయోధులు బంగారువన్నె దేహాలతోనూ
ఎర్రటిముఖాలతోనూ ధగధగలాడుతూ మద్దిచెట్లనూ తాటిచెట్లనూ

పెద్ద పెద్ద రాళ్ళనూ చేతులలో తీసుకొని రామకార్యార్థము తమ ప్రాణాలను అయినా లెక్క చేయకుండా లంకాపట్టణప్రాకారాగ్ర భాగాలనూ బహిర్ద్వారాలనూ పగులకొట్టడము ఆరంభించినారు. ఉద్యానవనాలను ధ్వంసము చేసివేసినారు. స్వచ్ఛజలాలు ఉన్న అగడ్తలో రాళ్ళూ కర్రలూ గడ్డీ వేసి మన్ను పోసి పూడ్చివేసినారు. అంతట వేలకొద్దీ లక్షలకొద్దీ కోట్లకొద్దీ వానరసైనికులను వెంట పెట్టుకొని వానరయూధపతులు ప్రాకారముమీదికి ఎక్కినారు.

పెద్ద పెద్ద ఏనుగులవంటి ఆ వానరవీరులు ప్రాకారానికి అమర్చిన బంగారు బహిర్ద్వారాలు పగులకొట్టుతూనూ కైలాస పర్వతశిఖరాలవంటి ఆ బహిర్ద్వారగోపురాలను పడకొట్టుతూనూ ఎగిరి గంతులు వేసి పెద్ద పెద్ద కేకలు పెట్టినారు. అప్పుడు వెనక నుంచి వానరసేనాసమూహాలు ఆ లంకాపట్టణప్రాకారముమీదికి పరుగెత్తుకొని వచ్చినవి. అతిబలవంతుడికి రాముడికి జయము! మహాబలవంతుడికి లక్ష్మణుడికి జయము! సుగ్రీవరాజుకు జయము! అంటూ జయజయలు పలుకుతూ సింహనాదాలు చేస్తూ ఆ కామ రూపులు వానరవీరులు ఆ లంకాపట్టణప్రాకారముమీదికి పరుగు లెత్తినారు. ప్రసిద్ధవానరసేనానాయకులు అయిన వీరబాహువూ సుబాహువూ నలుడూ ఆ ప్రాకారాన్ని పడకొట్టేస్తూ ఆ వానర సైన్యాలు అక్కడ విడిది చేసే ఏర్పాట్లు చేయసాగినారు.

అప్పుడు కుముదుడు జయోత్సాహముతో తేజరిల్లుతూఉన్న పదికోట్లమంది వానరసైనికులను వెంటపెట్టుకొని పోయి ఆ లంకా పట్టణ తూర్పుద్వారాన్ని కమ్ముకొన్నాడు. ఆ కుముదుడికి తోడ్పడ డానికి అనేకమంది వానరవీరులలో ప్రఘసుడూ పనసుడూ నిలచి నారు. వీరుడూ బలవంతుడూ అయిన శతవలి ఇరవైకోట్లమంది వానరులను వెంటపెట్టుకొని పోయి దక్షిణద్వారాన్ని కమ్ము కొన్నాడు. మహాబలవంతుడూ తార తండ్రీ అయిన సుషేణుడు అరవైకోట్లమంది వానరవీరులతో పోయి పశ్చిమద్వారాన్ని ఎదిరించినాడు.

రామలక్ష్మణులు సుగ్రీవుడితోకూడా ఆ లంకాపట్టణ ఉత్తర ద్వారాన్ని కమ్ముకొన్నారు. భయంకరుడూ మహాకాయుడూ

అమితవీర్యవంతుడూ గోలాంగూలుడూ అయిన గవాక్షుడు ఒక కోటిమంది వానరవీరులతోనూ మహావీర్యవంతుడూ శత్రుధ్వంసకుడూ అయిన ధూమ్రుడు భీమవేగులు అయిన ఒక కోటిమంది భల్లూకవీరులతోనూ గద చేతిలో పట్టుకొని మహావీర్యవంతుడూ మహాబలవంతుడూ అయిన విభీషణుడు యుద్ధసన్నద్ధులు అయిన తన నలుగురు మంత్రులతోనూ రాముడిపక్కను నిలచినారు.

గజుడూ గవాక్షుడూ (వానరుడు) గవయుడూ శరభుడూ గంధమాదనుడూ అన్నివైపులా తిరుగుతూ వానరసైన్యాన్ని కాపాడుతూ ఉన్నారు.

రావణాసురుడు ఆ వానరసేనాసన్నివేశాన్ని చూచినాడు. కోపపరీతుడు అయిపోయినాడు. తన సర్వసైన్యాలనూ వెలుపలికి పొమ్మని ఆజ్ఞాపించినాడు. రావణుడి నోటినుంచి మాట వచ్చే రావడముతో రాక్షసయోధులు భయంకరముగా సింహనాదాలు చేస్తూ చంద్రబింబమువలె తెల్లటి ముఖాలు ఉన్న భేరీలను బంగారు దండాలతో భయంకరముగా అంతటా వినిపించేటట్టు మ్రోగించినారు. భయంకరాకారులు అయిన ఆ రాక్షసులు వందలకొద్దీ వేలకొద్దీ శంఖాలు పూరించినారు. నిగ నిగ లాడే ఆ నీలాంగులు నిశాచరులు అప్పుడు అట్లా శంఖాలు పూరిస్తూ కొంగలపంక్తులు కనపడుతూ ఉరుములు ఉరిమే నీలమేఘాలవలె కనిపించినారు. ఆ రాక్షస సైన్యాలు అప్పుడు పర్వసమయములో సముద్రప్రవాహాలు పొంగి పొర్లి ప్రవహించేట్టుగా బయలుదేరినవి.

అప్పుడు వానరయోధులు అందరూ ఆ త్రికూటపర్వత సత్త్రాలలోనూ చరియలలోనూ ఆ లంకాద్వీపము అంతటానూ మారుమ్రోగిపోయేట్టుగా సింహనాదాలు చేసినారు. వానరుల సింహనాదాలతోనూ రాక్షసుల సింహనాదాలతోనూ ఇంకా ఆ రాక్షసుల శంఖ దుందుభుల ఘోషతోనూ ఏనుగుల ఘీంకారాలతోనూ గుర్రాల సకిలింతలతోనూ రథచక్రాల చప్పుళ్ళతోనూ భూమ్యాకాశాలు బద్దలు అయిపోతున్నట్టుగా తోచింది. అది వరకటి దేవాసుర యుద్ధమువలె అప్పుడు వానరులకూ రాక్షసులకూ ఘోరసంగ్రామము ఆరంభము అయింది.

భయంకరాకారులు అయిన రాక్షసులు తమ తమ ప్రతాపము చెప్పుకొంటూ ధగధగలాడే గదలతోనూ తళ తళలాడే శూలాలతోనూ శక్త్యాయుధాలతోనూ గండ్రగొడ్డళ్ళతోనూ వానరులను కొట్టినారు. మహాకాయులు అయిన వానరయోధులు పెద్ద పెద్ద చెట్లతోనూ కొనలు తేలిన పెద్ద పెద్ద రాళ్ళతోనూ రాక్షసులను కొట్టినారు. అంతటితో ఆగకుండా ఆ వానరులు రాక్షసులమీదికి పరుగెత్తుకొని పోయి గోళ్ళతో వాండ్లను చీల్చివేసినారు. కోరలతో కొరికినారు. తమ తమ పేర్లూ తమ పరాక్రమమూ చెప్పుకొంటూ "జయజయ సుగ్రీవరాజా" అని అరిచినారు. ప్రాకారముమీద ఉన్న రాక్షసులూ ఇంకా ఇతర రాక్షసులూ భిండివాలాలతోనూ (విడిచివాటు ఇనుప గుదియలతోనూ) ఖడ్గాలతోనూ నేలమీద ఉన్న వానరులను ఛేదించినారు. నేలమీద ఉన్న వానరులు అప్పుడు పరమక్రుద్ధులు అయిపోయి పయికి ఎగిరి ప్రాకారముమీద ఉన్న రాక్షసయోధులను పట్టుకొని కింద పడత్రోసినారు.

అప్పుడు రాక్షసులకూ వానరులకూ అట్లా దొమ్మిగా జరిగిన ఆ పోరాటములో అక్కడి నేల అంతా నెత్తురుతోనూ మాంసముతోనూ బురద బురద అయిపోయింది.

౪౮

ఆ మహాబలవంతులు వానరులు అట్లా పోరాడుతూ ఉంటే రాక్షసులు సహించలేకపోయినారు. వాండ్లకు భయంకరము అయిన కోపము వచ్చింది.

బంగారు శిరోభూషణాలు అలంకరించిన గుర్రాలతోనూ అగ్నిహోత్రమువలె ధగధగలాడే ధ్వజాలతోనూ మధ్యాహ్న సూర్య కాంతులవలె దుర్నిరీక్ష్యము అయిన రథాలతోనూ రమణీయము అయిన కవచాలతోనూ దశదిశలూ మారుమ్రోగిపోయేట్లు మహాధ్వనులు చేస్తూ రావణాసురుడి జయము కాంక్షిస్తూ పెద్దపులుల వంటి రాక్షసోత్తములు బయలుదేరి వచ్చినారు. జయము కాంక్షించి అట్లా బయలుదేరి వచ్చిన ఆ కామరూపులను రాక్షసులను ఆ మహావానరసైన్యము ఎదిరించింది. అట్లా ఒకండ్లను

ఒకళ్ళను ఎదిరించడములో రాక్షసులకూ వానరులకూ అప్పుడు ద్వంద్వయుద్ధము జరిగింది.

మహాపరాక్రమవంతుడు ఇంద్రజిత్తు యముడు ముక్కంటితో పోరాడినట్లు వాలిపుత్రుడు అయిన అంగదునితో పోరాటానికి తల పడ్డాడు. ప్రజంఘుడు అనే రాక్షసుడు విభీషణుని మంత్రి అయిన సంపాతితోనూ మిత్రఘ్నుడు అనే రాక్షసుడు విభీషణునితోనూ తపనుడు అనే రాక్షసుడు గజునితోనూ నికుంభుడు అనే రాక్షసుడు నీలునితోనూ ప్రఘసుడు అనే రాక్షసుడు సుగ్రీవునితోనూ విరూపాక్షుడు అనే రాక్షసుడు లక్ష్మణునితోనూ సుప్తఘ్నుడూ అగ్నికేతువూ రశ్మికేతువూ అనే రాక్షసులు రామునితోనూ వజ్రముష్టి అనే రాక్షసుడు మైందునితోనూ అశనిప్రభుడు అనే రాక్షసుడు ద్వివిదునితోనూ ప్రతపనుడు అనే రాక్షసుడు నలునితోనూ విద్యున్మాలి అనే రాక్షసుడు సుషేణునితోనూ పోరాటానికి తలపడినారు.

వీరే కాకుండా ఇంకా భయంకరాకారులు అయిన రాక్షసులు అనేకమంది వానరులతో బహువిధాల ద్వంద్వయుద్ధము సాగించినారు. పరస్పర జయేచ్ఛతో రాక్షసులకూ వానరులకూ గొప్ప పోరాటము దారుణంగా ఒళ్ళు గగుర్పొడిచేట్లుగా జరిగింది. ఆ రాక్షసుల దేహాలనుంచి వానరుల దేహాలనుంచి నెత్తురు వెల్లువలుఅయి పారుతూ ఉంటే వారి దేహాలమీద వెంట్రుకలు పచ్చికపట్టుల వలెనూ వారి శరీరాల ఖండాలు కట్టెల పోగుల వలెనూ కనిపించినవి. శత్రుసైన్యాలను నాశనము చేసివేసే వీరుణ్ణి అంగదుణ్ణి దేవేంద్రుడు వజ్రాయుధముతో వలె ఇంద్రజిత్తు తన గదతో కొట్టినాడు. అప్పుడు ఆ కాంతిమంతుడు అంగదుడు అమిత వేగముతో ఇంద్రజిత్తు ఎక్కి వచ్చిన బంగారు రథాన్ని విరగకొట్టినాడు. గుర్రాలనూ సారథినీ చంపివేసినాడు. ప్రజంఘుడు సంపాతిమీద మూడు బాణాలు వదలినాడు. అతడు ఆ బాణాలు తప్పించుకొని ఇరుమద్దిచెట్టుతో కొట్టి ప్రజంఘుణ్ణి చంపివేసినాడు. మహాబలవంతుడు జంబుమాలి రథము మీద వచ్చి పరమకుపితుడుఅయి రథశక్తితో హనుమంతుని వక్షఃస్థలాన కొట్టినాడు. అప్పుడు ఆ మారుతాత్మజుడు హనుమంతుడు అమితవేగముతో ఆ రథము ఎక్కి ఆ జంబుమాలిని

అరచేతులలో చరచినాడు. భయంకరాకారుడు అయిన ప్రతపనుడు గర్జిస్తూ నలుడిమీదికి వస్తూ ఉంటే ఆ నలుడు అమిత వేగముతో ఎదురుగుండా పోయి ఆ ప్రతపనుడి రెండు కన్నులూ ఊడపెరికినాడు. తీక్ష్ణబాణాలు వదులుతూ అందరినీ మింగివేసేట్టు నోరు తెరుచుకొని వస్తూఉన్న ప్రఘసుణ్ణి సుగ్రీవుడు సప్తపర్ణవృక్షముతో కొట్టి చంపి వేసినాడు. అగ్నికేతువూ రశ్మికేతువూ సుప్తఘ్నుడూ యజ్ఞకోపుడూ అనే నల్గురు రాక్షసులూ రాముడిమీద బాణాలు వదిలినారు. రాముడు అగ్నిశిఖలవంటి బాణాలను వదిలి ఆ నల్గురు రాక్షసుల శిరస్సులూ తెగవేసినాడు. మైందుడి పిడికిలిపోటుకు వజ్రముష్టి అనే రాక్షసుడు చచ్చిపోయినాడు. ఆ వజ్రముష్టి గుర్రాలూ రథమూ మైందుడి పిడికిలిపోట్లకు కోటబురుజులవలె నేల కూలినవి. సూర్యుడు నీలమేఘాలమీద తన కిరణాలు ప్రసరించేట్టు నికుంభుడు నల్లటి కాటుకకొండవంటి నీలుడిమీద తీక్ష్ణబాణాలను వదిలినాడు. అట్లా అమితవేగముతో సూది బాణాలు వదిలి నవ్వుతూ ఉన్న నికుంభుణ్ణి చూచి నీలుడు విష్ణుదేవుడివలె విక్రమించి ఆ నికుంభుడి శిరము తెగవేసి వాడి రథచక్రముతో సారథిని ఛేదించి వేసినాడు. వజ్రదేహుడు ద్వివిదుడు అశనిప్రభుణ్ణి రాక్షసులు అందరూ చూస్తూ ఉండగా కొనలుతేలిన పెద్ద పెద్ద రాళ్ళతో కొట్టినాడు. అట్లా రాళ్ళతో తనను కొట్టుతూఉన్న ఆ ద్వివిదుడి మీద అశనిప్రభుడు పిడుగులవంటి బాణాలు వదిలినాడు. ఆ బాణాలకు దేహము అంతటా గాయాలు అయి ద్వివిదుడికి అత్యుత్కటము అయిన కోపము వచ్చింది. అంతట ఆ ద్వివిదుడు మద్దిచెట్టుతో అశనిప్రభుణ్ణి కొట్టి చంపివేసినాడు. అతడి రథాన్ని విరగకొట్టినాడు. గుర్రాలను చంపివేసినాడు. అప్పుడు రథము మీద ఉన్న విద్యున్మాలి బంగారుములుకులు వేసిన బాణాలు సుషేణుడిమీద వదిలి పదే పదే అరచినాడు. అంతట ఆ వానరోత్తముడు సుషేణుడు రాళ్లతో విద్యున్మాలి రథాన్ని పడగొట్టినాడు. విద్యున్మాలి ఆ రథముమీదనుంచి ఛట్టే కిందికి దిగి చేతులో గద తీసుకొని సుషేణుడిమీదికి పరుగెత్తినాడు. అప్పుడు ఆ వానరపుంగవుడు సుషేణుడు అది చూచి క్రోధావేశపరవశుడు అయి పెద్దరాయి తీసుకొని విద్యున్మాలిమీదికి పోయినాడు. అట్లా

పెద్దరాయి తీసుకొని తనమీదికి వస్తూఉన్న సుషేణుణ్ణి చూచి విద్యున్మాలి తన గదతో ఆ వానరుడి వక్షఃస్థలముమీద కొట్టినాడు. ఘోరము అయిన ఆ గదాప్రహారాన్ని లెక్కచేయకుండా ఆ వానరోత్తముడు సుషేణుడు తన చేతిలో ఉన్న రాయిని విద్యున్మాలి వక్షఃస్థలముమీద విసరి వేసినాడు. ఆ రాతిదెబ్బకు విద్యున్మాలి గుండె చితికిపోయింది. ప్రాణము పోయి నేల కూలినాడు.

ఈ విధముగా ఆ ద్వంద్వయుద్ధములో వానరవీరులు రాక్షస వీరులను కొట్టి చంపివేసినారు. విరిగిపోయిన ఖడ్గాలతోనూ గదలతోనూ శక్త్యాయుధాలతోనూ తోమరాయుధాలతోనూ ముక్కలు చెక్కలు అయిపోయిన రథాలతోనూ నుగ్గు నుగ్గు అయిపోయిన ఆ రథచక్రాలతోనూ ఆ చక్రాల కళ్లతోనూ కాండ్లతోనూ తెగి పడిపోయిన గుర్రాలతోనూ చచ్చి పడిపోయిన ఏనుగులతోనూ హతులు అయి పడిపోయిన వానరయోధులతోనూ రాక్షస వీరులతోనూ ఆ శవాలను తినడానికి వచ్చిన ఘోరము అయిన పక్కలతోనూ ఆ యుద్ధభూమి భయంకరముగా కనిపించింది. దొమ్మిగా జరిగిన ఆ యుద్ధములో రాక్షసవీరుల మొండెములూ వానరయోధుల మొండెములూ చెల్లా చెదరుగా అన్ని దిక్కులా పడిపోయినవి.

అప్పుడు వానరవీరులు రాక్షసయోధులను అట్లా చీల్చి వేస్తూ ఉంటే నెత్తురు కమ్ముకొన్న దేహాలతో రాక్షసవీరులు సూర్యాస్తమయాన్ని కాంక్షిస్తూ మళ్లీ యుద్ధము చేయడానికి సన్నద్ధులు అయినారు.

౪౪

వానరులూ రాక్షసులూ అట్లా యుద్ధము చేస్తూ ఉండగానే ప్రాణాలు తీసివేసే రాత్రి వచ్చింది. అప్పుడు బద్ధ వైరముతో పరస్పర జయేచ్ఛతో వానరులకూ రాక్షసులకూ ఘోరయుద్ధము జరిగింది.

భయంకరము అయిన చీకటిలో వానరులు "నీవు రాక్షసుడవు" అంటూ వానరుణ్ణి రాక్షసులు "నీవు వానరుడవు" అంటూ

రాక్షసుణ్ణి అని కేకలు వేస్తూ అరుస్తూ వారిలో వారిని వారే కొట్టసాగినారు. ఆ చిమ్మచీకటిలో "చంపు" "చీల్చు" "ఎట్లా పారిపోతావు" అనే కేకలు గోలగా వినిపించినవి. బంగారు కవచాలు తొడుగుకొన్న రాక్షసయోధులు ఆ చిమ్మచీకటిలో ఓషధులతో జ్వలించే పర్వతాలవలె కనిపించినారు. అపారము అయిన ఆ గాఢాంధకారములో రాక్షసులు క్రోధపరవశులు అయిపోయి అమితవేగముగా వానరులను పట్టుకొని నమిలివేస్తూ ఆ యుద్ధభూమిలో తిరిగినారు. అప్పుడు వానరవీరులు మహాకోపముతో ఆకాశానికి ఎగిరి బంగారు శిరోభూషణాలతో అలంకరించిన గుర్రాలమీదికి దూకి వాటిని తమ తమ కోరలతో గోళ్ళతో చీల్చివేసినారు. అగ్నిజ్వాలలవంటి ధ్వజాలను విరగకొట్టినారు. అట్లా ఆ వానరవీరులు రాక్షసబలాన్ని క్షోభపెట్టుతూ కోపావేశముతో ఏనుగులనూ ఏనుగులు ఎక్కినవారినీ కొరికివేసినారు. రథాలమీది ధ్వజాలనూ పతాకాలనూ పడలాగినారు. అప్పుడు అక్కడ కనిపించిన రాక్షసులనూ కనపడని రాక్షసులనూ రామలక్ష్మణులు విషసర్పాలవంటి బాణాలను వదిలి చంపివేసినారు. గుర్రాల గిట్టల తాకిడికి పొడిపొడిఅయి రథచక్రాలనుంచి రేగిన దుమ్మునుంచి కన్నులకు ఏమీ కనుపించకుండా పోయింది. వాటి చప్పుళ్ళనుంచి చెవులకు ఏమీ వినిపించకుండా పోయింది. అట్లా ఒళ్ళు గగుర్పొడిచేట్టుగా మహాభయంకరముగా ఆ రాత్రి యుద్ధము జరిగింది. ఆ యుద్ధభూమిలో రక్తము ఏరులుఅయి ఘోరముగా ప్రవహించింది.

అప్పుడు శంఖ వేణుస్వనాలతో కలసిన భేరీ మృదంగధ్వనులూ పణవాలమోతలూ అద్భుతముగావినిపించినవి. రాక్షసులూవానరులూ కొట్టుకొంటూ అరిచిన అరుపులూ దెబ్బలు తిన్నవాండ్ల మూలుగులూ పరమదారుణముగా వినిపించినవి. ఆ పోరాటములో రాక్షసులు వానరులను చంపివేయుడానికి శక్త్యాయుధాలనూ శూలాయుధాలనూ గండ్రగొడ్డళ్లనూ వానరులు ఆ కామరూపులను రాక్షసులను చంపివేయడానికి పెద్ద పెద్ద రాళ్లనూ చెట్లనూ వాడినారు. ఆ ఆయుధాలు అన్నీ ఆ యుద్ధభూమిలో పడిపోయి ఆ భూమిని పూజించిన పూలవలె కనిపించినవి. రక్తము స్రవించి ఆ యుద్ధభూమి అంతా

బురద బురద అయి లోపలికి పోనలవికాకుండానూ ఎవరు చచ్చి పోయిందీ తెలుసుకో నలవికాకుండానూ అయిపోయింది. వానరుల ప్రాణాలనూ రాక్షసుల ప్రాణాలనూ అట్లా ఘోరముగా తీసి వేస్తున్న ఆ రాత్రి సమస్తప్రాణికోటికీ కాళరాత్రివలె ఎంతసేపటికీ తెల్లవారేటట్టు కనిపించలేదు.

ఆ పరమదారుణము అయిన చీకటిలో రాక్షసులు బాణ వర్షము కురిపిస్తూ రాముడిమీదికి పోయినారు. కుపితులుఅయి అట్లా తనపైకి వస్తూఉన్న ఆ రాక్షసుల గర్జాధ్వనులు ప్రళయ కాలములో సప్తసముద్రాల మహాధ్వనిగా వినిపించింది. రెప్ప పాటులో ఆ రాక్షసులలో ఆరుగురిమీద అగ్నిజ్వాలలవంటి ఆరు తీక్ష్ణబాణాలను రాముడు వదిలినాడు. ఆ రామబాణాలు మర్మస్థానాలలో పడ్డందువల్ల ఎదిరించ నలవికాని ఆ ఆరుగురు రాక్షసులూ—మహోదరుడూ మహాపార్శ్వుడూ యమశత్రువూ మహాకాయుడు అయిన వజ్రదంష్ట్రుడూ శుకసారణులూ ఆ యుద్ధ రంగములోనుంచి పారిపోయి ప్రాణాలు దక్కించుకున్నారు. అప్పుడు ఆ మహాబలవంతుడు రాముడు బంగారుములుకులతో అగ్నిజ్వాలలవంటి బాణాలు వేసి దిక్కులూ విదిక్కులూ వెలుతురులో కనిపించేటట్టు చేసినాడు. ఆ రామబాణాగ్నికి అప్పుడు అక్కడ ఎట్టఎదుట నిలచిన రాక్షసులు అందరూ అగ్నిహోత్రములో పడ్డ మిడుతలవలె నాశనము అయిపోయినారు. రాముడు వదిలిన బంగారుములుకుల బాణాలు వేలకొద్దీ వచ్చి అన్ని దిక్కులా పడుతూ ఉంటే అప్పుడు అది మిణుగురుపురుగులతో శరత్కాల రాత్రి మాదిరిగా విచిత్రముగా కనిపించింది. అసలే భయంకరముగా ఉన్న ఆ రాత్రి వానరుల సింహనాదాలవల్లనూ రాక్షసుల మహా గర్జాధ్వనులవల్లనూ మరింత భయంకరముగా తోచింది. అన్ని వైపులా ఆ మహాధ్వనులు ఎక్కువ అయిపోయి ఆ త్రికూటపర్వత గుహాలలోనుంచి ప్రతిధ్వనిస్తూ ఉంటే ఆ త్రికూటపర్వతము అప్పుడు పెద్దపెట్టున అరుస్తున్నట్టుగా వినిపించింది.

అంధకారమువంటి నల్లటి మహాకాయాలతో గోలాంగూల వీరులు తమ చేతులు చాచి రాక్షసులను పెనవేసి పట్టుకొని

భక్షించడము మొదలుపెట్టినారు. అంగదుడు అప్పుడు ఇంద్రజిత్తును వధించడానికిపోయి ముందుగా వాడి గుర్రాలనూ సారథినీ చంపి వేసినాడు. అప్పుడు అక్కడ ఘోర సంగ్రామము సాగుతూ ఉన్నప్పటికిన్నీ ఆ మహాకాయుడు ఇంద్రజిత్తు ఆ రథాన్ని అక్కడనే వదలిపెట్టి అంతర్ధానము అయిపోయినాడు. అట్లా ఆ ఇంద్రజిత్తు సారథినీ గుర్రాలనూ చంపివేసినందుకు ఆ పూజనీయుణ్ణి అంగదుణ్ణి రామలక్ష్మణులు మెచ్చుకున్నారు. ఇంద్రజిత్తు ప్రభావము సర్వ ప్రాణికోటికిన్నీ తెలుసును. ఆ మహాపరాక్రమశాలి ఇంద్రజిత్తు యుద్ధములో అట్లా పరాజితుడు అయి పారిపోయినందుకు అందరూ సంతోషించినారు. అందరూ అంగదుణ్ణి స్తోత్రము చేసినారు. అప్పుడు సుగ్రీవుడూ విభీషణుడూ వానరయోధులూ అంగదుణ్ణి చూచి సంతోషాతిశయములో "భళే భళే" అని కేకలు వేసినారు.

ఆ యుద్ధములో భయంకరకర్ముడు అయిన అంగదుడు తనను జయించినందుకు పరమదారుణము అయిన కోపముతో ఇంద్రజిత్తు అంతర్ధానము అయిపోయినాడు. అది రాముడు గమనించినాడు. వానరవీరులను అందరినీ చూచి "ఓ వీరులారా, మీరు అందరూ ఇప్పుడు మీ కపిరాజువెంట జాగ్రత్తగా ఉండవలెను. వాడు ఆ ఇంద్రజిత్తు బ్రహ్మదేవుడు ఇచ్చిన వరమునుంచి ముల్లోకాల వారినీ ఎంతో బాధిస్తూ ఉన్నాడు. వాడికి ఇప్పుడు కాలము మూసించుకొని వచ్చింది. మనకు కార్యసిద్ధి అవుతుంది. మీ భయము అంతా తీరిపోయింది. ఇప్పుడు నాకోసము ఓర్చుకొని ఉండవలసింది. వాడు పాపాత్ముడు, అంతర్ధానము అయిపోయినాడు. యుద్ధములో వాడు గట్టివాడు. మన కంటికి కనపడకుండా వాడు ఇప్పుడు పిడుగులవంటి బాణాలను మనమీద వదులుతున్నాడు" అని రాముడు చెప్పడము పూర్తిచేయకముందే ఆ ఇంద్రజిత్తు రామ లక్ష్మణుల కరచరణాది సమస్తావయవాలమీదనూ పాములవంటి భయంకరము అయిన బాణాలను వదిలినాడు. వాడు ఆ ఇంద్రజిత్తు మాయావి. ఆ యుద్ధభూమిలో ఎవరికీ కనపడకుండా పోయి అప్పుడు కూటయుద్ధానికి దిగినాడు. తెలియకుండాచేసి రామలక్ష్మణులను నాగపాశాలతో బంధించివేసినాడు. అంతట వారు ఉభయులూ

ఒళ్ళు తెలియకుండా పడిపోయినారు. అది అంతా వానరులు చూచినారు.

ఎట్టఎదుట కనబడుతూ ఉంటే రామలక్ష్మణులతో పోరాడే శక్తి ఆ రాక్షసరాజపుత్రుడికి ఇంద్రజిత్తుకు లేకపోయింది. అందువల్లనే అప్పుడు ఆ మాయావి అదృశ్యుడు అయిపోయి ఆ అన్నతమ్ములను రామలక్ష్మణులను నాగపాశాలతో కట్టివేసినాడు.

౪౩

ఇంద్రజిత్తు ఎక్కడ ఉందీ తెలుసుకోవలసింది అని ఆ మహా పరాక్రమవంతుడు ఆ అతిబలవంతుడు రాముడు పదిమంది వానర యూథపతులను ఆజ్ఞాపించినాడు. ఆ పరంతపుడి ఆజ్ఞను శిరసావహించి సుషేణుడి ఇద్దరు పుత్రులూ వాలి పుత్రుడు అంగదుడూ వానరపుంగవుడు నీలుడూ బలవంతుడు అయిన శరభుడూ వినతుడూ జాంబవంతుడూ సానుప్రస్థుడూ ఋషభుడూ ఋషభస్కంధుడూ సంతోషముగా పెద్ద పెద్ద చెట్లను తీసుకొని దశదిశలా ఇంద్రజిత్తును వెతకడానికి ఆకాశానికి ఎగిరినారు.

ఆ వానరవీరులను అందరినీ ఆ ఇంద్రజిత్తు చూచినాడు. అతడు అస్త్రవేత్త. అమితవేగముతో పోయే బాణాలను పరమాస్త్రమంత్రముతో అభిమంత్రించి ఆ వానరవీరులమీద వదిలి వారి వేగాన్ని అడ్డగించినాడు. ఆ బాణాలకు ఆ భీమవేగుల దేహాలు గాయాలు అయినవి. ఆ అంధకారములో ఇంద్రజిత్తు నీలమేఘాలచాటుకు పోయిన సూర్యుడివలె ఆ వానరవీరులకు కనిపించకుండా దాగుకొన్నాడు.

అంతట ఆ జయశాలి ఇంద్రజిత్తు రామలక్ష్మణుల సమస్తావయవాలనూ భేదించే బాణాలు వదిలినాడు. వాడి కోపము అంతటితో ఆగలేదు. నాగపాశాలను (బాణరూపములో ఉన్న పాములను) ఆ అన్నతమ్ముల దేహముమీద సందులేకుండా వదిలినాడు. ఆ బాణాలకు రామలక్ష్మణులు కట్టుపడిపోయినారు. వారి దేహాలు గాయాలు అయినవి. ఆ గాయాలలోనుంచి అమితముగా రక్తము స్రవించింది. అప్పుడు ఆ అన్నతమ్ములు ఉభయులూ పూచిన మోదుగుచెట్లవలె కనిపించినారు.

ఎర్రటి కనుకొనలతో కాటుకరాశివలె కనుపించే ఇంద్రజిత్తు అప్పుడు రామలక్ష్మణులకు కనపడకుండానే వారిని ఉద్దేశించి "ఓ సోదరులారా, నేను అంతర్ధానము అయి పోరాడుతూవుంటే దేవేంద్రుడు అయినప్పటికిన్నీ నన్ను కనిపెట్టి పట్టుకోలేడు. ఇక మిమ్ములనుగురించి చెప్పేది ఏమిటి. ఓ రామలక్ష్మణులారా, నన్ను కోపము కమ్ముకొన్నది. మిమ్ములను కంకపక్షి రెక్కల బాణాలు కమ్ముకొన్నవి. ఇకను ఇప్పుడు మిమ్ములను యమ సదనానికి పంపించివేస్తాను." అని చెప్పి ఆ ధర్మజ్ఞులను నిశిత బాణాలతో నొప్పించి పక్కన నవ్వినాడు. పెద్దపెట్టున అరిచినాడు. అంతట తన పెద్దవింటిని తీసుకొని దిక్కులు దద్దరిల్లి పోయేట్టు నారి సారించినాడు. పదే పదే రామలక్ష్మణులమీద ఘోరముగా బాణాలు వదిలినాడు. ఆయువుపట్టులు తెలిసిన ఆ ఇంద్రజిత్తు అట్లా రామలక్ష్మణుల ఆయువుపట్టులలో నిశాతాస్త్రాలు వేస్తూ మాటి మాటికీ అరిచినాడు. ఆ పోరాటములో నిశితాస్త్రాలకు రామ లక్ష్మణులు కట్టుపడి పోయినారు. నిమిషములో వారికి కన్నులు కనిపించకుండా పోయినవి.

ఆ మహాధనుర్ధరులు ఆ మహావీరులు ఆ జగతీపతులు రామ లక్ష్మణులు ఆవిధముగా బాణపూర్ణదేహాలు అయిపోయినారు. సర్వాంగాలూ గాయాలు అయినవి. ఆయువుపట్టులలో తగిలిన దెబ్బలకు నిలువలేకపోయినారు. వణికిపోయినారు. నేలమీద పడిపోయినారు. ఆ వీరుల ఒంటినిండా గుచ్చుకొన్న బాణాల నుంచి నెత్తురుతో తడిసిపోయి ఆర్తులుఅయిపోయి ఆ నేలమీద పడుకొని బాధ పడసాగినారు. వారి దేహాలలో చేతులవేళ్ళవరకూ బాణాలు తగలకుండానూ చీలిపోకుండానూ గాయాలు కాకుం డానూ ఉన్న ప్రదేశము ఒక అంగుళము అయినా లేదు.

ఆ కామరూపుడు ఆ క్రూరకర్ముడు ఇంద్రజిత్తు వేసిన తీవ్ర బాణాలనుంచి ప్రస్రవణపర్వతమునుంచి జలప్రవాహాలావలె రామ లక్ష్మణుల దేహాలనుంచి రక్తము ఏరులు అయి పారింది. పూర్వము దేవేంద్రుణ్ణి జయించిన ఆ ఇంద్రజిత్తు వదిలిన బాణాలు ఆయువు పట్టులలో తగిలి రాముడే ముందుగా నేలమీద పడిపోయినాడు.

ఇంద్రజిత్తు నాగపాశాలు అనే బాణాలు వేసి ముందుగా రాముణ్ణి కదలకుండా మెదలకుండా ఉండేటట్లు చేసివేసినాడు. అంతట బంగారు పింజలతో వాడిఅయిన ములుకులతో పైనుంచి కిందికి దూకే బాణాలతోనూ వంకరటింకరలు లేకుండా గుండ్రముగా ఉండే నారసాలు అనే బాణాలతోనూ గండ్రగొడ్డళ్లవంటి బాణాలతోనూ చేమోద్పులవంటి బాణాలతోనూ అర్ధచంద్రాకారపు బాణాలతోనూ రాముణ్ణి ఇంద్రజిత్తు కొట్టినాడు. పిడికిలి పట్టు వదిలిపోయి నారి ఎక్కించని మువ్వంకల బంగారు ధనుస్సు చేతితో పట్టుకొని రాముడు ఆ యుద్ధభూమిలో నేలమీద పడుకొన్నాడు. అట్లా బాణాలకు కట్టుపడిపోయి దేహము అంతటా గాయాలు అయి నేలమీద బాణతల్పము మధ్యను పడిఉన్న ఆ పురుషోత్తముణ్ణి ఆ కమలపత్రాక్షుణ్ణి తన అన్నను రాముణ్ణి నేలమీద పడిఉన్న లక్ష్మణుడు ఎట్లాగో కన్నులు తెరిచి చూచినాడు. బ్రతకడము నిరాశ చేసుకొన్నాడు.

నాగపాశబద్ధులు అయి అట్లా నేలమీద పడిఉన్న ఆ రామలక్ష్మణుల చుట్టూ వాయుసుతుడూ మొదలుఅయిన వానరోత్తములు చేరి ఆర్తులు అయి దుఃఖపడిపోయినారు.

౪౬

ఇంద్రజిత్తును కనిపెట్టడానికి ఆకాశములోనూ భూమిమీదనూ వెతుకుతూ ఉన్న వానరోత్తములు అప్పుడు బాణాలతో ఒళ్లు అంతా గాయాలు అయి నేలమీద పడిఉన్న రామలక్ష్మణులను చూచినారు.

మేఘము వాన కురిసి వెలిసినట్టు ఇంద్రజిత్తు కావలెను అనుకొన్న పని చేసి విరమించినాడు. అప్పుడు సుగ్రీవుడితో కూడా విభీషణుడు రాముడు పడిఉన్న చోటికి వచ్చినాడు. హనుమంతుడితో కూడా నీలుడూ మైందుడూ ద్వివిదుడూ సుషేణుడూ కుముదుడూ అంగదుడూ వేగముగా వచ్చి రామలక్ష్మణులను చూచినారు. వారు అందరూ దిగులు పడిపోయినారు.

అప్పుడు రామలక్ష్మణులు చేష్టలు తప్పిపోయి మందము మందముగా నిట్టూర్పులు విడుస్తూ దేహము అంతటా సందులేకుండా

గుచ్చుకున్న బాణాలనుంచి నెత్తురు కారుతూ శరతల్పముమీద
స్తబ్ధులు అయి పడిఉన్నారు. కొంచెముసేపటికి పాములవలె
నిట్టూర్పులు విడుస్తూ నిశ్చేష్టులు అయిపోయినారు. వారి విక్రమము
మందగించింది. వారి దేహము అంతటా నెత్తురు కమ్ముకొన్నది.
వారు అప్పుడు బంగారు ధ్వజాలవలె కనిపించినారు.

ఆ యుద్ధభూమిలో దేహము అంతటా బాణాలు గుచ్చుకొని
పడిపోయి చేష్టలు మందగించిన రామలక్ష్మణుల చుట్టూ వానరులు
అందరూ మూగినారు. అందరూ కన్నీళ్లు కారుస్తూ ఏడువసాగినారు.
వారు ఆ వానరులు ఆ యుద్ధము జరిగేటప్పుడు ఆకాశములోనూ
అన్నిదిక్కులానూ వెతికినారు. రాక్షసమాయనుంచి వారికి
ఎక్కడనూ ఇంద్రజిత్తు కనిపించలేదు. కనపడే ఉన్నట్లయితే వాణ్ణి
ఆ ఇంద్రజిత్తును ప్రాణాలతో పోనిచ్చి ఉండేవాండ్లు కారు.

కనపడకుండా మాయముఅయిపోయేవాండ్లను కనుక్కొనే
మాయవిద్యాబలముతో అప్పుడు విభీషణుడు ఆ అప్రతిమకర్ముణ్ణి
వరదానమువల్ల అంతర్హితుడు అయ్యే ఆ వీరుణ్ణి ఆ రాక్షసుణ్ణి
తన అన్న కొడుకును ఇంద్రజిత్తును చూచినాడు.

ఇంద్రజిత్తు తన ప్రభావమువల్ల రామలక్ష్మణులు నేలమీద
పడిపోవడము చూచి అప్పుడు ఎంతో సంతోషించి తన వెంటఉన్న
రాక్షసులతో "ఓ రాక్షసులారా, ఖరుణ్ణి దూషణుణ్ణి చంపివేసిన
అన్నతమ్ములను మహాబలవంతులను రామలక్ష్మణులను నేను
ఇప్పుడు నా బాణాలతో నాశనము చేసివేసినాను. మహర్షులు
అందరూ దేవతలు అందరూ వచ్చినప్పటికిన్ని నాగపాశబంధముల
నుంచి ఈ రామలక్ష్మణులను విడిపించలేరు. ఈ రాముడినిగురించి
నా తండ్రి రావణాసురుడు ఎప్పుడూ ఆలోచిస్తూ దుఃఖముతో
బాధపడుతూ ఉన్నాడు. రాత్రి మూడుఝాములూ శయ్యమీద
పడుకోడము లేదు. నిద్రపోవడము లేదు.

ఈ రాముడి భయమునుంచి వర్షాకాలములో నదీజలాలు
బురదలు బురదలు అయిపోయేట్టు మన లంకాపట్టణములో అందరి
మనస్సులూ పాడు అయిపోయినవి. మనము అందరమూ సమూల
ముగా నాశనము అయిపోయే అనర్థము రాకుండా ఉండడానికి నేను

ఈ రాముణ్ణి చంపివేసినాను. ఇప్పుడు రాముడి పరాక్రమమూ లక్ష్మణుడి విక్రమమూ వానరుల అందరి బలమూ శరత్కాలములో మేఘాలవలె అగుపించకుండా పోయినవి.'' అని చెప్పి వానర యూధపతులు అందరిమీదనూ బాణాలు వదిలినాడు.

శత్రుసంహారకుడు ఆ ఇంద్రజిత్తు అప్పుడు నీలుడిమీద ఒక తొమ్మిది బాణాలూ మైందద్వివిదులమీద మూడు మూడు బాణాలూ జాంబవంతుడిమీద ఒక్క బాణమూ హనుమంతుడి మీద పదిబాణాలూ గవాక్షుడిమీదనూ శరభుడిమీదనూ రెండేసి బాణాలూ గోలాంగూలుడు అయిన గవాక్షుడిమీదనూ అంగదుడి మీదనూ అనేక బాణాలూ వదిలినాడు. అగ్నిశిఖలవంటి ఆ బాణాలను అట్లా ఆ వానరవీరులమీద వదిలి ఆ మహాబలవంతుడు ఇంద్రజిత్తు సింహనాదము చేసినాడు. ఆ వానరవీరులను అట్లా బాధపెట్టి భయపెట్టి సంతోషాతిశయముతో పకపక నవ్వుతూ వెంటఉన్న రాక్షసులతో ''ఓ రాక్షసులారా, సేనాముఖాన నేను వదిలిన భయంకరబాణాలకు కట్టుపడిపోయిన ఆ అన్నతమ్ములను రామలక్ష్మణులను చూడండి. వారు చచ్చిపోయినారు'' అన్నాడు.

ఇంద్రజిత్తు చెప్పిన ఈ మాటలకు ఆ కూటయోధులు ఎంతో సంతోషపడ్డారు. ఆశ్చర్యపడ్డారు. రాముడు చచ్చిపోయినాడు అని నీలమేఘాలవంటి ఆ రాక్షసులు అందరూ అనుకొన్నారు. పెద్ద పెట్టున అరిచినారు. ఇంద్రజిత్తును పూజించినారు. అప్పుడు ఆ ఇంద్రజిత్తు నేలమీద కదలకుండా మెదలకుండా ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లేకుండా పడివున్న రామలక్ష్మణులను మళ్ళీ చూచినాడు. ఆ ఉభయులూ చచ్చిపోయినారు అని నిశ్చయించుకొన్నాడు. అంతట ఆ జయశాలి ఇంద్రజిత్తు సంతోషపరవశుడు అయి లంకా పట్టణానికి ప్రయాణము అయినాడు.

రామలక్ష్మణులు తమ సర్వాంగోపాంగాలలోనూ బాణాలు గుచ్చుకొని కదలకుండా మెదలకుండా పడిఉండడము చూచి సుగ్రీవుడు ఖిన్నుడు అయిపోయినాడు. భయపడి పోయినాడు. అట్లా భయపడి కన్నీళ్లు కారుస్తూ వెలాతెలా పోతున్న సుగ్రీవుణ్ణి చూచి విభీషణుడు ''ఓ సుగ్రీవుడా, భయపడడము చాలించు.

నీవు కన్నీళ్లు కార్చవద్దు. యుద్ధాలు తరచూ ఈ విధముగానే ఉంటవి. విజయానికి నియతి లేదు. ఒక కొంచెముసేపు ఒకడు జయించవచ్చును. ఒకడు ఒక కొంచెముసేపు పడిపోవచ్చును. ఓడిపోవచ్చును. అయితే చివరకు ఎవడు జయిస్తాడో తెలియదు."

"సుగ్రీవుడా, నీవు వీరుడవు. అధైర్యపడవద్దు. మనకు ఇంకా మిగిలివున్న జీవితములో మనము ఏమిఅయినా భాగ్యము అనుభవించవలసి ఉన్నట్లయితే ఈ ధైర్యవంతులు ఈ మహాబలవంతులు రామలక్ష్మణులు మూర్ఛ తేరుకొంటారు. ఓ సుగ్రీవుడా, నీవు స్థిరచిత్తములో ఉండు. అనాథుణ్ణి నన్ను స్థిరచిత్తములో ఉండనివ్వు. సత్యధర్మపరాయణులకు మృత్యుభయము ఉండదు" అని చెప్పి నీళ్ళు తీసుకొని తన చేతులతో సుగ్రీవుని కన్నీళ్లను కడిగినాడు. అంతట ఆ ధర్మాత్ముడు విభీషణుడు మళ్ళీ నీళ్ళు తీసుకొని శోకనివారకమంత్రములో అభిమంత్రించి ఆ నీళ్లతో సుగ్రీవుని కన్నులు తుడిచినాడు. ఆ బుద్ధిమంతుడు కపిరాజు వ్యాకుల పడకుండా ఉండడానికి గట్టిగా సమయోచితముగా విభీషణుడు "ఓ కపిరాజా, వైక్లబ్యానికి ఇది సమయముకాదు. ఇది ఆపత్కాలము. అతిస్నేహానికిన్నీ ఇది అదనుకాదు. అతిస్నేహము మరణకారణము అవుతుంది. అందువల్ల వైక్లబ్యాన్ని వదిలిపెట్టు. అది సమస్తకార్యాలను నాశనము చేసివేస్తుంది. రాముడి వెనక నడిచే నీ వానరసైన్యాల మంచినిగురించి ఆలోచించు. అట్లా కాదు అనుకొనేట్లయితే రామలక్ష్మణులు మూర్ఛ తేరుకొనేవరకు వారిని కనిపెట్టుకొని ఉండు. వారు తేరుకోగానే వారే మన భయాలను అన్నిటినీ పోగొట్టుతారు. ఈ మూర్ఛవల్ల రాముడు ఏమాత్రమూ చచ్చిపోడు. ఆ మహానుభావుడి ముఖకాంతులు మాసిపోలేదు. చచ్చిపోయే వాడి ముఖాన ఇటువంటి కాంతులు ఉండవు.

"ఓ సుగ్రీవుడా, నీవు ఊరడిల్లు. నీ సైన్యాన్ని ఊరడించు. నేను అన్నిపనులూ చక్కపెట్టుతాను. అంతవరకూ నీవు నెమ్మదిగా ఉండు. ఓ వానరసత్తమా, ఈ వానరులు అందరూ కన్నులు పెద్దవి చేసి ఎగాదిగా చూస్తూ నన్నే ఇంద్రజిత్తు అనుకొని భయపడి ఒకరి చెవిలో ఒకరు చెప్పుకొంటూ పరుగెత్తి పారిపోవడానికి సిద్ధపడు

తున్నట్టుగా తోస్తున్నది. నేను ఇంద్రజిత్తును కాను అనీ మన ప్రభువును రాముణ్ణి శరణు చొచ్చిన విభీషణుణ్ణి అనీ వీరికి ధైర్యము చెప్పు. తలలో ముడిచిన పూలదండను అవతల పారవేసేటట్టు భయాన్ని తోసివేయవలసింది అని వీరికి బోధించు'' అని చెప్పినాడు.

ఇట్లా విభీషణుడు సుగ్రీవుణ్ణి ఊరడించి భయపడి పారిపోబోతున్న వానరసైన్యానికి ధైర్యము చెప్పినాడు.

ఆ మహామాయావి ఇంద్రజిత్తు అనుచరులతో లంకాపట్టణములోకి పోయినాడు. హుటాహుటి తండ్రిదగ్గరకు పోయినాడు. చేతులు జోడించి నమస్కారముచేసి "రామలక్ష్మణులను చంపివేసినాను. వారు చచ్చిపోయినారు'' అని సంతోషముగా చెప్పినాడు. సభామధ్యములో కూర్చున్న రావణాసురుడు ఆ మాట విన్నాడు. శత్రువు చచ్చిపోయినాడు అని సంతోషపడ్డాడు. కూర్చున్న పీఠముమీదనుంచి లేచి ఆ వర్తమానము చెప్పిన తన కొమారుణ్ణి కౌగలించుకొన్నాడు. సంతోషాతిశయముతో శిరము ఆఘ్రాణించినాడు. ఆ రామలక్ష్మణులను ఎట్లా చంపివేసిందీ చెప్పమని కొడుకును అడిగినాడు.

అంతట ఇంద్రజిత్తు రామలక్ష్మణులను ఎట్లా నాగపాశబద్ధులను చేసిందీ వారు ఎట్లా చేష్టలు ఉడిగిపోయిందీ వారి కాంతులు ఎట్లా మాసిపోయిందీ జరిగింది జరిగినట్టు చెప్పినాడు.

తననూ సారథినీ గుర్రాలనూ కాపాడుకొంటూ పదకొండు వేలమంది విలుకాండ్లతో పోరాడే ఇంద్రజిత్తు చెప్పిన మాటలకు రావణాసురుడు ఉప్పొంగిపోయినాడు. రామలక్ష్మణులనుగురించిన మనోవ్యాకులము అంతా రావణాసురుడికి పోయింది. సంతోషించినాడు. పుత్రుణ్ణి ఇంద్రజిత్తును మెచ్చుకొన్నాడు.

౪౬

కృతార్థుణ్ణి అయినాను అనుకొని ఇంద్రజిత్తు అట్లా లంకాపట్టణానికి పోయినాడు. అప్పుడు ఆ యుద్ధభూమిలో హనుమంతుడూ అంగదుడూ నీలుడూ సుషేణుడూ కుముదుడూ నలుడూ గజుడూ గవాక్షుడూ గవయుడూ గంధమాదనుడూ శరభుడూ రంభుడూ

పృథుడూ శతవలీ మొదలు అయిన వానరవీరులు అందరూ ఆర్తులు అయిపోయి రామలక్ష్మణుల చుట్టూ కనిపెట్టుకొని ఉన్నారు. వానర యోధులు అందరూ చెట్లను చేతులలో పట్టుకొని వ్యూహాలు తీర్చి సర్వసంసిద్ధులు అయి అన్నిదిక్కులానూ అటు పైకీ ఇటు కిందికీ చూస్తూనూ గడ్డిపోచ కదిలితే రాక్షసులు వస్తూఉన్నారు ఏమోఅని అనుకొంటూ హెచ్చరికతో ఉన్నారు.

అక్కడ లంకాపట్టణములో అప్పుడు రావణాసురుడు సంతోషములో తనకొడుకుకు ఇంద్రజిత్తుకు వీడ్కోలు చెప్పి పంపించి వేసి సీతాదేవికి కావలి ఉంటూఉన్న రాక్షసాంగనలను రమ్మని కబురు చేసినాడు. రావణాసురుడి ఆజ్ఞప్రకారము త్రిజట మొదలు అయిన రాక్షసాంగనలు వచ్చినారు. ఆ రాక్షసాధిపతి రావణాసురుడు సంతోషములో ఆ రాక్షసాంగనలను అందరినీ చూచి "ఓ అంగనలారా, రామలక్ష్మణులను ఇంద్రజిత్తు చంపివేసినాడు. మీరు ఈసంగతి సీతాదేవికి చెప్పి ఆమెను పుష్పకవిమానముమీద ఎక్కించుకొనిపోయి యుద్ధభూమిలో చచ్చి పడిఉన్న రామలక్ష్మణులను చూపించవలసింది. సీతాదేవి రాముడి ఆశ్రయమునుంచి గర్వము ఎక్కి నన్ను చేరకుండాఉంది. ఈమె పెనిమిటి రాముడూ వాడితమ్ముడు లక్ష్మణుడూ యుద్ధములో చనిపోయినారు. రామలక్ష్మణులు వస్తారు అనే ఆశ అంతము అయిపోయింది. కనుక మైథిలి నిర్విశంకముగా ఏ దిగులూ లేకుండా సమస్తాభరణాలతోనూ అలంకరించుకొని నన్ను చేరుతుంది. యుద్ధములో చనిపోయిన రామలక్ష్మణులను ఈ విశాలాక్షి చూస్తుంది. అంతటితో వారి ఆశ నిరాశ అయిపోతుంది. నాకన్నా వేరే గతి ఆమెకు కనపడదు. ఏ ఇతరాపేక్షా లేకుండా తనంతట తానే ఆమె నన్ను చేరుతుంది" అని చెప్పినాడు.

ఇట్లా ఆ దురాత్ముడు రావణాసురుడు చెప్పింది ఆ రాక్షసాంగనలు విని "అట్లాగేను" అన్నారు. అంతట వాండ్లు పుష్పకవిమానము ఉన్నచోటికి పోయినారు. రావణాసురుడు ఆజ్ఞాపించినట్లుగా ఆ పుష్పకవిమానాన్ని తీసుకొని అశోకవనములో సీతాదేవిదగ్గరకు పోయినారు. భర్తృశోకములో కుమిలిపోతూ ఉన్న ఆ సీతాదేవిని త్రిజటతోకూడా ఆ రాక్షసాంగనలు అప్పుడు

ఆ పుష్పకవిమానము ఎక్కించి రామలక్ష్మణులను చూపించడానికి తీసుకొనిపోయినారు.

“ఇంద్రజిత్తు రామలక్ష్మణులను చంపివేసినాడు” అని రావణాసురుడు సంతోషాతిశయములో లంకాపట్టణము అంతటా చాటింపు వేయించినాడు. ధ్వజాలతో అలంకారము చేయించినాడు. పతాకాలు ఎత్తించినాడు.

ఆ పుష్పకవిమానములో త్రిజటతో కూడా వచ్చిన సీతాదేవి అక్కడ నేలమీద సంతోషాతిశయములో తిరుగుతూ ఉన్న రాక్షసయోధులనూ చచ్చి పడిఉన్న వానరసైన్యాలనూ చూచింది. దుఃఖార్తులు అయి రామలక్ష్మణుల చుట్టూ ఉన్న వానరవీరులను చూచింది. అక్కడ నేలమీద పాన్పుగా పడిఉన్న బాణాల మీద తెలివిలేకుండా బాణాల గాయాలతో పడిఉన్న రామ లక్ష్మణులను చూచింది.

వారి కవచాలు చిరిగిపోయినవి. వారి ధనుస్సులు వారి పక్కను పడిఉన్నవి. అట్లా బాణమయము అయిపోయిన దేహాలతో పడిఉన్న రాముణ్ణి లక్ష్మణుణ్ణి సీతాదేవి చూచింది. అట్లా శరతల్పముమీద పడిఉన్న ఆ వీరులను ఆ పురుషపుంగవులను ఆ పుండరీకాక్షులను అగ్నిహోత్రోద్భవులు అయిన స్కంధ విశాఖులవంటి ఆ అన్నదమ్ములను రామలక్ష్మణులను చూచింది. ఆమెకు చెప్పనలవికాని దుఃఖము వచ్చింది. ఎంతోసేపు ఏడ్చింది. ఆ అనవద్యాంగి ఆ అసితేక్షణ జనకాత్మజ సీతాదేవి దుమ్ము కొట్టుకొని అట్లా పడిఉన్న తన పెనిమిటిని రాముణ్ణి తన మరిదిని లక్ష్మణుణ్ణి చూచింది. పెద్దపెట్టున ఏడ్చింది.

దేవతలవంటి ఆ మహానుభావులు రామలక్ష్మణులు చనిపోయినారు అనుకొని పరమదుఃఖములో కన్నీళ్ళు కారుస్తూ ఈ విధముగా ఆలోచించసాగింది.

౪౮

ఆ మహాబలవంతుడు తన భర్త రాముడూ తన మరిది లక్ష్మణుడూ చచ్చి పడిఉన్నట్టుగా తోచి సీతాదేవి జాలిపుట్టేట్టుగా ఏడ్చింది.

"అయ్యో, నాకు పుత్రుడు పుట్టుతాడు అని నేను వైధవ్యము అనుభవించను అని సాముద్రికము తెలిసినవారు చెప్పినారు. నా భర్త అశ్వమేధాది యజ్ఞాలూ సత్రయాగాలూ చేస్తాడు అనికూడా చెప్పినారు కార్తాంతికులు ఇంకా అనేక శుభాలు చెప్పినారు. నా భర్త పరమపరాక్రమవంతుడు అని నేను ధన్యురాలను అని చెప్పినారు. ఇప్పుడు రామప్రభువు చనిపోవడముతో ఆ చెప్పినవి అన్నీ అబద్ధాలు అయిపోయినవి.

"పాదాలలో పద్మరేఖ ఉన్న స్త్రీ మహారాజుభార్య అవుతుంది అని ఆ మహారాజుతోకూడా ఆమెకు రాజ్యాభిషేకము అవుతుంది అని చెప్పుతారు. నా పాదాలలో స్పష్టముగా పద్మరేఖలు ఉన్నవి. ఇట్లా అయిపోయింది ఏమిటి! ఏ లక్షణాలు ఉంటే స్త్రీలు నిర్భాగ్యలు అయి వైధవ్యము అనుభవిస్తారు అని చెప్పుతారో ఆ లక్షణాలు ఏవీ నాకు లేవే. నేను ఇట్లా అయిపోయినాను ఏమిటి! పద్మరేఖలు అమోఘము అయిన ఫలము ఇస్తవి అని చెప్పింది అంతా అబద్ధము అయిపోయింది."

"నా తలవెంట్రుకలు ఎంతో సన్నగా ఎక్కువ తక్కువలు లేకుండా నల్లగా ఉన్నవి. నా కనుబొమలు ఒక దానితో ఒకటి కలిసిపోలేదు. రోమాలు లేకుండా నా పిక్కలు గుండ్రముగా ఉన్నవి. నా నోటిలో పండ్లు సందులేకుండా కలిసి ఉన్నవి. నా కన్నులూ నా కణతలూ నా చేతులూ నా తొడలూ నా చీలమండలూ నా పాదాలూ బలుపుగా ఉన్నవి. గుండ్రని గోళ్లతో నా వేళ్ళు సన్నగా నా చేతులకు తగినట్టుగా ఉన్నవి. ఎడములేకుండా నా పీనస్తనాలు మొనలు అంటుకొనిపోయి ఉన్నవి. నా నాభి లోతుగా ఉంది. నా ముత్తలు ఎత్తు అయినవి. నా వక్షఃస్థలము పక్కలు బలుపుగా ఉన్నవి. నా దేహముమీద (ఉండవలసిన) వెంట్రుకలు మృదువు అయినవి. నా దేహకాంతి నిగ నిగలాడే రత్నము వంటిది. నా రెండు పాదాలూ వాటి పదివేళ్ళూ (అరకాళ్ళు) నేలను అంటుకొని ఉంటవి. ఇవి అన్నీ శుభలక్షణాలు అని పండితులు చెప్పినారు.

నా అరకాళ్లలోనూ అరచేతులలోనూ సమగ్రము అయిన యవాకారరేఖలు ఉన్నవి. వేళ్లు సందులు లేకుండా ఉన్నవి. నేను

ఎప్పుడూ చిరునవ్వు నవ్వుతూఉన్నట్టు కనపడుతాను అనీ, ఇవి అన్నీ శుభకన్యాలక్షణాలు అనీ తెలిసిన బ్రాహ్మణులు చెప్పినారు. నా పెనిమిటితో కూడా నాకు రాజ్యాభిషేకము జరుగుతుంది అని జ్యోతిషికులు అయిన బ్రాహ్మణులు చెప్పినారు. ఆ చెప్పినవి అన్నీ ఇప్పుడు అబద్ధాలు అయిపోయినవి.

ఆ అన్నతమ్ములు ఆ జనస్థానములో నన్ను వెదకి వెదకి నేను ఎక్కడఉందీ తెలుసుకొని దాటి రా నలవికాని మహాసముద్రాన్ని దాటివచ్చి ఇక్కడ గోష్పదము అంత ఇంద్రజిత్తు మాయలో పడి చచ్చిపోయినారు. అయ్యో రామలక్ష్మణులు వారుణాస్త్రాన్నీ ఆగ్నేయాస్త్రాన్నీ ఐంద్రాస్త్రాన్నీ బ్రహ్మశిరోనామకాస్త్రాన్నీ సంపాదించినారే. ఆ అస్త్రాలను ఎందుకు ఉపయోగించలేదో. ఇప్పుడు నేను అనాథను అయిపోయినాను. నా రక్షకులు రామలక్ష్మణులు దేవేంద్రుడితో సరిసమానము అయినవారు. యుద్ధములో ఇంద్రజిత్తు కంటికి కనపడకుండా మాయము అయిపోయినందువల్లనే నా పెనిమిటినీ నా మరిదినీ చంపివేయ కలిగినాడు. మనోవేగము వంటి వేగముకలవాడు అయినప్పటికిన్నీ శత్రువు కంటపడితే నా పెనిమిటి ప్రాణాలతో పోనీయడు. అటువంటి రామప్రభువు తమ్ముడితో కూడా యుద్ధములో హతుడు అయి నేలమీద పడి ఉన్నాడు. కాలమహిమ. కాలానికి అశక్యము అయింది ఏదీ లేదు.

నేను ఆ తపస్విని మా అత్తగారిని గురించి దుఃఖించినంతగా రామప్రభువునుగురించికానీ ఆ మహాబలవంతుడు లక్ష్మణుణ్ణి గురించికానీ నా తల్లినిగురించికానీ చివరకు నన్నుగురించికానీ దుఃఖించను. వనవాసవ్రతము ముగించుకొని రామప్రభువు లక్ష్మణుణ్ణి సీతనూ వెంటపెట్టుకొని ఎప్పుడు వస్తాడా అనీ ఎప్పుడు చూస్తానా అనీ ఆమె ఎప్పుడూ ఎదురు చూస్తూ ఉంటుంది" అంటూ ఏడ్చింది.

అట్లా పరిదేవనము చేస్తూ ఉన్న సీతాదేవితో త్రిజట "ఓ దేవీ, నీవు దుఃఖపడవద్దు. నీ భర్త జీవించిఉన్నాడు. అమ్మా, అన్నతమ్ములు ఇద్దరూ జీవించిఉన్నారు అని చెప్పడానికి తగిన కారణాలు ఎన్నో కనపడుతున్నవి. రాజు యుద్ధములో చనిపో[illegible]నప్పుడు యోధుల ముఖాలలో సంతోషముకానీ యా[illegible]ట్టుగా కానీ కోపముకానీ కనపడదు,

"ఓ వైదేహీ, అంతే కాదు. మనము ఎక్కి వచ్చిన పుష్పక విమానము దేవలోకములోనిది. రామలక్ష్మణులు నిజముగా చచ్చిపోయి ఉన్నట్లయితే ఈ పుష్పకవిమానము నిన్ను మోసుకొని వచ్చేదికాదు. యుద్ధములో ప్రధానవీరుడు చనిపోయినప్పుడు సైన్యానికి యుద్ధోత్సాహము హతము అయిపోతుంది. ఏ ప్రయత్నమూ చేయకపోవడమే కాకుండా సైన్యమంతా కలిబిలి అయిపోతుంది. చుక్కాని కాసేవాడు లేని నౌక నీళ్లలో దారీ తెన్నూ లేకుండా తిరుగుతుంది. అదే విధముగా యుద్ధభూమిలో సైన్యము గందరగోళముగా తిరుగుతూ ఉంటుంది. ఈ వానర సైన్యము ఇప్పుడు అట్లా లేదు. ఈ సైన్యములో కలవరమే కనిపించడములేదు. భయముపడ్డట్టు లేదు. వానరవీరులు జాగ్రత్తగా రామలక్ష్మణులను కాపాడుతూ ఉన్నారు. నా మాట నమ్ము. ఈ శుభలక్షణాలు అన్నీ చూడు. రామలక్ష్మణులు జీవించి ఉన్నారు.

"ఓ సీతా, నీమీద నాకు ఉన్న స్నేహమునుంచి ఇది అంతా చెప్పుతున్నాను. నేను అబద్ధము ఆడడము లేదు. నేను ఇదివరకు ఎన్నడూ నీతో అబద్ధము చెప్పి ఎరుగను. నేను ఎప్పుడూ నీతో అబద్ధము ఆడను. నీ సచ్ఛీలమునుంచీ నీ సత్ప్రవర్తనము నుంచీ నీవు నా మనస్సుకు వచ్చినావు. సురాసురులు అందరూ ఏకము అయి దేవేంద్రుడితో ఎత్తివచ్చినా ఈ రామలక్ష్మణులను జయించలేరు.

"ఓ జానకీ, రామలక్ష్మణులు జీవించి ఉన్నారు. నాకు అట్లా కనపడుతున్నారు. అందువల్ల చెప్పుతున్నాను. ఓ మైథిలీ, ఇది చాలా గొప్ప లక్షణము. చూడు, ఈ రామలక్ష్మణులు ఇద్దరూ ఇట్లా విసంజ్ఞులుగా పడిఉన్నప్పటికిన్నీ వీరి ముఖాలమీద కళ కాంతులు ఏమాత్రమూ మాసిపోలేదు. ఆయుస్సు తీరిపోయిన వారి ముఖాలమీదనూ చచ్చిపోయినవారి ముఖాలమీదనూ కని పించే పరమవికారము ఏమిన్నీ వీరి ముఖాలమీద కనిపించడము లేదు. నీవు ఈ రామలక్ష్మణులకోసము దుఃఖపరవశవు అయి పోవద్దు. నీవు దుఃఖము వదిలిపెట్టు. వీరు బ్రతుకకుండా పోవడము

నా తను. వీరు బ్రతికిఉన్నారు అనడానికి సందేహము యవాకారరేఖలు ఉన్ని.

ఇట్లా త్రిజట చెప్పింది దేవకన్యవంటి సీతాదేవి విన్నది. చేతులు జోడించి "అట్లా జరగవలెను" అన్నది. మనోవేగముతో పోయే ఆ పుష్పకవిమానాన్ని మళ్ళించుకొని దుఃఖపడుతూ ఉన్న సీతాదేవితో మళ్ళీ లంకాపట్టణానికి తీసుకొని పోయింది. అంతట రాక్షసాంగనలు త్రిజటతోకూడా సీతాదేవిని ఆ విమానములో నుంచి దింపి అశోకవనానికి తీసుకొని పోయినారు.

రాక్షసరాజు రావణాసురుడు విహరించే ఆ అశోకవనములో సీతాదేవి తాను చూచి వచ్చిన రామలక్ష్మణులనుగురించి తలచుకొంటూ దుఃఖపడసాగింది.

౪౮

భయంకరము అయిన నాగపాశాలకు కట్టుపడిపోయి పాముల వలె నిట్టూర్పులు విడుస్తూ నెత్తురుతో ఒళ్లు అంతా తడిసిపోయి నేలమీద పడుకొని ఉన్న రామలక్ష్మణుల చుట్టూ మహాబలవంతుడు అయిన సుగ్రీవుడితోకూడా వానరవీరులు అందరూ దుఃఖపడుతూ కనిపెట్టుకొని ఉన్నారు. అట్లా ఆ వానరవీరులు అందరూ చూస్తూ ఉండగా ఆ వీర్యవంతుడు రాముడు కన్నులు తెరిచినాడు. నాగపాశబద్ధుడు అయినప్పటికిన్నీ బలవంతుడు అయినందువల్లనూ ధైర్యవంతుడు అయినందువల్లనూ మూర్ఛ తేరుకొన్నాడు. గాఢముగా బాణాలు గుచ్చుకొని ఒళ్లు అంతా నెత్తురుతో తడిసిపోయి విషణ్ణుడు అయి దీనవదనంతో పడిఉన్న తన తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి చూచినాడు. దుఃఖము పొంగి పొర్లింది. అంతట రాముడు విలపించినాడు.

కన్నులవెంట నీరు కారుస్తూ "అయ్యో, నా తమ్ముడు లక్ష్మణుడు యుద్ధములో పరాజితుడు అయి పడిఉన్నాడు. ఇప్పుడు నాకు సీతతో పని ఏమిటి. నేను బ్రతికిఉండి ప్రయోజనము ఏమిటి. ఈ భూలోకములో వెతికితే ఎక్కడను అయినా సీతవంటి స్త్రీని సంపాదించుకోవచ్చును. కాని ఈ విధముగా సాయపడేవాణ్ణి యుద్ధసమర్థుణ్ణి నా తమ్ముణ్ణి లక్ష్మణుడివంటివాణ్ణి సంపాదించుకోడము అసంభవము. సుమిత్రాదేవిని సంతోషపెట్టే నా తమ్ముడు

లక్ష్మణుడు చనిపోయేట్లయితే నేను ఈ వానరులు అందరూ చూస్తూ ఉండగానే ప్రాణము వదులుతాను.

"నేను మా అమ్మ కౌసల్యాదేవికి ఏమి చెప్పేది. కైకేయీ దేవికి ఏమి చెప్పేది. నేను లక్ష్మణుడు లేకుండా అయోధ్యకు పోయేట్లయితే పుత్రదర్శనలాలస అయి పిల్ల పోయిన లేడివలె ఏడ్చే సుమిత్రాదేవిని ఓదార్చడము ఎట్లాగు. ఆ యశస్వికి భరతుడికి ఏమి అని చెప్పడము. శత్రుఘ్నుడికి ఏమి అని చెప్పడము. ఎట్లా చెప్పడము. నావెంట అడవికి వచ్చిన తమ్ముడు లేకుండా నేను అయోధ్యకు పోయేట్లయితే సుమిత్రాదేవి నన్ను నిందిస్తుంది. ఆమె నిందిస్తే నేను ఓర్చుకోలేను. అయ్యో, నేను ఇక బ్రతికి ఉండడము ఎందుకు. ఇక్కడనే ప్రాణము వదిలిపెట్టుతాను. నా కోసము ఈ లక్ష్మణుడు శరతల్పముమీద పడిపోయినాడు. చచ్చి పోయినట్టుగా ఉన్నాడు. అయ్యో నేను ఏమి పాపకార్యము చేసినానో. ఏమి దుష్టకార్యము చేసినానో.

"ఓ లక్ష్మణా, నేను ఎప్పుడు విమన్నుణ్ణి అయినా నీవు నన్ను ఓదార్చేవాడవు. నేను ఇప్పుడు ఇట్లా దుఃఖపడుతూఉంటే నీవు నన్ను ఓదార్చలేకుండా ఉన్నావు. రాక్షసులను పడకొట్టిన నిన్ను రాక్షసులు పడకొట్టినారు. ఒంటినిండా బాణాలు గుచ్చుకొని నెత్తురు కాల్లువలు అయి పారుతూ బాణాల పాన్పుమీద పడిఉన్న ఈ లక్ష్మణుడు అస్తమిస్తున్న సూర్యుడివలె తేజరిల్లుతున్నాడు. అన్ని ఆయువుపట్టులలోనూ దెబ్బలు తగిలినవి. మాట్లాడలేకుండా ఉన్నాడు. మాట్లాడలేకుండా ఉన్నప్పటికిన్నీ లక్ష్మణుడి చూపుల వల్లనే వాడి బాధ తెలుస్తున్నది. ఈ మహాద్యుతిమంతుడు ఎట్లా నావెంట అడవికి వచ్చినాడో నేనూ అట్లాగే వీడివెంట యమసదనానికి పోతాను. వీడు ఎప్పుడూ నన్ను అనుసరించుకొని నావెంట ఉన్నాడు. వీడు బంధుజనులకు అందరికీ ఇష్టుడు. అయినప్పటికిన్నీ నన్ను వదిలిపెట్టి ఎరగడు. నేను అభాగ్యుణ్ణి. నా అభాగ్యమువల్ల వీడికి ఈ దురవస్థ వచ్చింది. ఈ వీరుడికి లక్ష్మణుడికి ఎంత కోపము వచ్చినా ఒక్క పరుషవాక్యము అని ఎరగడు. ఒక్క అప్రియము అడి ఎరగడు. వీడు అట్లా అన్నట్టు మరిఒకడు ఎవడూ నాతో

చెప్పి ఉండలేదు. ఏకవేగముతో అయిదువందల బాణాలను వదిలే కార్తవీర్యార్జునుడికన్నా నా తమ్ముడు లక్ష్మణుడు అధికుడు. ఆ కార్తవీర్యార్జునుడికి వెయ్యిచేతులు ఉండేవి. నా తమ్ముడికి లక్ష్మణుడికి రెండేచేతులు అయినప్పటిన్నీ ఆ కార్తవీర్యార్జునుడి కన్నా ఏకకాలాన ఎక్కువబాణాలు వదిలేవాడు. మహాపరాక్రమవంతుడు అయిన దేవేంద్రుడి బాణాలను అయినా తన అస్త్రాలతో కొట్టే లక్ష్మణుడు—మహార్హ్హము అయిన శయ్యమీద పడుకోవలసిన లక్ష్మణుడు—ఒక రాక్షసుడి బాణాలకు నేలమీద పడిఉన్నాడు.

"అయ్యో, విభీషణుణ్ణి నేను లంకాపట్టణములో రాక్షసరాజుగా రాజ్యాభిషేకము చేస్తాను అన్నాను. అట్లా చేయలేదు. ఆ నా వాగ్దానము అబద్ధము అయింది. అదే నన్ను దహించి వేస్తుంది. సందేహము లేదు.

"ఓ సుగ్రీవుడా, నీవు కిష్కింధానగరానికి ఇప్పుడే తిరిగిపో. రావణాసురుడు బలవంతుడు. నేను ఉండను కనుక నిన్ను తరిమి కొట్టుతాడు. నీవు అంగదుణ్ణి పురస్కరించుకొని నీ స్నేహితులనూ నలుణ్ణి నీలుణ్ణి తక్కిన వానరవీరులనూ వెంటపెట్టుకొని సముద్రాన్ని దాటిపో. ఈ యుద్ధములో ఇతరులు ఎవరూ చేయలేనిపని హనుమంతుడు చేసినాడు. భల్లూకరాజు జాంబవంతుడూ గోలాంగూలరాజు గవాక్షుడూ చక్కగా పోరాడినారు. నేను సంతోషపడుతున్నాను. ఈ యుద్ధములో మైందుడూ ద్వివిదుడూ కష్టపడి పని చేసినారు. కేసరీ సంపాతీ ఘోరముగా పోరాడినారు. గజుడూ గవయుడూ గవాక్షుడూ శరభుడూ ఇంకా ఇతరులూ నా నిమిత్తము ప్రాణాలు వదులుకోడానికి సిద్ధము అయి చక్కగా యుద్ధము చేసినారు.

"ఓ సుగ్రీవుడా, ఎవరు ఏమి చేస్తే నేమిటి—మానవుడు దైవాన్ని అతిక్రమించలేడు. సుగ్రీవుడా, నీవు పరంతపుడవు. నాకు స్నేహితుడవు. నీ హృదయము మంచిది. అధర్మానికి భయపడి నీవు చేయవలసింది అంతా నీ శక్తివంచనలేకుండా చేసినావు.

"ఓ వానరులారా, మీరు అందరూ ఏలోపమూ లేకుండా మీ మిత్రుడి పని చేసిపెట్టినారు. మీరు అందరూ ఇప్పుడు తిరిగి

పోవలసింది. అందుకు నేను అనుమతిస్తున్నాను. మీరు యథేష్ట ముగా వెళ్ళిపొండి" అని చెప్పి రాముడు మళ్లీ మూర్ఛపోయినాడు.

రాముడి పరిదేవనము వానరులు అందరూ విన్నారు. అతడు మూర్ఛపోవడము చూచినారు. దుఃఖపడిపోయినారు. ఏడ్చి ఏడ్చి వానరులు అందరికన్నులూ ఎఱ్ఱపడిపోయినవి.

అదివరకు పారిపోవడానికి ప్రయత్నము చేసిన వానరసైన్యా లను అన్నిటినీ పారిపోకుండా నచ్చచెప్పి విభీషణుడు గద చేతులో పట్టుకొని గబా గబా రాముడు ఉన్నచోటికి బయలుదేరినాడు. అట్లా అమితవేగముతో వస్తూఉన్న కాటుకకొండవంటి ఆ విభీషణుణ్ణి రాముడిదగ్గర ఉన్న వానరయోధులు చూచినారు. ఇంద్రజిత్తు అనుకొన్నారు. భయపడ్డారు. పారిపోవడానికి ప్రయత్నము చేయ సాగినారు.

౩౦

అప్పుడు ఆ మహాతేజోవంతుడు ఆ మహాబలవంతుడు వానర రాజు సుగ్రీవుడు వానరవీరులను అందరినీ చూచి "ఓ వీరులారా, జలమధ్యములో ఎదురుగాలికి నౌకవలె మన సైన్యము అడ్డముఖము పెట్టుతున్నది ఏమిటి" అని అడిగినాడు.

అందుకు అంగదుడు "రాజా, ఒంటినిండా బాణాలు గుచ్చు కొని నెత్తురు కారుతూ బాణాలపాన్పుమీద పడుకొని ఉన్న రామలక్ష్మణులను నీవు చూడటము లేదా" అని అడిగినాడు.

అంతట సుగ్రీవుడు "అంగదుడా, అది కారణముగా కనబడ టము లేదు. వానరయోధులు అందరూ మరి దేనికో భయపడు తున్నట్లు నాకు తోస్తున్నది. అందరూ ఏదో ఒకే భయమునుంచి చేతులలో ఉన్న చెట్లను వదిలిపెట్టినారు. అందరి ముఖాలలోనూ దిగులు కనపడుతున్నది. అన్ని దిక్కులా తేరిపార చూస్తూ పరుగెత్తి పారిపోతున్నారు. ఒకండ్లను చూచి ఒకండ్లు సిగ్గుపడటము లేదు. వెనకకు తిరిగి చూడకుండా పరుగెత్తుతున్నారు. ఒకండ్లను ఒకండ్లు లాక్కొని పోతున్నారు. పడిపోయినవారిమీదుగా దాటి పోతున్నారు" అన్నాడు.

అప్పుడు ఆ సమయాన రాక్షసవీరుడు విభీషణుడు గదను చేతిలో పట్టుకొని అక్కడికి వచ్చినాడు. సుగ్రీవుణ్ణి ఆశీర్వదించి రామలక్ష్మణులను చూచినాడు. ఆ విభీషణుణ్ణి చూచే వానరయోధులు అందరూ భయపడి పారిపోతున్నారు అని ఊహించి సుగ్రీవుడు తనసమీపములో ఉన్న జాంబవంతుణ్ణి చూచి "ఓ భల్లూకరాజా, ఈ వచ్చిన విభీషణుణ్ణి మన వానరయోధులు అందరూ ఇంద్రజిత్తు అనుకొని భయపడి పరుగెత్తి పారిపోతున్నారు. నీవు వెంటనే పోయి వాండ్లకు అందరికీ ఈ వచ్చినవాడు ఇంద్రజిత్తు కాదు అనీ విభీషణుడు అనీ నచ్చచెప్పి వాండ్లను అందరినీ మళ్లించుకొని రావలెను" అని ఆజ్ఞాపించినాడు.

అప్పుడు ఆ భల్లూకరాజు జాంబవంతుడు పరుగెత్తి పారిపోతున్న వానరులకు అందరికీ నచ్చచెప్పినాడు. వాండ్లను అందరినీ తిరిగి తీసుకొనివచ్చినాడు. ఆ జాంబవంతుడి మాటలు అనుసరించి వచ్చి చూచి తాము చూచింది ఇంద్రజిత్తు కాదు అనీ, విభీషణుడు అనీ తెలుసుకొన్నారు. వారిభయము అంతటితో తీరిపోయింది. వానరయోధులు అందరూ తిరిగీ సన్నద్ధులు అయినారు.

ఆ ధార్మికుడు విభీషణుడు రామలక్ష్మణులను చూచి దుఃఖపడిపోయినాడు. చేతితో నీళ్ళు తీసుకొని ఆ అన్నతమ్ముల కన్నులు తుడిచినాడు. వారు మూర్ఛ తేరుకోలేదు. విభీషణుడు శోకముతో బాధపడ్డాడు. ఏడుస్తూ "ఈ రామలక్ష్మణులు బలవంతులు. పరాక్రమవంతులు. యుద్ధప్రియులు. కూటయుద్ధము చేసే రాక్షసుల నుంచి వీరికి ఈ దురవస్థ వచ్చింది. ఇంద్రజిత్తు దురాత్ముడు. తల్లి కడుపు చెడపుట్టినాడు. రాక్షస సాధారణము అయిన కుటిలబుద్ధితో కూటయుద్ధము చేయని ఈ రామలక్ష్మణులను మోసము చేసినాడు. అయ్యో, వీరి దేహమంతటా బాణాలు గుచ్చుకొని నెత్తురుతో తడిసి నేలమీద పడిపోయినారు. నేను వీరి పరాక్రమాన్ని ఆశ్రయించినాను. నాకు సమస్తగౌరవాలూ సంప్రాప్తము అవుతవి అనుకొన్నాను. అయ్యో, ఈ పురుషపుంగవులు ఉభయులూ దేహక్షయము కోసము నిద్రపోతున్నారు. నాకు రాజ్యము ఏలవలెను అనే కోరిక పోయింది. నేను ఇక బ్రతికి ఉండేట్లయితే ఆపదలపాలు అయిపోతాను. నా శత్రువు రావణాసురుడి ప్రతిజ్ఞ నెరవేరుతుంది.

వాడికోరిక నెరవేరుతుంది" అంటూ ఉన్న విభీషణుణ్ణి సుగ్రీవుడు కౌగలించుకొని "ఓ విభీషణుడా, నీవు ధర్మజ్ఞుడవు. రావణాసురుడి కోరిక నెరవేరదు. వాడి కొడుకు కోరిక నెరవేరదు. నీవు లంకా రాజ్యము ఏలుతావు. సందేహము లేదు. ఈ రామలక్ష్మణులు మూర్ఛ తేరుకొంటారు. వీరు యుద్ధములో రాక్షససమూహాలతో కూడా రావణాసురుణ్ణి సంహారము చేసివేస్తారు" అని చెప్పి ఓదార్చినాడు.

అంతట సుగ్రీవుడు సుషేణుణ్ణి చూచి "నీవు ఈ అరిందములు రామలక్ష్మణులు మూర్ఛ తేరుకోగానే వీరిని తీసుకొని వానర యోధులతో కూడా కిష్కింధానగరానికి పో. నేను రావణాసురుణ్ణి పుత్ర మిత్ర బాంధవముగా చంపివేసి కోలుపోయిన రాజ్యలక్ష్మిని వామనమూర్తి దేవేంద్రుడికి ఒప్పగించినట్లు సీతాదేవిని తీసుకొనివచ్చి రాముడికి సమర్పిసాను" అని చెప్పినాడు.

ఈ మాటలకు సుషేణుడు "రాజా, పూర్వము దేవాసుర యుద్ధము మహాభయంకరముగా జరిగింది. నేను ఆ యుద్ధము చూచినాను. బాణప్రయోగకోవిదులూ శస్త్రవిదులూ అయిన దానవులు ఆ యుద్ధములో వివిధాయుధాలూ దేవతలమీద ఎడతెగకుండా వర్షముగా కురిపించినారు. అప్పుడు ప్రాణాలుపోయినవారికీ మూర్ఛపోయినవారికీ బృహస్పతి మంత్రవిద్యతోనూ, ఓషధులతోనూ చికిత్సచేసినాడు. ఆ మూలికలు అన్నీ క్షీరసముద్రతీరాన దొరుకుతవి. వాటిని తేవడానికి నీవు వెంటనే ఇప్పుడే వానరవీరులను పంపించవలెను. పర్వతాలలో దొరికే మహౌషధులను మన వానరులు బాగా ఎరుగుదురు. సంజీవకరణీ, విశల్యకరణీ అనే రెండుమూలికలను దేవతలు సృష్టించినారు. వాటిని రెంటినీ ఇప్పుడు తెప్పించవలెను. పరమోత్తమమయిన పాలసముద్రాన్ని పూర్వము దేవతలు అమృతముకోసము చిలికినారు. అక్కడ ఆ పాలసముద్రములో ద్రోణపర్వతమూ చంద్రపర్వతమూ అనే రెండు పర్వతాలు ఉన్నవి. ఆ పర్వతాలమీద సంజీవకరణీ, విశల్యకరణీ అనే రెండు పరమౌషధాలూ ఉన్నవి. ఆ పరమౌషధులు రెంటినీ దేవతలు ఆ రెండు పర్వతాలమీద నాటినారు. రాజా, వాయు

సుతుణ్ణి హనుమంతుణ్ణి అక్కడికి పంపించు. అతడు పోయి వాటిని తీసుకొని వస్తాడు" అని చెప్పినాడు.

ఇట్లా సుషేణుడు చెప్పుతూ ఉండగా మెరుపులతో మేఘాలమూ సముద్రజలాలను చెదరగొట్టుతూనూ భూమి అంతా కదిలి పోతున్నట్టుగా గాలి వీచింది. ఆ గాలికి లంకాద్వీపములో ఉన్న మహావృక్షాలు కొమ్మలతో విరిగి సమూలముగా పెళ్ళగిలి సముద్రములో పడిపోయినవి. అక్కడ ఉంటూఉన్న మహాసర్పాలూ జలజంతువులూ భయపడి దాగుకోడానికి సముద్రములో మునిగి పోయినవి. అంతట కొంచెము సేపటికి మహాబలవంతుడు వినతా పుత్రుడు గరుత్మంతుడు జ్వలిస్తూఉన్న అగ్నిహోత్రుడివలె అక్కడి వానరులకు అందరికీ కనిపించినాడు. మహాబలవంతులను రామలక్ష్మణులను బాణరూపాన చుట్టి వేసుకొని ఉన్న పాములు అన్నీ ఆ వచ్చిన గరుత్మంతుణ్ణి చూచి పారిపోయినవి. అప్పుడు ఆ గరుత్మంతుడు రామలక్ష్మణులను చూచి చంద్రసమకాంతులతో తేజరిల్లుతూ ఉన్న తన చేతులతో ఆ రామలక్ష్మణులను సంతోషముగా తడవినాడు. అంతట ఆ అన్నదమ్ముల శరీరాలమీద గాయాలు అన్నీ కనపడకుండా పోయినవి. అంతేకాదు. వారి దేహాలు అప్పుడు మంచివన్నెతో నున్నగా అయిపోయినవి. వారి తేజస్సూ ఓజస్సూ వీర్యమూ బలమూ ఉత్సాహమూ సూక్ష్మార్థ పరిజ్ఞానమూ జ్ఞాపకశక్తి బుద్ధికుశలతా అదివరకటికన్నా రెట్టింపు అయినవి.

ఆ మహావీర్యవంతుడు గరుత్మంతుడు సంతోషముగా రామలక్ష్మణులను లేవనెత్తి కౌగలించుకొన్నాడు.

అప్పుడు రాముడు గరుత్మంతుడితో "ఓ మహానుభావుడా, నీ అనుగ్రహమువల్ల మేము ఇంద్రజిత్తు పెట్టిన కష్టసముద్రములో నుంచి ఇప్పుడు గట్టు ఎక్కినాము. మాకు ఇప్పుడు ఇదివరకటి బలము వచ్చింది. నిన్ను చూస్తూఉంటే మా తండ్రి దశరథమహారాజును చూస్తూ ఉన్నట్టుగా ఉంది.

"ఓ రూపసంపన్నుడా, నీవు ఎవరవు! దివ్యపుష్పమాలికలూ దివ్యాభరణాలూ ధరించినావు. సుగంధలేపనములతో ఘుమ

ఘుమలాడుతూ ఉన్నావు. నిర్మలవస్త్రము కట్టుకొన్నావు. నీవు ఎవరవో చెప్పు" అని అడిగినాడు.

రాముడు అడిగిన ఈ ప్రశ్నకు ఆ మహాతేజోవంతుడు ఆ మహాబలవంతుడు ఆ పక్షిరాజు వైనతేయుడు అపరిమితము అయిన సంతోషముతో ఆనందబాష్పములు వదులుతూ "ఓ రామా, నేను నీ స్నేహితుణ్ణి. నిన్ను సంతోషపెట్టడమే నా పని. నేను నీ బహిశ్చర ప్రాణమువంటివాడను. నా పేరు గరుత్మంతుడు. నీకు సహాయపడడానికి వచ్చినాను. ఆ క్రూరకర్ముడు ఇంద్రజిత్తు తన మాయాబలముతో నిర్మించిన నాగపాశాలను మహావీర్యవంతులు అయిన అసురులుకానీ మహాబలవంతులు అయిన దానవులుకానీ దేవేంద్రుడితో దేవతలూ గంధర్వులూకానీ విడిపించలేరు. మహావిషముతో కరుకుకోరలతో కద్రువకు పుట్టిన నాగులు అనే మహాసర్పాలను ఇంద్రజిత్తు తన రాక్షసమాయాప్రభావముతో బాణాలుగా చేసి మీమీద వదిలినాడు. ఓ రామా, నీవు ధర్మజ్ఞుడవు. నీ పరాక్రమము ఎప్పుడూ వ్యర్థము అయిపోదు. ఈ యుద్ధములో నీవూ నీ తమ్ముడూ శత్రువులను అందరినీ సంహారము చేసివేస్తారు. మీరు జయిస్తారు.

"ఓ రామా, మిమ్ములను ఇంద్రజిత్తు నాగపాశాలతో బంధించి వేసినాడు అని వినగానే బయలుదేరినాను. స్నేహధర్మాన్ని పాటించి ఇక్కడికి వచ్చినాను. మిమ్ములను మహాఘోరము అయిన నాగపాశాలనుండి విడిపించినాను. మీరు ఇకను ఎప్పుడూ ఏమరుపాటు లేకుండా ఉండవలెను. కూటయుద్ధము చేయడము రాక్షసుల స్వభావము. మీరు పరిశుద్ధులు. శూరులు. మీరు ఋజువర్తనులు. అదే మీ బలము. అందువల్ల మీరు ఎప్పుడూ హెచ్చరికతో ఉండవలెను. యుద్ధభూమిలో రాక్షసులను ఎప్పుడూ మీరు నమ్మకూడదు. ఈ నిదర్శనమువల్లనే రాక్షసులు ఎప్పుడూ కుటిలురు అని తేలిపోయింది" అంటూ ఆ మహాబలవంతుడు గరుత్మంతుడు రాముడితో చెప్పినాడు. స్నేహాతిశయముతో రాముణ్ణి కౌగలించుకొని "ఓ మిత్రుడా, నీవు ధర్మము తెలిసిన వాడవు. శత్రువులమీదకూడా నీకు వాత్సల్యము ఉంది.

“ఓ రామా, నాకు అనుజ్ఞ ఇవ్వు. నేను పోయివస్తాను. నేను నీకు ఎట్లా స్నేహితుడనో తెలుసుకోవలెను అనే కుతూహలము వద్దు. నీవు వీరుడవు. యుద్ధములో కృతకృత్యుడవు అవుతావు. అప్పుడు నేను ఎవరినో నీకు తెలుస్తుంది. రామప్రభూ, లంకాపట్టణములో బాలవృద్ధులనుమాత్రము వదిలిపెట్టి తక్కినవారిని అందరినీ నీ బాణపరంపరలతో ముంచివేయవలెను. నీ శత్రువును రావణాసురుణ్ణి చంపివేయవలెను. సీతాదేవిని తెచ్చుకోవలెను” అని చెప్పి అమిత వేగముతో పోయే ఆ వీర్యవంతుడు వానరుల మధ్యను ఉన్న రామలక్ష్మణులకు ప్రదక్షిణము చేసి వారిని కౌగలించుకొని వారికి నమస్కారపురస్సరముగా వీడ్కోలు చెప్పి ఆకాశమార్గాన వాయుదేవుడివలె సాగిపోయినాడు.

ఏ బాధా లేకుండా హాయిగా ఉన్న రామలక్ష్మణులను చూచి వానరులు సంతోషముతో సింహనాదాలు చేసినారు. అదివరకటివలె భేరీలు మ్రోగించినారు. మృదంగాలు వాయించినారు. శంఖాలు పూరించినారు. తోకలు ఝాడించినారు. మరింత సంతోషముతో సింహనాదాలు చేసినారు. వృక్షాలు తీసుకొని పోరాడే ఆ వానరయోధులు అంతట పరాక్రమించి భుజాలు చరిచి నానావిధమహావృక్షాలనూ పెళ్ళగించి లక్షలకొద్దీ యుద్ధసన్నద్ధులు అయినారు. అప్పుడు వానరయోధులు అందరూ మహాధ్వనులు చేస్తూ నిశాచరులను భయపెట్టుతూ యుద్ధకాముకులు అయి లంకాపట్టణద్వారాలను ఎదుర్కొన్నారు.

ఆ మహానిశీథములో వానరయోధుల మహానాదాలు గ్రీష్మఋతువు అయిపోయిన తరువాత తొలకరి మేఘాలు ఉరిమే ఉరుములవలె గలిబిలిగా మహాభయంకరముగా వినిపించినవి.

౨౦

అప్పుడు ఆ బలవంతులు వానరులు చేసిన కోలాహలధ్వనులూ సింహనాదాలూ రాక్షసులమధ్యను సభాభవనములో ఉన్న రావణాసురుడు విన్నాడు. ఆ గంభీరఘోషాన్ని విని వినయముతో మంత్రుల వంక చూచి “వానరులు అందరూ మహామేఘాలవలె గర్జిస్తున్నారు.

వాండ్లకు అందరికీ పరమసంతోషము వేసి ఉండవలెను. స్పష్టముగా తెలుస్తున్నది. పరమసంతోషమే వేయకపోయినట్లయితే వాండ్లు అందరూ అట్లా అరవరు. సందేహము లేదు. ఆ మహాధ్వనినుంచే సముద్రము అల్లకల్లోలముగా ఉంది. రామలక్ష్మణులు ఇంద్రజిత్తు వదిలిన తీక్ష్ణబాణాలకు కట్టుపడిపోయినారు. ఇప్పుడు వానరుల కోలాహలధ్వనులు వినపడుతున్నవి. ఒకవేళ వారికి ఆ శరబంధాలు వదిలిపోయినవి ఏమోను అని నాకు తోస్తూఉంది" అని చెప్పి దాపునఉన్న రాక్షసయోధులను చూచి "ఓ యోధులారా, వానరులు ఇప్పుడు దుఃఖపడుతూ ఉండవలసింది పోయి కోలాహల ధ్వనులు చేస్తూఉన్నారు. అందుకు కారణము ఏమిటో మీరు యిప్పుడే పోయి తెలుసుకొని రావలెను" అని రావణాసురుడు ఆజ్ఞాపించినాడు.

ఈ మాటలకు ఆ రాక్షసయోధులు అందరూ కలవరపడి పోయినారు. వెంటనే పోయి ప్రాకారము ఎక్కినారు. వానర సైన్యాన్ని చూచినారు. మహాభయంకరము అయిన నాగపాశ బంధాలు విడిపోయి రామలక్ష్మణులు హాయిగా తిరుగుతూ ఉండడము కనిపించింది. అందుకు ఆ భయంకరులు భయపడిపోయినారు. వారికి దిగులు వేసింది. ఆ ప్రాకారముమీదినుంచి కిందికి దిగి ముఖాలు వెల వెలపోతూ తమ ఏలికదగ్గరకు పోయినారు. వాండ్లు ఏ మాటలు ఎప్పుడు ఎవరితో చెప్పవలెనో తెలిసిన నేర్పరులు. ఆ అప్రియము అప్పుడు తమ ఏలికతో విన్నవించడము మంచిది అనుకొన్నారు.

ఆ రాక్షసయోధులు అప్పుడు రావణాసురుణ్ణి చూచి "రాజా, యుద్ధములో ఇంద్రజిత్తు వదిలిన నాగపాశాలకు అటూ ఇటూ కదలకుండా మెదలకుండా కట్టుబడిపోయిన రామలక్ష్మణులు ఆ నాగపాశల కట్లు వదిలిపోయి కట్టుతాడు తెంచుకొన్న మదపు టేనుగులవలె చెలరేగి తిరుగుతున్నారు. మేము చూచినాము" అని చెప్పినారు.

ఈ విధముగా ఆ రాక్షసయోధులు చెప్పింది ఆ మహాబల వంతుడు రావణాసురుడు విన్నాడు. అతడికి దిగులు వేసింది. ఆలోచనలో పడ్డాడు. అతనిముఖము వెలవెలపోయింది. దిగులు

పడుతూ "ఇంద్రజిత్తు వదిలిన బాణాలు భయంకరము అయినవి. అమోఘము అయినవి. వాటిని వాడు వరదానమువల్ల సంపాదించినాడు. అవి తీక్ష్ణవిషసర్పాలవంటివి. అవి తేజములో సూర్యుడితో సరిసమానము అయినవి. ఆ బాణాలతో ఇంద్రజిత్తు రామలక్ష్మణులను బంధించివేసినాడు. ఆ బాణబంధమునుంచి శత్రువులు ఇద్దరూ ఇప్పుడు విముక్తులు అయిఉన్నట్లయితే రాక్షససైన్యానికి అంతటికీ ప్రాణసంశయావస్థ వచ్చింది అన్నమాట. అట్లా నాకు తోస్తూఉంది. ఆ బాణాలు వాసుకి తేజమువంటివి. ఇదివరకు అవి యుద్ధాలలో శత్రువుల ప్రాణాలను తీసివేసినవి. అవి ఎన్నడూ నిష్ఫలము అయిపోలేదు. ఆ బాణాలు ఇప్పుడు పనికిరాకుండా పోయినవి" అంటూ రావణాసురుడు క్రుద్ధుడు అయిపోయినాడు. మహాసర్పమువలె నిట్టూర్పులు విడిచినాడు. ఆ రాక్షసుల మధ్యను ఉన్న ధూమ్రాక్షుణ్ణి చూచి "ఓ ధూమ్రాక్షుడా, నీ పరాక్రమము భయంకరము అయినది. కాబట్టి నీవు ఇప్పుడు మన రాక్షస సైన్యాలలో గొప్పసైన్యాన్ని తీసుకొనిపోయి వానరులతోకూడా ఆ రామలక్ష్మణులను చంపివేయవలెను" అని చెప్పినాడు.

అంతట ధూమ్రాక్షుడు ఆ ధీమంతుడికి రావణాసురుడికి నమస్కారముచేసి పరమసంతోషముతో ఆ రాజగృహములోనుంచి బయలుదేరినాడు. ఆ రాజగృహద్వారము దాటి వచ్చి యుద్ధోత్సాహముతో సేనాధ్యక్షుణ్ణి చూచి సేనలను వెంటనే పంపించమని చెప్పినాడు. ఆ సేనాధ్యక్షుడు ధూమ్రాక్షుడు చెప్పిన రాజాజ్ఞను శిరసావహించి అప్పటికి అప్పుడు రాక్షససైన్యాన్ని సిద్ధముచేసినాడు.

నడుములకు గంటలు కట్టుకొన్న భయంకరాకారులు అయిన నిశాచరయోధులు శూలాలూ ముద్గరాలూ మొదలు అయిన వివిధాయుధాలూ చేతులలో పట్టుకొని సంతోషాతిశయముతో గర్జిస్తూ ధూమ్రాక్షుడివెంట నడిచినాడు. అప్పుడు ఆ ధూమ్రాక్షుడి వెంట పోవడానికి నాల్గువైపులనుంచి రాక్షసయోధులు గదలూ ఇనుపదండాలూ ముసలాయుధాలూ ఇనుప గుదియలూ విడిచి వాటుగుదియలూ బల్లెములూ ఈటెలూ గండ్రగొడ్డళ్ళూ తీసుకొని మహామేఘాలవలె గర్జిస్తూ వచ్చి చేరినారు.

ధ్వజాలతోనూ బంగారు కిటికీలతోనూ ఉన్న రథాలకు వివిధముఖాల కంచరగాడిదలనూ పూన్చినారు. ఆ రథాలమీద కవచాలు తొడుగుకొన్న రాక్షసయోధులు కొందరు బయలుదేరినారు. పెద్దపులులవలె దురాసదులు అయిన రాక్షసయోధులు కొందరు గుర్రాలమీదనూ కొందరు మదపుటేనుగులమీదనూ బయలుదేరినారు.

ధూమ్రాక్షుడు తోడేళ్లవంటి ముఖాలతోనూ సింహాలవంటి ముఖాలతోనూ బంగారు అలంకరణాలతోనూ ఉన్న కంచరగాడిదలు పూన్చిన రథము ఎక్కినాడు. ఆ రథము భయంకరధ్వనులతో కదిలింది. రాక్షససైన్యము ఆ రథమువెంట నడిచింది. వానరయోధాలతో హనుమంతుడు ముట్టడించిన లంకాపట్టణ పశ్చిమద్వారమువైపుకు ఆ రథముమీద ధూమ్రాక్షుడు ఖులాసాగా నవ్వుతూ బయలుదేరినాడు.

అట్లా పశ్చిమద్వారానికి పోతూఉన్న ఆ మహాభయంకరుడికి ఆ భీమవిక్రముడికి ధూమ్రాక్షుడికి అంతరిక్షమునుంచి ఘోరము అయిన పక్షులు అడ్డము వచ్చినవి. ఆ రథశీర్షముమీద మహాభయంకరము అయిన ఒక గద్ద వాలింది. శవాలను తినే రాబందు పక్షులు ఆ రథధ్వజముమీద వాలి అవి అక్కడ నిలువలేక నేల కూలినవి. నెత్తురుతో తడిసిన తెల్లటి మొండెము ఒకటి వికృత స్వరముతో ఏడుస్తూ ధూమ్రాక్షుడి సమీపములో నేలమీద పడ్డది. నెత్తురువాన కురిసింది. భూమి చలించింది. పిడుగుల ధ్వనితో గాలి ఎడా పెడా కొట్టింది. దిక్కులు అన్నీ చీకట్లు కమ్ముకొన్నవి. ఆ మహాఘోరము అయిన ఉత్పాతాలను చూచి ధూమ్రాక్షుడు మనస్సులో దిగులుపడ్డాడు. రాక్షసయోధులు అందరూ భయపడిపోయినారు. ఆ ధూమ్రాక్షుడిముందు నడుస్తూఉన్న రాక్షసయోధులు దిగులుతో భయముతో మూర్ఛపోయినారు. అయితే ఆ బలవంతుడు ఆ మహాభయంకరుడు ధూమ్రాక్షుడు యుద్ధోత్సాహమునుంచి ఆ దుశ్శకునాలను లెక్కచేయలేదు. ఆ రాక్షససైన్యముతో ముందుకు సాగిపోయినాడు. రామాజ్ఞలను శిరసావహించి ఎదురుగుండా మహాప్రవాహమువలె సాగివస్తూఉన్న వానరవాహినులను ధూమ్రాక్షుడు చూచినాడు.

౫౨

అట్లా తమమీదికి వస్తూఉన్న ఆ భయంకర పరాక్రముణ్ణి ధూమ్రాక్షుణ్ణి వానరులు అందరూ చూచినారు. యుద్ధకాంక్షతో సంతోషపడ్డారు. సింహనాదాలు చేసినారు. అప్పుడు వానరులకూ రాక్షసులకూ దొమ్మిగా పెద్దయుద్ధము జరిగింది.

శూలాలతోనూ ముద్గరాలతోనూ భయంకరము అయిన పరిఘాయుధాలతోనూ నానావర్ణాల శూలాలతోనూ రాక్షసులూ చెట్లతోనూ రాళ్ళతోనూ వానరులూ పోరాటము సాగించినారు. పరస్పరమూ ఘోరముగా కొట్టుకొన్నారు. ఆ ఘోరాకారులు రాక్షసులు వానరులను అనేకమందిని తెగవేసినారు. వానరులు చెట్లతో కొట్టి రాక్షసులను అనేకమందిని నేలమట్టము చేసివేసినారు. రాక్షసులు క్రుద్ధులు అయిపోయి కంకపక్షి రెక్కలతో సూటిగా పోయే తీక్ష్ణబాణాలను వదిలి వానరులను చంపివేసినారు. అంతే కాదు, వాండ్లు ఆ రాక్షసులు భయంకరము అయిన గదలతోనూ పట్టిసాలతోనూ కూటాలతోనూ ముద్గరాలతోనూ ఆ మహా బలవంతులను వానరులను అనేకమందిని కొట్టి చంపివేసినారు.

అందుకు వానరవీరులు భయపడలేదు. వారి యుద్ధోత్సాహము తగ్గలేదు. రోషము హెచ్చింది. రాక్షసులు అట్లా తమ యోధుల దేహాలను బాణాలతోనూ శూలాలతోనూ భేదిస్తూ ఉన్నప్పటికిన్నీ వానర యూథపతులు మహారోషముతో పోరాటము సాగించటానికి వివిధ వృక్షాలనూ వివిధశిలలనూ పెల్లగించుకొని వచ్చినారు. సింహనాదాలు చేస్తూనూ తమ తమ పేర్లు చెప్పుకొంటూనూ అంతకు అంతకూ భయంకరవేగముతో విజృంభించి ఆ భయంకరాకారులను రాక్షసులను అద్భుతముగా నలగకొట్టినారు. ఆ జయశీలురు వానరవీరులు రాక్షసులను కొంతమందిని చితుకకొట్టినారు. నెత్తురు తాగే ఆ రాక్షసులను కొంతమందిని నెత్తురు కక్కుకొని చచ్చేట్టు కొట్టినారు. కొంతమందిని రెండుపక్షాలుగా చీల్చివేసినారు. వృక్షాల దెబ్బలకు రాక్షసులు కుప్పలు కుప్పలుగా పడిపోయినారు. రాళ్ళ దెబ్బలకు నుగ్గు నుగ్గు అయిపోయినారు.

వానరులు రువ్విన రాళ్ళకు రథాల ధ్వజాలు విరిగిపోయి ఆ రథాలకు కట్టిన కంచరగాడిదలు చచ్చిపోయి ఆ రథాలు ముక్కలు ముక్కలు అయి నేలపాలు అయినవి. పర్వతాలు అంతంత ఏనుగులూ ఆ ఏనుగులమీది రాక్షసులూ గుర్రాలూ ఆ గుర్రాలమీది రాక్షసులూ చచ్చి పడిపోయి పెద్ద పెద్ద పర్వతాలు అంత కుప్పలు కుప్పలుగా ఆ యుద్ధభూమిలో కనిపించినవి. ఆ భయంకర పరాక్రములు వానరులు అమితవేగముతో పయికి ఎగిరి తీక్ష్ణముఅయిన తమ తమ గోళ్లతో రాక్షసుల ముఖాలు గీరి దేహాలను చీల్చివేసినారు. రాక్షసులు అనేకమంది తలవెంట్రుకలు విరపోసుకొని నెత్తురుతో తడిసిపోయి ముఖాలు వివర్ణము అయిపోయి నేలమీద పడి మూర్ఛపోయినారు. అప్పుడు కొందరు రాక్షసులు పరమ కుపితులు అయి భయంకరముగా గర్జిస్తూ వజ్రాయుధాలవంటి తమ తమ చేతులతో కొట్టి వానరులను తరిమివేసినారు. అట్లా తరుముకొంటూ అమితవేగముతో వచ్చి తమపయిన పడుతూఉన్న రాక్షసులను అప్పుడు వానరులు అంతకన్నా అమితవేగముతో ఎదురు తిరిగి పిడికిళ్ళతో పొడిచి కాళ్ళతో తన్ని గోళ్ళతోనూ కోరలతోనూ చీల్చివేసి వృక్షాలతో కొట్టి నానాహింసలూ పెట్టినారు. కనపడ్డ రాక్షసులను అందరినీ వానరులు అట్లా కొట్టుతూఉంటే ఆ బాధ భరించలేక రాక్షసులు అనేకమంది పరుగెత్తి పారిపోయినారు.

ఆ రాక్షసపుంగవుడు ధూమ్రాక్షుడు తన సైన్యములో చాలాభాగము పారిపోవడము చూచినాడు. కుపితుడు అయి పోయినాడు. యుద్ధోత్సాహముతో పోరాడుతూఉన్న వానర యోధులను హింసించడానికి బయలుదేరి వచ్చినాడు. అతనివెంట ఉన్న రాక్షసవీరులు కొంతమంది ఈటెలతో వానరులను పొడిచినారు. కొందరు ముద్గరాలతో కొట్టినారు. ఆ దెబ్బలకు అనేకమంది వానరులు నెత్తురుతో తడిసి నేలమీద పడిపోయినారు. అప్పుడు రాక్షసులు మరికొందరు ఇనుపగుదియలతోనూ భిండివాలాలతోనూ పట్టిసాలతోనూ వానరులను అనేకమందిని కొట్టినారు. ఆ ఆయుధాల దెబ్బలకు వానరుల దేహాలు ఛిన్నా భిన్నము అయిపోయి అవయవాలు స్వాధీనము తప్పిపోయి నేలకూలి ప్రాణాలు కోలుపోయినారు. ఆ రాక్షసుల శూలాల పోట్లకు కొందరు వానరులు

నెత్తురు కారుతూ నేలమీద పడిపోయినారు. ఆ రాక్షసుల పక్క వేట్లకు కొంతమంది వానరుల గుండెకాయలు పగిలిపోయినవి. త్రిశూలాలతో రాక్షసులు పొడుస్తూ ఉంటే కొంతమంది వానరుల పేగులు వెళ్ళు కొని వచ్చినవి. ఆ రాక్షసులు కొందరు వానరులను తరిమికొట్టి నారు. అట్లా వానరులకూ రాక్షసులకూ ఆ యుద్ధము పరమ భయంకరముగా జరిగింది.

అల్లెత్రాటి ధ్వని మనోహరము అయిన వీణానాదముగానూ ఆ యోధులకు దెబ్బలు తగిలినందువల్ల వచ్చిన ఎక్కిళ్లు తాళ ధ్వనులుగానూ ఆ యోధుల మూలుగులు మంద్రస్వరముతో పాడు తున్న సంగీతముగానూ గాంధర్వవిద్య యుద్ధమూపాన అప్పుడు ఆ యుద్ధభూమిలో విజృంభించింది.

అప్పుడు ఆ యుద్ధరంగములో ధూమ్రాక్షుడు చేతిలో ధనుస్సు పట్టుకొని పక పక నవ్వుతూ వానరులమీద బాణవర్షము కురిపించినాడు. ఆ బాణాల బాధకు నిలువలేక వానరులు దశదిశలా పరుగులు ఎత్త సాగినారు. అట్లా పారిపోతున్న తన వానర సైన్యాన్ని హనుమంతుడు అప్పుడు చూచినాడు. అతడికి ధూమ్రాక్షుడిమీద కోపము వచ్చింది. తన తండ్రి వాయుదేవుడితో సమానము అయిన ఆ పరాక్రమవంతుడి కన్నులు అప్పుడు రెండు ఇంతలు ఎర్రపడిపోయినవి. కొనలు తేలిన పెద్ద రాతిబండను చేతితో తీసుకొని ధూమ్రాక్షుడి రథముమీద విసరివేసినాడు. అట్లా అంతరిక్షములో వస్తూఉన్న ఆ పెద్ద రాతిబండను అప్పుడు ధూమ్రాక్షుడు చూచినాడు. కలవరపడిపోయినాడు. గదను తీసుకొని ఇట్టే ఆ రథముమీదనుంచి నేలమీదికి దూకినాడు. హనుమంతుడు విసరివేసిన ఆ పెద్ద రాతిబండ ఆ ధూమ్రాక్షుడి రథముమీద పడ్డది. ఆ రథధ్వజము విరిగిపోయింది. నొగతోనూ చక్రాలతోనూ ఆ రథము నుగ్గు నుగ్గు అయి నేల కూలింది. బోదెతోనూ కొమ్మల తోనూ ఉన్న ఒక మహావృక్షాన్ని అప్పుడు హనుమంతుడు తీసు కొని రాక్షసయోధులను కొట్టడము మొదలుపెట్టినాడు. ఆ చెట్టుతో కొట్టిన దెబ్బలకు రాక్షసయోధులు ఎంతోమంది శిరస్సులు పగిలి నెత్తురు వరదలు అయి పారింది. నెత్తురుతో ఒళ్లు

అంతా తడిసి నేలమీద పడిపోయినారు. అట్లా రాక్షససైన్యాన్ని పడగొట్టి బ్రతికిఉన్నవారిని పారతోలి హనుమంతుడు కొనలు లేచిన మరి ఒక పెద్ద రాతిబండను తీసుకొని అంతట ధూమ్రాక్షుడిమీదికి పరుగెత్తినాడు. అట్లా తనమీదికి వచ్చి పడపోతున్న హనుమంతుణ్ణి ఆ వీర్యవంతుడు ధూమ్రాక్షుడు చూచినాడు. గదను చేతితో పట్టుకొని సింహనాదము చేస్తూ ధూమ్రాక్షుడు అమిత వేగముతో హనుమంతుడిమీదికి పరుగెత్తినాడు. ఎన్నో మేకులతో ఉన్న ఆ గదను ధూమ్రాక్షుడు హనుమంతుడి తలమీదికి విసరి వేసినాడు. భయంకరము అయిన ఆ గద హనుమంతుడి నెత్తిమీద పడ్డది. వాయుపుత్రుడు ఆ మహాబలవంతుడు ఆ దెబ్బనుగురించి ఆలోచించను అయినా ఆలోచించకుండా చేతిలో ఉన్న శిలను ధూమ్రాక్షుడిమీద విసరివేసినాడు. అది పోయి ధూమ్రాక్షుడి నడి నెత్తిమీద పడ్డది. ఆ రాతిదెబ్బకు ధూమ్రాక్షుడి సర్వాంగాలు వివశము అయిపోయినవి. అంతట వాడు నేలకూలినాడు. అట్లా చచ్చి పడిపోయిన ధూమ్రాక్షుణ్ణి చావకుండా మిగిలిఉన్న రాక్షస యోధులు అందరూ చూచినారు. భయపడి లంకాపట్టణములోకి పరుగెత్తి పారిపోయినారు.

శత్రువులను చంపివేసి నెత్తురు వరదలు అయి పారేటట్టు చేసి అలసిపోయిన ఆ మహాపరాక్రమవంతుణ్ణి వానరులు అందరూ పూజించినారు. సంతోషించినారు.

౫౩

హనుమంతుడు ధూమ్రాక్షుణ్ణి చంపివేసినట్టు రాక్షసేశ్వరుడు రావణాసురుడు విన్నాడు. మహాకోపముతో విషసర్పమువలె నిట్టూర్పులు విడిచినాడు. శూరుడూ మహాబలవంతుడూ అయిన వజ్రదంష్ట్రుణ్ణి చూచి "ఓ వీరుడా, నీవు సైన్యాన్ని వెంటపెట్టుకొని పో. ఆ రాముణ్ణి ఆ సుగ్రీవుణ్ణి వారి వానరసైన్యాన్ని వధించు" అని చెప్పినాడు. అందుకు ఆ మాయావి వజ్రదంష్ట్రుడు "అట్లాగేను" అని రాక్షసవీరులను వెంటపెట్టుకొని రాక్షససైన్యముతో బయలు దేరినాడు.

ఏనుగులతోనూ గుర్రాలతోనూ కంచరగాడిదలతోనూ ఒంటెలతోనూ వివిధవర్ణాల పతాకాలూ ధ్వజాలూ ఎత్తిన రథాలతోనూ రాక్షససైన్యము యుద్ధసన్నద్ధము అయి వచ్చింది. వజ్రదంష్ట్రుడు చిత్ర విచిత్ర కాంతులతో ధగ ధగ లాడుతూ ఉన్న కిరీటమూ బాహుపురులూ కవచమూ ధరించి ధనుస్సు తీసుకొని యుద్ధసన్నద్ధుడు అయినాడు. తప్తకాంచనాలంకారాలతో ధగ ధగ లాడుతూ పతాకాలు ఎగురుతూ ఉన్న రథానికి ప్రదక్షిణము చేసినాడు. అంతట ఆ రథము ఎక్కినాడు. ఆ రాక్షస సేనానాయకుడి వెంట పదాతులు లాఠీలతోనూ ముసలాలతోనూ భిందివాలాలతోనూ పాశాలతోనూ పట్టిసాలతోనూ ఖడ్గాలతోనూ తోమరాలతోనూ రంగురంగుల శూలాలతోనూ శక్తులతోనూ చక్రాయుధాలతోనూ గదలతోనూ పదును అయిన గండ్రగొడ్డళ్ళతోనూ ఇంకా వివిధాయుధాలతోనూ నడిచినారు. గజసాదులు తోమరాలూ అంకుశాలూ తీసుకొని యుద్ధసన్నద్ధులు అయి మదపు టేనుగులు ఎక్కినారు. యుద్ధభయము లేకుండా తిరిగే ఆ మదపు టేనుగులు అప్పుడు కదలిపోతున్న పర్వతాలవలె కనిపించినవి. భయంకరము అయిన రాక్షససైన్యము యుద్ధానికి అట్లా బయలుదేరి పోతూఉంటే వర్షాకాలములో మెరుపులతో ఉరుములతో పరుగులెత్తే మేఘసమూహాలవలె కనిపించింది. ఆ రాక్షససైన్యము ఆయుధాల ఠకఠకలతోనూ దిక్కులు పిక్కటిల్లిపోయే సింహనాదాలతోనూ బయలుదేరి అంగదుడు ముట్టడించిన లంకాపట్టణ దక్షిణ ద్వారమువైపు పోయింది.

ఆ రాక్షససైన్యము అట్లా పోతూఉండగా అశుభాలు కనిపించినవి. మేఘాలు లేని నిర్మలాకాశమునుంచి కన్నులు చెదిరిపోయే కొరవులు కిందపడ్డవి. నక్కలు అగ్నిజ్వాలలు కక్కుతూ భయంకరముగా అరిచినవి. భయంకరము అయిన మృగాలు రాక్షసుల మరణాన్ని సూచిస్తూ అరిచినవి. అప్పుడు రాక్షస యోధులు భయములో ఉక్కిరి బిక్కిరి అయి తడబడిపోయినారు.

ఆ మహాపరాక్రమవంతుడు ఆ మహాబలవంతుడు వజ్రదంష్ట్రుడు ఆ ఉత్పాతాలను అన్నిటినీ చూచినాడు. వాటిని అతడు లెక్క

చేయలేదు. ధైర్యము చెడగొట్టుకోకుండా రణోత్సాహముతో ఆ రాక్షససైన్యాన్ని వెంటపెట్టుకొని పోయినాడు.

జయముతో తేజరిల్లుతూ ఉన్న వానరవీరులు అందరూ అప్పుడు ఆ వస్తూఉన్న రాక్షససైన్యాన్ని చూచినారు. దశదిశలూ మారుమోగిపోయేట్లు సింహనాదాలు చేసినారు. భయంకరాకారులూ భయంకరులూ అయిన ఆ వానరులకూ రాక్షసులకూ అప్పుడు దొమ్మిగా పోరాటము ఆరంభము అయింది. పరస్పరమూ మహోత్సాహముతో యుద్ధము చేసినారు. అటు రాక్షసులూ ఇటు వానరులూ దేహాలు తెగిపోయి మెడలువిరిగిపోయి సర్వాంగాలూ నెత్తురుతో తడిసిపోయి నేల కూలినారు. పోరాటములో వెనుతీయని రాక్షసయోధులూ వానరయోధులూ నానావిధాయుధాలతోనూ పరమభయంకరముగా యుద్ధముచేసినారు. వానరులు అప్పుడు చెట్లతో కొట్టుతూ ఉన్న ధ్వనులూ రాళ్ళు రువ్వుతూ ఉన్న ధ్వనులూ రాక్షసుల వివిధాయుధాల ధ్వనులూ రథచక్రాల ధ్వనులూ ధనుష్టంకార ధ్వనులూ భేరీమృదంగాదుల ధ్వనులూ శంఖాలు పూరించిన మహాధ్వనులూ పరమభయంకరముగానూ దొమ్మిగానూ వినిపించినవి. అంతట అటు రాక్షసులూ ఇటు వానరులూ ఆయుధాలు వదిలిపెట్టి బాహువులతో పోరాడటము మొదలుపెట్టినారు. వానరులు రాక్షసులను అరచేతులతో చరిచినారు. పిడికిళ్ళతో పొడిచినారు. కాళ్లతో తన్నినారు. రాళ్ళు రువ్వినారు. చెట్లతో కొట్టినారు. ఈ విధముగా వానరయోధులు రాక్షసయోధులను చాలామందిని చంపివేసినారు.

ఆ యుద్ధములో వజ్రదంష్ట్రుడు తీవ్రబాణాలు వదిలి వానరులను బాధపెట్టుతూ లోకసంహారకాలములో పాశహస్తుడు అయిన యముడివలె విహరించినాడు. ఆయుధవిద్యలో ఆరితేరిన రాక్షసులు కోపమువచ్చి వివిధాయుధాలూ తీసుకొని ఒళ్ళు ఎరగకుండా పోరాడి ఒక కొంత వానరసైన్యాన్ని సంహారము చేసివేసినారు. రాక్షసులు అట్లా వానరులను వధించివేయడము అంగదుడు చూచినాడు. ఆ వీర్యవంతుడు క్రోధతామ్రాక్షుడు అయినాడు. ప్రళయకాలాగ్నిహోత్రుడివలె రేగినాడు. స్వల్పమృగాలను సింహమువలె అంగదుడు రాక్షసులను అనేకమందిని ఒక చెట్టుతో కొట్టి చంపివేసినాడు.

పరాక్రమములో దేవేంద్రుడితో సరిసమానము అయిన ఆ అంగదుడు అప్పుడు పరమభయంకరముగా పోరాడినాడు. ఎట్ట ఎదుట ఉన్న భయంకరపరాక్రములను రాక్షసులను అంగదుడు చెట్టులో కొట్టినాడు. గొడ్డలి వేటుకు చెట్లవలె ఆ అంగదుడి దెబ్బలకు ఆ రాక్షసులు నేల కూలినారు. విరిగిపోయిన రథాలతోనూ చచ్చి పడిపోయిన ఏనుగులతోనూ ముక్కలు అయి పడిపోయిన ధ్వజాలతోనూ రాక్షసుల రక్తధారలతోనూ వానరుల రక్తధారలతోనూ అప్పుడు ఆ యుద్ధభూమి పరమభయంకరముగా కనిపించింది.

ఆ రాక్షసులు ధరించిన హారాలతోనూ బాహుపురులతోనూ వివిధాభరణాలతోనూ వారు కట్టుకొన్న ఆ యా రంగురంగుల గుడ్డలతోనూ తళతళలాడే వివిధాయుధాలతోనూ నక్షత్రాలతో తేజరిల్లే శరత్కాల రాత్రివలె ఆ యుద్ధభూమి శోభించింది.

ఆ అంగదుడి వేగానికి రాక్షసమహాసైన్యాలు అప్పుడు గాలికి మేఘాలవలె పరుగులెత్తినవి.

౨౪

అంగదుడు జయించడమూ తన రాక్షససైన్యము కొంత హతము అయిపోవడమూ కొంత పలాయనము అయిపోవడమూ ఆ మహాబలవంతుడు వజ్రదంష్ట్రుడు చూచి కోపముతో రెచ్చిపోయినాడు. దేవేంద్రుడి వజ్రాయుధమువలె భయంకరధ్వని అయ్యేట్టుగా తన ధనుస్సును సారిస్తూ వానరసైన్యాలమీద బాణవర్షము కురిపించినాడు. వజ్రదంష్ట్రుడు ఒక్కడే కాకుండా అప్పుడు ఆ యుద్ధములో శూరులూ ముఖ్యులూ అయిన రాక్షసులు రథాలమీద వచ్చి నానా విధాయుధాలతోనూ అద్భుతముగా పోరాటము సాగించినారు. వానరులలో శూరులూ శ్రేష్ఠులూ అయినవారు పెద్ద పెద్ద రాళ్ళను తీసుకొని అన్నివైపులనుంచీ రాక్షసులను కొట్టినారు. ఆ మహా యుద్ధములో రాక్షసులు వానరులను వివిధాయుధాలతోనూ కొట్టినారు. వానరులు రాక్షసులను మహావృక్షాలతోనూ పెద్ద పెద్ద రాళ్ళతోనూ పర్వతాలతోనూ కొట్టినారు. యుద్ధరంగములోనుంచి వెనకకు మళ్ళని ఆ వానరవీరసమూహాలకున్నూ రాక్షసవీర సమూహాలకున్నూ అప్పుడు ఘోరము అయిన యుద్ధము జరిగింది.

తలలు తెగిపోయి చేతులూ కాళ్ళూ విరిగిపోయి ఆయుధాల దెబ్బలు ఒంటినిండా తగిలి నెత్తురుతో తడిసిపోయి వానరయోధులూ రాక్షసయోధులూ నేల కూలినారు. ఆ యోధుల కళేబరాల కోసము అప్పుడు రాబందులూ గద్దలూ కాకులూ నక్కలూ గుంపులు గుంపులుగా వచ్చినవి. ఆ శవాలను ఆ పక్షులు అన్నీ ముసురుకొన్నవి.

ఆ వజ్రదంష్ట్రుడు చూస్తూఉండగానే రాక్షససైన్యాన్ని వానరసైన్యము వధించివేసింది. వానరయోధులు కొట్టి చంపివేస్తూ ఉంటే రాక్షసయోధులు భయపడి పారిపోవడముచూచి వజ్రదంష్ట్రుడు రోషతామ్రాక్షుడు అయి చేతిలో ధనుస్సు తీసుకొని భయంకరముగా మోగిస్తూ వానరసైన్యముమీదికి పోయినాడు. కంకపక్షి రెక్కలతో సూటిగా పోయే బాణాలను వదిలి వానరులను భేదించినాడు. ఒక్కొక్క బాణానికి అయిదుగురిని ఆరుగురిని ఏడుగురిని ఎనిమిది మందిని తొమ్మిదిమందిని వానరులను ఒక్కసారిగా భేదించినాడు. ఆ పరమ పరాక్రమవంతుడు వజ్రదంష్ట్రుడు ఆవిధముగా చిత్ర విచిత్రముగా బాణాలు వదిలి వానరులను చంపివేయడము మొదలు పెట్టినాడు.

అప్పుడు వానరయోధులు అందరూ భయపడిపోయినారు. దేవతలు అందరూ బ్రహ్మదేవుడిచుట్టూ మూగేటట్టు అప్పుడు ఆ వానరయోధులు అంగదుడిచుట్టూ మూగినారు. వానరసైన్య సమూహాలు భగ్నము అయిపోవడము చూచి అంగదుడు తనను ఎదురుచూస్తూఉన్న వజ్రదంష్ట్రుడికి ఎదురుగుండా పోయినాడు. అంగదుడూ వజ్రదంష్ట్రుడూ కలుసుకొన్నారు. ఉభయులూ పరమ క్రుద్ధులు అయిపోయినారు. సింహమూ మదపుటేనుగూవలె సంచరించినారు. ఆ మహాబలవంతుడు వజ్రదంష్ట్రుడు మదపుటేనుగు మీద తోమరాలవలె అంగదుడి ఆయువుపట్లలో ఒక వెయ్యి బాణాలు వదిలినాడు.

ఆ మహాబలవంతుడు ఆ భయంకర పరాక్రమవంతుడు అంగదుడి సర్వాంగాలలోనూ బాణాలు గుచ్చుకొన్నవి. అతడు నెత్తురుతో తడిసిపోయినాడు. అప్పుడు అంగదుడు ఒక మహావృక్షాన్ని

పెళ్లగించి వజ్రదంష్ట్రుడిమీద విసరివేసినాడు. అట్లావచ్చి తనమీద పడిపోతున్న ఆ మహావృక్షాన్ని వజ్రదంష్ట్రుడు చూచినాడు. కలవర పడిపోకుండా అనేకబాణాలు వదలి ఆ మహావృక్షాన్ని ఖండించి వేసినాడు. ఆ మహావృక్షము ముక్కలు ముక్కలు అయి నేలమీద పడిపోయింది. అంగదుడు వజ్రదంష్ట్రుడి పరాక్రమాన్ని గమనించి నాడు. ఒక వెడల్పాటి పర్వతశిఖరాన్ని తీసుకొని ఆ వజ్రదంష్ట్రుడి మీద రువ్వి సింహనాదము చేసినాడు. అట్లావచ్చి తనమీద పడ బోతున్న ఆ పర్వతశిఖరాన్ని ఆ వీర్యవంతుడు వజ్రదంష్ట్రుడు చూచి నాడు. తత్ క్షణమే ఒకగద తీసుకొని నిర్భయముగా నేలమీదికి దూకినాడు. అంగదుడు రువ్విన పర్వతశిఖరము వజ్రదంష్ట్రుడి రథము మీద పడ్డది. ఆ రథమూ దానిచక్రాలూ దానినోగా గుర్రాలూ నుగ్గునుగ్గు అయిపోయినవి.

ఈ లోపల అంగదుడు చెట్లతో ఉన్న ఒక పర్వతాన్ని పెళ్ల గించి వజ్రదంష్ట్రుడి తలమీద వేసినాడు. అతడు అంతట నెత్తురు కక్కుకొంటూ నేలమీద పడి మూర్ఛపోయినాడు. గదను కౌగలించుకొని కొంచెముసేపు నిట్టూర్పులు విడిచి ఒళ్ళు తెలియ కుండా పోయిన ఆ నిశాచరుడు మూర్ఛ తేరుకొన్నాడు. కుపితుడు అయిపోయినాడు. ఎట్టఎదట నిలుచునిఉన్న అంగదుణ్ణి చూచినాడు. ఇట్టే తనగదతో అంగదుడి ఎదురురొమ్ములమీద కొట్టినాడు. కాని తృప్తితీకపోయింది. ఆ గదను పారవేసి ముష్టియుద్ధానికి తలపడ్డాడు. అప్పుడు ఆ రాక్షసవీరుడూ ఈ వానరవీరుడూ ఒకరిని ఒకరు బాగా కొట్టుకొన్నారు. ఉభయులూ నెత్తురు కక్కుతూ ఆయాసపడుతూ బుధాంగారకులవలె పోరాడినారు.

అప్పుడు ఆ పరమ పరాక్రమవంతుడు కపికుంజరుడు అంగదుడు పూలతోనూ పండ్లతోనూ ఉన్న ఒక చెట్టును పెళ్లగించి పోరా టానికి సంసిద్ధము అయినాడు. మరిఒక చెట్టును పెళ్లగించి వజ్రదంష్ట్రుడున్నూ పోరాటానికి నిలుచున్నాడు. ఎద్దుచర్మము డాలువాలునూ అందము అయిన గజ్జలతో పొడుగాటి ఒరలో ఉన్న ఖడ్గాన్ని అంగదుడు తీసుకొన్నాడు. ఆ వానరుడూ ఆ రాక్షసుడూ ఒకరిని ఒకరు జయించడానికి నానావిధాలా పోరాడినారు. గట్టిగా

కొట్టుకొన్నారు. ఉభయులకూ ఒంటినిండా గాయాలు అయినవి. నెత్తురుతో తడిసిపోయి ఉభయులూ విరగపూసిన మోదుగు చెట్లవలె శోభించినారు. ఉభయులూ అలసిపోయినారు. మోకాళ్లమీద నిలుచున్నారు. కర్రదెబ్బతిన్న తాచుపామువలె రెప్పపాటులో కన్నులలోనుంచి నిప్పులురాలుస్తూ అంగదుడు లేచినాడు. చక్కగా సానపెట్టిఉన్న తెల్లటి ఖడ్గాన్ని ఇట్టే ఒరలోనుంచి దూసి వజ్రదంష్ట్రుడి కంఠాన్ని తెగవేసినాడు. ఒళ్లు అంతా నెత్తురుతో తడిసిపోయి గుడ్లుతిప్పుతూ వజ్రదంష్ట్రుడి తల ఊడి నేలమీద పడి పోయింది. ఆ తలతోపాటు వజ్రదంష్ట్రుడి మొండెమున్నూ ఆ నేలమీద పడిపోయింది.

అట్లా అయిపోయిన వజ్రదంష్ట్రుణ్ణి రాక్షసయోధులు చూచినారు. భయపడిపోయినారు. విషణ్ణవదనులు అయినారు. సిగ్గుతో తలలు వంచుకొన్నారు. గర్వము ఉడిగిపోయి ఏమి చేయడానికీ తోచక ఆ రాక్షసయోధులు అందరూ లంకాపట్టణములోకి పరుగెత్తి పారిపోయినారు.

ఆ మహాబలవంతుడు వాలిపుత్రుడు అంగదుడు వజ్రధరుడు అయిన దేవేంద్రుడి ప్రభావముతో వజ్రదంష్ట్రుణ్ణి వధించి వానర సైన్యముమధ్యను వానరుల పూజలు అందుకొంటూ దేవతలమధ్యను దేవేంద్రుడివలె తేజరిల్లినాడు.

౨౨

అంగదుడు వజ్రదంష్ట్రుణ్ణి చంపివేసినాడు అని రావణాసురుడు విన్నాడు. చేతులు జోడించి తన పక్కను నిలుచునిఉన్న సేనాధ్యక్షుణ్ణి చూచి "ఓ సేనాధ్యక్షుడా, అకంపనుడు సమస్తాస్త్ర కోవిదుడు. యుద్ధప్రియుడు. యుద్ధములో ప్రసిద్ధికెక్కినాడు. ఎప్పుడూ నా మేలుకోరుతూ ఉంటాడు. తన సైన్యాన్ని కాపాడుకొంటూ శత్రువులను వధించి వేయడములో అకంపనుడు అతి సమర్థుడు. ఎదిరించ నలవికాని భయంకర పరాక్రములను వెంట పెట్టుకొని అకంపనుడు ఇప్పుడు యుద్ధానికి బయలుదేరి పోవలెను."

“ఓ అకంపనుడా, నీవు పరంతపుడవు. నీవు ఆ మహా బలవంతులను రామలక్ష్మణులనూ సుగ్రీవుణ్ణీ జయించవలెను. తక్కిన వానరులను అందరినీ సంహారము చేసివేయవలెను” అని చెప్పినాడు.

రావణాజ్ఞను శిరసావహించి ఆ మహాబలవంతుడు ఆ అలఘు పరాక్రముడు రాక్షససేనాధ్యక్షుడు అప్పటికి అప్పుడు రాక్షస సైన్యాన్ని యుద్ధానికి సిద్ధము చేసినాడు. ఆ సేనాధ్యక్షుడు పురికొల్పినందువల్ల భయంకరాకారులూ భయంకరనేత్రులూ అయిన రాక్షసముఖ్యులు నానావిధాయుధాలతోనూ యుద్ధసన్నద్ధులు అయి వచ్చినారు. మేఘస్వనమువంటి మహాధ్వనులు చెలరేగుతూ ఉండగా మేఘవర్ణములో తప్తకాంచనకుండలాల ధగ ధగలతో ఆ మహాకాయుడు అకంపనుడు విశాలము అయిన రథము ఎక్కినాడు. ఆ రథమువెంట రాక్షససైన్యము బయలుదేరింది.

మహాయుద్ధములో అకంపనుడు అకంపముగా పోరాడుతాడు. దేవతలు సహితము అతడు కంపించేట్టు పోరాడలేక పోయినారు. అందువల్లనే అతడు అకంపనుడు అని ప్రసిద్ధికెక్కినాడు. ఆ రథము మీద అప్పుడు అతడు ఆదిత్యుడివలె తేజరిల్లినాడు.

అకంపనుడు యుద్ధోత్సాహముతో శత్రువులమీదికి అమిత వేగముగా పోతూఉంటే అతని రథాన్ని లాగుకొనిపోతూఉన్న గుర్రాలు హఠాత్తుగా ఆగిపోయినవి. నిర్హేతుకముగా నిరుత్సాహముతో నిలుచుండిపోయినవి. అప్పుడు అకంపనుడి ఎడమకన్ను అదిరింది. అతడు మాట్లాడపోతే మాటలు తడపడి పోయినవి. ముఖము వెలవెల పోయింది. అప్పుడు గాలి ఎడా పెడా కొట్టింది. ఎండకాస్తూ ఉన్నప్పటికిన్నీ ఇట్టే ఆకాశాన మబ్బులు కమ్ముకొన్నవి. పక్షులూ మృగాలూ భయంకరముగా కర్ణకఠోరముగా అరిచినవి. సింహము మూపులవంటి ఎగువభుజాలతోనూ పెద్దపులివంటి పరాక్రమముతోనూ తేజరిల్లే ఆ అకంపనుడు ఆ ఉత్పాతాలను గురించి ఏమీ ఆలోచించకుండా యుద్ధభూమికి సాగిపోయినాడు.

ఆ అకంపనుడు యుద్ధము చేయడానికి అట్లా రాక్షస సైన్యాన్ని వెంటపెట్టుకొని వస్తూ ఉంటే సముద్రము కంపించి

పోయేట్టుగా మహాధ్వని అయింది. ఆ మహాధ్వనికి వానరసైన్యము భయపడిపోయింది. అయితే వెంటనే వానరయోధులు అందరూ వృక్షాలూ శిలలూ ఆయుధాలుగా పట్టుకొని పోరాటానికి నిలుచున్నారు. రాముడికోసము వానరులూ రావణాసురుడికోసము రాక్షసులూ తమ ప్రాణాలను వదిలిపెట్టడానికి నిశ్చయించుకొన్నారు. మహాభయంకరముగా యుద్ధము సాగింది. అటు రాక్షసులూ ఇటు వానరులూ అమితబలవంతులు ఆ యుద్ధములో పాల్గొన్నారు. ఉభయులయోధులూ పర్వతాకారులు. శూరులు. రాక్షసులను అందరినీ సంహారముచేసి వేయవలెను అని వానరులూ వానరులను అందరినీ సంహారము చేసివేయవలెను అని రాక్షసులూ పోరాడినారు. ఆ అమితబలవంతులు ఆ పోరాటములో క్రోధావేశములో అన్యోన్యమూ సింహనాదాలు చేస్తూ ఉంటే ఆ మహాధ్వనికి దిక్కులు పిక్కటిల్లిపోయినవి. ఆ వానరుల పాదాల తొక్కిడికీ ఆ రాక్షసుల పాదాల తొక్కిడికీ అక్కడి దుమ్ము ఎర్రటి రంగుతో భయంకరముగా పయికి లేగింది. అట్లా లేగిన దుమ్ము నుంచి దిక్కులు కనపడకుండా పోయినవి. పెదచల్లిన పట్టువలె ఆ దుమ్ము పయికిపోయినకొద్దీ తెల్లపడిపోయింది. ఆ దుమ్ము అట్లా అంతటా వ్యాపించడమునుంచి ఏ వస్తువూ కంటికి అగుపించకుండా పోయింది. రథికులుకానీ రథికుల కవచాలుకానీ గుర్రాలుకానీ చివరకు రథాలుకానీ కనపడలేదు. దొమ్మిగా సాగుతూఉన్న ఆ యుద్ధములో వానరులూ రాక్షసులూ అరుస్తూ ఉన్న అరుపులూ పరుగులెత్తుతూ ఉన్న చప్పుళ్లూ తప్ప వారి వారి రూపాలు కనిపించలేదు. దుమ్మునుంచి కనపడకుండాపోయిన ఆ చీకటిలో కోపములో చెలరేగిన వానరులు తాము ఎవరిని చంపివేస్తున్నదీ తెలియకుండా వానరులనే చంపివేసినారు. అదేవిధముగా రాక్షసులు రాక్షసులనే చంపివేసినారు. అట్లా ఆ చీకటిలో ఒకరిని ఒకరు తెలుసుకోకుండా రాక్షసులూ వానరులూ కొట్టుకొని చస్తూ ఉంటే నెత్తురు వరదలు అయి పారింది. ఆ యుద్ధభూమి అంతా నెత్తురులో బురద బురద అయిపోయింది. అంతటితో దుమ్మురేగడము ఆగిపోయింది. ఆ ప్రదేశము అంతా పీనుగులమయముగా కనిపించింది. అంతట వానరులు పరాక్రమించి రాళ్ళతోనూ శిలలతోనూ రాక్షసుల

పరాక్రమించి శక్తులతోనూ ప్రాసాలతోనూ గదలతోనూ పరిఘుల తోనూ తోమరాలతోనూ పోరాటము సాగించినారు. అప్పుడు పర్వతాకారులూ భయంకరకర్ములూ అయిన వానరులు తమ బాహువులతో రాక్షసులను కొట్టి చంపివేయడము మొదలుపెట్టినారు. అందుకు రాక్షసులు కోపముతో చెలరేగి ఈటెలతోనూ చిల్లకోలల తోనూ ఇంకా పరమదారుణము అయిన ఆయుధాలతోనూ వానరులను కొట్టి చంపివేయ సాగినారు.

అప్పుడు ఆ రాక్షససేనానాయకుడు అకంపనుడు భయంకర పరాక్రములు అయిన తన రాక్షసయోధులను అందరినీ పురికొల్పి నాడు. అట్లా మహోత్సాహముతో వచ్చిన ఆ రాక్షసయోధులను వానరులు ఎదిరించి తమ పరాక్రమముతో వాండ్ల చేతులలో ఉన్న ఆయుధాలను ఊడలాగుకొని మహావృక్షాలతోనూ గొప్ప గొప్ప శిలలతోనూ కొట్టి వాండ్లను చంపివేసినారు.

ఆ సమయాన వానరవీరులు కుముదుడూ మైందుడూ ద్వివిదుడూ చెలరేగి మహావేగముతో పోరాటము సాగించినారు. ఆ వానరవీరులు విలాసముగా మహావృక్షాలు తీసుకొని కొట్టుతూ ఉంటే రాక్షసయోధులు చచ్చి కుప్పలు కుప్పలుగా నేల కూలినారు.

౫౬

ఆ యుద్ధములో రాక్షసయోధులను వానరవీరులు అట్లా చంపివేయడము అకంపనుడు చూచినాడు. క్రోధావేశపరవశుడు అయిపోయి తన గొప్పధనుస్సును సారిస్తూ సారథితో "ఓ సారథీ, వానరులు ఎంతోమంది రాక్షసయోధులను చంపివేసినారు. వాండ్లు ఆ వానరులు ఎక్కువమంది ఎక్కడ ఉంటున్నారో చూడు. ఈ రథాన్ని అక్కడికి తోలుకొనిపో.

"ఇదుగో ఆ భయంకరాకారులు వానరులు చెట్లనూ పర్వత శిలలనూ తీసుకొని మనకు ఎదురుగుండా రాక్షసులతో పోరాడు తున్నారు. పోరాటములో పొగరెక్కిన ఆ వానరులను అందరినీ సంహారము చేసివేస్తాను. వాండ్లు మన రాక్షససైన్యాన్ని అంతా మథించివేసినారు" అని చెప్పినాడు.

అకంపనుడు చెప్పినట్టుగా అమితవేగముతో ఆ రథాన్ని సారథి తోలినాడు. అంతట అకంపనుడు వానరులమీద బాణవర్షము కురిపించడము మొదలుపెట్టినాడు. ఆ బాణాల బాధకు వానరులు నిలువలేకపోయినారు. భయపడిపోయినారు. పోరాటము మానుకొని పరుగులెత్త సాగినారు. అకంపనుడి బాణాలకు మృత్యువశము అయిపోతూఉన్న తన జ్ఞాతులను వానరులను అప్పుడు హనుమంతుడు చూచినాడు. ఆ మహాబలవంతుడు అంతట అక్కడికి బయలుదేరినాడు. ఆ మహాకపి తమకు తోడుపడడానికి రావడము వానరయూథపతులు చూచినారు. పరమసంతుష్టులు అయినారు. ఆ మహాబలవంతుడి అండను అప్పుడు ఆ వానరవీరులు అందరూ నిలిచినారు.

ఆ హనుమంతుడిమీద అప్పుడు అకంపనుడు దేవేంద్రుడు కురిపించే సంతతవర్షధారలవలె బాణాలవర్షము కురిపించినాడు. ఆ మహాబలవంతుడు హనుమంతుడు అకంపనుణ్ణి చంపివేయడానికి సంకల్పించుకొన్నాడు. అట్లా తనమీద వచ్చిపడుతూన్న కరుకు బాణాలను ఏ మాత్రమూ లక్ష్యము చేయకుండా అకంపనుడిమీదికి పరుగెత్తినాడు. అప్పుడు ఆ మారుతాత్మజుడి పాదఘాతానికి భూమి కంపించింది. అతడు సింహనాదము చేస్తూ మహాతేజముతో మిట్టమధ్యాహ్న సూర్యుడివలె దుర్ధర్షుడు అయినాడు. అట్లా అకంపనుడిమీదికి పరుగెత్తుతూ ఉండగా తనచేతిలో ఆయుధము ఏదీలేదు అని తెలుసుకొన్నాడు. ఇట్టే ఒక పర్వతాన్ని పెళ్ళగించినాడు. దానిని చేతిలో పట్టుకొని గిరగిరా తిప్పి చూచినాడు. పూర్వము వజ్రధరుడు నముచిని వజ్రాయుధముతో హతమార్చినట్టు ఆ మహాపరాక్రమవంతుడు హనుమంతుడు ఆ పర్వతముతో అకంపనుణ్ణి చంపివేయవలెను అనుకొన్నాడు. గిరగిరా తిప్పుతూ ఉన్న ఆ పర్వతాన్ని అకంపనుడిమీదికి రువ్వినాడు. అకంపనుడు అది చూచినాడు. ఆ పర్వతాన్ని పగులగొట్టడానికి అర్ధచంద్రాకార బాణాలను వదిలినాడు. ఆ పర్వతము ఆ అకంపనుడి బాణాలకు అంతరిక్ష్యములోనే ముక్కలు ముక్కలు అయిపోవడము చూచినాడు. కోపపరవశుడు అయిపోయినాడు. అక్కడ ఎంతో ఎత్తుగా కొండమాదిరిగా ఉన్న ఇనుమద్దిచెట్టును ఇట్టే పెళ్ళగించినాడు.

ఆ మహాద్యుతిమంతుడు పరమసంతోషముతో పకపక నవ్వుతూ పెద్ద బోదెతో ఉన్న ఆ చెట్టును తన చేతితో గిరగిర తిప్పిచూచినాడు. ఆ ధీమంతుడు హనుమంతుడు ఆ చెట్టుతో అకంపనుడిమీదికి పరుగెత్తుతూ దారిలో అడ్డముఅయిన ఏనుగులనూ ఆ ఏనుగులమీద ఉన్న రాక్షసులనూ రథాలనూ ఆ రథాలమీద ఉన్న రథికులనూ పదాతులనూ నలగకొట్టినాడు. పరమవేగముతో పరుగెత్తుతూ ఉన్న ఆ హనుమంతుడి తొడల తాకిడికి చెట్లు విరిగి పడిపోయినవి. పాదాల తొక్కుడికి నేల బీటలు వారింది. కుపితుడుఅయిన యముడి వలె ప్రాణాలు తీసివేస్తూ ఉన్న హనుమంతుడిని చూచి రాక్షస యోధులు చావగా మిగిలినవారు పరుగులెత్తినారు.

క్రుద్ధుడుఅయి అట్లా రాక్షసులను అందరినీ చంపివేస్తూ ఉన్న హనుమంతుణ్ణి చూచి అకంపనుడు సింహనాదము చేసినాడు. దేహాన్ని చీల్చివేసే పద్నాలుగు నిశితబాణాలను ఆ వీర్యవంతుడి మీద వదిలినాడు. అట్లా అనేకసార్లు తనమీద బాణవర్షము కురిసినప్పటికీ హనుమంతుడు వృక్షాలతో ఉన్న పర్వతమువలె అచంచలముగా నిలుచున్నాడు. ఆ బాణాలు తగిలి ఆ మహా కాయుడు ఆ మహాపరాక్రమవంతుడు ఆ ధైర్యవంతుడు హనుమంతుడు పూచిన అశోకవృక్షమువలెనూ పొగలు లేకుండా మండుతూ ఉన్న అగ్నిహోత్రమువలెనూ కనిపించినాడు. అంతట మరి ఒక చెట్టును పెల్లగించినాడు. ఇట్టే అకంపనుడి శిరసుమీద కొట్టినాడు. ఆ చెట్టు దెబ్బకు అకంపనుడు నేల కూలినాడు.

అట్లా చచ్చి నేలమీద పడిపోయిన అకంపనుణ్ణి రాక్షస యోధులు అందరూ చూచినారు. భూకంపసమయాన చెట్లవలె గడగడ వణికిపోయినారు. దుఃఖపడిపోయినారు. భయపడిపోయినారు. వానరులు తరుముకొంటూ వస్తూఉంటే తమ తమ చేతులలో ఉన్న ఆయుధాలను పారవేసి ఒళ్ళుఅంతా చెమటలు కారుతూ నిట్టూర్పులు విడుస్తూ తలలు విరపోసుకొని మూఢులు అయిపోయి వాండ్లలో వాండ్లనే కొట్టుతూ భయమునుంచి మాటి మాటికీ వెనకకుతిరిగి చూస్తూ లంకాపట్టణానికి పరుగెత్తి పారిపోయినారు.

రాక్షసులు అందరూ అట్లా పారిపోయిన తరువాత ఆ మహా బలవంతులు వానరులు అందరూ హనుమంతుణ్ణి పూజించినారు.

ఆ సత్యసంపన్నుడు హనుమంతుడు సంతోషముతో ఆ వానర యోధులను అందరినీ మెచ్చుకొన్నాడు. ఆ వానరయోధులు హనుమంతుణ్ణి యథాయోగ్యముగా బదులు పూజించినారు. జయముతో తేజరిల్లుతూ ఆ వానరవీరులు తమ బలముకొద్దీ సింహ నాదాలు చేసినారు. ఆ సింహనాదాలకు లంకాపట్టణములో మహా బలవంతులు అయిన రాక్షసులు అందరూ అదిరిపోయినారు.

మహాభయంకరుడూ అమితబలవంతుడూ శత్రునాశకుడూ అయిన కైటభాసురుణ్ణి సంహారము చేసివేసిన మహావిష్ణువవలె ఆ మహాకపి ఆ మారుతాత్మజుడు హనుమంతుడు ఆ అకంపనుణ్ని వధించి వానరసేనాసమ్ముఖాన వీరలక్ష్మితో విరాజిల్లినాడు.

అప్పుడు ఆహనుమంతుణ్ణి దేవగణాలు పూజించినవి. రామలక్ష్మ ణులూ సుగ్రీవుడూ తక్కిన వానరవీరులూ మహాబలవంతుడు అయిన విభీషణుడూ హనుమంతుణ్ణి ఎంతగానో గౌరవించినారు. కొనియాడినారు.

౩౮

అకంపనుణ్ణి హనుమంతుడు చంపివేసినాడు అనే వర్తమానం రావణాసురుడు విన్నాడు. ఆ రాక్షసేశ్వరుడిముఖము అప్పుడు చిన్న పోయింది. మంత్రులవంక చూచినాడు. ఒక ముహూర్తముసేపు మనసులో ఆలోచించినాడు. అంతట ఆ మంత్రులు అందరితోనూ సంప్రతించినాడు. అప్పటికి ఇంకా మధ్యాహ్నము కాలేదు. ఆ పూర్వాహ్ణములోనే లంకాపట్టణము అంతా తిరిగిచూడటానికి బయలుదేరినాడు. ఆ లంకాపట్టణాన్ని కాపాడుతూ ఉన్న రాక్షస సమూహాలనూ వ్యూహాలుగా ఉన్న సేనాసమూహాలనూ పతా కాలు ఎగురుతూ ఉన్న ధ్వజాలపంక్తులనూ చూచినాడు. వాన రులు అట్లా తన లంకాపట్టణాన్ని ముట్టడించినందుకు కుపితుడు అయిపోయినాడు.

అంతట రావణాసురుడు తన సభాభవనానికి పోయినాడు. యుద్ధకోవిదుడు అయిన ప్రహస్తుణ్ణి చూచి "ఓ ప్రహస్తుడా, నీవు యుద్ధవిశారదుడవు. శత్రువులు హఠాత్తుగా మన పట్టణాన్ని ముట్ట డించి బాధ పెట్టుతున్నారు. నీవు తప్ప మరి ఇతరులు ఎవరూ పోరాడి ఈ లంకాపట్టణాన్ని ఈ ముట్టడిలోనుంచి తప్పించలేరు అని నాకు తోస్తున్నది. నేనో కుంభకర్ణుడో నా సేనాపతివి నీవో ఇంద్రజిత్తో

నికుంభుడో తప్ప మరి ఒకడు ఎవడూ ఈ భారము వహించలేడు. నీవు ఇప్పుడే నీ సైన్యాన్ని వెంటపెట్టుకొని వానరులు ఉన్నచోటికి పోయి వారిని జయించు. నీవు నీ సైన్యాలతో వెళ్ళితే చాలు. రాక్షసవీరుల సింహనాదాలకు ఆ వానరవాహిని అంతా చలించి పోతుంది. వానరసైనికులు అందరూ పారిపోతారు. వాండ్లు చలచిత్తులు. యుద్ధశిక్ష పొందినవాండ్లు కారు. నీ సింహనాదము వినగానే సింహగర్జనము విన్న ఏనుగులవలె చిత్తస్థయిర్యము చెడి వాండ్లు పరుగులెత్తి పారిపోతారు.

"ఓ ప్రహస్తుడా, అట్లా వానరసైన్యము పారిపోయిన తరువాత రామలక్ష్మణులు ఆధారములేనివాండ్లూ అసహాయులూ అయిపోతారు. నీ చేతికి చిక్కుతారు. మనము ఊహిస్తున్నట్టు జరిగినా జరగకపోయినా ఇప్పుడు మనము యుద్ధముచేయకుండా ఉండటానికి వీలులేదు. యుద్ధములో ఎవరు జయిస్తారో చెప్పలేము. అట్లా అనుకొని మనము యుద్ధము చేయకుండా ఊరక ఉండేట్లయితే ఇప్పుడు మనమీదికి ఎత్తివచ్చిన ఎదిరి మనలను చంపివేయకుండా పోదు. ఒకవేళ యుద్ధములో మనమే జయిస్తామో ఏమో చెప్పలేము. కాబట్టి ఏమి అయినప్పటికిన్నీ మనము ఇప్పుడు యుద్ధము చేయడమే మనకు మేలు అని, నాకు తోస్తూ ఉంది. ఓ ప్రహస్తుడా, నీకు ఏమి తోస్తున్నదో చెప్పు. నేను చెప్పింది నీకు అనుకూలముగా తోచినా ప్రతికూలముగా తోచినా మనకు మేలు అయ్యేది ఏమిటో ఆలోచించిచెప్పు" అన్నాడు.

ఈ విధముగా రాక్షసరాజు రావణాసురుడు చెప్పి అడిగింది విని అసురరాజుతో శుక్రాచార్యుడివలె "ఓ రాజా, ఇదివరకు మంత్రులు అందరితోనూ ఆలోచించిన విషయమే ఇది. ఈ విషయములో పరస్పరమూ చర్చించడమూ వివాదపడడమూ అయిపోయింది. సీతాదేవిని ఇచ్చివేసేట్లయితే యుద్ధము ఉండదు అనీ ఇవ్వకపోయేట్లయితే యుద్ధము తప్పదు అనీ ఇదివరకే నిశ్చయము అయిపోయింది. మేము మంత్రులము యుద్ధము రాకతప్పదు అనుకొన్నదే.

"రాజా, నీవు ఎప్పుడూ నన్ను గౌరవిస్తూ ఉన్నావు. నానావిధాలా నన్ను సంతోషపెట్టుతూ ఉన్నావు. ఇప్పుడు

సమయము వచ్చింది. నిన్ను సంతోషపెట్టడానికి నేను ఏపని అయినా చేస్తాను. నీ కోసము నా బిడ్డలను అయినా నా పెండ్లాన్ని అయినా వదులుకొంటాను. నీ కోసము యుద్ధములో నా ప్రాణాలు పోయేటంతవరకూ పోరాడుతాను. నీవు చూస్తావు” అని చెప్పినాడు.

రావణాసురుడితో ఇట్లా చెప్పి ఆ ప్రహస్తుడు ఎట్టఎదుట ఉన్న సేనాధ్యక్షులను చూచి “ఓ సేనాధ్యక్షులారా, రాక్షస మహాసైన్యాన్ని ఇప్పుడే సిద్ధముచేయండి. పిడుగులవంటి నా బాణాలకు యుద్ధభూమిలో చచ్చిపడిపోయే వానరుల మాంసాన్ని పక్షులు తనివితీర తినవలెను” అని చెప్పినాడు.

ప్రహస్తుడు ఆజ్ఞాపించిసట్టుగా ఆ సేనాధ్యక్షులు అప్పటికి అప్పుడు రాక్షససైన్యాన్ని యుద్ధసన్నద్ధము చేసినారు. నానావిధ తీక్ష్ణాయుధాలూ ధరించిన మదపుటేనుగులవంటి రాక్షసయోధులతో క్షణకాలములో లంకాపట్టణము అంతా సిండిపోయింది. ఆ యుద్ధములో జయించడానికి రాక్షసవీరులు అప్పుడు హోమాలుచేసి బ్రాహ్మణులకు గంధపుష్పాదులు ఇచ్చి పూజించడమువల్ల అక్కడ ఆజ్య సుగంధముతోనూ పుష్పసుగంధముతోనూ గాలి వీచింది. విజయముకోసము మంత్రపూతము చేసిన వివిధవిధాల పూలదండలను సంగ్రామసన్నద్ధులు అయిన రాక్షసయోధులు అప్పుడు వేసుకున్నారు. కవచాలు తొడుగుకొని చేతులలో ధనుస్సులు తీసుకొని రాక్షస యోధులు రావణాసురుడి దగ్గరకుపోయి నమస్కారము చేసి ప్రహస్తుడి దగ్గరకువచ్చి నిలిచినారు.

అప్పుడు ప్రహస్తుడు రావణాసురుడికి వీడ్కోలు చెప్పినాడు. మహాభయంకరముగా భేరిని కొట్టించినాడు. అప్పుడు మేఘ గర్జనలవంటి ధ్వనులు చేస్తూ సూర్యుడివలె దుర్నిరీక్షముగానూ చంద్రుడివలె మనోజ్ఞముగానూ బంగారు కిటికీలతో చక్కని వైకప్పుతో దుర్ధర్షము అయిన సర్పధ్వజముతో చక్కని చక్రాలతో మహావేగముతో పోయే గుర్రాలతో యుద్ధానికి సిద్ధముచేసిన రథాన్ని మంచి సమర్థుడు అయిన సారథి తోలుకొని వచ్చాడు. ఆ రథము సమస్త జగత్తునూ పరిహాసిస్తూ ఉన్నట్టు కనిపించింది. రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి ప్రహస్తుడు ఆ రథము

ఎక్కినాడు. రాక్షస మహాసైన్యము అప్పుడు ఆ రథము వెంట బయలుదేరింది.

అప్పుడు ఉరుములవలె దుందుభులూ నానావిధవాద్యాలూ మ్రోగినవి. శంఖాలు పూరించినారు. సముద్రము పొంగి భూమిని ముంచివేస్తూ ఉన్నట్టూ దిశలు బద్దలుఅయిపోతున్నట్టూ ఆ ధ్వనులు వినిపించినవి. ఆ ప్రహస్తుడి రథముముందు నడుస్తూ ఉన్న రాక్షసయోధులు అందరూ భయంకరాకారులు. వాండ్లు అందరూ మహాకాయులు. భయంకర స్వరముతో సింహనాదాలు చేస్తూ నడిచినారు.

అట్లా యుద్ధానికి పోతున్న ప్రహస్తుణ్ణి నరాంతకుడూ కుంభహనుడూ మహానాదుడూ సమున్నతుడూ అనే అతని నలుగురు మంత్రులూ వెంబడించినారు. ఆ రాక్షస మహాసైన్యము వ్యూహాలు తీరి ఏనుగుల మందలవలె ఆ ప్రహస్తుకుచుట్టూ నడచినవి. ప్రళయకాలములో సమస్తలోకాలనూ నాశనము చేసివేసే యముడివలె ప్రహస్తుడున్నూ, సముద్రముపొంగి మహాప్రవాహాలై పొర్లుతూ ఉన్నట్లు ఆ రాక్షససైన్య సమూహాలున్నూ కనిపించినవి.

ఆ ప్రహస్తుడున్నూ అతడివెంట యుద్ధానికి పోతూఉన్న రాక్షసయోధులున్నూ చేసిన సింహనాదాలకు లంకాపట్టణములో ఉన్న సమస్త జంతువులన్నూ భయపడిపోయి వికృతస్వరాలతో విపరీతముగా అరిచినవి. నెత్తురు తాగి మాంసము తినే భయంకరము అయిన పక్షులు అప్పుడు ఆకాశములో ఆ రథముపైన మండలాకారముగా ప్రదక్షిణము చేసినవి. భయంకరము అయిన నక్కలు అగ్నిజ్వాలలు కక్కుతూ అరిచినవి. అంతరిక్షమునుంచి కొఱవులు కిందపడ్డవి. గాలి ఎడాపెడా కొట్టింది. గ్రహయుద్ధము ఆరంభము అయినందువల్ల గ్రహాలకాంతులు మాసిపోయినవి. మేఘాలు కర్ణకఠోరముగా గర్జించినవి. ఆ ప్రహస్తుడిముందు నడుస్తూ ఉన్న రాక్షసయోధులు అందరూ తడిసిపోయేట్టు నెత్తురువాన కురిసింది. ఆ ప్రహస్తుడి రథపతాకముమీద ఒక గ్రద్ద వాలి రెండు రెక్కలను ముక్కులో పొడుచుకోసాగింది. ఆ ప్రహస్తుడి రథము తోలుతూఉన్న సారథి తండ్రి తాతలనుంచీ రథచోదక వృత్తితో జీవించిన సూతవంశములో పుట్టినాడు. అనేకమార్లు యుద్ధాలలో

ప్రహస్తుడికి రథము తోలినాడు. అటువంటి ఆ రథసారథి చేతిలో నుంచి హఠాత్తుగా కొరడా జారి నేలమీద పడిపోయింది. ఆ రథానికి కట్టిన గుర్రాలకాళ్ళు కారణములేకుండా మిట్టపల్లాలులేని సమ ప్రదేశములో జారిపడిపోయినవి. అష్టవసువులకు దుర్లభము అయిన కాంతులతో యుద్ధానికి బయలుదేరిన ప్రహస్తుడి దేహకాంతులు ముహూర్తమాత్రములో కనపడకుండా పోయినవి.

ప్రసిద్ధికెక్కిన ఆ బలవంతుడు ఆ పౌరుషవంతుడు పోరాటానికి రావడము కపిసైన్యము చూచింది. నానా ప్రహరణాలతోనూ ఎదురుగుండా నిలిచింది. ఆ వానరయోధులు యుద్ధము చేయడానికి పెద్ద పెద్ద రాళ్లను పెళ్లగిస్తూఉంటే మహాధ్వని దొమ్మిగా అయింది.

అప్పుడు అటు రాక్షసులు అరుస్తూనూ ఇటు గర్జిస్తూనూ ఉభయసైన్యాలూ సంతోషములో యుద్ధానికి తలరేగినవి. ఉభయులు వేగవంతులు. ఉభయులు యుద్ధసమర్థులు. ఒకండ్లను ఒకండ్లు చంపివేయడానికి వానరులూ రాక్షసులూ పిలుచుకొంటూ భూమ్యాకాశాలు బద్దలు అయిపోయేట్లు సింహనాదాలు చేసినారు.

అప్పుడు ఆ దుర్మతి ప్రహస్తుడు కపిరాజుసైన్యాన్ని తాను జయించకలను అనుకొని అగ్నిహోత్రముమీదికి అమితవేగముతో పోయే మిడుతవలె చావడానికి ఆ వానరసైన్యముమీదికి పోయినాడు.

౫౮

అట్లా వస్తూఉన్న ఆ భీమపరాక్రముణ్ణి రాముడు చూచినాడు. ఆ అరిందముడు చిరునవ్వు నవ్వుతూ విభీషణుణ్ణి చూచి "ఓ మిత్రుడా, ఈ వస్తూ ఉన్న మహాకాయుడు ఎవడు. చుట్టూ సైన్యముతో వస్తూ ఉన్న ఈ నిశాచరుడు ఎవడో చెప్పు" అని అడిగినాడు.

"రామా, ఈ రాక్షసుడు రావణాసురుడి సేనానాయకుడు. వీడిపేరు ప్రహస్తుడు. రావణాసురుడికి లంకాపట్టణములో ఉన్న మహాసైన్యములో మూడవభాగము వీడి స్వాధీనములో ఉంటూ ఉంది. వీడు ప్రసిద్ధికెక్కిన పరాక్రమవంతుడు. బలవంతుడు. శూరుడు. అస్త్రవేత్త" అని విభీషణుడు చెప్పినాడు.

సింహనాదాలు చేస్తూ ఉన్న రాక్షసయోధులను వెంట పెట్టుకొని వస్తూ ఉన్న ఆ భయంకరాకారుణ్ణి ఆ భయంకర పరాక్రముణ్ణి ఆ మహాకాయుణ్ణి ప్రహస్తుణ్ణి వానరవీరులు అందరూ చూచినారు. అప్పుడు ఆ బలవంతులు అందరూ అమిత వేగముతో ఆ ప్రహస్తుడికి ఎదురుగుండా పోయి సింహనాదాలు చేసినారు.

తళతళలాడుతూ ఉన్న ఖడ్గాలతోనూ శక్త్యాయుధాలతోనూ అష్టులు అనే ఆయుధాలతోనూ ముసలాయుధాలతోనూ శూలాలూ గదలూ ఇనుపగుదియలూ ఈటెలూ మొదలు అయిన వాటితోనూ రకరకాల గండ్రగొడ్డళ్ళతోనూ విచిత్రము అయిన ధనుస్సులతోనూ బాణాలతోనూ ఆ రాక్షసయోధులు అందరూ జయము కాంక్షిస్తూ వానరులమీదికి పరుగెత్తుకొని వచ్చినారు. ఆ రాక్షసయోధులతో పోరాడటానికి పూలుపూసిన చెట్లు చేతులతో పట్టుకొనీ పెద్దపెద్ద పొడుగాటి వెడల్పాటి రాళ్ళు పట్టుకొనీ వానరయోధులు నిలుచున్నారు. అప్పుడు రాక్షసులు వానరులమీద బాణవర్షము కురిపించినారు. వానరులు రాక్షసులమీద రాళ్ళవాన కురిపించినారు. ఆ విధముగా ఆ మహాసంగ్రామము ఆరంభము అయింది.

ఆ యుద్ధములో రాక్షసులను అనేకమందిని వానరులు చంపివేసినారు. వానరులను అనేకమందిని రాక్షసులు చంపివేసినారు. రాక్షసయోధులు శూలాలతో వానరులను చీల్చివేసినారు. చక్రాయుధాలతో వానరులను తెగవేసినారు. ఇనుపగుదియలతో వానరులను చితుకకొట్టినారు. గండ్రగొడ్డళ్ళతో వానరులను నరికివేసినారు. బాణాలతో వానరుల గుండెకాయలను పగులకొట్టినారు. తుండ్లు తుండ్లుగా ఎగిరిపడేట్టు వానరులను ఖడ్గాలతో తెగకొట్టినారు.

అప్పుడు వానరులు ఈ భూమిమీద కనిపించిన చెట్లనూ పర్వతాలనూ పెళ్ళగించి తెచ్చి వాటితో రాక్షసులను నుగ్గు నుగ్గు చేసినారు. ఆ వానరులు కొంతమంది రాక్షసులను వజ్రాయుధాల వంటి తమ గోళ్ళతో చీల్చివేసినారు పిడికిలి పోట్లతో కొంతమంది రాక్షసులను చంపివేసినారు. చేతులతో కొంతమంది రాక్షసుల పళ్ళు ఊడకొట్టి వాండ్ల కన్నులు పెరికివేసినారు. నెత్తురు కక్కుకొని నేలమీద పడిపోయేట్టు కొంతమంది రాక్షసులను కొట్టి

నారు. ఆ పోరాటములో అటు రాక్షసులూ ఇటు వానరులూ దెబ్బలు తిన్నవాండ్లు ఏడుస్తూనూ మూలుగుతూనూ ఉంటే తక్కిన వాండ్లు దొమ్మిగా సింహనాదాలు చేసినారు. ఉభయపక్షాల యోధులూ క్రుద్ధులు అయిపోయి వీరమార్గము అనుసరించినారు. కన్నులు తిప్పుతూ నిర్భయముగా క్రూరకృత్యాలు చేసినారు.

అప్పుడు నరాంతకుడూ నికుంభుడూ మహానాదుడూ సమున్నతుడూ చెలరేగి వానరులను ఘోరముగా వధించడము మొదలు పెట్టినారు. వాండ్లు అట్లా చొచ్చుకొనవచ్చిపడి వానరులను చంపివేస్తూ ఉంటే ద్వివిదుడు ఒక పర్వతశిఖరాన్ని నరాంతకుడిమీద రువ్వినాడు. ఆ దెబ్బకు నరాంతకుడు చచ్చిపోయినాడు. చక చకా చేతులతో పనులు చేసే దుర్ముఖుడు అనే వానరుడు ఒక మహా వృక్షాన్ని ఇట్టే పెల్లగించి దానితో సమున్నతుణ్ణి కొట్టి చంపివేసినాడు. తేజోవంతుడు జాంబవంతుడు అప్పుడు పరమక్రుద్ధుడు అయిపోయి ఒక పెద్ద రాతిబండను మహానాదుడి వక్షస్థలముమీద వేసి కొట్టినాడు. ఆ రాతిదెబ్బకు ఆ మహానాదుడు చచ్చిపోయినాడు. తారుడు ఒక చెట్టుతో కుంభహనుడి శిరముమీద కొట్టినాడు. ఆ చెట్టుదెబ్బకు కుంభహనుడు చచ్చిపోయినాడు. అట్లా తన నలుగురు మంత్రులనూ వానరయూథపతులు చంపివేయడము ప్రహస్తుడు రథముమీదినుంచి చూచినాడు. సహించలేకపోయినాడు. ధనుస్సు తీసుకొని వానరులతో ఘోరముగా పోరాటము సాగించినాడు. ప్రళయకాలము ఆసన్నము అయినట్టు ఉభయసైన్యాలూ కలవరపడిపోయినవి. సముద్రము పొంగి పొర్లి ఈ భూమిని అంతా ముంచి వేస్తున్నట్టు ఉభయ సైన్యాలూ మహాధ్వనులు చేసినవి.

అప్పుడు ఆ మహాయుద్ధములో యుద్ధకోవిదుడు ప్రహస్తుడు కుపితుడు అయి బాణపరంపరలతో వానరులను భయంకరముగా నొప్పించినాడు. ఆ యుద్ధభూమిలో పడిపోయిన వానరుల కళేబరాలూ రాక్షసుల కళేబరాలూ పర్వతాలవలె ఘోరముగా కనిపించినవి. నెత్తురుతో నిండిపోయిన ఆ యుద్ధభూమి అప్పుడు వైశాఖ మాసములో విరగపూసిన మోదుగుచెట్లతో కమ్ముకొనిపోయిన భూమివలె తోచింది. చచ్చిపడిపోయిన వీరసమూహాలు తీరాలు

గానూ విరిగిపడిపోయిన ఆయుధాలు మహావృక్షాలుగానూ రక్త ప్రవాహము మహాజలముగానూ గుండెకాయకు ఇరువైపులా ఉండే మాంసము బురదగానూ వెదజల్లినట్టు పడి ఉన్న పేగులు నాచుగానూ ఛిన్నాభిన్నము అయిపోయిన దేహాలూ తల కాయలూ చేపలుగానూ దేహావయవాలు పచ్చికపట్లుగానూ అంతటా వ్యాపించిన గద్దలు హంసలుగానూ రాబందుపక్షులు సారసపక్షులుగానూ మెదస్సు అక్కడ వ్యాపించిన నురుగుగానూ ఆర్తులు అయిపోయినవారి మూలుగులు మహాధ్వనులుగానూ పిరికివాళ్ళకు దాటిపోనలవికాకుండా యముడు అనే మహాసముద్రము లోకి పోతున్న మహాప్రవాహమువలె ఆ యుద్ధభూమి అప్పుడు అక్కడ కనిపించింది. శరత్కాలములో హంసలూ సారసపక్షులూ సేవించే నదిని సులభముగా దాటిపోయేట్టు యుద్ధభూమి అనే దాటిపోనలవికాని ఆ నదిని రాక్షసులూ వానరులూ ఇట్టే దాటిపోయి నారు. కమలాల పుప్పొడులతో నిండి ఉన్న కాసారములో దిగి బయటికివచ్చిన ఏనుగుల దేహాలు ఎర్రపడిపోయినట్టు ఆ యుద్ధ భూమిలోకి పోయిన వానరుల దేహాలూ రాక్షసుల దేహాలు ఎర్రపడిపోయినవి.

రథముమీదినుంచి బాణవర్షము కురిపించి వానరులను ఇట్టే చంపివేస్తున్న ప్రహస్తుణ్ణి నీలుడు చూచినాడు. అమిత వేగముతో ఆ వానరవీరుడు ఆ రాక్షసవీరుడికి ఎదురుగుండా పోయినాడు. అట్లా తనమీదికి వస్తూఉన్న ఆ వానరవీరుణ్ణి నీలుణ్ణి ఆ రాక్షసవీరుడు ప్రహస్తుడు చూచినాడు. మహానీలమేఘాన్ని ఎగరకొట్టే వాయువు వలె ఆ నీలుడికి ఎదురుగుండా ప్రహస్తుడు ఆదిత్యకాంతులతో తేజ రిల్లుతూఉన్న తన రథముమీద పోయినాడు. ఆ మేటివిలుకాడు రాక్షససేనాపతి ఆ ప్రహస్తుడు అంతట తన ఉత్తమోత్తమము అయిన ధనుస్సును ఆకర్ణాంతము లాగి నీలుడిమీద బాణాలు వదిలి నాడు. ఆ బాణాలు అమితవేగముతో గురితప్పకుండా కుపిత సర్పాలవలె పోయి నీలుడిమీద పడ్డవి. అవి అతనిని నొప్పించి భూమిలోకి పోయినవి. అగ్నిహోత్రమువంటి తీక్ష్ణబాణాలు తన మీద ప్రహస్తుడి వర్షముగా కురిపిస్తూఉంటే ఆ మహాబలవంతుడు నీలుడు శరత్కాలములో కురిసి ఇట్టే వెలిసిపోయే వర్షధారలను

ఓర్చుకొనే అబోతువలె నిలుచుండిపోయినాడు. అయితే ఆ బాణ వర్షానికి పట్టరాని కోపము వచ్చింది. సమయము దొరికింది. మహా సాలవృక్షాన్ని ఒకదాన్ని ఇట్టే పెళ్ళగించినాడు. మనోజవముతో పోయే ప్రహస్తుడి గుఱ్ఱాలను ఆ చెట్టుతో కొట్టినాడు. ఆ దెబ్బకు ఆ గుఱ్ఱాలు చచ్చి పడిపోయినవి. అప్పుడు ఆ మహాబలవంతుడు నీలుడు చటుక్కున ఎగిరిపోయి ప్రహస్తుడి చేతిలోఉన్న ధనుస్సును పట్టుకొని ముక్కలు ముక్కలుగా విరగకొట్టినాడు. అంతట పదే పదే సింహానాదము చేసినాడు.

రాక్షససేనానాయకుడు ప్రహస్తుడు అట్లా విధనుష్కుడూ విరథుడూ అయిపోయినాడు. అంతట భయంకరము అయిన ముసలాయుధము తీసుకొని ఆ రథముమీదినుంచి కిందికి దూకినాడు. అంతట అమితవేగముతో ప్రహస్తుడు నీలుడి నొసటను ఆ ముసలాయుధముతో కొట్టినాడు. దేహము అంతా నెత్తురుతో తడిసిపోయి నీలుడు క్రుద్ధుడు అయిపోయి ఒక మహావృక్షముతో ప్రహస్తుడి ఎదురురొమ్ములమీద కొట్టినాడు.

అప్పుడు ఆ ఉభయ సేనానాయకుల దేహాలూ నెత్తురుతో తడిసిపోయినవి. ఉభయులూ బలవంతులు. అమిత వేగవంతులు. దెబ్బలుతిన్న మదపుటేనుగులవలె ఉభయులూ పోరాటానికి బద్ధవైరముతో నిలుచున్నారు. ఆ వీరులు ఉభయులూ పోరాటములో ఎన్నడూ వెనుకకు మళ్ళి ఎరుగరు. ఉభయులూ సింహశార్దూలాల వంటి వాండ్లు. అనేక యుద్ధాలలో ఉభయులూ సింహమువంటి దర్పముతోనూ పెద్దపులివంటి పరాక్రమముతోనూ పోరాడి జయించినారు. ఎన్నడూ అపజయము అనేది ఎరుగరు. అటువంటి ఆ రాక్షససేనానాయకుడు ప్రహస్తుడూ వానర సేనానాయకుడు నీలుడూ జయేచ్ఛతో పరస్పరమూ సుతీక్ష్ణము అయిన కోరలతో కొరుక్కున్నారు.

అంతట ప్రహస్తుడు ముసలాయుధము తీసుకొని నీలుడిమీదికి ఉగ్రవేగముతో పరుగెత్తినాడు. అప్పుడు ఆ మహావేగుడు నీలుడు ఒక పెద్దరాయి తీసుకొన్నాడు. ప్రహస్తుడు తనతో పోరాటానికి ముసలాయుధము ఎత్తేలోపలనే ఆ పెద్ద రాతిబండను ఎత్తి అరడి

తలమీద పడేట్టు విసరివేసినాడు. భయంకరము అయిన ఆ రాతి బండ ప్రహస్తుడి తలమీద పడ్డది. ఆ తల ముక్కలు ముక్కలు అయిపోయింది. వేరునరికిన మహావృక్షమువలె ప్రహస్తుడు తటాలున నేల కూలినాడు. పగిలిపోయిన శిరమునుంచీ దేహమునుంచీ పర్వతమునుంచి సెలవళ్ళవలె రక్తము ఏరులుఅయి పారింది.

అంతవరకూ అకంపముగా ఉన్న రాక్షససైన్యము కంపించి పోయింది. తమ సేనానాయకుడు ప్రహస్తుడు అట్లా అయిపోగానే రాక్షసయోధులు అక్కడ నిలువలేకపోయినారు. ఆనకట్టను దాటి జలాలు ముందుకు పోలేనట్టు రాక్షసయోధులు ఒక్క అడుగు ముందుకు వేయలేకపోయినారు. లంకాపట్టణములో రావణాసురుడి ఇంటికి పరుగెత్తిపోయినారు. ఆలోచించుకొంటూ మాట్లాడలేక మూగవాండ్లవలె నిలుచుండిపోయినారు. దుఃఖమహాసముద్రములో పడి తెప్పిరిల్లలేకపోయినారు.

అట్లా ప్రహస్తుణ్ణి జయించిన ఆ వానరసేనానాయకుడు ఆ మహాబలవంతుడు నీలుడు రామలక్ష్మణులదగ్గిరకు పోయినాడు. వారి మన్ననలను అందుకొన్నాడు.

౩౯

అగ్నిహోత్రుడి పుత్రుడు నీలుడు అనే వానరుడు ప్రహస్తుణ్ణి చంపివేసినాడు అని అంతట ఆ రాక్షసయోధులు రావణాసురుడితో చెప్పినారు. ఆ మాట విని రావణాసురుడు దుఃఖపడ్డాడు. బాధపడ్డాడు. దుఃఖమూ కోపమూ మనస్సులో పెనవేసుకొనిపోయినవి. దేవేంద్రుడు దేవయోధులతో చెప్పేటట్టు అప్పుడు ఆ రాక్షసరాజు రావణాసురుడు ఆ రాక్షసయోధులతో "ఓ యోధులారా, మన సేనానాయకుడు ప్రహస్తుడు దేవేంద్రుడి సైన్యాన్ని సంహారము చేసివేసినాడు. అటువంటివాణ్ణి అనుచరులతోనూ అతణ్ణి వెంబడించిన గజసాదులతోనూ వానరులు చంపివేసినారు అని మీరు చెప్పుతున్నారు. అందువల్ల ఆ వానరులను తక్కువవారు అనుకోడానికి వీలులేదు. ఇకను ఆలోచించేది ఏమీ లేదు. ఆ శత్రువులను అందరినీ జయించడానికీ వారిని అందరినీ సంహారము చేసివేయడానికీ ఆ అద్భుత యుద్ధభూమికి నేనే స్వయముగా బయలుదేరవలెను. కార్చిచ్చు

అడవిని దహించివేసేట్టు నా బాణాలతో ఆ వానరసైన్యాన్ని ఆ రామలక్ష్మణులనూ ఇప్పుడే నాశనము చేసివేస్తాను" అన్నాడు.

జ్వలిస్తూ ఉన్న అగ్నిహోత్రమువలె ధగ ధగ లాడుతూను అలంకరణాలతో తళ తళ లాడుతూ బంగారు రథము వచ్చింది. ఉత్తమాశ్వాలు పూంచిన ఆ రథముమీద రావణాసురుడు ఎక్కినాడు. అప్పుడు శంఖాలు పూరించినారు. భేరీలూ పణవాలూ మోగించినారు. మహాధ్వని అయ్యేట్టు రాక్షసయోధులు భుజాలు చరచుకొన్నారు. రావణాసురుణ్ణిగురించి స్తోత్రపాఠాలు చదివినారు. రాక్షసయోధులు అందరూ సింహనాదాలు చేయసాగినారు. అప్పుడు ఆ రాక్షసరాజు రావణాసురుడి రథము బయలుదేరింది. ఆ రథముతో నిప్పుకణికలవంటి నేత్రాలతో పర్వతాకారులూ, మహామేఘాకారులూ అయిన రాక్షసయోధులు బయలుదేరినారు. ఆ రాక్షసరాజు రావణాసురుడు అట్లా అంత పరివారముతో అంత సైన్యముతో పోతూ ఉంటే మహాభూతాలను వెంటపెట్టుకొనిపోయే రుద్రుడివలె కనిపించినాడు. అమితవేగముతో ఆ మహాపరాక్రమవంతుడు రావణాసురుడు అట్లా లంకాపట్టణము వెలుపలికి పోయినాడు. మహాసముద్రఘోషమువలెనూ మహామేఘనిస్వనాలవలెనూ సింహనాదాలు చేస్తూ మహావృక్షాలూ పర్వతశిలలూ పట్టుకొని యుద్ధసన్నద్ధము అయిన వానరసైన్యాన్ని చూచినాడు.

అతిప్రచండముగా అట్లా వస్తూ ఉన్న ఆ రాక్షససైన్యాన్ని వానరుల మధ్యను ఉన్న ఆ మహాకాంతిమంతుడు భుజగేంద్రబాహువు రాముడు చూచినాడు. రాక్షస వీర భట తారతమ్యము తెలిసిన విభీషణుడితో "మిత్రుడా, నానావిధపతాకాలతోనూ ధ్వజాలతోనూ ఈటెలూ ఖడ్గాలూ శూలాలూ ధనుస్సులూ మొదలు అయిన ఆయుధాలతోనూ మహేంద్రపర్వతమువంటి ఏనుగులతోనూ దేనికి కలవరపడకుండానూ దేనికీ భయపడకుండానూ రాక్షససైన్యము వస్తూవుంది. ఈ భయంకరసైన్యాన్ని వెంటపెట్టుకొని వస్తూఉన్న వాడు ఎవడు?" అని రాముడు అడిగినాడు.

ఆ శక్రసమాన పరాక్రమవంతుడు విభీషణుడు అప్పుడు ఆ వస్తూవున్న రాక్షసవీరుల బలపరాక్రమాతిశయాలను గురించి

చెప్పతలచుకొని "ఓ రామా, అదుగో, అప్పుడే ఉదయిస్తూ ఉన్న
సూర్యుడివంటి ఎర్రటి ముఖముతో ఏనుగు మూపుమీద కూర్చుండి
ఏనుగువలె తల ఆడిస్తూ వస్తున్నవాడు రావణాసురుడి కొడుకు
అకంపనుడు అనేవాడు.

"అదుగో, సింహము చిత్రించిన పతాకము ఎగురుతూవున్న
రథముమీద మదపుటేనుగువంటి ఆకారముతో బయటికి వెళ్ళుకొని
వచ్చిన పెద్ద పెద్ద కోరలతో ఇంద్రధనుస్సువంటి ధనుస్సు చేతిలో
పట్టుకొని వస్తూవున్నవాడే బ్రహ్మానుగ్రహమువల్ల అంతర్ధానుడు అయి
పోయే శక్తి సంపాదించిన ఇంద్రజిత్తు.

"అదుగో, ఆ రథముమీద వింధ్యపర్వతమువలెనూ మహేంద్ర
పర్వతమువలెనూ అస్తగిరివలెనూ మహాకాయుడు అతుల్యప్రమాణ
ధనుస్సును మోగిస్తూ వస్తూవున్నవాడు అతిరథుడు. వాడు అతి
వీరుడు. వాడిపేరు అతికాయుడు.

"ఘంటలు గణగణ మోగించుకొంటూ వస్తూఉన్న ఏనుగు
మీద శ్రవణకఠోరముగా అరుస్తూ అప్పుడే ఉదయించిన సూర్య
బింబమువంటి ఎర్రటి కన్నులతో వస్తూఉన్న వీరుడిపేరు మహో
దరుడు.

"సంధ్యాకాలమేఘము అలముకొన్న పర్వతమువంటి ఆకా
రములో కాంచనచిత్రితాభరణాలు ధరించి తళతళలాడుతూ ఉన్న
ఈటె పట్టుకొని పిడుగువంటి వేగముతో గుర్రముమీద వస్తూఉన్న
వాడు పిశాచుడు.

"అదుగో, పర్వతము అంత ఎద్దుమీద నెక్కి తీక్షణము
అయిన మెరుపులవలె మెరుస్తూ వజ్రాయుధము అంత వేగముగా
పనిచేసే శూలాన్ని పట్టుకొని వస్తూఉన్నవాడు త్రిశిరుడు.

"అదుగో, పన్నగరాజధ్వజము ఉన్న రథముమీద యుద్ధ
సన్నద్ధుడు అయి ధనుస్సువిదిలిస్తూ మ్రోగిస్తూ అందముఅయిన
వెడల్పాటి ఎదురురొమ్ములతో మేఘసమానరూపముతో వస్తూ
ఉన్నవాడు కుంభుడు.

కార్చిచ్చు

"అదుగో, చూడు, పెద్ద పరిఘాయుధము పట్టుకొని వస్తూ ఉన్నాడు. ఆ పరిఘకు పొదిగిన వజ్రాలు పొగలు రాజుకుంటూ ఉన్నట్టూ దానికి పొదిగిన బంగారమునుంచి అది మంటలు మండుతూఉన్నట్టూ కనపడుతూ ఉంది. ఆ పరిఘను పట్టుకొని వస్తూఉన్నవాడు నికుంభుడు. వాడు రాక్షససైన్యానికి ధ్వజమువంటి వాడు. అనేక అద్భుత ఘోరకృత్యాలు చేసినాడు.

"అదుగో, ఆ రథాన్ని చూడు. దానిమీద పెద్ద పతాకము ఎగురుతూ ఉంది. ఆ రథము అగ్నిహోత్ర కాంతులతో ధగధగ లాడుతూ ఉంది. ఆ రథమునిండా ధనుస్సులూ ఖడ్గాలూ బాణాలూ ఉన్నవి. ఆ రథముమీద వస్తూఉన్నవాడి పేరు నరాంతకుడు. వాడు పర్వతశిఖరాలను పెళ్ళగించి వాటిని ఆయుధాలుగా చేసుకొని పోరాడుతాడు.

"ఓ రామా, చూడు, వ్యాఘ్రముఖాలతోనూ ఒంటె ముఖాలతోనూ ఏనుగు ముఖాలతోనూ మృగముఖాలతోనూ గుర్రము ముఖాలతోనూ ఉన్న ఘోరాకారులను వెంటపెట్టుకొని రథముమీద వస్తూఉన్నవాణ్ణి చూడు. వాడు తన ఎర్రటి గ్రుడ్లు తిప్పుతున్నాడు. పూర్ణచంద్రమండలమువలె గుండ్రముగానూ తెల్లగానూ సన్నటి శలాకలతో ఎంతో అందముగానూ ఉన్న శ్వేతచ్ఛత్రముక్రింద దేహకాంతులతో తేజరిల్లుతూ భూత ప్రేత పిశాచాలను వెంటపెట్టుకొని వచ్చే రుద్రుడివలె వస్తూఉన్నాడు. వింధ్యహిమవత్పర్వతాలవంటి భీమకాయముతోనూ నవరత్నఖచిత కిరీటముతోనూ బంగారుకుండలాలతోనూ ధగధగలాడుతూ సూర్యుడివలె తేజరిల్లుతూ తల ఆడిస్తూ ఆ రథముమీద వస్తూ ఉన్నాడు. వాడే దేవతల దర్పాన్నీ దేవేంద్రుడి దర్పాన్నీ యముడి దర్పాన్నీ అణచివేసిన రాక్షసరాజు రావణాసురుడు" అని చెప్పినాడు.

ఇట్లా ఆ రాక్షసవీరులనుగురించి చెప్పిన ఆ శత్రుసంహారకుణ్ణి విభీషణుణ్ణి రాముడు చూచి "ఆహా, ఎంత కాంతిమంతుడు! ఎంత తేజోవంతుడు, ఈ రావణాసురుడు! ఆశ్చర్యము. కన్నులు మిరుమిట్లుకొలిపే కిరణాలనుంచి తేరిపారచూడ నలవి కాని సూర్యుడి

వలె వీడు దేహకాంతులతో తేజరిల్లుతూ ఉన్నాడు. వీడి రూపమే వీడి ప్రతాపాన్ని స్పష్టముగా తెలియచెప్పుతూ ఉంది. వీడి కాయమూ వీడి తేజమూ దేవ దానవ వీరులకు ఎవరికీ లేదు. వీడి యోధులు అందరూ తేజోవంతులు. పర్వతాకారులు. అందరూ దీప్తాయుధాలు ధరించినారు. మహాకాయులూ భయంకరాకారులూ అయిన యమకింకరులను వెంటపెట్టుకొని వచ్చే యమధర్మరాజువలె వీడు ఈ రాక్షసరాజు మహాకాంతిమంతులూ భయంకర పరాక్రములూ అయిన యోధులను వెంటపెట్టుకొని వస్తూఉన్నాడు.

"ఓ విభీషణుడా, ఈ పాపాత్ముడు నా అదృష్టమునుంచి నేటికి నా కంటపడ్డాడు. సీతాపహరణమునుంచి వీడిమీద నాకు వచ్చిన కోపము ఈ నాటితో తీరిపోతుంది" అని చెప్పినాడు. అంతట ఆ మహాపరాక్రమవంతుడు రాముడు ధనుస్సునూ ఉత్తమోత్తమబాణాలనూ తీసుకొని లక్ష్మణుడితోకూడా యుద్ధసన్నద్ధుడు అయి నిలుచున్నాడు.

ఇక్కడ రాముడు యుద్ధసన్నద్ధుడు అవుతూవుంటే అక్కడ ఆ మహాకాయుడు రావణాసురుడు మహాబలవంతులు అయిన రాక్షసవీరులను చూచి "ఓ వీరులారా, మీరు పోయి మీమీ గృహద్వారాలదగ్గరనూ చతుష్పథాలలో ఉన్న గృహద్వారాల లోనూ నిశ్శంకముగా హాయిగా ఉండండి. మీరు అందరూకూడా నావెంట ఉండేట్లయితే నగరములో సరియయిన బలము లేదు అని వానరులు తెలుసుకో గలుగుతారు. అంతట వానరులు నగరములో చొరబడి సర్వనాశనము చేసివేస్తారు. అందువల్ల మీరు పొండి" అని చెప్పి రాక్షసవీరులను పంపించివేసినాడు. మహాసముద్రజలాలను ఒక మహామీనము ధ్వంసము చేసివేసేటట్లు తాను ఆ వానరసైన్య సముద్రాన్ని ధ్వంసము చేయకలను అనుకొని ఆ రాక్షసరాజు రావణాసురుడు అంతట వానరసైన్యముమీదికి రథాన్ని తోలించినాడు.

అమితవేగముతో తన వానరసైన్యముమీద పడటానికి ధగధగలాడుతూ ఉన్న ధనుస్సుతోనూ తళతళలాడుతూఉన్న బాణాలతోనూ వస్తూ ఉన్న రాక్షసేంద్రుణ్ణి రావణాసురుణ్ణి సుగ్రీవుడు చూచినాడు. ఆ సుగ్రీవుడు ఒక పర్వతశిఖరాన్ని పెళ్లగించి దానిని

చేతిలో పట్టుకొని రావణాసురుడికి ఎదురుగుండా పరుగెత్తినాడు. ఎన్నో చెట్లతోనూ చరియలతోనూ ఉన్న ఆ పర్వతశిఖరాన్ని అంతట ఆ నిశాచరరాజుమీద విసరివేసినాడు. తనమీద పడబోతూ ఉన్న ఆ పర్వతశిఖరాన్ని రావణాసురుడు చూచినాడు. తత్క్షణమే బంగారుములుకులతో ఉన్న బాణాలను ఆ పర్వతశిఖరముమీద వదిలినాడు. పెద్దఎత్తున పెరిగిన చెట్లతోనూ చరియలతోనూ ఉన్న ఆ పర్వతము రావణాసురుడి బాణాలకు ముక్కలు ముక్కలు అయి నేలమీద పడ్డది. అంతట ఆ రాక్షసలోకనాథుడు రావణాసురుడు ప్రాణాంతకము అయిన మహాసర్పము వంటి బాణాన్ని వింట సంధించినాడు. దేవేంద్రుడి వజ్రాయుధము వంటి వేగముతోనూ వాయువేగముతోనూ మంటలు మండుతూ నిప్పులు కక్కుతూ పోయే ఆ బాణాన్ని ఇట్టే సుగ్రీవుడిమీద వదిలినాడు. నిశితాగ్రముతోనూ వజ్రాయుధమువంటి ఆకారముతోనూ ఉన్న ఆ బాణము కుమారస్వామి వదిలిన ఉగ్రశక్త్యాయుధము క్రౌంచపర్వతాన్నివలె సుగ్రీవుణ్ణి చీల్చుకొని పోయింది. ఆ మహావీరుడు సుగ్రీవుడు ఆ బాణము అట్లా తనలోనుంచి దూసుకొని పోయినందుకు బాధపడుతూ గుండెచెదిరి అరుస్తూ నేలమీద పడిపోయినాడు. అట్లా నేలమీద పడి చేష్టలుతప్పిపోయిన సుగ్రీవుణ్ణి చూచి రాక్షసయోధులు అందరూ సింహనాదాలు చేసినారు.

అంతట గవాక్షుడూ గవయుడూ సుదంష్ట్రుడూ జ్యోతిర్ముఖుడూ నభుడూ అనే వానరవీరులు దేహాలు పెంచి పర్వతాలు పెళ్ళగించి వాటిని తీసుకొని ఆ రాక్షసేంద్రుడి మీదికి పరుగెత్తినారు. అప్పుడు ఆ రాక్షసాధిపతి నిశితాగ్రబాణాలు వదిలి ఆ వానరులు పట్టుకొని పోయిన పర్వతశిఖరాలను ముక్కలు ముక్కలుగా పడగొట్టి బంగారు ములుకుల బాణాలు వదిలి ఆవానరవీరులను అందరినీ నేలపడగొట్టినాడు. భయంకరాకారులు అయిన ఆ వానరవీరులు నేలమీద పడిపోయిన తరువాత రావణాసురుడు పరమభయంకరముగా వానరసైన్యముమీద బాణవర్షము కురిపించడము మొదలుపెట్టినాడు. ఆ బాణాలకు పరమపరాక్రమవంతులు అయిన వానరవీరులు చచ్చిపోతూనూ ఘోరముగా బాధపడుతూనూ ఉంటే చూచి వానరయోధులు అందరూ భయము అనే శల్యముతో బాధ

పడుతూ పెద్దపెట్టున కేకలువేసుకుంటూ సర్వశరణ్యుడు అయిన రాముడి శరణు చొచ్చినారు.

అంతట ఆ మహాపరాక్రమవంతుడు ఆ మహాధనుర్ధరుడు రాముడు తన ధనుస్సును తీసుకొని వానరులను కాపాడడానికి రావణాసురుడిమీదికి బయలుదేరినాడు. అప్పుడు లక్ష్మణుడు ఆ రాముడికి ఎదురుగుండా పోయి చేతులు జోడించి పరమార్థముగా "ఓ ప్రభూ, ఈ దురాత్ముణ్ణి చంపివేయడము నీకు ఒక లెక్కా! వీడు నీచుడు. ఇటువంటి నీచుణ్ణి నీవు చంపివేయడముకన్నా నేను చంపివేయడము బాగుంటుంది. నేను వీణ్ణి చంపివేస్తాను. అన్నా, రామా, అనుమతించు" అని వేడుకున్నాడు.

ఆ మహాతేజోవంతుడు సత్యపరాక్రముడు రాముడు లక్ష్మణుడితో "తమ్ముడా, నీవే పో. పోరాటములో జాగ్రత్తగా నీవు మెలగవలెను. రావణాసురుడు మహావీర్యవంతుడు. యుద్ధములో వాడి పరాక్రమము అద్భుతముగా ఉంటుందిసుమా. వాడు కోపములో ఒలరేగేట్లయితే ముల్లోకాలవారున్నా వాణ్ణి ఎదిరించలేరు. సందేహములేదు. అయితే పోరాటములో వాడిలోపము ఎక్కడ వుందో నీవు వెతుకు. నీ లోపాన్ని గమనించి సవరించుకో. కంటితో వాణ్ణి చూస్తూ ఉండు. హెచ్చరికతో పోరాడు. ఏ మాత్రమూ ఏమరకుండా నీ ధనుస్సుతో నిన్ను నీవు కాపాడుకుంటూ ఉండవలెను" అని చెప్పినాడు.

రాముడు చెప్పిన ఈ మాటలు లక్ష్మణుడు విన్నాడు. రాముణ్ణి కౌగలించుకున్నాడు. ప్రదక్షిణము చేసినాడు. ఆ మహానుభావుడి అనుజ్ఞతో యుద్ధానికి బయలుదేరినాడు.

దేహాలు తెగి చెల్లాచెదురుగా పడిఉన్న వానరులమీద రావణాసురుడు దేదీప్యమానమూ భయంకరమూ అయిన ధనుస్సులోనుంచి బాణవర్షము కురిపిస్తున్నాడు. ఏనుగుతొండమువంటి చేతితో ధనుస్సు పట్టుకొని లక్ష్మణుడు ఆ రావణాసురుడివంక చూచినాడు. అట్లా పోరాటానికి సిద్ధము అయి పోబోతున్న లక్ష్మణుణ్ణి మహాతేజోవంతుడు మారుతాత్మజుడు చూచినాడు. కింకరుడు తాను ఉండగా లక్ష్మణుడు పోరాటానికి పోవటము ఏమిటి

అనుకొన్నాడు. రావణాసురుడు వదులుతూ ఉన్న బాణాలను తన చేతులతో అడ్డగిస్తూ ఆ ధీమంతుడు హనుమంతుడు రావణాసురుడి మీదికి పరుగెత్తినాడు. ఇట్టే ఎగిరి రావణాసురుడి రథము ఎక్కినాడు. కుడిచెయ్యి ఎత్తి భయపెట్టుతూ "ఓ రాక్షసుడా, నీవు దేవ దానవ గంధర్వ రాక్షసులను అందరినీ జయించినావు. యథార్థమే. నీకు వారి భయము లేదు. నాకు తెలుసును. అయితే ఇప్పుడు నీవు వానరులకుమాత్రము భయపడక తప్పదు. నేను ఇప్పుడు నా అయిదువేళ్ల కుడిచెయ్యి ఎత్తినాను. బహుకాలము నుంచి నీ దేహములో ప్రాణియాపాన ఉంటూఉన్న ఆత్మను ఇప్పుడు నేను బయటికి వెళ్లగొట్టుతాను. చూసుకో" అన్నాడు హనుమంతుడు.

ఆ భయంకరపరాక్రముడు రావణాసురుడు కోపములో కన్నులు ఎర్రచేసి "ఓ వానరుడా, నిశ్శంకముగా కొట్టు. రావణాసురుణ్ణి ఒక వానరుడు కొట్టినాడు అనే కీర్తి నీకు స్థిరముగా ఉండిపోతుంది. నీ పరాక్రమము నేను తెలుసుకొంటాను. అంతట నిన్ను నాశనము చేస్తాను" అన్నాడు.

అందుకు ఆ వాయుసుతుడు హనుమంతుడు "ఓ రావణుడా, ఇదివరకు నేను కొట్టిన నీ కొడుకును అక్షకుమారుణ్ణి జ్ఞాపకము తెచ్చుకో" అన్నాడు. ఈ మాట చెవిన పడీ పడటములో ఆ వీర్యవంతుడు ఆ కాంతిమంతుడు రావణాసురుడు అరచేతితో హనుమంతుడి ఎదురురొమ్ములమీద ఒక్క చరుపు చరిచినాడు. ఆ చరుపుకు హనుమంతుడు గజగజ వణికిపోయినాడు. ఒక ముహూర్తముసేపటికి ఆ మహామతిమంతుడికి ఆ మహాతేజోవంతుడికి హనుమంతుడికి స్థైర్యము వచ్చింది. అంతట పరమక్రుద్ధుడు అయిపోయినాడు. తన అరచేతితో రావణాసురుణ్ణి కొట్టినాడు. ఆ దెబ్బకు భూకంపసమయాన భూమిమీద పర్వతము కంపించిపోయేట్టు ఆ రథముమీద ఉన్న రావణాసురుడు కంపించినాడు.

ఆ పోరాటములో హనుమంతుడి అరచేతి దెబ్బ తిని గజగజలాడుతూ ఉన్న రావణాసురుణ్ణి చూచి వానరులు అందరూ కోలాహల

ధ్వనులు చేసినారు. పయినుంచి చూస్తూఉన్న దేవర్షులూ సిద్ధులూ దేవతలూ హనుమంతుణ్ణి మెచ్చుకొన్నారు.

ఆ పరాక్రమవంతుడు రావణాసురుడు తెప్పిరిల్లి "భళే భళే—వానరుడా, నీవు నా శత్రువు అయినప్పటికిన్ని నిన్ను నేను మెచ్చుకొంటున్నాను." అన్నాడు.

"ఛీ ఛీ—నాది ఏమిపరాక్రమము! ఓ రావణుడా, నీవు ఇంకా బ్రతికిఉన్నావు. నా పరాక్రమము కాల్చనా. ఓ దుర్బుద్ధీ, ఈ కాస్త దెబ్బకే నన్ను పొగుడుతున్నావు ఏమిటి? ఇప్పుడు నన్ను మళ్ళీ కొట్టు. ఆ తరువాత ఒక గుద్దుతో నిన్ను యమసదనానికి నేను పంపిస్తాను" అన్నాడు హనుమంతుడు.

ఈ మాటలకు రావణాసురుడు కోపముతో భగ్గున మండిపోయినాడు. కన్నులు జ్యోతులు అయిపోయినవి. ఇట్టే హనుమంతుడి వక్షఃస్థలముమీద ఊద్చి ఒకగుద్దు గుద్దినాడు. విశాలవక్షఃస్థలముమీద తగిలిన ఆ దెబ్బకు హనుమంతుడు వణికిపోయినాడు. ఉత్తరక్షణాన అవయవాలు స్వాధీనము తప్పిపోయినవి. ఆ రథము మీదినుంచి కింద పడిపోయినాడు. అట్లా నేలమీద పడిపోయిన హనుమంతుణ్ణి వదిలిపెట్టి ఆ అతిరథుడు ఆ మహాబలవంతుడు రావణాసురుడు అమిత వేగముతో నీలుడిమీదికి పోయినాడు. ప్రాణము తీసివేసే భయంకరసర్పమువంటి బాణాన్ని ఆ నీలుడిమీద వదిలినాడు. ఆ వానరసేనాధిపతి నీలుడు ఆ బాణము గుచ్చుకొని బాధపడుతూనే ఒక పర్వతశిఖరాన్ని పెళ్ళగించి రావణాసురుడి మీద విసరి వేసినాడు.

అప్పుడు ఆ తేజస్వి ఆ మతిమంతుడు హనుమంతుడు తెప్పిరిల్లినాడు. పోరాటానికి అటూ ఇటూ చూచినాడు. నీలుడితో పోరాటము సాగిస్తూఉన్న రావణాసురుణ్ణి చూచి "ఓ రాక్షసుడా, మరి ఒకడితో పోరాడుతున్నవాడిమీద పడడము ధర్మము కాదు. అందువల్ల నిన్ను ఇప్పుడు వదిలిపెట్టుతున్నాను" అని చెప్పి తప్పుకొన్నాడు.

నీలుడు విసరివేసిన పర్వతశిఖరముమీద ఆ మహాపరాక్రమవంతుడు రావణాసురుడు ఏడు బాణాలు వదిలినాడు. ఆ బాణాలు

తగిలి ఆ పర్వతశిఖరము ముక్కలు ముక్కలు అయిపోయింది. అది చూచి ఆ పరవీరహంత యూథపతి నీలుడు కోపముతో ప్రళయ కాలాగ్నివలె అయిపోయినాడు. ఇనుమద్దిచెట్లనూ మద్దిచెట్లనూ చంద్రచెట్లనూ పూలు విరగపూసిన మామిడిచెట్లనూ ఇంకా వివిధ వృక్షాలనూ పెళ్ళగించి ఆ రావణాసురుడిమీద విసిరివేసినాడు. ఆ చెట్లను అన్నిటినీ రావణాసురుడు తన బాణాలతో నరికివేసినాడు. అంతట మహాభయంకరము అయిన బాణవర్షము కురిపించ సాగినాడు. మేఘాలు వర్షించే వానకు పర్వతమువలె ఆ బాణాల వర్షములో నీలుడు తడిసిపోయినాడు. అంతట నీలుడు తన ఆకారాన్ని హ్రస్వము చేసుకొన్నాడు. ఇట్టే ఎగిరి రావణాసురుడి రథధ్వజముమీదికి పోయి కూర్చున్నాడు. అట్లా తన ధ్వజముమీద కూర్చున్న నీలుణ్ణిచూచి రావణాసురుడికి పెద్దకోపము వచ్చింది. అప్పుడు నీలుడు సింహనాదముచేస్తూ ఆ రథధ్వజముమీదినుంచి రావణాసురుడు పట్టుకొనిఉన్న ధనుస్సు చివరకున్నూ ఆ ధనుస్సు కొనమీదినుంచి అతడు పెట్టుకొనిఉన్న కిరీటముమీదికిన్ని దూకడము మొదలుపెట్టినాడు. అది చూచి రామలక్ష్మణులూ హనుమంతుడూ ఆశ్చర్యపడిపోయినారు. ఆ కపి లాఘువానికి ఆ మహాతేజోవంతుడు రావణాసురుడున్నూ ఆశ్చర్యపడ్డాడు. వ్యాకుల పడిపోయినాడు. అది చూచి వానరులు అందరూ పకపకా నవ్వినారు. అంతట సంతోషాతిశయములో సింహనాదాలు చేసినారు.

రావణాసురుడికి కొంచెముసేపు ఏమిచేయడానికిన్ని తోచక నిలుచుండిపోయినాడు. ఆ నీలుడిమీద ఆగ్నేయాస్త్రము వదల వలెను అనుకొన్నాడు. ఆగ్నేయాస్త్రముతో అభిమంత్రించిన బాణాన్ని తీసుకొని రావణాసురుడు ధ్వజాగ్రముమీదఉన్న నీలుణ్ణి చూచి "ఓరీ కపీ, నీవు చాలా మాయలు నేర్చుకొన్నావు. మహాలాఘువముతో ఎగురుతున్నావు. ఓ వానరుడా, నీకు శక్తి ఉంటే ఇప్పుడు నిన్ను నీవు కాపాడుకో. నేను నీ ప్రాణము తీయపోతున్నాను. నీవు అనేక ఆకారాలు సృష్టించుకొంటున్నావు. అయినప్పటికిన్ని నేను వదిలే అస్త్రము నీ ప్రాణము తీస్తుంది. చేతనయ్యేట్లయితే నీ ప్రాణము పోకుండా చూసుకో" అంటూ

ఆగ్నేయాస్త్రముతో సంబంధించిన బాణాన్ని వదిలినాడు. ఆ ఆగ్నేయాస్త్రము అంతట పోయి ఆ వానరసేనానాయకుడు నీలుడి వక్షఃస్థలాన పడ్డది. అది ఆ నీలుణ్ణి దహించివేయడము మొదలుపెట్టింది. అతడు అక్కడ నిలువలేకపోయినాడు. ఆ ధ్వజాగ్రముమీది నుంచి నీలుడు నేలమీద పడిపోయినాడు. నీలుడు అగ్నిహోత్రుడి పుత్రుడు. అప్పుడు అగ్నిహోత్రుడి అనుగ్రహమువల్లనూ తన నైసర్గిక తేజోమహిమవల్లనూ నీలుడు మోకాళ్ళు ఆనించి నేలమీద పడి మూర్ఛపోయినాడు కాని ప్రాణము పోలేదు.

నీలుడు ఒళ్లు తెలియకుండా పడిపోవడము రావణాసురుడు చూచినాడు. అంతట యుద్ధోత్సాహముతో ఆ యుద్ధభూమిని పారచూచినాడు. మేఘగంభీరధ్వనులు చేస్తూ పోయే ఆ రథముమీద ఏ అడ్డూలేకుండా రణమధ్యానికి పోయి ఈ పృథ్వీఅంతా కంపించి పోయేట్లు ధనుష్టంకారము చేసినాడు.

అప్పుడు లక్ష్మణుడు ఆ రావణాసురుడితో "ఓ నిశాచరుడా, నీవు నామీదికి రావలెను అనుకొన్నట్లయితే వానరులతో యుద్ధము చేయడము ఏమిటి?" అని అడిగి, దశదిశలూ మారుమోగి పోయేట్లు భయంకరముగా తన ధనుస్సును మోగించినాడు. అప్పుడు రావణాసురుడు ఆ లక్ష్మణుడికి ఎదురుగుండా పోయి "ఓ లక్ష్మణా, నీకు వినాశకాలము వచ్చింది. అందువల్లనే విపరీతబుద్ధి పుట్టింది. నామీదికి వస్తున్నావు. ఇది నా అదృష్టము. నా కంట పడ్డావు. ఇప్పుడే ఈ క్షణమే నా బాణాలతో నిన్ను మృత్యుదేశానికి పంపిస్తాను" అన్నాడు. తెల్లటి మిట్టపళ్లు వేసుకొని అట్లా అరుస్తూ ఉన్న రావణాసురుణ్ణి చూచి ఏమాత్రమూ తడబడకుండా "ఓ రాక్షసుడా, పాపకృత్యాలు చేయడములో నీవు మహాదొడ్డవాడవు. ఓ రాక్షసరాజా, మహాప్రభావులు ఎవరూ నీవలె అరవరు. తమను తాము పొగడుకొనరు. ఓ నిశాచరుడా, నీ శక్తి నీ ప్రతాపమూ నేను ఎరుగుదును. నీవు ఎంతటి బలవంతుడివో ఎటువంటి పరాక్రమవంతుడవో నాకు తెలుసు. నేను శరచాపాలు పట్టుకొని నిలుచున్నాను. రా. పోరాడు. ఎందుకు ఊరక నిన్ను నీవు పొగడుకొంటావు" అని అంటూఉండగా రావణాసురుడు కుపితుడు అయి

పోయి లక్ష్మణునిమీద ఏడు బాణాలు వదిలినాడు. కరుకుగొనలతో బంగారుములుకులతో ఉన్న తన బాణాలతో లక్ష్మణుడు ఆ ఏడు బాణాలనూ నరికివేసినాడు. మహాసర్పాలు తుండ్లు తుండ్లుగా తెగిపడిపోయినట్టు తన ఏడు బాణాలు నేలమీద పడిపోవడము చూచి రావణాసురుడు క్రోధావేశముతో మరింత తీక్ష్ణము అయిన బాణాలను వదిలినాడు. అందుకు లక్ష్మణుడు ఏమాత్రమూ వ్యాకులపడలేదు. బాణవర్షము కురిపించ తలచుకొని తన ధనుస్సును మండలాకారముగా వంచి కత్తివాయి అంబులనూ అర్ధ చంద్రాకారపు అంబులనూ ఈటెలవంటి అంబులనూ వదలడము మొదలుపెట్టినాడు. అవి రావణాసురుడు వదిలే బాణాలను అన్నిటినీ నరికివేయసాగినవి.

ఆ దేవవిరోధి తాను వదిలిన బాణాలు అన్నీ వ్యర్థము అయిపోవడము చూచినాడు. లక్ష్మణుడి లాఘవానికి ఆశ్చర్యపడి పోయినాడు. మళ్ళీ లక్ష్మణుడిమీద తీక్ష్ణము అయిన బాణాలను వదిలినాడు. అప్పుడు లక్ష్మణుడు రావణాసురుణ్ణి వధించివేయ వలెను అనుకొన్నాడు. దేవేంద్రుడు వదిలే వజ్రాయుధముతోనూ పిడుగుతోనూ సరిసమానము అయిన వేగముతో భగభగ మంటలు మండుతూ పోయే బాణాలను ఆ వింటను ఎక్కించి వెంటవెంటనే రావణాసురుడిమీద వదిలినాడు. లక్ష్మణుడు వదిలిన ఆ బాణాలను అన్నిటినీ రావణాసురుడు తన బాణాలతో ఖండించివేసినాడు. అంతట ఆ రావణాసురుడు బ్రహ్మదేవుడు తనకు ఇచ్చిన ప్రళయ కాలాగ్నివంటి బాణాన్ని లక్ష్మణుడి లలాటాన్ని గురిపెట్టి వదిలినాడు. ఆ బాణమువచ్చి లక్ష్మణుడిమీద పడ్డది. ఆ బాణము దెబ్బకు లక్ష్మణుడు వణికిపోయినాడు. చేతితో పట్టుకొనిఉన్న ధనుస్సు పట్టు తప్పిపోయింది. అమితకష్టముతో తెప్పిరిల్లినాడు. తత్క్షణమే ఒక బాణము వదిలి దేవశత్రువు అయిన ఆ రావణాసురుడి చేతిలోఉన్న వింటిని విరుగగొట్టినాడు. లక్ష్మణుడు అంతటితో పోనీయలేదు. కరుకుగొనల బాణాలు మూడింటిని ఆ రావణాసురుడి మీద వదిలినాడు. వాటి దెబ్బకు ఆ దేవవిరోధి గజ గజ వణికి పోయినాడు. ఒళ్లు తెలియకుండా పోయింది. కష్టముమీద

కొంచెముసేపటికి తేరుకొన్నాడు. అయితే ఆ మహాశక్తిమంతుడి చేతిలో చాపము పోయింది. కండలు బయటపడేట్టు ఒంటినిండా గాయాలు అయినవి. దేహము అంతా నెత్తురులో తడిసిపోయింది. అంతట ఆ రాక్షస రాష్ట్రనాథుడు రావణాసురుడు తనకు బ్రహ్మదేవుడు అదివరకు ఇచ్చిన శక్త్యాయుధాన్ని తీసినాడు. వానరవాహిని అంతా భయపడిపోయేట్లు ఆ శక్త్యాయుధాన్ని చటుక్కున లక్ష్మణుడిమీద వదిలినాడు. పొగలూ గిగలూ లేకుండా మంటలు మండుతూ నిప్పులు కక్కుతూ వస్తూఉన్న ఆ శక్త్యాయుధాన్ని చూచి లక్ష్మణుడు వేల్చిన అగ్నిహోత్రమువంటి బాణాలను వదిలినాడు. అట్లా అటువంటి బాణాలు వదిలినప్పటికిన్నీ ఆ శక్త్యాయుధము వచ్చి లక్ష్మణుడి విశాలవక్షఃస్థలముమీద పడ్డది. శక్తిమంతుడు అయినప్పటికిన్నీ ఆ శక్త్యాయుధము దెబ్బకు లక్ష్మణుడి విశాలవక్షఃస్థలము మంటలు మండింది. ఆ బాధ భరించలేక పోయినాడు. మూర్ఛపోయినాడు. అది చూచి రావణాసురుడు ఆ లక్ష్మణుడిని తీసుకొనిపోవలెను అనుకొని తన చేతులతో లేవనెత్తపోయినాడు. హిమవత్పర్వతాన్ని కానీ మందరపర్వతాన్ని కానీ మేరుపర్వతాన్ని కానీ ముల్లోకాలను కానీ చేతులతో లేవనెత్తడము సాధ్యము అవుతుందో ఏమోకానీ పోరాటములో అట్లా పడిపోయిన ఆ లక్ష్మణుణ్ణి తన చేతులలో ఆ రావణాసురుడు లేవనెత్తలేకపోయినాడు. బ్రహ్మ సంబంధము అయిన శక్త్యాయుధము వక్షఃస్థలాన పడగానే తాను విష్ణుదేవుని అచింత్యాంశముగా భావించి అది తనను ఏమీ చేయలేదు అని లక్ష్మణుడు అనుకొన్నాడు. రాక్షసుల దర్పాన్ని అణచివేయడానికి మనుష్యాకారములో వైష్ణవాంశము అయినందువల్ల ఆ లక్ష్మణుణ్ణి దేవకంటకుడు అయిన రావణాసురుడు తన చేతులతో లేవనెత్తలేకపోయినాడు.

అప్పుడు వాయుసుతుడు హనుమంతుడు క్రుద్ధుడు అయిపోయినాడు. హుటాహుటి రావణాసురుడిమీదికి పరుగెత్తినాడు. వజ్రాయుధ తుల్యము అయిన తన పిడికిటితో ఆ రావణాసురుడి వక్షఃస్థలాన ఒక్కపోటు పొడిచినాడు. ఆ పిడికిలిపోటుకు ఆ రాక్షసేశ్వరుడు నిలవలేకపోయినాడు. గడ గడ వణికిపోయినాడు. మోకాళ్లు నేలమీద ఆనించి ముందుకు బోర్లా పడిపోయినాడు.

నోటిలోనుంచీ చెవులలోనుంచీ కన్నులలోనుంచీ నెత్తురు కక్కుకొన్నాడు. దేహము గిర్రున తిరుగుతూ ఉన్నట్టు తోచింది. తూలిపోతూ ఆ రథముమీద మెల్లగా కూర్చున్నాడు. కాని స్థిమితము తప్పిపోయింది. ఒళ్లు తెలియకుండా పోయింది. మూర్ఛ పోయినాడు.

భయంకర పరాక్రమముతో పోరాడే రావణాసురుడు ఆ విధముగా మూర్ఛపోవడము పైనుంచి చూచి దేవేంద్రుడూ దేవతలూ దేవర్షులూ సంతోషపడ్డారు. ఆ యుద్ధభూమిలో వానరులు అందరూ సంతోషాతిశయముతో సింహనాదాలు చేసినారు.

అప్పుడు ఆ పరమపరాక్రమవంతుడు హనుమంతుడు మూర్ఛ పోయిన లక్ష్మణుణ్ణి తన చేతులతో ఎత్తుకొని రాముడిదగ్గరకు పోయినాడు. ఆ లక్ష్మణుణ్ణి రావణాసురుడు శత్రువు అయినందువల్ల లేవనెత్తలేకపోయినాడు. కాని హనుమంతుడు పరమభక్తుడూ మిత్రుడూ అయినందువల్ల అవలీలగా ఎత్తుకొనిపోగలిగినాడు. అట్లా హనుమంతుడు ఆ లక్ష్మణుణ్ణి రాముడిదగ్గరకు తీసుకొని పోగానే ఆ శక్త్యాయుధము దానిఅంతట అదే రావణాసురుడిదగ్గరకు తిరిగి పోయింది. అప్పుడు ఆ శత్రుసూదనుడు తేరుకొన్నాడు. గాయాలు ఆరిపోయినవి. అచింత్యముఅయిన వైష్ణవాంశాన్ని స్మరించినాడు.

రావణాసురుడున్నూ మూర్ఛ తేరుకొన్నాడు. మహాచ్చాపాన్ని మళ్ళీ తీసుకొని వానరసైన్యముమీద తీక్ష్ణబాణాలను వదలడము మొదలుపెట్టినాడు. ఆ బాణాలకు గొప్పగొప్ప వానర వీరులు పడిపోవడమూ పరుగులెత్తడమూ రాముడు చూచినాడు. రావణాసురుడిమీదికి తత్క్షణమే పరుగెత్తినాడు. అప్పుడు హనుమంతుడు రాముడిదగ్గరకు పరుగెత్తిపోయి "ఓ ప్రభూ, మహావిష్ణువుకు గరుత్మంతుడు వాహనము. అదే విధముగా ఓ రామా, నీకు నేను వాహనాన్ని. నీవు ఇప్పుడు నన్ను ఆరోహించు. హాయిగా రావణాసురుణ్ణి సంహరించు" అని చెప్పినాడు.

అంతట ఆ మహాశూరుడు రాముడు ఆ మహాబలవంతుణ్ణి హనుమంతుణ్ణి ఆరోహించినాడు. పోరాటానికి రథముమీద వస్తూ

ఉన్న రావణాసురుణ్ణి ఆ మనుజాధిపుడు రాముడు చూచినాడు. బలిచక్రవర్తిని చూచిన విష్ణుమూర్తివలె ఆ మహాతేజోవంతుడు రాముడు క్రుద్ధుడు అయిపోయినాడు. తన మహాచ్చాపాన్ని ఎత్తినాడు. పిడుగుల మోతలవలె అల్లెత్రాటిని మోగించినాడు. అట్లా జ్యానాదము చేసి రావణాసురుణ్ణి చూచి "ఓ రాక్షసుడా, నిలు, నిలు. నీవు నాకు ఇంత అంత అని చెప్పనలవికాని అప్రియము చేసినావు. నీవు ఎక్కడికిపోయినా నేను నిన్ను వదిలిపెట్టను. నీవు దేవేంద్రుడిదగ్గరకు పోయినా సూర్యుడిదగ్గరకు పోయినా యముడి దగ్గరకు పోయినా బ్రహ్మదేవుడిదగ్గరకు పోయినా అగ్నిహోత్రుడి దగ్గరకు పోయినా శివుడిదగ్గరకు పోయినా నీవు దశదిశలలో ఎక్కడికి పోయినా నిన్ను వదిలిపెట్టేవాణ్ణికాను. అటువంటిది ఇప్పుడు నా ఎదుట పడ్డావు. నిన్ను విడిచిపెట్టను.

ఓ రాక్షసుడా, ఇప్పుడు నీవు శక్త్యాయుధములో ఎవణ్ణి కొట్టినావో వాడే వచ్చి నీతో పోరాడుతాడు. ఎప్పుడోకాదు, ఇప్పుడే. నిన్ను నీ పుత్రులతోనూ నీ భార్యలతోనూ వధించివేస్తాడు. ఓ రాక్షసుడా, నేను ఎవరినో చెప్పుతాను విను. జనస్థానములో నివాసము పెట్టుకొన్న భయంకరాకారులను ఆయుధధారులను పధ్నాలుగువేలమంది రాక్షసులను హతము అర్చివేసింది నేనే" అని చెప్పినాడు.

రాముడు చెప్పిన ఈ మాటలు వింటూనే రావణాసురుడు హనుమంతుడిమీద కాలానలశిఖలవంటి బాణాలు వదిలినాడు. ఆ బాణాలు తగిలి స్వభాసిద్ధముగా తేజోవంతుడు అయిన వాయుపుత్రుడు హనుమంతుడు మరింత తేజోవంతుడు అయినాడు.

రావణాసురుడి బాణాలకు హనుమంతుడి దేహము అంతా గాయాలు అయిపోవడము ఆ మహాతేజోవంతుడు రాముడు గమనించి కోపపరవశుడు అయిపోయినాడు. అంతట ఆ రావణాసురుడి రథముమీద మంచి ములుకులతో ఉన్న బాణాలను వదిలినాడు. ఆ బాణాలు తగిలీ తగలడములో ఆ రథచక్రాలు ఊడిపోయినవి. గుఱ్ఱాలు చచ్చిపోయినవి. సారథి యమలోకానికి పోయినాడు. ఆ రథముమీద ఉన్న ధ్వజమూ పతాకాలూ

ఛత్రమూ విరిగి నేల కూలినవి. ఆ రథములోఉన్న శూలాలూ ఖడ్గాలూ మొదలు అయిన ఆయుధాలు అన్నీ ముక్కలు ముక్కలుగా విరిగిపోయినవి. భగవంతుడు అయిన దేవేంద్రుడు వజ్రాయుధాన్ని మేరుపర్వతముమీద వదిలినట్లు రాముడు ఆ దేవేంద్ర శత్రువు విశాల సుజాత వక్షఃస్థలముమీద వజ్రాయుధముతోనూ పిడుగుతోనూ సరిసమానము అయిన బాణాన్ని వదిలినాడు.

అదివరకు వజ్రాయుధము వేటుకుకానీ పిడుగుపాటుకుకానీ క్షోభపడి ఎరుగని ఆ రావణాసురుడు అప్పుడు ఆ రామబాణము దెబ్బకు తాళలేని బాధపడ్డాడు. వణికిపోయినాడు. తెలియకుండా చేతిలో ధనుస్సు వదిలిపెట్టినాడు. మూర్ఛపోయినాడు. అట్లా మూర్ఛపోయిన ఆ రావణాసురుణ్ణి ఆ మహాపరాక్రమవంతుడు రాముడు చూచి ధగధగ లాడుతూఉన్న అర్ధచంద్రాకార బాణాన్ని తీసినాడు. దానిని ఆ రాక్షసాధిపతిమీద వదిలినాడు. అది అతని శిరముమీదఉన్న నవరత్నఖచిత కిరీటాన్ని పగులకొట్టింది.

రావణాసురుడు మూర్ఛ తేరుకొన్నాడు. కిరీటము అట్లా విరిగిపోయినందువల్ల ముఖాన కళకాంతులు మాసిపోయినవి. విషము పిండిన సర్పమువలెనూ జ్వాలలు ఆరిపోయిన అగ్నిహోత్రము వలెనూ కిరణాలు మాసిపోయిన సూర్యబింబమువలెనూ ఐశ్వర్యము పోయిన శ్రీమంతుడివలెనూ ఉన్న రావణాసురుణ్ణి చూచి "ఓ రావణుడా, నీవు మహాభయంకరముగా పోరాడినావు. మేటి వీరులను నావారిని కూలమార్చినావు. చాలా అలసిపోయినావు. మూర్ఛపోయినావు. నీకు ఇప్పుడు ధనుస్సు పట్టుకొనే శక్తికూడా లేదు. ఇటువంటి దశలో నిన్ను చంపివేయడము యుద్ధధర్మము కాదు. ఇప్పుడు నేను నిన్ను చంపివేసేట్లయితే నాకు లోకాపవాదము వస్తుంది. నేను ఎప్పుడూ ధర్మము తప్పను. అందువల్ల ఇప్పుడు నీమీద బాణాలు వేసి నిన్ను మృత్యువశము చేయను.

"ఓ రాత్రించరుడా, నీవు ఈ యుద్ధములో మంచి దెబ్బ తిన్నావు. బాగా బాధపడ్డావు. నేను అనుమతిస్తున్నాను. నీవు ఇప్పుడు నీ లంకాపట్టణానికి పో. నీ అలసట అంతా తీర్చుకో. మంచి ధనుస్సు తీసుకో. మంచిరథము ఎక్కు. మళ్లీ ఇక్కడికి రా.

నీవు అట్లా ధనుర్ధరుడవు అయి రథముమీద వస్తే నా బలము ఏమిటో నీకు తెలుస్తుంది '' అని రాముడు చెప్పినాడు.

ఆ రాక్షసరాజు దర్పము హతము అయిపోయింది. హర్షము హతము అయిపోయింది. గుర్రాలు హతము అయిపోయినవి. సారథి హతము అయిపోయినాడు. చేతిలో పట్టుకొన్న విల్లు విరిగి పోయింది. గుచ్చుకొన్న బాణాలు బాధపెట్టుతూ ఉన్నవి. కిరీటము ఛిన్నాభిన్నము అయిపోయింది. రాముడు అట్లా చెప్పుతూ ఉంటే రావణాసురుడికి అప్పుడు ఏమిచేయడానికీ తోచలేదు. లంకాపట్టణానికి పోయినాడు.

ఆ రజనీచరుడు ఆ మహాబలవంతుడు దేవదానవశత్రువు రావణాసురుడు అటు లంకాపట్టణానికి పోగానే రామ లక్ష్మణులు వానరవీరులకు గుచ్చుకొన్న బాణాలను పీకించి వారు బాధ పడకుండా చేసినారు.

అట్లా దేవేంద్రశత్రువు రావణాసురుడు పరాజితుడు అయిపోయినందుకు భూతగణాలూ దిక్పాలకులూ మహర్షులూ మహోరగులూ సురాసురులు—వారు వీరు ఏమిటి సమస్తజగత్తూ సంతోషించింది.

౬౦

రామబాణాలకు బాధపడుతూనూ భయపడుతూనూ రావణా సురుడు లంకాపట్టణానికి పోయినాడు. అతడి దర్పము అణగి పోయింది. దిగులుపడిపోయినాడు. సింహాన్ని చూచి పారిపోయి వచ్చిన ఏనుగువలెనూ, గరుత్మంతుణ్ణి చూచి పారిపోయివచ్చిన పామువలెనూ, ఆ మహాబలవంతుణ్ణి ఆ మహాపరాక్రమవంతుణ్ణి రాముణ్ణి చూచి భయపడిపోయి వచ్చినాడు. ఖిన్నుడు అయి పోయినాడు. పొగలూ సెగలూ లేకుండా నిప్పులు కక్కుతూ మంటలు మండే బ్రహ్మదండమువలెనూ చటుక్కున ఏ దిక్కున పడితే ఆ దిక్కున మెరిసే మెరుపుతీగవలెనూ వచ్చిపడే రామ బాణాలనుగురించి తలచుకొంటూ వ్యథపడిపోయినాడు. కుంగి పోయినాడు. బంగారుమయము అయిన దివ్యసింహాసనముమీద

కూర్చుని రావణాసురుడు రాక్షసవీరులను చూచి "ఓ వీరులారా, నేను దేవేంద్రుడితో సరిసమానము అయిన బలవంతుణ్ణి. పరాక్రమవంతుణ్ణి. అటువంటి నన్ను మానవుడు ఒకడు జయించినాడు. నేను చేసిన పరమోత్తమము అయిన తపస్సు అంతా వ్యర్థము అయిపోయినట్టేకదా.

"దేవదానవగంధర్వులుకానీ యక్షరాక్షసపన్నగులుకానీ నన్ను చంపివేయకుండా ఉండేవరము బ్రహ్మదేవుడు నాకు ఇచ్చినాడు. మానవులు నన్ను చంపివేయకుండా ఉండేవరము నేను ఆ బ్రహ్మదేవుణ్ణి అడగలేదు. అందువల్ల నాకు మరణభయము మానవుడివల్లనే అని బ్రహ్మదేవుడు నాతో చెప్పిన భయంకర వాక్యము ఇప్పుడు నాకు అనుభవానికి వస్తూ ఉంది. అది అంతే. బ్రహ్మవాక్యము తప్పదు.

"ఓ రాక్షసముఖ్యులారా, పూర్వము నేను దిగ్విజయ యాత్రకు పోయినప్పుడు ఇక్ష్వాకువంశీయుణ్ణి అనరణ్యుడు అనే రాజును చిత్రవధ చేసినాను. ఆ అనరణ్యుడు చచ్చిపోతూ నన్ను చూచి "ఓ రాక్షసాధమా, నీవు కులాధముడవు. నా వంశములో పుణ్యపురుషుడు ఒకడు పుట్టుతాడు. వాడు యుద్ధములో నీ పుత్రులతోనూ నీ మంత్రులతోనూ నీ సైన్యముతోనూ నీ గుర్రాలతోనూ నీ సారథితోనూ నిన్ను సంహారము చేసివేస్తాడు" అని ప్రతిజ్ఞచేసి చెప్పినాడు. ఆ అనరణ్యుడు చెప్పిన మహాపురుషుడే ఈ దశరథాత్మజుడు రాముడు అని నాకు తోస్తున్నది.

నేను పూర్వము వేదవతి అనే ఆమెను బలవంతముగా భంగపరచినాను. ఆ తపశ్శీలి నన్ను శపించింది. నన్ను నాశనము చేసివేస్తాను అని చెప్పింది. ఆ మహాభాగ వేదవతే ఈ జనకనందిని సీతాదేవిగా పుట్టిఉంటుంది. నేను పూర్వము కైలాస పర్వతము పెళ్ళగించినప్పుడు ఉమాదేవికి నామీద కోపమువచ్చింది. స్త్రీ నిమిత్తము నాకు చావు రావలెను అని ఆ ఉమాదేవి నన్ను శపించింది. నేను నందీశ్వరుణ్ణి అపహసించినాను. అందుకు అతడికి కోపమువచ్చి తనను పోలిన వానరులు పుట్టి నన్ను సర్వనాశనము చేసివేయవలెను అని శాపము పెట్టినాడు. నేను రంభను చూచి

మోహించినాను. కామార్తుణ్ణి అయి ఆమెను బలాత్కరించినాను. అందుకు ఆమె పెనిమిటికి కోపమువచ్చి నాకు శాపము పెట్టినాడు. వరుణకన్యక పుంజికస్థల అనే ఆమెను బలాత్కరించి మానభంగము చేసినాను. అందుకు బ్రహ్మదేవుడికి నామీద కోపమువచ్చి శాపము పెట్టినాడు. నేను బాధించిన మహర్షులు అందరూ నన్ను శపించినారు. ఆ మహర్షుల మాటలు అబద్ధాలు అయిపోవు.

"ఓ రాక్షసులారా, ఈ విషయము అంతా మీరు గమనించండి. ఇకను ఇప్పుడు జయించడానికి అవసరము అయిన ప్రయత్నమంతా మీరు చేయండి. పురద్వారాలలోనూ భట సంచారప్రదేశాలలోనూ గోపురశిఖరాలలోనూ మీరు కావలి కాయండి. దేవదానవుల దర్పాన్ని అణగత్రొక్కిన కుంభకర్ణుడు అప్రతిమాన గంభీరుడు. వాడు ఇప్పుడు నిద్రపోతున్నాడు. ఇప్పుడే కాదు. వాడు బ్రహ్మ శాపమునుంచి ఎప్పుడూ నిద్రపోతూనే ఉంటాడు. ఆ కుంభకర్ణుణ్ణి నిద్ర లేపవలెను" అని చెప్పుతూ ఆ మహాబలవంతుడు రావణాసురుడు ప్రహస్తుడు చచ్చిపోవడమూ తాను ఓడిపోయి రావడమూ తలచుకొని కుంభకర్ణుణ్ణి నిద్రలేపడానికి ఆ భయంకర రాక్షసయోధులతో "ఓ వీరులారా, మీరు రాజభవన ద్వారములలో కావలి ఉండవలెను. అంతేకాదు. నగర ప్రాకారము యెక్కి కావలి కాయవలెను. మీలో కొందరు పోయి నిద్రాపరవశుడు అయిఉన్న కుంభకర్ణుణ్ణి నిద్ర లేపండి. నేను యిక్కడ ఈ దశలో ఉంటూఉంటే వాడు సుఖముగా నిశ్చింతగా నిద్రపోతున్నాడు. కాలకర్మమువల్ల వాడు ఆరు నెలలూ ఏడునెలలూ ఎనిమిది తొమ్మిదినెలలూ నిద్రపోతూ ఉంటాడు. ఇప్పటికి తొమ్మిది దినాలకిందట యుద్ధాలోచనసభలో కుంభకర్ణుడు జరగవలసినదానినిగురించి చర్చించి నిర్ణయించి వెళ్ళిపోయినాడు. వాడు ఇటీవలనే నిద్రపోవడానికి మొదలుపెట్టినాడు. కనుక లేపితే వాడు నిద్ర లేస్తాడు. వాణ్ణి ఆ మహాబలవంతుణ్ణి నా తమ్ముణ్ణి కుంభకర్ణుణ్ణి మీరు ఇప్పుడే నిద్ర లేపండి. వాడు ఆ మహాబాహువు నావలె శాపగ్రస్తుడుకాడు. అందువల్ల వాణ్ణి నరులుకానీ వానరులుకానీ చంపివేస్తారు అనే భయములేదు.

అంతేకాదు. మన రాక్షసవీరులు అందరిలోనూ వాడు ప్రధానము అయినవాడు. వాడు యుద్ధభూమిలో ధ్వజమువంటివాడు. పోరాటములో వానరులనూ రామలక్ష్మణులనూ వాడు తప్పకుండా చంపివేస్తాడు. అయితే తెలివితేనివాడు. గ్రామ్యసుఖాలలో పడి ఎప్పుడూ నిద్రపోతూఉంటాడు. మహాదారుణము అయిన ఈ యుద్ధములో రాముడు నన్ను అవమానించినాడు. ఇప్పుడు కుంభకర్ణుడు నిద్ర లేచివచ్చేట్లయితే నా దుఃఖము తీరిపోతుంది. ఇటువంటి కష్టకాలములో వాడు నాకు తోడుపడకపోయేట్లయితే దేవేంద్రుడితో సరిసమానము అయిన పరాక్రమవంతుడు అయినప్పటికీన్నీ నాకు వాడితో ఏమి ప్రయోజనము? కాబట్టి వాణ్ణి మీరు వెంటనే నిద్ర లేపండి.'' అని చెప్పినాడు.

ఈ చెప్పింది అంతా రాక్షసవీరులు విన్నారు. రక్తమాంసాహారులు అయిన ఆ రాక్షసులు అంతట పూలదండలనూ సుగంధద్రవ్యాలనూ పిండివంటలనూ తీసుకొని అమితవేగముతో కుంభకర్ణుడి ఇంటికి పోయినారు. మహాద్వారములో ఒకటిన్నర యోజనము వైశాల్యముతో రమణీయము అయిన కుంభకర్ణుడి గృహములోకి ఆ రాక్షసయోధులు అందరూ పోయినారు. ఆ నిశాచరుడు నిద్రపోతూఉన్న ఆ గుహాకార గృహములోనుంచి సుగంధవాసనలు ప్రవాహాలుగా వస్తూ ఉన్నవి. ఆ భయంకరుడిదగ్గరకు పోబోయినారు. నిద్రపోతూఉన్న ఆ కుంభకర్ణుడి నిట్టూర్పుల ఉరవడికి వాండ్లు ముందుకు పోలేకపోయినారు. ఆ నిట్టూర్పులగాలి వాండ్లను వెనకకు తోసివేయడము మొదలుపెట్టింది. మహాప్రయత్నము చేసి మహాకష్టముమీద లోపలికి పోయినారు. ఆ గుహాకార గృహము బంగారు చపటాలతోనూ మంగళద్రవ్యాలతోనూ మనోహరముగా కనిపించింది. అక్కడ శయ్యమీద ఆరాక్షసవ్యాఘ్రము ఆ భయంకరాకారుడు కుంభకర్ణుడు నేల కూలిన పర్వతమువలె సర్వాంగాలూ చాచుకొని పెద్ద కిరీటముతోనూ బంగారు బాహుపురులతోనూ వికృతముగా లేపడానికి అలవికాకుండా మహానిద్ర పోతున్నాడు. ఒంటిమీద వెంట్రుకలు నిక్కపొడుచుకొని ఉన్నవి. పాము బుసలుకొట్టేట్టు భయంకరముఅయిన నాసారంధ్రాలలోనుంచీ పాతాళమువంటి విశాలముఅయిన నోటిలోనుంచీ ఊపిరి

వదులుతున్నాడు. ఆ ఊపిరి అరడు తిన్న మేదోరుధిరవాసనలు కొడుతూ ఉంది. లేపడానికి అలవి కాకుండా అట్లా నిద్రపోతున్న ఆ రాక్షసవ్యాఘ్రాన్ని కుంభకర్ణుణ్ణి ఎంత లేపినా ప్రయోజనము లేక పోయింది.

ఆ కుంభకర్ణుణ్ణి నిద్రలేవగానే తృప్తిపరచడానికి అతనికి ఎట్టఎదుట మేరువుపర్వతము అంత ఎత్తున జింకల మాంసాన్నీ ఎనుపోతుల మాంసాన్నీ అడవిపందుల మాంసాన్నీ ఆశ్చర్యకరము అయిన అన్నపురాశులనూ ఉంచినారు. నిండా నెత్తురు ఉన్న బానలనూ ఇంకా నానావిధ మద్యభాండాలనూ ఉంచినారు. అంతట ఆ శత్రుసంహారకుడి ఒంటినిండా ఘుమఘుమలాడే చందనము పూసినారు. దివ్య సుగంధము గుబాళించే పూలదండలు అతడి మెడలో వేసినారు. సుగంధధూపము వేసినారు. అతణ్ణి స్తోత్రము చేసినారు. మేఘాలు ఉరుములు ఉరిమేటట్టు పెద్దపెట్టున అరిచినారు. చంద్రబింబమువంటి పెద్ద పెద్ద శంఖాలు పూరించినారు. ప్రయోజనము లేకపోయింది. కుపితులు అయిపోయి అందరూ ఒక్కసారిగా ఎడతెగకుండా అరిచినారు. చేతులతో తట్టినారు. కదిలించినారు. మళ్లీ మహాధ్వని చేసినారు. కుంభకర్ణుడు నిద్ర లేవలేదు.

అట్లా దుందుభులూ పణవాలూ మోగిస్తూనూ శంఖాలు పూరిస్తూనూ సింహనాదాలు చేస్తూనూ ఉంటే అయిన మహాధ్వనులకు పక్షులు దిక్కులు తెలియకుండా పయికి ఎగిరిపోయినవి. ఎంత ఎత్తు ఎగిరినా ఆ మహాధ్వనులు ఆగలేదు. ఆ మహాధ్వనులకు భయము వదలక అట్లా ఎంతో ఎత్తు ఎగిరిపోయిన పక్షులు అక్కడ నిలువలేక కింద పడిపోయినవి.

ఆ రాక్షసయోధులు అందరూ అట్లా ఏకము అయి ఎంత అరిచినా ఆ కుంభకర్ణుడు నిద్ర మేల్కొనలేదు. అంతట ఆ రాక్షస యోధులు ఆ కుంభకర్ణుణ్ణి అరచేతులతో చరిచినారు. పిడికిళ్లతో పొడిచినారు. గుద్దినారు. ఆ దెబ్బలకు ఆ కుంభకర్ణుడు నిద్ర లేవకపోవడము అట్లా ఉండగా ఊపిరి మరింత ఉరవడిగా వదులుతూ ఉంటే ఆ రాక్షసులు అక్కడ నిలవడమే కష్టము అయిపోయింది.

అంత ఆ భయంకరులు ఇనుప గుదియలూ ముసలాలూ గదలూ ముద్గరాలూ తీసుకొని కొట్టినారు. పర్వతశిఖరాలూ వృక్షాలూ పెళ్ళగించుకొని వచ్చి ఆ కుంభకర్ణుణ్ణి కొట్టినారు. ఏమిచేసినా అతడు నిద్ర లేవలేదు. అప్పుడు అక్కడ ఒక పదివేలమంది రాక్షసులు చేరి ఏకకాలాన భేరీలూ పణవాలూ మృదంగాలూ భయంకరముగా మోగించినారు. అతడు నిద్ర లేవలేదు. అంతట ఆ పదివేల మంది రాక్షసులూ ఒక్కసారిగా శంఖాలు పూరించినారు. కాటుక కొండలవంటి ఆ రాక్షసులు పెద్దపెట్టున అరుస్తూ కొట్టుతూ ఎంత లేపినా ఆ కుంభకర్ణుడు నిద్ర లేవలేదు.

ఏమిచేసినా కుంభకర్ణుడు నిద్ర లేవకపోయినందువల్ల ఆ రాక్షసయోధులు మరింత భయంకరము అయిన ప్రయత్నము తలపెట్టినారు. కొంతమంది భేరీ పణవ మృదంగ శంఖధ్వనులు చేస్తూఉంటే కొంతమంది గుర్రాలను కొరడాలతో కొట్టి గాడిదలను కర్రలతో బాదీ ఏనుగులను అంకుశాలతో పొడిచీ ఆ కుంభకర్ణుడి మీదికి తోలినారు. మరింత మహాధ్వని చేసినారు. ఆ మహాధ్వనికి లంకాపట్టణ పర్వతాలూ వనాలూ కదిలిపోయినవి కాని కుంభకర్ణుడుమాత్రము నిద్ర మేలుకోలేదు.

బంగారు దండాలతో భేరీలను అన్నిటినీ ఏకకాలాన మోగించినారు. బ్రహ్మశాపమువల్ల కుంభకర్ణుడు నిద్ర లేవలేదు. రాక్షసులు అందరూ కుపితులు అయిపోయినారు. కొంతమంది అతడిని లేపడానికి తమ పరాక్రమాన్ని ప్రదర్శించినారు. కొందరు భేరీలు మోగించినారు. కొందరు సింహనాదాలు చేసినారు. కొందరు అతడి జుట్టు పీకినారు. అతడి చెవులు కొరికినారు. వందలకొద్దీ బానలనిండా నీళ్ళు తీసుకొని వచ్చి అతడి చెవులలో పోసినారు. వాండ్లు ఎవండ్లు ఏమిచేసినా మహానిద్రలో ఉన్న ఆ కుంభకర్ణుడు మేలుకోలేదు. కదలను అయినా కదలలేదు. అంతట కొందరు బలవంతులు కూటముద్గరాయుధాలు తీసుకొని అతడి తల మీద కొట్టినారు. అన్ని అవయవాలమీద దెబ్బలు వేసినారు. శతఘ్నులతో ఆ మహాకాయుడి దేహము అంతటా కొట్టినారు. అతడికి మెలకువ రాలేదు. అంతట ఒక వెయ్యేనుగులను అతడి

మీదికి తోలినారు. వాటిచేత అతణ్ణి తొక్కించినారు. అప్పుడు ఏదో చిన్నపురుగు తనమీద పాకుతూఉన్నట్టుగా కన్నులు తెరిచినాడు. పర్వతశిఖరాలతోనూ వృక్షాలతోనూ కొట్టిన దెబ్బలను గురించి తెలుసుకోకుండా ఆవలిస్తూ నిద్ర లేచినాడు. ఆ నిశాచరుడు కుంభకర్ణుడు పర్వతశిఖరాలవలె కఠినముగానూ మహాసర్పాలవలె పొడుగుగానూ ఉన్న చేతులు విదలించుకొంటూ ఆవలించడానికి మంటలు మండుతూ ఉండే బడబాముఖమువంటి నోరు వికృతముగా తెరిచినాడు. పాతాళద్వారమువంటి ఆ నోరు తెరిచి ఆవలిస్తూఉంటె అది మేరుపర్వతముమీద ఉదయిస్తూఉన్న సూర్యుడివలె కనిపించింది. ఒళ్ళు విరుచుకొంటూ ఆవలిస్తూ ఆ కుంభకర్ణుడు వదలిన నిట్టూర్పులు కొండగుహాలనుంచి వచ్చే పెద్ద గాలివలె వీచింది. వానాకాలములో కొక్కెరలు బారులుకట్టి తిరుగుతూ ఉంటే వాన కురవపోయే మహామేఘమువలె వంకరటింకర హారాలతో ఆ నిశాచరుడి ఆకారము అగుపించింది. అగ్నికణాలవలెనూ ఆకాశములో (శన్యంగారక) గ్రహాలవలెనూ ఆ రాక్షసుడి కన్నులు కనిపించినవి.

నిద్ర లేచి అట్లా దేహము విదిలించుకొంటూ "ఆకలి. ఆకలి వేస్తూఉంది" అని అరిచిన ఆ కుంభకర్ణుడికి రాక్షసయోధులు అప్పుడు నానావిధభక్ష్యాలనూ వరాహమాంసరాశులనూ మహిషమాంసరాశులనూ చూపించినారు. మంచి ఆకలి వేసినందువల్ల ఆ మాంసరాశులను భక్షించి వేస్తూ దాహము వేసినందువల్ల బానలనిండా ఉంచిన నెత్తురు తాగినాడు. అప్పుడు కుంభకర్ణుడు తృప్తి చెందినాడు అని తెలుసుకొని ఆ రాక్షసయోధులు అందరూ అతడిని సమీపించి సాష్టాంగనమస్కారము చేసినారు. చుట్టూ నిలుచున్నారు. కలకపారిన కన్నులు మూస్తూ తెరుస్తూ వారిని అందఱినీ చూచినాడు. తనను మేలుకొలిపినందుకు ఆశ్చర్యపడుతూ ఆ నిశాచరుడు "ఓ యోధులారా, మీరు ఎందుకు నన్ను నిద్రలేపినారు? నన్ను లేపవలసినంత ఆవసరము మీకు ఏమివచ్చింది? రాజు కుశలముగా ఉన్నాడుకదా! మా అన్న దేనికిఅయినా భయపడుతున్నాడా! మీరు తొందరపడి ఎందుకు నన్ను లేపినారు. తెలుస్తూనే ఉంది. శత్రువులవల్ల పరమభయావస్థ వచ్చిఉంటుంది.

అందువల్లనే నన్ను నిద్రలేపినారు. నేను ఇప్పుడే ఆ శత్రువులను అందరినీ సంహారము చేసివేస్తాను. సందేహించవద్దు. నేను ఏవిధము అయిన భయమూ లేకుండా చేసివేస్తాను. దేవేంద్రుణ్ణి అయినా పడగొట్టుతాను. అగ్నిహోత్రుణ్ణి అయినా ఆర్పివేస్తాను. మా అన్న ఏదో స్వల్పకారణానికి నన్ను లేపమనలేదుకదా. నన్ను నిద్రలేపడానికి యథార్థకారణము ఏమిటో చెప్పండి" అని అడిగినాడు.

ఇట్లా పూనికతో అడిగిన ఆ మహాబలవంతుడికి కుంభకర్ణుడికి నమస్కారముచేసి రావణాసురుడి మంత్రి యూపాక్షుడు అనేవాడు "ఓ రాజా, దేవతలవల్ల ఏ కొంచెము భయమూ లేదు. ఇప్పుడు మానవుడివల్ల పెద్దభయము వచ్చిపడి బాధ పెట్టుతూ ఉంది. దైత్యదానవులవల్ల ఎన్నడూ ఇంతభయము ఎరగము. పర్వతాకారులు అయిన వానరులు ఇప్పుడు లంకా పట్టణాన్ని ముట్టడించినారు. సీతాపహరణమువల్ల కోపము వచ్చిన రాముడినుంచి ఇంతభయము వచ్చిపడ్డది. ఇదివరకు ఒక్క వానరుడు వచ్చి అక్షకుమారుణ్ణి చతురంగబలాలతో చంపివేసి లంకాపట్టణాన్ని దగ్ధము చేసిపోయినాడు. సూర్యుడివంటి కాంతి మంతుడు రాముడు దేవతలను జయించిన మీ అన్నను రావణ ప్రభువును ఇప్పుడు యుద్ధములో జయించినాడు. మన ప్రభువు చచ్చిపోయినాడు అనుకొని ఆ రాముడు వదిలిపెట్టినాడు. దైత్యులూ దానవులూ ఏమీచేయలేకపోయిన మన ఏలికను రావణుణ్ణి ఇప్పుడు రాముడు జయించినాడు. బ్రతికి ఉన్నాడో లేదో అనే సందేహమువల్లనే రాముడు యుద్ధభూమిలోనుంచి రావణుణ్ణి విడిచిపెట్టినాడు" అని చెప్పినాడు.

యూపాక్షుడు చెప్పిన ఈ మాటలు కుంభకర్ణుడు విన్నాడు. యుద్ధములో తన అన్న రావణుడు ఓడిపోయినాడు అన్నందుకు అతడికి పెద్దకోపము వచ్చింది. గుడ్లు తిప్పుతూ "ఓ యూపాక్షుడా, నేను ముందు ఆ రామలక్ష్మణులనూ ఆ వానరసైన్యాన్నీ సంహారము చేసివేస్తాను. ఆ తరువాత పోయి మా అన్నను చూస్తాను. వానరుల రక్తమాంసాలతో రాక్షసులను తృప్తి

పడుస్తాను. ఆ రామలక్ష్మణుల నెత్తురు నేను స్వయముగా దాహము తాగుతాను" అన్నాడు.

ఇట్లా కోపము పెచ్చుపెరిగిపోయి ఒళ్ళు తెలియకుండా గర్వముతో మాట్లాడుతూ ఉన్న కుంభకర్ణుణ్ణి రాక్షసయోధులలో ముఖ్యుడు అయిన మహోదరుడు చేతులు జోడించి "ఓ మహాబాహూ, నీవు రావణుడు చెప్పేది ముందు విను. గుణదోషాలు ఆలోచించు. ఆ తరువాత యుద్ధములో శత్రువులను జయించు" అని చెప్పినాడు.

ఈ విధముగా మహోదరుడు చెప్పింది విని కోపముతో ఆ మహాబలవంతుడు ఆ మహాపరాక్రమవంతుడు కుంభకర్ణుడు లేచినాడు.

ఆ భయంకరనేత్రుణ్ణి ఆ భయంకరాకారుణ్ణి ఆ భయంకర పరాక్రమవంతుణ్ణి కుంభకర్ణుణ్ణి నిద్రలేపి అప్పటికి జరిగింది అంతా రాక్షసమంత్రులు విన్నవిస్తూ ఉంటే రాక్షసయోధులు అమిత వేగముతో పోయి సింహాసనముమీద కూర్చునిఉన్న రావణాసురుణ్ణి చూచి చేతులు జోడించి నమస్కారము చేసి "ఓ రాజా, నీ తమ్ముణ్ణి కుంభకర్ణుణ్ణి నిద్రలేపినాము. ఇటునుంచే అతణ్ణి యుద్ధము చేయడానికి పొమ్మంటావో ఇక్కడికి వచ్చి నిన్ను చూచి పొమ్మంటావో చెప్పు" అని అడిగినారు.

రావణాసురుడు సంతోషించినాడు. ఆ రాక్షసయోధులతో "ఓ యోధులారా, నేను కుంభకర్ణుణ్ణి చూడవలెనని అనుకొంటున్నాను. వాణ్ణి మీరు యథాన్యాయముగా గౌరవించి ఇక్కడికి పిలుచుకొని రండి" అని రావణాసురుడు చెప్పినాడు. "అట్లాగేను" అని చెప్పి ఆ రాక్షసయోధులు మళ్ళీ కుంభకర్ణునిదగ్గరకు పోయి "ఓ కుంభకర్ణుడా, సర్వరాక్షసపుంగవుడు మన ఏలిక రావణుడు నిన్ను ఇప్పుడు చూడవలెనని అనుకొంటున్నాడు. ఓ రాజా, నీవు ఆయన కోరినట్లు వచ్చి సంతోషపెట్టు" అని చెప్పినారు. "అట్లాగేను" అని ఆ మహాబాహువు ఆ దుర్ధర్షుడు అన్నగారి ఆజ్ఞను శిరసా వహించడానికి శయ్యమీదినుంచి లేచినాడు. సంతోషముగా ముఖము కడుగుకొన్నాడు. స్నానము చేసినాడు. అలంకరించుకొన్నాడు. దాహము వేసినందువల్ల బలవర్ధకము అయిన మద్యాన్ని

వెంటనే తీసుకొని రమ్మని తొందరచేసినాడు. అప్పుడు ఆ రాక్షసయోధులు నానావిధమద్యాలూ కుండలనిండా తీసుకొని పోయి ఆ కుంభకర్ణుడికి సమర్పించినారు. అతడు అప్పుడు రెండువేల కుండల మద్యము తాగినాడు. రావణుడిదగ్గరకు బయలుదేరినాడు. కొంచెము ఎక్కువగా తాగినందువల్ల కైపు ఎక్కి ఆ తేజోవంతుడు సంతోషాతిశయముతో తూలుతూ ప్రళయకాలములో సర్వలోకాలనూ సర్వనాశనము చేసివేయడానికి కింకరులను వెంటపెట్టుకొనిపోయే యముడివలె రాక్షసయోధసమూహాలను వెంటపెట్టుకొని భూమి వణికిపోయేట్లు అడుగులు వేస్తూ నడిచినాడు. సూర్యుడు తన కిరణాలతో ఈ భూమిని తేజరిల్ల చేసేటట్లు ఆ మహాపరాక్రమవంతుడు కుంభకర్ణుడు తన దేహకాంతులతో ఆ రాజవీధిని అంతా వెలుగుచేస్తూ పౌరజనుల నమస్కారాలు అందుకొంటూ బ్రహ్మదేవుణ్ణి చూడపోయే దేవేంద్రుడివలె రావణాసురుడి ఇంటికి పోయినాడు.

లంకాపట్టణము వెలుపల ఉన్న వానరయోధులు అందరూ ఆ లంకాపట్టణ రాజవీధిన పోతూఉన్న ఆ శత్రుసంహర్తను ఆ అప్రమేయబలవంతుణ్ణి ఆ పర్వతాకారుణ్ణి కుంభకర్ణుణ్ణి చూచినారు. భయపడ్డారు. కొందరు దిగులుపడ్డారు. కొందరు అటూ ఇటూ పరుగులెత్తినారు. కొందరు భయార్తులయి నేలమీద పడుకొన్నారు. కొందరు శరణ్యుడు అయిన రాముడి శరణు చొచ్చినారు.

౬౧

ఆ మహాకాయుణ్ణి కుంభకర్ణుణ్ణి ఆ మహాతేజోవంతుడు రాముడు చూచినాడు. ధనుర్ధరుడు అయినాడు.

పూర్వము శ్రీమన్నారాయణమూర్తి త్రివిక్రమావతారములోవలె ఆకాశాన్ని అతిక్రమించిన ఆ పర్వతాకారుణ్ణి ధగధగలాడుతూ ఉన్న కిరీటముతోనూ బంగారు బాహుపురులతోనూ వివిధకాంచనాభరణాలతోనూ వాన కురవడానికి మెరుపులు మెరుస్తూ ఉన్న నీలమేఘమువలె కనపడుతూ ఉన్న ఆ రాక్షసుణ్ణి కుంభకర్ణుణ్ణి చూచి వానరసైనికులు మళ్లీ పరుగెత్తసాగినారు.

అట్లా పరుగులెత్తి పారిపోతూ ఉన్న వానరులనూ అట్లా పర్వతాకారముతో వస్తూ ఉన్న ఆ రాక్షసుణ్ణి చూచి రాముడు ఆశ్చర్యపడిపోయినాడు. అంతట విభీషణుణ్ణి చూచి "మిత్రుడా, ఇప్పుడు లంకాపట్టణ రాజవీధిలో కనపడుతూ ఉన్న ఆ పర్వతాకారుడు ఎవడు? వాడి శిరస్సున కిరీటము ఉంది. మెరుపులు మెరుస్తూ ఉన్న మేఘమువలె కపిలనేత్రాలతో కన్నులు మిరుమిట్లు గొలుపుతున్నాడు. ఆ వీరుడు ఎవడు! ఈ లంకాపట్టణానికి వాడు ధ్వజముమాదిరిగా కనపడుతున్నాడు. వాణ్ణి చూచి ఎక్కడ ఉన్న వానరులు అక్కడనుంచి పరుగులెత్తి పోతున్నారు. వాడు ఎవడు! రాక్షసుడా, అసురుడా! వాడు ఎవడో చెప్పు. నేను ఇదివరకు ఎన్నడూ ఇటువంటి భూతాన్ని చూడలేదు" అని అడిగినాడు.

రాముడు ఎటువంటి కష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసి వేస్తాడు. అటువంటివాడు ఈవిధముగా అడుగగానే సమస్తమూ తెలిసిన విభీషణుడు "రామా, వీడు విశ్రవసుకి పుత్రుడు, పేరు కుంభకర్ణుడు. వీడే ఈ పరాక్రమవంతుడే దేవేంద్రుణ్ణీ యముణ్ణీ యుద్ధములో జయించినాడు. ఈ కుంభకర్ణుడి ఒడ్డూ పొడుగూ ఉన్న రాక్షసుడు మరిఒకడు లేడు. వీడు వేలకువేలు దేవదానవ రాక్షసులనూ గంధర్వకిన్నరోరగవిద్యాధరులనూ అనేకమార్లు యుద్ధములో జయించినాడు. ఈ మహాబలవంతుణ్ణి ఈ విరూపాక్షుణ్ణి ఈ శూలపాణిని దేవతలు వధించివేయలేకపోయినారు. పయిగా వీడు యముడుఏమో ననుకొని భ్రమపడ్డారు. ఈ మహాబలవంతుడు కుంభకర్ణుడు స్వభావసిద్ధముగా పరాక్రమవంతుడు. తక్కిన రాక్షసులు బ్రహ్మరుద్రాదులను మెప్పించి వారి వరదానము వల్ల బలవంతులూ పరాక్రమవంతులూ అయినారు. వీడు అట్లా కాదు. పుట్టడమే వీడు మహాబలవంతుడుగా పుట్టినాడు. పుట్టగానే వీడికి ఆకలివేసింది. అంతట అనేకవేల ప్రాణులను భక్షించివేయడము ఆరంభించినాడు. అట్లా ప్రాణికోటిని భక్షిస్తూఉంటే ప్రజలు అందరూ భయపీడితులు అయిపోయి దేవేంద్రుడి శరణుచొచ్చినారు. అప్పుడు దేవేంద్రుడు కుపితుడు అయిపోయి వీణ్ణి తన తీక్ష్ణ వజ్రాయుధముతో కొట్టినాడు. ఆ దెబ్బకు వీడు కొంచముసేపు

వణికిపోయినాడు. అంతట కోపముతో రేగి సింహనాదము చేసినాడు. ఆ భయంకర సింహనాదానికి ప్రాణికోటి మరింతభయపడిపోయింది. అప్పుడు ఈ మహాబలవంతుడు కుంభకర్ణుడు చెలరేగి దేవేంద్రుడి ఐరావతదంతాన్ని ఊడపెరికి దానితో దేవేంద్రుడి వక్షఃస్థలముమీద కొట్టినాడు. ఆ వేటుకు దేవేంద్రుడు ఆర్తుడు అయిపోయినాడు. అందుకు దేవర్షులూ బ్రహ్మర్షులూ దుఃఖపడ్డారు. దేవేంద్రుడు అంతట ప్రజలను వెంటపెట్టుకొని బ్రహ్మదేవుడివద్దకు పోయినాడు. కుంభకర్ణుడు ప్రజలను భక్షించివేయడమూ దేవతలను అవమానించడమూ ఋష్యాశ్రమాలను ధ్వంసముచేయడమూ పరదారలను పట్టుకొనిపోవడమూ మొదలు అయిన దుష్టచేష్టలు చేయడము ప్రజలూ దేవేంద్రుడూ బ్రహ్మదేవుడితో చెప్పుకొన్నారు.

"ఈ ప్రకారముగా కుంభకర్ణుడు ఎప్పుడూ ప్రజలను భక్షించివేస్తూ ఉండేట్లయితే అచిరకాలములోనే ఈ జగత్తు అంతా జనశూన్యము అయిపోతుంది" అని దేవేంద్రుడు చెప్పినాడు.

"సర్వలోకపితామహుడు ఆ బ్రహ్మదేవుడు ప్రజలూ దేవేంద్రుడూ చెప్పుకొన్నది అంతా విని రాక్షసులను పిలిపించినాడు. కుంభకర్ణుణ్ణి చూచినాడు. వాణ్ణి చూచి బ్రహ్మదేవుడు కూడా భయపడ్డాడు. అంత ధైర్యము తెచ్చుకొని "ఓ కుంభకర్ణుడా, నీవు నిజముగా ఈ లోకాన్ని అంతా నాశనము చేసివేయడానికి విశ్రవసుడికి పుట్టినట్టు ఉన్నావు. నేను ఇది ఒప్పను, ఇకను ఇంతటినుంచి నీవు ఎప్పుడూ చచ్చిపోయినవాడివలె పడుకొని నిద్రపోతూ ఉండవలెను" అని శాపము పెట్టినాడు.

బ్రహ్మదేవుడు అట్లా శాపము పెట్టగానే కుంభకర్ణుడు అక్కడనే బ్రహ్మదేవుడి ఎట్టఎదటనే పడిపోయినాడు. అప్పుడు రావణుడు భయభ్రాంతుడు అయిపోయి బ్రహ్మదేవుణ్ణి చూచి "ఓ ప్రజాపతీ, బంగారుచెట్టు పండ్లు పండపోతూ ఉంటే నరికివేస్తున్నావు. వీడు నీ మునిమనుమడు. నీవు ఇట్లా శాపము పెట్టడము అన్యాయము. నీ మాట దబ్బర అయిపోదు. వీడు ఇక నిద్రపోతూనే ఉంటాడు. సందేహములేదు. అయితే వీడు నిద్రపోవడానికీ మేలుకొని ఉండడానికీ నీవు కాలనిర్ణయము చేయవలెను" అని వేడుకొన్నాడు.

అప్పుడు బ్రహ్మదేవుడు "ఓ రావణుడా, వీడు ఈ కుంభకర్ణుడు ఆరుమాసములు నిద్రపోతూనూ ఒక్కదినము మేలుకొంటూనూ ఉంటాడు. మేలుకొనిఉండే ఒక్కదినమూ ఆకలితో నోరుతెరుచుకొని తిరుగుతూ అగ్నిహోత్రుడివలె కోపముతో కంటికి కనపడే సర్వాన్నీ భక్షించివేస్తాడు" అని చెప్పినాడు. ఇది కుంభకర్ణుడి విషయము.

"ఓ రామా, నీ పరాక్రమానికి రావణాసురుడు భయపడిపోయినాడు, దిగులుపడ్డాడు. ఆపన్నుడు అయిపోయినాడు. అందువల్ల కుంభకర్ణుణ్ణి నిద్ర లేవకొట్టించి ఉంటాడు. వీడు ఈ శూరుడు కుంభకర్ణుడు భయంకర పరాక్రముడు. ఇప్పుడు పరమక్రుద్ధుడు అయిపోయి వానరులను అందరినీ భక్షించివేయడానికి తన ఇంటిలో నుంచి పరుగెత్తుకొని వస్తూఉన్నాడు. వీణ్ణి చూచి వానరులు ఇప్పుడే పరుగులెత్తి పారిపోతున్నారు. ఇక వీడు కోపముతో చెలరేగితే వానరులు యుద్ధములో వీణ్ణి ఏమి ఎదిరిస్తారు! అందువల్ల వానరులతో 'ఇది పయికిఎత్తిన ఒక యంత్రము అనీ, రాక్షసుడు కాడు అనీ' నీవు చెప్పవలెను. నీవు చెప్పితే అవును అనుకొని వానరులు నిర్భయముగా వీడితో పోరాడకలుగుతారు" అని చెప్పినాడు.

విభీషణుడు ఇట్లా చక్కగా యుక్తియుక్తముగా చెప్పింది విని రాముడు వానరసేనానాయకుణ్ణి నీలుణ్ణి చూచి "నీలుడా, నీవు నీ తండ్రి అగ్నిహోత్రుడు అంతటివాడవు. రాక్షసులు మనమీదికి వస్తారు. నీవు ఇప్పుడు నిర్భయముగా సమస్త సైన్యాలను వ్యూహముపన్ని ఉంచు. లంకాపట్టణ ద్వారాలనూ చర్యాగృహాలనూ కోట దిడ్డివాకిళ్ళనూ మన సైన్యాలు ముట్టడించవలెను. పర్వతశిఖరాలనూ, వృక్షాలనూ ఇంకా ఇతర శిలలనూ, తెప్పించి సిద్ధముగా ఉంచు. వానరయోధులు అందరూ పర్వతశిఖరాలు మొదలు అయిన ఆయుధాలతో యుద్ధసన్నద్ధులు అయి ఉండవలెను" అని చెప్పినాడు.

రామాజ్ఞను శిరసావహించి ఆ వానరసేనానాయకుడు నీలుడు వానరసైన్యాన్ని వ్యూహాలు పన్నినాడు. పర్వతాకారులు అయిన హనుమంతుడూ అంగదుడూ గవాక్షుడూ శరభుడూ

అప్పుడు పర్వతశిఖరాలు చేతులలో పట్టుకొని లంకాపట్టణ ద్వారము మీదికి పోయినారు. వానరయోధులు శత్రువులను మర్దించడానికి మహోత్సాహముతో చెట్లూ రాళ్ళూ తీసుకొని యుద్ధానికి సిద్ధము అయినారు.

మహాపర్వతాన్ని ఆవరించే మేఘ సమూహమువలె నానావిధ శిలలూ తీసుకొని భయంకరమూ అయిన వానరవాహిని లంకాపట్టణ ద్వారాన్ని కమ్ముకొన్నది.

౬౨

రాక్షసులలో పెద్దపులివంటి ఆ మహాపరాక్రమవంతుడు కుంభకర్ణుడు తన ఆభరణాల ధగధగలతోనూ దేహకాంతుల తోనూ తేజరిల్లుతూ నిద్రమత్తుతో తూలుతూ వెంట వేలకొద్ది రాక్షసులు వస్తూఉంటే ఆ లంకాపట్టణ రాజవీధిలో నడువసాగి నాడు. అప్పుడు ఆ పరమదుర్జయుడిమీద ఆ రాజవీధిలో ఉన్న గృహాలలోనుంచి పూలవాన కురిసింది. బంగారు కిటికీలతో సూర్య మండలమువలె కన్నులు మిరుమిట్లుకొలుపుతూ విశాలమూ రమ ణీయమూ అయిన రాక్షసరాజభవనములోకి మేఘసమూహాలలోకి పోయే సూర్యుడివలె కుంభకర్ణుడు పోయినాడు. దూరమునుంచే ఆ మహాబలవంతుడు సింహాసనముమీద కూర్చునిఉన్న తన అన్నను రావణాసురుణ్ణి దేవేంద్రుడు కమలాసనముమీద కూర్చున్న బ్రహ్మ దేవుణ్ణి చూచినట్టు చూచినాడు. రాక్షససమూహాలతో నిండిఉన్న ఆ రాజభవనములోకి కుంభకర్ణుడు అట్లా పోతూఉంటే అతని పాదన్యాసానికి భూమి వణికిపోయింది.

కుంభకర్ణుడు అట్లా ఆ యా కక్ష్యలు అన్నీ దాటుకొంటూ పోయి పుష్పకవిమానములో సింహాసనముమీద కూర్చుని దిగులు పడుతూఉన్న తన అన్నను రావణాసురుణ్ణి చూచినాడు. రావణాసురుడున్నూ తన తమ్ముడు కుంభకర్ణుడు రావడము చూచినాడు. ఎంతో సంతోషపడ్డాడు. సింహాసనముమీద నుంచి లేచి ఎదురుగుండాపోయి కుంభకర్ణుణ్ణి వెంటపెట్టుకొని వచ్చి పర్యంకముమీద కూర్చున్నాడు. అప్పుడు కుంభకర్ణుడు తన అన్నపాదాలకు నమస్కారము చేసి లేచి 'అన్నా, పని ఏమిటి!',

అని అడిగినాడు. ఆ ప్రశ్నకు రావణాసురుడు లేచి సంతోష ముతో కుంభకర్ణుణ్ణి కౌగలించుకొన్నాడు. మెచ్చుకొన్నాడు. అంతట దివ్యసుందరసింహాసనముమీద కూర్చున్నాడు.

ఆ మహాబలవంతుడున్నూ ఉచితాసనముమీద కూర్చున్నాడు. తన అన్నకు వచ్చిన ఆపదకు కోపముతో కన్నులు ఎఱ్ఱచేసినాడు. కన్నులలోనుంచి నిప్పులు కక్కుతూ తన అన్నను చూచి "రాజా, నీవు ఎంతో అవసరమువచ్చి నన్ను నిద్రలేవకొట్టించినావు. ఇప్పుడు నేను చేయవలసినపని ఏమిటి చెప్పు. ఎవడికి నీవు ఇప్పుడు భయపడుతున్నావు. వాడు ఎవడో చెప్పు. ఇప్పుడే వాణ్ణి నేను చంపివేస్తాను" అని చెప్పినాడు.

తమ్ముడు కుంభకర్ణుడు తనకోసము శత్రువును కోపముతో చంపివేయడానికి నిశ్చయించడము చూచి రావణాసురుడు రాముడిమీద కోపముతో గుడ్లు తిప్పుతూ "మహాబలుడా, నీవు పడుకొని చాలాకాలము (తొమ్మిది దినాలు) అయింది. నీవు హాయిగా నిద్రపోతున్నావు. అందువల్ల నీవు ఎఱుగవు. నాకు రాముడివల్ల భయమువచ్చిపడ్డది. వాడు దశరథమహారాజుకొడుకు. మంచి బలవంతుడు. వాడు ఆ రాముడు సుగ్రీవుడితోకూడా వానరసైన్యాలను వెంటపెట్టుకొని సముద్రాన్ని దాటి మన లంకాద్వీపానికి వచ్చినాడు. వాడు ఆ రాముడు సముద్రానికి సేతువు కట్టించి వానరసైన్యాన్ని సుఖముగా తీసుకొని వచ్చినాడు చెట్లను కూకటి వేళ్లతోవలె మన రాక్షసులను వానరులు ఇప్పుడు సమూలముగా నరికివేస్తున్నారు. మన లంకాద్వీపములో ఉన్న వనాలనూ ఉపవనాలనూ చూడు. అంతా వానర మహాసముద్రము అయిపోయింది. అయ్యో, ఏమి అని చెప్పేది. మన రాక్షసులలో ముఖ్యము అయిన వాండ్లను అందరినీ వానరులు యుద్ధములో చంపివేసినారు. వానరులలో ఒక్కడు అయినా చచ్చిపోయినట్టు కనిపించలేదు. మన వాండ్లు ఇంతవరకూ వానరులలో ఒక్కణ్ణి అయినా యుద్ధములో జయించలేదు.

"ఓ మహాబలుడా, ఇప్పుడు ఇటువంటి భయము వచ్చింది. నీవు ఇప్పుడు ఈ లంకాపట్టణాన్ని కాపాడవలెను. అందుకోసమే

నిన్ను నిద్రలేపించినాను. నీవు ఈ వానరులను నాశనము చేసి వేయవలెను. నా ఐశ్వర్యము అంతా అయిపోయింది. రాక్షస వీరులు అందరూ చచ్చిపోయినారు. ఇప్పుడు లంకాపట్టణములో బాలురూ వృద్ధులూ మాత్రము మిగిలిఉన్నారు. ఇట్లా ఉన్న ఈ లంకాపట్టణాన్ని నీవు ఇప్పుడు కాపాడవలెను. ఓ మహాబాహూ, ఈ పని నీవుతప్ప మరిఒకడు ఎవడూ చేయలేడు. నీవు ఈ పని నీ అన్నకోసము చేసిపెట్టవలెను. తమ్ముడా, నీవు పరంతపుడవు. నేను ఇదివరకు ఎన్నడూ నిన్ను ఇట్లా అడిగిఉండలేదు. నీమీద నాకు ఎంతో స్నేహము ఉంది. గౌరవము ఉంది. నీకు అది తెలుసును. దేవాసురయుద్ధములో దేవతలను ఎదిరించినావు. వారిని ఓడించి నావు. సమస్తప్రాణికోటిలోనూ నీతో సరిసమానము అయిన పరాక్రమవంతుడు నాకు ఎక్కడనూ కనపడలేదు. తమ్ముడా, నీవు భయంకర పరాక్రముడవు. ఇప్పుడు నీ పరాక్రమము అంతా చూపించు.

"తమ్ముడా, నీవు యుద్ధప్రియుడవు. బంధుజనులు అంటే నీకు ఎంతో ఇష్టము. కాబట్టి నీ అన్నను నన్ను ఇప్పుడు నీవు సంతోషపెట్టు. నాకు మేలుఅయ్యే ఈ పని చేసిపెట్టు. శరత్కాల మేఘాలను మహావాయువువలె శత్రుసైన్యాలను నీ పరాక్రమముతో పారతోలు" అని చెప్పినాడు.

౬౩

రావణాసురుడు దిగులుపడిపోయి మాట్లాడింది అంతా కుంభ కర్ణుడు విన్నాడు. నవ్వుతూ "అన్నా, ఇదివరకు ఈ విషయము మనము ఆలోచించినాము. ఈ ఆపద వస్తుంది అనే అనుకొన్నాము. సీతను ఇచ్చివేయమని నీ మేలు కోరి చెప్పినమాట నీవు వినలేదు. అందువల్ల ఇప్పుడు నీకు ఆపద వచ్చింది. దుష్కృత్యాలు చేసినవారు దేహము చాలించిన తరువాత నరకములో పడిపోతారు, అని అంటారు. సీతను అపహరించుకొని వచ్చిన పాపకృత్యానికి నీవు వెంటనే ప్రతిఫలము అనుభవించవలసివచ్చింది.

"రాజా, నీవు కేవలము పరాక్రమమువల్లనూ దర్పమువల్లనూ సీతను ఎత్తుకొని వచ్చినావు. కాని ఎటువంటి ఆపదలు వచ్చేదిన్నీ

ముందుగా నీవు ఆలోచించలేదు. నీతిజ్ఞుడు అయిన ప్రభువు ఎవడూ ముందుచేయవలసిన పనులు వెనకనూ వెనకచేయవలసిన పనులను ముందూ చేయడు. నియమపూర్వకముగా వేదాధ్యయనము చేయనివారు యజ్ఞాదులలో వేల్చిన ఆజ్యాది హోమద్రవ్యాదులవలె దేశ కాల విరుద్ధముగా చేసిన పనులు ప్రతికూలము అయిపోవడమే కాకుండా దోషఫలాన్నికూడా ఇస్తవి.

"రాజా, తాను బలవంతుడు అయి శత్రువు బలహీనుడుగా ఉంటేనే యుద్ధము చేయవలెను. తానూ తన శత్రువూ తుల్య బలవంతులుగా ఉంటే సంధి చేసుకోవలెను. తాను బలహీనుడు గానూ శత్రువు బలవంతుడుగానూ ఉన్నప్పుడు తాను లొంగిపోయి శత్రువుకు కప్పము కట్టవలెను. మంత్రులతో చక్కగా ఆలోచించి ఈ ఉత్తమ మధ్యమాధమ మార్గాలలో దేనినో ఒకదాన్ని నిర్ణయించి పనిచేయవలెను. అంతేకాదు. ఆ చేయనిర్ణయించు కొన్న పనిని ఆరంభించే ఉపాయమూ అందుకు అవసరముఅయిన ద్రవ్యసాధనసంపత్తీ అందుకు అనుగుణము అయిన దేశమూ కాలమూ అందుకు వచ్చే విఘ్నాలూ ఆ విఘ్నాలకు ప్రతీకారమూ ముందుగా ఆలోచించుకోవలెను. ఇట్లా ఈ అయిదింటినీ ఆలోచించి పనులు చేసేవాడే నీతిజ్ఞుడు.

"ఏపని చేయడానికి అయినా మంత్రుల అభిప్రాయము ముందుగా తెలుసుకోవలెను. ఆ తెలుసుకొన్న అభిప్రాయాన్ని ఆప్తమిత్రులతో ఆలోచించవలెను. ఆ తరువాత నీతిశాస్త్ర విరుద్ధముగా కాకుండా పనిచేయవలెను. అట్లా చేసే రాజు ఎప్పుడూ జయిస్తాడు.

"ఓ రాజా, ప్రాతఃకాలాన ధర్మాన్నీ మధ్యాహ్నకాలాన అర్థాన్నీ సాయంకాలాన కామాన్నీ సేవించవలెను. అట్లా కాక పోయేట్టయితే జంటలు జంటలుగా అంటే ప్రాతఃకాలాన ధర్మార్థాలనూ మధ్యాహ్నకాలాన అర్థధర్మాలనూ సాయంకాలాల కామార్థాలనూ సేవించవలెను. లేదా ధర్మార్థకామాలను మూడింటినీ సాయంకాల మప్పుడు అయినా సేవించవలెను. సర్వ కాలాలలోనూ కామాన్నిమాత్రము సేవించకూడదు. ధర్మార్థ కామాలు మూడింటిలో శ్రేష్టము అయిందిధర్మము. అది అట్లాగుఅని

తెలిసికూడా దానిని ఆచరణలో పెట్టని రాజుకానీ రాజు అంతటి వాడుకానీ సంపాదించిన శాస్త్రజ్ఞానము అంతా వ్యర్థము. ధర్మార్థ కామాలను అనుష్ఠిస్తూ అవసరము అయినప్పుడు మంత్రులతో కూడా ఆలోచించి సామదానభేదదండాలు అనే చతురోపాయా లలో ఏ ఒక్క ఉపాయాన్నో రెంటినో కాక నాల్గింటినో ఆచరించ వలెను. అట్లా చేయని రాజు ఈలోకములో దుఃఖాలపాలు అయి పోతాడు. తనకు ఏది మేలో ఏది కీడో తాను ఏపని చేయవలెనో ఏపని చేయకూడదో కార్యతత్త్వజ్ఞులు అయిన మంత్రులను ముందుగా ఆలోచించి పనులు చేసే రాజు ఎప్పుడూ సుఖపడతాడు.

"నీతిశాస్త్రార్థము ఏకొంచమూ తెలియని మంత్రులు తమ ప్రాగల్భ్యము చూపించడానికి ఆలోచనాసభలలో పశుబుద్ధితో ఏమేమో వదురుతారు. నీతిశాస్త్రాన్నికానీ ఇతర శాస్త్రాలనుకానీ తెలుసుకోకుండా చెప్పేవారివల్ల కీడు మూడుతుంది. కనుక మహాదైశ్వర్యము కాంక్షించే రాజు అటువంటి అజ్ఞానులు చెప్పే ఏపనీ చేయకూడదు. వారు తమ ప్రాగల్భ్యముతో కీడును మేలుగాచేసి చెప్పుతారు. అటువంటివారివల్ల పనులు పాడు అయిపోతవి. కాబట్టి అది తెలుసుకొని అటువంటివాండ్లను మంత్రసభకు రానీయకుండా వెలుపలనే ఉంచవలెను.

"మంత్రులు శత్రువులతోచేరి తమ రాజును నాశనము చేయ డానికి తమ రాజుచేతనే విపరీతపు పనులు చేయిస్తూ ఉంటారు. పయికి మిత్రులవలె నటిస్తూ శత్రువులసొమ్ము తిని అమిత్రులు అవుతారు. అటువంటివారిని వారి మంత్రనిర్ణయాలనుపట్టి తెలుసు కోవచ్చును. అందువల్ల శత్రువులసొమ్ము తిన్న మంత్రులు చెప్పి నట్టు ఆ యా పనులు అమితవేగముతో చేసే చపలచిత్తపు రాజుల లోపాలను శత్రువులు ఇట్టే కనుక్కో కలుగుతారు. దారి కనపడని పక్షులు క్రౌంచపర్వతరంధ్రములోనుంచి దూరి అవతలకు పోయేట్టు శత్రువులు తమపనులను ఎదుటివారి దుర్మంత్రుల మూలకముగా సాధించుకొంటారు. శత్రువులను తెలుసుకొని తనను కాపాడుకోని రాజు ఆపదలపాలు కావడమేకాకుండా రాజ్యాన్నికూడా పోగొట్టు కొంటాడు.

"అన్నా, నీవు ఈవిషయములో ఇదివరకు విభీషణుడు చెప్పినట్టు చేసిఉండవలసింది. ఇప్పుడున్నూ అది మంచిపని అని నాకు అనిపిస్తూఉంది. అట్లాకాదు అనేటట్లయితే నీ ఇష్టము వచ్చినట్టు చేయవలసింది" అని కుంభకర్ణుడు చెప్పినాడు.

ఇట్లా కుంభకర్ణుడు చెప్పింది అంతా రావణాసురుడు విన్నాడు. అతనికి కోపము వచ్చింది. కోపముతో కనుబొమలు ముడివేసి కుంభకర్ణుణ్ణి చూచి "తమ్ముడా, నీవు ఏదో పరమపూజ్యుడివలెనూ ఆచార్యుడివలెనూ గురువువలెనూ నన్ను శాసిస్తూ ఉన్నావు. ఇట్లా చెప్పడము వృథా ప్రయాస. ఈ మాటలవల్ల ప్రయోజనము ఏమీలేదు. ఇది నీతివిచారానికి సమయముకాదు. ఈ సమయానికి ఉచితము అయిన పనిని ఇప్పుడు చేయవలెను. భ్రాంతి వల్లనో తెలివితక్కువవల్లనో నేను ఏదో చేసినాను. ఆ చేసినదాని గురించి ఆలోచించడానికికానీ దానిని తిరగతోడడానికికానీ వీలు లేదు. దానినిగురించి ఇప్పుడు ఏమి అనుకొన్నా ఏమీ ప్రయోజనములేదు. బుద్ధిమంతులు అయిపోయినదానికోసము దుఃఖపడరు. అయిపోయింది ఎట్లాగూ అయిపోయింది. అది తిరిగి రాదు. తమ్ముడా, నీకు నామీద స్నేహము ఉన్నట్లయితే నీవు నీ పరాక్రమాన్ని నమ్ముతూ ఉన్నట్లయితే నీవు నాకు సహాయము తప్పకుండా చేయవలెను అనుకొనేట్లయితే నాదోషాన్ని నీ పరాక్రముముతో సరిచేసిపెట్టు. ఆపదలపాలు అయి దీనదశలో ఉన్నవాడికి సహాయము చేసే స్నేహితుడే స్నేహితుడు. నీతితప్పి సహాయము కావలెను అనుకొంటున్నవాడికి సహాయపడే బంధువే బంధువు" అని రావణాసురుడు అన్నాడు.

ఇట్లా తెగతెంపులుగా చెప్పినందువల్ల రావణాసురుడికి కోపము వచ్చింది అని కుంభకర్ణుడు తెలుసుకున్నాడు. అంతట మెల్లగానూ మృదువుగానూ "రాజా, నీవు సంతాపపడవద్దు. కోపము వదిలిపెట్టు. స్వస్థముగా ఉండు. నేను జీవించిఉండగా నీవు దుఃఖపడవలసిన పనిలేదు. నీవు ఎవరికోసము ఇట్లా పరితాపపడుతున్నావో వాణ్ణి నేను నాశనము చేసివేస్తాను. బంధుత్వము నుంచి అందులో భ్రాతృగౌరవమునుంచి నేను ఎప్పుడూ నీకు హితము చెప్పవలెను. అది నా విధి. అందువల్ల చెప్పినాను. బంధువు

అయినవాడు అందులో స్నేహితుడు అయినవాడు ఈ సమయములో ఏమి చేయడము మంచిదో అది యుద్ధములో చేసి చూపిస్తాను. నేను నీ శత్రువులను అందరినీ సంహారము చేసివేస్తాను.

"ఓ మహాబాహూ, నేను ఇప్పుడే రామలక్ష్మణులను చంపివేస్తాను. వానరసైన్యాన్ని పరుగెత్తిస్తాను. యుద్ధభూమిలోనుంచి రాముడిశిరస్సు తీసుకొనివచ్చి నీకు సమర్పిస్తాను. ఆ శిరస్సును చూచి సీతాదేవి దుఃఖపడవలెను. నీవు సుఖపడవలెను. బంధువులను కోలుపోయి ఇప్పుడు లంకాపట్టణములో దుఃఖపడుతూ ఉన్న రాక్షసులు అందరూ చూచి సంతోషపడేట్టు రామలక్ష్మణులను సంహారము చేసివేస్తాను. ఓ రాజా, నీ శత్రువులను అందరినీ నాశనముచేసివేయడానికి నేను దేవేంద్రుడితోనయినా యముడితోనయినా పోరాడుతాను. నేను సింహనాదము చేస్తే నా తీక్ష్ణదంష్ట్రిలనూ నా పర్వతాకారాన్నీ నా చేతిలో ఉండే శూలాన్నీ చూచి దేవేంద్రుడు అయినప్పటికిన్నీ పారిపోతాడు. నాకు శూలముకూడా అవసరములేదు. నేను ఏఆయుధమూ లేకుండా నా బాహువులతోనే శత్రువులను చంపివేయకలను. నేను అట్లా నా బాహువులతో శత్రువులను చంపివేయడము మొదలుపెట్టితే బ్రతుకతలచుకున్నవాడు ఎవడూ నా ఎట్టఎదట నిలవలేడు. నాకు శక్త్యాయుధము అక్కరలేదు. గద అక్కరలేదు. ఖడ్గము అక్కరలేదు. నిశితాస్త్రిలు అంతకన్నా అక్కరలేదు. నేను కోపములో చెలరేగితే దేవేంద్రుణ్ణిఅయినా చంపివేయకలను. ఆ రాముడు నా పిడికిటిపోటు తాళుకోగలిగితేనే వాడు బాణాలు వదలడమూ అవి వచ్చి నా నెత్తురు తాగడమూ సంభవిస్తుంది.

"ఓ రాజా, నేను జీవించిఉండేటంతవరకూ నీవు దుఃఖపడము ఎందుకు? బాధపడడము ఎందుకు? నేను నీ శత్రువులను అందరినీ నాశనము చేసివేయడానికి పోతున్నాను. రాముణ్ణి గురించిన భయము వదిలిపెట్టు. నేను రామలక్ష్మణులనూ సుగ్రీవుణ్ణీ చంపివేస్తాను. అంతటితో ఊరుకోను. రాక్షసులను చంపివేసి లంకాపట్టణాన్ని దహించివేసిన హనుమంతుణ్ణీ మిగతా వానరయోధులనూ రూపు మాపివేస్తాను. నీకు అసాధారణము అయిన మహాయశస్సు సంపాదించి పెట్టుతాను.

"రాజా, నీకు బ్రహ్మదేవుడివల్లకానీ దేవేంద్రుడివల్లకానీ భయము లేకుండా చేసివేస్తాను. నాకు కోపమువస్తే దేవతలను అందరినీ నేలమీద పడగొట్టుతాను. నేను యముణ్ణి అయినా ఎప్పటికీ నిద్రలేవకుండా చేసివేస్తాను. అగ్నిహోత్రుణ్ణి అయినా భక్షించివేస్తాను. నక్షత్రాలతోకూడా సూర్యుణ్ణి నేలమీద పడ గొట్టుతాను. సముద్రాన్ని దాహము తాగివేస్తాను. పర్వతాలను చూర్ణము చూర్ణము చేసివేస్తాను. ఈ భూమిని పగులగొట్టి వేస్తాను. నేను ప్రాణికోటిని భక్షిస్తూ ఉంటే బహుకాలము నిద్ర పోయిన కుంభకర్ణుడి పరాక్రమము అందరికీ తెలుస్తుంది. ముల్లో కాలూ నా ఆహారానికి చాలవు.

"ఓ అన్నా, నీవు సుఖము అనుభవించవలెను. అందు కోసము ఆ రాముణ్ణి చంపివేయడానికి పోతున్నాను. వాడితో పాటు వాడి తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి చంపివేస్తాను. వానరయోధులను అందరినీ భక్షించివేస్తాను. రాజా, నీ చిత్తము వచ్చినట్టు నీవు ఇక్కడ క్రీడిస్తూ ఉండు. మంచి మద్యము తాగుతూ ఉండు. నీ ఇష్టము వచ్చిన పనులు చేసుకొంటూ ఉండు. దిగులు పడవద్దు. ఇప్పుడే రాముణ్ణి చంపివేస్తాను. సీతాదేవి నీ వశము అవుతుంది. ఆమెతో బహుకాలము సుఖము అనుభవించు" అని చెప్పినాడు.

౬౪

రామలక్ష్మణులను చంపివేస్తాను అని చెప్పిన ఆ మహాబల వంతుణ్ణి ఆ మహాబాహువును కుంభకర్ణుణ్ణిచూచి మహోదరుడు అనే మంత్రి "ఓ కుంభకర్ణుడా, నీవు ఉత్తమవంశములో పుట్టినావు. కాని ప్రాకృతుడవు. మోటవాడవు. ఏసమయములో ఏపని ఎట్లా చేయవలెనో నీకు తెలియదు. రాజుకు నీతులు తెలియకపోలేదు. నీవు అజ్ఞానంవల్లనూ మొరటుతనమువల్లనూ అధిక ప్రసంగము చేసినావు. మన రాజు దేశ కాల విభాగము బాగా ఎరిగినవాడు. తన స్థానాన్నీ శత్రువుల స్థానాన్నీ తన వృద్ధిక్షయమునూ శత్రువుల వృద్ధిక్షయాలనూ చక్కగా తెలుసుకొన్నవాడు. బలవంతుడు అయినవాడు. అందులో పెద్దలను ఉపాసించనివాడూ బుద్ధిబలము లేనివాడూ చేయరాదు అనుకొనేపనిని సర్వమూ తెలిసిన పండితుడు

ఎందుకు చేస్తాడు! మనరాజు ఏదీ తెలియకుండానూ ఆలోచించ కుండానూ చేయలేదు.

"ధర్మార్థకామాలు ప్రత్యేకముగా ఫలాన్ని ఇస్తవి అని నీవు చెప్పినావు. వాటి స్వభావము అది అని నీకు ఎట్లా తెలిసింది! అందుకు ప్రమాణము ఏమిటి? రాజు సీతను ఎత్తుకొని రావడము అధర్మమనీ అందువల్ల ఆయనకు ఇప్పుడు ఈ ఆపద వచ్చింది అనీ నీవు చెప్పినావు. మంచిపని చేస్తే మంచిఫలము వస్తుంది అనీ చెడుపని చేస్తే చెడుఫలము వస్తుంది అనీ నీ అభిప్రాయము అయి ఉండవలెను. అయితే ఈ ప్రపంచములో నీవు చెప్పినట్లు జరగడము లేదు. మంచిపనులు చేసినా చెడుఫలమూ చెడుపనులు చేసినా చెడుఫలమూ అనుభవించడం చూస్తూనే ఉన్నాము. ఫలప్రాప్తి ఆ యా పనులనుబట్టే ఉంటుంది. ధర్మార్థాలనుపట్టి సుఖఫలమూ అధర్మానర్థాలనుపట్టి దుఃఖపలమూ వస్తుంది అనుకోవడము పొర పాటు. ఈ పనికి ఈ ఫలము అనే నియమము ఏమీ లేదు. తాను కష్టపడి సంపాదించిన ధనము సుఖఫలాన్ని ఇతరులదగ్గర దొంగి లించి తెచ్చిన ధనము దుఃఖఫలాన్ని ఇస్తుందా? అదేవిధముగా తన సొంతభార్యను అనుభవిస్తే సుఖమూ పరాయివాడి భార్యను అనుభవిస్తే దుఃఖమూ వస్తుందా! అందువల్ల ఏపనివల్ల సుఖము వస్తుంది అనుకొంటే ఆ పని చేయవలెను. ఇహలోక సౌఖ్యానికీ పరలోక సౌఖ్యానికీ అందరూ ఆ యా పనులు చేస్తూవుంటారు. శాస్త్రవిహితముకాని పనులు తమ చిత్తము వచ్చినట్లు చేసిన వారున్నూ ఈ లోకములో సుఖము అనుభవిస్తున్నారు. అందువల్ల శాస్త్రవిహితము అయిన పనులు సుఖఫలాన్ని ఇస్తవి అనే నియ మమూ శాస్త్రనిషిద్ధము అయిన పనులు దుఃఖఫలాన్ని ఇస్తవి అనే నియమమూ లేదు. ధర్మార్థాలకు వలెనే కామానికికూడా ఫల నియమము లేదు. ఏపనిచేసినా ఒక సమయములో సుఖమూ మరి ఒక సమయములో దుఃఖమూ రావచ్చును. రాముడు జనస్థాన ములో చేసిన పనినుంచి మనరాజుకు శత్రువు అయినాడు. శత్రువు విషయములో సాహసముచేస్తే తప్పు ఏమీ లేదు. అందువల్ల మన రాజు సీతను ఎత్తుకొని వచ్చినాడు. అందుకు మేము మంత్రులము సమ్మతించినాము.

"ఓ కుంభకర్ణుడా, నీవు ఒంటరిగాపోయి యుద్ధముచేస్తాను అంటున్నావు. అందుకు నీ పరాక్రమమే కారణము అని చెప్పినావు. నీవు చెప్పిన కారణము యుక్తియుక్తముగాలేదు. ఇదివరకు జనస్థానములో మహాబలవంతులు అయిన రాక్షసులను అనేక వేలమందిని రాముడు ఒక్కడే చంపివేసినాడు. అటువంటివానితో నీవు ఒంటరిగా ఎట్లా పోరాడుతావు? ఎట్లా జయిస్తావు? జనస్థానములో అంతమంది రాక్షసులను చంపివేసినందువల్లనే రాముడి పేరుచెప్పితే రాక్షసులు అందరూ భయపడుతూఉన్నారు. అది తెలియక రాముడిమీదికి నీవు ఒంటరిగాపోవలెను అనుకొంటున్నావు.

"ఆ రాముడు కుపితసింహమువంటివాడు. నిద్రపోతున్న మహాసర్పమువంటివాడు. ఎప్పుడూ మహాతేజముతో జ్వలించే అగ్నిహోత్రమువంటివాడు. ఎదిరించ నలవికాని మృత్యువువంటివాడు. అతడికి కోపమువస్తే ఎంతటివాడు అయినా అతనిని పట్టుకొనడము ఉత్తది. ఆ రాముడి ఎట్టఎదుట మన ఈ రాక్షస సైన్యము అంతాకూడా నిలవకలదో లేదో సందేహమే. అటువంటి వాడిమీదికి ఒంటరిగా పోవడము ఎంతమాత్రమూ పనికిరాదు. మహాబలవంతుడు అయిన శత్రువును అల్పుడు అనుకొని లెక్క చేయకుండా బలహీనుడు పోయి తన ప్రాణాలు పోగొట్టుకోకూడదు.

"ఓ కుంభకర్ణుడా, నీవు రాక్షసులలో మహాబలవంతుడవు కాదు అని ఎవరూ అనడములేదు. కాని సమస్తమానవులలో రాముడితో సరిసమానము అయిన బలవంతుడూ పరాక్రమవంతుడూ మరిఒకడు లేడు. ఇది నీవు తెలుసుకో. అతడు దేవేంద్రుడివంటి పరాక్రమవంతుడు. సూర్యుడివంటి తేజోవంతుడు. అతడితో నీవు ఒంటరిగా ఎట్లాపోరాడవలెను అనుకొంటున్నావు" అని అడిగినాడు.

ఈ విధముగా కుంభకర్ణుణ్ణి అడిగి ఆ మహోదరుడు ఆ రాక్షసులు అందరి మధ్యనూ కోపముతో రేగి లోకరావణుడు అయిన రావణుణ్ణి చూచి "రాజా, నీవు సీతాదేవిని తెచ్చుకొన్నావు. ఆమె ఇక్కడనే ఉంది. కాని నీవు ఏమేమో మాట్లాడుతావు. నీవు కావలెను అనుకొన్నప్పుడు ఆమె నీ వశము అవుతుంది. నాకు ఇప్పుడు ఒక ఉపాయము తోచింది. చెప్పుతాను. నీ స్వబుద్ధితో ఆలోచించు.

"నేనూ ఈ కుంభకర్ణుడూ ద్విజిహ్వుడూ సంహ్రాది వితర్దనుడూ రాముణ్ణి సంహారము చేయడానికి పోవలెను అని నీవు చాటించు. అంతట మేము అయిదుగురుమూ పోయి పెద్ద యత్నములో యుద్ధము చేస్తాము. రాముణ్ణి మేము జయించేట్లయితే ఏ ఉపాయమూ అక్కరలేదు. పోరాటములో మేము జయించలేక పోయేట్లయితే నేను ఇప్పుడు చెప్పే ఉపాయము పనిచేస్తుంది.

"మేము మాదేహాలను బాణాలతో భేదించుకొని నెత్తురుతో తడిసి రాముడిపేరు చెక్కిన బాణాలతో ఇక్కడికి వస్తాము. మేము రామలక్ష్మణులను భక్షించివేసినాము అని చెప్పుతూ నీ పాదాలు పట్టుకొని నమస్కారము చేస్తాము. నీవు అప్పుడు మమ్మలను బహూకరించవలెను. అంతట ఒక రాక్షసుణ్ణి ఏనుగుమీద ఎక్కించి అయిదుగురు రాక్షసులూ రామలక్ష్మణులనూ వానరులనూ చంపివేసినారు అని లంకాపట్టణము అంతటా చాటించేట్లు చేయవలెను. అప్పుడు నీవు నీ సంతోషము ప్రకటించడానికి నీ పరివారానికీ నీ భృత్యులకూ కోరుకొన్న ధనాన్నీ భోగద్రవ్యాలనూ ఇవ్వవలెను. యోధులకు పూలదండలూ వస్త్రాలూ వీరానులేపనాలూ మద్యమూ ఇప్పించవలెను. నీవున్నూ సంతోషముగా మద్యపానము చేయవలెను.

"రాక్షసులు రామలక్ష్మణులను చంపివేసినారు అనే వార్తను బాగా ప్రచారము చేయవలెను. అంతట నీవు సీతాదేవినిచూచి ఊరడించవలెను. ఏకాంతములో ఆమెకు నీవు మంచిమాటలు చెప్పవలెను. ధనాదులతోనూ రత్నాద్యాభరణములతోనూ నీవు ఆమెను ప్రలోభపెట్టవలెను.

"రాజా, ఈ కపటోపాయమువల్ల సీతాదేవి తన భర్త పోయినాడు అని నమ్ముతుంది. ఆమె తన భర్తపోయినాడు అనే దుఃఖమువల్లనూ నీవు ఏమిచేస్తావోను అనే భయమువల్లనూ ఇదివరకు నీమీద ఇష్టము లేకపోయినప్పటికిన్నీ మరి ఒక దారిలేక నీ వశము అవుతుంది. తనభర్త రాడు అనే నిరాశవల్లనూ స్త్రీ చాపల్యమువల్లనూ సీతాదేవి నీ వశము అయితీరుతుంది. ఆమె పుట్టినప్పటినుంచీ ఎంతో సుఖముగా పెరిగింది. ఎప్పుడూ సుఖము అనుభవించవలసిన సీతాదేవి దుఃఖములో కృశించి కుంగిపోయి

ఉంది. అందువల్ల నీ వశము అయ్యేట్లయితే సుఖపడవచ్చును అనుకొని ఆమె నిన్ను ఆశ్రయిస్తుంది. నేను ఆలోచించి చూచినాను. నాకు ఈ ఉపాయము తోచింది. నీవు రాముడి ఎదటికి పోవడము అపాయము. కాబట్టి నీవు యుద్ధానికి పోవద్దు. యుద్ధము చేయకుండానే నీ కోరిక ఇక్కడనే ఈడేరుతుంది. నీవు మహా సుఖము అనుభవించవచ్చును.

"రాజా, నీ సైన్యాలను నాశనము చేసుకోవద్దు. యుద్ధము చేయవద్దు. ప్రాణభయము లేదు. శత్రువును జయించు. బహు కాలము మహదైశ్వర్యము అనుభవించు. సుఖముగా ఉండు" అని చెప్పినాడు.

౬౩

మహోదరుడు చెప్పినమాటలు కుంభకర్ణుడు విన్నాడు. అతనిని అటువంటిమాటలు చెప్పవద్దు అని బెదరించినాడు. అంతట రావణాసురుణ్ణిచూచి "అన్నా, నేను ఇప్పుడే ఆ దురాత్ముణ్ణి రాముణ్ణి వధించివేస్తాను. నీవు నిర్భయముగా ఉండు. ఇక శత్రువులు లేకుండా నీవు హాయిగా ఉంటావు. వాన కురవని మేఘాలవలె శూరులు వృథాగా గర్జించరు. నేను చెప్పినట్టుగా పోరాడుతాను. నీవు చూస్తావు. శూరులు తమను అవమానించే మాటలు అంటే విని సహించరు. తమను తాము పొగడుకోరు. ఇతరులకు ఎవరికీ చేయనలవికాని పనులు చేసి చూపిస్తారు.

"ఓ మహోదరుడా, నీవంటి పిరికివాండ్లూ బుద్ధిలేనివాండ్లూ సమస్తమూ తెలిసిన పండితులము అనుకునే అహంకారులూ చెప్పిన మాటలు విని మా అన్న రాక్షసరాజు రావణాసురుడు ఆపదలపాలు అయినాడు. యుద్ధము అంటే భయపడుతూ ఎప్పుడూ ఇచ్చకాల మారిమాటలు మాట్లాడుతూ రాజు చెప్పిన ప్రతిదీ బాగుంది అంటూ తిరిగి మీరు సీతాపహరణమూ అందువల్ల యుద్ధమూ తెచ్చిపెట్టినారు. రాజు మిమ్ములను మిత్రులు అనుకొని నమ్మినాడు. మీరుమాత్రము మిత్రులవలె పయికి నటిస్తూ రాజుమీద మీ మనస్సులో ఉన్న శత్రుత్వమునుంచి అతడు చెప్పిన ప్రతిదానికీ తలలు ఊపి అంతా తారుమారు చేసివేసినారు. మీనుంచి

సైన్యము అంతా హతము అయిపోయింది. బొక్కసము అంతా క్షీణించిపోయింది. రాజు మిగిలి ఉన్నాడు. లంకాపట్టణము మిగిలిఉంది. మీ దుర్ణయాన్ని సరిచేయడానికి నేను ఇప్పుడు యుద్ధము చేయవలసివచ్చింది. శత్రువులను జయించడానికి యుద్ధభూమికి పోతున్నాను " అని చెప్పినాడు.

ఇట్లా ఆ బుద్ధిమంతుడు కుంభకర్ణుడు చెప్పింది విని రావణుడు నవ్వుతూ, " నాయనా, కుంభకర్ణుడా, నీవు యుద్ధవిశారదుడవు. నాకు తెలుసును. ఈ మహోదరుడు రాముడికి భయపడిపోయినాడు. అందువల్ల యుద్ధమువద్దు అంటున్నాడు. నీ అంతటి బలవంతుడు ఈ లోకములో మరిఒకడు లేడు. నీవంటి బంధువూ స్నేహితుడూ నాకు మరిఒకడు లేడు. నీవు పోయి శత్రువులను వధించు, జయించు. నీవు నా భయము పోగొట్టుతావు అనే నిన్ను నిద్రమేల్కొల్పించినాను. అరిందమా, నావాండ్లు అయిన రాక్షసులు అందరూ యుద్ధము చేసి నన్ను సంతోషపెట్టడానికి ఇదే సమయము. నాయనా, నీవు నీ శూలము తీసుకో. పాశహస్తుడు అయిన యముడివలె పో. వానరులను అందరినీ వధించు. ఆదిత్య తేజస్సువంటి నీ తేజస్సుతో దుర్ధర్షుడవు అయి రామలక్ష్మణులను భక్షించు.

" నాయనా, నీవు యుద్ధము చేయవలసిన అవసరమే ఉండదు. నీ మహాదాకారాన్ని చూడగానే వానరులు అందరూ పరుగెత్తి పారిపోతారు. రామలక్ష్మణుల గుండెలు పగిలిపోతవి" అని చెప్పినాడు.

ఈ విధముగా రావణాసురుడు కుంభకర్ణుడితో చెప్పి తాను పునర్జన్మము ఎత్తినట్టు భావించుకొన్నాడు. కుంభకర్ణుడి బలమూ పరాక్రమమూ అతడు బాగా ఎరుగును. అందువల్ల సంతోషములో స్వచ్ఛచంద్రుడివలె తేజరిల్లినాడు. ఆ మహాబలవంతుడు కుంభకర్ణుడు అంతట యుద్ధము చేయడానికి బయలుదేరినాడు. అమిత వేగముతో శత్రువుల ప్రాణాలు తీసివేసే శూలాన్ని అందుకొన్నాడు.

ఆ శూలము ఉక్కుతో చేసింది. మేలిమి బంగారు అలంకారాలతో ధగధగలాడుతూ ఉంది. ఇంద్రుడు వదిలే పిడుగువలె

అది భయంకరము అయింది. వజ్రాయుధమువలె అది కఠినము అయింది. అలంకారముగా కట్టిన పూలదండలనుంచి మహా తేజముతో నిప్పులు కక్కుతూ ఉన్నట్లుగానూ శత్రురక్తముతో తడిసి ఉన్నందువల్ల మంటలు మండుతూ ఉన్నట్టుగానూ కనిపించింది. ఆ శూలముతో దేవదానవగంధర్వయక్షకిన్నరోరగులను అనేక మార్లు అదివరకు కుంభకర్ణుడు చంపివేసినాడు. ఆ శూలాన్ని తీసుకొని రావణాసురుణ్ణి చూచి, "అన్నా, ఇప్పుడు నేను ఒక్కణ్ణే పోయి పోరాడుతాను. నా సైన్యాన్ని ఇక్కడే ఉండనివ్వు. నా క్రుద్ధరూపాన్ని చూచి ఈవేళ వానరులు అందరూ వ్యాకుల పడిపోతారు. నేను వాండ్లను అందరినీ భక్షించివేస్తాను" అని కుంభకర్ణుడు చెప్పినాడు.

ఇట్లా కుంభకర్ణుడు చెప్పింది విని రావణాసురుడు "నాయనా, నీవు సైన్యాలతోకూడా పోవడము మంచిది. శూలాలూ ఇనుప గుదియలూ తీసుకొని సైనికులు నీ వెంట ఉండవలెను. వానరులు అమిత పరాక్రమవంతులు. వేగవంతులు. చక్కని యుద్ధ ప్రయత్నము చేస్తారు. ఒంటరివాణ్ణికానీ ఏమరినవాణ్ణికానీ వాండ్లు తమ కోరలతో కొరికి చంపివేస్తారు. అందువల్ల నీవు ఎదిరించ నలవికాని మన సైన్యాలను వెంటపెట్టుకొని పో. రాక్షసులకు అపకారము చేసిన శత్రువులను అందరినీ రూపుమాపు" అని చెప్పి సింహాసనముమీదినుంచి లేచి రత్నాలు పొదిగిన బంగారు పూల హారాన్ని కుంభకర్ణుడి మెడలో వేసినాడు. అంతేకాకుండా బాహువులకు బాహుపురులూ వేళ్ళకుఉంగరాలూ చెవులకు తళతళ లాడే కుండలాలూ వరాభరణాలూ చంద్రహారాలూ ఇచ్చి దివ్య సుగంధము గుబాళించే పూలదండలు మెడలో వేసినాడు.

అంతట ఆ పెద్ద పెద్ద చెవుల కుంభకర్ణుడు బంగారు బాహు పురులతోనూ అనేక వరాభరణాలతోనూ అలంకరించుకొని వేల్చిన అగ్నిహోత్రమువలె తేజరిల్లినాడు. అమృతమంథన సమయములో వాసుకిని చుట్టిన మందరపర్వతమువలె నల్లటి మొలతాడుతో కని పించినాడు. ధగధగలాడుతూ ఉన్న బంగారుకవచము తొడుగు కొన్నాడు. అది చాలా బరువు అయింది. గట్టిది. పర్వతా లతో కొట్టినా అది పగిలిపోదు. గాలి లోపలికి దూరదు. మంటలు

మండుతూ ఉన్నట్టుగా ఉన్న ఆ బంగారు కవచము తొడుగుకొన్న కుంభకర్ణుడు సంధ్యాకాలమేఘాలు కమ్ముకొన్న హిమవత్పర్వతమువలె భాసించినాడు. సమస్తాంగాలకూ పెట్టుకోవలసిన సర్వాభరణాలూ పెట్టుకొన్నాడు. చేతులో శూలము తీసుకొన్నాడు మూడు అడుగులు వేయడానికి విజృంభించిన శ్రీమన్నారాయణమూర్తివలె కుంభకర్ణుడు అప్పుడు కనిపించినాడు. ఆ మహాబలవంతుడు కుంభకర్ణుడు అంతట తన అన్నను రావణాసురుణ్ణి కౌగలించుకొన్నాడు. పోరాటానికి పోబోతూ అతనికి ప్రదక్షిణముచేసి సాష్టాంగనమస్కారము చేసినాడు.

పోరాటానికి అట్లా బయలుదేరి పోబోతున్న ఆ మహాకాయుణ్ణి ఆ మహాబలవంతుణ్ణి మహానాదము చేసే ఆ కుంభకర్ణుణ్ణి రావణాసురుడు ఆశీర్వదించినాడు. అప్పుడు శంఖాలు పూరించినారు. దుందుభులు మోగించినారు. ఆ రథికశ్రేష్ఠుడు కుంభకర్ణుడు అప్పుడు యుద్ధభూమికి ప్రయాణము అయినాడు. అతని రథము వెంట మేఘగంభీరధ్వనులు చేస్తూ రథాలూ ఏనుగులూ గుర్రాలూ వివిధవరాయుధాలూ ధరించిన సైన్యాలూ నడిచినవి. గొడుగు వేసుకొని శూలము చేతిలో పట్టుకొని రక్తగంధము అద్దిన మహాకాయముతో స్వాభావిక మదముతో పోరాటానికి పోతూఉన్న ఆ కుంభకర్ణుడిమీద రాక్షసాంగనలు పూలవాన కురిపించినారు.

ఆ కుంభకర్ణుడివెంట సింహానాదాలు చేస్తూ బయలుదేరిన పదాతులు మహాబలవంతులు, భయంకరాకారులు, భయంకర రక్తనేత్రులు, కాటుకరాసులవంటి మహాకాయులు. వాండ్లు అందరూ శూలాలూ ఖడ్గాలూ పదునుపెట్టిన గండ్రగొడ్డళ్లూ పెద్ద పొడుగాటి ఇనుప గుదియలూ గదలూ ముసలాయుధాలూ లావుపాటి తాటిబోదెలూ సమీపించడానికి అలవికాని క్షేపణీయాలు అనే ఆయుధాలూ పట్టుకొని పోయినారు.

అట్లా యుద్ధభూమికి పోతూఉన్న ఆ పరాక్రమవంతుడు మహాబలవంతుడు కుంభకర్ణుడు అప్పుడు తన రూపాన్ని మరింత భయంకరముగా మార్చుకొన్నాడు. ఒండ్లు గగురుపుట్టించే మహాభయంకరము అయిన మహాదాకారము ధరించినాడు. బండిచక్రాలు అంతటి కన్నులతో నూరుధనుస్సుల వెడల్పునా ఆరునూరు ధనుస్సుల

పొడుగునా చెట్లూ చేమలూ తగులబడిపోయిన మహాపర్వతమువలె కనిపించినాడు. నోరు తెరచి నవ్వుతూ తనవెంట వస్తూఉన్న రాక్షసయోధులతో "ఓ యోధులారా, నాకు ఇప్పుడు చాలా కోపముగా ఉంది. వానరముఖ్యులనూ వానరసమూహాలనూ అగ్నిహోత్రుడు మిడుతలనువలె నేను ఇప్పుడు రూపుమాపివేస్తాను. అడవులలో తిరిగే వానరులు నాకు ఏఅపరాధమూ చేయలేదు. పయిగా వానరజాతివాండ్లు మావంటివాండ్ల పురోద్యానవనాలకు అలంకారముగా ఉంటారు. అయితే వానరులు అందరూ లంకా పట్టణాన్ని ముట్టడించినారు. అందుకు కారకులు రామలక్ష్మణులు. వాండ్లను ఇద్దరినీ వెంటనే చంపివేస్తాను. వాండ్ల వెంటవచ్చినందుకు వానరవీరులను అందరినీ భక్షించివేస్తాను" అని చెప్పినాడు.

అట్లా కుంభకర్ణుడు చెప్పగానే సంతోషాతిశయముతో రాక్షసులు అందరూ సముద్రము కంపించిపోయేట్టు మహాభయంకరముగా గర్జించినారు.

ఆ ధీమంతుడు అట్లా అనుచరులతో చెప్పి అమితవేగముతో పోరాటానికి పోతూఉంటే ఘోరము అయిన అపశకునాలు అన్నివైపులా అగుపించినవి. మేఘాలు కంచరగాడిదలవలె ఎర్రటి రంగుతో కనిపించినవి. ఆ మేఘాలలోనుంచి కొరవులు పిడుగుల ధ్వనులతో కిందపడ్డవి. సముద్రముతోనూ వనాలతోనూ భూమి కంపించింది. మహాభయంకరాకారాలతో ఉన్న నక్కలునోళ్లలోనుంచి మంటలు కక్కుతూ అరిచినవి. పక్షులు బారులుకట్టి అపసవ్యమండలాకారముగా ఆకాశములో తిరగసాగినవి. దారిలో గద్దలు పంక్తులు పంక్తులుగా నేలమీద వాలినవి. అప్పుడు కుంభకర్ణుడి ఎడమకన్నూ ఎడమభుజమూ అదిరినవి. మంటలు మండుతూ భయంకరధ్వనిచేస్తూ ఒక కొరవి ఆకాశమునుంచి పడ్డది. సూర్యుడి కాంతులు మాసిపోయినవి. హాయిగా వీస్తూఉన్న గాలి ఆగిపోయింది. ఒండ్లు గగురుపుట్టించే మహోత్పాతాలను యముడు తోసుకొనిపోతూ ఉన్నందువల్ల కుంభకర్ణుడు లెక్క చేయలేదు. అంతట అతడు లంకా ప్రాకారాన్ని దాటి మేఘసమూహమువలె అద్భుతముగాఉన్న వానరవాహినిని చూచినాడు.

అప్పుడు ఆ పర్వతాకారుణ్ణి వానరులు అందరూ చూచినారు. గాలి తరుముకొనిపోయే మేఘాలవలె వానరులు అందరూ చెల్లాచెదురుఅయి అన్నిదిక్కులా పరుగులెత్తసాగినారు. తనను చూడగానే ఆ ప్రచండవానరవాహిని పరుగులెత్తడము ఆ మహామేఘాకారుడు కుంభకర్ణుడు చూచి సంతోషాతిశయముతో మహామేఘమువలె గర్జించినాడు. ఆ భయంకర సింహనాదానికి మూలము నరికివేసిన ఏపెచెట్టువలె వానరయోధులు అనేకవేలమంది నేలకూలినారు. ఆ మహాకాయుడు కుంభకర్ణుడు లాహాటి ఇనుపగుదియ పట్టుకొని ప్రళయకాలములో దండధరుడు అయి కింకరులను వెంట పెట్టుకొనిపోయే యముడివలె వానరవాహినీసమూహాలమీదికి పోయినాడు.

యుద్ధకాండ ప్రథమభాగము సమాప్తము.

ద్వితీయ భాగము

౬౬

అమిత వేగముతో లంకాపట్టణ ప్రాకారము దాటిపోయిన ఆ పర్వతాకారుడు కుంభకర్ణుడు సముద్రము చెలరేగి మహాఘోషము చేస్తూఉన్నట్టూ పిడుగులు పడుతూఉన్నట్టూ పర్వతాలు అన్నీ పగిలిపోతూ ఉన్నట్టూ మహాభయంకరముగా సింహనాదము చేసినాడు.

దేవేంద్రుడూ వరుణుడూ యముడూ వధించలేకపోయిన ఆ భయంకరనేత్రుడు తమమీదికి రావడము వానరులు అందరూ చూచినారు. పరుగులెత్తి పారిపోవడము మొదలుపెట్టినారు. అట్లా పారిపోతున్న వానరులను అందరినీ అంగదుడు చూచినాడు. అంతట వారిలో బలవంతులు అయిన నలుణ్ణీ నీలుణ్ణీ గవాక్షుణ్ణీ పిలిచి ‘‘ఓ వానరవీరులారా, మీరు అందరూ బలవంతులు, గొప్ప వంశాలలో పుట్టినారు. ఇది ఏమిటి నీచ వానరులవలె మీరు అందరూ ఇప్పుడు ఎక్కడికి పరుగులెత్తుతున్నారు ! ఎక్కడికి పారిపోతారు ! శూరులకు ప్రాణముకన్నా మానము అధికము, పోరాడటానికి పొండి. ప్రాణాలు కాపాడుకొని ఏమిచేస్తారు. ఇంతకూ ఈ కనపడుతున్నవాడు యుద్ధము చేయడానికి వచ్చిన రాక్షసుడు కాడు. ఇది ఒక బిభీషక. మనలను ఝడిపించడానికి రాక్షసులు వెంటపెట్టుకొని వచ్చిన ఒక యంత్రము ఒక పెద్ద బొమ్మ. మనము మన పరాక్రమముతో దీనిని ధ్వంసము చేసివేద్దాము. బయలుదేరండి, పదండి’’ అని అంగదుడు చెప్పినాడు.

ఎంతో కష్టముమీద వానరులు అందరూ ధైర్యము తెచ్చుకొన్నారు. అందరూ మెల్లగా ఏకము అయినారు. వృక్షాలూ పర్వతశిఖరాలూ తీసుకొని క్రుద్ధులు అయి మళ్లీ యుద్ధభూమికి ప్రయాణము అయిపోయినారు. మదముఎక్కి చెలరేగిన మదపు ఏనుగులవలె కుంభకర్ణుడిమీదికి పోయినారు. పొడుగాటి పర్వతశిఖరాలతోనూ పెద్ద రాళ్లతోనూ చావతేలిన చెట్లతోనూ కుంభకర్ణుణ్ణి కొట్టినారు. అందుకు ఆ రాక్షసుడు చలించలేదు. అంతే

కాదు, వానరులు విసరివేసిన పర్వతశిఖరాలూ పెద్ద పెద్ద రాళ్లూ మహావృక్షాలూ ఆ కుంభకర్ణుడి దేహాన్ని తాకి ముక్కలు ముక్కలు అయి నేలమీద పడిపోయినవి.

అంతట కుంభకర్ణుడు కుపితుడు అయిపోయినాడు. అడవిలో చెట్లను అన్నిటినీ కార్చిచ్చువలె ఆ మహాబలవంతుడు వానరులను అందరినీ చంపివేయడము మొదలుపెట్టినాడు. ఆ రాక్షసుడి దెబ్బలకు గాయాలు అయి దేహము అంతా నెత్తురుతో తడిసిపోయి ఎంతోమంది వానరులు నేలకూలి ఎఱ్ఱటి పూలచెట్లవలె కనిపించినారు. అట్లా దెబ్బలకు నేలకూలకుండా మిగిలిపోయిన వానరులలో కొందరు వెనకకు తిరిగిచూడకుండా ఒకరిమీదనుంచి ఒకరు దూకి పరుగెత్తి పారిపోయినారు. ఆ బలవంతుడి దెబ్బలకు ఓర్వలేక కొందరు వానరులు సముద్రములో పడిపోయినారు. కొందరు సేతువు మీదికి పరుగెత్తినారు. కొందరు ఆకాశానికి ఎగిరిపోయినారు. కొందరు భయముతో ముఖాలు వెలవెలపోతూ మిట్టలకు పరుగులెత్తినారు. కొందరు పల్లాలకు పరుగులెత్తినారు. భల్లూకవీరులు కొందరు చెట్లు ఎక్కినారు. ఆ భల్లూకవీరులలో కొందరు కొండలు ఎక్కినారు. ఆ వానరులలో కొందరు సముద్రములో మునిగిపోయినారు. కొందరు కొండగుహలలో దాగుకొన్నారు. కొందరు నేలమీద కూలబడిపోయినారు. కొందరు ఉన్నచోటున ఉండలేక అదేటికున పరుగెత్తినారు. కొందరు చేష్టలు తప్పి మూర్ఛపోయినారు.

పరాజితులు అయి అట్లా పారిపోతూవున్న వానరులను అందరినీ అంగదుడు చూచి "ఓ వీరులారా, నిలవండి, పారిపోవద్దు. వెనకకు మళ్ళండి. మనము పోరాడుదాము. మీరు యిట్లా భయపడి పరుగులెత్తి ఈ భూమి అంతా తిరిగినా బ్రతికి ఉండడానికి ఎక్కడనూ చోటు దొరకదు. తిరిగి రండి. ప్రాణాలు కాపాడుకొన్నందువల్ల ప్రయోజనము ఏమిటి?

"ఓ వీరులారా, ఇదివరకు మీ పరాక్రమాన్ని ఎవరూ అడ్డగించలేదు. ఏ యుద్ధములోనూ మీరు అపజయము ఎరగరు. మీరు ఇప్పుడు ఆయుధాలను పారవేసి పారిపోతే మీ భార్యలే మిమ్ములను ఎగతాళి చేస్తారు. పెండ్లాలచేత ఎగతాళి చేయించు

పోవడముకన్నా యుద్ధములో చచ్చిపోవడమే మేలు. మనము అందరమూ దేవాంశసంభూతులము. నీచులవలె భయపడి మీరు అందరూ ఎక్కడికిపోతారు. మీరు ఇప్పుడు కుంభకర్ణునికి భయపడి మీ పరాక్రమాన్ని వదలిపెట్టి పారిపోతున్నారు. అందువల్ల అయోగ్యులు అవుతారు. మీరు ఇదివరకు అందరి ఎదటనూ మేము ఇంతవాండ్లము అంతవాండ్లము అని చెప్పుకొన్నారు. ఆ ఆత్మస్తుతులు అన్నీ ఇప్పుడు ఎక్కడికి పోయినవి.

"పరాజితులు అయి ప్రాణాలతో ఉండేవారిని అందరూ పిరికిపందలు అని పిలుస్తారు. అట్లా పిలిపించుకొనేకంటే చచ్చి పోవడము మేలు. శూరులూ వీరులూ పోయే దారినే మనమూ పోదాము. మీరు యిప్పుడు భయాన్ని అవతలకు తోసివేయండి. మనము అల్పాయుష్కులము అయి ఒకవేళ యుద్ధములో చచ్చి పోయేట్లయితే సామాన్యులకు ఎవరికీ పోవడానికి వీలులేని బ్రహ్మ లోకానికి పోతాము. మనము ఒకవేళ యుద్ధములో జయించేట్లయితే అఖండము అయిన కీర్తి వస్తుంది.

"ఓ వీరులారా, మనము ఈ కుంభకర్ణుడివల్ల చచ్చిపోము. మంటలు మండుతూఉన్న అగ్నిహోత్రముమీదికి పోయే మిడుత ప్రాణాలతో తిరిగిపోదు. అదేవిధముగా ఆ రామప్రభువును చూడ పోయే వీడు ప్రాణాలతో తిరిగిపోడు."

అంగదుడు ఈవిధముగా చెప్పుతూఉంటే భయపడిపోయిన వానరులు "ఓ యువరాజా, కుంభకర్ణుడు మమ్ములను ఘోరముగా మర్దించినాడు. మేము నిలవలేము. పోతున్నాము. ఎట్లాగో బ్రతికి ఉంటాము" అన్నారు. వానరయోధులు ఇట్లా చెప్పుతూ ఉండగా కుంభకర్ణుడు అక్కడ కనిపించినాడు. ఆ భయంకరనేత్రుణ్ణి ఆ భయంకరాకారుణ్ణి చూచి వానరయోధులు పరుగులెత్తి పోయినారు. అంగదుడు అంతట మంచిమాటలతో అనేక దృష్టాంతాలతో ఆ వానరయోధులను అందరినీ పారిపోనీయకుండా చేసినాడు. అప్పుడు వారికి అందరికీ తోడుపడడానికి హనుమంతుడు అక్కడికి వచ్చినాడు. అంతట ఆ వానరయోధులు అందరూ పరమసంతోషములో సుగ్రీవాజ్ఞను ఎదురుచూస్తూ మళ్లీ యుద్ధ సన్నద్ధులు అయినారు.

అప్పుడు హనుమంతునివెంట ఋషభుడూ శరభుడూ మైందుడూ ధూమ్రుడూ నీలుడూ తారుడూ కుముదుడూ సుషేణుడూ గవాక్షుడూ రంభుడూ ద్వివిదుడూ పనసుడూ యుద్ధాభిముఖులు అయినారు.

౭౮

ఆ మహాకాయులు వానరవీరులు అందరూ అంగదుడి మాటలు విన్నారు. ప్రాణాలు తెగించి యుద్ధముచేయడానికి సంసిద్ధము అయి తమ తమ పరాక్రమాన్నిగురించి చెప్పుకొంటూ పర్వత శిఖరాలూ వృక్షాలూ తీసుకొని ఆ కుంభకర్ణుడిమీదికి పోయి దొమ్మిగా పోరాటము సాగించినారు. ఆ రాక్షసుణ్ణి తరిమివేసినారు.

అప్పుడు ఆ మహాకాయుడు కుంభకర్ణుడు పరమకుపితుడు అయి గద తీసుకొని ఆ వానరయోధులను అందరినీ ఎడా పెడా కొట్టినాడు. ఒక్కొక్క దెబ్బకు వానరయోధులు ఏడువందల మంది ఎనిమిదివందలమంది వేలకువేలమందీ పడచల్లినట్టు నేల కూలినారు. కుంభకర్ణుడు మరింత క్రుద్ధుడు అయినాడు. గరుత్మంతుడు పాములను పట్టుకొని భక్షించేట్టు కుంభకర్ణుడు చేతులు చాచి ఒక్కొక్కసారి ఎనిమిదిమందినీ పదిమందినీ పదహారుమందినీ పద్ధెనిమిదిమందినీ ఇరవైమందినీ పట్టుకొని నోట వేసుకొని భక్షించి వేస్తూ ఆ యుద్ధభూమిలో విహరించ సాగినాడు.

అప్పుడు వానరులు ఎట్లాగో ధైర్యము తెచ్చుకొని అందరూ ఏకముఅయి రాళ్లూ చెట్లూ తీసుకొని యుద్ధసన్నద్ధులు అయి నిలచినారు. వానర యూథపతి ద్వివిదుడు ఒక పెద్ద పర్వతశిఖరాన్ని పెల్లగించి చేతులతోపట్టుకొని నేలమీదికి వాలుతూ ఉన్న మేఘము వలె పోయి ఆ పర్వతాకారుడిమీద ఆ పర్వతశిఖరాన్ని విసరివేసినాడు. అది గురి తప్పిపోయింది. ఆ మహాకాయుడిమీద పడలేదు. అతడి సైన్యముమీద పడ్డది. ఆ పర్వతము అట్లాపడి గుర్రాలూ ఏనుగులూ రథాలూ నుగ్గునుగ్గు అయిపోయినవి. అనేక మంది రాక్షసయోధులు చితికిపోయినారు. ద్వివిదుడు అప్పుడు మరి ఒక పర్వతాన్ని పెళ్ళగించుకొనిపోయి కుంభకర్ణుడిమీద మళ్లీ విసరినాడు. అదిన్ని గురి తప్పిపోయింది. ఆ రాక్షసుడి వెంట

ఉన్న సైన్యముమీదనే పడ్డది. అప్పుడు ఆ యుద్ధభూమిలోనుంచి రాక్షసుల రక్తము వెల్లువలు అయిపారింది. రాక్షసరథికులు అంతట ధనుస్సులు మోగిస్తూ అమితవేగముతో మృత్యువువంటి బాణాలను సింహనాదాలు చేస్తూఉన్న వానరయోధులమీద వదిలి వాండ్ల శిరస్సులను ఖండించివేసినారు. అంతట మహాబలవంతులు అయిన ఆ వానరులు మహావృక్షాలను పెళ్లగించి తీసుకొనిపోయి రాక్షసయోధులనూ వారి గుఱ్ఱాలనూ ఏనుగులనూ ఒంటెలనూ రథాలనూ చితుకకొట్టినారు.

ఆ సమయాన హనుమంతుడు ఆకాశమూర్ధాన పోయి కుంభకర్ణుడి శిరస్సుమీద పర్వతశిఖరాలనూ వివిధవృక్షాలనూ వానగా కురిపించినాడు. ఆ మహాకాయుడు కుంభకర్ణుడు తన శూలముతో ఆ పర్వతశిఖరాలను భేదించినాడు. ఆ మహావృక్షాలను ఛేదించినాడు. ఆ తీక్ష్ణశూలముతో వానరసైన్యముమీదికి పరుగెత్తినాడు. హనుమంతుడు అంతట పరమ కుపితుడు అయి ఒక పర్వతశిఖరాన్ని తీసుకొని కుంభకర్ణుడికి ఎదురుగుండా పరుగెత్తుకొని పోయినాడు. ఆ పర్వతశిఖరముతో కుంభకర్ణుణ్ణి కొట్టినాడు. అప్పుడు ఆ పర్వతాకారుడి మెదడులోనుంచి నెత్తురుకారి అతడి దేహము అంతా తడిసిపోయింది. ఆ రాక్షసుడు అప్పుడు కొంచెము కలవరపడిపోయినాడు. పూర్వము కుమారస్వామి శక్త్యాయుధముతో క్రౌంచపర్వతాన్ని భేదించినట్టు అప్పుడు కుంభకర్ణుడు కొనలు మంటలు మండుతూనూ మెరుపుతీగవలె తళతళ మెరుస్తూనూ ఉన్న తనశూలాన్ని ఊపి హనుమంతుడి వక్షఃస్థలాన్ని గురిచేసి విసరినాడు. ఆ శూలము దెబ్బకు హనుమంతుడు నోట నెత్తురు కక్కుతూ ప్రళయకాలమేఘమువలె మహాభయంకరముగా గర్జించినాడు. అప్పుడు అతనికి ఒండ్లు తెలియకుండాపోయింది. అట్లా అయిపోయిన హనుమంతుణ్ణి రాక్షసయోధులు అందరూ చూచి సంతోషాతిశయముతో సింహనాదాలు చేసినారు.

అప్పుడు ఆ కుంభకర్ణుడికి భయపడి వానరయోధులు అందరూ పరుగులెత్తసాగినారు. వారికి నీలుడు ధైర్యముచెప్పి ఆ వానరయోధులు అందరూ పరుగులెత్తి పారిపోకుండా చేసి ఒక పర్వతశిఖరాన్ని తీసుకొని కుంభకర్ణుడిమీద విసరివేసినాడు. తనమీద

పడబోతూవున్న ఆ పర్వతశిఖరాన్ని కుంభకర్ణుడు తన పిడికిటితో ఎదుర్కొన్నాడు. ఆ పిడికిటిపోటుకు ఆ పర్వతశిఖరము పగిలిపోయి అగ్నికణాలు రేగుతూ మంటలు మండుతూ ముక్కలు ముక్కలుగా నేలమీద పడిపోయింది.

అప్పుడు ఋషభుడూ శరభుడూ గవాక్షుడూ గంధమాదనుడూ నీలుడుకి అండగాపోయి ఆ అయిదుగురు వానరులూ ఏకము అయి కుంభకర్ణుడిమీదికి పోయినారు. ఆ మహాకాయుడి చుట్టూ పెద్ద పులులవంటి ఆ అయిదుగురు వానరులూ మూగి పర్వతశిఖరాలతోనూ వృక్షాలతోనూ కొట్టినారు. అరచేతులతో చరచినారు. పిడికిళ్లతో పొడిచినారు. గుద్దినారు. అట్లా ఆ వానరవీరులు అన్ని విధాలా కొట్టుతూఉంటే ఆ మహాకాయుడు తన దేహాన్ని వారు హాయిగా చముఃరుతూఉన్నట్టు నిలుచున్నాడు.

కుంభకర్ణుడు అంతట మహావేగుడు అయిన ఋషభుణ్ణి తన రెండుచేతులూ చాచి పట్టుకొని గట్టిగా అదిమివేసినాడు. ఆ వానర పుంగవుడు ఋషభుడు అంతట నోట నెత్తురుకక్కుతూ నేలమీద పడిపోయినాడు. ఆ మహాకాయుడు అంతట శరభుణ్ణి పిడికిటితో గుద్దినాడు. నీలుణ్ణి మోకాలితో కుమ్మినాడు. గవాక్షుణ్ణి అరచేతితో చరచినాడు. గంధమాదనుణ్ణి పాదముతో తన్నినాడు. ఆ దెబ్బలకు ఆ వానరవీరులు అయిదుగురు నెత్తురుతో తడిసి మూర్ఛపోయినారు. నరికివేసిన మోదుగుచెట్లవలె నేలమీద కనిపించినారు. ఆ మహాబలవంతులు వానరవీరులు అట్లా నేలమీద పడిపోవడముచూచి వానరవీరులు వేలకొద్దీ కొండలమీదిగి పరుగులెత్తేటట్టు ఆ మహాకాయుడిమీదికి పరుగులెత్తినారు. ఆ మహాకాయుడిమీదికి ఎక్కిన ఆ వానరవీరులు అతనిని గోళ్లతో గీరినారు. కోరలతో కొరికినారు. పిడికిళ్లతో పొడిచినారు. మోకాళ్ళతో కుమ్మినారు. అన్నివేలమంది అన్నివిధాల కొట్టినా ఆ రాక్షస వ్యాఘ్రము కుంభకర్ణుడు మహాపర్వతమువలె అచలముగా నిలుచున్నాడు. ఆ మహాబలవంతుడు కుంభకర్ణుడు పరమక్రుద్ధుడు అయి వానరులను పట్టుకొని మింగివేయడము మొదలుపెట్టినాడు. ఆ మహాకాయుడు పాతాళకుహరమువంటి తన నోటిలో వానరులను వేసుకొని మింగుతూఉంటే ఆ వానరులు అందరూ ఆ రాక్షసుడి

ముక్కురంధ్రాలలోనుంచీ చెవులలోనుంచీ బయటికి వెళ్లుకొని వచ్చినారు. అట్లా వానరులు బయటికి వెళ్లుకొని వస్తూఉంటే ఆ పర్వతాకారుడికి పట్టరాని కోపము వచ్చింది. అంతట పట్టుకొన్న వానరులను అందరినీ విరిచివేసి మింగసాగినాడు. ప్రళయకాలాగ్ని వలె చెలరేగి ఆ మహాకాయుడు భూమిని అంతా మాంసమయమూ నెత్తురుమయమూ చేసివేస్తూ వానరసైన్యములో తిరుగ సాగినాడు.

అప్పుడు ఆ యుద్ధభూమిలో కుంభకర్ణుడు చేతిలో శూలము పట్టుకొని వజ్రాయుధము ధరించిన దేవేంద్రుడివలెనూ పాశహస్తుడు అయిన యముడివలెనూ తేజరిల్లినాడు. ఆ మహాకాయుడు ఎండా కాలములో ఎండిపోయిన అడవులను దహించి వేసే అగ్నిహోత్రము వలె ఆ వానరసైన్యాలను రూపుమాపినాడు. ఆ రాక్షసుడు కుంభకర్ణుడు అట్లా వానరవీరులను సంహారము చేసివేస్తూ ఉంటే వానరసేనాసమూహాలు అనాయకము అయిపోయినవి. వానర సైనికులు అందరూ భయపడి వికృతముగా కేకలు పెట్టుతూ ఏడుస్తూ ఖిన్నులు అయిపోయి రాముడి శరణు చొచ్చినారు.

ఆ మహాసంగ్రామములో వానరయోధులు అందరూ పరాజితులు అయిపోవడము అంగదుడు చూచినాడు. ఆ కుంభకర్ణుణ్ణి వెంబడించిన రాక్షసయోధులు అందరూ భయపడిపోయేట్టు పదే పదే సింహనాదము చేస్తూ అంగదుడు ఒక పెద్ద పర్వతశిఖరాన్ని తీసుకొని కుంభకర్ణుడిమీదికి పరుగెత్తినాడు. ఆ పర్వతశిఖరాన్ని అతడి శిరస్సుమీదికి విసరివేసినాడు. అది ఆ రాక్షసుడి నెత్తిమీద పడ్డది. ఆ దెబ్బకు కుంభకర్ణుడు కోపముతో మండిపోయినాడు. వానరులు అందరూ భయపడేటట్టు అరుస్తూ అంగదుడిమీదికి పరుగెత్తినాడు. మహాకోపముతో అంగదుడిమీద శూలము విసరివేసినాడు. పోరాటములో సమస్తోపాయాలూ తెలిసిన అంగదుడు ఆ శూలము తనమీద పడకుండా తప్పించుకొని చటుక్కున ఎగిరి కుంభకర్ణుడి ఎదురురొమ్ములమీద తన అరచేతితో ఇట్టే చరచినాడు. అంగదుడు అమితకోపముతో చరచిన ఆ చరుపుకు ఆ పర్వతాకారుడు మూర్ఛపోయినాడు. మహాబలవంతుడు అయినందువల్ల ఇట్టె తెప్పిరిల్లినాడు. తెలివి వచ్చింది. ఉత్తరక్షణాన తన కుడి

చేతితో అంగదుణ్ణి ఒక గుద్దు గుద్దినాడు. అంగదుడు చేష్టలు తప్పి నేలమీద పడిపోయినాడు.

అంగదుడు మూర్ఛపోగానే కుంభకర్ణుడు శూలము తీసుకొని సుగ్రీవుడిమీదికి పరుగెత్తినాడు. అప్పుడు ఆ వానరరాజు సుగ్రీవుడు తనమీదికి పరుగెత్తుకొని వస్తూవున్న కుంభకర్ణుణ్ణిచూచి యుద్ధోత్సాహముతో ఎగిరి గంతులు వేసినాడు. ఒక పర్వతశిఖరాన్ని తీసుకొని గిరగిర తిప్పుతూ అమితవేగముతో కుంభకర్ణుడికి ఎదురుగుండా పరుగెత్తినాడు. అట్లా పరుగెత్తుకొని వస్తూఉన్న సుగ్రీవుణ్ణి చూచి కుంభకర్ణుడు తన సమస్తావయవాలూ విదిలించుకొంటూ నిలుచున్నాడు. వానరరక్తముతో సమస్తాంగాలూ తడిసిపోయి ఉన్న ఆ కుంభకర్ణుణ్ణి చూచి సుగ్రీవుడు "ఓ రాక్షసుడా, నీవు పరమ పరాక్రమవంతులను పడవేసినావు. ఎవరూ చేయలేనిపని చేసినావు. నా సైన్యాలను భక్షించినావు. అల్పులను ఏమిచేస్తే ఏమి ప్రయోజనము. ఇదిగో, నీవు ఈ ఒక పర్వతము దెబ్బకు ఓర్చుకో" అని చెప్పినాడు.

అట్లా ఎంతో ధైర్యముతో చెప్పిన సుగ్రీవుడి మాట విని పెద్దపులివంటి ఆ కుంభకర్ణుడు "ఓ వానరుడా, నీవు బ్రహ్మదేవుడి మనుమడివి. ఋక్షరజుడి పుత్రుడవు. పరాక్రమానికి ప్రసిద్ధికెక్కినావు. నేను ఎరుగుదును. నీవు ఇప్పుడు ఊరక అరవవద్దు" అన్నాడు.

ఆ మాట వినే వినడముతో చేతిలోఉన్న పర్వతశిఖరాన్ని సుగ్రీవుడు గిరగిరాతిప్పి కుంభకర్ణుడిమీద విసరివేసినాడు. అది వజ్రాయుధమువలెనూ పిడుగువలెనూ పోయి కుంభకర్ణుడి వక్షఃస్థలాన పడి ముక్కలు ముక్కలు అయిపోయింది. ఆ రాక్షసుడు వక్షఃస్థలము చెక్కు చెదరలేదు. అది చూచి వానరయోధులు అందరూ దిగులుపడిపోయినారు. రాక్షసయోధులు అందరూ సంతోషాతిశయముతో సింహనాదాలు చేసినారు. అప్పుడు కుంభకర్ణుడికి పట్టరాని కోపము వచ్చింది. నోరు తెరిచి భయంకరముగా అరిచినాడు. మెరుపుతీగవలె మెరుస్తూ ఉన్న తన శూలాన్ని గిరగిర తిప్పి సుగ్రీవుడిమీద విసరివేసినాడు. అప్పుడు హనుమంతుడు చటుక్కున ఎగిరి కుంభకర్ణుడు విసరివేసిన ఆ తీక్ష్ణశూలాన్ని పట్టుకొన్నాడు.

వెయ్యిబారువుల ఇనుముతో చేసి బంగారు పొదిగిన ఆ శూలాన్ని హనుమంతుడు తన మోకాలికి ఆనించి రెండు చేతులతో పట్టుకొని విరిచివేసినాడు. అది చూచి వానరయోధులు అందరూ పరమ సంతోషముతో గంతులు వేసినారు. సింహనాదాలు చేసినారు. హనుమంతుణ్ణి స్తోత్రము చేసినారు.

ఆ మహాబలవంతుడు కుంభకర్ణుడు తన శూలాన్ని హనుమంతుడు విరిచివేయడము చూచి మహోగ్రుడు అయినాడు. ఆ లంకాద్వీపములో ఉన్న మలయపర్వతశిఖారాన్ని పెల్లగించి తెచ్చి సుగ్రీవుడిమీద విసరివేసినాడు. ఆ దెబ్బకు సుగ్రీవుడు చేష్టలు తప్పి నేలమీద పడిపోయినాడు. రాక్షసులు అందరూ సంతోషముతో "భళే—భళే" అని కేకలు వేసినారు. అప్పుడు కుంభకర్ణుడు నేలమీద పడిఉన్న సుగ్రీవుడిదగ్గరకు పోయినాడు. ఆ అద్భుత పరాక్రమవంతుణ్ణి ఆ భయంకర పరాక్రమవంతుణ్ణి సుగ్రీవుణ్ణి లేవనెత్తి తనభుజాన వేసుకొని మహామేఘాన్ని ఎత్తుకొనిపోయే ప్రచండ వాయువువలె లంకాపట్టణములోకి పరుగెత్తినాడు. ఆ పర్వతాకారుడు కుంభకర్ణుడు యుద్ధభూమిలోనుంచి ఆ మహామేఘాకారుణ్ణి సుగ్రీవుణ్ణి అట్లా మోసుకొని పోతూఉంటె మహోన్నతశిఖరముతో ఉన్న మేరువుపర్వతము పరుగెత్తుతూ ఉన్నట్టు తోచింది. అట్లా వానరరాజును ఎత్తుకొనిపోతూఉన్న ఆ కుంభకర్ణుణ్ణి చూచి రాక్షసవీరులు అందరూ పొగడినారు. అది చూచి దేవతలు అందరూ ఆశ్చర్యపడ్డారు.

దేవేంద్రుణ్ణి ఎదిరించిన కుంభకర్ణుడు దేవేంద్రుడితో సరిసమానము అయిన సుగ్రీవుణ్ణి ఎత్తుకొనిపోతూ మనస్సులో "ఇంతటివాణ్ణి నేను ఎత్తుకొనిపోతూ ఉన్నాను. ఇక రామలక్ష్మణులూ వానరసైన్యమూ నాకు ఒక లెక్కా" అనుకొన్నాడు. కుంభకర్ణుడు సుగ్రీవుణ్ణి ఎత్తుకొనిపోవడము చూచి వానరసైనికులు పరుగులెత్తసాగినారు. అది ఆ మతిమంతుడు హనుమంతుడు చూచి తనలో "నేను ఇప్పుడు ఏమిచేయవలెను! ఏమిచేస్తె బాగుంటుంది! పర్వతాకారుడు అయిన కుంభకర్ణుణ్ణి ఎదిరించి నా పిడికిటిపోట్లతో వాడిదేహాన్ని ఛిన్నాభిన్నముచేసి వానరరాజును విడిపించుకొని రావలెను. అట్లా చేస్తే వానరులు అందరూ సంతోషిస్తారు.

"అట్లా కాదు, నేను అట్లా చేయకూడదు. సుగ్రీవుణ్ణి దేవతలూ అసురులూ ఉరగులూ ఏకముఅయి పట్టుకొన్నా వారిని అందరినీ అతడే తప్పించుకొని రాగలడు. పోరాటములో కుంభకర్ణుడి పర్వతము దెబ్బకు వానరరాజు మూర్ఛపోయినాడు. అందువల్ల ఏమి జరుగుతూ ఉందీ అతడు తెలుసుకోలేకపోయినాడు. కొంచెము సేపటికి అతడికి తెలివి వస్తుంది. అప్పుడు అతడు తనకూ వానరులకూ ఏది మేలో అది అతడే ఆలోచిస్తాడు. అతడు మహాయుద్ధము చేసి చూపిస్తాడు. నేను అతడిని విడిపించుకొని వచ్చేట్లయితే ఆ మహాపరాక్రమవంతుడు సుగ్రీవుడు మనస్సులో బాధపడు తాడు. నేను వదిలించుకొని వచ్చేట్లయితే అతడు పరమపరాక్రమ వంతుడు అనే కీర్తి శాశ్వతముగా పాడు అయిపోతుంది. అందువల్ల కొంచెముసేపు కనిపెట్టుకొని ఉంటాను. అతడు ఏమి చేస్తాడో చూస్తాను. అతడు వచ్చేలోపల ఈ వానరసైన్యాన్ని ఓదారుస్తాను." అని ఆలోచించి నిశ్చయించుకొన్నాడు. హనుమంతుడు అంతట వానరసైన్యాలను పారిపోకుండా నిలిపినాడు.

కుంభకర్ణుడు ఆ మహాకపిని సుగ్రీవుణ్ణి ఎత్తుకొని పోతూఉంటే లంకాపట్టణములో విమానగృహాలలోనుంచీ గోపురాలలోనుంచీ రాక్షసులు అతనిమీద పూలవాన కురిపించినారు. పేలాలు చల్లినారు. పన్నీరువాన కురిపించినారు. ఆ సుగంధానికీ ఆ చల్లదనానికీ కుంభకర్ణుడి భుజానఉన్న సుగ్రీవుడు మెల్లమెల్లగా తేరుకొన్నాడు. ఆ మహాపరాక్రమవంతుడు సుగ్రీవుడు ఆ లంకాపట్టణ రాజవీధులు చూస్తూ మనస్సులో "నేను ఇప్పుడు ఏమి ప్రతీకారము చేయవలెను? నేను ఏమిచేస్తే వానరులు సంతోషిస్తారు? ఏమిచేస్తే వానరులకు మేలు అవుతుంది!" అని ఆలోచించినాడు. చటుక్కున తన కరుకుగోళ్లతో కుంభకర్ణుడి చెవులు చీల్చివేసినాడు. కోరలతో వాడి ముక్కు కటిక్కున కొరికినాడు. అంతటితో వదిలిపెట్టకుండా ఆ పక్కనూ ఈ పక్కనూ కొరికినాడు. కుంభకర్ణుడి చెవులు తెగి పోయినవి. ముక్కు తెగిపోయింది. పక్కలనుంచి కండలు బయటికి వెళ్లుకొని వచ్చినవి. దేహము అంతా నెత్తురుతో తడిసిపోయింది. బాధపడుతూ కోపముతో రేగి కుంభకర్ణుడు సుగ్రీవుణ్ణి నలిపివేస్తూ నేలమీద పడవేసి కొట్టినాడు. నేలమీద పడవేసిన సుగ్రీవుణ్ణి

రాక్షసులు అప్పుడు నానావిధాలా కొట్టినారు. ఆ దెబ్బలను సుగ్రీవుడు లక్ష్యపెట్టలేదు. అమితవేగముతో ఆకాశానికి ఎగిరి నాడు. రాముడిదగ్గరకు వచ్చినాడు.

ముక్కూచెవులూ తెగిపోయిన కుంభకర్ణుడు నెత్తురుకారుతూ సెలయేర్లు ప్రవహిస్తూఉన్న పర్వతమువలె కనిపించినాడు. నల్లటి కాటుకరాశివంటి ఆ కుంభకర్ణుడు దేహముఅంతా నెత్తురుతో తడిసి పోయి సంధ్యాకాలమేఘమువలె తేజరిల్లినాడు. సుగ్రీవుడు తప్పించు కొని పోయినాడు అనే కోపముతో పరమకుపితుడు అయి భయంకరము అయిన ఒక ఇనుపగుదియ తీసుకొని కుంభకర్ణుడు యుద్ధభూమికి పరుగెత్తుకొని వచ్చినాడు. వానరసైన్యములలో చొరబడి ప్రజలను దహించివేసే ప్రళయకాలాగ్నివలె వానర సైన్యాలను రూపుమాపివేయసాగినాడు.

అప్పుడు కుంభకర్ణుడికి ఆకలివేసింది. రక్తమాంసాలమీద ఆశ పుట్టింది. రాక్షసులూ వానరులూ పిశాచాలూ భల్లూకవీరులూ అనే భేదములేకుండా కనపడ్డ ప్రతివాణ్ణీ పట్టుకొని భక్షించివేయ సాగినాడు. ప్రళయకాలమృత్యువువలె వానరులూ రాక్షసులూ అనే భేదములేకుండా పట్టుకొని ఏకకాలాన ఒకణ్ణీ ఇద్దరినీ ఎంత మందిని పడితే అంతమందిని ఒకచేతితో లాగుకొని నోటిలో వేసు కోడము మొదలుపెట్టినాడు. పర్వతశిఖరాలతోనూ వృక్షాల తోనూ వానరులు ఎంత కొట్టుతూవున్నా బుగ్గలలోనుంచి మెదస్సూ రక్తమూ కారుస్తూ వానరులను ఏడువందలమందినీ ఎనిమిదివందల మందినీ ఇరవైవందల మందినీ ముప్పయివందల మందినీ చేతులతో పట్టుకొని అదిమివేసి నోటిలో వేసుకొని భక్షిస్తూ పరుగులెత్తినాడు. ఆ కుంభకర్ణుడికి చిక్కకుండా మిగిలిన వానరులు అందరూ పరుగెత్తి పోయి రాముడి శరణు చొచ్చినారు.

అప్పుడు శత్రుసంహారకుడు లక్ష్మణుడు క్రుద్ధుడు అయిపోయి ఆ కుంభకర్ణుడిమీద ముందుగా ఏడు బాణాలు వదిలినాడు. అంతట ఎడతెగకుండా ఆ రాక్షసుడిమీద బాణవర్షము కురిపించసాగినాడు. ఆ బాణాలను లెక్కచేయకుండా ఆ మహాకాయుడు కుంభకర్ణుడు భూమి పగిలిపోయేట్టు అడుగులువేస్తూ రాముడుమీదికి పరుగెత్తి నాడు. రాముడు అప్పుడు రుద్రదేవతాకము అయిన అస్త్రాన్ని

వింట సంధించినాడు. అందులోనుంచి అప్పుడు అనేక బాణాలు దూసుకొనిపోయి కుంభకర్ణుడి ఎదురురొమ్ములమీద పడ్డవి.

ఆ బాణాల దెబ్బలకు ఆ రాక్షసుడికి అప్పుడు ఒళ్లుతెలియకుండాపోయింది. వాడిచేతిలోఉన్న పెద్ద ఇనుపగుదియ జారి నేలమీద పడిపోయింది. బాణాలు గుచ్చుకొని గాయాలు అయినవి. ఆ గాయాలలోనుంచి కారిన నెత్తురుతో ఆ రాక్షసుడి దేహమంతా తడిసిపోయింది. మూర్ఛ తేరుకొన్నాడు. నిరాయుధుడు అయిపోయినట్టు తెలుసుకొన్నాడు. వాడికి కోపము వచ్చింది. అప్పుడు వాడినోటిలోనుంచి అగ్నిజ్వాలలు వెలువడినవి. వానరులమీదికి పోయినాడు. పిడికిళ్ళతో పొడుస్తూనూ పాదములతో తన్నుతూనూ పోరాటము సాగించినాడు. ఆ కోపములో వాడికి తనవాండ్లూ పరాయివాండ్లూ అనే జ్ఞానము లేకుండాపోయింది. రాక్షసులు వానరులు అనే భేదము లేకుండా అందరినీ పట్టుకొని చంపివేస్తూ పెద్దపెద్ద కేకలుపెట్టుతూ ఆ యుద్ధభూమి అంతటా పరుగులెత్తినాడు.

ఆ మహాబలవంతుడు ఆ భయంకరపరాక్రముడు యముడివంటి ఆ కుంభకర్ణుడు అంతట ఒక భయంకర పర్వతశిఖరాన్ని పెళ్ళగించి రాముడిమీద విసరివేసినాడు. రాముడు ఆ పర్వతశిఖరము వచ్చి తనమీద పడేలోపలనే ఏడు బంగారుబాణాలు వదలినాడు. మేరుపర్వతశిఖరమువంటి ఆ పర్వతశిఖరము రెండువందల ముక్కలుగా పగిలి భగభగ మంటలుమండుతూ వానరసైన్యముమీద పడబోతూ ఉంటే రాముడు బాణాలు వదిలి ఆ పర్వతశిలలను చెదరకొట్టి వానరసైన్యాన్ని కాపాడినాడు.

అప్పుడు ఆ కుంభకర్ణుణ్ణి చంపివేసే ఉపాయము ఆలోచిస్తూఉన్న లక్ష్మణుడు రాముణ్ణిచూచి "ప్రభూ, ఈ కుంభకర్ణుడు ఇప్పుడు రక్తపానము మత్తులోఉన్నాడు. వీడు తనవాండ్లు ఎవరో పరాయివాండ్లు ఎవరో తెలుసుకోలేకుండా ఉన్నాడు. రాక్షసులు ఎవరో వానరులు ఎవరో వీడికి ఇప్పుడు తెలియడములేదు. కాబట్టి వానరయోధులు అందరూ వీడిమీదికి ఎక్కవలెను. వీణ్ణి కదలనీయకుండా వానరసేనానాయకులుచుట్టూ ముట్టడించవలెను. ఇట్లా చేసేట్లయితే ఈ దుర్బుద్ధి తనమీదికి ఎక్కిన వానరుల బరువుమోయలేక నేలమీద పడి

పోతాడు. నేలమీద పడిపోతే వీడు లేవలేడు. కనుక వీడు ఇక వానరులను చంపివేయడము ఆగిపోతుంది" అని చెప్పినాడు.

లక్ష్మణుడు చెప్పిన ఈ మాటలు విని వానరయోధులు అందరూ సంతోషముతో బయలుదేరినారు. వందలకొద్దీ వానర యోధులు కుంభకర్ణుడిమీదికి ఎక్కినారు. తనమీద అట్లా వానరులు ఎక్కినందుకు కుంభకర్ణుడికి కోపము వచ్చింది. మదముయొక్క చెలరేగిన ఏనుగు మావటివాణ్ణి విదలించివేసేట్టు కుంభకర్ణుడు తన మీదికి యెక్కిన వానరులను అందరినీ విదలించివేసినాడు.

అదిచూచి రాముడు క్రోధతామ్రాక్షుడు అయినాడు. కన్నులవెంట నిప్పులు రాలుస్తూ కుంభకర్ణుణ్ణి సంహారము చేసివేయడానికి ఉద్యుక్తుడు అయినాడు. మహాసర్పమువంటి అల్లెతాడుతో ఉన్న భయంకరముఅయిన ధనుస్సుతీసుకొన్నాడు. ఉత్తమోత్తమము అయిన బాణాలతో ఉన్న అంబులపొదులు కట్టుకొన్నాడు. వానర యోధులకు అందరికీ ధైర్యము చెప్పినాడు. అంతవరకూ భయపడుతూ ఉన్న వానరవీరులు అందరూ అప్పుడు సంతోషపడ్డారు. అంతట ఆ పరమదుర్జయుడు రాముడు లక్ష్మణుణ్ణీ వానరసైన్యాలనూ వెంటపెట్టుకొని కుంభకర్ణుడిమీదికి పోయినాడు.

కోపముతో చెలరేగిన దిగ్గజమువలె అందరిమీదికి పరుగులెత్తుతూనూ రాక్షసులను వెంటపెట్టుకొని క్రుద్ధుడుఅయి వెదికి పట్టుకొన్న వానరులను అందరినీ మర్దించివేస్తూనూ వానకురుస్తున్న మేఘమువలె నోట నెత్తురుకారుతూనూ ఆ కారుతూ ఉన్న నెత్తురును నాలుకతో నాకుతూనూ, నెత్తురువంటి నేత్రాలతో చూస్తూనూ ఉన్న ఆ అరిందముణ్ణి సర్వాంగాలూ నెత్తురుతో తడిసిపోయిన ఆ మహాబలవంతుణ్ణి వింధ్య మందర పర్వతాలంత ఎత్తునఉన్న ఆ మహాకాయుణ్ణి ప్రళయకాలములో సర్వనాశముచేసివేసే యముడివలె బంగారు బాహుపురులతో కిరీటముతో ధగధగలాడుతూఉన్న ఆ కుంభకర్ణుణ్ణి రాముడు చూచినాడు.

జ్వలిస్తూ ఉన్న అగ్నిహోత్రమువంటి ఆ రాక్షసుణ్ణి చూచే చూడటముతో ఆ పురుషోత్తముడు రాముడు ధనుష్టంకారము చేసినాడు. ఆ టంకార ధ్వనిని కుంభకర్ణుడు సహించలేకపోయినాడు.

కోపముతో లేగి రాముణ్ణి ఎదుర్కొనడానికి పరుగెత్తినాడు. ఆ పర్వతాకారుడు వాసుకి సర్పమువంటి బాహువులతో గాలి తరుము కొని వస్తూఉన్న మహామేఘమువలె తనమీదికి రావడము చూచి "ఓ కుంభకర్ణుడా, రా, నేను రాముణ్ణి. నీవు దిగులుపడవద్దు. నీవు దేవేంద్రుణ్ణి ఎదిరించినవాడవు అని నాకు తెలుసును. నిన్ను నేను ఇప్పుడే విచేతనుణ్ణి చేసివేస్తాను" అన్నాడు రాముడు.

ఆ చెప్పింది రాముడు అని కుంభకర్ణుడు తెలుసుకొన్నాడు. ఉరుములు ఉరుముతూ ఉన్నట్టు భయంకరముగా వికృతస్వరముతో పకపక నవ్వుతూ వానరుల గుండెలు పగిలిపోయేట్టు రామునిమీదికి పోయి "ఓరీ, నేను విరాధుడనుకాను. ఖరుణ్ణికాను. మారీచుణ్ణి కాను. కబంధుణ్ణికాను. కుంభకర్ణుణ్ణి. వచ్చినాను. ఇదిగో ఈ ముద్గరాన్ని చూడు. ఎంతో భయంకరముగా ఉంది. అంతా ఇనుముతో చేసింది. నేను ఇదివరకు ఈ ముద్గరముతోనే దేవత లనూ దానవులనూ సంహారము చేసివేసినాను. ఓ రామా, నాకు ముక్కు, చెవులూ పోయినందువల్ల తక్కువవాణ్ణి అనుకోవద్దు. అవి పోయినందువల్ల నాకు ఏమాత్రమూ బాధలేదు. నీ పరాక్రమాన్ని చూపించు. నేను నీ పరాక్రమాన్నీ నీ పౌరుషాన్నీ నిన్నూ భక్షించి వేస్తాను" అన్నాడు.

ఈ మాటలు కుంభకర్ణుడు ముగించే లోపలనే మంచి రెక్క లతో ఉన్న బాణాలను రాముడు ఆ కుంభకర్ణుడిమీద వదిలినాడు. అవి అమితవేగముతో పోయి ఆ రాక్షసుడిమీద పడ్డవి. అయితే అవి అతనిని ఏమీ చేయలేకపోయినవి. ఆ రాక్షసుడు ఏమాత్రమూ చలించలేదు. ఇదివరకు ఆ బాణముతో సప్తతాలవృక్షాలనూ ఛేదించి వేసినాడు. ఆ బాణముతోనే వాలిని చంపివేసినాడు. అది వజ్రాయుధమువంటిది. అవి ఆ కుంభకర్ణుణ్ణి ఏమీ చేయలేకపోయినవి.

రాముడు వదిలిన ఆ బాణాలను అన్నిటినీ కుంభకర్ణుడు తన మీద పడుతూఉన్న జలధారలవలె భావించినాడు. చేతిలో ఉన్న ముద్గరాన్ని గిర గిర తిప్పుతూ తనమీద వచ్చిపడుతూఉన్న బాణా లను అడ్డగించినాడు. నెత్తురుతో తడిసిఉన్న ఆ ముద్గరముతోటే ఇదివరకు ఆ రాక్షసుడు దేవసేనలను నుగ్గునుగ్గు చేసినాడు. ఆ ముద్గరముతోనే వానరసైన్యాలను మర్దించినాడు.

అప్పుడు రాముడు వాయువ్యాస్త్రాన్ని కుంభకర్ణుడిమీద వదిలినాడు. అది ఆ కుంభకర్ణుడి బాహువును తెగవేసింది. దేహము నుంచి తెగిపోయిన ఆ బాహువు ముద్గరముతో కూడా పోయి వానర సైన్యముమీద పడి వానరసైనికులను చంపివేసింది. చావగా మిగిలిపోయిన వానరులు దిగులుతోనూ భయముతోనూ గడ గడ వణికిపోతూ రామకుంభకర్ణ యుద్ధము చూడడానికి దగ్గరకు పోయినారు.

వాయువ్యాస్త్రానికి ఒకచెయ్యి తెగిపోగానే ఆ పర్వతాకారుడు కుంభకర్ణుడు రెండవచేతితో ఒక వృక్షాన్ని పెళ్లగించినాడు. దానిని పట్టుకొని రాముడిమీదికి పరుగెత్తినాడు. అట్లా సాలవృక్షము పట్టుకొని తనమీదికి పరుగెత్తుకొని వస్తూ ఉన్న కుంభకర్ణుణ్ణి చూచి రాముడు ఐంద్రాస్త్రముతో బాణాన్ని సంధించినాడు. మహాసర్పమువంటి కుంభకర్ణుడి బాహువును గురిచేసి ఆ బాణాన్ని వదిలినాడు. ఆ బాహువు తెగి గిర గిర తిరుగుతూ పోయి చెట్లనూ పర్వతాలనూ రాళ్లనూ రాక్షసులనూ నలగకొట్టి నేలమీద పడ్డది. రెండు చేతులూ తెగిపోయిన కుంభకర్ణుడు పెద్ద పెద్ద కేకలు పెట్టుతూ రాముడిమీదికి పరుగెత్తపోయినాడు. అది చూచి రాముడు రెండు అర్ధచంద్రాకారపు బాణాలను తీసి ఆ కుంభకర్ణుడి పాదాలను గురిచేసి వదిలినాడు. ఆ రెండు పాదాలూ తెగి మహాధ్వని చేస్తూ నేలమీద పడ్డవి. ఆ మహాధ్వని దశదిశలానూ పర్వతాలమీదనూ పర్వతగుహలలోనూ మహాసముద్రములోనూ లంకాపట్టణములోనూ వానరసైన్యాలలోనూ రాక్షససైన్యాలలోనూ మారుమోగింది.

బాహువులు తెగిపోయి పాదాలు తెగిపోయి కుంభకర్ణుడు నోరు తెరిచి బడబాముఖమువలె అరుస్తూ చంద్రుడుమీదికిపోయే రాహువువలె రాముడిమీదికి పరుగెత్తినాడు. అప్పుడు రాముడు తీక్ష్ణము అయిన ములుకులతోనూ బంగారు రెక్కలతోనూ ఉన్న బాణాలను ఆ కుంభకర్ణుడి నోటినిండా వదిలినాడు. ఆ అమ్ములతో ఆ తెరిచిన నోరు అంతా నిండిపోయింది. నోట మాట పెగలలేదు. ఎట్లాగో ఒక పెద్దకేక పెట్టినాడు. మూర్ఛపోయినాడు. అప్పుడు రాముడు సూర్యకిరణాలవలె కన్నులు మిరుమిట్లు గొలిపే ఒక బాణాన్ని తీసినాడు. అది బ్రహ్మదండమువంటిది. అతితీక్ష్ణము

అయింది. అది వాయువేగముతో పోతుంది. బంగారు రెక్కలు అమర్చిన ఆ బాణము వజ్రాయుధమువంటిది. పిడుగువంటిది. దానిని దేవేంద్రుడు నిర్మించినాడు. ఆ బాణాన్ని రాముడు కుంభకర్ణుడి కంఠాన్ని గురిచేసి వదిలినాడు.

ఆ అమ్ము పొగలతో భగభగ మండుతూఉన్న మంటలతో దశదిశలా తేజరిల్లచేస్తూ దేవేంద్రుడి వజ్రాయుధ వేగముతో రాముడి వింటిలోనుంచి దూసుకొనిపోయి కుంభకర్ణుడి కంఠము మీద పడ్డది. పూర్వము పురందరుడి వజ్రాయుధము వృత్రాసురుడి శిరస్సును తెగవేసినట్టు ఆ అమ్ము పర్వతశిఖరమువంటి కుంభకర్ణుడి శిరస్సును తెగవేసింది. వంకరతిరిగిన కోరలతో తళతళలాడే కుండలాలతో ఉన్న ఆ కుంభకర్ణుడి శిరస్సు పయికి ఎగిరింది. రాత్రిపూట ఆకాశములో ఉదయించిన పునర్వసు నక్షత్రాల రెంటిమధ్యను చంద్రబింబమువలె కనిపించింది. అట్లా పయికి ఎగిరిన ఆ కుంభకర్ణుడి శిరస్సు లంకాపట్టణ చర్యాగృహాలనూ పురద్వారాలనూ ఎంతో ఎత్తునఉన్న పట్టణప్రాకారాన్ని కొట్టుకొంటూపోయి నేలకూలింది.

ఆ కుంభకర్ణుడి మొండెము ఎటు ఎగురుతుందోననే భయముతో పరుగెత్తుతూఉన్న కోట్లకొద్ది వానరులను నేల పడకొట్టింది. పర్వతాకారములోఉన్న ఆ మొండెము అంతట సముద్రములో పడ్డది. ఆ మొండెము బరువుకు అప్పుడు సముద్రములోఉన్న గ్రాహాలూ మత్స్యాలూ సర్పాలూ అణగారిపోయినవి.

ఆ మహాబలవంతుడు కుంభకర్ణుడు హతము అయిపోగానే భూమి చలించింది. పర్వతాలు కదిలినవి. దేవతలు సంతోషాతిశయముతో కోలాహలధ్వనులు చేసినారు.

ఆకాశగతులు అయిన దేవర్షులూ మహర్షులూ పన్నగులూ దేవతలూ భూతగణాలూ యక్షులూ గంధర్వులూ గుహ్యకులూ గరుత్మంతులూ రాముడి పరాక్రమానికి అమితముగా సంతోషించినారు.

కుంభకర్ణుడు హతము అయిపోగానే రాక్షసరాజు బంధువులు అందరూ అమితముగా దుఃఖపడ్డారు. దేవాసురయుద్ధములో విష్ణుమూర్తినిచూచి అసురులు భయపడ్డట్టు ఈ వానర రాక్షస యుద్ధములో రాముణ్ణిచూచి రాక్షసులు భయపడిపోయినారు. పెద్ద

పెట్టున కేకలుపెడుతూ ఏడ్చినారు. దేవాసురయుద్ధములో రాహువునోటిలోనుంచి బయటపడి దేవలోకములో చీకటిని పోగొట్టిన సూర్యుడివలె ఈ వానరరాక్షసయుద్ధములో కుంభకర్ణుణ్ణి సంహారముచేసివేసిన రాముడు ఈ భూమిమీద తేజరిల్లినాడు.

ఆ భీమబలుణ్ణి దగ్గరకు పోవలవికాని ఆ పరమపరాక్రమవంతుణ్ణి రాముడు హతమార్చివేయగానే వానరులు అందరి ముఖాలూ సంతోషముతో పద్మాలవలె వికసించినవి. వారు అందరూ అప్పుడు రాముణ్ణి పూజించినారు.

దేవసమూహాలను జయించిన మహాబలవంతుణ్ణి మహాయుద్ధాలు అన్నీ అవలీలగా గెల్చిన ఆ పరమపరాక్రమవంతుణ్ణి కుంభకర్ణుణ్ణి యుద్ధములో చంపివేసిన రాముడు వృత్రాసురుణ్ణి వధించిన దేవేంద్రుడివలె సంతోషపడ్డాడు.

౬౮

మహాపరాక్రమవంతుడు రాముడు కుంభకర్ణుణ్ణి చంపివేసినాడు అని చెప్పడానికి రాక్షసులు తమ ఏలికదగ్గరకు పోయి "రాజా, కాలాంతకుడివంటి కుంభకర్ణుడు వానరసైన్యాలను పరుగు లెత్తించినాడు. అనేకమంది వానరవీరులను భక్షించివేసినాడు. ఒక కొంచెముసేపు వానరులను అందరినీ తాపము ఎత్తించినాడు. కాలకర్మమువల్ల కాలము చేసినాడు. రామపరాక్రమానికి గురి అయినాడు. ఆ పర్వతాకారుడి కంఠము తెగిపోయింది. ఎంతో నెత్తురుకారుతూ మొండెము సముద్రములో పడ్డది. బాహువులు తెగిపోయినవి. తొడలు తెగిపోయినవి. శిరస్సు భయంకరముగా లంకాపట్టణద్వారములో అడ్డముగా పడ్డది. రామబాణాలకు కుంభకర్ణుడు కార్చిచ్చుకు కాలిపోయిన చెట్టువలెనూ ముద్ద అయిపోయిన కొండచిలువవలెనూ వికృతముగా కనిపించినాడు" అని చెప్పినారు.

మహాబలవంతుడు కుంభకర్ణుడు యుద్ధములో చనిపోయినాడు అని చెప్పగానే రావణాసురుడు దుఃఖముతో తపించి పోయినాడు. మూర్ఛపోయినాడు. నేలమీద పడిపోయినాడు.

దేవాంతకుడూ నరాంతకుడూ త్రిశిరుడూ అతికాయుడూ తన పినతండ్రి చనిపోయినాడు. అని వినగానే పట్టరాని దుఃఖము వచ్చి ఆవురున ఏడ్చినారు.

మహోదరుడూ మహాపార్శ్వుడూ తమ తోబుట్టువును రాముడు చంపివేసినాడు అని చెప్పగానే దుఃఖసముద్రములో మునిగి పోయినారు.

రావణాసురుడు ఎంతో కష్టముమీద మూర్ఛ తేరుకొన్నాడు. కుంభకర్ణుడు చచ్చిపోయినందువల్ల దీనుడు అయిపోయి ఏడుస్తూ "అయ్యో, వీరుడా, నీవు శత్రువుల గర్వాన్ని అణచి వేసినావు. నీవు మహాబలవంతుడవు. ఓ కుంభకర్ణుడా, నన్ను వదిలిపెట్టి దైవవశమువల్ల నీవు యమసదనానికి పోయినావు. మహాబలవంతుడా, నీవు ఒంటరిగా పోయినావు. శత్రుసైన్యాలను తాపము ఎత్తించినావు. నా దుఃఖాన్నీ బంధువుల దుఃఖాన్నీ పోగొట్టకుండానే నన్ను వదిలిపెట్టి పోయినావు. నిన్ను అండాగా చేసుకొన్నందువల్లనే నేను సురాసురులకు భయపడలేదు. నీవు నా కుడిభుజానివి. నీవు ఇప్పుడు లేకుండాపోయినావు. కాబట్టి నేనూ ఉన్నా లేనట్టేను.

"నీవు దేవదానవుల గర్వాన్ని అణచివేసినావు. ప్రళయకాలాగ్నివంటివాడవు. రుద్రుడివంటివాడవు. నాయనా, నిన్ను యుద్ధములో రాముడు ఎట్లా చంపివేయ కలిగినాడు! వజ్రాయుధము దెబ్బ నిన్ను ఏమీ చేయలేకపోయిందే! అటువంటి నీవు ఎట్లా రామబాణార్తుడవు అయి నిద్రపోతున్నావు.

"తమ్ముడా, దేవగణాలు మహర్షులతోకూడా ఆకాశములో నిలుచుని యుద్ధములో నీవు చనిపోవడము చూచి "భలే-భలే" అని కేకలు వేసినారు. ఇప్పుడు వానరులు అందరూ సంతోషిస్తున్నారు. వాండ్లకు సందు దొరికింది. ఇంతవరకూ చొరనలవి కాకుండా ఉన్న ఈ లంకాపట్టణద్వారాలమీదికి ఇప్పుడే తప్పకుండా వాండ్లు అందరూ ఎక్కుతారు.

"తమ్ముడా, నాకు ఇక రాజ్యముతో పనిలేదు. సీతను ఇక నేను ఏమిచేసుకుంటాను. నీవు లేకుండా జీవించిఉండడము నాకు

ఇష్టములేదు. నిన్ను చంపివేసిన రాముణ్ణి నేను యుద్ధములో వధించలేకపోయినట్లయితే బ్రతికిఉండడముకన్నా చచ్చిపోవడమే మంచిది. జీవించిఉండడము నిరర్థకము. తమ్ముడా, నేనూ నీవు ఉన్నచోటుకే వస్తాను. నిన్ను వదిలిపెట్టి ఒక క్షణము అయినా బ్రతికిఉండడము నాకు ఇష్టములేదు. తమ్ముడా, నేను ఇదివరకు దేవతలకు అపకారము చేసినాను. వారు ఇప్పుడు నన్నుచూచి నవ్వుతారు. ఓ కుంభకర్ణుడా, నీవు చనిపోయినావు. నేను ఇకను దేవేంద్రుణ్ణి ఎట్లా జయిస్తాను!

"ఆ పూజ్యుడు విభీషణుడు చెప్పినమాటలు నేను నా అజ్ఞానమువల్ల వినలేదు. అతడు చెప్పినట్టు చేసిఉన్నట్లయితే శుభము అయ్యేది. ప్రహస్తుడూ కుంభకర్ణుడూ దారుణముగా చనిపోయినారు. వారి చిత్రవధ విన్నప్పటినుంచీ విభీషణుడు చెప్పినమాటలు జ్ఞాపకము వస్తూఉన్నవి. నాకు సిగ్గువేస్తూఉంది. విభీషణుడు ధార్మికుడు. అతణ్ణి నేను వెళ్లగొట్టినాను. తమ్ముణ్ణి వెళ్లగొట్టడముకన్నా పాపకర్మము మరిఒకటి లేదు. ఆ పాపకర్మ పరిపాకమే ఈ దుఃఖము" అనుకొంటూ ఆ పదిముఖాలవాడు రావణాసురుడు దేవేంద్రుణ్ణి ఎదిరించిన తన తమ్ముడు కుంభకర్ణుడు చచ్చిపోయినందుకు వ్యాకులపడిపోయి దీనుడు అయి ఏడ్చినాడు. ఆ దుఃఖము భరించలేక మూర్ఛపోయినాడు.

౬౯

శోకములో తపించిపోతూ విలపిస్తూవున్న రావణాసురుణ్ణి త్రిశిరుడు చూచి "రాజా, నీవు చెప్పినట్టు మా పినతండ్రి కుంభకర్ణుడు మహాపరాక్రమవంతుడే, సందేహములేదు. అయితే దైవవశమువల్ల హతుడు అయిపోయినాడు. నీవంటి పెద్దలు, అందులో నీవంటి ధైర్యవంతులు విలపించరు. ప్రభూ, నీవు ఒక్కడవే త్రిభువనాలను అయినా జయించివేయగలవు. అటువంటి నీవు ఇప్పుడు ఒక అల్పుడివలె ఎందుకు దుఃఖపడతావు? నీకు బ్రహ్మదేవుడు ఇచ్చిన శక్త్యాయుధమూ కవచమూ బాణమూ ధనుస్సూ మేఘగంభీరధ్వనులు చేస్తూ వెయ్యి కంచరగాడిదలు లాగుకొనిపోయే రథమూ ఉన్నవి. రాజా, నీవు ఒకప్పుడు ఏఆయుధమూ లేకుండా

దేవతలనూ దానవులనూ జయించినావు. ఇప్పుడు నీకు సమస్తా
యుధాలూ ఉన్నవి. ఆ రాముణ్ణి జయించడము నీకు ఒక లెక్కా.

"రాజా, నీవు యథేష్టముగా ఇక్కడనే ఉండు. నేను పోయి
పోరాడుతాను. గరుత్మంతుడు పాములను పట్టుకొని చంపివేసేట్టు
నేను నీ శత్రువులను పట్టుకొని చంపివేస్తాను. దేవేంద్రుడు శంబ
రాసురుణ్ణి వధించినట్టూ విష్ణుదేవుడు నరకాసురుణ్ణి వధించినట్టూ
యుద్ధములో నేను రాముణ్ణి వధించివేస్తాను" అని చెప్పినాడు.

ఈ విధముగా త్రిశిరుడు చెప్పిన మాటలు రావణాసురుడు
విన్నాడు. కాలము ముసించుకొని వస్తూ ఉన్నందువల్ల
తాను పునర్జన్మము ఎత్తినట్టుగా సంతోషముతో ఉప్పొంగి
పోయినాడు.

అప్పుడు దేవాంతకుడూ నరాంతకుడూ అతికాయుడూ
త్రిశిరుడి మాటలు విని "మేము యుద్ధము చేస్తాము" అంటే
"మేము యుద్ధము చేస్తాము" అంటూ గర్జించినారు. రావణా
సురుడి ఆ నలుగురు పుత్రులూ వీరులు. దేవేంద్రుడితో సరిసమా
నము అయిన పరాక్రమవంతులు. నలుగురూ మాయావిశారదులు.
ఆకాశములోకి పోయి యుద్ధము చేస్తారు. నలుగురూ దేవతల
దర్పాన్ని అణచి వేసినారు. పోరాటములో జయించ నలవికాని
వాండ్లు. మహాబలవంతులు అని ప్రసిద్ధికెక్కినారు. ఆ నలుగురినీ
గంధర్వులూ కిన్నరులూ మహోరగులూ దేవతలూ ఏకము అయిన
ప్పటికిన్నీ జయించలేరు. నలుగురూ ప్రజ్ఞావంతులు. బ్రహ్మాది
దేవతలను మెప్పించి నలుగురూ వరాలు సంపాదించినారు. ఆ
సూర్యసమాన వర్చస్సుతో శత్రువులను మర్దించివేసే ఆ నలుగురు
పుత్రులతో రాక్షసరాజు రావణాసురుడు దానవుల గర్వము అణచి
వేసిన దేవేంద్రుడివలె తేజరిల్లినాడు.

రావణాసురుడు అప్పుడు ఆ నలుగురు పుత్రులనూ కౌగ
లించుకొన్నాడు. ఆభరణాలతో వారిని అలంకరించినాడు.
ఆశీర్వదించినాడు. పోరాటానికి పొమ్మని ప్రోత్సాహము చేసి
నాడు. ఆ కుమారులను కాపాడడానికి తన తమ్ములను మహో
దరుణ్ణి మహాపార్శ్వుణ్ణి వెంట యుద్ధభూమికి పొమ్మని చెప్పినాడు.

అప్పుడు ఆ మహాధైర్యవంతుడికి శత్రువులను గగ్గోలుపరిచే ఆ రావణాసురుడికి ఆ మహాకాయులు ప్రదక్షిణ నమస్కారాలుచేసి యుద్ధభూమికి ప్రయాణము అయినారు. శత్రువుల ఆయుధాల దెబ్బలు తమను బాధపెట్టకుండా ఉండడానికి వారు ఓషధులగంధము ఒంటికి పూసుకొన్నారు. కాలము ముగించుకొని వస్తూ ఉన్నందువల్ల ఆ మహాబలవంతులు ఆరుగురూ మహోత్సాహముతో యుద్ధభూమికి అంతట బయలుదేరినారు.

మహోదరుడు సుదర్శనము అనే నీలమేఘమువంటి ఐరావతజాతి ఏనుగును ఎక్కినాడు. సమస్తాభరణాలతోనూ అలంకరించిన ఆ మదపుటేనుగుమీద సమస్తాయుధాలతోనూ అమ్ముల పొదులతోనూ కూర్చున్న ఆ మహోదరుడు అస్తగిరిమీది సూర్యుడివలె కనిపించినాడు. సమస్తాయుధాలతోనూ రథముమీద ధనుర్ధరుడు అయి కూర్చున్న త్రిశిరుడు పర్వతశిఖరముమీద ఇంద్రధనుస్సుతోనూ కొరవులతోనూ తేజరిల్లే మహామేఘమువలె కనిపించినాడు. మూడుతలలకిరీటము పెట్టుకొని రథముమీద కూర్చున్న ఆ త్రిశిరుడు మూడు బంగారుశిఖరాలతో ధగధగలాడే హిమవంతుడివలె తోచినాడు. మేటివిలుకాడూ మహాపరాక్రమవంతుడూ అయిన అతికాయుడు మంచి చక్రాలతోనూ గట్టి ఇరుసుతోనూ చక్కని నొగలతోనూ ఉన్న రథముయెక్కి అమ్ములపొదులతోనూ తళ తళ మెరుస్తూ ఉన్న ఈటెలతోనూ ఖడ్గాలతోనూ ఇనుపగుదియలతోనూ కూర్చున్నాడు. దేదీప్యమానము అయిన కిరీటముతోనూ బంగారు ఆభరణాలతోనూ ధగధగలాడుతూ ఆ రథముమీద కూర్చున్న అతికాయుడు మేరుపర్వతమువలె భాసించినాడు. ఆ మహాబలవంతుడు అతికాయుడు చుట్టూ ఉన్న పెద్దపులులవంటి రాక్షసవీరులతో దేవతల మధ్యను దేవేంద్రుడివలె తేజరిల్లినాడు. బంగారు ఆభరణాలతోనూ మహాకాయముతోనూ అమితవేగముతోనూ పోయే శ్వేతాశ్వముమీద నరాంతకుడు ఎక్కినాడు. ఉచ్చైశ్శ్రవమువంటి ఆ శ్వేతాశ్వముమీద కొరవివంటి ఈటె పట్టుకొని కూర్చున్న నరాంతకుడు నెమలివాహనముమీద శక్త్యాయుధము పట్టుకొనిపోయే కుమారస్వామివలె కనిపించినాడు. మహాకాయుడూ మహాపరాక్రమవంతుడూ అయిన మహాపార్శ్వుడు

గదను పట్టుకొని యుద్ధభూమిలో గదాపాణి అయిన కుబేరుడివలె తోచినాడు. అప్రతిమానసైన్యాలతో అమరావతీ పట్టణమునుంచి బయలుదేరిపోయే దేవతలవలె అప్రతిమానసైన్యాలతో లంకాపట్టణమునుంచి ఆ రాక్షసవీరులు యుద్ధభూమికి బయలుదేరినారు. రాక్షసయోధులు ఉత్తమాయుధాలతో ఏనుగులమీదనూ గుఱ్ఱాలమీదనూ మేఘగంభీరధ్వనులు చేస్తూ నడిచే రథాలమీదనూ బయలుదేరినారు. ఆ సూర్యవర్చస్కులు ఆ కిరీటకుండలధరులు రాక్షసరాజు నల్గురు కుమాళ్లూ ఆకాశములో గ్రహాలవలె తేజరిల్లినారు. ఆ రాకుమారులు పట్టుకొని పోతూఉన్న ఆయుధాల పంక్తి తళతళలాడుతూ శరత్కాలస్వచ్ఛాకాశములో హంసల పంక్తులవలె తోచినది.

ఆ రాక్షసవీరులూ ఆ రాక్షసయోధులూ ఆ యుద్ధములో శత్రువులను జయించవలెను లేదా తాము చచ్చి అయినా పోవలెను అని మతిస్థిరము చేసుకొన్నారు. అట్లా యుద్ధము చేయవలెను అనే మదముతో మహోత్సాహముతో పోరాటానికి సాగిపోతూ ఉరుములు ఉరిమినట్టు భయంకరముగా సింహనాదాలు చేసినారు. శత్రువులనుగురించి నిందావాక్యాలు పలుకుతూనూ ధనుస్సులు మోగిస్తూనూ నడిచినారు. ఆ రాక్షసయోధుల అరుపులకూ వాండ్ల భుజాస్ఫాలన ధ్వనులకూ అప్పుడు భూమి చలించిపోతున్నట్టుగానూ వాండ్ల సింహనాదాలకు ఆకాశము పగిలిపోతున్నట్టుగానూ తోచింది. ఆ మహాబలవంతులు రాక్షసవీరులు అట్లా పరమసంతోషముతో లంకాపట్టణమునుంచి యుద్ధభూమికి పోయినారు. అక్కడ మహావృక్షాలూ పర్వతశిఖరాలూ పట్టుకొని యుద్ధసన్నద్ధము అయి ఉన్న వానరసైన్యాన్ని రాక్షసవీరులు చూచినారు.

ఆ రాక్షససైన్యము గుఱ్ఱాలతోనూ ఏనుగులతోనూ రథాలతోనూ కిటకిటలాడుతూనూ ఆ గుఱ్ఱాలకూ ఏనుగులకు రథాలకూ కట్టిన ఘంటల మోతలు మోగుతూనూ గజ్జల చప్పుళ్లు చేస్తూనూ రావడము వానరయోధులు అందరూ చూచినారు. ఏనుగులమీద ఉన్న రాక్షసయోధులు నీలమేఘాలవలెనూ ఆయుధాలుధరించిన రాక్షసయోధులు మంటలు మండుతూఉన్న అగ్నిహోత్రాలవలెనూ

గ్రీష్మకాల సూర్యుడివలె కనిపించినారు. ఆ రాక్షససైన్యము అట్లా తమమీదికి రావడము చూచి ఆ మహాబలవంతులు వానరయోధులు అందరూ తమ పరాక్రమము చూపించే అవకాశము వచ్చింది అని సంతోషపడ్డారు. పర్వతశిఖరాలు తీసుకొని సింహనాదాలు చేసినారు. రాక్షసయోధులను చూచి వానరయోధులు ఓర్వలేక గర్జించసాగినారు. వానరసేనాసమూహాల భయంకర సింహనాదాలను విని వారి సంతోషాతిశయాన్ని చూచి ఆ మహాబలవంతులు రాక్షసయోధులు సహించలేక మరింతభయంకరముగా సింహనాదాలు చేసినారు. వానరసేనానాయకులు పర్వతశిఖరాలు తీసుకొని మహాభయంకరము అయిన ఆ రాక్షససైన్యములో చొరపడ్డారు. పర్వతాకారులు అయిన ఆ వానరయోధులు పట్టుకొని పోయిన పర్వతశిఖరాలతో పెద్దపెద్ద శిఖరాలు ఉన్న పర్వతాలుగా కనిపించినారు. వృక్షాలూ శిలలూ ఆయుధాలుగా పోరాడే ఆ వానరయోధులు కోపములో ఊలరేగినారు. కొందరు వానరులు ఆకాశానికి ఎగిరిపోయినారు. కొందరు భూమిమీదనే ఆ రాక్షససైన్యాన్ని ఎదిరించినారు. లావాటి కొమ్మలతో ఉన్న వృక్షాలు పట్టుకొని ఆ రాక్షససైన్యములో తిరుగసాగినారు.

ఆ యుద్ధభూమిలో కిక్కిరిసిఉన్న రాక్షసయోధులకున్నూ వానరయోధులకున్నూ అప్పుడు భయంకరము అయిన పోరాటము ఆరంభము అయింది. రాక్షసవీరులు బాణాలతో అడ్డగిస్తూన్నప్పటికిన్ని వానరులు భయంకరము అయిన పరాక్రమములో అనుపమానముగా వృక్షాలూ పర్వతశిఖరాలూ వానగా రాక్షసయోధుల మీద కురిపించినారు. రాక్షసులూ వానరులూ భయంకరముగా పోరాటము సాగిస్తూ సింహనాదాలు చేసినారు. వానరయోధులు కొందరు రాళ్లతో రాక్షసయోధులను ఉతుకకొట్టినారు. కొందరు వానరయోధులు కవచాలతోనూ ఆభరణాలతోనూ ఉన్న రాక్షసులను కొట్టినారు. కొందరు వానరులు రథాలమీదనూ గుర్రాలమీదనూ ఏనుగులమీదనూ ఉన్న రాక్షసులను కొట్టినారు. కొందరు పైకి ఎగిరి కిందఉన్న రాక్షసయోధులను కొట్టినారు. ఆ పోరాటములో రాక్షసులు పర్వతాలదెబ్బలకు పడిపోయినారు. కొందరు రాక్షసులు వానరుల పిడికిలిపోట్లకు కనుగుడ్లు బయటికి

వెళ్లుకొనివచ్చి తిరుగుతూ నేలకూలినారు. కొందరు రాక్షస యోధులు అరచినారు.

రాక్షసులున్నూ వానరులను బాణాలతో ఒళ్లు బద్దలు కొట్టినారు. శూలాలతో కొందరు వానరులను పొడిచివేసినారు. ఇనుప గుదియలతో కొందరు వానరులను పడగొట్టినారు. ఈటెలతో కొందరు వానరులను చంపివేసినారు. ఖడ్గాలతో కొందరు వానరులను తెగవేసినారు. శక్త్యాయుధాలతో కొందరు వానరులను సంహరించినారు.

పరస్పరజయైషిణులు అయి వానరులూ రాక్షసులూ పోరాడుతూ దేహాలు నెత్తురుతో తడిసిపోయి ఒకరినొకరు నేలమీద పడ తోసుకున్నారు. వానరులు కొట్టిన వృక్షాలతోనూ పర్వతశిఖరాలతోనూ రాక్షసులు ఉపయోగించిన ఖడ్గాద్యాయుధాలతోనూ అప్పుడు ఆ యుద్ధభూమి అంతా నిండిపోయింది. అచిరకాలములో ఆ యుద్ధభూమిలోనుంచి నెత్తురు వరదలు అయి పారింది. శత్రుసంహారము చేయవలెను అనుకొని యుద్ధమదముతో వచ్చిన రాక్షసులు అనేకమంది పర్వతాకారులు వానరులచేత చచ్చి నేలకూలి పగిలిపోయిన పర్వతాలవలె కనిపించినారు.

ఆ పోరాటములో వానరయోధులు రాక్షసయోధులును పడలాగినారు. అట్లా పడలాగుతూఉంటే రాక్షసయోధుల చేతులలో ఉన్న శూలాద్యాయుధాలు విరిగిపోయినవి. ఆయుధాలు విరిగిపోయినప్పటికిన్నీ అనేకమంది హతము అయిపోతూ ఉన్నప్పటికిన్నీ రాక్షసయోధులు తమ కరచరణాద్యాయుధాలతో మహాద్భుతముగా పోరాటము సాగించినారు. ఆ రాక్షసయోధులు తమచేత చిక్కిన వానరయోధులను పట్టుకొని గిరగిర తిప్పుతూ తిప్పుతూ ఉన్నవారితో తక్కిన వానరయోధులను కొట్టి చంపివేసినారు. అదే విధముగా వానరయోధులున్నూ రాక్షసయోధులను పట్టుకొని గిర గిర తిప్పుతూ ఉన్నవారితో తక్కిన రాక్షసయోధులను కొట్టి చంపివేసినారు. అవిధముగా వానరయోధులను వానరయోధులచేతనూ రాక్షసయోధులను రాక్షసయోధులచేతనూ చంపించినారు. రాక్షసయోధులు ఆ పోరాటములో

వానరయోధుల చేతులలో ఉన్న పర్వతశిఖరాలనూ వృక్షాలనూ ఊడలాక్కొని వానరులను కొట్టి చంపివేసినారు. అదే విధముగా రాక్షసుల చేతులలో ఉన్న ఆయుధాలను వానరయోధులు ఊడలాక్కొని రాక్షసులను కొట్టి చంపివేసినారు. వానరులు రాక్షసులను రాళ్లతో కొట్టి వాళ్ళ దేహాలు గాయాలు అయి పడిపోగానే సింహనాదాలు చేసినారు. అదేవిధముగా రాక్షసులు శూలాద్యాయుధాలతో వానరులను కొట్టి వాండ్ల దేహాలు గాయాలు అయి పడిపోగానే సింహనాదాలు చేసినారు. ఆ పోరాటములో వానరులు కొట్టిన దెబ్బలకు రాక్షసుల కవచాలు తెగి కత్తివాట్లకు చెట్లనుంచి పాలు కారేట్టు దేహాలనుంచి నెత్తురు కారింది. ఆ పోరాటములో కొందరు వానరులు రథాలతో రథాలనూ ఏనుగులతో ఏనుగులనూ గుర్రాలతో గుర్రాలనూ అత్యద్భుతముగా కొట్టించినారు. వానరులు అందరూ పరమసంతోషములో కఠినశిలలూ పెద్ద పెద్ద చెట్లూ తీసుకొని కొట్టి రాక్షసయోధులను చంపివేసినారు. ఆ యుద్ధము పరమభయంకరముగానూ దొమ్మిగానూ జరిగింది.

రాక్షసులు కరుకు అయిన అర్ధచంద్రాకారపు బాణాలతోనూ పదును అయిన బల్లెములతోనూ ఇంకా వివిధాయుధాలతోనూ వానరులను కొట్టి చంపివేసినారు. వానరులు తీసుకునిపోయిన చెట్లనూ పర్వతశిఖరాలనూ ముక్కలు ముక్కలు చేసివేసినారు. ఆ యుద్ధభూమిలో పగిలిపోయిన పర్వతశిఖరాలూ ముక్కలు ముక్కలు అయిపోయిన మహావృక్షాలూ చచ్చి పడిపోయిన రాక్షసుల కళేబరాలూ వానరుల కళేబరాలూ రాశులు రాశులుగా పడిపోయి నడవడానికి దారిలేకుండా పోయింది. ఆ మహాసత్త్వసంపన్నులు వానరులు అందరూ సంతోషములోనూ గర్వములోనూ నిర్భయముగా వానరచేష్టలు చేస్తూ రాక్షసుల చేతులలోనుంచి నానా విధాయుధాలూ ఊడలాక్కొని ఆ ఆయుధాలతోనే రాక్షసులను కొట్టి చంపివేసినారు. అట్లా దొమ్మిగా సాగిన ఆ యుద్ధములో వానరులు అత్యుత్సాహముతో రాక్షసులను పడగొట్టుతూ ఉంటే పయిన ఆకాశములో ఉన్న మహర్షులూ దేవతలూ సంతోష ధ్వనులు చేసినారు.

అప్పుడు నరాంతకుడు పదును అయిన శక్త్యాయుధముతో వాయువేగముతో పోయే గుర్రముమీద బయలుదేరి వచ్చి మహా సముద్రములో చొరపడే మహామీనమువలె ఆ వానరసైన్యములో చొరపడ్డాడు. ఆ పరమపరాక్రమవంతుడు ఆ మహాధైర్యవంతుడు తళతళలాడుతూ ఉన్న ఈటెతో పొడిచి ఇట్టే ఏడువందలమంది వానరులను చీల్చివేసినాడు. క్షణకాలములో వానరవీరులను అందరినీ భయపెట్టినాడు. అప్పుడు ఆ వానరసైన్యములో గుర్రముమీద తిరుగుతూఉన్న మహాధైర్యవంతుణ్ణి ఆ నరాంతకుణ్ణి ఆకాశములో నుంచి దేవతలూ విద్యాధరులూ మహర్షులూ చూచినారు.

ఆ యుద్ధభూమి అంతటా మాంసముతోనూ రక్తముతోనూ బురద బురద అయి ఉండడమూ చచ్చిపడిఉన్న పర్వతాకారులు అయిన వానరులు కిక్కిరిసి ఉండడమూ నరాంతకుడు చూచినాడు. చావగా మిగిలియున్న వానరవీరులు అందరూ పరాక్రమించే లోపలనే వారిని అందరినీ వెంబడించి తనచేతిలో ఈటెతో వారిని అందరినీ చీల్చి వేసినాడు. మహారణ్యాన్ని కాల్చిచ్చు మంటలవలె వానర సైన్యాన్ని నరాంతకుడు జ్వలిస్తూ ఉన్న తన ఈటెతో రూపుమాపి వేసినాడు. వానరులు వృక్షాలనూ పర్వతశిఖరాలనూ పెళ్లగించే లోపలనే దేవేంద్రుడు వజ్రాయుధముతో పర్వతాలను పగుల గొట్టేట్టు నరాంతకుడు తన ఈటెతో పర్వతాకారులు అయిన ఆ వానరులను విరగగొట్టినాడు. వానాకాలములో ఎడా పెడా కొట్టే గాలివలె ఆ మహాబలవంతుడు నరాంతకుడు ఆ యుద్ధభూమిలో అన్నిదిక్కులా వానరులను మర్దిస్తూ తిరిగినాడు. ఆ పరాక్రమ వంతుడు పైకి ఎగురుతూ ఉన్న వానరులనూ భూమిమీద ఉన్న వానరులనూ పారిపోతూఉన్న వానరులనూ పట్టుకొని కొట్టుతూ ఉంటే వానరవీరులు భయపడి పరుగెత్తి పారిపోలేకపోయినారు. అక్కడ నిలువలేకపోయినారు. కదలలేకపోయినారు. మెదలలేక పోయినారు.

ప్రళయకాల యముడివలెనూ గ్రీష్మకాల సూర్యుడివలెనూ తేజరిల్లుతూఉన్న ఒక్క ఈటెతో ఆ నరాంతకుడు వానరసైన్యాన్ని అంతా నేలమీద పడకొట్టినాడు. వజ్రాయుధము దెబ్బవంటి ఆ ఈటెదెబ్బను వానరులు ఓర్చుకోలేక పెద్దపెట్టున కేకలు

పెట్టినాడు. ఆ ఈటెదెబ్బకు పడిపోతున్న వానరుల ఆకారాలు వజ్రాయుధము దెబ్బకు నేలకూలిన పర్వతాలవలె కనిపించినవి.

ఆ పోరాటము అట్లా జరుగుతూ ఉండగా అదివరకు కుంభకర్ణుడు పడగొట్టిన వానరవీరులు మూర్ఛ తేరుకొని సుగ్రీవుడిదగ్గరకు పోయినారు. అప్పుడు సుగ్రీవుడున్నూ ఏవైపున ఏమి జరుగుతూందోనని నాల్గువైపులా చూచినాడు. నరాంతకుడి దెబ్బలకు ఓర్చుకోలేక భయపడి అన్నివైపులా పారిపోతున్న వానరయోధులు కనిపించినారు. గుర్రముమీద కూర్చొని చేతిలో ఈటెపట్టుకొని వానరులను పరుగులెత్తిస్తూ ఉన్న నరాంతకుణ్ణి చూచినాడు. అంతట మహాతేజోవంతుడు అయిన ఆ వానరరాజు సుగ్రీవుడు దేవేంద్రుడితో సరిసమానము అయిన పరాక్రమవంతుణ్ణి మహాబలవంతుణ్ణి అంగదుణ్ణి చూచి "నాయనా, అదుగో కనపడుతున్నాడు. గుర్రముమీద వస్తూఉన్నాడు. మన వానరసైన్యాన్ని మహాక్షోభ పెట్టినాడు. నీవు పో. ఆ రాక్షసుణ్ణి సంహరించు. వెంటనే పో" అని చెప్పినాడు.

ఈ విధముగా సుగ్రీవుడు చెప్పగానే మేఘసమూహమువంటి ఆ వానరసైన్యములోనుంచి అంగదుడు ఆకాశానికి ఎగిరినాడు. మేఘసమూహాలలోనుంచి వెలువడిన సూర్యుడివలె తేజరిల్లినాడు. పర్వతసమూహమువంటి ఆకారముతో నవరత్నఖచితము అయిన బంగారు బాహుపురులతో తేజరిల్లుతూఉన్న ఆ అంగదుడు గైరికాది ధాతువులతో ధగధగలాడుతూఉన్న పర్వతమువలె కనిపించినాడు. ఆ అంగదుడు తన గోళ్లతోనూ కోరలతోనూ చేతులతోనూ కాళ్ళతోనూ పోరాడదలచుకొని ఏఆయుధమూ లేకుండా నరాంతకుణ్ణి ఎదుర్కొని "ఓ రాక్షసుడా, నిలు నిలు. అల్పులతో పోరాడినందువల్ల నీకు ఏమిలాభము. వజ్రమువంటి నీ ఈటెతో చేత అయితే నా వక్షఃస్థలాన కొట్టు. నా పేరు అంగదుడు. నేను యువరాజును" అని చెప్పినాడు.

ఆ మాటలు వినగానే నరాంతకుడు పళ్లతో తన పెదవి కొరుక్కొన్నాడు. మహాసర్పము రేగి బుసలు కొట్టేటట్టు నిట్టూర్పులు విడువసాగినాడు. కోపముతో అంగదుణ్ణి ఎదుర్కొన్నాడు. తళ

తళతళలాడుతూఉన్న తన ఈటెను అంగదుడి ఎదురురొమ్మున్మలమీద విసరివేసినాడు. వజ్రముతో సరిసమానము అయిన ఆ అంగదుడి వక్షఃస్థలముమీద ఆ ఈటె పడి విరిగి ముక్కలు ముక్కలు అయిపోయింది. గరుత్మంతుడు కొరికివేసిన సర్పమువలె నేలమీద పడిపోయిన ఆ ఈటెను చూచి అంగదుడు సంతోషపడ్డాడు. అంతట నరాంతకుడి గుఱ్ఱము నెత్తిన అంగదుడు తన అరచేతితో చరిచినాడు. ఆ చరుపుకు పర్వతాకారములోఉన్న ఆ గుఱ్ఱము తల పగిలి దాడలు లోపలికిపోయి కనుగుడ్లు బయటికి వెళ్లుకొనివచ్చి నాలుక చాచి నేలకూలింది.

ఆ మహాపరాక్రమవంతుడు నరాంతకుడు తన గుఱ్ఱము పడిపోయినందుకు క్రోధావేశపరవశుడు అయి పిడికిలి బిగించి చెయ్యి ఎత్తి అంగదుడి నెత్తిమీద కొట్టినాడు. ఆ పిడికిటిపోటుకు అంగదుడి తల చిట్లి వేడివేడి నెత్తురు కారింది. ఆ తల మంటలు మండినట్టు అయిపోయింది. అంతట అంగదుడు మూర్ఛపోయినాడు. కొంచెము సేపటికి తెప్పిరిల్లినాడు. నరాంతకుడి బలానికి ఆశ్చర్యపడి పోయినాడు. అంతట ఆ ధైర్యవంతుడు అంగదుడు వజ్రమువలె కఠినమూ పర్వతశిఖరమువలె కఠుకూ అయిన తన పిడికిటితో నరాంతకుడి ఎదురురొమ్మున్మలమీద ఒక్కపోటు పొడిచినాడు. ఆ పిడికిటిపోటుకు నరాంతకుడి వక్షఃస్థలము ముక్కలు ముక్కలుగా పగిలిపోయింది. అగ్నిజ్వాలలవలె దేహము అంతటా నెత్తురు వ్యాపించింది. వజ్రాయుధము దెబ్బకు పగిలిపోయిన పర్వతమువలె నరాంతకుడు నేలకూలినాడు. అంగదుడు ఆ నరాంతకుణ్ణి అట్లా పడగొట్టి చంపివేయగా ఆ యుద్ధభూమిలో వానరయోధులూ ఆకాశములో దేవతలూ సంతోషాతిశయముతో మహాధ్వనులు చేసినారు.

ఎవరూ ఎదిరించలేని ఆ నరాంతకుణ్ణి అంగదుడు చంపివేసినందుకు రాముడు ఆశ్చర్యపోయినాడు. సంతోషపడ్డాడు. అంగదుణ్ణి మెచ్చుకొన్నాడు. అంగదుడు సంతోషముతో మళ్లీ యుద్ధసన్నద్ధుడు అయినాడు.

౭౦

నరాంతకుణ్ణి అంగదుడు చంపివేయడముచూచి దేవాంతకుడూ త్రిశిరుడూమహోదరుడూ దుఃఖపడిపోయినారు. అంతట ఆ మహా బలవంతుడు మహోదరుడు మహామేఘమువంటి ఏనుగును ఎక్కిపోయి అంగదుణ్ణి ఎదుర్కొన్నాడు. తన తోబుట్టువు చనిపోయినందుకు దుఃఖముతో తపించిపోతూ దేవాంతకుడు ధగధగలాడుతూఉన్న ఇనుపగుదియతో పోయి అంగదుణ్ణి ఎదిరించినాడు. ఉత్తమాశ్వాలు పూంచిన రథముమీద త్రిశిరుడు బయలుదేరి పోయి అంగదుణ్ణి ఎదుర్కొన్నాడు.

దేవతలదర్పాన్ని అణచివేసిన ఆ రాక్షసోత్తములు సల్గురూ తనను ఎదుర్కొనటము చూచి అంగదుడు ఒక మహావృక్షాన్ని పెల్లగించి పట్టుకొన్నాడు. పూచిన పెద్ద పెద్ద కొమ్మలతో దేవేంద్రుడి వజ్రాయుధమువలె ధగధగలాడుతూఉన్న ఆ మహా వృక్షాన్ని అంగదుడు దేవాంతకుడిమీద విసరివేసినాడు. అప్పుడు త్రిశిరుడు పాములవంటి బాణాలు వదిలి ఆ మహావృక్షాన్ని నరికి వేసినాడు. అదిచూచి అంగదుడు ఆకాశానికి ఎగిరి చెట్లవాన రాళ్లవాన కురిపించినాడు. అందుకు త్రిశిరుడు క్రుద్ధుడు అయిపోయి తన నిశితబాణాలతో ఆ వచ్చిపడుతూఉన్న చెట్లను అన్నిటినీ నరికివేసినాడు. ఆ త్రిశిరుడే కాకుండా దేవాంతకుడు తన ఇనుప గుదియతో ఆ వచ్చిపడుతూఉన్న చెట్లను అన్నిటినీ విరగ కొట్టినాడు.

త్రిశిరుడు బాణాలువదిలి అంగదుణ్ణి అడ్డగించినాడు. ఏనుగు మీద ఉన్న మహోదరుడు అంగదుణ్ణి ఎదుర్కొన్నాడు. తోమ రాయుధముతో అతడి వక్షఃస్థలాన కొట్టినాడు. దేవాంతకుడున్నూ క్రుద్ధుడు అయిపోయి అమితవేగముతో పోయి అంగదుణ్ణి తన ఇనుప గుదియతో ఎదుర్కొన్నాడు. అట్లా ముగ్గురు రాక్షసశ్రేష్ఠులు ఏకకాలాన తనను ఎదుర్కొన్నప్పటికిన్నీ ఆ మహావర్చస్కుడు ఆ మహాప్రతాపవంతుడు అంగదుడు ఏమాత్రమూ జంకలేదు. ఆ అజయ్యుడు ఆ మహావేగుడు అంగదుడు అమితవేగముతో పైకి ఎగిరి మహోదరుడు ఎక్కివచ్చిన ఏనుగుతలను తన అరచేతితో

చరచినాడు. ఆ దెబ్బకు ఆ ఏనుగు రెండుకన్నులూ ఊడి పడిపోయినవి. ఆ ఏనుగు ఘోరముగా అరిచింది. క్షణలేశములో అంగదుడు ఆ ఏనుగు రెండుదంతాలనూ పెకలించివేసినాడు. అంతట ఇట్టె ఆ దేవాంతకుణ్ణి కొట్టినాడు. ఆ దెబ్బకు దేవాంతకుడి అవయవాలు స్వాధీనము తప్పిపోయినవి. నోటిలోనుంచి లక్క-రసమువంటి నెత్తురు కక్కుకొన్నాడు. గాలికి పెళ్ళగిలిన చెట్టువలె నేలమీదికి ఒరిగినాడు. ఎంతో కష్టముమీద ఆ బలవంతుడు ఆ పరాక్రమవంతుడు దేవాంతకుడు తెప్పిరిల్లినాడు మెల్లగా లేచినాడు. భయంకరముఅయిన తన ఇనుపగుదియను గిరగిరతిప్పి అంగదుణ్ణి కొట్టినాడు. ఆ దెబ్బకు అంగదుడి మోకాళ్ళపట్టు తప్పిపోయి కిందపడ్డాడు. మళ్ళీ మెల్లగా లేచినాడు.

అట్లా లేస్తూఉన్న అంగదుణ్ణిచూచి త్రిశిరుడు గురితప్పని భయంకరబాణాలను ఆ అంగదుడి లలాటానికి గురిచేసి వదిలినాడు. అంగదుణ్ణి ముగ్గురు రాక్షసశ్రేష్ఠులు కమ్ముకొని కొట్టుతూఉన్నారు అని తెలుసుకొని హనుమంతుడూ నీలుడూ అంగదుడిదగ్గరకు పోయినారు. నీలుడు ఒక పర్వతశిఖరాన్ని త్రిశిరుడి శిరస్సుమీద పడేట్టు విసరివేసినాడు. ఆ బుద్ధిమంతుడు త్రిశిరుడు తన వాడి వాడి బాణాలతో ఆ పర్వతశిఖరాన్ని ముక్కలు ముక్కలు చేసివేసినాడు. అట్లా ముక్కలు ముక్కలు అయిపోయిన రాళ్లు నిప్పులుచెరుగుతూ మంటలు మండుతూ నేలమీద రాలినవి. అదిచూచి సంతోషాతిశయముతో దేవాంతకుడు విజృంభించి తన ఇనుపగుదియతో హనుమంతుణ్ణి ఎదిరించినాడు. అట్లా తనను ఎదిరించిన దేవాంతకుణ్ణి చూచి హనుమంతుడు ఇట్టే పయికి ఎగిరి వజ్రమువంటి తన పిడికిటితో అతడి తలమీద కొట్టినాడు. రాక్షసులు అందరూ చలించిపోయేట్టు సింహనాదము చేసినాడు. ఆ పిడికిటిపోటుకు ఆ దేవాంతకుడి తల ముక్కలు చెక్కలు అయిపోయింది. పళ్ళూ కళ్ళూ బయటికి వెళ్లుకొని వచ్చినవి. నాలుక చాచినాడు. ఆ దేవాంతకుడి ప్రాణము పోయింది. తటాలున నేలమీద పడిపోయినాడు.

రాక్షసయోధులలో ముఖ్యుడూ దేవతలను ఎదిరించిన మహా బలవంతుడూ అయిన దేవాంతకుడు అట్లా పోరాటములో

చచ్చి పడిపోగానే త్రిశిరుడు క్రుద్ధుడు అయిపోయి మహోగ్రనిశితాగ్ర బాణాలను నీలుడి వక్షఃస్థలాన వదిలినాడు. మందరపర్వతమువంటి ఏనుగుమీద సూర్యసమానకాంతులతో తేజరిల్లుతూ ఉన్న మహోదరుడు అప్పుడు అక్కడికి పోయినాడు. ఆకాశములో ఇంద్రధనుస్సు వ్యాపించగానే మేఘాలు మెరుపులు మెరుస్తూ వాన కురిసేట్టుగా మహోదరుడు నీలుడి వక్షఃస్థలాన బాణవర్షము కురిపించినాడు. దేహముఅంతా గాయాలుఅయి నీలుడు చేష్టలు తప్పిపోయినాడు. కొంచెము సేపటికి తేరుకొని వృక్షాలనూ పర్వతశిఖరాలనూ పెళ్ళగించి వాటితో ఎగిరిపోయి అమితవేగముతో మహోదరుడి శిరముమీద కొట్టినాడు. వజ్రాయుధము దెబ్బకు పర్వతమువలె నీలుడి పర్వతశిఖరాల దెబ్బకు దేవాంతకుడు చచ్చి తనపెద్ద ఏనుగుతో కూడా నేలకూలినాడు.

ఆ పోరాటములో తన పినతండ్రి మహోదరుడు అట్లా పడిపోవడము చూచి త్రిశిరుడు క్రుద్ధుడు అయిపోయి వాడి వాడి బాణాలను హనుమంతుడిమీదనూ నీలుడిమీదనూ వదిలినాడు. అప్పుడు వాయుపుత్రుడు హనుమంతుడు కుపితుడు అయిపోయి ఒక పర్వతశిఖరాన్ని పెళ్లగించి త్రిశిరుడిమీద విసరివేసినాడు. ఆ పర్వతశిఖరము తనమీద పడకుండా త్రిశిరుడు తన వాడి వాడి బాణాలతో దానిని తునకలు తునకలు చేసివేసినాడు. ఆ పర్వతశిఖరము అట్లా వ్యర్థము అయిపోవడము చూచి హనుమంతుడు త్రిశిరుడి శిరముమీద చెట్లవాన కురిపించినాడు. ఆకాశమునుంచి అట్లాపడుతూఉన్న చెట్లను ఆ పరాక్రమవంతుడు త్రిశిరుడు తన నిశితబాణాలతో నరికివేసి సింహనాదము చేసినాడు.

అంతట హనుమంతుడు క్రుద్ధుడు అయిపోయి పయికి ఎగిరి త్రిశిరుడి గుర్రాలను సింహము ఏనుగును తన గోళ్లతో చీల్చివేసేట్టు చీల్చివేసినాడు. అప్పుడు త్రిశిరుడు కాళరాత్రి అనే ఆయుధముతో యముడు బయలుదేరేటట్టు శక్త్యాయుధము తీసుకొని హనుమంతుడిమీద విసరివేసినాడు. ఆకాశములోనుంచి పడుతూ ఉన్న కొరవివలె అడ్డగించడానికి అలవికాకుండా పడపోతూఉన్న ఆ శక్త్యాయుధాన్ని హనుమంతుడు పట్టుకొని విరిచివేసి సింహ

నాదము చేసినాడు. భయంకరము అయిన ఆ శక్త్యాయుధాన్ని హనుమంతుడు విరిచివేయడము చూచి వానరయోధులు అందరూ సంతోషాతిశయముతో మేఘాలవలె గర్జించినారు. అప్పుడు ఆ రాక్షసోత్తముడు త్రిశిరుడు ఒక ఖడ్గము తీసికొని హనుమంతుడి విశాల వక్షఃస్థలముమీద కొట్టినాడు. ఆ కత్తివేటుకు హనుమంతుడు క్రుద్ధుడు అయిపోయి తన అరచేతితో త్రిశిరుడి వక్షఃస్థలాన కొట్టినాడు. ఆ దెబ్బకు ఆ మహాతేజోవంతుడు త్రిశిరుడు చేష్టలు తప్పిపోయినాడు. చేతిలోనుంచి ఖడ్గము జారిపడిపోయింది. నేలమీదపడి మూర్ఛపోయినాడు. కింద పడిపోయిన ఆ త్రిశిరుడి ఖడ్గాన్ని హనుమంతుడు తీసుకొని రాక్షసులు అందరూ భయపడిపోయేట్టు సింహనాదము చేసినాడు. ఆ మహాఘోరాన్ని విని సహించలేక త్రిశిరుడు లేచి తన పిడికిటితో హనుమంతుణ్ణి కొట్టినాడు. ఆ పిడికిటిపోటుకు హనుమంతుడికి పట్టరాని కోపము వచ్చింది. త్రిశిరుడి శిరాన్ని పట్టుకొన్నాడు. త్వష్టపుత్రుడు అయిన విశ్వరూపుడి శిరస్సును దేవేంద్రుడు తెగవేసినట్టు ధగధగలాడుతూ ఉన్న కిరీటకుండలాలతో తేజరిల్లుతున్న త్రిశిరుడి శిరస్సును తీక్ష్ణము అయిన ఆ ఖడ్గముతో హనుమంతుడు తెగవేసినాడు. ఆకాశమునుంచి రాలుతూఉన్న నక్షత్రాలవలె పర్వతాకారములో ఉన్న త్రిశిరుడి మూడు తలలూ మంటలు మండుతూ ఉన్న నిప్పులవంటి నేత్రాలతో నేలకూలినవి. దేవేంద్రుణ్ణి ఎదిరించిన ఆ త్రిశిరుణ్ణి దేవేంద్రుడివంటి పరాక్రమవంతుడు హనుమంతుడు వధించి వేయగానే వానరులు కోలాహల ధ్వనులు చేసినారు. భూమి కంపించింది. అంతట రాక్షసులు అందరూ అన్ని దిక్కులా పరుగులెత్తినారు.

అట్లా త్రిశిరుణ్ణి మహోదరుణ్ణి ఎదిరించ వలవికాని నరాంతకుణ్ణి దేవాంతకుణ్ణి చంపివేయడము మత్తుడు అనే మహాపార్శ్వుడు చూచినాడు. పరమకుపితుడు అయినాడు. మంటలు మండుతూఉన్న భయంకరము అయిన గదను తీసుకొన్నాడు. మాంసముతోనూ నెత్తురుతోనూ నెత్తురు నురుగులతోనూ ఎర్రటి పూలదండలతోనూ ఉన్న ఆ ఇనుపగదను మహాపార్శ్వుడు తీసుకొన్నాడు. అతడు అదివరకు ఆ గదతో అనేక యుద్ధాలు గెలిచినాడు. ఆ గదనుచూచి

అదిపంతా ఐరావతం మహాపద్మ సార్వభౌమాలు అనే దిగ్గజాలు భయ
పడిపోయినవి. మహాపార్శ్వుడు ప్రళయకాలాగ్నివలె మండిపడుతూ
ఆ గదతో వానరులమీదికి పోయినాడు.

అప్పుడు ఋషభుడు అనే వానరుడు ఎగిరి ఆ మహాపార్శ్వుడి
ఎదుట నిలుచున్నాడు. అట్లా తన ఎట్టఎదటికి వచ్చి నిలుచున్న ఆ
పర్వతాకారుణ్ణి వానరుణ్ణి చూచి మహాపార్శ్వుడు వజ్రతుల్యము
అయిన తన గదతో అగడి వక్షఃస్థలముమీద కొట్టినాడు. ఆ దెబ్బకు
ఋషభుడి రొమ్మున్నలు గాయాలు అయి ఎంతో నెత్తురు కారింది.
ఋషభుడు మూర్ఛపోయినాడు. చాలాసేపటికి కాని తెలివిరాలేదు.

అప్పుడు ఆ మహాపార్శ్వుడి చేతిలో గదను లాగివేయడానికి
ఋషభుడు ఎదురుగుండా పోయినాడు. మహాభయంకరముఅయిన
ఆ గదను ఇట్టే మహాపార్శ్వుడి చేతిలోనుంచి ఊడలాగుకొన్నాడు.
ఆ గదను గిరగిర త్రిప్పినాడు. దానితోనే మహాపార్శ్వుణ్ణి కొట్టి
నాడు. ఆ దెబ్బకు ఆ రాక్షసుడి పళ్లూ కళ్లూ రాలి వజ్రాయుధపు
దెబ్బకు పర్వతమువలె నేలకూలినాడు. ఆ మహాపార్శ్వుడి ప్రాణము
పోయి అట్లా నేలకూలగానే రాక్షససైన్యము అక్కడ నిలువకుండా
పరుగెత్తింది.

రావణాసురుడి తమ్ముణ్ణి మహాపార్శ్వుణ్ణి చంపివేయగానే
మహాసముద్రమువంటి ఆ రాక్షససైన్యము ఆయుధాలు వదిలిపెట్టి
బ్రతికిఉంటే చాలును అనుకొని మహాసముద్రము పొంగిపొర్లేట్టు పరు
గెత్తింది.

౭౧

ఒళ్లు గగుర్పొడిచేట్టు [illegible]మ్నంగా సాగిన ఆ పోరాటములో
తమ రాక్షససైన్యము [illegible] నాశనము అయిపోవడమూ
దేవేంద్రుడివంటి పరాక్రమవంతులు తమ తోబుట్టువులనూ తన పిన
తండ్రులనూ శత్రువులు చంపివేయడమూ అతికాయుడు చూచినాడు.
ఆ పర్వతాకారుడు ఆ మహాపరాక్రమవంతుడు అతికాయుడు
అదివరకు దేవతల దర్పాన్ని అణచివేసినాడు. అతడు బ్రహ్మదేవుణ్ణి
మెప్పించి అనేకవరాలు సంపాదించినాడు. అప్పుడు అతడు వెయ్యి
సూర్యులవలె తేజరిల్లే రథము ఎక్కి వానరసైన్యముమీదికి పోయి

నాడు. ఆ అతికాయుడు కిరీటకుండలాలతో తేజరిల్లుతూ అందరికీ వినిపించేట్లు తనపేరు చెప్పుకుంటూ తనమహాచాపాన్ని మోగిస్తూ దిక్కులు పిక్కటిల్లిపోయేట్లు సింహనాదము చేసినాడు.

ఆ సింహనాదానికీ ఆ అల్లెతాటి మోతకూ వానరయోధులు అందరూ భయపడ్డారు. ఆ అతికాయుడి ఒడ్డూ పొడుగూ చూచి కుంభకర్ణుడు లేచి వచ్చినాడు ఏమోనని అనుకొన్నారు. భయముతో వానరయోధులు ఒకరిని ఒకరు పట్టుకొన్నారు. త్రివిక్రమావతారములో విష్ణుదేవుడి ఆకారమువంటి ఆ మహాదాకారాన్ని చూచి వానరయోధులు అటూ ఇటూ పరుగులెత్తినారు. ఆ అతికాయుడు దగ్గరకు వచ్చినాడు. అప్పుడు వానరయోధులు అందరికీ ఏమి చేయడానికీ తోచక నిర్విణ్ణులు అయిపోయినారు. లక్ష్మణుణ్ణి కూడా వదిలిపెట్టి పరుగులెత్తి రాముడి శరణుచొచ్చినారు.

ప్రళయకాల మేఘమువలె గర్జిస్తూ రథముమీద వస్తూఉన్న ఆ పర్వతాకారుణ్ణి ఆ ధనుర్ధరుణ్ణి అతికాయుణ్ణి రాముడు దూరము నుంచి చూచినాడు. ఆ మహాకాయుణ్ణి చూచే చూడటముతో ఆశ్చర్యపోయినాడు. అయితే వానరులకు ధైర్యము చెప్పినాడు. అంతట విభీషణుణ్ణి చూచి "ఓ రాక్షసోత్తమా, అడుగో, చూడు, వెయ్యి గుర్రాలు పూంచిన విశాలరథముమీద ధనుర్ధరుడు అయి సింహమువంటి కన్నులతో చూస్తూ వస్తూఉన్న ఆ పర్వతాకారుడు ఎవడు? భూతగణాలతో తేజరిల్లుతూ వచ్చే రుద్రుడివలె చుట్టూ ధగధగలాడుతూనూ తళతళలాడుతూనూ ఉన్న నిశితబాణాలతోనూ తోమరాలతోనూ వస్తూఉన్నాడు. మెరుపులు మెరుస్తూ కనిపించే మహామేఘమువలె తేజ[illegible]ఉన్నాడు. నాలుకలు చాచిన మృత్యుదేవతవలె శక్త్యాయుధముతో రథముమీద కనపడుతున్నాడు. వెనుకవైపున బంగారు మలామా చేసిన ధనుస్సులూ బంగారు అల్లెత్రాళ్లూ ఆ రథముమీద అన్నివైపులా కనపడుతూ ఉన్నవి. అవి ఆకాశములో ఇంద్రధనుస్సువలె ఆ రథముమీద భాసిస్తూ ఉన్నవి. సూర్యతేజముతో ధగధగలాడుతూఉన్న రథముమీద కూర్చుని ఈ యుద్ధభూమిని తేజరిల్లచేస్తూఉన్న పెద్దపులివంటి ఈ రాక్షసుడు ఎవడు?

"ఈ రథానికి [illegible] సూర్యకిరణాలవలె [illegible] ప్రకాశిస్తూ ఉన్నవి. రథధ్వజముమీద [illegible] గ్రహాలను [illegible] రాహుగ్రహము అమర్చి ఉంది. [illegible] ఉన్న [illegible] విల్లు మ్రోగించినప్పుడు మేఘగర్జనమువలె వినిపించింది. ఆ [illegible] విచిత్రంగా చేసిన బంగారు అలంకారాలతో [illegible] ధనుస్సువలె తేజరిల్లుతూ ఉంది. రథానికి ఎత్తిన [illegible] ఎంతో శోభాయమానముగా ఉన్నవి. [illegible] కూర్చుని తోలడానికి వీలుగా రథముపైట అమర్చి ఉంది. [illegible] మీద ఒకచోట పది ఒకచోట ఇరవై ఒకచోట ఎనిమిది [illegible] పొదులు వేల్లాడుతూ ఉన్నవి. బంగారు [illegible] రకము అయిన ధనుస్సులు రథమునిండా కనపడుతూ ఉన్నవి. [illegible] పిడులతోనూ పది చేతుల పొడుగునా ఉన్న ఖడ్గాలు ఈ రాక్షసుని ఇరువైపులా శోభాయమానముగా కనపడుతున్నవి. [illegible] పంటి పెద్దనోటితో ఎర్రటి పూలదండలతో ఈ మహా [illegible] ఆకారాలు మేఘాలు కమ్ముకొన్న సూర్యుడివలె తేజరిల్లుతూ ఉన్నాడు. ఎత్తు అయిన శిఖరాలతో కనపడే హిమవంతునివలె బంగారు బాహుపురులతో ఎత్తు అయిన భుజాలతో శోభిస్తూ ఉన్నాడు.

"ఓ మహా[illegible], ఓ విభీషణుడా, వీడు ఎవడు! రెండు చెవులకూ తళతళలాడుతున్న కుండలాలతో మంగళకరము అయిన నేత్రాలతో వీడు [illegible] నక్షత్రాలమధ్య చంద్రునివలె [illegible] ఉన్నాడు. వీడు ఎవడు! వీడ్ని చూచి వానరయోధులు [illegible] భయభ్రాంతులు అయి దశదిశలా పరుగులెత్తినారు. ఓ విభీషణుడా, వీడు ఎవడో నాకు వివరము చెప్పు" అని ఆ [illegible] రాముడు అడిగినాడు.

అంతట ఆ మహాపరాక్రమవంతుడు విభీషణుడు "రామా, వీడు రావణాసురుని పుత్రుడు. యుద్ధములో [illegible]. [illegible] పరాక్రమవంతుడు. సర్వాస్త్రవేత్తలలోనూ శ్రేష్ఠుడు. [illegible] [illegible], అశ్వికుడు, రథికుడు, గజసాది, [illegible] [illegible] పాశాద్యాయుధాలు [illegible]

యోగించడములోనూ ఆరితేరినాడు. సామ దానాది చతురుపాయాలూ తెలిసిన నీతిజ్ఞుడు. ఆలోచనలు చెప్పడములో అతి సమర్థుడు. ధాన్యమాలిని వీడి తల్లి. వీడి పేరు అతికాయు వీడి బాహుబలమునుంచే లంకాపట్టణము నిర్భయముగా ఉ–

“ఈ అతికాయుడు ఆత్మధ్యానపరాయణుడు. తపస్సుచే బ్రహ్మదేవుణ్ణి మెప్పించి అనేక అస్త్రాలు సంపాదించినాడు. దేవతల చేతకానీ అసురులచేతకానీ చావకుండా ఉండడానికోసము బ్రహ్మదేవుడు వీడికి ఇప్పుడు వీడు తొడుక్కొని ఉన్న దివ్యకవచాన్ని సూర్యుడివలె తేజరిల్లుతూ ఉన్న ఈ రథాన్ని ఇచ్చినాడు. వీడు దేవదానవులను అనేకమార్లు జయించినాడు. యక్షులను వధించి రాక్షసులను రక్షించినాడు. వీడు తన బాణాలతో దేవేంద్రుడి వజ్రాయుధము స్తంభించి పోయేట్టు చేసినాడు. వరుణదేవుడి పాశాయుధాన్ని తెగవేసినాడు. వీడు రాక్షసవీరులలో శ్రేష్ఠుడు.

“ఓ పురుషోత్తమా, రామా, నీవు వీడి విషయములో వెంటనే తగినప్రయత్నము చేయవలెను. లేకపోయేట్లయితే వీడు తన బాణాలతో వానరసైన్యాన్ని నాశనము చేసివేస్తాడు” అని చెప్పినాడు.

ఈ మాటలు విభీషణుడు చెప్పుతూ ఉండగానే అతికాయుడు వానరసైన్యములో చొరబడి ధనుష్టంకారము చేస్తూ పదే పదే సింహనాదము చేసినాడు. ఆ రథికుణ్ణి ఆ భయంకరాకారుణ్ణి అతికాయుణ్ణి అప్పుడు వానరశ్రేష్ఠులలో ముఖ్యులు అనుకొనవారు ఎదిరించినారు. వారిలో కుముదుడూ ద్వివిదుడూ మైందుడూ నీలుడూ శరభుడూ ఏకకాలన ఆ అతికాయుడిమీద పర్వతశిఖరాలూ మహావృక్షాలూ విసరివేసినారు. అట్లా వానరవీరులు విసరివేసిన ఆ పర్వతశిఖరాలనూ మహావృక్షాలనూ అప్పుడు ఆ అస్త్రవిదుడు అతికాయుడు తన బంగారు బాణాలు వదిలి నరికి వేసినాడు. ఆ బలవంతుడు ఆ భయంకరాకారుడు వానరవీరులకు ఎదురుగుండా పోయి వారిమీద ఉక్కు బాణాలు వదిలినాడు. ఆ బాణవర్షానికి వానరుల అవయవాలు తెగిపోయి వివశులు అయి పోయినారు. ఎదురుతిరిగి పోరాడలేకపోయినారు. యావన

దర్పించి వస్తున్న సింహము కోపముతో చెలరేగి మృగసమూహాన్ని గగ్గోలుపరిచేట్లు ఆ అతికాయుడు అప్పుడు వానరసేనా [illegible]లను చీకాకు పరిచినాడు.

అప్పుడు ఆ వానరసేనామధ్యములో ధనుస్తూణీరాలతో [illegible]ముని ఏ ఒక్కడితోనూ పోరాడకుండానూ, ఏ ఒక్కణ్ణి చంపి[illegible]కుండానూ ఉన్న రాముణ్ణి చూచి అతికాయుడు గర్వముతో "నేను ధనుర్బాణాలతో పోరాటానికి వచ్చినాను. అల్పులతో నేను పోరాడను. యుద్ధము చేయవలెను అనే ఉత్సాహము ఎవడికి అయినా ఉన్నట్లయితే వెంటనే ఇప్పుడే నాతో పోరాడటానికి రావలెను" అన్నాడు.

అతికాయుడు అన్న ఈ మాటలు విని లక్ష్మణుడు ఓర్వలేకపోయినాడు. ఆ శత్రుంతపుడికి కోపము వచ్చింది. ఆ అతికాయుడికి ఎదురుగుండా పోయినాడు. చిరునవ్వు నవ్వుతూ, ధనుస్సు పట్టుకొన్నాడు. [illegible] అయినాడు. అమ్ముల పొదిలోనుంచి బాణాన్ని తీసి నారికి ఎక్కించినాడు. ఆ అతికాయుడికి ఎట్టఎదట తన మహాచాపాన్ని మోగించినాడు. భయంకరము అయిన ఆ జ్యానాదము ఈ భూమిమీదనూ పర్వతాల మీదనూ ఆకాశములోనూ సముద్రములోనూ దశదిశలానూ వ్యాపించింది. ఆ మహాధ్వని రాక్షసులు అందరూ భయపడి పోయినారు. ఆ బలవంతుడు ఆ మహాపరాక్రమవంతుడు అతికాయుడు ఆ ధనుష్టంకారానికి ఆశ్చర్యపోయినాడు. అంతట కోపిష్ఠుడు అయిపోయి నిశితబాణాన్ని తీసి అట్లా తనవైపుకి వస్తూ ఉన్న లక్ష్మణుడితో "ఓ లక్ష్మణుడా, నీవు పసివాడవు. ఎవడు ఎంత పరాక్రమవంతుడు అనే విచక్షణ [illegible] నాతో యుద్ధము చేయవలెను అనే కోరిక నీకు [illegible] నా బాహువులతో వదిలే బాణాల ప్రభావ[illegible] ఈ భూమి ఓర్వలేదు. ఓ లక్ష్మణుడా, [illegible] కాలాగ్నిని ఎందుకు రగుల్కొల్పుతావు. [illegible] వెనకకు మళ్ళి పో. [illegible] పోగొట్టుకొంటావు. కాదు అన్నావంటే [illegible] చేస్తాను. నిన్ను ఇప్పుడే యమసదనానికి [illegible]

"ఇదిగో, చూడు, నా బాణాలు. వీటితో స్వా... వుల దర్పాన్ని అణచివేసినాను. మేలిమి బంగారు అలంకారాలతో రుద్రదేవుడి త్రిశూలమువంటివి. ఇదిగో, చూడు— ఈ బాణము : సర్పమువంటిది. కుపిత సింహము మదపుటేనుగు నెత్తురును పీల్చి వేస్తుంది. అదేవిధముగా నా ఈ బాణాలతో నీ నెత్తురును పీల్చి వేస్తాను" అని చెప్పుతూ కుపితుడు అయిపోయి ఆ బాణాన్ని ధనుస్సులో ఎక్కించినాడు.

ఇట్లా అతిగర్వముతోనూ కోపముతోనూ అతికాయుడు ...న్న మాటలు విని ఆ మహాబలవంతుడు ఆ కాంతిమంతుడు లక్ష్మ...డు కోప... "ఓ దురాత్ముడా, నీవు మాటలు అన్నంత ...గొప్పవాడవు కాజాలవు. ఆత్మశ్లాఘనము శూరులు ఎవరూ చేయరు. నా చేతిలో విల్లూ అంబులూ ఉన్నవి. నీ బలమే చూపించు. ఎందుకు నన్ను నీవు పొగడుకొంటావు. పరాక్రమాన్ని చూపించేవాణ్ణే శూరుడు అంటారు. నీవు రథముమీద ఉన్నావు. నీ చుట్టూ సమస్తాయుధాలూ ఉన్నవి. నీ చేతిలో ధనుస్సు ఉంది. బాణాలతో కానీ అస్త్రాలతో కానీ నీ శౌర్యాన్ని చూపించు. ఓ అతికాయుడా, కాలపరిపాకము అయినప్పుడు గాలికి తాటిపండు తొడిమనుంచి ఊడి నేల రాలుతుంది. ఇప్పుడు నా బాణాలకు నీ శిరము ఊడి నేల కూలుతుంది. మేలిమి బంగారుతో అలంకరించిన నా బాణాలు నీ దేహములో చిల్లులుపొడిచి నీ నెత్తురును పీల్చివేస్తవి. నన్ను పిల్లవాడు అని తిరస్కరించవద్దు. పిల్లవాణ్ణి అయినా వృద్ధుణ్ణి అయినా పోరాటములో నేను యముడి వంటివాడను అనుకో. మహావిష్ణువు పిల్లవాడుగా పోయి ముల్లోకాలనూ ఆక్రమించినాడు. గుర్తు తెచ్చుకో" అని అర్థవంతముగానూ యుక్తియుక్తముగానూ చెప్పినాడు.

...ణుడు అన్నమాటలకు అతికాయుడికి పట్టరాని కోపము ...ఉత్తమోత్తమము అయిన బాణాన్ని తీసుకొన్నాడు. ...యుద్ధము చూడటానికి విద్యాధరులూ భూతగణాలూ ...లూ మహర్షులూ గుహ్యకులూ ఆకాశము...లో ...కాయుడు అంతట ఆ బాణాన్ని వింటికి ఎక్కించి

లక్ష్మణుణ్ణి గురిచేసి అమితవేగముతో వదిలినాడు. ఆ బాణధ్వని ఆకాశము పగిలి నేల కూలుతున్నట్లుగా వినిపించింది. క్రూరసర్పము వలె వచ్చి తనమీద పడబోతూ ఉన్న ఆ నిశిత బాణాన్ని లక్ష్మణుడు ఒక అర్ధచంద్రాకారపు బాణముతో నరికివేసినాడు. పామును రెండు ముక్కలుగా నరికినట్లు ఆ బాణాన్ని లక్ష్మణుడు నరికివేయడము చూచి అమితకోపముతో అతికాయుడు అయిదు బాణాలను తీసి లక్ష్మణుడిమీద వదిలినాడు. ఆ అయిదింటినీ లక్ష్మణుడు తన తీక్ష్ణబాణాలతో ఛేదించివేసి ధగధగ మంటలు మండుతూపోయే బాణాన్ని తీసి వింటికి ఎక్కించి అమితవేగముతో లాగి అతికాయుడి మీద వదిలినాడు. కణుపులు కనపడకుండా సూటిగాపోయే ఆ బాణము అప్పుడు ఆ అతికాయుడి లలాటాన గుచ్చుకొన్నది. ఆ భయంకరాకారుడి లలాటాన గుచ్చుకొన్న ఆ బాణము నెత్తుటితో తడిసి పర్వతములోనుంచి బయటికి వెళ్లుకొని వచ్చిన మహాసర్పము వలె కనిపించింది. పూర్వము రుద్రదేవుడి బాణముదెబ్బకు త్రిపుర గోపురము కంపించినట్లుగా లక్ష్మణుడి బాణముదెబ్బకు ఆ అతికాయుడు కంపించిపోయినాడు.

ఆ మహాబలవంతుడు అతికాయుడు తెప్పిరిల్లి తనబలాన్నీ ఎదిరిబలాన్నీ విమర్శించి చూచి "ఓ లక్ష్మణుడా, నీవు చక్కగా బాణము వదిలినావు. నీవు నా విరోధివి. నిన్ను నేను మెచ్చుకొంటున్నాను" అని చెప్పి తలవంచి రెండుభుజాలూ అణచుకొని రథము మధ్యను కూర్చున్నాడు. అంతట ఆ రథాన్ని చిత్రవిచిత్రముగా తిప్పించి ఆ రాక్షసపుంగవుడు ఒక బాణాన్నీ ఆ తరువాత మూడు బాణాలనూ, ఆ తరువాత అయిదు బాణాలనూ, ఆ తరువాత ఏడు బాణాలనూ తీసి వింట సంధించి లక్ష్మణుడిమీద వదలినాడు. ఆ అతికాయుడి ధనుస్సులోనుంచి వెలువడిన ఆ బాణాలు బంగారు పింజలతో సూర్యసమాన తేజముతో జ్వలిస్తూ ఆకాశములో వస్తూంటే లక్ష్మణుడు ఏమాత్రమూ చలించకుండా తన నిశిత బాణాలు వదలి వాటిని దారిలోనే నరికివేసినాడు.

దేవేంద్రుణ్ణి ఎదిరించిన ఆ అతికాయుడు తన బాణాలు అప్పుడు అట్లా ముక్కలు ముక్కలు అయిపోవడము చూచి కుపితుడు అయి

మరియొక తీక్ష్ణబాణాన్ని తీసి ధనుస్సుకు ఎక్కించి లక్ష్మణుడి వక్షః స్థలాన్ని గురిచేసి వదలినాడు. ఆ బాణము అమితవేగముతో వచ్చి లక్ష్మణుడి వక్షస్థలాన గుచ్చుకొన్నది. మదపుటేనుగు మదజలము వలె లక్ష్మణుడి వక్షః స్థలమునుంచి నెత్తురు కారింది. ఆ మహాసమర్థుడు లక్ష్మణుడు ఆ బాణాన్ని తన వక్షఃస్థలమునుంచి పెరికివేసి తీక్ష్ణ బాణాన్ని తీసి అగ్నిదేవతాకము అయిన మంత్రముతో దానిని అభిమంత్రించి వింట సంధించినాడు. అది ఆ ధనస్సులో జ్వలించ సాగింది.

అప్పుడు అతికాయుడు అది చూచి బంగారు పుంఖముతో మహాసర్పమువంటి బాణాన్ని తీసి సూర్యదేవతాకము అయిన మంత్రముతో దానిని అభిమంత్రించినాడు. అంతలో లక్ష్మణుడు తనవింట యముడి కాలదండమువలె జ్వలిస్తూన్న ఆ ఆగ్నేయాస్త్రాన్ని అతికాయుడిమీద వదలినాడు. సూర్యాస్త్రముతో అభిమంత్రించిన తన బాణాన్ని అతికాయుడు అప్పుడు లక్ష్మణుడిమీద వదలినాడు. ఆ రెండు బాణాలున్నూ ఆకాశములో మంటలు మండుతూ పోయి కోపముతో రేగిన పాములవలె ఒకదానితో నొకటి పోరాడటము మొదలుపెట్టినవి. ఒకదాన్ని ఒకటి దహించి వేసింది. రెండూ భస్మము అయిపోయినవి.

అంతట ఆ అతికాయుడు పరమక్రుద్ధుడు అయిపోయి ఐషీకాస్త్రాన్ని వదలినాడు. లక్ష్మణుడు ఐంద్రాస్త్రాన్ని వదలినాడు. ఆ ఐషీకాస్త్రాన్ని ఐంద్రాస్త్రము కొట్టివేసింది. అది చూచి అతికాయుడు యమదేవతాకము అయిన మంత్రముతో అభిమంత్రించి బాణాన్ని ధనుస్సుకు ఎక్కించి వదలినాడు. ఆ యామ్యాస్త్రాన్ని లక్ష్మణుడు వాయవ్యాస్త్రముతో కొట్టివేసినాడు. అంతటితో వదలిపెట్టకుండా అతికాయుడిమీద లక్ష్మణుడు ఎడతెగకుండా బాణవర్షము కురిపించినాడు. ఆ బాణాలు అన్నీ పోయి వజ్రఖచితము అయిన అతికాయుడి దివ్యకవచానికి గుచ్చుకొని ములుకులు విరిగి పోయి నేలమీద పడ్డవి. తన బాణాలన్నీ అట్లా వ్యర్థము అయి పోవడము చూచి లక్ష్మణుడు వెయ్యి తీక్ష్ణబాణాలను అతికాయుడి మీద వర్షము కురిపించినాడు. అభేద్యము అయిన కవచము

తొడుగుకొని ఉన్నందువల్ల ఆ బాణాలు అతికాయుణ్ణి ఏమీ చేయు లేకపోయినవి. ఎంత బాణవర్షము కురిపించినా అతికాయుడు ఏమాత్రమూ బాధపడలేదు. ఎంత ప్రయత్నము చేసినా ఆ పురుషశ్రేష్ఠుడు లక్ష్మణుడు అతికాయుణ్ణి ఏమాత్రమూ నొప్పించ లేకపోయినాడు.

అప్పుడు వాయుదేవుడు లక్ష్మణుణ్ణి చూచి "ఓలక్ష్మణుడా, ఈ అతికాయుడికి బ్రహ్మదేవుడు అభేద్యము అయిన కవచము ఇచ్చినాడు. దానిని వీడు ఇప్పుడు తొడుగుకొని ఉన్నాడు. అందువల్ల నీవు ఇప్పుడు వీడిమీద బ్రహ్మాస్త్రము వదులు. వీడిని మరి ఒక విధముగా నీవు భేదించలేవు" అని చెప్పినాడు. అంతట లక్ష్మణుడు బ్రహ్మాస్త్రమంత్రముతో బాణాన్ని అభిమంత్రించినాడు. అమోఘము అయిన ఆ బ్రహ్మాస్త్రాన్ని అతికాయుడిమీద వదిలినాడు. లక్ష్మణుడి ధనుస్సులోనుంచి ఆ బ్రహ్మాస్త్రము వెలువడగానే భూమ్యాకాశాలూ దిక్కులూ సూర్యచంద్రాదిగ్రహాలు సంచలించినవి. చిత్రవిచిత్రము అయిన బంగారు పింజలతో ధగధగ మంటలు మండుతూ యమ దూతవలె తనమీదికి వస్తూఉన్న ఆ బ్రహ్మాస్త్రబాణాన్ని చూచి అతికాయుడు అనేక నిశితబాణాలను దానిమీద వదిలినాడు, ఆ బాణాలను అన్నిటినీ అమోఘము అయిన వేగముతో కొట్టివేస్తూ గరుత్మంతుడి వేగముతో ఆ బ్రహ్మాస్త్రము అతికాయుడిమీదికి పోయింది. ధగధగ మంటలు మండుతూ యముడివలె భయంకరముగా కనపడుతూఉన్న ఆ బ్రహ్మాస్త్రబాణానికి అతికాయుడు భయపడ కుండా శక్త్యాయుధాలతోనూ ఋష్టి అనే ఆయుధాలతోనూ గదల తోనూ శూలాయుధాలతోనూ హలాయుధాలతోనూ కొట్టినాడు. మంటలు మండుతూఉన్న ఆబాణము ఆ అద్భుతాకారపు ఆయుధాలను అన్నిటినీ లెక్కచేయకుండా కిరీటకుండలాలతో ధగధగ లాడుతూ ఉన్న అతికాయుడి శిరాన్ని ఉత్తరించి వేసింది. హిమవత్పర్వత శిఖరమువంటి ఆ అతికాయుడి శిరము తటాలున నేలకూలింది. అతడు పెట్టుకొన్న ఆభరణాలు అన్నీ ఎగిరి నేలమీద పడిపోయినవి.

అది చూచి రాక్షసయోధులు అందరూ దుఃఖాక్రాంతులు అయినారు. అప్పుడు వానరయోధులు కొట్టుతూఉన్న దెబ్బలు

ఓర్చుకోలేక వికృతస్వరాలతో పెద్దపెట్టున అరుస్తూ ఏడుస్తూ దావగా మిగిలిన రాక్షసయోధులు ఆ యుద్ధభూమిని వదిలిపెట్టి లంకాపట్టణాభిముఖులు అయి పరుగులెత్తినారు.

ఆ భీమబలుణ్ణి ఆ దురాసదుణ్ణి అతికాయుణ్ణి లక్ష్మణుడు చంపివేయగానే సంతోషాతిశయముతో వానరవీరుల ముఖాలు కమలాలవలె వికసించినవి. వారు అందరూ లక్ష్మణుణ్ణి కొనియాడినారు.

౬౨

అతికాయుణ్ణి మహాపరాక్రమవంతుడు లక్ష్మణుడు చంపివేసిన సంగతి రావణాసురుడు విన్నాడు. భయపడిపోయినాడు. అంతట రాక్షసయోధులను అందరినీచూచి "ఆయుధ ధారులలో ఉత్తముడూ గొప్ప ధానుష్కుడూ పరమకోపనుడూ అయిన ధూమ్రాక్షుడు చనిపోయినాడు. అకంపనుడూ ప్రహస్తుడూ కుంభకర్ణుడూ చనిపోయినారు. వాండ్లు అందరూ పరమపరాక్రమవంతులు. మహాబలవంతులు. వాండ్లేకాకుండా ఎప్పుడూ యుద్ధము కాంక్షిస్తూ శత్రుసైన్యాలను నాశనము చేసివేసే రాక్షసయోధులూ ఎన్నడూ అపజయము ఎరగని రాక్షసవీరులూ ఎందరో చనిపోయినారు. మహాపరాక్రమవంతులూ మహాకాయులూ నానా శస్త్రాస్త్రవిదులూ అయిన రాక్షసవీరులను అందరినీ రాముడు చంపివేసినాడు. అతడు ఎటువంటి క్లిష్టకార్యాన్ని అయినా ఇట్టే చేసివేస్తాడు. అతడు రాక్షసులలో అనేకమంది మహాప్రభావులనూ శూరులనూ ఇట్టే చంపివేసినాడు.

"ఆ అన్నతమ్ములను ఆ శూరులను రామలక్ష్మణులను నా పుత్రుడు ఇంద్రజిత్తు దివ్యబాణాలతో బంధించివేసినాడు. ఆ బలపరాక్రమవంతుడు ఇదివరకే ఆ బాణాలు వ్యర్థము అయిపోకుండా ఉండేవరము సంపాదించినాడు. ఆ బాణబంధము భయంకరము అయింది. ఆ బంధాన్ని దేవతలుకానీ మహాబలవంతులు అయిన అసురులుకానీ యక్షులుకానీ గంధర్వులుకానీ విడిపించుకోలేరు. అటువంటి శరబంధాన్ని ఆ అన్నతమ్ములు రామలక్ష్మణులు విడిపించుకొన్నారు. అది వారి ప్రభావమో మాయో ఔషధబలమో

తెలియలేదు. నా ఆజ్ఞను శిరసావహించి యుద్ధముచేయడానికి పోయిన రాక్షసవీరులను అందరినీ ఆ మహాబలవంతులు వానరవీరులు వధించివేసినారు. ఇప్పుడు ఆ రామలక్ష్మణులను సుగ్రీవ విభీషణులతోకూడా పోరాడి శిక్షించేవీరుడు ఎవడూ నాకు కనిపించడము లేదు. ఆహా, ఆ రాముడు ఎంతగొప్ప బలవంతుడు! అతడి పరాక్రమము ఎంతగొప్పది! అతణ్ణి ఎదుర్కొన్న ప్రతిరాక్షసుడూ చచ్చిపోయినాడు. ఆ మహావీరుడు నాశరహితుడు అయిన శ్రీమన్నారాయణమూర్తి అయిఉండవలెను అని తోస్తున్నది. అతడి భయమునుంచి లంకాపట్టణములో అందరూ లోపలివాళ్లూ వెలుపలివాళ్లూ మూసివేసుకొంటున్నారు.

"ఓ రాక్షసులారా, ఏమాత్రమూ ఏమరుపాటు లేకుండా మీరు మిమ్ములను కాపాడుకొంటూ ఈ లంకాపట్టణాన్ని జాగ్రత్తగా కాపాడవలెను. నా ఆజ్ఞలేకుండా సీతాదేవిని ఉంచిన అశోక వనములోకి ఎవరినీ పోనీయవద్దు. లోపలినుంచి ఎవరినీ వెలుపలికి రానీయవద్దు. ఎక్కడ ఎక్కడ సేనానివేశాలు ఉండవలెనో అక్కడ అక్కడ మీరు మీ మీ సైన్యాలతో ఉండవలెను. అంతేకాదు. మీరు మీ మీ సైన్యాలతో పదే పదే అన్నిదిక్కులా తిరిగి చూస్తూనూ ఉండవలెను.

"ఓ రాక్షసులారా, మీరు సాయంకాలమప్పుడూ ప్రాతఃకాలమప్పుడూ అర్ధరాత్రమప్పుడూ అన్నివేళలనూ వానరుల ప్రయత్నాలను కనిపెట్టుతూ ఉండవలెను. మీరు వానరులను ఎప్పుడున్నూ తక్కువవారు అనుకోవద్దు. వాండ్లు యుద్ధసన్నద్ధులు అవుతూఉందీ వచ్చి పయిన పడిపోయేదీ నిలిచిఉండి ఎప్పుడూ కనిపెట్టి చూస్తూఉండవలెను" అని చెప్పినాడు.

ఆ మహాబలవంతులు రాక్షసయోధులు అందరూ తమ ఏలిక ఆజ్ఞాపించినట్టుగా సర్వమూ నిర్వహించ సాగినారు.

అప్పుడు రావణాసురుడు దుఃఖము అనే శల్యముతో బాధ పడుతూ తన అంతఃపురములోకి పోయినాడు. ఒకవైపున కోపాగ్ని రగులుకొంటూ ఉంటే పుత్రశోకముతో తపించిపోతూ పదే పదే నిట్టూర్పులు విడిచినాడు.

౭౩

ఆ యుద్ధరంగములో చావకుండా మిగిలిన రాక్షసయోధులు మరికొందరు అంతఃపురములోకి పోయి తమ ఏలికతో అతికాయుడే కాకుండా దేవాంతకుడూ మొదలు అయినవారు చనిపోయిన సంగతి చెప్పినారు. అది విని రావణాసురుడు కన్నీళ్లు కార్చినాడు. మూర్ఛ పోయినాడు. కొంచెము సేపటికి తెప్పరిల్లినాడు. తమ్ములూ పుత్రులూ చనిపోయినందుకు చాలాసేపు ఆలోచించినాడు.

అట్లా శోకసముద్రములో మునిగిపోయి ఆలోచిస్తూ ఉన్న తన తండ్రిని రాక్షసరాజును అప్పుడు ఇంద్రజిత్తువచ్చి చూచి "ఓ తండ్రీ, నీవు సర్వరాక్షసులకూ అధికతివి. ఇంద్రజిత్తు జీవించిఉండగా నీవు దుఃఖపడవలసిన పనిలేదు. ఇంద్రజిత్తు బాణాలు తగిలినవాడు ఎవడు అయినప్పటికిన్నీ జీవించి ఉండడము ఉత్తది. రాజా, ఇప్పుడే నీవు చూస్తూ ఉండగానే నా బాణాలతో ఆ రామలక్ష్మణులను ఛేదించివేస్తాను. వాండ్లను ముక్కలు ముక్కలు చేసివేస్తాను. దేహము అంతటా నా బాణాలు గుచ్చుకొని వాండ్లు చచ్చి నేల కూలుతారు. నేను పురుషబలముతోనూ దైవబలముతోనూ ప్రతిజ్ఞచేసి చెప్పుతూ ఉన్నాను. వినవలసింది. అమోఘము అయిన బాణాలతో ఆ రామలక్ష్మణులను నేను సంహారము చేసి వేస్తాను. పూర్వము బలిచక్రవర్తి యజ్ఞవాటికలో విష్ణుమూర్తి పరాక్రమాన్ని చూచినట్టు ఇప్పుడు ఇంద్రుడూ యముడూ విష్ణువూ వరుణుడూ సాధ్యులూ అశ్వినీదేవతలూ సూర్యచంద్రులూ అగ్ని హోత్రుడూ ఇంతింత అని చెప్ప వలవికాని నా పరాక్రమాన్ని చూస్తారు" అని చెప్పినాడు.

అంతట ఆ మహాధైర్యవంతుడు ఇంద్రజిత్తు తన తండ్రి రావణా సురుడికి వీడ్కోలు చెప్పి వాయువేగముతోపోయే రథము ఎక్కి నాడు. సూర్యుడిరథమువంటి ఆ రథముమీద యుద్ధభూమికి బయలుదేరినాడు. కంచరగాడిదలు పూంచిన ఆ రథమువెంట మహాబలవంతులు అయిన రాక్షసులు అప్పుడు పరమసంతోషముతో ప్రయాణము అయినారు. దారిలో కొందరు ధానుష్కులు కొందరు అశ్వికులు కొందరు గజసాదులు ఆ రాక్షసయోధులు

అందరూ ఈటెలూ ఇనుపగుదియలూ ఖడ్గాలూ గండ్రగొడ్డళ్లూ గదలూ మొదలుఅయిన ఆయుధాలతో ఆ ఇంద్రజిత్తును వెంబడించినారు.

అప్పుడు శంఖాలు పూరించినారు. భేరీలు మోగించినారు. రాక్షసులు స్తోత్రపాఠాలు చెప్పినారు. శంఖమువలెనూ చంద్రబింబమువలెనూ తేజరిల్లుతూ ఉన్న తెల్లటి గొడుగుక్రింద కూర్చున్న ఇంద్రజిత్తునుంచి ఆ రథము పూర్ణచంద్రుడు ఉదయించిన ఆకాశమువలె తేజరిల్లింది. ఆ ధానుష్కుడికి బంగారు పిడులువేసిన చామరాలతో అప్పుడు వీచినారు. సూర్యుడువచ్చి ఆకాశాన్ని తేజరిల్లచేసేట్టు సూర్యుడివంటి ఆ తేజోవంతుడు ఆ ఎదురులేని పరాక్రమవంతుడు ఇంద్రజిత్తు యుద్ధానికి బయలుదేరి అప్పుడు లంకాపట్టణాన్ని తేజరిల్ల చేసినాడు. ఆ మహాతేజోవంతుడు ఆ అరిందముడు ఆ విధముగా యుద్ధభూమికి పోగానే తన రథము దివ్యరథము కావడానికి హోమము చేయ సంకల్పించుకొన్నాడు. ఆ రథముచుట్టూ రాక్షసులను కావలిఉంచినాడు. అగ్నిహోత్రప్రభలతో తేజరిల్లుతూ ఉన్న ఆ ఇంద్రజిత్తు అంతట శాస్త్రోక్తముగానూ మంత్రయుక్తముగానూ అగ్నిహోత్రములో హోమము చేయడము మొదలుపెట్టినాడు. ముందుగా ఆ అగ్నిహోత్రాన్ని గంధపుష్పాదులతో పూజించి సంస్కరించిన హవిస్సులతోనూ పరిపేలాలతోనూ హోమము చేసినాడు. ఆయుధాలను దర్భలుగా పరిచినాడు. తాండ్రకొమ్మలను సమిధలుగా చేసినాడు. ఎర్రటివస్త్రాలు కట్టుకొని నల్లని ఇనుపతెడ్డు తీసుకొని హోమముచేస్తూ అగ్నిహోత్రానికి అన్నివైపులా దర్భలనూ తోమరాయుధాలనూ పరిచినాడు. అంతట నల్లమేక గొంతు నులిపివేసి సమిధలలో ఒక్కసారిగా అగ్నిహోత్రాన్ని రగులుకొలిపినాడు. పొగలూ గిగలూ లేకుండా అగ్నిహోత్రము జయసూచకముగా పెద్ద పెద్ద మంటలలో లేచింది. జ్వాలలు చుట్టూ ప్రదక్షిణము చేస్తూఉంటే మేలిమిబంగారు ఆభరణాలు ధరించిన అగ్నిహోత్రుడు స్వయముగా లేచి వచ్చి ఆ ఇంద్రజిత్తు ఇచ్చిన హవిస్సును తీసుకొని అంతర్ధానము అయిపోయినాడు. అంతట ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రమంత్రాన్ని జపముచేసినాడు. తననూ తన ధనుస్సునూ ఆ యుద్ధభూమిలో తనకు సంబంధించిన సమస్తాన్నీ

మంత్రపూతము చేసినాడు. అట్లా అగ్నిహోత్రములో హోమము చేసి ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రమంత్రాన్ని జపము చేయగానే నవగ్రహాలూ నక్షత్రాలూ ఆకాశమూ చలించిపోయినవి.

అగ్నిహోత్రుడివంటి ఆ తేజోవంతుడు దేవేంద్రుడివంటి ఆ పరాక్రమవంతుడు ఇంత అంత అని చెప్పనలవికాని ఆ మంత్రవేత్త ఇంద్రజిత్తు ఆ విధముగా హోమాదులు ముగించి ధనుర్బాణఖడ్గ రథాశ్వసారథిసహితముగా ఆకాశానికి ఎగిరి అంతర్ధానము అయిపోయినాడు. అప్పుడు రథాలతోనూ గుర్రాలతోనూ పతాకాలతోనూ రాక్షససైన్యము యుద్ధోత్సాహముతో సింహనాదాలు చేస్తూ నేలమీద నడిచింది. ఆ నిశాచరయోధులను అందరినీ ఇంద్రజిత్తు పయినుంచి చూస్తూ "ఓ యోధులారా, మీరు మంచి ఉత్సాహముతో వానరవీరులను అందరినీ చంపివేయవలెను" అని చెప్పినాడు. అంతట ఆ రాక్షసయోధులు బంగారుతో అలంకరించిన చిత్ర విచిత్రము అయిన బాణాలతోనూ తోమరాయుధాలతోనూ అంకుశాలతోనూ జయించవలెను అనే కాంక్షతో గర్జిస్తూ భయంకరాకారులు అయిన వానరయోధులను ఎదిరించినారు. బాణవర్షము కురిపించినారు.

ఆకాశములో ఉన్న ఇంద్రజిత్తు ఆ రాక్షసయోధులను పురికొల్పసాగినాడు. ఆ రాక్షసయోధులు వానరయోధులను గదలతోనూ ముసలాయుధాలతోనూ కొట్టి హింసపెట్టుతూ ఉంటే పయినుంచి ఇంద్రజిత్తు వాండ్లమీద కరుకుకొనల ఇనుపబాణాలు కురిపించసాగినాడు. అట్లా వానరులను పైనుంచీ కిందనుంచీ హింసపెట్టుతూ ఉంటే వానరయోధులు వృక్షాలు ఆయుధాలుగా తీసుకొని ఆకాశానికి ఎగిరి రణకర్కశుడు అయిన ఇంద్రజిత్తుమీదికి పోయినారు. అప్పుడు ఆ మహాబలవంతుడు ఆ మహాతేజోవంతుడు ఇంద్రజిత్తు కోపముతో రేగి ఆ వానరయోధులను అంతరిక్షములోనే చించి చెండాడినాడు. రాక్షసులను బాగా సంతోషపెట్టడానికోసము ఒక్కొక్క బాణముతో అయిదుగురినీ ఏడుగురినీ తొమ్మిదిమందినీ వానరయోధులను ఛేదించివేసినాడు. జయించనలవికాని ఆ ఇంద్రజిత్తు అంతట సూర్యకిరణాలవలె కన్నులు మిరుమిట్లు గొలిపే బంగారు బాణాలను కిందఉన్న వానరయోధులమీద వదిలినాడు.

ఆ బాణాలకు దేహాలు ఛిన్నాభిన్నము అయి వానర యోధులు నేల కూలినారు. ఆ పోరాటములో జయించగలము అనే ఆశ అప్పుడు వానరయోధులకు పోయింది. దేవాసురయుద్ధములో మహాసురులవలె వానరయోధులు నేల కూలినారు. వారిలో మేటి వానరవీరులు లేచినారు. సూర్యకిరణాలవంటి బాణాలతో ఎదిరించనలవి కాకుండా సూర్యుడివలె తేజరిల్లుతూ ఉన్న ఆ ఇంద్రజిత్తుమీదికి ఆ మేటి వానరవీరులు శిలాయుధాలతోనూ వృక్షాయుధాలతోనూ పోయినారు. రామకార్యార్థము తమ ప్రాణాల మీద ఆశ వదలుకొని ఇంద్రజిత్తును ఆ వానరవీరులు అన్నివైపులా ముట్టడించి వృక్షాలూ శిలలూ పర్వతశిఖరాలూ వానగా కురిపించినారు. ఆ జయశీలి ఆ మహాసమర్థుడు తనమీదనూ తన రాక్షససైన్యముమీదనూ ఆ వృక్షాలూ శిలలూ పడకుండా బాణాలు వదిలినాడు. అగ్నిహోత్రమువంటి బాణాలనూ మహాసర్పాలవంటి బాణాలనూ వదిలి ఇంద్రజిత్తు ఆ వానరసైన్యాన్ని భేదించినాడు.

అప్పుడు ఇంద్రజిత్తు పద్దెనిమిది కరుకు బాణాలను గంధమాదనుడిమీద వదిలినాడు. తొమ్మిది బాణాలను దూరానఉన్న నలుడిమీద వదిలినాడు. ఏడు బాణాలను మైందుడి మర్మస్థానాలను గురిచేసి వదిలినాడు. అయిదు బాణాలు గజుడిమీదనూ పది బాణాలు జాంబవంతుడిమీదనూ ముప్పయి బాణాలు నీలుడిమీదనూ వదిలినాడు. వర ప్రభావమువల్ల తీక్ష్ణమూ భయంకరమూ అయిన బాణాలను వదిలి సుగ్రీవుణ్ణీ ఋషభుణ్ణీ అంగదుణ్ణీ ద్వివిదుణ్ణీ మూర్ఛపోగొట్టినాడు.

అప్పుడు ఆ ఇంద్రజిత్తు ప్రళయకాలాగ్నిహోత్రమువలె రేగి తక్కిన మేటి వానరవీరులను హింసించినాడు. సూర్యకిరణాలవంటి అతితీక్ష్ణము అయిన బాణాలను అమితవేగముతో లాగి వదలిపెట్టి వానరసైన్యాన్ని పడగొట్టినాడు. అట్లా వందలకొద్దీ వేలకొద్దీ వదలిన తన బాణాలకు వానరసైనికులు దేహాలు గాయాలు అయి నెత్తురు కారుతూ వ్యాకులపడిపోవడమూ మూర్ఛపోవడమూ చూచి సంతోషపడ్డాడు. ఆ రాక్షసరాజపుత్రుడు ఇంద్రజిత్తు మళ్ళీ దారుణముగా ఖడ్గాద్యాయుధాలనూ బాణాలనూ వానగా కురిపించి

వానరసైన్యాన్ని మర్దించినాడు. అంతటితో తనివితీరక తన సైన్యాన్ని వదిలిపెట్టి వానరసైన్యములో చొరబడి ఎవరికీ కనపడకుండా మాయము అయిపోయి పయినుంచి ప్రళయకాల మేఘము జలధారలను వర్షించేట్లు మహాభయంకరబాణవర్షాన్ని ఆ వానర సైన్యముమీద కురిపించినాడు. ఇంద్రజిత్తు కురిపించిన ఆ బాణ వర్షానికి వానరయోధులు భిన్నదేహాలు అయి మాయా మోహితులు అయి వికారస్వరాలతో కేకలుపెట్టుతూ దేవేంద్రుడి వజ్రాయుధము దెబ్బకు ముక్కముక్కలు అయిపోయిన పర్వతాల వలె నేల కూలినారు. ఆ వానరయోధులు తమమీద వచ్చిపడుతూ ఉన్న తీక్ష్ణబాణాలను చూచినారేకాని మాయము అయిపోయిన ఇంద్రజిత్తును చూడలేదు. అంతట అతడు సూర్యకిరణాలవంటి బాణాలు వదులుతూ దిక్కులు తెలియకుండా చేసివేసినాడు. అగ్ని జ్వాలలవంటి శూలాలనూ ఖడ్గాలనూ గండ్రగొడ్డళ్ళనూ నిప్పులు రాలేట్లు గిరగిర తిప్పుతూ ఆ వానరసైన్యముమీద వేసినాడు. ఆ ఇంద్రజిత్తు వదలిన అగ్నిహోత్రమువంటి ఆ తీక్ష్ణాయుధాల దెబ్బలకు ఆ వానరుల దేహాలనుంచి నెత్తురు వెల్లువలుఅయి కారింది. వారు అందరూ విరగపూసిన మోదుగుచెట్లవలె కనిపించినారు. భిన్నదేహాలుఅయి ఒకరిమీద ఒకరు పడి వికృతస్వరాలతో కేకలు పెట్టుతూ కూలిపోయినారు. అప్పుడు వారిలో కొందరు తలలు పైకిఎత్తి చూస్తూఉంటే బాణాలువచ్చి వారి కళ్ళలో పడ్డవి. అట్లా కన్నులుపోయి ఆ వానరయోధులు ఒకరిని ఒకరు పట్టుకొని పోయి అందరూ నేలకూలినారు.

ఈవిధముగా వానరయూథపతులను అందరినీ గదాద్యాయుధాలతోనూ బంగారు బాణాలతోనూ పడకొట్టి ఆ ఇంద్రజిత్తు సూర్యకిరణాలవంటి తీక్ష్ణబాణాలను తీసుకొని రామలక్ష్మణులను గురిచేసి వదిలినాడు. అట్లా తమమీద బాణవర్షము కురిపిస్తూ ఉంటే ఆ పరమాద్భుత ధైర్యవంతుడు రాముడు ఆ బాణవర్షాన్ని లెక్కచేయకుండా ఏదో వానకురుస్తూ ఉన్నట్లుగా నిలుచుని లక్ష్మణుణ్ణిచూచి "తమ్ముడా, దేవేంద్రుణ్ణి జయించిన ఈరాక్షసేంద్రుడు ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రము అనుసంధించిన బాణాలతో భయంకరము అయిన వానరసైన్యాన్ని పడకొట్టినాడు. ఇప్పుడు మనమీదకూడా

బాణాలు వదులుతున్నాడు. ఈ మహాధైర్యవంతుడు ఇంద్రజిత్తు బ్రహ్మదేవుడి వరప్రభావమువల్ల అదృశ్యుడు అయి ఆకాశమునుంచి బ్రహ్మాస్త్రాలను వదులుతున్నాడు. కాబట్టి వీణ్ణి ఇప్పుడు కొట్టడానికి వీలులేదు.

"ఓ ధీమంతుడా, ఈ అస్త్రము చింతించ నలవికాని మహాత్ముడూ పూజ్యుడూ అయిన బ్రహ్మదేవుడిది అనుకొంటున్నాను. అందువల్ల నీవున్నూ నావలె నిశ్చలమనస్కుడవు అయి ఈ బాణపాతాన్ని ఓర్చుకో. ఇప్పుడు ఈ ఇంద్రజిత్తు బాణవర్షములో దిక్కులు తెలియకుండా చేసివేస్తున్నాడు. వానరరాజసైన్యము అంతా సేనానాయకులతో కూడా మూర్ఛపోయి ఉంది. మనము ఇప్పుడు కోపమూ యుద్ధోత్సాహమూ వదిలిపెట్టి యుద్ధము చేయకుండా మూర్ఛపోయేట్లయితే జయలక్ష్మి తనను వరించింది అనుకొని సంతోషముతో ఇంద్రజిత్తు తప్పకుండా లంకాపట్టణానికి పోతాడు" అని చెప్పినాడు.

అంతట రామలక్ష్మణులు ఇంద్రజిత్తు బాణాలకు మూర్ఛపోయినారు. అదిచూచి ఇంద్రజిత్తు పరమసంతోషముతో ఆ యుద్ధభూమిలో సింహనాదము చేసినాడు.

ఆ విధముగా రామలక్ష్మణులూ వానరసైన్యమూ పడిపోయిన తరువాత ఇంద్రజిత్తు లంకాపట్టణానికి పోయినాడు.

౭౪

అప్పుడు ఆ యుద్ధభూమిలో రామలక్ష్మణులు మూర్ఛపోయినారు. వానరసైన్యము అంతా మూర్ఛపోయి ఉంది. సుగ్రీవుడూ నీలుడూ అంగదుడూ జాంబవంతుడూ కొంచెము అయినా స్మారకము లేకుండా పడిఉన్నారు. అట్లా బాధపడుతూ ఉన్న ఆ వానరసైన్యాన్ని విభీషణుడు చూచినాడు. ఆ మహాబుద్ధిమంతుడు కొనఊపిరితో ఉన్న వానరసేనానాయకులనూ వానరవీరులనూ చూచి "ఓ వానరవీరులారా, మీరు భయపడవద్దు. రామలక్ష్మణులు వివశులు అయిపోయినారు అని మీరు దుఃఖపడవద్దు. వారు బ్రహ్మదేవుణ్ణి గౌరవించడానికొరకు ఇంద్రజిత్తు వదిలిన

బాణాలకు కట్టుపడిపోయినారు. బ్రహ్మదేవుడు ఇంద్రజిత్తుకు అత్యమోఘవేగముతో పోయే బ్రహ్మాస్త్రాన్ని ఇచ్చినాడు. బ్రహ్మదేవతాకము అయిన ఆ పరమాస్త్రాన్ని గౌరవించడానికోసము రామలక్ష్మణులు యుద్ధభూమిలో పడిపోయినారు. అందువల్ల మీరు ఇప్పుడు దుఃఖపడవలసిన అవసరము ఏమీ లేదు" అంటూ అప్రతిమానవాక్యాలతో ఓదార్చినాడు.

ఆ బ్రహ్మాస్త్రాన్ని గౌరవించిన బుద్ధిమంతుడు హనుమంతుడు అప్పుడు ఆ విభీషణుడి మాటలు విని "ఓ రాక్షసోత్తముడా, బలవంతులు అయిన వానరులు అందరూ దెబ్బతిన్నారు. ఈ వానర సైన్యములో ఇంకా ప్రాణాలతో ఉన్నవారిని అందరినీ మనము ఓదారుద్దాము" అని చెప్పినాడు.

అంతట ఆ రాత్రిసమయాన ఆ రాక్షసవీరుడు విభీషణుడూ ఆ వానరవీరుడు హనుమంతుడూ కాగడాలు పట్టుకొని ఒక్కసారిగా ఆ యుద్ధభూమి అంతటా తిరిగి చూచినారు. తోకలు తెగిపోయిన వారినీ చేతులు తెగిపోయినవారినీ తొడలు తెగిపోయినవారినీ కాళ్లూ వేళ్లూ తెగిపోయినవారినీ కంఠాలు తెగిపోయినవారినీ నెత్తురు కారుతూ నేలమీదపడి అటూ ఇటూ పొర్లాడుతూ ఉన్న పర్వతాకారులగు వానరులనూ అంతటా చెల్లాచెదరుగా పడి ధగధగలాడుతూ ఉన్న ఆయుధాలనూ చూచినారు. ఆ పోరాటములో దెబ్బతిని పడిపోయిన సుగ్రీవుణ్ణి అంగదుణ్ణి నీలుణ్ణి శరభుణ్ణి గంధమాదనుణ్ణి గవాక్షుణ్ణి సుషేణుణ్ణి వేగదర్శినీ ఆహుకణ్ణి మైందుణ్ణి నలుణ్ణి జ్యోతిర్ముఖుణ్ణి ద్వివిదుణ్ణి పనసుణ్ణి ఇంకా తక్కిన వానర వీరులనూ చూచినారు. ఆనాటి సాయంకాలము ఇంద్రజిత్తు వదిలిన బ్రహ్మాస్త్రానికి అరవై ఏడుకోట్లమంది వానరయోధులు హతము అయిపోయినారు. భయంకరబాణాల దెబ్బలు తిని మహాసముద్ర ప్రవాహాలవలె పడివున్న ఆ వానరసైన్యాలలో అప్పుడు ఆ హనుమంతుడూ విభీషణుడూ జాంబవంతుడికోసము వెతికినారు. వందల కొద్ది బాణాలు దేహము అంతటా గుచ్చుకొని మంటలు ఆరిపోతున్న అగ్నిహోత్రమువలె పడివున్న ఆ వయోవృద్ధుణ్ణి ఆ జ్ఞానవృద్ధుణ్ణి బ్రహ్మపుత్రుణ్ణి జాంబవంతుణ్ణి అక్కడ ఒకచోట విభీషణుడు

చూచినాడు. ఆ పరమపరాక్రమవంతుడిదగ్గరకు పోయి "ఓ పూజ్యుడా, తీక్ష్ణబాణాల దెబ్బకు నీవు ప్రాణాలు కోలుపోలేదు కదా" అని విభీషణుడు అడిగినాడు.

అప్పుడు ఆ భల్లూకవీరుడు ఎంతో కష్టముమీద మాటలు కూడపలుకుతూ "ఓ రాక్షసోత్తమా, నీకంఠస్వరాన్నిపట్టి నిన్ను నేను గుర్తుపట్టినాను. నేను తీక్ష్ణబాణాలు గుచ్చుకొని మహాబాధ పడుతున్నాను. కన్నులు తెరవలేకుండా ఉన్నాను. ఓ విభీషణుడా, అంజనాదేవి కడుపు చల్లగాపుట్టిన ఆ వాయుపుత్రుడు హనుమంతుడు జీవించిఉన్నాడా" అని అడిగినాడు.

"ఓ పూజ్యుడా, నీవు రామలక్ష్మణులను వదలిపెట్టి ఆ వాయుపుత్రుణ్నిగురించి అడుగుతున్నావు, కారణము ఏమిటి? ఓ ముసలివాడా నీకు ఆ హనుమంతుడిమీద ఉన్న స్నేహము వానరరాజు సుగ్రీవుడిమీదకానీ యువరాజు అంగదుడిమీదకానీ రామప్రభువుమీదకానీ లేదు. ఎందువల్లను?" అని విభీషణుడు అడిగినాడు.

"ఓ రాక్షసశార్దూలమా, నేను ఆ మారుతినిగురించి ఎందుకు అడిగినానో చెప్పుతాను విను. ఆ వీరుడు హనుమంతుడు జీవించి ఉన్నట్లయితే హతము అయిపోయిన వానరసైన్యముఅంతా జీవించి ఉన్నట్టే. ఆ హనుమంతుడు ఒక్కడూ చనిపోయి ఉన్నట్లయితే మనము అందరము జీవించి ఉన్నప్పటికిన్ని చచ్చి పోయినట్లేను. నాయనా విభీషణుడా, ఏమంటే ఆ హను మంతుడు వేగానికి వాయువుతో సరిసమానము అయినవాడు. పరాక్రమానికి అగ్నిహోత్రుడితో సరిసమానము అయినవాడు. అందువల్ల అతడు జీవించి ఉన్నట్లయితే అందరూ జీవిస్తారు అని నా ఆశ" అని జాంబవంతుడు చెప్పినాడు.

అప్పుడు హనుమంతుడు ఆ వృద్ధుడిదగ్గరకు పోయినాడు. నియమబద్ధముగా ఆ జాంబవంతుడి పాదాలు పట్టుకొని నమస్కారము చేసినాడు. ఆ భల్లూకరాజు అప్పుడు హనుమంతుడి కంఠస్వరము విని దేహమునిండా గుచ్చుకొన్న బాణాలవల్ల వ్యథపడుతూ ఉన్నప్పటికిన్ని పునర్జన్మము ఎత్తినట్లు భావించినాడు. ఆ మహా

జాంబవంతుడు అంతట హనుమంతుడితో "ఓ వానరశార్దూలమా, రా, నాయనా, నాదగ్గరకు రా. నీవు ఇప్పుడు వానరులను అందరినీ కాపాడవలెను. పరాక్రమానికి నీకు చాలినవాడు మరిఒకడు ఎవడూ లేడు. ఈవానరులకు అందరికీ నీవే ఆప్తుడవు. నీపరాక్రమము చూపించ వలసిన సమయము ఇప్పుడు వచ్చింది. నీవలె పరాక్రమించకలవాడు ఎవడూలేడు. వానరవీరులనూ వారి సైన్యాలనూ భల్లూకవీరు లనూ వారి సైన్యాలనూ నీవు కాపాడవలెను. రామలక్ష్మణుల ప్రణాలు నయము చేయవలెను.

"ఓ హనుమంతుడా, నీవు ఇప్పుడు సముద్రముపైనుంచి బహుదూరము ప్రయాణముచేసి హిమవత్పర్వతానికి పోవలెను. అక్కడ ఎంతో ఎత్తున వృషభము అనే కాంచనపర్వతశిఖరమూ కైలాసపర్వతశిఖరమూ కనపడుతవి. ఆ పర్వతశిఖరాల మధ్యను ఓషధిపర్వతము ఉంది. అక్కడ సర్వౌషధులూ ధగధగలాడుతూ కనపడతవి. ఆ పర్వతము సాటిలేని కాంతులతో తేజరిల్లుతూ ఉంటుంది.

"నాయనా, ఆ ఓషధిపర్వతముమీద నాలుగు ఓషధులు ఉన్నవి. అవి దేదీప్యమానముగా ప్రకాశిస్తూ దశదిశలనూ తేజ రిల్ల చేస్తూ కనపడుతవి. ఆ ఓషధులలో సంజీవకరణి ఒకటి. దాని వల్ల చచ్చిపోయినవారు బ్రతుకుతారు. విశల్యకరణి అనే మూలిక రెండవది. దానివల్ల ప్రణాలు నయము అయిపోతవి. సావర్ణ్య కరణి మూడవ ఓషధి. దానివల్ల గాయాల మచ్చలూ వైవర్ణ్యమూ లేకుండా దేహము ఎప్పటిమాదిరిగా అవుతుంది. నాల్గవది సంధాన కరణి. అది తెగిపోయిన అవయవాలను అతికిస్తుంది.

"ఓ వాయుపుత్రుడా, నీవుపోయి ఈ నాలుగు మూలికలనూ వెంటనే తీసుకొనిరావలెను. చనిపోయిన వానరులను అందరినీ బ్రతికించవలెను. వాండ్లను అందరినీ స్వస్థచిత్తులను చేయవలెను" అని చెప్పినాడు.

ఇట్లా జాంబవంతుడు చెప్పింది విని హనుమంతుడు జలప్రవా హాలతో పెరిగిపోయే మహాసముద్రమువలె సంతోష బలాతిశయా లతో పెరిగిపోయి ఆ త్రికూటపర్వతాగ్రముమీదికి పోయినాడు.

ఆ పర్వతోత్తమాన్ని మరిఒక పర్వతమువలె హనుమంతుడు నలగత్రొక్కినాడు. ఆ పర్వతాకారుని పాదఘట్టనలకు ఆ పర్వతము చితికి చితికిలపడిపోయింది. అది ఎప్పటివలె నిలవలేకపోయింది. ఆ పర్వతశిఖరాలు రాలి చెల్లాచెదరుగా పడిపోయినవి. ఆ పర్వతముమీద చెట్లు విరిగి నేల కూలినవి. ఎండుచెట్లు మంటలు మండినవి. ఆ హనుమంతుడి పాదఘట్టనలకు ఆ పర్వతము గజగజ వణికిపోతూనూ రాళ్ళుపగిలి చెల్లాచెదరుగా పడిపోతూనూ చెట్లు విరిగి పడిపోతూనూ ఉంటే వానరయోధులు అక్కడ నిలవలేక పోయినారు.

లంకాపట్టణద్వారాలు కదిలిపోతూనూ ఆ యా గృహాలూ గోపురాలూ పడిపోతూనూ రాక్షసులు అందరూ భయపడుతూనూ కలవరపడిపోతూనూ ఉంటే ఆరాత్రి ఆ లంకాపట్టణము నాట్యమాడు తున్నట్లుగా కనిపించింది. ఆ మహాకాయుడి పాదఘట్టనలకు ఆ త్రికూటపర్వతమే కాకుండా భూమీ సముద్రమూ కపించిపోయినవి.

అప్పుడు హనుమంతుడు అక్కడనుంచి (ఆ త్రికూటపర్వతము మీదినుంచి సమీపములో ఉన్న) మలయపర్వతముమీదికి ఎగిరి పోయినాడు. మేరు మందర పర్వతాలవంటి ఆ మలయపర్వతము ఎన్నో శిలవళ్ళతోనూ నానావిధ వృక్షాలతోనూ లతలతోనూ జలాశయాలలో వికసిస్తూఉన్న కమలాలతోనూ అంతటా తిరుగుతూ ఉన్న వివిధ మృగాలతోనూ ఎన్నో గుహాలతోనూ అరవై యోజనాల ఎత్తున ఉంది. అక్కడ దేవతలూ అప్సరసలూ గంధర్వులూ విద్యాధరులూ మహర్షులూ విహరిస్తూ ఉంటారు. మహామేఘము వంటి ఆ వాయుపుత్రుడు హనుమంతుడు అక్కడ అప్పుడున్న యక్ష గంధర్వ కిన్నరులు అందరూ భయపడిపోయేటట్లు తన కాయాన్ని పెంచినాడు. పాదాలతో ఆ పర్వతాన్ని పద తొక్కుతూ భయంకరము అయిన బడబాముఖమువంటి తన నోరు తెరిచి రాక్షసులను భయపెట్టడానికి పెద్దపెట్టున గర్జించినాడు. ఆ హనుమంతుడి అద్భుతగర్జనము లంకాపట్టణములో ఉన్న రాక్షసులు అందరూ అప్పుడు విన్నారు. వారికి భయము వేసింది. కదలలేకపోయినారు. మెదలలేకపోయినారు. నిశ్చేష్టులు అయి పోయినారు.

ఆ భయంకర పరాక్రముడు ఆ పరంతపుడు హనుమంతుడు అప్పుడు రాముడికి మనసా నమస్కారము చేసినాడు. రాముణ్ణి సంతోష పెట్టడానికి ఆ మహోత్కృష్టకార్యము నిర్వహించ పూనుకొన్నాడు. అంతట ఆ చండవేగుడు సర్పమువంటి తన తోకను పైకి ఎత్తినాడు. వీపు వంచినాడు. చెవులు కుంచించినాడు. బడబాముఖమువంటి నోరు తెరచినాడు. ఆకాశానికి ఎగిరినాడు. హనుమంతుడి బాహువుల వేగానికీ తొడలవేగానికీ అప్పుడు ఆ పర్వతముమీద వృక్షాలూ శిలలూ శైలాలూ మహావృక్షాలు కొమ్మలూ పైకి ఎగిరి కొంతదూరము ఆ హనుమంతుణ్ణి వెంబడించి సముద్రజలాలలో పడిపోయినవి. అప్పుడు ఆ హనుమంతుడు పర్వతమువంటి తన బాహువులను చాచి గరుత్మంతుని పరాక్రమముతో దిక్కులను కంపరపెట్టుతూ హిమవత్పర్వతాన్ని ఉద్దేశించి ఉత్తరదిక్కుగా పోతూ అలలు చిమ్ముకొంటూనూ పైకివచ్చిన జలజంతువులు గుంపున తిరుగుతూనూ ఉన్న మహాసముద్రాన్ని చూస్తూ విష్ణుమూర్తి చేతినుంచి వదిలిన చక్రాయుధమువలె కనిపించినాడు. తన తండ్రి వాయుదేవునివంటి వేగముతో పరాక్రమముతో ఆకాశమార్గాన ఏమాత్రమూ శ్రమ పడకుండా పోతూ హనుమంతుడు మార్గమధ్యములో ద్వీపాలనూ మహారణ్యాలనూ నదులనూ వనాలనూ దేవపురాలనూ పెద్ద పెద్ద పట్టణాలనూ సుసమృద్ధములుగా ఉన్న జనపదాలనూ చూసినాడు. ఆ వానరశ్రేష్ఠుడు అట్లా వాయుదేవుడివలె మహత్తరము అయిన వేగముతో పోతూవుంటే దిక్కులు పిక్కటిల్లిపోయినవి. జాంబవంతుడు చెప్పిన మాటలు స్మరించుకుంటూ వాయువేగముతో పోతూ వున్న హనుమంతుడు హిమవత్పర్వతాన్ని చూసినాడు.

ఎన్నెన్నో సెలయేళ్లతోనూ ఎన్నెన్నో జలప్రవాహాలతోనూ ఎన్నెన్నో గుహలతోనూ తెల్లటి మేఘసమూహాలవంటి మనోహరము అయిన శిఖరాలతోనూ వివిధవృక్షాలతోనూ లతలతోనూ శోభాయమానముగా ఉండే ఆ హిమవత్పర్వతముమీదికి పోయినాడు. ఆ మహాపర్వతశృంగాలు ఎంతో ఎత్తు అయినవి. ఎంతో భయంకరము అయినవి. ఆ శిఖరాలమీదికి హనుమంతుడు పోయినాడు. దేవర్షిసమూహాలనూ వారు నివసించే మహాపుణ్యాశ్రమాలనూ చూసినాడు. ఆ హిమవత్పర్వతముమీద ఉన్న బ్రహ్మ

కోశాన్ని కైలాసాన్ని దేవేంద్రుడి ఆశ్రమస్థానాన్ని రుద్రదేవుడు విలాసార్థము బాణాలువదిలే స్థానాన్ని హయగ్రీవక్షేత్రాన్ని ధగ ధగ లాడుతూ ఉండే బ్రహ్మకపాలాన్ని యమకింకరుల విశ్రమ స్థానాన్ని బ్రహ్మదేవుడు దేవేంద్రుడికి వజ్రాయుధము ఇచ్చిన స్థానాన్ని సూర్యుడివలె తేజరిల్లే కుబేరస్థానాన్ని సూర్యుని బంధనస్థానాన్ని బ్రహ్మాసన స్థానాన్ని శివధనుః స్థానాన్ని భూమినుంచి పాతాళము పోయే రంధ్రస్థానాన్ని ఉత్తమోత్తమము అయిన కైలాసపర్వతాన్ని హిమవచ్ఛిలనూ ఋషభము అనే కాంచనపర్వతాన్ని రాత్రి పూట సమస్తౌషధులతో జ్వలించే సర్వౌషధిపర్వతాన్ని చూచినాడు. అగ్నిజ్వాలలవలె ధగధగలాడుతూ ఉన్న ఆ పర్వతాన్ని చూచి ఆశ్చర్యపోయినాడు. ఆ ఓషధిపర్వతముమీద అంతటా మూలికలకోసము వెతకడము మొదలుపెట్టినాడు.

ఆవిధముగా దివ్యౌషధులకోసము వెదుకుతూ ఆ పర్వతము మీద అనేకవేల యోజనాలమేర తిరిగినాడు. ఆ పర్వతముమీద ఉన్న మహౌషధులు తమను అప్పుడు ఆ హనుమంతుడు ఎత్తుకొని పోతాడు అని తెలుసుకొని అవి అతనికి కనపడకుండా అంతర్ధానము అయిపోయినవి. అట్లా ఆ ఓషధులుఅన్నీ కనబడకుండా పోయినందువల్ల అప్పుడు హనుమంతుడికి కోపము వచ్చింది. కోపముతో పెద్దపెద్ద కేకలు పెట్టుతూ నిప్పులవలె కన్నులు ఎర్రచేసి ఆ పర్వతముతో "ఓ ఓషధిపర్వతమా, నీవు రాముడిమీద దయలేకుండా ఉన్నావు. ఇదే—ఇట్లా ఓషధులను కనపడకుండా చేయడమే నీ నిశ్చయము అయినట్లయితే నా బాహుబలముతో నిన్ను పెళ్లగించివేస్తాను. నిన్ను పిండిపిండిచేసి పెదజల్లుతాను. చూడు" అని చెప్పి శోభాయమానము అయిన నత్రాలతోనూ మహావృక్షాలతోనూ మహాసర్పాలతోనూ బంగారముతోనూ వేలకొద్దీ గైరిక ధాతువులతోనూ చిన్నచిన్న శిఖరాలతోనూ ఉన్న ఆ పర్వత శిఖరాన్ని పట్టుకొని ఇట్టే పెళ్లగించివేసినాడు. సురాసుర లోకాల వారు అందరూ భయపడిపోయేటట్లు ఆ పెళ్లగించిన పర్వతాన్ని చేతిలో పట్టుకొని హనుమంతుడు ఆకాశానికి ఎగిరి గరుడోగ్ర వేగముతో పోతూఉంటే దేవతలు అందరూ అతనిని స్తోత్రము చేసినారు.

సూర్యకాంతులతో తేజరిల్లుతూఉన్న ఆ ఓషధిపర్వతాన్ని పట్టుకొని అంతరిక్షములో సూర్యుని సమీపాన పోతూఉన్న సూర్యసమాన కాంతిమంతుడు ఆ హనుమంతుడు అప్పుడు రెండవ సూర్యునివలె కనిపించినాడు. అట్లా ఆ పర్వతాన్ని పట్టుకొని ఆకాశములో పోతూఉన్న ఆ పర్వతాకారుడు వాయుపుత్రుడు హనుమంతుడు అప్పుడు వెయ్యి అంచులతోనూ అగ్నిజ్వాలలతోనూ తేజరిల్లే చక్రాయుధము పట్టుకొని పోతూఉన్న మహావిష్ణువువలె తోచినాడు.

అప్పుడు అట్లా ఆ ఓషధిపర్వతముతో వస్తూఉన్న ఆ మారుతాత్మజుణ్ణి హనుమంతుణ్ణి చూచి వానరవీరులు సంతోషాతిశయముతో గర్జించినారు. ఆ ఓషధిపర్వతవాసన సోకినంతమాత్రాననే లేచి గర్జిస్తూఉన్న వానరవీరులను చూచి హనుమంతుడు మహాగంభీరముగా ఉచ్చైఃస్వరముతో గర్జించినాడు. ఆ వానరుల గర్జాధ్వనులు విని లంకాపట్టణములో ఉన్న రాక్షసులు భయపడి వెర్రికేకలు పెట్టినారు. అప్పుడు ఆ మహానుభావుడు హనుమంతుడు ఓషధిపర్వతముతో ఆ త్రికూటపర్వతముమీద ఉన్న వానరసేనామధ్యములో దూకినాడు. వానరోత్తములకు శిరసా నమస్కారము చేసినాడు. విభీషణుణ్ణి కౌగలించుకొన్నాడు.

ఆ మహౌషధిగంధాన్ని అప్పుడు రామలక్ష్మణులు ఆఘ్రాణించినారు. వారి వ్రణాలు అన్నీ అప్పటికి అప్పుడు నయము అయిపోయి లేచినారు. ఆ మూలికలవాసన సోకిన తక్కిన వానరులున్నూ గాయాలు నయముఅయి లేచినారు. ఆ యుద్ధభూమిలో చచ్చిపడిఉన్న వానరయోధులు ఆ దివ్యౌషధి గంధము సోకగానే రాత్రి నిద్రపోయి తెల్లవారగానే లేచినట్లు వ్రణాలుఅన్నీ నయముఅయి ఏరోగమూ నొప్పీ లేకుండా హాయిగా లేచినారు.

ఆ లంకాపట్టణములో రాక్షసులకూ వానరులకూ యుద్ధము ఆరంభము అయినది మొదలు అంతవరకూ వానరుల చేతులలో చావ సిద్ధముఅయి పడిపోయిన రాక్షసులనూ చచ్చిపోయిన రాక్షసులనూ రావణాసురుడు తనకు లెక్క తెలియడానికో కాక ఇంతమంది రాక్షసులు చచ్చిపోయినారు అని ఇతరులకు లెక్క

తెలియకుండా ఉండడానికి సముద్రములో పారతోయించినాడు. అందువల్ల వానరులమాదిరిగా చచ్చిపోయిన రాక్షసయోధులకు అందరికీ ఆ దివ్యౌషధగంధము సోకి బ్రతికే అవకాశము లేకుండా పోయింది.

అంతట ఆ వాయుపుత్రుడు హనుమంతుడు ఆ ఓషధిపర్వతాన్ని పట్టుకొనిపోయి హిమవత్పర్వతముమీద వదిలిపెట్టి వెంటనే తిరిగి వచ్చి రాముణ్ణి కలుసుకొన్నాడు.

౭౩

ఆ మహాపరాక్రమవంతుడు వానరరాజు సుగ్రీవుడు ఇకను అంతట జరగవలసిన పనినిగురించి రాముడికి విన్నవించి హనుమంతుణ్ణి చూచి "ఓ మారుతీ, రావణాసురుడి కొడుకులు చచ్చిపోయినారు. అతడి తమ్ముడు కుంభకర్ణుడు చచ్చిపోయినాడు. ఆ దుఃఖమువల్ల అతడు ఇప్పుడు లేచివచ్చి యుద్ధము చేయలేడు. కాబట్టి మహా బలవంతులూ అమితవేగవంతులూ అయిన మన వానరవీరులు అందరూ ఇప్పుడు దివిటీలతోపోయి లంకాపట్టణాన్ని ముట్టడించ వలెను" అని ఆజ్ఞాపించినాడు.

వానరవీరులు అందరూ సుగ్రీవాజ్ఞను శిరసావహించినారు. సూర్యాస్తమయము అయింది. చిమ్మచీకట్లు కమ్ముకొన్నవి. దివిటీలు తీసుకొని వానరవీరులు అందరూ లంకాభిముఖులు అయి నడిచినారు. అట్లా దివిటీలు పట్టుకొని వానరవీరులు అన్నివైపుల నుంచి తమ లంకాపట్టణముమీదికి రావడము కావలివాండ్లు చూచినారు. భయపడిపోయినారు. అంతట ఆ వికారనేత్రులు అక్కడ నుంచి లంకాపట్టణములోకి పరుగులెత్తి పారిపోయినారు.

అప్పుడు ఆ వానరవీరులు పరమసంతోషముతో లంకా పట్టణద్వారాలకూ ప్రాకారముమీది బురుజులకూ రాజవీధిలో ప్రాసాదగృహాలకూ చిన్న చిన్న వీధులలో ఉన్న చిన్న చిన్న ఇండ్లకూ నిప్పు అంటించినారు. వానరులు వదిలిపెట్టిన ఆ అగ్నిహోత్రుడు అప్పుడు వందలకొద్దీ వేలకొద్దీ గృహాలను దహించి వేయడము మొదలుపెట్టినాడు.

పర్వతాలు అంతటి ప్రాసాదగృహాలు తగులబడి ఇట్టే నేల కూలినవి. ఆ యా గృహాలలో అగరూ శ్రీచందనమూ తగుల బడుతూ సుగంధధూపవాసనలు అంతటా గుబాళించినవి. ముత్యాలూ రత్నాలూ పగడాలూ తెల్లటి పట్టుబట్టలూ శోభాయ మానము అయిన పట్టుచీరాలూ గొర్రె వెంట్రుకల కంబళ్ళూ మేకవెంట్రుకల కంబళ్ళూ వివిధవికారాలతో చేసిన బంగారు ఆభర ణాలూ ఆయుధాలూ ఆ యా గృహాలలో కాలిపోయినవి. అవే కాదు. గుర్రాలకు పెట్టే లగాములూ మొదలు అయిన పనిముట్లూ ఆభరణాలూ ఏనుగుల కంఠాభరణాలూ నడుము కట్టు బంగారు మోకులూ రథోపకరణాలూ ఏనుగులకూ గుర్రాలకూ తొడిగే కవచాలూ యోధుల కవచాలూ ఖడ్గాలూ ధనుస్సులూ అల్లె తాళ్ళూ బాణాలూ తోమరాలూ అంకుశాలూ శక్త్యాయుధాలూ రకరకాల కంబళ్లూ చామరాలూ దాలుతోళ్లూ పులితోళ్లూ పులి గోళ్ళూ కస్తూరి మొదలు అయిన సుగంధ ద్రవ్యాలూ దగ్ధము అయిపోయినవి.

ముత్యాలతోనూ రత్నాలతోనూ అలంకరించిన ప్రాసాద గృహాలూ స్వస్తికాది నానావిధాకారాలతో నిర్మించిన గృహాలూ అట్లా ఆ లంకాపట్టణములో అన్నివైపులా నిప్పు అంటుకొని ఆ యా గృహాలలో ఉన్న రాక్షస గృహస్థులతోనూ వారి వారి వివిధాయు ధాలతోనూ భస్మము అయిపోయినవి. ఆ యా ప్రాసాదగృహాల లోనూ ఇంకా ఇతర గృహాలలోనూ ఆ యా ప్రదేశాలలోనూ అప్పుడు బంగారు కవచాలు తొడుగుకొని ఉన్నవారూ సొగసు అయిన వస్త్రాలు ధరించి పూలదండలు వేసుకొని ఉన్నవారూ మద్య పానము చేసి కైపు ఎక్కి కన్నులు తేలిపోతూ అడుగులు తడ బడుతూ తిరుగుతున్నవారూ తమ కాంతల కొంగులు పట్టుకొని ఉన్నవారూ శత్రువులమీది కోపములో గదలూ శూలాలూ కత్తులూ చూచుకొంటూ ఉన్నవారూ మాంసము తింటూఉన్న వారూ తాగుతూఉన్నవారూ మహార్హశయ్యలమీద తమ భార్య లతోకూడా పడుకొని నిద్రపోతున్నవారూ ఆ మంటలకు భయ పడి తమ బిడ్డలను తీసుకొని దిక్కులు తెలియకుండా పరుగులెత్త

పోయినవారూ అనేక లక్షలమంది లంకానగరవాసులు తగులపడి పోయినారు. మంటలు పదే పదే లేచినవి.

అప్పుడు ఆ లంకాపట్టణములో కాలిపోయిన గృహాలు సామాన్యమైనవి కావు. అవి అన్నీ గట్టివి. అమూల్యము అయినవి. అందము అయినవి. గంభీరము అయినవి. బంగారముతో చంద్రాకారముగానూ అర్ధచంద్రాకారముగానూ పైన చంద్రాశాలలతోనూ నిర్మించినవి. రత్నాలు పొదిగిన కిటికీలు. రత్నాలతోనూ పగడాలతోనూ చిత్ర విచిత్రముగా అలంకరించిన పాన్పులూ ఆసనాలూ మొదలు అయినవి అన్నీ ఉన్నవి. ఆ భవనాలు ఆకాశాన్ని అంటుతూన్నవి. ఆ గృహాలలో ఎప్పుడూ క్రౌంచపక్షులు కేకలు వేస్తూనూ నెమళ్లు నాట్యమాడుతూనూ వీణలు మోగుతూనూ స్త్రీల ఆభరణాల చప్పుళ్లు వినిపిస్తూనూ ఉంటవి. అటువంటి ఆ గృహాలు అన్నీ కాలిపోతూ మంటలు వెలుపలి వాకిళ్ళకు వ్యాపించినవి. అట్లా తగులపడిపోతున్న ఆ గృహాలు అన్నీ తొలకరివానలు కురిసేటప్పుడు మెరుపులవలెనూ మేఘాలవలెనూ ఆ రాత్రి కనిపించినవి.

దేవేంద్రుడి వజ్రాయుధముదెబ్బకు పగిలి చిందరవందరగా పడిపోయే పర్వతాలవలె ఆ మంటలకు ఆ గృహాలు భయంకరము అయిన చప్పుళ్ళతో పగిలి పడిపోయినవి. ఆ మంటలకు అప్పుడు పయిన విమానగృహాలలో పడుకొని నిద్రపోతూ ఉన్న వరాంగనలు లేచి తమ ఆభరణాలను తీసి అవతల పారవేసి అటూ ఇటూ పరుగులెత్తిపోయి హాహాకారాలు చేసినారు. ఏమీ తోచక ఏడ్చినారు. అట్లా మంటలు మండుతూన్న ఆ విమానగృహాలు రాత్రిపూట ఓషధులతో తేజరిల్లే హిమవత్పర్వతశిఖరాలవలె దూరానికి కనిపించినవి. రాత్రిపూట మంటలు మండుతూ ఉన్న హర్మ్యాగ్రభాగాలూ విరగపూసిన మోదుగుచెట్లవలె తోచినవి.

అప్పుడు మావటివాండ్లు తమతమ ఏనుగుల కట్టుతాళ్లు వదిలించి వేసినారు. గుర్రపువాండ్లు తమతమ గుర్రాల కట్టుతాళ్లు తెంచివేసినారు. ప్రళయకాలంలో మహాసముద్రమధ్యాన గిలిగిలిగా తిరిగే నక్రగ్రాహాలవలె ఆ ఏనుగులూ ఆ గుర్రాలూ అప్పుడు ఆ లంకాపట్టణములో దిక్కులు తెలియకుండా పరుగులెత్తినవి.

అట్లా పరుగులెత్తుతూ ఉన్న గుర్రాలను చూచి ఏనుగులు భయపడి వెనుకకు పరుగులెత్తినవి. వెనుకకు పరుగులెత్తుతూవున్న ఏనుగులను చూచి గుర్రాలు భయపడి పరుగులెత్తినవి. అట్లా తగులపడిపోతూన్న ఆ లంకాపట్టణములో మంటలు మహాసముద్రములో ప్రతిఫలించి సముద్రజలాలు రక్తవర్ణముతో కనిపించినవి.

ఒక్కముహూర్తము సేపులో వానరులు నిప్పు ముట్టించిన లంకాపట్టణం ప్రళయకాలములో ఈ లోకమంతా దగ్ధము అయిపోతున్న భూమిమాదిరిగా కనిపించింది. పొగలు కమ్ముకొని మంటలు మండుతూ ఉంటే ఆ లంకాపట్టణములో ఆడవాండ్లు అరిచిన అరుపులూ పెడబొబ్బలూ పదియోజనాల దూరము వినిపించినవి. ఒళ్లు కాలి పరుగులెత్తి బయటకు వస్తూన్న రాక్షసులను అందరినీ వెంటనే వానరయోధులు ఎదిరించినారు.

అప్పుడు రామప్రభువు ఉత్తమోత్తమము అయిన ధనుస్సు తీసుకొని అల్లెత్రాడు మోగించినాడు.

ఆ ధనుష్టంకారము క్రుద్ధుడు అయిన రుద్రదేవుని వేదమయ ధనుష్టంకారమువలె వినిపించింది. ఆ మహాభయంకర ధ్వనికి రాక్షసులు అందరూ దద్దరిల్లిపోయినారు. ఆ ధనుష్టంకారధ్వనిలో రాక్షసుల అరుపులూ పెడబొబ్బలూ వానరుల కోలాహల ధ్వనులూ వినిపించకుండా మునిగిపోయినవి. ఆ మహాధ్వని దశదిశలా మారు మోగింది. రాముడు అప్పుడు ఆ కార్ముకములోనుంచి బాణాన్ని వదిలినాడు. ఆ బాణపాతానికి కైలాసశిఖరము అంత ఎత్తున వున్న లంకాపురద్వారము తునాతునకలు అయి నేలకూలింది. అంతటితో వదిలిపెట్టకుండా రాముడు లంకాపట్టణముమీద బాణాలు వదలడము మొదలుపెట్టినాడు. అది చూచి విమానగృహాలలోనూ వివిధగృహాలలోనూ ఉన్న రాక్షసులు అందరూ యుద్ధసన్నద్ధులు అయినారు. రాక్షసవీరులు యుద్ధసన్నద్ధులు అయి సింహనాదాలు చేస్తూ వస్తూ ఉంటే అది ప్రళయకాలరాత్రి వలె పరమభయంకరముగా తోచింది.

మహాపరాక్రమవంతుడు వానరరాజు సుగ్రీవుడు వానరయోధులను అందరినీ చూచి "ఓయోధులారా, మీరు ఇప్పుడు

రావణాంతఃపురద్వారము దగ్గర పోరాటము సాగించవలెను. ఆ యా స్థలాలలో నిలవకుండా మీలో ఎవరు అయినా నా ఆజ్ఞను మేర మీరేట్లయితే రాజశాసనాన్ని ధిక్కరించిన నేరానికి శిక్షగానే వాణ్ణి చంపివేయవలెను" అని ఆజ్ఞాపించినాడు. సుగ్రీవాజ్ఞను శిరసావహించి వానరయోధులు అందరూ అప్పుడు రావణాంతఃపురద్వారాన్ని ముట్టడించినారు. అందుకు రావణాసురుడికి పెద్ద కోపము వచ్చింది. ఒళ్లు విరుచుకొని సింహనాదము చేసినాడు. ఆ అరుపుకు దశదిశలూ కలవరపడిపోయినవి. ప్రళయకాల రుద్రుడివలె లేచినాడు. కుంభకర్ణుడి పుత్రులను కుంభుణ్ణి నికుంభుణ్ణి రాక్షసయోధులతో పోయి వానరులతో పోరాడవలసింది అని ఆజ్ఞాపించినాడు. ఆ కుంభ నికుంభులతో యూపాక్షుడూ శోణితాక్షుడూ ప్రజంఘుడూ కంపనుడూ రావణాజ్ఞను శిరసావహించి బయలుదేరినారు. అప్పుడు ఆ మహాబలవంతులను అందరినీ చూచి రావణాసురుడు "ఓ వీరులారా, మీరు దిక్కదరించే సింహనాదాలు చేస్తూ పొండి. వానరులను జయించండి" అని ప్రోత్సహించినాడు.

ఆ రాక్షసవీరులు పదే పదే సింహనాదాలు చేస్తూ జ్వలిస్తూ ఉన్న ఆయుధాలతో బయలుదేరినారు. ఆ రాక్షసవీరులు ధరించిన ఆభరణాల కాంతులతోనూ వానరుల దివిటీల వెలుతురులతోనూ ఆ ప్రదేశము అప్పుడు ఆకాశమువరకూ కనిపించింది. అంతే కాకుండా అప్పుడు చంద్రోదయము అయింది. ఆ చంద్రుడి వెన్నెలా నక్షత్రకాంతులూ లంకాపట్టణము తగులబడుతూ ఉన్న మంటలూ రాక్షసుల ఆభరణాల ధగధగలూ వానరుల దివిటీల వెలుతురూ ఏకము అయి అన్నివైపులా కనిపించింది. పయికి లేగుతూ ఉన్న మంటలనుంచి అటు ఆకాశమునుంచి ఇటు పాతాళము వరకూ అంతా వెలుతురు అయిపోయింది. ఆ వెలుతురులో రాక్షససైన్యాలూ వానరసైన్యాలూ తేజరిల్లినవి. పతాకాలతోనూ ధ్వజాలతోనూ భయంకరము అయిన ఏనుగులతోనూ గుర్రాలతోనూ వివిధవేషాల పదాతులతోనూ కత్తి గొడ్డలి కలిసిఉన్న ఆయుధాలూ ధగధగలాడుతూ ఉన్న శూలాలూ గదలూ తోమరాలూ జ్వలిస్తూఉన్న ప్రాసాలూ పావెట్టిన గండ్రగొడ్డళ్ళూ

భయంకర బాణాలు ఎక్కుపెట్టిన కార్ముకాలూ తీసుకొని భుజాలకు బంగారు ఆభరణాలు పెట్టుకొని మెడలలో పూలదండలు వేసుకొని తమ తమ చేతులలో ఉన్న వివిధాయుధాలూ ఝళిపిస్తూ భయంకర పరాక్రమముతో పౌరుషముతో మహామేఘాలవలె సింహనాదాలు చేస్తూ రాక్షసవీరులు తమ తమ సైన్యాలతో వానరులమీదికి నడిచినారు.

అట్లా వస్తూఉన్న ఆ మహాదారుణము అయిన రాక్షససైన్యాన్ని చూచి వానరసైన్యము యుద్ధోత్సాహముతో పెద్దపెట్టున గర్జించింది. మిడుతలు ఎగిరి అగ్నిహోత్రముమీదికి పోయేటట్లు ఆ రాక్షస సైన్యము అప్పుడు వానరసైన్యముమీదికి పోయింది. భుజాల రాపిడినుంచి సానపెట్టిన వజ్రాయుధమువలె తళతళలాడుతూ ఉన్న పరిఘాయుధాలతోనూ వివిధాయుధాలతోనూ రాక్షససైన్యము వానరసైన్యముమీదికి పోయింది. వానరులు యుద్ధోత్సాహముతో వృక్షాలూ పర్వతశిఖరాలూ తీసుకొని రాక్షసులను ఎదిరించినారు. పిడికిళ్ళతో రాక్షసులను గుద్దినారు. పిచ్చిఎత్తిన వాండ్లవలె ఎగిరి గంతులు వేసినారు. భయంకరాకారులు అయిన రాక్షసులు తమమీదికి వచ్చిన వానరుల శిరస్సులను తీక్ష్ణముఅయిన ఖడ్గాలతో తటాలున తెగవేసినారు.

ఆ పోరాటములో వానరులు రాళ్ళతో రాక్షసుల అవయవాలను చితుకకొట్టినారు. పిడికిటి పోట్లతో రాక్షసుల తలలు చితుక పొడిచినారు. కోరలతో రాక్షసుల చెవులు కొరికివేసినారు. అట్లా అయినప్పటికిన్నీ రాక్షసయోధులు వానరయోధులను అనేక మందిని చంపివేసినారు. మేటి వానరవీరులను రాక్షసవీరులు ఖడ్గాలతో ఎదుర్కొన్నారు. ఆ పోరాటములో ఒకణ్ణి ఒకడు కొట్టుతూఉంటే ఆ కొట్టుతూ ఉన్నవాణ్ణి మరిఒకడు వచ్చి కొట్టినాడు. ఒకణ్ణి ఒకడు పడతోస్తూ ఉంటే ఆ పడతోస్తూ ఉన్న వాణ్ణి మరిఒకడు వచ్చి పడతోసినాడు. ఒకణ్ణి ఒకడు నిందిస్తూ ఉంటే ఆ నిందిస్తూ ఉన్నవాణ్ణి మరిఒకడు వచ్చి కొరికినాడు. తనను కొట్టి చూడమని ఒకడూ ఇదుగో కొట్టుతున్నాను అని ఒకడ్లూ నా ఎదుట నిలచి చూడమని మరిఒకడూ అంటూ ఆ

పోరాటములో రాక్షసులూ వానరులూ అన్యోన్యమూ తమ బల పరాక్రమాలను ప్రదర్శించినారు. కట్టుకొన్న వస్త్రాలు జారిపోతూ తొడుగుకొన్న కవచాలు ఊడిపోతూ ఆయుధాలు చేతులలోనుంచి జారిపోతూ ఈటెలతోనూ అస్త్రాలతోనూ శూలాలతోనూ రాక్షసులు మహాభయంకరముగా పోరాడినారు. రాక్షసులు ఒక్కొక్క దెబ్బకు ఏడుగురు వానరులను పదిమంది వానరులను చంపివేసినారు. అదేవిధముగా వానరులున్నూ ఒక్కొక్క దెబ్బకు పదిమంది రాక్షసులను చంపి వేస్తూ పోరాటము సాగించినారు.

తలవెంట్రుకల ముడులు ఊడిపోయి కట్టుకొన్న వస్త్రాలు జారిపోయి తొడుగుకొన్న కవచాలు చిరిగిపోయి రథధ్వజాలు విరిగిపోయి పోరాటము సాగిస్తూ ఉన్న రాక్షసవీరులను వానరయోధులు అప్పుడు అన్నివైపులా ఎదిరించినారు.

౭౬

ఎడా తెరపీ లేకుండా భయంకరముగా సాగుతూ ఉన్న ఆ పోరాటములో అనేకమంది వీరులు నాశనము అయిపోయినారు. యుద్ధోత్సాహములో అంగదుడు అప్పుడు కంపనుడిమీదికి పోయినాడు. కంపనుడు అంగదుణ్ణి ఆహ్వానించి కోపముతో లేగి ఇట్టె తన గదతో కొట్టినాడు. అంగదుడికి ఆ దెబ్బ గాఢముగా తగిలింది. మూర్ఛపోయినాడు. కొంచెముసేపటికి తేరుకొని ఆ మహాపరాక్రమవంతుడు ఒక పర్వతశిఖరాన్ని పెళ్ళగించి కంపనుడిమీద విసరివేసినాడు. ఆ దెబ్బకు కంపనుడు నేలకూలి చచ్చిపోయినాడు.

కంపనుడు హతము అయిపోవడము శోణితాక్షుడు చూచి తన రథాన్ని నిర్భయముగా అంగదుడిమీదికి తోలించి శరీరాన్ని దహించివేసే ప్రళయకాలాగ్నివంటి నిశితబాణాలను వదలడము మొదలుపెట్టినాడు. మంగలికత్తులవంటి బాణాలనూ అర్ధచంద్రాకారపు బాణాలనూ ఇనుపబాణాలనూ దూడపళ్ళవంటి బాణాలనూ కంకపక్షిరెక్కలవంటి మొనలు ఉన్న బాణాలనూ, రెండు వైపులా చివులు వున్న బాణాలనూ అర్ధనారాచబాణాలనూ గన్నేరుఆకువంటి బాణాలనూ శోణితాక్షుడు తనమీదికి వదులుతూ

ఉంటే ఆ పరాక్రమవంతుడు వాలిపుత్రుడు అంగదుడు ఆ బాణాలను లెక్క చేయకుండా తన బలము అంతా చూపించడానికి ఎగిరి ఆ శోణితాక్షుడిమీదికి పోయినాడు. ఆ శోణితాక్షుడి చేతిలో ఉన్న పెద్ద ధనుస్సునూ బాణాలనూ ఊడిలాగి వాటిని విరిచివేసినాడు. అంతట ఆ రథాన్ని పగులకొట్టడము మొదలుపెట్టినాడు.

శోణితాక్షుడు అంతట కత్తీ డాలూ తీసుకొని అనాలోచితముగా కోపముతో ఇట్టే ఆకాశానికి ఎగిరినాడు. ఆ బలవంతుడు అంగదుడున్నూ అమితవేగముతో ఆకాశానికి ఎగిరి ఆ శోణితాక్షుడి చేతిలో ఉన్న ఖడ్గాన్ని ఊడలాగుకొని సింహనాదము చేసినాడు. ఆ ఖడ్గముతోనే ఆ శోణితాక్షుడి భుజఫలకముమీది నుంచి యజ్ఞోపవీతము మాదిరిగా అంగదుడు తెగవేసినాడు. ఆ మహాఖడ్గాన్ని పట్టుకొని పదేపదే సింహనాదము చేస్తూ అంగదుడు తక్కిన రాక్షసులమీదికి పరుగెత్తినాడు. శోణితాక్షుడు అప్పుడు ఒక ఇనుపగుదియ తీసుకొని అంగదుడి వెంటపడ్డాడు.

మహాబలవంతుడూ పరాక్రమవంతుడూ అయిన యూపాక్షుడు ప్రజంఘుణ్ణి వెంటపెట్టుకొని తన రథాన్ని ఆ సమయాన అంగదుడికి ఎదురుగుండా తోలించినాడు. ఆ విధముగా శోణితాక్ష ప్రజంఘుల మధ్యను పడిపోయిన అంగదుడు అప్పుడు విశాఖా నక్షత్రాల రెంటి మధ్యనూ ఉన్న పూర్ణచంద్రుడివలె శోభించినాడు. అంగదుణ్ణి ఆ పోరాటములో కాపాడుతూ ఉన్న మైంద ద్వివిదులు అప్పుడు అంగదుడు సమీపానికి పోయి ఆ రాక్షసులను పరస్పరమూ చూస్తూ నిలుచున్నారు. ఆ భయంకరాకారులు ఆ మహాబలవంతులు రాక్షసవీరులు కత్తులూ డాళ్లూ గదలూ తీసుకొని యుద్ధసన్నద్ధులు అయి మహారోషముతో ఆ వానరోత్తములను ఎదుర్కొన్నారు. వానరవీరులు అంగద మైంద ద్వివిదులు ముగ్గురున్నూ రాక్షసవీరులు శోణితాక్ష యూపాక్ష ప్రజంఘులు ముగ్గురున్నూ ఒళ్లు గగుర్పుట్టించేట్టుగా అప్పుడు పోరాటము సాగించినారు.

ఆ వానరవీరులు విసిరివేస్తూ ఉన్న మహావృక్షాలనూ శిలలనూ ప్రజంఘుడు తన ఖడ్గముతో నరికివేసినాడు. ఆ మహావృక్షాలూ

శిలలూ వచ్చి గుర్రాలమీదనూ రథాలమీదనూ పడకుండా యూపాక్షుడు తన బాణాలతో అడ్డగించినాడు. వాటిని దారిలోనే శోణితాక్షుడు తన గదతో విరగగొట్టినాడు. అప్పుడు ప్రజంఘుడు మర్మస్థానాలను తెగవేసే మహాఖడ్గముతో అమితవేగముగా అంగదుడిమీదికి పోయినాడు. అది చూచి అంగదుడు ఇనుమద్ది చెట్టుతో ఆ ప్రజంఘుణ్ణి కొట్టినాడు. ఆ బలవంతుడు అంతటితో ఊరక ఉండకుండా ప్రజంఘుడు ఖడ్గము పట్టుకొనిఉన్న భుజముమీద తన పిడికిలితో ఒక్కపోటు పొడిచినాడు. ఆ దెబ్బకు ప్రజంఘుడి చేతిలో ఉన్న ఖడ్గము జారి నేలమీద పడిపోయింది. నల్లకలువరేకువంటి తన ఖడ్గము నేలమీద పడిపోగానే ప్రజంఘుడు వజ్రసమానము అయిన తన పిడికిలితో అంగదుడి లలాటముమీద కొట్టినాడు. ఆ పిడికిటిపోటుకు అంగదుడు ఒక ముహూర్తముసేపు కదలలేక పోయినాడు; మెదలలేక పోయినాడు.

ఆ మహాతేజోవంతుడు వాలిపుత్రుడు అంగదుడు తేరుకొని నేలమీదఉన్న ఖడ్గము తీసుకొని ప్రజంఘుడి శిరస్సును ఇట్టే తెగవేసినాడు. అట్లా తన పినతండ్రి కాయమునుంచి శిరము తెగి పడిపోవడము చూచి యూపాక్షుడు కన్నీళ్లు కారుస్తూ బాణాలు అన్నీ అయిపోయినందువల్ల తక్షణమే రథము దిగి ఒక ఖడ్గము తీసుకొని బయలుదేరినాడు. అట్లా వస్తూఉన్న ఆ యూపాక్షుణ్ణి చూచి ద్వివిదుడు క్రుద్ధుడు అయిపోయి ఇట్టే అతడి ఎదురురొమ్ములమీద కొట్టి బలవంతముగా పట్టుకొన్నాడు. తన తమ్ముణ్ణి ద్వివిదుడు పట్టుకోవడము చూచి శోణితాక్షుడు తన గదతో ఆ ద్వివిదుణ్ణి కొట్టినాడు. ఆ దెబ్బకు ద్వివిదుడు చలించినాడు. అంతలో మళ్ళీ కొట్టడానికి శోణితాక్షుడు గద ఎత్తినాడు. ఆ ఎత్తిన గదను ద్వివిదుడు ఊడలాగుకొన్నాడు.

అప్పుడు యూపాక్షుడి వక్షఃస్థలాన వానర యూథపతి మైందుడు అరచేతితో చరచినాడు. అంతట ఆ మహాబలవంతులు శోణితాక్షయూపాక్షులున్నూ మైందద్వివిదులున్నూ ఒకండ్లను ఒకండ్లు పడలాగుకొంటూ కొట్టుకొన్నారు. శోణితాక్షుడి ముఖాన్ని ద్వివిదుడు తన గోళ్ళతో చీరివేసినాడు. అంతటితో వదిలిపెట్టకుండా

ఆ శోణితాక్షుణ్ణి నేలమీదికి పడకొట్టి నలిపి ముద్దముద్దగా చేసివేసినాడు. మైందుడు అప్పుడు ఆ యూపాక్షుణ్ణి రెండు చేతులతోనూ కొట్టి చంపివేసినాడు.

ఆ పోరాటములో రాక్షససైన్యము చాలాభాగము నశించింది. మహావీరులు చచ్చిపోయినారు. చావగా మిగిలిన రాక్షసయోధులు అప్పుడు కుంభకర్ణుని కొడుకు కుంభుడిదగ్గరకు పరుగెత్తినారు. అట్లా అమిత వేగముతో తనదగ్గరకు పరుగెత్తుకొని వచ్చిన ఆ రాక్షస సైన్యానికి అప్పుడు కుంభుడు ధైర్యం చెప్పినాడు. రాక్షస సైన్యములో ఎదురులేని మహావీరులు అందరూ పడిపోవడము చూచి ఆ రాక్షసశ్రేష్ఠుడు ఆ ధానుష్కుడు కుంభుడు అంతట ధనుస్సు తీసుకొన్నాడు. దేహాన్ని చీల్చివేసే విషసర్పమువంటి బాణాన్ని ఆ ధనుస్సుకు ఎక్కించినాడు. ఇంద్రధనుస్సువలె ధగధగలాడుతూ ఉన్న ఆ వింటి అల్లెత్రాటిని తన చెవులవరకూ లాగి బంగారుపింజలతో మెరుపుమాదిరిగా మెరుస్తూఉన్న బాణాన్ని ద్వివిదుడిమీద వదిలినాడు. ఇట్టే వచ్చిపడ్డ ఆ బాణము దెబ్బకు పర్వతమువంటి ఆ వానరోత్తముడు ద్వివిదుడు పాదాలు తడపడిపోయి అవయవాలు స్వాధీనము తప్పిపోయి నేలమీద పడిపోయినాడు. తన తమ్ముడు అట్లా పడిపోవటము చూచి మైందుడు ఒక పెద్ద రాతిబండను తీసుకొని కుంభుడిమీద విసరివేసినాడు. అది చూచి కుంభుడు బాణాలు వదిలి ఆ రాతిబండను ముక్కలు ముక్కలు చేసివేసినాడు. అంతట విషసర్పమువంటి మరి ఒక బాణాన్ని ఆ వింట సంధించి మైందుడిమీద వదిలినాడు. ఆ బాణము మైందుడి మర్మస్థానములో గుచ్చుకొంది. అతడు మూర్ఛపోయి నేలమీద పడ్డాడు. తన మేనమామలు మైందద్వివిదులు ఇద్దరూ అట్లా పడిపోవడము అంగదుడు చూచినాడు. అప్పుడు కార్ముకము ఎత్తుతూఉన్న కుంభుడిమీదికి పరుగెత్తినాడు. అట్లా తనమీదికి వస్తూఉన్న ఆ అంగదుడిమీద అప్పుడు కుంభుడు అయిదు ఇనుపబాణాలు వదిలినాడు. అంతట తృప్తిచెందక మరి మూడు కరుకు బాణాలనూ బంగారముతో అలంకరించిన ఇనుప బాణాలను మొక్కపోనివాటిని అంగదుడిమీద వదిలినాడు. అన్ని బాణాలు వచ్చి మీదపడుతూఉన్నప్పటికిన్నీ అంగదుడు ఏమాత్రమూ

చలించకుండా ఉండడమే కాకుండా ఆ కుంభుడి నెత్తిమీద రాళ్ళ వాన, చెట్లవాన కురిపించినాడు. ఆ కాంతిమంతుడు కుంభుడు అట్లా వచ్చిపడుతూఉన్న రాళ్లనూ చెట్లనూ తన బాణాలతో నరికివేసినాడు. అంతట తనమీదికి వస్తూఉన్న అంగదుణ్ణి చూచి కుంభుడు ఏనుగును కొరవులతో అడ్డగించేట్లు ఆ అంగదుడి కనుబొమలమీద బాణాలను వదిలినాడు. నెత్తురు కారుతూ అంగదుడు కన్నులు తెరవలేక పోయినాడు. అప్పుడు అతడు కన్నులమీదికి కారుతూఉన్న నెత్తురును ఒకచేతితో తుడుచుకొంటూ రెండవచేతితో సమీపములో ఉన్న సాలవృక్షాన్ని పట్టుకొని రొమ్ముతో ఆ చెట్టుబోదెను కదిలిస్తూ కొంచెము వంగి ఏనుగువలె ఆ చెట్టును విరిచివేసినాడు. ఇంద్రధ్వజమువలెనూ, మందరపర్వతమువలెనూ ఉన్న ఆ సాలవృక్షాన్ని వెంటనే కుంభుడిమీద విసరివేసినాడు. అదిచూచి కుంభుడు దేహాన్ని భేదించివేసే ఏడు బాణాలను అంగదుడిమీద వదిలినాడు. ఆ బాణాలకు అంగదుడు అమితముగా బాధపడుతూ అరిచి మూర్ఛపోయినాడు. ఆ దురాసదుడు అంగదుడు సముద్రములో పడ్డవాడివలె అట్లా కొట్టుకులాడుతూఉంటే చూచి వానరయోధులు ఆ సంగతి రాముడికి విన్నవించడానికి పోయినారు.

అప్పుడు రాముడు, జాంబవంతుడు మొదలయిన వానర వీరులను పోయి అంగదుణ్ణి చూడవలసింది అని ఆజ్ఞాపించినాడు. రామాజ్ఞను శిరసావహించి పెద్దపులులవంటి ఆ వానరవీరులు కుపితులు అయి కుంభుడిమీదికి పోయినారు. ఆ ధానుష్కుణ్ణి జాంబవంతుడూ సుషేణుడూ వేగదర్శి అనే ముగ్గురు వానరవీరులూ ఎదిరించినారు. జలప్రవాహాలను పర్వతాలతో అడ్డగించేటట్లు ఆ మహాబలవంతులగు వానరవీరులను కుంభుడు తన బాణపరంపరలతో నిరోధించినాడు. సముద్రము చెలియలికట్టను దాటలేక పోయినట్టు ఆ కుంభుడి బాణపథాన్ని దాటి ఆ వానరవీరులు ముందుకు పోలేకపోయినారు.

కుంభుడి బాణవర్షానికి వానరసైన్యసమూహాలు బాధపడడము సుగ్రీవుడు చూచినాడు. అంగదుణ్ణి దాటి ముందుకు పోయినాడు. పర్వతసానువులో సంచరిస్తూఉన్న మదపుటేనుగుమీదికి అమిత వేగముతో దూకే సింహముమాదిరిగా కుంభుడిమీదికి సుగ్రీవుడు

ఉరికినాడు. పెద్దపెద్ద రాళ్ళనూ ఇనుమద్దిచెట్లనూ చండ్రచెట్లనూ ఇంకా ఎన్నోరకాల చెట్లనూ పెళ్ళగించి కుంభుడిమీద విసరివేసినాడు. ఆకాశము అంతా ఆవరించి కురుస్తూఉన్న వాన మాదిరిగా తనమీద పడుతూఉన్న ఆ రాళ్లనూ ఆ చెట్లనూ కుంభుడు తన బాణాలతో నరికివేసినాడు. గురితప్పని కుంభుడి బాణాలకు ముక్కలు ముక్కలు అయిపోయిన ఆ రాళ్లూ ఆ చెట్లూ శతఘ్నులవలె నేలమీద తేజరిల్లినవి. తాను వానగా కురిపించిన ఆ వృక్షాలను అన్నిటినీ కుంభుడు నరికివేసినందుకు ఆ కాంతిమంతుడు ఆ మహాబలవంతుడు సుగ్రీవుడు కించ పడలేదు. అమిత వేగముతో అప్పుడు ఆకుంభుడు వదులుతూ ఉన్న బాణాలు తనను భేదించి బాధపెట్టుతూ ఉన్నప్పటికిన్నీ ఓర్చుకొని సుగ్రీవుడు కుంభుడి రథముమీదికి ఇట్టే ఎగిరి పోయినాడు. అతడి చేతిలోఉన్న ఇంద్రధనుస్సువంటి ధనుస్సు పట్టుకొని విరిచి వేసినాడు. ఎవడికీ సాధ్యముకాని అటువంటి పని చేసి సుగ్రీవుడు కుపితుడు అయిపోయినాడు. తనచేతిలో ధనుస్సు పోయినందువల్ల దంతాలు విరిగిపోయిన మదపుటేనుగు మాదిరిగా ఉన్న కుంభుణ్ణి చూచి "ఓ కుంభుడా, నీ పరాక్రమము నీ బాణవేగమువలె అద్భుతము అయింది. నీ ప్రభావము రావణాసురుడి ప్రభావమువలె అద్భుతముగా ఉంది. నీవు ప్రహ్లాదుడితోనూ బలిచక్రవర్తితోనూ కుబేరుడితోనూ వరుణదేవుడితోనూ సరిసమానము అయినవాడవు. బలపరాక్రమానికి నీవు ఒక్కడవే నీ తండ్రినిపోలి పుట్టినావు.

"ఓ మహాబాహూ, నీవు చాపహస్తుడవు అయిన అరిందముడవు. మనోవ్యథలు జితేంద్రియుణ్ణి ఏమీ చేయలేనట్లు దేవతలు నిన్ను అతిక్రమించలేరు. నీవు మహాబుద్ధిమంతుడవు. అయితే నీవు ఇప్పుడు నేను చూస్తూ ఉండగా యుద్ధములో పరాక్రమించవలెను.

"ఓ కుంభుడా, నీ పినతండ్రి వరప్రభావమువల్ల దేవదానవులను ఎదిరించి లోపరచుకొన్నాడు. నీ తండ్రి కుంభకర్ణుడు కేవలము తన పరాక్రమమువల్ల దేవదానవులను లోపరచుకొన్నాడు. నీవు ధనుస్సు పట్టడములో ఇంద్రజిత్తు అంతటివాడవు. పరాక్రమములో

రావణాసురుడు అంతటివాడవు. బలపరాక్రమాలకు ఇప్పుడు ఈ లోకములో ఉన్న రాక్షసులలో నీఅంతటివాడు మరిఒకడు లేడు. నీవు అప్రతిమానకృత్యము చేసినావు. నీ అస్త్రకౌశలాన్ని చూపించినావు. భయంకర పరాక్రములు అయిన వానరవీరులను పడగొట్టినావు.

"ఓ వీరుడా, అనేకమందితో పోరాడి అలసిపోయినవాణ్ణి చంపివేసినాడు అనే అపఖ్యాతి నాకు వస్తుంది అనే భయమునుంచి ఇంతవరకూ నీతో పోరాడకుండా ఊరకఉన్నాను. నీవు చాలా పనిచేశావు. అలసిపోయినావు. కొంచెము సేపు అలుపుతీర్చుకో. ఆ తరువాత మనము పోరాడుదాము. మన పోరాటాన్ని సమస్త భూతాలూ చూస్తవి. శంబరాసురుణ్ణి దేవేంద్రుడివలె నిన్ను నేను చంపివేస్తాను" అని చెప్పినాడు.

ఇటువంటి అవమానపు మాటలతో సుగ్రీవుడు తనను గౌరవిస్తూ ఉంటే కుంభుడు నేతితో హోమము చేస్తూఉన్న అగ్నిహోత్రమువలె భగ్గున మండిపోయినాడు. తక్షణము తన రెండు చేతులతోనూ సుగ్రీవుణ్ణి కుంభుడు పట్టుకొన్నాడు. అంతట కుంభుడూ సుగ్రీవుడూ మాటిమాటికి నిట్టూర్పులు విడుస్తూ రెండు మదపుటేనుగులవలె ఒకరిని ఒకరు పట్టుకొని పడలాగుకొంటూ అలసిపోయి నోళ్ళలోనుంచి పొగలూ మంటలూ వదిలిపెట్టినారు. వాండ్ల పాదాల తొక్కిడికి ఈ భూమి అణగారిపోయింది. సముద్రము పెద్దపెద్ద అలలతో లేచి గిర్రున తిరుగుతూ అల్లకల్లోలము అయిపోయింది. అప్పుడు సుగ్రీవుడు ఆ సముద్రము అడుగు చూపించడానికో అన్నట్లు కుంభుణ్ణి ఎత్తి ఆ సముద్రములో పారవేసినాడు.

కుంభుడు పడగానే ఆ మహాసముద్రము వింధ్య మందర పర్వతాల అంతఎత్తున పయికిలేచి అన్నివైపులా వ్యాపించింది. కుంభుడు అంతట ఆ సముద్రములోనుంచి పయికి ఎగిరివచ్చి తన పిడికిలి బిగించి వజ్రాయుధ వేగముతో సుగ్రీవుడి ఎదురురొమ్ముల మీద పొడిచినాడు. ఆ పిడికిటిపోటుకు సుగ్రీవుడి ఎదురురొమ్ముల మీద చర్మము తెగి జల జల నెత్తురు కారిందే కాని ఎముక ఏదీ చెక్కు చెదరలేదు. ఆట్లా సుగ్రీవుడి వక్షఃస్థలముమీద కారుతూ

ఉన్న నెత్తురు వజ్రాయుధము ఒరపిడికి మేరుపర్వతముమీద రేగిన జ్వాలవలె కనిపించింది.

కుంభుడు కొట్టిన దెబ్బకు ఆ మహాబలవంతుడు వానరపుంగవుడు కుపితుడు అయిపోయి వజ్రముతో సమానము అయిన తన పిడికిలి బిగించినాడు. సూర్యమండలమువలె సహస్రకిరణాలతో తేజరిల్లుతూఉన్న తన పిడికిటితో సుగ్రీవుడు అప్పుడు కుంభుని వక్షఃస్థలముమీద పొడిచినాడు. ఆ పిడికిటిపోటుకు అవయవాలు స్వాధీనము తప్పిపోయి కుంభుడు ఆరిపోయిన అగ్నిహోత్రమువలె అయిపోయినాడు. కాంతిమంతము అయిన అంగారకగ్రహము యాదృచ్ఛికముగా ఆకాశమునుంచి నేల రాలిపోయేట్టు నేల కూలినాడు. అట్లా చచ్చి పడిపోయిన ఆ కుంభుని ఆకారము అప్పుడు రుద్రదేవుడు పడతోసిన సూర్యుడివలె కనిపించింది.

ఆ పోరాటములో సుగ్రీవుడు కుంభుణ్ణి చంపివేయగానే పర్వతాలతోనూ మహారణ్యాలతోనూ భూమిఅంతా గడ గడ వణికింది. రాక్షసులు అందరూ భయపడిపోయినారు.

౨౨

సుగ్రీవుని చేతిలో చచ్చిపోయిన తన అన్నను కుంభుణ్ణి నికుంభుడు చూచినాడు. చూపులతో దహించివేసేవాడివలె సుగ్రీవుణ్ణి చూస్తూ భయంకరముఅయిన యమదండమువంటి పరిఘాయుధాన్ని అందుకొన్నాడు. అది రాక్షసులకు మంగళకరము అయిన ఆయుధము. హిమవత్పర్వతశిఖరమువంటి ఆ పరిఘాయుధము అదివరకు రాక్షసులకు అనేకమార్లు జయము సంపాదించిపెట్టింది. తాపటము చేసిన వజ్రాలతోనూ పగడాలతోనూ బంగారు కట్లతోనూ అయిదువేళ్ళ ముద్రలతోనూ అలంకారముగా కట్టిన పూదండలతోనూ ఇంద్రధ్వజమువంటి ఆ పరిఘాయుధాన్ని ఆ భయంకరపరాక్రముడు పట్టుకొని గిరగిర తిప్పుతూ వికృతముగా నోరు తెరిచి సింహనాదము చేసినాడు.

వక్షఃస్థలముమీద ధగధగలాడుతూఉన్న పతకముతోనూ తళతళలాడుతూఉన్న బంగారు బాహుపురులతోనూ చిత్రవిచిత్ర

కాంతులతో తేజరిల్లుతూఉన్న కుండలాలతోనూ మెడలో వేసుకున్న రంగురంగుల పూలదండలతోనూ చేతిలో పట్టుకొన్న పరిఘాయుధము తోనూ నికుంభుడు అప్పుడు ఆకాశములో ఇంద్రధనుస్సుతోనూ మెరుపులు మెరుస్తూనూ ఉరుములు ఉరుముతూనూ ఉన్న మహా మేఘమువలె కనిపించినాడు.

ఆ మహాకాయుడు నికుంభుడు అప్పుడు గిరగిర తిప్పుతూఉన్న పరిఘాయుధము కొన తగిలి సప్తవాయువుల సంధిప్రదేశము బ్రద్దలు అయిపోయింది. ఆ ప్రదేశములో మహాధ్వనితో పొగలులేని అగ్ని హోత్రము ప్రజ్వరిల్లింది. అప్పుడు విటపావతి అనే కుబేరుని అలకా పట్టణమూ గంధర్వభవనాలూ అమరావతీపట్టణమూ అశ్విన్యాది నక్షత్రాలూ సాధారణ నక్షత్రాలూ బుధాది గ్రహాలూ చంద్రుడూ ఆకాశమూ సమస్తలోకాలూ గిరగిర తిరుగుతున్నట్లు కనిపించినవి. ఆ పరిఘాయుధకాంతులనుంచీ ఆభరణాలకాంతులనుంచీ ప్రళయ కాలాగ్నిహోత్రమువలె తేజరిల్లుతూఉన్న నికుంభుణ్ణి వానరవీరులు తేరిపారచూడలేకపోయినారు. ఆ నికుంభుణ్ణి చూచి అటు రాక్షసులూ ఇటు వానరులూ భయపడిపోయినారు. ఎవరూ కదలకుండా మెదల కుండా ఉన్న ఆ సమయములో మహాబలవంతుడు హనుమంతుడు తన రొమ్ము విరిచి ఆ నికుంభుడి ఎట్టఎదుటికిపోయి నిలుచున్నాడు.

అప్పుడు నికుంభుడు ఇనుపగుదియలవంటి తన చేతులలో సూర్యప్రభలతో తేజరిల్లుతూఉన్న ఇనుపగుదియలతో ఆ హనుమం తుడి వక్షఃస్థలముమీద కొట్టినాడు. ఆ విశాలస్థిరవక్షఃస్థలానికి తగిలిన ఆ పరిఘాయుధము అప్పుడు ముక్కలుముక్కలుగా పగిలిపోయింది. ఆ ముక్కలు అంతటా రేగి ఆకాశములో కొరవులవలె కనిపించినవి. ఆ పరిఘాయుధము దెబ్బకు హనుమంతుడు భూకంపసమయములో పర్వతమువలె ఒక్క క్షణము వణికిపోయినాడు.

అంతట ఆ మహాబలవంతుడు హనుమంతుడు తన బలముకొద్దీ పిడికిలి బిగించి వాయువేగముతో వాయుపరాక్రమముతో నికుంభుడి వక్షఃస్థలముమీద గుద్దినాడు. నికుంభుడి వక్షఃస్థలముమీది చర్మము చిరిగిపోయింది. నెత్తురు కారుతూఉన్న ఆ వక్షఃస్థలము మంటలు మండుతూ ఉన్నట్లు కనిపించింది. నికుంభుడు వణికిపోయినాడు.

ఎట్లాగో నిబ్బరించుకొని ఆ మహాబలవంతుణ్ణి హనుమంతుణ్ణి తన రెండుచేతులా పట్టుకొని పయికి ఎత్తినాడు. అదిచూచి ఆ మహాబలవంతుడు హనుమంతుడు నికుంభుడికి చిక్కినాడు అనుకొని రాక్షసులు అందరూ సంతోషాతిశయముతో సింహనాదాలు చేసినారు. అట్లా తనను పైకిఎత్తి మోసుకొనిపోతూఉన్న నికుంభుణ్ణి హనుమంతుడు అప్పుడు వజ్రాయుధమువంటి తన పిడికిలితో ఒక్కపోటు పొడిచి ఆ రాక్షసుడి పట్టు వదిలించుకొన్నాడు. మారుతాత్మజుడు అంతట నేలమీద నిలుచుని చటుక్కున నికుంభుణ్ణి మళ్ళీ కొట్టినాడు. ఆ వీర్యవంతుడు హనుమంతుడు అంతట మంచి పూనికతో ఆ నికుంభుణ్ణి నేలమీదికి పడకొట్టి నలిపి చటుక్కున పయికి ఎగిరినాడు. ఆ నికుంభుని వక్షఃస్థలముమీదికి దూకినాడు. అంతట తన రెండుచేతులా ఆ రాక్షసుడి గొంతు పట్టుకొన్నాడు. ఆ నికుంభుడు అందుకు భయంకరముగా అరుస్తూఉంటే మెడ విరగతీసివేసినాడు.

నికుంభుడి ప్రాణము పోగానే వానరయోధులు అందరూ సంతోషాతిశయముతో దిక్కులు మారుమోగిపోయేట్టు సింహనాదాలు చేసినారు.

౭౮

కుంభుడూ నికుంభుడూ చచ్చిపోయిన వృత్తాంతము రావణాసురుడు విన్నాడు. కోపముతో అగ్నిహోత్రమువలె మండిపోయినాడు. అంతట దుఃఖమూ కోపమూ మనస్సులో పెనవేసుకొని పోయినవి. ఖరుడి పుత్రుణ్ణి మకరాక్షుణ్ణి చూచినాడు. ఆ వెడల్పాటి కన్నుల వాణ్ణి యుద్ధము చేయడానికి ప్రోత్సహిస్తూ "నాయనా, నేను నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను. సైన్యాన్ని తీసుకొని పో. ఆ రామలక్ష్మణులనూ వానరులనూ వధించు" అని రావణాసురుడు చెప్పినాడు. తాను శూరుడను అనుకొంటూఉండే ఆ అహంకారి మకరాక్షుడు తత్క్షణమే "మంచిది, మంచిది" అని చెప్పి దశగ్రీవుడికి నమస్కారమూ ప్రదక్షిణమూ చేసి తెల్లటి ఆ రాజభవనములోనుంచి బయటికి వచ్చినాడు.

ఆ మకరాక్షుడు అంతట సేనాధ్యక్షుణ్ణి చూచి "ఓ సేనాపతీ వెంటనే నాకు రథాన్ని తెప్పించు. త్వరగా సైన్యాన్ని పిలిపించు"

అని ఆజ్ఞాపించినాడు. ఆ సేనాపతి అప్పటికి అప్పుడు సైన్యాన్నీ రథాన్నీ అక్కడికి రావించినాడు. ఆ రథానికి మకరాక్షుడు అప్పుడు ప్రదక్షిణము చేసినాడు. రాక్షసయోధులను అందరినీ చూచి "ఓ యోధులారా, మీరు అందరూ చక్కగా పోరాడవలెను. మన ఏలిక రాక్షసరాజు రావణాసురుడు రామలక్ష్మణులను చంపివేయవలసింది అని ఆజ్ఞాపించినాడు.

"ఓ నిశాచరులారా, నేను ఆ రామలక్ష్మణులనూ ఆ సుగ్రీవుణ్ణీ తక్కిన వానరవీరులనూ నా ఉత్తమోత్తమ బాణాలతో సంహారము చేసివేస్తాను. ఎండుకట్టెలను అగ్నిహోత్రములో దహించివేసేట్టు ఆ వానర మహాసైన్యాన్ని శూలాలతో పొడిచి మీరు నాశనము చేసివేయవలెను" అని చెప్పి మకరాక్షుడు రథము ఎక్కినాడు. వెంటనే ఆ రథాన్ని యుద్ధభూమికి తోలవలసింది అని ఆజ్ఞాపించినాడు.

ఆ బలవంతుడు మకరాక్షుడు చెప్పిన మాటలు విని రాక్షసయోధులు అందరూ నానావిధాయుధాలతోనూ ఆ రథమువెంట బయలుదేరినారు. ఆ మహాకాయులు రాక్షసయోధులు తేనెరంగు కన్నులతో పెద్ద పెద్ద కోరలతో తలలు విరబోసుకొని మదపుటేనుగుల ఘీంకారాలవలె సింహనాదాలు చేస్తూ అన్నివైపులా భేరీలు మ్రోగిస్తూ శంఖాలు పూరిస్తూ దిక్కులు మారుమ్రోగిపోయేట్టు భుజాలు చరుచుకొంటూ యుద్ధభూమికి నడువసాగినారు.

అప్పుడు ఆ మకరాక్షుడి రథసారథి చేతిలోనుంచి ములికోల జారిపడిపోయింది. ఆ రథధ్వజము హఠాత్తుగా నేలకూలింది. ఆ రథానికి కట్టిన గుఱ్ఱాలు నడుస్తూ నడుస్తూ అకారణముగా కాళ్ళు తడపడి కన్నీళ్ళు కార్చినవి. గాలిదుమారము పరమదారుణముగా లేచింది. రాక్షసవీరులు శకునాలనుగురించి ఆలోచించను అయినా లేదు. రామలక్ష్మణులు ఉన్నచోటికి మకరాక్షుడివెంట ఆ రాక్షససైన్యము నడువసాగింది.

అదివరకు అనేకమార్లు యుద్ధాలలో గదలదెబ్బలూ కత్తిదెబ్బలూ తిన్న ఆ రాక్షసయోధులు మహామేఘాలవలెనూ ఏనుగులవలెనూ ఎనుపోతులవలెనూ పోరాటానికి సాగిపోతూ "నేను

ముందు" అంటే "నేను ముందు" అని తమ తమ యుద్ధ చాతుర్యాన్ని గురించి చెప్పుకుంటూ సింహనాదాలు చేస్తూ యుద్ధ భూమికి పోయినారు.

౬౯

అట్లా రాక్షససైన్యాలతో వస్తూఉన్న ఆ మకరాక్షుణ్ణి వానరయూథపతులు అందరూ చూచినారు. యుద్ధోత్సాహముతో ఎగిరి గంతులు వేసినారు. యుద్ధ సన్నద్ధులు అయి నిలుచున్నారు.

అప్పుడు దేవదానవ యుద్ధమువలె ఒళ్ళు గగుర్పొడిచేట్లు వానరులకూ రాక్షసులకూ యుద్ధము ఆరంభము అయింది. వానర యోధులు శిలలతోనూ వృక్షములతోనూ రాక్షసయోధులు కొందరు శూలాయుధాలతోనూ పరిఘాయుధాలతోనూ కొందరు శక్త్యాయుధాలతోనూ కుంతాయుధాలతోనూ గదలతోనూ తోమరాయుధాలతోనూ పట్టిసాలతోనూ భిండివాలాలతోనూ వజ్రాయుధాలతోనూ కొందరు రాక్షసులు పాశాయుధాలతోను ముద్గరాలతోనూ దండాయుధాలతోను నిఘాతాయుధాలతోనూ పోరాటము సాగించినారు. వానరయోధులూ రాక్షసయోధులూ అప్పుడు ఆ యా ఆయుధాలతో పోరాడుతూ ఒకండ్లను ఒకండ్లు చంపివేసుకొంటూ ఉంటే మకరాక్షుడు వానరసైన్యాలమీద బాణవర్షము కురిపించ సాగినాడు. ఆ రెండువిధాల దెబ్బలకు వానరయోధులు అందరూ భయభ్రాంతులు అయి పరుగులెత్త సాగినారు. అట్లా పరుగులెత్తి పారిపోతూ ఉన్న వానరయోధులను చూచి రాక్షసయోధులు అందరూ తాము జయించినట్లు భావించి సంతోషాతిశయముతో సింహాలవలె గర్జించసాగినారు.

అప్పుడు అట్లా పరుగులెత్తి పారిపోతూన్న వానర యోధులను అందరినీ చూచి రాముడు రాక్షసయోధులు ముందుకు సాగిరాకుండ బాణవర్షము కురిపించి అడ్డగించినాడు. అది చూచి మకరాక్షుడు కోపముతో మండిపడుతూ "ఓ రామా, నిలు నిలు. నా ఎదుట నిలు. నా తీక్ష్ణబాణాలతో నీ ప్రాణాలు తీసి వేస్తాను. నీవూ నేనూ ద్వంద్వయుద్ధము చేద్దాము. నీవు అప్పుడు దండకారణ్యములో నా తండ్రిని చంపివేసిన కారణమునుంచి

నిన్ను ఎట్టయెదుట చూస్తూన్నకొద్దీ నా కోపము హెచ్చు పెరిగి పోతూంది. ఆ మహారణ్యములో నీవు అప్పుడు నాకు అగపడ లేదు. అందువల్ల ఇప్పుడు నిన్ను చూస్తూంటే నా ఒళ్ళు అంతా మండిపోతూ ఉంది.

"ఓ రామా, నీవు ఇప్పుడు దైవవశమువల్ల నా ఎదుట పడ్డావు. ఆకలితో బాధపడే సింహము మృగముకోసము కనిపెట్టుకొని ఉండేట్టు నేను యింతకాలమూ నీకోసము కనిపెట్టు కొని ఉన్నాను. నా తీవ్రబాణాలు నిన్ను ఇప్పుడే ప్రేతరాజు దేశానికి తీసుకొని పోతవి. నీవు పోయి నీవు చంపివేసిన వీరులను కలుసుకొంటావు. రామా, ఎన్నో మాటలు ఎందుకు, అస్త్ర యుద్ధముకానీ గదాయుద్ధముకానీ బాహుయుద్ధముకానీ నీవు ఏది అభ్యసించినావో ఆ విధముగా యుద్ధము చేదాము. యుద్ధరంగములో నిన్నూ నన్నూ సకలలోకాలవారూ చూడ వలెను. నా మాట విను. పోరాటానికి రా" అన్నాడు.

ఈ విధముగా మకరాక్షుడు అన్న మాటలకు రాముడు నవ్వుతూ "ఓరాక్షసుడా, ఎందుకు వృధాగా మాట్లాడుతావు. చేతకాని మాటలు ఎందుకు పేలడము. పోరాడి జయించవలెను. కాని మాటలతో జయించడము ఉత్తది. ఓపాపీ, ఇప్పుడే నీ మాంసాన్ని కాకులూ, గద్దలూ తీక్ష్ణము అయిన ముక్కులతోనూ గోళ్ళతోనూ గీరుకొని తింటవి. నక్కలు కరుకు కోరలతో నీ మాంసాన్ని తనివితీర తింటవి" అని చెప్పినాడు.

ఇట్లా చెప్పే చెప్పడముతో రాముడిమీద మకరాక్షుడు వరుసగా బాణాలు వదలడము మొదలుపెట్టినాడు. ఆ బాణాలను అన్నిటినీ రాముడు బాణవర్షము కురిపించి నరికి వేసినాడు. అప్పుడు ఆ రణరంగములో మకరాక్షుడూ రాముడూ తమ తమ పరా క్రమాన్ని ప్రదర్శిస్తూ పరమ భయంకరముగా పోరాటము సాగించి నారు. మకరాక్షుడు వదలిన వేలకు వేలు బంగారు పింజల బాణాలు ముక్కలు ముక్కలు అయి నేల అంతటా పడి పోయినవి. వారి ధనుష్టంకారధ్వనులు అప్పుడు ఆకాశములో ఉరుములు ఉరిమినట్లుగా వినిపించినవి.

ఆ అద్భుత పోరాటాన్ని చూడటానికి దేవ దానవ గంధర్వ మహోరగులు అందరూ అప్పుడు అక్కడికి బయలుదేరి వచ్చి ఆకాశములో నిలుచున్నారు. ఆ పోరాటములో ఒకరికి ఒక గాయము అయితే ఉత్తరక్షణాన రెండవవారికి రెండు గాయాలు అయినవి. రాముడు వదలిన బాణాలను మకరాక్షుడూ మకరాక్షుడు వదలిన బాణాలను రాముడూ తమ తమ బాణాలతో నరికివేసినారు. అట్లా ముక్కలు ముక్కలు అయి పడ్డ బాణాలవల్ల అప్పుడు ఆ యుద్ధభూమిలో దిక్కులూ విదిక్కులూ కనిపించకుండా పోయినవి.

అంతట ఆ మహాబాహువు రాముడు మహోగ్రుడు అయిపోయి రాక్షసుడు పట్టుకొనిఉన్న వింటిని తన బాణముతో విరగకొట్టినాడు. వెంటనే మరిఎనిమిది బాణాలను వదలి ఆ మకరాక్షుడి రథసారథిని పడకొట్టినాడు. ఇంకా కొన్ని బాణాలు వదలి ఆ రథానికి పూంచిన గుర్రాలనూ ఆ రథాన్నీ పడకొట్టినాడు. విరథుడు అయిపోయిన మకరాక్షుడు నేలమీదికి వచ్చినాడు. సర్వప్రాణి కోటి భయపడిపోయే యుగాంతాగ్నిప్రభలతో తేజరిల్లుతూఉన్న శూలాన్ని తీసుకొని గిరగిరతిప్పి రాముడిమీద విసరివేసినాడు.

అగ్నిజ్వాలలతో అట్లా అంతరిక్షములో వస్తూఉన్న ఆ శూలాయుధాన్ని గురిచేసి రాముడు బాణాలు వదలినాడు. ఆ బాణాలు తగిలి ఆ శూలాయుధము ఆకాశములోనే ముక్కలు ముక్కలు అయిపోయింది. ఆ ముక్కలు కొరువులవలె నేలమీద పడ్డవి. అప్పుడు ఆకాశములో నిలుచుని అదిఅంతా చూస్తూ ఉన్నవారు అందరూ "భళే భళే" అని కేకలు వేసినారు.

అప్పుడు మకరాక్షుడు పిడికిలి బిగించి చెయ్యి ఎత్తి రాముణ్ణి చూచి "నిలు నిలు" మని కేకలు పెట్టినాడు. అట్లా అరుస్తూ వస్తూఉన్న ఆ మకరాక్షుణ్ణి చూచి రాముడు నవ్వుతూ తన శరాసనములో ఆగ్నేయాస్త్రాన్ని సంధించి అతడిమీద వదలినాడు. ఆ ఆగ్నేయాస్త్రానికి ఆ మకరాక్షుడి గుండెలు పగిలి నేలమీదపడి ప్రాణాలు వదలిపెట్టినాడు.

రాక్షసయోధులు మకరాక్షుడు పడిపోవడము చూచినారు. అప్పుడు తమమీద వచ్చిపడుతూఉన్న బాణాలకు ఓర్చుకోలేక పోయినారు. లంకాపట్టణములోకి పరుగెత్తినారు.

వజ్రాయుధము దెబ్బకు పర్వతము పగిలి పడిపోయేట్టు రామ బాణానికి మకరాక్షుడు పడిపోవటముచూచి దేవతలు అందరూ సంతోషించినారు.

౮౦

రాముడు మకరాక్షుణ్ణి చంపివేసినాడు అని జయశీలి రావణాసురుడు విన్నాడు. అతడికి మహత్తరము అయిన కోపము వచ్చింది. పళ్లు పట పట కొరికినాడు. ఇకను అప్పుడు ఏమి చేయవలసిందీ ఆలోచించినాడు. తన కుమారుణ్ణి ఇంద్రజిత్తును చూచి " నాయనా, నీవు పరమపరాక్రమవంతుడవు. నీవు అన్నివిధాలా అమిత బల వంతుడవు. నీవు పోయి యుద్ధరంగములో అందరికీ కనపడుతూనో కనపడకుండానో పోరాటము సాగించి ఆ రామలక్ష్మణులను చంపి వేయవలెను. దేవేంద్రుడు అంతటివాణ్ణి నీవు పోరాటములో జయించినావు. నీ పరాక్రమము అప్రతిమానము. నీవు యుద్ధ రంగములోకి పోతేచాలును. ఆ మానవులు నిన్ను చూస్తూనే చచ్చిపోతారు. నీవు జయిస్తావు " అని రావణాసురుడు చెప్పినాడు.

ఈ విధముగా రావణుడు చెప్పిన మాటలను విని ఇంద్రజిత్తు యజ్ఞవాటికకు పోయినాడు. యథావిధిగా అభిచారహోమము చేసినాడు. అగ్నిహోత్రాన్ని వేల్చి దేవ దానవ రాక్షసులను అందరినీ సంతృప్తి పరచినాడు. అప్పుడు అక్కడికి కంటికి కనపడ కుండా అంతర్ధానము అయిపోయే రథము వచ్చింది. నాల్గు గుర్రాలు కట్టిన ఆ రథమునిండా తీక్ష్ణబాణాలూ ఎక్కుపెట్టిన పెద్ద ధనుస్సూ ఉన్నవి. బంగారు మలామా చేసిన ఆ రథము వెలుపలి భాగాన జింకలూ చంద్రబింబమూ చంద్రవంకా మొదలుఅయిన చిత్తరువులు అలంకారముగా చిత్రించి ఉన్నవి. బంగారుకట్లు వేసిన ఆ రథధ్వజము తాపటముచేసిన వైడూర్యమణులవల్ల మంటలు మండుతూ ఉన్న అగ్నిహోత్రము మాదిరిగా ఉంది. సూర్య కాంతులతో తేజరిల్లే ఆ రథము ఉండడమువల్లనూ బ్రహ్మాస్త్రము

ఉండడమువల్లనూ ఆ మహాబలవంతుడు ఇంద్రజిత్తు ఎవరికీ ఎదిరించనలవికానివాడు అయిపోయినాడు.

ఆ యుద్ధశీలి ఇంద్రజిత్తు నిర్ఋతిదేవతాకము అయిన మంత్రాలతో హోమము పూర్తిచేయగానే ఎవరి కంటికీ కనపడకుండా అంతర్ధానమయిపోయే ఆ రథము ఎక్కి లంకాపట్టణములో నుంచి వెలుపలికి పోయినాడు. రాక్షసయోధులను అందరినీ చూచి "ఓ యోధులారా, కపటపరివ్రాజక వేషాలతో అడవిలో తిరిగిన ఆ రామలక్ష్మణులను నేను ఇప్పుడే వధించివేస్తాను. ఆ తరువాత ఈ భూమిమీద వానరులు అనేవాండ్లు లేకుండా చేసివేస్తాను. నాకు జయము తప్పదు. నేను జయించి నా తండ్రిని రాక్షసరాజును రావణాసురుణ్ణి సంతోషపెట్టుతాను" అని చెప్పినాడు.

అంతట ఆ భయంకరుడు ఇంద్రజిత్తు ఆ రథముమీద తీక్ష్ణబాణాలతోనూ ఎక్కుపెట్టిన పెద్దధనుస్సుతోనూ యుద్ధరంగానికి పోయి వానరసేనామధ్యములో ధనుర్ధరులు అయి మూడుతలల పాములవలె కనపడుతూ బాణాలు వదులుతూ ఉన్న రామలక్ష్మణులను చూచినాడు. అంతట తన ధనుస్సును సజ్యముచేసి వానలు కురిపించే పర్జన్యుడివలె ఎడతెగకుండా బాణవర్షము కురిపిస్తూ తన రథముతోకూడ ఆ ఇంద్రజిత్తు అంతర్ధానముఅయి ఆకాశానికి పోయినాడు. అక్కడ ఏప్రదేశములో ఉన్నదీ ఎవరికీ కనిపించకుండా రామలక్ష్మణులమీద నిశితబాణాలు వదలినాడు.

ఇంద్రజిత్తు వదలిన ఆ బాణాలు అమితవేగముతో వచ్చి మీదపడుతూఉంటే రామలక్ష్మణులు తమ ధనుస్సులలో దివ్యములయిన బాణాలను ఎక్కుపెట్టి పయికి వదలినారు. సూర్యసమానము అయిన ఆబాణాలూ ఆ అస్త్రాలూ ఆకాశాన్ని కప్పివేసినవే కాని ఇంద్రజిత్తుకు తగలలేదు. అప్పుడు ఆకాంతిమంతుడు ఇంద్రజిత్తు పొగలతో చీకట్లు కమ్ముకొని ఆకాశము కనపడకుండానూ పొగమంచు కమ్ముకుని దిక్కులు కనపడకుండానూ చేసినాడు. అంతేకాదు, తన ధనుష్టంకారధ్వనికానీ రథచక్రాల ధ్వనికానీ గుర్రాల గిట్టల చప్పుళ్లుకానీ వినపడకుండానూ తన ఆకారము కనపడకుండానూ ఆకాశములో తిరుగుతూ మబ్బులు కమ్ముకొన్నందు

వల్ల చిమ్మచీకట్లు అయిపోయి వాన కురిసేటట్టు అద్భుతముగా బాణ వర్షము కురిపించినాడు. వరప్రసాదమువల్ల సూర్యసమానము అయిన తీక్ష్ణబాణాలు వదలి రామలక్ష్మణుల అవయవాలను అన్నిటినీ నొప్పించినాడు. ధారాపాతముగా కురుస్తూఉన్న వర్షానికి పర్వతాలవలె అచలముగా నిలుచున్న ఆ రామలక్ష్మణులు బంగారు పింజలు వేసిన నిశితబాణాలను పయికి వదలినారు. కంకపక్షి రెక్కలతోఉన్న ఆ బాణాలు పక్షులవలె రివ్వున ఆకాశములోకి పోయి ఇంద్రజిత్తు దేహానికి గుచ్చుకొని నెత్తురుతో తడిసి నేలమీద పడిపోయినవి.

ఆ పురుషోత్తములు రామలక్ష్మణులు తమమీద వచ్చి పడుతూ ఉన్న బాణసమూహాలనుంచి బాధపడుతూ ఉన్నప్పటికిన్నీ ఆబాణాలను ఎన్నిటినో భల్లాయుధాలతో నరికివేసినారు. ఆ బాణాలు ఎక్కడనుంచి వచ్చిపడుతూ ఉన్నదీ కనిపెట్టి అక్కడికి ఉత్తమోత్తమము అయిన అస్త్రాలను రామలక్ష్మణులు వదలినారు. అప్పుడు ఆ అతిరథుడు ఇంద్రజిత్తు రామలక్ష్మణులు వదులుతూ ఉన్న బాణాలను తప్పించుకుంటూ తన రథముమీద ఆకాశములో అన్ని వైపులా తిరుగుతూ అమిత వేగముతో పోయే నిశిత బాణాలను ఆ అన్నతమ్ములమీద వదలినాడు. ఆకాశాన మేఘాలు కమ్ముకొన్నప్పుడు సూర్యసంచారము తెలియనట్టు ఆ ఇంద్రజిత్తు అప్పుడు ఎక్కడ తిరుగుతూఉన్నదికానీ అతడి ఆకారముకానీ అతడి ధనుర్బాణాలుకానీ మరి ఏదికానీ పయిన ఆకాశములో కనిపించ లేదు.

ఆ ఇంద్రజిత్తు వదలిన బాణాలకు అప్పుడు వానరులు వందల కొద్ది ప్రాణాలు కోలుపోయి నేలకూలినారు. లక్ష్మణుడు క్రుద్ధుడు అయిపోయి రాక్షసులను అందరినీ సంహారము చేసివేయడానికి బ్రహ్మాస్త్రాన్ని వదల తలచుకొన్నట్టు రాముడితో చెప్పినాడు. ఆ శుభలక్షణుణ్ణి లక్ష్మణుణ్ణి చూచి రాముడు “తమ్ముడా, ఒక్కడి కోసము ఈ పృథ్వీమీద ఉన్న రాక్షసులను అందరినీ సంహారము చేసివేయడము అన్యాయము. ఏమంటే యుద్ధము చేయకుండా ఉన్నవారినీ యుద్ధము చేయడానికి భయపడి దాగొన్నవారినీ

చేతులెత్తి నమస్కారము చేస్తున్నవారినీ శరణాగతులమా పరుగెత్తి
పారిపోతున్నవారినీ మద్యపానపు మత్తులో ఉన్నవారినీ చంపి
వేయకూడదు.

"తమ్ముడా, నీవు మహాబలవంతుడవు. ఇంద్రజిత్తు ఒక్కణ్ణి
చంపివేసే ప్రయత్నము చేదాము. మహావేగములో పోయే
క్రూరవిషసర్పాలవంటి అస్త్రాలు వదులుదాము. కంటికే కన
పడేట్లయితే ఈ మాయలమారివాణ్ణి ఈ నీచుణ్ణి రథముతోకూడా
కనపడకుండా తిరుగుతూఉన్న ఈ ఇంద్రజిత్తును పట్టుకొని వానర
సేనానాయకులే తమ బలముతో చంపివేస్తారు. నేను ఇప్పుడు
వీడిమీద ఒక దివ్యాస్త్రాన్ని వదలవలెను అనుకొంటున్నాను. వీడు
భూవివరములోకి పోయినా స్వర్గాది ఊర్ధ్వలోకాలకు పోయినా
ఆకాశములోకిపోయినా ఇంకా ఎక్కడికి పోయి దాక్కున్నా నా
దివ్యాస్త్రము వీణ్ణి వదలిపెట్టదు. దగ్ధము చేసివేస్తుంది. ప్రాణాలు
కోలుపోయి వీడు నేల కూలుతాడు" అని చెప్పినాడు.

ఈ విధముగా చెప్పి వానరవీరుల మధ్యను ఉన్న ఆ బుద్ధి
మంతుడు ఆ మహాధైర్యవంతుడు రఘువీరుడు రాముడు అంతట
ఆ క్రూరకర్ముణ్ణి ఆ భయంకరుణ్ణి ఇంద్రజిత్తును సంహారము చేసి
వేయ సంకల్పించుకొని ధనుష్టంకారము చేసినాడు.

౮౧

ఆ మహాత్ముడు రాముడు అప్పుడు ఏమి చేయపోతున్నదీ
ఇంద్రజిత్తు కనిపెట్టినాడు. వెంటనే ఆ యుద్ధభూమిలోనుంచి
లంకాపట్టణానికి వెళ్ళిపోయినాడు. మహాబలవంతులగు కుంభ
కర్ణాది రాక్షసవీరులను రాముడు సంహారము చేసివేయడము
పదే పదే తలపుకువచ్చి క్రోధతామ్రాక్షుడు అయినాడు. ఆలోచించి
నాడు. మళ్ళీ లంకాపట్టణములోనుంచి బయలుదేరినాడు. ఆ
శూరుడు ఆ మహాద్యుతిమంతుడు ఆ మహాపరాక్రమవంతుడు పౌలస్త్య
మహర్షివంశములో పుట్టిన ఆ దేవకంటకుడు ఇంద్రజిత్తు అప్పుడు
రాక్షససేనలను వెంటపెట్టుకొని యుద్ధసన్నద్ధులు అయివున్న రామ
లక్ష్మణులకు దూరముగా ఉన్న లంకాపట్టణ పశ్చిమద్వారములో

నుంచి బయటికి పోయినాడు. వానరులూ రామలక్ష్మణులూ దుఃఖపరవశులు అయిపోయి ఏ యుద్ధప్రయత్నమూ చేయకుండా ఉండడానికి అంతట ఒక మాయాసీతను చేసి తన రథముమీద కూర్చుండపెట్టుకొన్నాడు. అట్లా తన రథముమీద కూర్చుండ పెట్టుకొన్న ఆ మాయాసీతను రాక్షస మహాసైన్యముమధ్యను చంపి వేసి వానరులను అందరినీ మోసముచేయడానికి ఆ రథాన్ని వానరసైన్యాభిముఖముగా తోలించినాడు.

అట్లా లంకాపట్టణమునుంచి మళ్ళీ తమకు ఎదురుగుండా వస్తూఉన్న ఇంద్రజిత్తును వానరవీరులు అందరూ చూచినారు. పరమక్రుద్ధులు అయిపోయి రాళ్ళూ చెట్లూ చేతులలో పట్టుకొని ఆ ఇంద్రజిత్తును ఎదిరించడానికి సంసిద్ధము అయినారు. అప్పుడు ఒక మహాపర్వతశిఖరాన్ని చేతిలో పట్టుకొని హనుమంతుడు ఆ వానరసైన్యము ముందు ఇంద్రజిత్తు రథాన్ని చూచినాడు. పెన వేసుకొనిపోయిన తలవెంట్రుకలు అన్నీ ఒకే ఒక జడ అయిపోయి ఉపవాసాదులలో దేహముఅంతా కృశించిపోయి విడువకుండా కట్టుకొని ఉన్నందువల్ల చీర మాసిపోయి దేహసంస్కారాదులు లేనందువల్ల దేహము అంతా దుమ్ముకొట్టుకొనిపోయి దీనురాలు అయిపోయిన కృశాంగిని రాముడిప్రియురాలిన సీతాదేవిని ఆ ఇంద్రజిత్తు రథముమీద చూచినాడు. ఒక ముహూర్తముసేపు ఆమెవంక హనుమంతుడు చూచినాడు. అచిరకాలముక్రిందటనే ఆ జనకాత్మజను సీతాదేవిని అతడు చూచినాడు. ఆమె సీతా దేవేను అనుకొన్నాడు.

ఆ మైథిలిని దుమ్ముకొట్టుకొని ఉన్న ఆ దీనురాలిని ఆ సీతా దేవిని ఇంద్రజిత్తురథముమీద చూచేచూడడముతో హను మంతుడికి పట్టరాని దుఃఖము వచ్చింది. ముఖము అంతా కన్నీళ్లు కమ్ముకొనిపోయినవి. ఆ శోకార్తను ఆ నిరానందను ఆ దీనురాలిని సీతాదేవిని ఎందుకు ఇంద్రజిత్తు ఆ రథముమీద తెచ్చినాడా అని ఆలోచించినాడు. వెంటఉన్న వానరవీరులను అందరినీ అడిగినాడు. అంతట ఆ వానరసైన్యాన్ని వెంటపెట్టుకొని ఆ రథానికి ఎదురు గుండా పరుగెత్తినాడు.

అప్పుడు అట్లా తనమీదికి వస్తూఉన్న హనుమంతుణ్ణీ వానరమహాసైన్యాన్నీ చూచి ఇంద్రజిత్తు ఒరలోనుంచి కత్తిదూసి రెండోచేతితో ఆ సీతాదేవి జుట్టుపట్టుకొన్నాడు. రథముమీద ఉన్న ఆ సీతాదేవి "రామా రామా" అని అరుస్తూవుంటే హనుమంతుడు మొదలుఅయినవారు అందరూ చూస్తూఉండగా కొట్టినాడు. అట్లా ఆ సీతాదేవి శిరోజాలను ఇంద్రజిత్తు పట్టుకొంటే ఆ మారుతాత్మజుడికి హనుమంతుడికి ఏడుపు వచ్చింది. ఆ స్థితిలో ఏమిచేయడానికీ అతడికి తోచలేదు.

ఆ సర్వాంగసుందరిని రాముడి ప్రియభార్యను పట్టమహిషిని సీతాదేవిని చూచి ఆమె దురవస్థకు కోపమువచ్చి హనుమంతుడు అతిపరుషముగా ఇంద్రజిత్తుతో "ఓ దురాత్ముడా, నీది బ్రహర్షుల వంశము. అయితే నీవు రాక్షసస్త్రీకి పుట్టినావు. అందువల్ల నీకు ఇటువంటి దుర్బుద్ధి పుట్టింది. ఛీ ఛీ నీవు ఏమి చేస్తున్నదీ నీకు తెలియడములేదు. సీతాదేవి తలవెంద్రుకలు పట్టుకొన్నావు. ఓరి దురాచారుడా, ఓరి క్రూరుడా, నీవు పాపిష్టిపనికి పరమ పరాక్రమవంతుడవు. ఓరి దుష్టుడా, దుర్మార్గుడా, నీవు దుర్జనులు చేసే పని చేస్తున్నావు. నీవు నిర్దయుడవు. నీకు సిగ్గులేదు. రాజ్యము పోయింది, ఇల్లూ వాకిలీ వదలిపెట్టింది, రాముడి చేతిలోనుంచిజారి పోయింది. ఈ సీతాదేవి నీకు ఏమి అపరాధము చేసింది! ఈమెను ఎందుకు చంపివేయ తలచుకొన్నావు? నీవు ఈ సీతాదేవిని చంపివేసేట్లయితే నీవు బ్రతికిఉండడము ఉత్తది. ఎవడు అయినా సరే నిన్ను వెంటనే చంపివేయవలెను. నీవు ఇప్పుడు నా చేతిలో చిక్కినావు. నీవు ఏలోకానికి పోయినా నిన్ను నేను వదలిపెట్టను. నీవు ఇక్కడ చచ్చినతరువాత నీ యాతనాశరీరము స్త్రీహత్య చేసినవారు పోయే లోకానికి పోతుంది" అని చెప్పుతూ హను మంతుడు సాయుధులు అయిన వానరయోధులను వెంటపెట్టుకొని ఆ ఇంద్రజిత్తును ఎదిరించపోయినాడు.

అప్పుడు ఆ మహావీర్యవంతము అయిన వానరసైన్యాన్ని రాక్షససైన్యము భయంకరవేగములో అడ్డగించింది. ఇంద్రజిత్తు ఆ వానరవాహినిమీద వేలకొద్ది బాణాలు వదలి క్షోభపెట్టి ఆ

వానరవీరుణ్ణి హనుమంతుణ్ణి చూచి "ఓరీ, నీవూ సుగ్రీవుడూ ఆ రాముడూ ఇక్కడికి ఎవరి నిమిత్తము వచ్చినారో ఆవైదేహిని సీతాదేవిని ఇప్పుడే నీ ఎట్టఎదుట నీవు చూస్తూవుండగా చంపివేస్తాను. ఓ వానరుడా, సీతను చంపివేసినతరువాత రామలక్ష్మణులనూ నిన్నూ సుగ్రీవుణ్ణి ఆ పరమ దుర్జనుణ్ణి విభీషణుణ్ని చంపివేస్తాను. స్త్రీలను చంపివేయకూడదు అని నీవు చెప్పినావు. శత్రువులను దుఃఖపెట్టటమే నా కర్తవ్యము. అందుకు నేను ఏపనిఅయినా చేసివేస్తాను" అని చెప్పతూ పదును అయిన ఖడ్గములో సీతాదేవిని తెగవేసినాడు. యజ్ఞోపవీతధారణమార్గముగా తెగిపోయిన ఆ దీనురాలు ఆ ప్రియదర్శిని ఆ పృథుశ్రోణి సీతాదేవి నేలమీద పడిపోయినది.

ఇంద్రజిత్తు అట్లా సీతను స్వయముగా చంపివేసి హనుమంతుణ్ణి చూచి "ఓరీ, నేను రాముడి ప్రియభార్యను చంపివేసినాను. చూడు. మీరు పడ్డ శ్రమఅంతా వృథా అయిపోయింది" అని చెప్పి సంతోషములో రథములో కూర్చుని వికృతముగా నోరు తెరచి పెద్దపెట్టున సింహనాదము చేసినాడు. చోరపడడానికి అలవి కాని రాక్షససేనామధ్యములోఉన్న ఇంద్రజిత్తు చేసిన సింహనాదము విని వానరయోధులు విషణ్ణులు అయిపోయినారు. వెంటనే వెనుకకు మళ్లినారు.

౮౩

దేవేంద్రుడు వదిలే పిడుగువంటి మహాభయంకరధ్వనివలె ఇంద్రజిత్తు అప్పుడు సింహనాదము చేసినాడు. ఆ మహాభయంకర ధ్వనికి వానరయోధులు అందరూ భయపడి పారిపోవడానికి దశదిశలూ చూడసాగినారు. విషణ్ణముఖాలతో ఎవరిదారిన వారు పరుగెత్తిపోతున్న ఆ వానరయోధులను అందరినీ హనుమంతుడు చూచి "ఓ వానరవీరులారా, మీ యుద్ధోత్సాహము ఏమి అయిపోయింది. ఎందుకు విషణ్ణముఖాలతో పరుగులెత్తుతారు. మీ శౌర్యము ఎక్కడికి పోయింది. మీరుభయపడవద్దు. పారిపోవద్దు. యుద్ధరంగములో నేను ముందుఉంటాను. మీరు అందరూ నా

వెనుక ఉండండి. మనము పోరాడుదాము. సత్కులములో పుట్టిన శూరులు వెన్ను ఇచ్చి పారిపోరు" అని చెప్పినాడు.

ఈ విధముగా హనుమంతుడు చెప్పినమాటలు విని వానర వీరులు అందరూ మహోత్సాహముతో పర్వతశిఖరాలూ మహా వృక్షాలూ తీసుకొని ఆ హనుమంతుడిచుట్టూ చేరి సింహనాదాలు చేసినారు. అంతట ఆ మహాబలవంతుడివెంట బయలుదేరి రాక్షససైన్యాలకు ఎదురుగుండా పోయినారు. అన్ని వైపులా మంటలు మండుతూ ఉన్న అగ్నిహోత్రముమాదిరిగా చుట్టూఉన్న వానరవీరులతో హనుమంతుడు విజృంభించి ఆ రాక్షససైన్యాన్ని నాశనముచేసివేయసాగినాడు. చుట్టూఉన్న వానరసైన్యాలతో హనుమంతుడు అప్పుడు ప్రళయకాలయముడివలె రాక్షసులను సంహారముచేసివేసినాడు.

ఆ మహాబలవంతుడికి హనుమంతుడికి అప్పుడు (ఇంద్రజిత్తు సీతాదేవిని చంపివేసినందుకు) పట్టరాని దుఃఖము వచ్చింది. కోపముతో చెలరేగి పెద్ద రాతిబండను తీసుకొని ఇంద్రజిత్తు రథముమీద విసరినాడు. అట్లావచ్చి పడబోతున్న ఆ రాతిబండను ఆ రథసారథి అప్పుడు చూచినాడు. ఎటుతోలితే అటుపోయే గుర్రాలను ఆ రథ సారథి ఇట్టే పక్కకు తోలి ఆ రాతిబండను రథముమీద పడకుండా తప్పించినాడు. అందువల్ల ఆ రాతిబండ ఆ రథముమీదకానీ ఆ రథముమీద కూర్చునిఉన్న ఇంద్రజిత్తుమీదకానీ సారథిమీద కానీ పడకుండా కిందపడ్డది. నేల బద్దలు అయిపోయింది. ఆ రాతిబండక్రింద పడి అనేకమంది రాక్షసయోధులు చితికిపోయినారు. అప్పుడు వానరయోధులు సింహనాదాలు చేస్తూ వందలకొద్దీ ఇంద్రజిత్తుమీదికి పరుగెత్తినారు. ఆ మహాబలవంతులు ఆ భయంకర పరాక్రములు వానరయోధులు మహావృక్షాలనూ పర్వతశిఖరాలనూ అప్పుడు ఇంద్రజిత్తుమీద విసరివేసినారు. వృక్షశైలమహావర్షము కురిపించి వానరయోధులు శత్రువులతో పోరాడుతూ వివిధ స్వరాలతో కేకలు పెట్టినారు. అట్లా తమ బలముకొద్దీ ఆ మహాబల వంతులు వానరయోధులు వృక్షాలతోనూ పర్వతాలతోనూ కొట్టుతూఉంటే ఆ దెబ్బలకు భయంకరాకారులు అయిన రాక్షస

యోధులు అనేకమంది ఆ యుద్ధములో క్రిందపడి పొర్లాడి చచ్చి పోయినారు. తన సైన్యము వానరయోధుల దెబ్బకు పడిపోవడము చూచి ఇంద్రజిత్తు మహోగ్రుడు అయిపోయి ధనుస్సు తీసుకొని వానరసైన్యాలకు ఎదురుగుండా వచ్చినాడు. తన సైన్యాలను చుట్టూ ఉంచుకొని వానరసైన్యాలమీద అప్పుడు పదునుఅయిన ఇనుపబాణాలను వదలడము మొదలుపెట్టినాడు. అతడి అనుచరులు అప్పుడు తమ పరాక్రమముకొద్దీ శూలాలతోనూ ఖడ్గాలతోనూ కూటముద్గరాలతోనూ పట్టిసాలతోనూ పిడుగులు అనే ఆయుధాలతోనూ వానరయోధులను కొట్టినారు. ఆ భయంకర కర్మలను రాక్షసులను అప్పుడు ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఎదుర్కొన్నాడు. కొమ్మలతోనూ బోదెలతోనూ ఉన్న పెద్ద చెట్లను తీసుకొని పర్వతశిఖరాలను పెళ్ళగించి రాక్షసయోధులను కొట్టి హనుమంతుడు ఆ శత్రుసైన్యాలు తన సైన్యాలమీద పడకుండా అడ్డగించినాడు. అంతట వానరవీరులను అందరినీ చూచి "ఓ వీరులారా, రాక్షససైన్యాన్ని మనము సాధించ నవసరము లేదు. మనము సీతాదేవిని సాధించడానికి వచ్చినాముకానీ, ఈ రాక్షస సైన్యాన్ని సాధించడానికోసమని రాలేదు. కాబట్టి మనము వెనుకకు మళ్ళుదాము. రాముణ్ణి సంతోషపెట్టడానికి ప్రాణాలమీద ఆశ వదులుకొని ఎవరికోసము పోరాడినామో ఆ సీతాదేవిని ఇంద్రజిత్తు చంపివేయడము చూచినాము. ఈవృత్తాంతము మనము రాముడికి సుగ్రీవుడికీ తెలియచెప్పుదాము. ఆతరువాత వారు ఏమి చేయమంటే అది చేదాము" అని చెప్పి వానరయోధులను రాక్షస సైన్యాలమీదికి పోకుండా ఆపివేసినాడు.

అంతట ఆ హనుమంతుడు ఆసైన్యాన్ని నిర్భయముగా వెనుకకు మళ్ళించినాడు. వానరసైన్యాలు మెల్లమెల్లగా హనుమంతుడివెంట బయలుదేరి రాముడు ఉన్నచోటికి పోవడము ఆ దుష్టాత్ముడు ఇంద్రజిత్తు చూచినాడు. సంతోషపడ్డాడు. అంతట హోమము చేయడముకోసము చైత్యములో ఉన్న నికుంభిలాదేవతాలయానికి ప్రయాణముఅయి పోయినాడు.

ఆ నికుంభిలాదేవతాలయములో ఉన్న అగ్నిహోత్రములో ఇంద్రజిత్తు అప్పుడు హోమము చేయడము మొదలుపెట్టినాడు.

యథావిధిగా మాంసముతోనూ నెత్తురుతోనూ హోమము చేస్తూ ఉంటే అగ్నిహోత్రము భగ భగ మంటలు మండినది. ఆ రక్త హోమానికి అగ్నిహోత్రుడు తృప్తిపడి తీవ్రముగా జ్వలిస్తూ సంధ్యాకాలసూర్యుడివలె తేజరిల్లినాడు.

ఆగమవిధులు అన్నీ తెలిసిన ఆ ఇంద్రజిత్తు రాక్షసులు జయించడానికి హవిర్భాగాన్ని హోమము చేస్తూఉంటే అక్కడ రాక్షససమూహములో విధినిషేధాలు తెలిసిన రాక్షసపండితులు విధిలోపము రానీయకుండా చుట్టూ చూస్తూనిలుచున్నారు.

౮౩

వానర రాక్షస సంగ్రామఘోషము రాముడు విన్నాడు. జాంబవంతుణ్ణి పిలిచి "ఓ సౌమ్యుడా, ఆయుధాలధ్వని భయంకరము గానూ విశేషముగానూ వినబడుతున్నది. హనుమంతుడు ఏదో అసాధ్యము అయిన మహాకార్యాన్ని చేస్తూ ఉండిఉండవలెను. ఓ భల్లూకరాజా! నీవు నీ సైన్యాన్ని వెంటపెట్టుకొని ఇప్పుడేపోయి యుద్ధముచేస్తూఉన్న ఆ వానరవీరుడికి హనుమంతుడికి సహాయపడు" అని చెప్పినాడు.

అంతట ఆ భల్లూకరాజు జాంబవంతుడు తన సైన్యాన్ని వెంటపెట్టుకొని హనుమంతుడుఉన్న పశ్చిమద్వారముదగ్గరకు ప్రయాణము అయినాడు. అంతవరకూ పోరాడి అలసిపోయి నిట్టూర్పులు విడుస్తూ ఉన్న వానరయోధులను వెంటపెట్టుకొని వస్తూఉన్న హనుమంతుణ్ణి ఆ దారిలో జాంబవంతుడు చూచినాడు. హనుమంతుడున్నూ యుద్ధముచేయడానికోసము వస్తూఉన్న నీల మేఘాలవంటి ఆ భయంకర భల్లూకవీరులనూ జాంబవంతుణ్ణి చూచినాడు. వారినికూడా వెనుకకు మళ్ళించి ఆ మహాయశుడు హనుమంతుడు అమితవేగముతో రాముడిదగ్గరకు పోయి దుఃఖ పడుతూ "ప్రభూ, మేము అందరమూ యుద్ధము చేస్తూఉన్నాము. యుద్ధభూమిలో మా ఎట్టఎదుట మేము అందరమూ చూస్తూ ఉండగా ఇంద్రజిత్తు ఏడుస్తూఉన్న సీతాదేవిని చంపివేసినాడు.

"ఓ అరిందమా! సీతాదేవిని ఇంద్రజిత్తు తన రథముమీద తీసుకొనిరావడము చూచినాను. నేను విషణ్ణుడి అయిపోయినాను నా మనస్సు క్షోభపడ్డది. నాకు అప్పుడు ఏమిచేయడానికీ తోచలేదు. జరిగింది మీకు విన్నవించడానికి వచ్చినాను." అని కన్నీళ్ళు కారుస్తూ చెప్పినాడు.

రాముడు ఆ హనుమంతుడు చెప్పింది అంతా విన్నాడు. వింటూనే శోకముతో మూర్ఛపోయినాడు. వేరునరికిన చెట్టువలె నేలమీద పడిపోయినాడు. ఆ దేవసమానుడు రాముడు నేలమీద పడిపోవడము చూచి వానరవీరులు అందరూ అన్నివైపుల నుంచి అక్కడికి పరుగెత్తుకొని వచ్చినారు. నేలమీద పడిపోయినప్పటికిన్నీ దరిచేర నలవికాకుండా జ్వలించే అగ్నిహోత్రమువలె దివ్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్న ఆ రాముడిమీద కమలాల సుగంధమూ కలువపూల సుగంధమూ గుబాళిస్తూఉన్న చల్లటినీళ్లు తెచ్చి చల్లినారు.

అట్లా అస్వస్థుడు అయిపోయిన ఆ రాముణ్ణి లక్ష్మణుడు తన రెండు చేతులా కౌగలించుకొని దుఃఖపడుతూ యుక్తియుక్తముగా "ఓ పూజ్యుడా, నీవు ధర్మమార్గము అవలంబించినావు. జితేంద్రియుడవు. అయితే ధర్మము నిరర్థకము అయిపోయినది. నీవు అవలంబించిన ధర్మము నీ దుఃఖాలను పోగొట్టలేకపోయింది. ఇంతకూ స్థావరజంగమాలవలె ధర్మాధర్మాలు ప్రత్యక్షముగా కనపడటము లేదు. అందువల్ల ధర్మాధర్మాలు లేవు అనిపిస్తున్నది. స్థావర పదార్థాలూ జంగమపదార్థాలూ కన్నులకు కనపడుతూ ఉన్నవి. అందువల్ల అవి ఉన్నవి అనుకొంటున్నాము. అట్లా ధర్మాధర్మాలు కన్నులకు కనపడటములేదు. నీవంటి పరమధార్మికుడికి ఇంత ఆపద వచ్చింది. ధర్మమే ఉన్నట్లయితే నీకు ఇటువంటి విపత్తు వచ్చి ఉండ కూడదు. ధర్మాధర్మాలు అనేవి ఉన్నట్లయితే రావణాసురుడు అనుసరించిన అధర్మపద్ధతికి అతడు నరకబాధలు అనుభవిస్తూ ఉండవలెను. అటువంటిది ధర్మమార్గము అవలంబించిన నీవు దుఃఖాల పాలు అయిపోయినావు. అధర్మమార్గము అవలంబించిన రావణాసురుడు ఏదుఃఖమూ లేకుండా సుఖముగా ఉన్నాడు.

"ధర్మము అభ్యుదయఫలాన్నీ అధర్మము కష్టఫలాన్నీ ఇస్తుంది అని శాస్త్రాలలో చెప్పిఉండేకాని ప్రత్యక్షములో పరస్పరవిరుద్ధముగా కనపడుతున్నది. ధర్మమూ ధర్మఫలాన్ని అంటే సుఖఫలాన్ని ఇవ్వవలెను. కాబట్టి అధర్మము అనుష్ఠించేవారికి అధర్మఫలము అయిన కష్టము తప్పకుండా సంభవించవలెను. అదే విధముగా ధర్మము అనుష్ఠించేవారికి ధర్మఫలము అయిన సుఖము తప్పకుండా సంభవించవలెను. అధర్మము ఆచరించిన వారికి ఇష్టసిద్ధిన్నీ ధర్మము ఆచరించినవారికి కష్టసిద్ధిన్నీ అయింది. అందువల్ల ధర్మాధర్మాలు ఉన్నవి అనుకొన్నా వాటిని అనుష్ఠించడము వ్యర్థము.

"రామా, పాపకర్మాలు అధర్మముచేత బాధ పడేట్టయితే చంపివేయడము అనే కర్మ అధర్మము. ఆ అధర్మము కాస్త జరిగి పోయింది. జరిగిపోయిన ఆ అధర్మము ఎవరిని బాధ పెట్టు తున్నది. ఎవడో చేసిన అధర్మము నిన్ను బాధపెట్టుతున్నది. నీవు చేసిన ధర్మము మరి ఒకండ్లను సుఖపెట్టుతున్నది. ఒకవేళ ఒకరిని ఒకరు చంపివేయడము దైవికము అనేట్లయితే ఆ పాప కర్మము దైవానిది అవుతుంది. కాని ఆ చేసినవాడిదికాదు. అందు వల్ల దైవికము అని తోసివేయడానికిన్నీ వీలులేదు.

"ఓ పరంతపా, ధర్మము ఇటువంటి ఇటువంటి లక్షణాలతో ఉంటుంది అని ఊహించటానికిఅయినా అలవికాకుండా ఉంది. అందువల్ల అది లేనిదానివంటిదే. ధర్మమే ఉన్నట్లయితే నీవు ఇటు వంటి కష్టాలపాలు కాకూడదు. కనుక ధర్మము లేనేలేదు అని పిస్తూఉంది. ధర్మానికి సామర్థ్యములేదు. బలము లేదు. అది పురుషప్రయత్నాన్ని ఆశ్రయించుకొని బ్రతుకుతూ ఉంది. కాబట్టి ధర్మాన్ని ఆశ్రయించడముకన్నా ధర్మానికి ఆశ్రయముఅయిన పురుషప్రయత్నాన్ని ఆశ్రయించడము మంచిది. కార్యసాధన విషయంలో పురుషప్రయత్నానికి ధర్మము ప్రధానము కాదు. కాబట్టి ధర్మాన్ని వదలిపెట్టి పురుషప్రయత్నమే చేయవలెను.

"ఓ అరిందమా, సత్యము చెప్పడము ధర్మము కదా. మన తండ్రి నిర్దయుడు అయి అసత్యమాడితే నీవు ఆయనను ఎందుకు

బంధించివేయలేదు. ధర్మమే అనుష్ఠించవలసి ఉన్నట్లయితే దేవేంద్రుడు విశ్వరూపుడు అనే మునిని చంపివేయకుండా యజ్ఞము మాత్రము చేసిఉండేవాడు. అధర్మము అనుష్ఠించవలసి ఉన్నట్లయితే ఆ విశ్వరూపుడు అనే మునినిమాత్రము చంపివేసి యజ్ఞము చేయకుండా ఉండేవాడు. అందువల్ల సమయాసమయాలనుపట్టి ధర్మాధర్మాలను రెంటినీ అనుష్ఠించవలెను. కేవల ధర్మముకానీ కేవల అధర్మముకానీ అనుష్ఠించేట్లయితే కర్తకు చెరుపు అవుతుంది. కనుక ధర్మాధర్మకార్యాలను ఆ యా కాలాలకు తగినట్టు అనుసరించవలెను.

"అన్నా, ధర్మము అధర్మము అనే నియమము లేకుండా అవసరము అయిన పని చేయడమే ధర్మము. రాజ్యము వస్తూవుంటే నీవు వదులుకొన్నావు. ఆ విధముగా ధర్మానికి మూలము అయిన అర్థాన్ని వదిలిపెట్టినావు. మూలచ్ఛేదము అయిపోయినందువల్ల నీకు ధర్మము ఎక్కడిది. కొండలలోనుంచి చిన్న చిన్న ఏర్లుగా బయలుదేరి మహానదులుఅయి లోకానికి ఉపయోగించేట్టు రాజ్యము సంపాదించి ప్రజలు ఇచ్చే పన్నులు మొదలు అయిన వాటిని వృద్ధిచేసుకొన్నట్లయితే యజ్ఞాదిసర్వక్రియలూ చేయడానికి వీలు అయ్యేది. నీవు అట్లా చేయలేదు. అర్థాన్ని వదిలిపెట్టినావు. అర్థము లేని వాడు తేజోహీనుడు. అర్థము లేనివాడి సమస్తపనులూ ఎండా కాలములో ఏటినీళ్ళవలె రోజురోజుకూ ఎండిపోతవి. అర్థాన్ని త్యజించినవాడు సమస్తసుఖాలు అనుభవించవలెను అనుకొనేట్లయితే పాపకృత్యాలు చేయవలసివస్తుంది. అర్థాన్ని త్యజించడమువల్ల ధర్మము లోపము అయిపోవడమే కాకుండా దోషముకూడా సంభవిస్తుంది.

" రామా, ఈ లోకములో అర్థవంతుడికి అందరూ మిత్రులు అవుతారు. అర్థవంతుడికి అందరూ బంధువులు అవుతారు. అర్థవంతుడే మగవాడు. వాడే పండితుడు. వాడే మహాపరాక్రమవంతుడూ బుద్ధిమంతుడూ గుణవంతుడూ మహాభాగుడూ అవుతాడు. అర్థము వదులుకొంటే అన్నీ చిక్కులే అవుతవి. రామా, నీవు అప్పుడు రాజ్యము వదులుకున్నావే—ఎందుకు అప్పుడు నీకు అటు

వంటి బుద్ధి పుట్టింది. అర్థవంతుడికి ధర్మకామాలు లభ్యము అవుతవి, సమస్తమూ అనుకూలముగా ఉంటుంది. అర్థహీనుడు ఎంతప్రయత్నము చేసినా ఏలాభమూ పొందలేడు. రామా, సంతోషమూ కామమూ దర్పమూ ధర్మమూ కోపమూ శమమూ దమమూ సర్వమూ అర్థవంతుడిలో శోభిస్తవి. అర్థాన్ని అలక్ష్యముచేసి కేవలము ధర్మాన్ని అనుష్ఠించేవాడికి ఇహలోకసౌఖ్యము అంతా నాశనము అయిపోతుంది.

"ఓ వీరుడా, నీవు అర్థానికి కారణముఅయిన రాజ్యాన్ని వదులుకున్నావు. పితృవాక్యపరిపాలనము ధర్మము అనుకొన్నావు. అడవులకు వచ్చినావు. నీ ప్రాణముకన్నా నీకు ప్రియము అయిన నీ ఇల్లాలిని రాక్షసులు అపహరించడము జరిగింది. ఇప్పుడు నీకు ఈ గొప్పఆపత్తు వచ్చింది. నీవు ఇక లేవవలెను. నేను నా శౌర్యములో నీదుఃఖాన్ని పోగొట్టుతాను.

"ఓ నరశార్దూలమా, నీవు మహాబాహుడవు. దృఢవ్రతుడవు. ఎందువల్లనో నీప్రభావము నీవు తెలుసుకోలేకుండా ఉన్నావు. నీవు ఆజ్ఞాపించు. ఆ రాక్షసరాజును రావణాసురుణ్ణి గుర్రాలతోనూ ఏనుగులతోనూ రథాలతోనూ ఉన్న వాడి సైన్యాన్ని లంకాపట్టణాన్ని నా బాణాలతో క్షణమే ధ్వంసము చేసివేస్తాను" అని చెప్పినాడు.

౮౪

ఆ భ్రాతృవత్సలుడు లక్ష్మణుడు అట్లా రాముణ్ణి ఓదారుస్తూ ఉన్నాడు. విభీషణుడు సేనాసమూహాలను ఆయా స్థానాలలో ఉంచి ఏనుగులను వెంటపెట్టుకొనిపోయే మదపుటేనుగువలె ఆయుధధారులు అయిన కాటుకరాసులవంటి తన నలుగురు మంత్రులనూ వెంటపెట్టుకొని బయలుదేరి అప్పుడు రాముడు ఉన్నచోటికి వచ్చినాడు. కన్నీళ్లు కారుస్తూఉన్న వానరవీరులనూ దుఃఖపరవశుడు అయి ఉన్న మహాబలవంతుణ్ణి లక్ష్మణుణ్ణి ఆ లక్ష్మణుడి ఒడిలో ఒళ్లు తెలియకుండా పడిఉన్న రాముణ్ణి చూచినాడు. దిగులుపడిపోయినాడు.

తన దుఃఖాన్ని పయికి తెలియనీయకుండా "ఇది ఏమిటి" అని విభీషణుడు ప్రశ్నించినాడు.

లక్ష్మణుడు కన్నీళ్లు కారుస్తూ సుగ్రీవుణ్ణి తక్కిన వానర వీరులనూ చూస్తూ విభీషణుడితో మందము మందముగా "ఓ సౌమ్యుడా, హనుమంతుడు తన ఎట్టఎదట ఇంద్రజిత్తు సీతాదేవిని కొట్టి చంపివేసినాడు అని వచ్చి చెప్పినాడు. అది వినీవినడముతో రాముడు ఒళ్లు ఎరగకుండా పడిపోయినాడు" అని ఇంకా ఏమో చెప్పుకుపోతూ ఉంటే విభీషణుడు ఆ లక్ష్మణుణ్ణి చెప్పనీయకుండా "ప్రభూ, సముద్రము ఎండిపోయింది" అని చెప్పితే ఎంత నిజమో హనుమంతుడు చెప్పింది అంత నిజము. సీతాదేవిని ఇంద్రజిత్తు చంపివేయడము ఉత్తది.

"ఓ రామా, నేను మా అన్నకు మేలు చేయవలెను అనుకొని సీతాదేవిని వదిలిపెట్టమని ఎన్నిసార్లో ప్రార్థించినాను. వాడు నా మాట చెవిని పెట్టినాడు. అంతేకాదు. సామ దాన భేద దండోపాయాలవల్లకానీ మరి ఏ ఇతర మాయోపాయాలవల్లకానీ ఆ సీతాదేవిని చూడడానికి అయినా ఎవరికీ అలవికాకుండా మా అన్న కట్టుదిట్టాలు చేసివేసినాడు. సీతాదేవికోసము మా అన్న రావణుడు సమస్తమూ చివరకు ప్రాణాన్నిఅయినా వదులుకోడానికి సిద్ధముగా ఉన్నాడు. అందువల్ల ఇంద్రజిత్తు చంపివేయడము మాయ. వానరవీరులను మోసముచేసి తాను నికుంభిలా దేవతాలయములో హోమము చేయడానికి ఇంద్రజిత్తు వెళ్ళిపోయినాడు. వాడా హోమము పూర్తిచేసుకొని వచ్చేట్లయితే దేవేంద్రుడితో కూడా దేవతలుఅందరూ వచ్చినా వాణ్ణి యుద్ధరంగములో ఎదిరించలేరు. సీతాదేవిని చంపినట్లయితే వానరులు భ్రమపడిపోయి యుద్ధము చాలించి పోతారు అని వాడు ఆలోచించి మాయసీతను కల్పించి చంపివేసిఉంటాడు. తన యజ్ఞము నిర్విఘ్నముగా చేసుకోవచ్చును అని అట్లా చేసినాడు.

"ఓ రామప్రభూ, వాడు ఆ యజ్ఞము ముగించేలోపలనే మనము మన సైన్యాలతో ఆ నికుంభిలా దేవతాలయానికి పోవలెను.

నీవు దుఃఖపడ నవసరము లేదు. నీవు దుఃఖపడవద్దు. నీవు దుఃఖపడుతున్నందువల్ల ఈ వానరసైన్యము అంతా దుఃఖపడుతూ ఉంది.

"ఓ రామా, నీవు స్వస్థచిత్తముతో ఇక్కడనే ఉండు. మాతోనూ, ఈ వానరసైన్యాధిపతులతోనూ, లక్ష్మణుణ్ణి పంపించు ఈ నరశార్దూలము తన తీక్ష్ణబాణాలు వదలి ఆ ఇంద్రజిత్తు యజ్ఞకర్మను ధ్వంసము చేసివేస్తాడు. ఆ తరువాత వాణ్ణి సంహారము చేసివేయగలుగుతాడు. పక్షీఈకలు కట్టిన ఈ లక్ష్మణుడి బాణాలు అమితవేగముతో క్రూరపక్షులవలె పోయి, ఇంద్రజిత్తు నెత్తురు త్రాగివేస్తవి. ఓ మహాబాహూ, వజ్రధరుడు వజ్రాయుధాన్ని పంపించేట్టు ఈ శుభలక్షణుణ్ణి లక్ష్మణుణ్ణి మావెంట పంపించు.

"ఓ ప్రభూ, శత్రుసంహారానికి ఇది అదను. ఇప్పుడు కాలవిలంబనము ఎంతమాత్రమూ పనికిరాదు. తలపడినప్పుడు తారకాసురాదులను సంహారము చేయమని దేవేంద్రుడు కుమారస్వామిని ఆజ్ఞాపించినట్లు, ఇంద్రజిత్తును సంహారము చేసివేయమని నీవు నీ తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి ఆజ్ఞాపించు.

"ఓ రామప్రభూ, ఆ ఇంద్రజిత్తు చేస్తున్న హోమము సమాప్తము అయ్యేట్లయితే వాడు సురాసురులకుసైతము అదృశ్యుడైపోయి పోరాటము సాగిస్తాడు. అప్పుడు దేవతలకుసైతము ప్రాణసంశయము అవుతుంది" అని చెప్పినాడు.

౮౫

విభీషణుడు చెప్పింది దుఃఖముతో కుంగిపోయిన రాముడు విన్నాడేకాని స్పష్టముగా అర్థము చేసుకోలేదు. ఆ పరపురంజయుడు రాముడు అంతట కోలుకొని ఆ వానరవీరుల సమక్షములో విభీషణుణ్ణి చూచి "ఓ విభీషణుడా, నీవు చెప్పింది నాకు సరిగా బోధపడలేదు. మళ్ళీ చెప్పు. నీ అభిప్రాయము ఏమిటో తెలుసుకొంటాను" అన్నాడు.

ఆ వాక్యవిశారదుడు విభీషణుడు "ప్రభూ, నీవు ఆజ్ఞాపించినట్టు సేనాసన్నివేశాలను ఏర్పాటుచేసి నాలుగుపక్కలా ఉంచినాను.

యథాన్యాయముగా యూథపతులను నియమించినాను. నిన్ను చూడవలెను అనుకొని ఇక్కడికి వచ్చినాను.

“ఓ మహాయశా, నా విన్నపము ఆలకించు. నీవు అకారణముగా దుఃఖపడుతున్నావు. అందువల్ల అందరూ దుఃఖపడుతున్నారు. నీవు దుఃఖపడనక్కరలేదు. జరిగింది అంతా మాయ. నీవు ఇప్పుడు ఇట్లా సంతాపపడుతూఉండేట్లయితే శత్రువులు మరింత సంతోషిస్తారు. నీవు సంతాపపడవద్దు. ఉత్సాహముతో ఉండు. సంతోషముతో ఉండు.

“ఓ రామప్రభూ, నీవు రాక్షసులను అందరినీ సంహారముచేసి సీతాదేవిని తీసుకొని పోతలచుకొన్నట్లయితే నేను చెప్పేది వినవలెను. నేను నీ మేలు కోరి చెప్పుతున్నాను. ఈ లక్ష్మణుణ్ణి వానర మహాసైన్యముతో ఇప్పుడు పంపించు. ఇతడు నికుంభిలా దేవతాలయానికి పోయి పోరాడి ఆ ఇంద్రజిత్తును సంహారము చేసివేస్తాడు. ఈ జయశీలి ఈ మేటి విలుకాడు లక్ష్మణుడు మండలాకారముగా తన వింటిని వంచి వదిలిపెట్టే విషసర్పాలవంటి బాణాలకు ఆ ఇంద్రజిత్తు నిలువలేడు. వాడు చచ్చిపోతాడు.

“వాడు ఆ ఇంద్రజిత్తు ఇదివరకు తపస్సుచేసి బ్రహ్మదేవుణ్ణి మెప్పించి బ్రహ్మశిరము అనే అస్త్రాన్ని కోరుకొన్నట్లు పోయే నాలుగు గుర్రాల రథాన్ని సంపాదించినాడు. వాడు ఇప్పుడు రాక్షస సైన్యాన్ని వెంటపెట్టుకొని నికుంభిలా దేవతాలయానికి యజ్ఞకర్మ చేయడానికి పోయినాడు. అక్కడ వాడు ఆ యజ్ఞకర్మను పూర్తి చేసివేసేట్లయితే వాణ్ణి ఎవరూ జయించలేరు. వాడు మనలను అందరినీ సంహారము చేసివేయ కలుగుతాడు. నికుంభిలా దేవతాలయములో ఇంద్రజిత్తు హోమము పూర్తిచేసేలోపల ఎవడు వాణ్ణి అడ్డగిస్తాడో వాడిచేతిలోనే ఆ ఇంద్రజిత్తు చచ్చిపోతాడు అని బ్రహ్మదేవుడు చెప్పినాడు.

“ప్రభూ, నికుంభిలా హోమాన్ని విఘ్నము చేసేవాడి చేతిలో ఆ ధీమంతుడు ఇంద్రజిత్తు చచ్చిపోవలెను, అని బ్రహ్మదేవుడు ఇదివరకే విధించినాడు. కాబట్టి ఇప్పుడు ఆ ఇంద్రజిత్తును వధించి వేయడానికి నీవు లక్ష్మణుణ్ణి పంపించు. లక్ష్మణుడు వాణ్ణి వధించి

వేస్తాడు. ఇంద్రజిత్తు చచ్చిపోయిన ఉత్తరక్షణాన రావణాసురుడు బంధుమిత్రులతో చచ్చిపోయినాడు అనే అనుకో" అని చెప్పినాడు.

విభీషణుడు చెప్పిన ఈ మాటలకు రాముడు "ఓ మిత్రుడా, ఆ భయంకరుడి మాయలు నేనూ ఎరుగుదును. వాడు బ్రహ్మాస్త్రవిదుడు అనీ ధనుర్విద్యావిశారదుడు అనీ మహామాయావి అనీ నాకు తెలుసును. అందువల్లనే వాడు పోరాటములో దేవతలనుసహితము మోసము చేయగలిగినాడు. వాడు రథముమీద అంతరిక్షములో తిరుగుతూ మేఘాలు కమ్ముకొన్న సూర్యుడివలె కనపడకుండా పోతాడు" అని చెప్పి లక్ష్మణుడివంక చూచి "తమ్ముడా నీవు సుగ్రీవుణ్ణి హనుమంతుణ్ణి జాంబవంతుణ్ణి తక్కిన వానరయూథపతులనూ వారి వారి వానరసైన్యాలనూ భల్లూక సైన్యాలనూ వెంట పెట్టుకొని పో. సర్వమూ తెలిసిన ఈ విభీషణుడు తన నలుగురు మంత్రులతో నీవెంట ఉంటాడు. నీవు మాయాబలవిశారదుణ్ణి ఇంద్రజిత్తును వధించు" అని చెప్పినాడు.

అంతట ఆ అత్యద్భుత పరాక్రమవంతుడు లక్ష్మణుడు కవచము తొడుగుకొని బంగారుకార్ముకమూ బాణాలూ ఖడ్గమూ తీసుకొని సంతోషముగా యుద్ధసన్నద్ధుడు అయి రాముడి పాదాలకు నమస్కారముచేసి "ప్రభూ, నా ధనుస్సునుండి వెలువడే బాణాలు ఆ భయంకరాకారుడి శరీరాన్ని భేదించి వాణ్ణి వధించి తామరకొలనులోకి పోయే హంసలవలె పోయి లంకాపట్టణము అంతటా వ్యాపిస్తవి" అని చెప్పినాడు.

ఆ ద్యుతిమంతుడు అట్లా చెప్పి రాముడికి ప్రదక్షిణముచేసి ఆయన పాదాలకు నమస్కారముచేసి ఆయన మంగళాశీర్వాదము పొంది నికుంభిలా చైత్యానికి ప్రయాణము అయినాడు. అనేక వేలమంది వానరయోధులను వెంటపెట్టుకొని హనుమంతుడూ భల్లూక సేనలను వెంటపెట్టుకొని జాంబవంతుడూ వానరమహాసైన్యాలను వెంటపెట్టుకొని అంగద సుగ్రీవులూ తన నలుగురు మంత్రులనూ వెంటపెట్టుకొని విభీషణుడూ అప్పుడు లక్ష్మణుడివెంట నడిచారు. దూరాన వ్యూహాలుగా ఉన్న రాక్షససైన్యాన్ని ఆ లక్ష్మణుడు చూచినాడు. బ్రహ్మదేవుడు విధించినట్లు ఆ ఇంద్రజిత్తును వధించి

వేయడానికి నికుంభిలా ప్రదేశానికి ఆ లక్ష్మణుడు అమితవేగముతో నడచినాడు. అక్కడికిపోయి ధనుస్సు సజ్యము చేసినాడు. అప్పుడు ఆ మహాపరాక్రమవంతుడి ప్రక్కన అంగదుడూ హనుమంతుడూ విభీషణుడూ నిలచినారు. వివిధాయుధాల తళతళలతోనూ కిట కిటలాడుతూ ఉన్న మహారథధ్వజాల ధగధగలతోనూ చుట్టూ మహాభయంకరమూ అప్రమేయమూ అయిన రాక్షససైన్యముతోనూ ఆ నికుంభిలా దేవతాలయము అంధకారంలో ఎక్కడ వుందీ లక్ష్మణుడికి కనిపించలేదు.

౮౬

అప్పుడు విభీషణుడు లక్ష్మణుడితో "ఓ శూరుడా, నల్లని మేఘాలవలె కనపడుతూఉన్న ఆ రాక్షససైన్యముమీద ఇప్పుడే మన వానరసైన్యాలు వృక్షాలూ మొదలుఅయిన ఆయుధాలతో పడవలెను. వానరవీరులు రాక్షససైన్యాలమీద పడగానే నీవు నీ బాణాలతో ఆ రాక్షససైన్యాన్ని భేదించివేసే నీ ప్రయత్నము నీవు చేయవలెను. రాక్షససైన్యము ఛిన్నాభిన్నము అయిపోగానే నీకు ఇంద్రజిత్తు కనపడతాడు. నీవు అప్పుడు దేవేంద్రుడు వదిలే పిడుగులవంటి బాణాలను ఆ రాక్షసుడిమీద వదలవలెను. నికుంభిలా యజ్ఞకర్మ సమాప్తము చేసేలోపలనే పరుగెత్తిపోయి నీవు ఇంద్రజిత్తును ఎదిరించవలెను. సర్వలోకాలనూ దుఃఖపెట్టుతూఉన్న ఆ దుష్టాత్ముణ్ణి మాయలుచేయడమే పరమధర్మముగా పెట్టుకొన్న ఆ క్రూరకర్ముణ్ణి ఇంద్రజిత్తును నీవు చూచీచూడడముతో కొట్టవలెను" అని కార్యసాధనోపాయము చెప్పినాడు.

అప్పటికి అప్పుడు వానరయోధులూ భల్లూకయోధులూ మహావృక్షాలతోనూ పర్వతశిఖరాలతోనూ ఆ రాక్షససైన్యముమీద పడ్డారు. చేతులకు అందిన ఆ రాక్షసయోధులను ఆ వానర భల్లూకయోధులు తమ గోళ్లతోనూ కోరలతోనూ చీల్చివేసినారు. అంతట ఆ శుభలక్షణుడు లక్ష్మణుడు ఆ రాక్షససైన్యముమీద బాణవర్షము కురిపించడము మొదలుపెట్టినాడు. అది చూచి రాక్షసవీరులు తీక్ష్ణబాణాలను వానరసైన్యాలమీద వదిలినారు. రాక్షసయోధులు

ఖడ్గాలతోనూ శక్త్యాయుధాలతోనూ తోమరాయుధాలతోనూ వానరసైన్యాలను కొట్టసాగినారు. పోరాటము దొమ్మిగా సాగింది. ఆ యుద్ధఘోషము అప్పుడు లంకాపట్టణముఅంతటా వినిపించింది. ఆ పోరాటములో రాక్షసులు వదిలిన బాణాలూ వివిధాయుధాలూ వానరవీరులు విసరివేసిన మహావృక్షాలూ పర్వతశిఖరాలు కుప్పలు తిప్పలుగా ఆకాశము అంతఎత్తున పడ్డవి. వికృతాకారులుఅయిన రాక్షసులు వివిధాయుధాలతో తమ బాహుబలముకొద్దీ మహా భయంకరముగా పోరాడినారు. ఆదేవిధముగా వానరయోధులు మహావృక్షాలతోనూ పర్వతశిఖరాలతోనూ పోరాడుతూ అనేకవేల మంది రాక్షసయోధులను ఘోరముగా కొట్టి చంపివేసినారు. మహాకాయులూ మహాబలవంతులూ అయిన భల్లూక వానర యోధులు ఆవిధముగా రాక్షసయోధులను చంపివేస్తూఉంటే రాక్షసవీరులకు అందరికీ మహాభయము వేసింది. తన సైన్యాన్ని భల్లూక వానరయోధులు నాశనము చేసివేస్తున్నారు అని వినగానే ఆ దుర్ధర్షుడు ఇంద్రజిత్తు యజ్ఞకర్మను పూర్తి చేయకుండానే లేచినాడు. చుట్టూ పడ్డ చెట్లవల్లనూ పర్వతశిఖరాలవల్లనూ దిమ్మచీకట్లు కమ్మినట్లుగా ఉండడము చూచి ఇంద్రజిత్తు మహాకోపముతో అనుచరులను వెంటపెట్టుకొని వెలుపలికి వచ్చినాడు. అక్కడ అదివరకే ఆయుధాలతో సిద్ధముగా ఉన్న నాలుగుగుర్రాల రథము ఎక్కినాడు. భయంకర మేఘమువంటి ఆ ఇంద్రజిత్తు ముఖమూ కన్నులూ కోపముతో ఎర్రపడిపోయినవి. భయంకర కార్ముకాన్ని తీసుకొని సర్వనాశనము చేసివేసే యముడివలె ఆ రథముమీద తేజరిల్లుతూ ఉన్న ఇంద్రజిత్తును చూచి రాక్షసయోధులు అందరూ సింహనాదము చేసినారు. అంతట లక్ష్మణుడితో పోరాడటానికి ఆ రాక్షససైన్యము భయంకరవేగముతో ఇంద్రజిత్తును వెంబడించింది.

అప్పుడు పర్వతాకారుడు హనుమంతుడు విజృంభించి ప్రళయ కాలాగ్నివలె మహావృక్షాలతో ఆ రాక్షససైన్యముమీద పడి అప్పటికి అప్పుడు అనేకవేలమంది రాక్షసయోధులను చంపివేసినాడు. అప్పుడు వేలకువేలు రాక్షసయోధులు క్రొత్తగా వచ్చి ఆ వాయుపుత్రుణ్ణి హనుమంతుణ్ణి అన్నివైపులా కమ్ముకున్నారు. తీక్ష్ణ శూలాయుధాలు పట్టుకొని వచ్చినవారు శూలాయుధాలతోనూ

ఖడ్గాలు పట్టుకొని వచ్చినవారు ఖడ్గాలతోనూ ఈటెలు పట్టుకొని వచ్చినవారు ఈటెలతోనూ అడ్డకత్తులు పట్టుకొనివచ్చినవారు అడ్డకత్తులతోనూ ఇనుపగుదియలు పట్టుకొనివచ్చినవారు ఇనుపగుదియలతోనూ గదలు పట్టుకొనివచ్చినవారు గదలతోనూ తక్కిన రాక్షస యోధులు తళతళ మెరిసే చక్రాయుధాలతోనూ వందలకొద్దీ శతఘ్నులతోనూ భయంకరము అయిన గండ్రగొడ్డళ్ళతోనూ విడిచి వాటు ఇనుపగుదియలతోనూ అన్నివైపులా హనుమంతుణ్ణి ఎదిరించినారు. కొందరు వజ్రముతో సమానము అయిన తమ తమ పిడికిళ్ళతో పొడిచినారు. వజ్రాయుధమువంటి తమ తమ అరచేతులతో కొందరు కొట్టినారు. అంతమంది అనివైపులా అన్ని ఆయుధాలతో కొట్టాఉన్నప్పటికిన్నీ హనుమంతుడు కొంచెము అయినా చలించలేదు. మరింత క్రుద్ధుడు అయిపోయి అంతమందితోనూ మహాభయంకరముగా పోరాడసాగినాడు.

ఆ మహాయుద్ధములో ఎంతోమంది రాక్షసులను వధించివేస్తూ ఉన్న ఆ పర్వతాకారుణ్ణి హనుమంతుణ్ణి ఇంద్రజిత్తు చూచినాడు. తన సారథితో "ఈ హనుమంతుణ్ణి ఉపేక్షించడానికి వీలులేదు. వీణ్ణి ఉపేక్షించేట్లయితే ఈ రాక్షసయోధులను అందరినీ వీడు ఈ హనుమంతుడు ఒక్కడే సంహారముచేసివేస్తాడు. ఆ హనుమంతుడి వైపు రథాన్నితోలు" అని ఇంద్రజిత్తు చెప్పినాడు. రథాన్ని సారథి అప్పుడు హనుమంతుడిమీదికి తోలినాడు. అంతట ఆ దుర్ధర్షుడు ఇంద్రజిత్తు బాణాలనూ ఖడ్గాలనూ పట్టిసాలను గండ్రగొడ్డళ్లనూ హనుమంతుడిమీద కురిపించినాడు. ఆ భయంకరాయుధాలను అన్నిటినీ హనుమంతుడు తన చేతులతో పట్టుకొని అవతల పారవేసి మహాకోపముతో "ఓ రావణాసురుడి కొడుకా, నేను వాయుపుత్రుణ్ణి. హనుమంతుణ్ణి. నీవు శూరుడవు అనుకొని నామీదికి వచ్చినావు. నాతో పోరాడి ప్రాణాలతో పోయినవాడు ఎవడూలేడు" అని చెప్పినాడు.

అప్పుడు అది విభీషణుడు చూచి లక్ష్మణుణ్ణి పిలిచి "ఓ లక్ష్మణుడా, ఇంద్రజిత్తు హనుమంతుణ్ణి చంపివేయవలెను అని ధనుర్ధరుడు అయినాడు. తాను దేవేంద్రుణ్ణి జయించినాను అనే

గర్వముతో ఆ హనుమంతుణ్ణి చంపివేయవలెను అని వాడు అనుకొంటున్నాడు. నీకు ఇది అదను. నాయనా, శత్రువులను అసమానముగా భేదించివేసే బాణాలను తీసుకో. ఆయువుపట్లలో పడి ప్రాణాలు తీసివేసే బాణాలు వదలి నీవు ఇంద్రజిత్తును వధించు" అని చెప్పినాడు.

శత్రుభీషణుడు విభీషణుడు ఇట్లా చెప్పింది ఆ మహాపరాక్రమవంతుడు లక్ష్మణుడు విన్నాడు. అప్పుడు హనుమంతుడితో యుద్ధము చేయడానికి నిలుచుని సింహనాదము చేస్తూఉన్న భీమబలుణ్ణి పర్వతాకారుణ్ణి ఇంద్రజిత్తును లక్ష్మణుడు చూచినాడు.

౮౭

అంతట ధనుర్ధరుడు అయిన లక్ష్మణుణ్ణి సంతోషముగా విభీషణుడు వెంటపెట్టుకొని సమీపములో ఉన్న ఒక వనములోకి తీసుకొనిపోయి ఇంద్రజిత్తు హోమము చేస్తూఉన్న ప్రదేశాన్ని చూపించినాడు. అక్కడ నీలమేఘమువంటి భయంకరము అయిన మర్రిచెట్టును లక్ష్మణుడు చూచినాడు. అప్పుడు విభీషణుడు "లక్ష్మణా, ఆ బలవంతుడు ఇంద్రజిత్తు ఆ మర్రిచెట్టుదగ్గర భూతబలి ఇచ్చి యుద్ధానికి బయలుదేరుతాడు. అంతట వాడు సమస్తభూతకోటికి అదృశ్యుడు అయిపోయి తీక్ష్ణబాణాలు వదలి శత్రువులను బంధించివేస్తాడు. వాడు ఆ మర్రిచెట్టుదగ్గరకు వచ్చేట్లయితే వాణ్ణి జయించడము అశక్యము. అందువల్ల వాడు మళ్ళీ ఆ మర్రిచెట్టు దగ్గరకు వచ్చేలోపలనే నీవు వాడి రథాన్ని సారథినీ గుర్రాలనూ నీ తీక్ష్ణబాణాలతో నాశనము చేసివేయవలెను" అని చెప్పినాడు.

"అట్లాగేను" అని చెప్పి లక్ష్మణుడు తన విచిత్రము అయిన ధనస్సును మోగిస్తూ అక్కడ నిలుచున్నాడు. అగ్నిహోత్రమువలె ధగధగలాడుతూ ఉన్న రథముమీద కవచము తొడుగుకొన్న ఆ ధనుర్ధరుడు ఆ బలవంతుడు ఇంద్రజిత్తు అప్పుడు అక్కడ ప్రత్యక్షము అయినాడు. పౌలస్త్యమహర్షివంశములో పుట్టిన ఆ అపరాజితుణ్ణి ఇంద్రజిత్తును ఆ మహాపరాక్రమవంతుడు

లక్ష్మణుడు చూచి "ఓ రాక్షసుడా, నీవు మాయము అయి పోకుండా నాతో పోరాడు. నిన్ను నేను యుద్ధానికి ఆహ్వానిస్తున్నాను." అని చెప్పినాడు.

ఆ మతిమంతుడు ఇంద్రజిత్తు అప్పుడు అక్కడ లక్ష్మణుడి వెంటఉన్న విభీషణుణ్ణి చూచి పరుషముగా "ఓ రాక్షసుడా, నీవు ఈ లంకాపట్టణములో పుట్టి పెరిగినావు. నాతండ్రికి నీవు సాక్షాత్తూ తమ్ముడవు, నాకు పినతండ్రివి. నేను నీ పిల్లవాణ్ణి, నీవు నాకు ఎందుకు ద్రోహము తలపెట్టినావు! ఓ దుర్మతీ, నీకు బంధుత్వము లేదు. నీకు స్నేహము లేదు. నీకు జాతి లేదు. సోదరభావము లేదు. నీకు కులాభిమానము లేదు. నీవు ధర్మదూషణుడవు.

"ఓ దుర్బుద్ధీ, నీవు స్వజనాన్ని వదలిపెట్టి పరులకు భృత్యుడవు అయిపోయినావు. అందువల్ల నిన్ను చూస్తే దుఃఖము వస్తావుంది. సత్పురుషులు నిందించే పని చేసినావు. నీబుద్ధి బుగ్గిఅయిపోయింది. స్వజనసంవాసము ఎక్కడ నీచపరాశ్రయము ఎక్కడ. ఈ రెండింటి తారతమ్యమూ నీకు తెలియలేదు. పరులు గుణవంతులు అయినప్పటికిన్నీ స్వజనులు గుణవంతులు కాకపోయినప్పటికిన్నీ స్వజనులతో ఉండడమే శ్రేయస్కరము. ఎంతగుణవంతుడు అయినప్పటికిన్నీ పరుడు పరుడే. స్వజనాన్ని వదలిపెట్టి శత్రువులను ఆశ్రయించిన వాడిచేతనే వాడివాళ్ళను నాశనము చేసివేయడానికి శత్రువులు ఉపయోగించుకొంటారు. ఆ తరువాత వాణ్ణికూడా నాశనము చేసివేస్తారు. అది లోకధర్మము.

"ఓ నిశాచరుడా, నీవు రావణుడి తమ్ముడవు. నీవు నిర్దయుడవు అయి నా హోమము చెడగొట్టించడానికి ఈ లక్ష్మణుణ్ణి తీసుకొనివచ్చినావు. ఇది నీవు చేయవలసిన పని కాదు" అని చెప్పినాడు.

ఇంద్రజిత్తు అన్న ఈ మాటలకు "ఓరి దుర్మార్గుడా, నా శీలము ఎరగనివాడివలె ఎందుకు పేలుతావు. నేను నీ పినతండ్రిని అనే గౌరవమువల్లను అయినా నీవు నాతో పరుషముగా మాట్లాడకూడదు. నేను క్రూరకర్ములు అయిన రాక్షసుల వంశములో పుట్టినప్పటికిన్నీ నా శీలము రాక్షససంబంధము అయింది కాదు,

గుణము ప్రధానముకాని కులముకాదు. నేను క్రూరకర్మలను ఒడికట్టను. అధర్మము ఒప్పను. తన శీలము వేరు అయినప్పటికిన్నీ మా అన్నను రావణుణ్ణి నేను మన్నించినాను. కాని వాడు తప్పు చేసి అది నేను తెలియచెప్పితే నన్ను ఎందుకు నిరసించినాడు? ధర్మాన్ని జారవిడిచి పాపకార్యము చేయ నిశ్చయించుకొన్నవాణ్ణి చేతికి చుట్టుకొన్న పామును వదిలించుకొనేట్టు వదిలించుకోవలెను. ధర్మలోపము చేసినవాణ్ణి వదిలిపెట్టితేనే సుఖపడటానికి వీలు అవుతుంది. పరద్రవ్యాపహరణమూ పరదారాపరిగ్రహము జీవ హింస దురాచారమూ వీటికి పాల్పడేవాణ్ణి తగులబడిపోతున్న ఇంటిని వదిలిపెట్టిపోయేట్టు వదిలిపెట్టి పోవలెను. పరధనహరణమూ పరదారాపరిగ్రహమూ స్నేహితులను నమ్మకపోవడమూ ఎంతటి వాణ్ణిఅయినా నాశనముచేసివేస్తవి. మహర్షులను ఘోరముగా చంపివేయడమూ సమస్త దేవతలతోనూ కలహించడమూ గర్వమూ కోపమూ బద్ధవైరమూ ఇతరుల మేలు ఓర్చకపోవడమూ - ఈ దోషాలు జీవితాన్ని ఐశ్వర్యాన్ని నాశనముచేసివేస్తవి. ఈ దోష గుణాలు అన్నీ మేఘాలు పర్వతాన్ని ఆవరించినట్టు మీ తండ్రి అయిన మా అన్నను ఆవరించినవి. అందువల్లనే నేను మా అన్నను వదిలిపెట్టినాను. ఇకను ఈ లంకాపట్టణము ఉండదు. నీవు ఉండవు. నీ తండ్రి ఉండడు.

"ఓ రాక్షసుడా, నీవు గర్విష్ఠివి. దుష్టబుద్ధివి. నీవు ఏమీ తెలియని మూర్ఖుడవు. నీవు కాలపాశబద్ధుడవు కాబోతున్నావు. ఇంకా ఏమేమి నన్ను అనవలెను అనుకొంటున్నావో అవి అన్నీ అను. వింటాను. నీకు దుఃఖసమయము సంప్రాప్తము కాబోతున్నది. నీవు ఇక నికుంభిలా దేవతాలయానికి పోయేది లేదు. రామలక్ష్మణులను తిరస్కరించిన నీవు ఇక బ్రతికిఉండడము ఉత్తది. యుద్ధరంగములో ఈ లక్ష్మణుడితో పోరాడి చచ్చి యమలోకానికి పోతావు. అక్కడ యమదూతలు ఆజ్ఞాపించే పనులు అన్నీ చేస్తూఉండు. ఇప్పుడు నీ బలము అంతా చూపించు. సర్వాయుధాలూ వ్యయపెట్టు. లక్ష్మణుడు వదిలే బాణాలకు నీవూ నీ సైన్యమూ బ్రతికి ఉండడము ఉత్తది" అని చెప్పినాడు.

౮౮

అన్ని వైపులా చక్కగా అలంకరించిన నల్లటి నాల్గు గుఱ్ఱాల రథముమీద కూర్చున్న యముడివంటి ఆ ఇంద్రజిత్తు విభీషణుడి మాటలకు ఒళ్లు ఎరగని కోపము వచ్చి పొడుగాటి ఖడ్గాన్ని ఎత్తినాడు. విభీషణుడికి ఎదురుగుండా ఆ రథముమీద పోయినాడు. ఆ బలవంతుడు ఇంద్రజిత్తు అప్పుడు అక్కడ హనుమంతుడి మూపున ఉదయ పర్వతముమీద ఉదయించిన సూర్యుడివలె తేజరిల్లుతూ ఉన్న శత్రు సంహారకుణ్ణి లక్ష్మణుణ్ణి చూచినాడు. విభీషణుణ్ణి తిట్టినాడు. ఖడ్గాన్ని వదిలిపెట్టి పెద్ద పొడుగాటి వింటిని తీసుకొన్నాడు. ఆ విల్లు దృఢము అయింది. తీవ్రము అయింది. భయంకరము అయిన ఆ ధనుస్సు పట్టుకొని శత్రువులను సంహరించివేసే బాణాలకోసము వెతికినాడు.

అంతట ఆ లక్ష్మణుణ్ణి విభీషణుణ్ణి వానరులనూ చూచి వేగిర పాటుతో "ఇదిగో నా పరాక్రమము చూపిస్తాను. ఆకాశమునుంచి ఎడతెగకుండా కురిసే వర్షమువలె ఈ యుద్ధభూమిలో ఇప్పుడు నా కార్ముకములోనుంచి కురిపించే బాణవర్షాన్ని తప్పించుకోండి. అగ్ని హోత్రము దూది ఉండలనువలె నా ధనుస్సులోనుంచి వెలువడే బాణాలు మీ దేహాలను దహించివేస్తవి. శూలాయుధాలూ శక్త్యాయుధాలూ దండాయుధాలూ తీక్ష్ణబాణాలూ మిమ్ములను చీల్చివేసి యమసదనానికి తీసుకొనిపోతవి. నేను కురిపించే బాణ వర్షానికి నిలువకలవాడు ఎవడు.

"ఓ లక్ష్మణుడా, నేను ఇదివరకు రాత్రియుద్ధములో వజ్రాయుధమువంటి బాణాలనూ పిడుగులవంటి బాణాలనూ మీ అన్నదమ్ములమీద వదిలినాను. మీరు అప్పుడు మీ వెంట ఉన్న వారితో కూడా ఒళ్లు తెలియకుండా నేలమీద పడిపోయినారు. అది నీకు జ్ఞాపకము ఉందో లేదో - కాక యమసదనానికి పోవలెనను అనుకొంటున్నావు ఏమో. కుపితవిషసర్పమువంటి నాతో పోరాటానికి నిలుచున్నావు" అని ఇంద్రజిత్తు చెప్పినాడు.

ఇట్లా చెప్పిన ఇంద్రజిత్తును చూచి లక్ష్మణుడు "ఓ రాక్షసుడా, నీవు చేయలేని పనులను చేసేటట్టు చెప్పుతున్నావు.

కార్యసిద్ధికోసము ప్రయత్నముచేసేవాడు ఎవడూ ఇట్లా నీవలె మాట్లాడడు. ఓ దుర్మతీ, నీవే కాదు. మరి ఎవడూ నన్ను జయించలేడు. నీవు జయిస్తాను అని చెప్పుతూ జయించినట్టే సంతోషపడుతున్నావు. ఆనాడు రాత్రి నీవు అంతర్ధానము అయి పోయి మమ్ములను కొట్టినావు. దొంగలు చేసేపని నీవు చేసినావు. వీరులు ఎవరూ అట్లా చేయరు. ఓరాక్షసుడా, నేను ఇప్పుడు నీబాణ పథములోనే ఉన్నాను. ఆ నీ పరాక్రమము ఇప్పుడు చూపించు. నోటిమాటలతో ప్రయోజనములేదు" అని చెప్పినాడు.

ఇట్లా లక్ష్మణుడు చెప్పుతూ ఉండగానే ఆ మహాబలవంతుడు ఇంద్రజిత్తు భయంకరముఅయిన తన ధనుస్సును సారించి కరుకుబాణాలను లక్ష్మణుడిమీద వదిలినాడు. ఆ బాణాలు విషసర్పాలవలె బుసలు కొట్టుతూ అమిత వేగముతో పోయి లక్ష్మణుడిమీద పడ్డవి. ఆ వేగవంతుడు ఇంద్రజిత్తు అంతటితో వదిలిపెట్టకుండా మహా వేగముగా పోయే మరికొన్ని బాణాలను మళ్ళీ లక్ష్మణుడిమీద వదిలినాడు. దేహము అంతటా బాణాలు గుచ్చుకొని నెత్తురుతో తడిసి ఆ కాంతిమంతుడు లక్ష్మణుడు అప్పుడు పొగలులేని అగ్నిహోత్రుడువలె తేజరిల్లినాడు.

ఇంద్రజిత్తు అంతట సంతోషముతో పెద్దపెట్టున సింహనాదము చేసి లక్ష్మణుణ్ణి చూచి " ఓ లక్ష్మణుడా, ఇక రెక్కలుకట్టిన తీక్ష్ణ బాణాలు నావింటినుంచి బయిలుదేరి వస్తవి. అవి నీప్రాణాలు తీసి వేస్తవి. నీదేహాన్ని డేగలూ గద్దలూ నక్కలూ తింటవి. ఓ దుష్టుడా, ఓక్షత్రియాధముడా, ఓరామభక్తుడా, నిన్ను నేను చంపివేయడము ఆ పరమ దుర్మతి రాముడికి తెలుస్తుంది. నీ ప్రాణముపోగానే నీశిరస్సును నేను ఎత్తుకొని పోతాను. నీచేతిలో విల్లు కిందపడి నీ కవచము చిరిగిపోయి నేలమీద పడిఉండే నీమొండెన్ని నీ అన్న రాముడు చూస్తాడు" అని వేగిరపాటుతో చెప్పుతూఉంటే లక్ష్మణుడు యుక్తియుక్తముగానూ మహార్థముగానూ " ఓ రాక్షసుడా, మాటలబింకము వదలిపెట్టు. నీవు క్రూరకర్ముడవే. నాకు తెలుసు. మాటలు ఎందుకు! పనిచేసి చూపించు. ఊరక ఎందుకు నిన్ను నీవు పొగడుకొంటావు. నేను నీ మాటలు నమ్మేట్టు

పనిచేసి చూపించు" అని చెప్పుతూ మహావేగముతో పోయే తీక్ష్ణ బాణాలను అయిదింటిని తన వింటికి ఎక్కించి అల్లెత్రాటిని తన చెంపవరకూ లాగి ఇంద్రజిత్తు వక్షఃస్థలాన్ని గురిచేసి వదలినాడు. చక్కనిరెక్కలతో ఉన్న పాములవంటి ఆ బాణాలు మంటలు మండుతూ పోయి ఇంద్రజిత్తు వక్షఃస్థలముమీద పడి సూర్యకిరణాల వలె శోభించినవి. లక్ష్మణుడు వదలిన ఆ బాణాల దెబ్బకు ఇంద్రజిత్తు కుపితుడు అయిపోయి మూడు బాణాలను లక్ష్మణుడిమీద వదలినాడు.

అప్పుడు ఆ రాక్షసశ్రేష్ఠుడు ఇంద్రజిత్తూ మానవశ్రేష్ఠుడు లక్ష్మణుడూ పరస్పరజయేచ్ఛతో పరమ భయంకరముగానూ దారుణముగానూ పోరాటము సాగించినారు. వారు ఉభయులూ మహాబలసంపన్నులు. పరమ పరాక్రమవంతులు. సర్వశస్త్రాస్త్ర కోవిదులు. జయించ నలవికాని శూరులు. అసమాన తేజోవంతులు. ఆ వీరులు ఉభయులూ ఆకాశములో గ్రహాలవలె అప్పుడు పోరాటము సాగించినారు.

దేవేంద్రుడూ వృత్రాసురుడూవలె పోరాడినారు. ఆ మహా పరాక్రమవంతులు ఉభయులూ పోరాడుతున్న రెండు సింహాలవలె కనిపించినారు. ఆ మానవోత్తముడు లక్ష్మణుడూ ఆ రాక్ష సోత్తముడు ఇంద్రజిత్తూ సంతోషముగా ఒకరిమీద ఒకరు ఎన్నో బాణాలను వదులుకొన్నారు. మహామేఘాలవలె ఉభయులూ బాణవర్షము కురిపించినారు.

భయంకరము అయిన ధనుస్సులూ బాణాలూ ఖడ్గాలూ మొదలుఅయినవి ధరించిన ఆ మహాబలవంతులు ఆ యుద్ధకో విదులు ఇంద్రజిల్లక్ష్మణులు ఒకరికన్నా ఒకరు విజృంభించి ఆ మహాయుద్ధములో అనేకమార్లు శంబరాసుర దేవేంద్రులవలె కొట్టుకొన్నారు.

౮౯

అంతట ఆ శత్రుసంహారకుడు లక్ష్మణుడు పాముబుసలవలె నిట్టూర్పులు విడుస్తూ తన వింట బాణాన్ని సంధించి ఇంద్రజిత్తు

మీద వదలడానికి అల్లెత్రాటిని మోగించినాడు. ఆ ధనుష్టంకార ధ్వని వింటూఉండగా ఇంద్రజిత్తు ముఖము వివర్ణము అయిపోవడము విభీషణుడు చూచి లక్ష్మణుడితో "ఓ మహాబాహూ, ఇప్పుడు ఇంద్రజిత్తు ముఖము వెలవెల పోవడమూ మొదలుఅయిన అపశకునాలను చూస్తూఉంటే వీడు నీచేతిలో ఇప్పుడే చచ్చిపోతాడు అని తోస్తూఉంది. సందేహములేదు. నీవు తొందరపడు" అని చెప్పినాడు.

లక్ష్మణుడు అంతట అగ్నిహోత్రశిఖలవంటిన్ని తీక్ష్ణ విషసర్పాలవంటిన్ని బాణాలను వింట సంధించి ఇంద్రజిత్తుమీద వదలినాడు. అవి దేవేంద్రుడి వజ్రాయుధమువలె పోయి ఇంద్రజిత్తుమీద పడ్డవి. ఆ బాణాలదెబ్బకు అతడి సర్వేంద్రియాలూ కంపించి పోయినవి. ఒక ముహూర్తము సేపటివరకూ తేరుకోలేకపోయినాడు. తేరుకోగానే ఎదుటఉన్న వీరుణ్ణి లక్ష్మణుణ్ణి చూచినాడు. కోపముతో కన్నులు ఎర్రచేసి ఏడు బాణాలను లక్ష్మణుడిమీదనూ మరి పదిబాణాలను హనుమంతుడిమీదనూ వదలినాడు. అంతట ఆ మహాపరాక్రమవంతుడు ఇంద్రజిత్తు రెట్టింపుకోపముతో విభీషణుణ్ణి గురిచేసి నూరుబాణాలు వదిలినాడు. ఇంద్రజిత్తు వదిలిన ఆ బాణాలను ఏమాత్రమూ లక్ష్యపెట్టకుండా లక్ష్మణుడు నవ్వుతూ "ఓ రాక్షసుడా, నీ బాణాలు కొంచెముఅయినా పనిచేయలేదు" అని చెప్పుతూ భయంకరము అయిన బాణాలను ఇంద్రజిత్తుమీద వదిలిపెట్టి "ఓ నిశాచరుడా, యుద్ధము చేసే శూరులు నీవు వదిలినటువంటి చౌకపాటు బాణాలు వదలరు. నీ బాణాలు మమ్ములను కొంచెముఅయినా బాధ పెట్టలేదు. నేను హాయిగా ఉన్నాను. జయము కాంక్షించే శూరులు ఇట్లా నీవలె పోరాడరు" అని చెప్పుతూ బాణవర్షము కురిపించినాడు.

అప్పుడు ఆ బాణాలదెబ్బకు ఇంద్రజిత్తు హేమభూషితకవచము తునకలు తునకలు అయిపోయింది. ఆకాశమునుంచి నక్షత్రాలవలె ఆ రథము సమీపాన నేలమీద ఆ కవచము తునకలు రాలినవి. బాణాలు గుచ్చుకొని అతని దేహము అంతటా గాయాలు అయినవి. అట్లా ఒంటినిండా గాయాలు అయినప్పటికిన్ని ఆ ఇంద్రజిత్తు

పర్వతమువలె అచలముగా నిలుచుని లక్ష్మణుణ్ణి గురిచేసి వెయ్యి బాణాలు వదిలినాడు. ఆ భయంకరపరాక్రముడి బాణాలకు లక్ష్మణుని కవచము ముక్కలు ముక్కలు అయిపోయింది. అంతటితో ఒకరు చేసినదానికి ఒకరు బదులు చేసినట్టు అయిపోయింది. బాణాలు గుచ్చుకొని ఉభయుల దేహాలూ గాయాలు అయినవి. ఉభయులూ నెత్తురుతో తడిసిపోయినారు. ఉభయులూ నిట్టూర్పులు విడుస్తూ పదేపదే దొమ్మిగా పోరాటము సాగించినారు.

ఆ మహాపరాక్రమవంతులు ఆ రణకర్మవిశారదులు ఆ శూరులు ఇంద్రజిల్లక్ష్మణులు. ఎంతోసేపు ఒకరిమీద ఒకరు బాణాలు వదులుకొన్నారు. కవచాలు తెగిపోయినప్పటికిన్నీ వారివారి దేహాలనుంచి నెత్తురు కొండవాగులవలె పారుతూ ఉన్నప్పటికిన్నీ ఒకరిని ఒకరు జయించవలెను అనే ప్రయత్నము మానుకోకుండా పోరాడసాగినారు. ఆకాశములో ఉరుములు ఉరుముతూ సంతతధారలు వర్షించే మేఘాలవలె మహాభయంకరధ్వనులతో ఒకరిపయిన ఒకరు బాణవర్షము కురిపించుకొన్నారు. అప్పుడు ఎంత పొద్దుపోయిందీ ఆ వీరులకు ఉభయులకూ తెలియలేదు. వారికి విసుగత్తలేదు. వారు అలసిపోలేదు. తమ తమ అస్త్రవిద్యానైపుణ్యము చూపించుకొంటూ వివిధాకారాలతో ఉన్న బాణాలు వదులుకొంటూ ఆకాశము కనపడకుండా పోయేట్టు చేసినారు. ఆ ఉభయులూ వదిలిన బాణాలలో ఒక్కటి అయినా వ్యర్థము అయిపోలేదు. అద్భుతముగా అమితవేగముతో ఒకరిమీద ఒకరు బాణాలు వేసుకొంటూ భయంకరముగా దొమ్మిగా పోరాడినారు. వారి వారి జ్యాధ్వనులు వేరేవేరే పిడుగులవలె వినిపించినవి. అందుకు ఉభయ పక్షాల యోధులూ భయభ్రాంతులు అయిపోయినారు. ఆకాశములో మేఘగర్జనలవలె వారు పోరాడుతూ గర్జించినారు. బంగారు పింజల బాణాలు గుచ్చుకొన్న గాయాలలోనుంచి నెత్తురు ఏరులుఅయి పారింది. ఆ బంగారు పింజల బాణాలు ఆ వీరుల దేహాలలో చొరబడి నెత్తురుతో తడిసి వెలుపలికి వచ్చి నేలమీద పడిపోయినవి. కొన్ని బాణాలు తీక్ష్ణాయుధాలతో కలసి ఆకాశానికి పోయి చేరినవి. మరి కొన్ని బాణాలు తక్కిన బాణాలను విరుగగొట్టినవి.

ఆ యుద్ధము భయంకరముగా జరిగినది. ఆ వీరులు ఉభయులూ వదిలిన బాణాలరాశులు యజ్ఞములో ప్రజ్వలిస్తూఉన్న గార్హపత్యమూ ఆహవనీయమూ అనే రెండు అగ్నిహోత్రాలతో చేరిన కళరాశులవలె కనిపించినవి. దేహమునిండా గాయాలు అయిన ఆ మహాధైర్యవంతులు ఉభయులూ ఆకులు అన్నీ రాలిపోయి పూలు మాత్రమే పూసిఉన్న బూరుగుచెట్లవలెనూ మోదుగుచెట్లవలెనూ కనిపించినారు.

ఒకరిని ఒకరు వధించివేయవలెను అనుకొని ఆ ఇంద్రజిల్లక్ష్మణులు ఉభయులూ పదేపదే భయంకరముగానూ దొమ్మిగానూ పోరాడినారు. లక్ష్మణుడు ఇంద్రజిత్తునూ ఇంద్రజిత్తు లక్ష్మణుణ్ణి ఎన్నిసార్లు ఎన్నివిధాల కొట్టినా వారిలో ఏఒక్కరికీ అలుపు రాలేదు దేహాలలో గట్టిగా దిగపడిపోయిన బాణాలతో ఉన్న ఆ బలవంతులు ఆ మహాపరాక్రమవంతులు ఉభయులూ చెట్లుమొలిచిన రెండు పర్వతాలవలె కనిపించినారు. అవయవాలు అన్నీ నెత్తురుతో తడిసిపోయినందువల్ల వారు ఉభయులూ ప్రజ్వలిస్తూ ఉన్న రెండు అగ్నిహోత్రాలవలె కనిపించినారు.

మహాపరాక్రమవంతుడు అయిన విభీషణుడు లక్ష్మణుడి అలుపు పోగొట్టడానికీ మేలు చేయడానికీ అప్పుడు ఆ యుద్ధరంగములోకి వచ్చి నిలుచున్నాడు.

౯౦

ఆ యుద్ధభూమిలో ఒకరిని ఒకరు వధించివేయవలెను అనుకొని మదపుటేనుగులవలె పోరాడుతూ ఉన్న లక్ష్మణుణ్ణి ఇంద్రజిత్తునూ విభీషణుడు చూచినాడు. అంతట ఆ బలవంతుడు ఆ శూరుడు రావణాసురుడి తమ్ముడు యుద్ధరంగములోకి పోయి నిలుచున్నాడు. తన మహాచ్చాపము తీసుకొని టంకారము చేసినాడు. కరకకొనలతో ఉన్న గొప్ప గొప్ప బాణాలను రాక్షసుల మీద వదిలినాడు. ఆ బాణాలు అగ్నిహోత్రమువలె మంటలు మండుతూ పోయి ఆ రాక్షససైన్యముమీద అన్నివైపులా పడ్డవి. పిడుగులుపడి పర్వతాలు పగిలిపోయేటట్లు ఆ బాణాలు పడి

రాక్షసులు అనేకమంది ఛిన్నాభిన్నము అయి కూలిపోయినారు. విభీషణుడు అట్లా బాణాలు వదులుతూఉంటే అతడి నలుగురు అనుచరులున్నూ అప్పుడు శూలాలతోనూ ఖడ్గాలతోనూ పట్టిసాల తోనూ పోరాటము సాగించి రాక్షసవీరులను ఛేదించినారు.

మదపుటేనుగుగున్నలమధ్య ఉన్న పెద్ద మదపుటేనుగువలె తన అనుచరులమధ్యను ఉన్న విభీషణుడు ఎప్పుడు ఏది చేయ వలెనో తెలిసినవాడు కనుక రాక్షసులతో యుద్ధము చేయడానికి ఎప్పుడూ సంతోషపడే వానరులను అప్పుడు పురికొల్ప తలచుకొని వానరవీరులను చూచి "ఓ వీరులారా, ఇప్పుడు రాక్షసరాజు రావణాసురుడి సైన్యములో మిగిలిఉన్న వీరుడు ఈ ఇంద్రజిత్తు ఒక్కడే. ఇప్పుడు వీడు ఒక్కడే ఆ రావణాసురుడికి గతి. మీరు ఎందుకు ఊరక నిలుచున్నారు? ఈ రణరంగములో ఈ పాపిష్ఠి వాడు చచ్చిపోయేట్లయితే రావణాసురుడి మిగతా బలము అంతా చచ్చిపోయినట్లే. ఇకను అప్పుడు రావణాసురుడు ఒక్కడే మిగులు తాడు. మహావీరుణ్ణి ప్రహస్తుణ్ణి మీరు చంపివేసినారు. మహా బలవంతుడు అయిన నికుంభుణ్ణి మీరు చంపివేసినారు. కుంభ కర్ణుడు అంతటివాడు హతుడు అయిపోయినాడు. కుంభుడూ ధూమ్రా క్షుడూ జంబుమాలీ మహామాలీ తీక్ష్ణవేగుడూ అశనిప్రభుడూ సుప్తఘ్నుడూ యజ్ఞకోపుడూ వజ్రదంష్ట్రుడూ సంహ్రాదీ వికటుడూ నిఘ్నుడూ తపనుడూ దముడూ ప్రఘసుడూ ప్రజంఘుడూ జంఘుడూ చచ్చిపోయినారు. వారే కాదు. దుర్ధర్షుడు అయిన అగ్ని కేతువూ పరాక్రమవంతుడు అయిన రశ్మికేతువూ విద్యుజ్జిహ్వుడూ ద్విజిహ్వుడూ సూర్యశత్రువూ అకంపనుడూ సుపార్శ్వుడూ చక్ర మాలీ కంపనుడూ దేవాంతకనరాంతకులూ చచ్చిపోయినారు.

"ఓ వానరులారా, మీరు ఇంకా ఎంతోమంది రాక్షస యోధులను సంహారము చేసివేసినారు. చేతులతో సముద్రాన్ని దాటివచ్చిన మీకు ఈ ఇంద్రజిత్తుసైన్యాన్ని సంహరించడము గోష్పాదము దాటిపోవడము వంటిది. బలదర్పితులైన రాక్షస వీరులను అందరినీ మీరు సంహారము చేసివేసినారు. ఇక జయించ వలసినది వీణ్ణి ఒక్కణ్ణే. వీడు ఈ ఇంద్రజిత్తు నా అన్నకొడుకు,

అన్నకొడుకును చంపివేయడము మంచిపని కాదు. కాని రామ
కార్యార్థము ఏమాత్రమూ దయతలచకుండా వీణ్ణి నేను చంపి
వేయగలను. అయితే వీణ్ణి చంపివేయవలెను అని నేను అను
కొన్నప్పుడల్లా నా కన్నులనిండా నీళ్లు కమ్ముకొని నన్ను అడ్డ
గిస్తున్నవి. లక్ష్మణుడు ఎట్లాగూ వీణ్ణి సంహారము చేసివేస్తాడు.
ఇప్పుడు మీరు అందరూ ఏకమై ఈ ఇంద్రజిత్తుచుట్టూ ఉన్న
సైన్యాన్ని నాశనము చేసివేయండి'' అని చెప్పినాడు.

ఇట్లా ఆ యశస్వి విభీషణుడు చెప్పగానే వానరవీరులు
అందరూ తోకలు ఝాడించినారు. మేఘాలను చూచిన నెమళ్ల
వలె మాటిమాటికీ కోలాహలధ్వనులు చేసినారు. అంతట జాంబ
వంతుడు తన భల్లూకసైన్యాలనూ వానరసైన్యాలనూ వెంట
పెట్టుకొని పోయి రాక్షససైన్యాన్ని ఎదిరించినాడు. అప్పుడు వానర
యోధులూ భల్లూకయోధులూ చెట్లతోనూ రాళ్లతోనూ రాక్షస
యోధులను కొట్టినారు. గోళ్లతో రాక్షసయోధులను చీల్చివేసినారు.
కోరలతో కొరికివేసినారు. మహాబలవంతులు అయిన రాక్షస
వీరులు అప్పుడు వివిధాయుధాలతోనూ భల్లూకనాథుణ్ణి జాంబ
వంతుణ్ణి ఎదిరించినారు. అప్పుడు రాక్షసవీరులు ఆ జాంబవంతుడి
మీద బాణాలు వదిలినారు. తక్కిన రాక్షసయోధులు కరకు
గొడ్డళ్లతోనూ అడ్డకత్తులతోనూ యష్టులతోనూ చిల్లకోలలతోనూ
వానరయోధులమీద పడ్డారు. క్రుద్ధులు అయిన దేవాసురులవలె
అప్పుడు వానర రాక్షస యోధులు భయంకరముగానూ దొమ్మి
గాను యుద్ధము చేసినారు. మహాపరాక్రమవంతుడు హనుమంతుడు
అప్పుడు తన మూపులమీదినుంచి లక్ష్మణుణ్ణి దింపి మహోగ్రుడు
అయిపోయి ఒక సాలవృక్షాన్ని పెళ్ళగించి పట్టుకొని వేలకువేల
రాక్షసయోధులతో పరమభయంకరముగా పోరాడి పడగొట్టినాడు.

అప్పుడు ఇంద్రజిత్తు తనతో దొమ్మిగా పోరాడుతూ ఉన్న
తన పినతండ్రి విభీషణుణ్ణి వదలిపెట్టి మళ్లీ లక్ష్మణుడిమీదికి
పరుగెత్తినాడు. అప్పుడు ఆ వీరులు ఉభయులూ ఒకరిమీద ఒకరు
బాణవర్షము కురిపించుకొన్నారు. ఆ మహాబలవంతులు ఆ మహా
వేగవంతులు వర్షాకాలములో మేఘాలు ఆవరించిన సూర్యచంద్రుల

వలె బాణాలు కమ్ముకొన్నందువల్ల ఆ వీరులు ఒకరికి ఒకరు కనిపించకుండా పోరాడినారు. అప్పుడు ఆ పోరాటములో ఇంద్రజిత్తుకానీ లక్ష్మణుడుకానీ వింటిని ఎట్లా పట్టుకొన్నదీ అమ్ముల పొదిలోనుంచి బాణాలు ఎట్లా తీసిందీ ఆ బాణాలను ఎట్లా వింటికి ఎక్కించిందీ ఎవరికీ కనపడలేదు. ఎక్కుపెట్టడమూ, గురి చూడడమూ, చెవివరకూ నారి లాగడమూ మొదలైనవి ఎప్పుడు చేసిందీ ఎవరి కన్నులకూ కనపడలేదు. కాని వారి వారి ధనుస్సులలో నుంచి వెలువడిన బాణాలు ఆకాశాన్ని కమ్ముకొన్నందువల్ల కింద నేల మీద ఏవస్తువూ కనిపించకుండాపోవడముమాత్రము అందరికీ తెలుసు. ఇంద్రజిత్తు లక్ష్మణుడిమీదికీ లక్ష్మణుడు ఇంద్రజిత్తుమీదికీ పోయి మహోగ్రముగా కొట్టుకొంటూఉంటే ఎవరిని ఎవరు జయిస్తారో ఎవరూ నిర్ణయించలేకపోయినారు. వారు ఉభయులూ వదిలిన బాణాలు ఆకాశము అంతాటా సందులేకుండా కమ్ముకొని చీకటి అయిపోయింది. దిక్కులూ విదిక్కులూ తెలియకుండా వారు వదిలిన బాణాలతో నిండిపోయినవి. సూర్యుడు అస్తమిస్తే చీకట్లు కమ్ముకొన్నట్లుగా అయిపోయింది. అప్పుడు నెత్తురు వెల్లువలై ప్రవహించింది. మాంసము తినే క్రూరజంతువులూ భయంకరమైన పక్షులూ ఘోరముగా అరిచినవి. గాలి వీచడము ఆగిపోయింది. అగ్నిహోత్రము జ్వలించడము మానివేసింది. "యుద్ధము లేకుండా సమస్తలోకాలూ సుఖముగా ఉండవలెను" అని అప్పుడు మహర్షులు ఆశీర్వదించినారు. ఆ యుద్ధము చూడడానికి అక్కడికి వచ్చిన గంధర్వులూ చారణులూ ఆ ఘోరసంగ్రామము చూచి పారిపోయినారు.

ఆ రాక్షససింహుడు ఇంద్రజిత్తు రథానికి బంగారు ఆభరణాలతో పూన్చిన నాలుగు నల్లటిగుర్రాలను గురిచేసి లక్ష్మణుడు అప్పుడు నాలుగు బాణాలు వదిలినాడు. చక్కని రెక్కలతో తెల్లగా తళతళలాడుతూఉన్న కత్తివాయి అమ్మును తీసి వింటికెక్కించి చెవివరకూ లాగి దేవేంద్రుడు వదిలే పిడుగువంటి జ్యాతల నాదముతో ఇంద్రజిత్తురథసారథిమీద వదిలినాడు. అప్పుడు పిడుగువంటి ఆ బాణము ఆ రథాన్ని చిత్రవిచిత్రగతులతో తోలుతూఉన్న

ఆ రథసారథికంఠాన్ని దేహమునుంచి ఉత్తరించివేసింది. రథసారథి అట్లా హతుడైపోగానే ఆ మహాపరాక్రమవంతుడు ఇంద్రజిత్తు స్వయముగా రథసారథ్యము చేసుకొంటూ మళ్ళీ ధనుస్సు అందుకొన్నాడు. ఆ ఇంద్రజిత్తు అత్యద్భుతసామర్థ్యానికి ఆశ్చర్యపోతూ అతని చేతులు రథసారథ్యము చేస్తూఉండడము చూచి లక్ష్మణుడు ఆ రథానికి పూన్చిన గుర్రాలమీద నిశితబాణాలను వదిలినాడు. ఇంద్రజిత్తు ధనుస్సు అందుకోగానే లక్ష్మణుడు ఆ గుర్రాలమీద మళ్ళీ బాణాలు వదిలినాడు. తనలోపాన్ని లక్ష్యపెట్టకుండా నిర్భయముగా రథముమీద తిరుగుతూఉన్న ఇంద్రజిత్తుమీద లక్ష్మణుడు అప్పుడు అమితవేగముతో బాణవర్షము కురిపించినాడు. ఆ పోరాటములో తన సారథి చచ్చిపోవడమూ తానే రథము తోలుకొంటూ ఉండడమూ చూచి లక్ష్మణుడు బాణవర్షము కురిపించినందుకు ఇంద్రజిత్తుకు యుద్ధగర్వము వదిలిపోయింది. విషణ్ణుడు అయిపోయినాడు.

వానరవీరులు అందరూ ఇంద్రజిత్తు విషణ్ణవదనము చూచి పరమ సంతోషముతో లక్ష్మణుణ్ణి కొనియాడినారు. అప్పుడు ప్రమాథీ, శరభుడూ, రభసుడూ, గంధమాదనుడూ అనే నలుగురు వానరవీరులు పరాక్రమించినారు. ఆ భయంకర పరాక్రములు నలుగురు వానరవీరులూ ఎగిరిపోయి ఇంద్రజిత్తు రథానికి కట్టిన నాలుగు గుర్రాలమీదనూ పడ్డారు. పర్వతాలవంటి ఆ నలుగురు వానరవీరులు వచ్చి పైన పడడముతో ఆ నాలుగు గుర్రాలు నోళ్ళు తెరచి నెత్తురు కక్కినవి. అవి వాళ్ళతాకిడికి తట్టుకోలేక ప్రాణాలు వదిలి నేల కూలినవి. ఆ గుర్రాలను చంపివేయడముతో తృప్తిచెందక ఆ నలుగురు వానరవీరులు ఆ ఇంద్రజిత్తు మహారథాన్ని విరుగకొట్టి అమితవేగముతో ఎగిరిపోయి లక్ష్మణుడి ప్రక్కను నిలుచున్నారు.

సారథీ, గుర్రాలూ చచ్చిపోవడముతో ఇంద్రజిత్తు రథమునుంచి కిందికి దిగి బాణవర్షము కురిపిస్తూన్న లక్ష్మణుడికి ఎదురుగుండా పరుగెత్తినాడు. బాణాలు వదలుతూ ఉన్న తనమీదికి అట్లా పదాతి అయి పరుగెత్తుకొని వస్తూఉన్న ఆ ఇంద్రజిత్తుమీద దేవేంద్రుడివంటి ఆ పరమ పరాక్రమవంతుడు లక్ష్మణుడు నిశితబాణాలను సూటిగా వదిలి నిలుచుండబెట్టినాడు.

౫౧

ఆ మహాపరాక్రమవంతుడు ఇంద్రజిత్తు విరథుడు అయిపోయి నేలమీద నిలుచున్నాడు. మహోగ్రుడు అయి పరాక్రమముతో జ్వలించినాడు. అప్పుడు ఆ ధనుర్ధరులు ఇంద్రజిత్తూ, లక్ష్మణుడూ, ఒకరిని ఒకరు జయించవలెను అని అనుకొన్నారు. మహారణ్యములో మదపుటేనుగులవలె అంతట ఆ వీరులు ఒకరిని ఒకరు ఎదుర్కొన్నారు. అప్పుడు తమ తమ నాయకులతోపాటు అటు రాక్షసయోధులూ ఇటు వానరయోధులూ కలియపడి పోరాటము సాగించినారు. అన్ని వైపులా అన్యోన్యమూ చంపివేసుకోవడము మొదలుపెట్టినారు.

అప్పుడు ఇంద్రజిత్తు తన రాక్షసయోధులను అందరినీ చూచి పొగడి సంతోషపెట్టి "ఓ రాక్షసవీరులారా, ఇప్పుడు దిక్కులన్నీ చీకట్లు అలముకొన్నవి. ఈ యుద్ధభూమిలో ఇపుడు తనవారు ఎవ్వరో పరాయివారు ఎవ్వరో ఎవరికీ తెలియడము లేదు. ఇప్పుడు మీరు అందరూ వానరయోధులను మభ్యపెట్టవలెను. అందుకు మీరు అందరూ ధైర్యముతో పోరాటము సాగించవలెను. మీరు భయంకరముగా పోరాటము సాగిస్తూఉంటే నేను ఇట్టే లంకా పట్టణానికిపోయి మరిఒక రథముమీద తిరిగివచ్చి యుద్ధముచేస్తాను. నేను లంకాపట్టణము పోవడము వానరులకు ఎవరికీ తెలియనీయకుండా ఉండేట్లు మీరు పోరాటము సాగించవలెను. ఏమాత్రము తెలిసినా ఆ దురాత్ములు నాకు అడ్డము తగులుతారు. అందువల్ల మీరు ఎట్లా పోరాటం సాగిస్తే వాళ్లు నాకు అడ్డము రాకుండా యుంటారో అట్లా మీరు వానరయోధులతో పోరాడుతూ ఉండవలెను" అని చెప్పినాడు.

అంతట ఆ శత్రుహంత ఇంద్రజిత్తు వానరవీరులను మభ్యపెట్టి రథముకోసము లంకాపట్టణానికి పోయినాడు. అక్కడ బంగారు రథానికి ఉత్తమాశ్వాలను పూన్చి చక్కగా అలంకరించినారు. ఆ రథమునిండా వందలకొద్దీ ఈటెలూ ఖడ్గాలూ విండ్లూ మొదలైన ఆయుధాలు అమర్చినారు. అశ్వహృదయము తెలిసి రథికుడికి మేలయ్యేట్లు పోనిచ్చే సారథి ఆ రథము తోలడానికి కూర్చున్నాడు. మనోజ్ఞమైన ఆ మహారథముమీద ఆ మహాపరాక్రమవంతుడు ఆ

జయశీలి ఇంద్రజిత్తు ఎక్కినాడు. అంతట రాక్షసగణాలను వెంట పెట్టుకొని అమిత వేగముతో లంకాపట్టణమునుంచి బయలుదేరి లక్ష్మణ విభీషణులమీదికి పోయినాడు.

యుద్ధభూమిలో ఉన్నట్లే ఉండి తమకు ఎవరికీ ఏమాత్రమూ తెలియకుండా లంకాపట్టణానికి పోయి అంత తొందరగా రథము ఎక్కి వచ్చిన ఆ ఇంద్రజిత్తును చూచి లక్ష్మణుడూ విభీషణుడూ వానరవీరులూ ఆశ్చర్యపోయినారు. ఆ ఇంద్రజిత్తు లాఘవానికి వారు అందరూ చకితులు అయిపోయినారు.

అంతట ఇంద్రజిత్తు బాణవర్షము కురిపిస్తూ వందలకొద్దీ వేలకొద్దీ వానరయోధులను పడగొట్టినాడు. అతడు తన ధనుస్సును గుండ్రముగా వంచి రెప్పపాటులో బాణాలు వదిలి ఎంతోమంది వానరవీరులను వధించివేసినాడు. ఆ బాణపాతానికి ఓర్చుకోలేక ఆ భీమపరాక్రములు వానరవీరులు అప్పుడు కష్టకాలములో దేవతలు బ్రహ్మదేవుడిదగ్గరికి పోయేట్లు లక్ష్మణుడిదగ్గరికి పోయి అతని శరణు చొచ్చినారు.

అప్పుడు లక్ష్మణుడు కోపముతో మండిపడుతూ తన హస్తలాఘవాన్ని చూపించటానికి ఒకే ఒక బాణము వదిలి ఇంద్రజిత్తు కార్ముకాన్ని నరికివేసినాడు. అప్పుడు ఇంద్రజిత్తు ఇట్టే మరిఒక ధనుస్సు తీసుకొని ఎక్కుపెట్టుతూఉంటే, లక్ష్మణుడు చూచి ఆ వింటినికూడా మూడు బాణాలు వదిలి విరుగగొట్టినాడు. అంతటితో వదిలిపెట్టకుండా ఆ ఇంద్రజిత్తు వక్షస్థలాన్ని గురిచేసి విషసర్పాల వంటి అయిదు బాణాలను వదిలినాడు. ఆ అయిదు బాణాలూ ధనుస్సులు పోగొట్టుకొన్న ఇంద్రజిత్తు కాయాన్ని భేదించుకొనిపోయి ఎర్రటి పాములవలె నేలమీద పడ్డవి. ఇంద్రజిత్తు తొడుగుకొనిఉన్న కవచము తెగిపోయింది. నోట నెత్తురు కక్కినాడు. కానీ వెంటనే గట్టి అల్లెత్రాడుతో బలవత్తరమైన గొప్ప ధనుస్సు తీసుకొని దేవేంద్రుడు వర్షము కురిపించేటట్టుగా అమిత వేగముతో లక్ష్మణుడిమీద బాణవర్షము కురిపించినాడు. అందుకు ఆ అరిందముడు లక్ష్మణుడు కలవరపడకుండా ఎదిరించనలవికాని ఆ బాణవర్షాన్ని తన బాణాలతో నివారించినాడు. అంతట ఆ మహాపరాక్రమవంతుడు లక్ష్మణుడు

ఏమాత్రమూ సంభ్రమపడకుండా, ఇంద్రజిత్తుమీద బాణాలు వదులుతూ తన పరాక్రమాన్ని అద్భుతముగా చూపించినాడు. అప్పుడు లక్ష్మణుడు క్రుద్ధుడైపోయి ఒక్కొక్క రాక్షసుణ్ణి మూడేసి బాణాలతో పడకొట్టి తన బాణప్రయోగలాఘవాన్ని ప్రదర్శిస్తూ ఇంద్రజిత్తుమీద అనేక బాణాలు వదిలినాడు. ఆ శత్రుహంత ఇంద్రజిత్తు శత్రువుచేతిలో అట్లా దెబ్బతింటూ వెంటనే ధనుస్సు తీసుకొని లక్ష్మణుడిమీద ఎన్నో బాణాలు వదిలినాడు. ఆ ఇంద్రజిత్తు వదిలిన బాణాలన్నీ తనమీద వచ్చిపడేలోపలనే లక్ష్మణుడు తన తీక్ష్ణబాణాలతో వాటిని అన్నిటినీ దారిలోనే విరుగకొట్టినాడు. ఆ ధర్మాత్ముడు ఆ రథికోత్తముడు లక్ష్మణుడు అంతట ఆ ఇంద్రజిత్తు రథసారథిమీద కణుపులువంగిన కత్తివాయిఅమ్ము వదిలినాడు. ఆ అమ్ము పోయి ఆ రథసారథిని పడకొట్టింది. వాడు చచ్చి నేల కూలినాడు. సారథి పడిపోయినప్పటికిన్నీ ఆ రథానికి కట్టిన గుర్రాలు కలవరపడిపోకుండా ఆ రథాన్ని మండలాకారముగా తిప్పుతూ శత్రు బాణాలను తప్పించసాగినవి. అందుకు లక్ష్మణుడు ఆశ్చర్యపోయినాడు. ఉత్తరక్షణాన కోపపరవశుడు అయి ఆ రణరంగములో అందరూ కూడలిపోయ్యేట్లు ఆ గుర్రాలను గురిచేసి బాణాలు వదిలినాడు. ఇంద్రజిత్తు అది సహించలేక తక్షణమే లక్ష్మణుడిమీద పది బాణాలు వదిలినాడు. విషసర్పాలవంటి ఆ వజ్రతుల్యబాణాలు లక్ష్మణుడి కాంచనకవచానికి తాకి కింద పడిపోయినవి. లక్ష్మణుడు తొడుగుకొని ఉన్న ఆ కాంచనకవచము అభేద్యము అని ఇంద్రజిత్తు తెలుసుకొన్నాడు. వెంటనే లక్ష్మణుడి లలాటాన్ని గురిచేసి మంచి బంగారు పింజలతో ఉన్న మూడు బాణాలను వదలినాడు. ఆ మూడు బాణాలు నొసటను గుచ్చుకొని అప్పుడు లక్ష్మణుడు ఆ యుద్ధభూమిలో మూడు శిఖరాల పర్వతమువలె శోభించినాడు.

ఇంద్రజిత్తు వదలిన బాణాలు గుచ్చుకొని బాధపడుతూ ఉన్నప్పటికిన్నీ లక్ష్మణుడు తన వింటి అల్లెత్రాటిని ఆకర్ణాంతము లాగి కుండలాలతో ధగధగ లాడుతూ ఉన్న ఇంద్రజిత్తుమీద అయిదు బాణాలు వదిలినాడు. అప్పుడు ఆ శూరులు ఆ భయంకర పరాక్రములు ఆ మహాబలధనుర్ధరులు లక్ష్మణ ఇంద్రజిత్తులు వివిధ

బాణాలతోనూ ఒకరిని ఒకరు కొట్టుకొన్నారు. ఉభయుల దేహాలూ నెత్తురుతో తడిసిపోయి విరుగపూచిన మోదుగచెట్లవలె కన్పించినారు. ధనుర్ధరులు ఉభయులూ జయించవలెను అని సంకల్పించుకొన్నారు. ఒకరిని ఒకరు ఎదిరించుకొని సమస్తఅవయవాలలోనూ భయంకరము అయిన బాణాలు వదులుకొన్నారు.

అంతట ఇంద్రజిత్తు కోపముతో చెలరేగి ఆ యుద్ధభూమిలో ఉన్న విభీషణుడి ముఖాన మూడు ఇనుపబాణాలు వదిలినాడు. అంతటిలో తృప్తిచెందక వానరయోధపతులు ఒక్కొక్కరిమీద ఒక్కొక్క బాణము వదిలి నొప్పించినాడు.

అప్పుడు ఆ మహాపరాక్రమవంతుడికి విభీషణుడికి మహా చెడ్డ కోపము వచ్చింది. తన గద తీసుకొని ఆ దురాత్ముడి రథానికి కట్టిన గుర్రాలను కొట్టినాడు. ఆ గదదెబ్బలకు ఆ గుర్రాలు చచ్చిపోయినవి. గుర్రాలు పడిపోగానే ఆ మహాపరాక్రమవంతుడు ఇంద్రజిత్తు ఆ రథము దిగినాడు. రథశక్తిని తీసుకొని పినతండ్రిమీద విసిరి వేసినాడు. విభీషణుడిమీద వచ్చి పడబోతూఉన్న ఆ రథశక్తిని లక్ష్మణుడు చూచినాడు. తక్షణమే దాన్ని గురిచేసి తీక్ష్ణ బాణాలు వదిలినాడు. ఆ రథశక్తి ముక్కలు ముక్కలు అయి నేల కూలింది. విభీషణుడికి కోపము వచ్చింది. గట్టి ధనుస్సు తీసుకొన్నాడు. ఇంద్రజిత్తు వక్షస్థలాన్ని గురిచూచి వజ్రమువంటి అయిదు బాణాలు వదిలినాడు. బంగారు పింజలతో ఉన్న ఆ బాణాలు గురి తప్పకుండా సూటిగా పోయి ఇంద్రజిత్తుకాయాన్ని భేదించి నెత్తురుతో తడిసి ఎర్రటి పాములవలె బైటికి వచ్చినవి. ఆ ఇంద్రజిత్తుకు అప్పుడు కోపము వచ్చింది. తన పినతండ్రిని కొట్టి చంపివేయవలెను అనుకొన్నాడు. యముడు తనకు ఇచ్చిన బాణాన్ని తీసుకొని వింటిని ఎక్కించినాడు. ఆ మహాబాణాన్ని ఇంద్రజిత్తు ఎక్కుపెట్టడము లక్ష్మణుడు చూచినాడు. అంతట ఆ మహాతేజోవంతుడు లక్ష్మణుడు దేవేంద్రుడితోకూడా సురాసురులు ఎవ్వరూ తట్టుకోలేని బాణాన్ని తీసుకొన్నాడు. ఆ బాణాన్ని జయించినవారుకానీ ఎదిరించినవారు కానీ అదివరకు ఎవ్వరూ లేరు. మహాధైర్యవంతుడు కుబేరుడు స్వయముగా ఆ బాణాన్ని లక్ష్మణుడికి ఇచ్చినాడు. ఆ బాణాన్ని తన

ధనుస్సులో సంధించినాడు. అంతట అటు ఇంద్రజిత్తు యముడు ఇచ్చిన బాణాన్ని ఇటు లక్ష్మణుడు కుబేరుడు ఇచ్చిన బాణాన్ని తమ తమ ధనుస్సులలో సంధించినారు. ఇనుపగుదియలవంటి తమ తమ బాహువులతో తమ తమ చెవులవరకూ అల్లెత్రాళ్ళను లాగినారు. ఆ అల్లెత్రాళ్లు మ్రోగినవి. ఆ మ్రోతలు క్రౌంచపక్షుల కేకలవలె వినిపించినవి. అప్పుడు ఆ బాణాలు రెండూ కాంతి అతిశయముతో మంటలు మండుతూ ఉన్నట్లు కనిపించినవి. ఆ ఉభయుల ధనుస్సులలోనుంచి వెలువడిన ఆ రెండు బాణాల ధగధగలవల్ల అప్పుడు ఆకాశము భాసించింది. ఆ రెండు బాణాలూ ఒకదాని ముఖము ఒకదానికి తాకింది. ఘోరాకారములో ఉన్న ఆ బాణాలు రెండూ ఒకదాన్ని ఒకటి ఒరుసుకొన్నవి. పొగలు రాజుకొంటూ పెద్దపెద్ద మంటలు రగులుకొంటూ నిప్పుల రవ్వలు రేగినవి. అంతరిక్షములో ఆ రెండు బాణాలూ చిత్రవిచిత్రముగా తిరుగుతూ పోరాడి నేలమీద పడిపోయినవి.

ఆ వీరులు లక్ష్మణేంద్రజిత్తులు ఉభయులూ తమ తమ బాణాలు దెబ్బతిని పడిపోవడము చూచి సిగ్గుపడ్డారు. ఉత్తరక్షణాన ఉభయులకూ కోపము పుట్టుకొని వచ్చింది. వెంటనే లక్ష్మణుడు వారుణాస్త్రము తీసినాడు. దేవేంద్రుడుఅంతటివాణ్ణి జయించిన ఇంద్రజిత్తు అది చూచినాడు. రుద్రదేవతాకము అయిన అస్త్రాన్ని వదిలి ఆ వారుణాస్త్రాన్ని పరమాద్భుతముగా పడగొట్టినాడు. అంతట ఆ జయశీలి ఇంద్రజిత్తు ఈ లోకాన్నిఅంతా సంహారముచేసివేయడానికో ఏమోను అన్నట్లు దేదీప్యమానము అయిన ఆగ్నేయాస్త్రాన్ని తనవింట సంధించినాడు. అదిచూచి లక్ష్మణుడు చటుక్కున సౌరాస్త్రాన్ని వదిలి ఆ ఆగ్నేయాస్త్రాన్ని అడ్డగించినాడు. తన ఆగ్నేయాస్త్రాన్ని అడ్డగించడముచూచి ఇంద్రజిత్తు కోపపరవశుడు అయిపోయి, శత్రువులను అందరినీ ఒక్కసారిగా నాశనముచేయ సంకల్పించుకొని ఆసురాస్త్రాన్ని వదిలినాడు. ఆ ఆసురాస్త్ర ప్రభావమువల్ల అప్పుడు ఇంద్రజిత్తు ధనుస్సులోనుంచి ధగధగలాడుతూ బాణాలూ, ముద్గరాలూ, శూలాలూ, గదలూ, ఖడ్గాలూ, గండ్రగొడ్డళ్ళూ బయలుదేరినవి. ఆ ఆసురాస్త్రాన్ని అదివరకు సర్వ

భూతకోటి అడ్డగించలేకపోయింది. అది సమస్తశత్రువులను నాశనము చేసివేస్తుంది. అది లక్ష్మణుడు చూచినాడు. మహేశ్వరాస్త్రాన్ని వదిలి అన్ని ఆయుధాలతో వెలువడిన ఆ అసురాస్త్రాన్ని పడగొట్టినాడు.

అంతట లక్ష్మణుడూ ఇంద్రజిత్తూ దొమ్మిగా పోరాటము సాగించినారు. ఆ పోరాటము అసదృశముగానూ, అద్భుతముగానూ సాగింది. ఆకాశములో ఉన్న భూతాలు అన్నీ అప్పుడు లక్ష్మణుడి చుట్టూ మూగినవి. అట్లా ఆ వీరులు పోరాడుతూఉంటే మహాభైరవస్వనాలతో ఇటు వానరయోధులూ, అటు రాక్షసయోధులూ, భయంకరము అయిన యుద్ధము చేసినారు. అప్పుడు సమస్త భూతకోటి అక్కడ ఆకాశములో సమావేశము అయింది. దేవేంద్రుడివెంట దేవతలూ, పితృదేవతలూ, గంధర్వులూ, గరుడులూ, ఉరగులూ, పరమర్షులూ వచ్చి ఆకాశములో నిల్చొని ఆ యుద్ధములో లక్ష్మణున్ని కాపాడినారు.

అప్పుడు లక్ష్మణుడు తాకితే తగులపడిపోయే బాణాన్ని వింట సంధించినాడు. బంగారముతో చేసిన ఆ బాణము చక్కని రెక్కలతో గుండ్రముగా ఎంతో అందము అయినది. అది తగిలితే చచ్చిపోకతప్పదు. దానిని అదివరకు ఎవరూ ఎదిరించి ఎరుగరు. ఎవరూ ఓర్చుకొని ఎరుగరు. అది మహాభయంకరము అయింది. ఆ బాణాన్ని అదివరకు దేవసమూహాలు అన్నీ పూజించినవి. మహాతేజోవంతుడూ, దేవతలప్రభువూ, పచ్చనిగుఱ్ఱాలమీద పోయే దేవేంద్రుడు ఆ బాణాన్ని దేవదానవుల యుద్ధములో దానవులమీద వదలినాడు. ఆ బాణముతో దానవులను జయించినాడు. ఆ బాణము అదివరకు అపజయము అనేది ఎరుగదు. ఆ బాణాన్ని అప్పుడు లక్ష్మణుడు ఐంద్రాస్త్రముతో అభిమంత్రించినాడు. దుర్ధర్షము అయిన తన శరాసనాన్ని వంచినాడు. ఆ మానవోత్తముడు లక్ష్మణుడు సమస్తలోకాలనూ సంహారము చేసివేసే ప్రళయకాల యముడివలె ఆ బాణాన్ని తన చెవివరకూ లాగినాడు. ఆ కాంతిమంతుడు అంతట కార్యసాధనముకోసము ఆ బాణమువంక చూచి "ఓ బాణమూ, దశరథమహారాజు

జ్యేష్ఠపుత్రుడు రాముడు ధర్మాత్ముడూ, సత్యసంధుడూ, ఎదిరించ సలవికాని పరాక్రమవంతుడూ అయినట్లయితే నీవు ఈ ఇంద్రజిత్తును వధించు'' అని చెప్పినాడు. అంతట ఆ పరవీరహంత ఆ కాంతిమంతుడు లక్ష్మణుడు ఐంద్రాస్త్రముతో అభిమంత్రించిన ఆ బాణాన్ని వదిలినాడు. అది గురితప్పకుండా సూటిగా పోయింది. శిరస్త్రాణము (తలకు దెబ్బ తగులకుండా ఉండడానికి పెట్టుకొన్న ఇనుప గొలుసుల టోపి) తోనూ ధగధగలాడే కుండలాలతోనూ ఉన్న ఇంద్రజిత్తు శిరస్సును ఆ బాణము ఖండించింది. అంతట అతని కాయాన్ని నేలమీదికి పడగొట్టింది. బంగారమువలె కాంతిమంతము అయిన ఆ ఇంద్రజిత్తుశిరస్సు దేహమునుంచి తెగి, నెత్తురుతో తడిసి నేలమీద కనిపించింది. ఇంద్రజిత్తు అట్లా హతుడు అయి తలకు పెట్టుకొన్న శిరస్త్రాణముతోనూ దేహానికి తొడుగుకొన్న కవచముతోనూ చేతిలో పట్టుకున్న శరాసనముతోనూ నేల కూలినాడు. వృత్రాసురుడు హతుడు అయినప్పుడు దేవతలవలె అప్పుడు విభీషణుడూ వానరవీరులూ సింహనాదాలు చేసినారు ఆకాశములో దేవతలూ మహర్షులూ గంధర్వులూ సంతోష ధ్వనులు చేసినారు.

అప్పుడు వానరయోధులు ఘోరముగా చంపివేస్తూఉంటే రాక్షసయోధులు తెలివితప్పి ముద్గరాలు, శూలాలూ, గండ్రగొడ్డళ్లూ మొదలైన ఆయుధాలు వదలిపెట్టి కొందరు లంకాపట్టణానికి అభిముఖముగా పరుగెత్తినారు. వానరయోధులు తరుముతూఉంటే కొందరు రాక్షసయోధులు దశదిశలా పరుగులెత్తినారు. కొందరు సముద్రములో పడిపోయినారు. కొందరు కొండలలోకి పరుగెత్తుకొనిపోయి దాక్కున్నారు. ఒక్క రాక్షసుడు అయినా అక్కడ నిలువలేదు. అందరూ పరుగులెత్తి పారిపోయినారు. సూర్యాస్తమయము అయిపోగానే సూర్యకిరణాలు కనపడకుండా పోయేట్లు, ఇంద్రజిత్తు పడిపోగానే, రాక్షసయోధులు అందరూ అయిపులేకుండా పారిపోయినారు.

నేలమీదపడ్డ ఇంద్రజిత్తుమొండెము అప్పుడు కొంచము సేపు కొట్టుకులాడి కిరణాలు మాసిపోయిన సూర్యుడివలెనూ

ఆరిపోయిన అగ్నిహోత్రమువలెనూ కనిపించింది. ఆ ఇంద్రజిత్తు చావుతో లోకములో పీడలు అన్నీ వదలిపోయి, కీర్లు అన్నీ తొలగిపోయి, ఈ ప్రపంచము అంతా ప్రశాంతముగా కనిపించింది. సమస్త దేవతలూ, దేవేంద్రుడూ అందుకు సంతోషించినారు. సంతోషాతిశయములో దేవతలూ, ఆకాశములో మ్రోగించిన దుందుభుల చప్పుళ్లూ, గంధర్వులూ అప్సరసలూ ఆడిన మనోహరధ్వనులూ వినిపించినవి. అంతట దేవతలు పూలవాన కురిపించినారు. దేవతలు అందరూ లక్ష్మణుణ్ణి ప్రశంసించినారు. దశదిశలూ నిర్మలముగా కనిపించినవి.

సర్వలోకాలనూ భయపెట్టిన ఆ ఇంద్రజిత్తు చచ్చిపోగానే దేవతలూ, గంధర్వులూ, దానవులూ, అక్కడికి వచ్చినారు. లక్ష్మణుణ్ణిచూచి "ఇక మహర్షులకు భయము వదిలిపోయింది" అని చెప్పి మెచ్చుకొని వెళ్ళిపోయినారు.

అప్పుడు వానరయోధపతులు అందరూ అసమానబలవంతుడు అయిన ఇంద్రజిత్తును చంపివేసిన లక్ష్మణుణ్ణి చూచి సంతోషాతిశయములో కొనియాడినారు. విభీషణుడూ, భల్లూకరాజు జాంబవంతుడూ లక్ష్మణుణ్ణి అభినందించినారు. ఆ వానరులు అందరూ పట్టరాని సంతోషములో సింహనాదాలు చేసినారు. అరిచినారు. ఎగిరి గంతులువేసినారు. గర్జించినారు. లక్ష్మణునిచుట్టూ మూగినారు. మళ్ళీ సంతోషముతో తమ తమ వాలాలతో శిలలూ మొదలైనవాటిని పగులకొట్టినారు. చెట్లను పీకివేసినారు. "లక్ష్మణుడు జయించినాడు. జయించినాడు" అని ఆకాశము పగిలిపోయేట్లు కేకలు వేసినారు. అంతట ఇంకా సంతోషము పట్టలేక ఆ వానరయోధులు ఒకరిని ఒకరు కౌగలించుకొన్నారు. వివిధ విధాలా లక్ష్మణుణ్ణి ప్రశంసించినారు.

ఇంద్రజిత్తు చచ్చిపోయినట్లు దేవలోకములోఉన్న దేవతలు చారణులు చెపితే తెలుసుకొన్నారు. సంతోషములో ఆ యుద్ధభూమికి వచ్చినారు. ఎవరికీ అలవికాని ఆ ఇంద్రజిత్తుతో పోరాడి, జయించిన లక్ష్మణుణ్ణి చూచి మరింత సంతోషపడ్డారు.

౯౩

ఒళ్ళంతా నెత్తురుతో తడిసిపోయిన ఆ శుభలక్షణుడు లక్ష్మణుడు ఆ పోరాటములో ఇంద్రజిత్తును సంహారము చేసివేసినందు వల్ల సంతుష్టుడు అయినాడు. అంతట ఆ మహాతేజోవంతుడు లక్ష్మణుడు, జాంబవంతుడూ, హనుమంతుడూ మొదలయిన వానర వీరులనూ తక్కిన వానరయోధులను అందరినీ వెంటపెట్టుకొని పోరాటములో డస్సిపోయినందువల్ల హనుమంతుణ్ణీ విభీషణుణ్ణీ ఊతముగా పట్టుకొని, రాముడూ, సుగ్రీవుడూ ఉన్నచోటికి నడిచిపోయినాడు. రాముడికి నమస్కారము చేసినాడు. దేవేంద్రుడిదగ్గర బృహస్పతి వలె అన్నగారిదగ్గర నిలుచొని సంతోషాతిశయములో మాటలు తడబడుతూ భయంకరము అయిన ఇంద్రజిత్తువధనుగురించి లక్ష్మణుడు విన్నవించినాడు. అప్పుడు విభీషణుడు సంతోషముతో ఆ మహాధైర్యవంతుడు లక్ష్మణుడు ఇంద్రజిత్తుశిరస్సును ఎట్లా తెగ వేసిందీ మొదలు అయినవి వివరముగా చెప్పినాడు.

అప్పుడు ఆ మహాత్ముడు రాముడు సాటిలేని సంతోషముతో "తమ్ముడా, భలేపని చేసినావు. నీవు చేసిన పనికి నాకు సంతోషముగా ఉంది. చక్కనిపని చేసినావు. ఇంద్రజిత్తు చచ్చిపోయినాడు. కనుక మనము జయించినట్లే" అంటూ ఆ పరమ పరాక్రమవంతుడు రాముడు జయలక్ష్మిని చేపట్టి లజ్జపడుతూ ఉన్న లక్ష్మణుడి శిరము ఆఘ్రాణించి స్నేహాతిశయముతో బలవంతముగా తన ఒళ్ళో కూర్చుండపెట్టుకొని గట్టిగా కౌగలించుకొన్నాడు. తన తమ్ముడి వంక పదేపదే చూచినాడు. గాయాలతో బాధపడుతూ నిట్టూర్పులు విడుస్తూఉన్న తన తమ్ముడి శిరస్సును మళ్ళీ ఆఘ్రాణించినాడు. అతని ఒళ్ళంతా తడువుతూ ఆ గాయాలు శమించటానికి త్వరపడుతూ ఆ తమ్ముడిబాధకు తానూ దుఃఖ తాపముతో నిట్టూర్పులు విడుస్తూ, తమ్ముణ్ణి మంచిమాటలతో ఊరడిస్తూ "నాయనా, నీవు దుర్ఘట కార్యము చేసినావు. పరమ కళ్యాణము అయిన పని చేసినావు. కొడుకు పోయినాడు కనుక రావణాసురుడు ఇప్పుడు చచ్చిపోయి నట్లే. ఆ దుర్మాత్ముడు ఇంద్రజిత్తే ఆ రావణాసురుడికి పరమాధారము. వాడే వాడికి కుడిభుజము. నీవు దైవవశమువల్ల ఆ క్రూరుడి

కుడిభుజాన్ని తెగవేసినావు. పోరాటములో ఈ విభీషణుడూ, హనుమంతుడూ నీకు గొప్ప సాయము చేసినారు. నాయనా, లక్ష్మణా, మూడు అహోరాత్రములు పోరాడి, ఎట్లాగో ఆ ఇంద్రజిత్తును చంపివేసినావు.

"నేటితో నాశత్రువులు అందరూ నశించిపోయినట్లే. పుత్రుడు చనిపోయినాడు అని వినగానే రావణాసురుడు మహాసైన్యముతో బయలుదేరి వస్తాడు. పుత్రశోకముతో తపించిపోయే ఆ దుర్జనుణ్ణి రావణాసురుణ్ణి వాడి మహాసైన్యముతోకూడా నేను ఇట్టే సంహారము చేసివేస్తాను.

"లక్ష్మణా, నీవు ఇంద్రజిత్తును సంహారము చేసివేసినావు. నేను సీతాదేవినీ ఈ భూమినీ సంపాదించడము ఇకను అట్టే కష్టము అయిన పనికాదు." అని రాముడు చెప్పినాడు.

అంతట రాముడు సుషేణుణ్ణి పిలిచి "ఓ వైద్యశాస్త్ర విశారదుడా, నీవు వానరయూధపతులలో మిత్రవత్సలుడవు. ఇప్పుడు ఈ విభీషణుడికీ ఈ లక్ష్మణుడికీ బాణాలు గుచ్చుకొని గాయాలు అయినవి. బాధపడుతూ ఉన్నారు. నీవు ఇప్పుడు వీరి గాయాలు నయముచేయవలెను. ఓ మిత్రుడా, వీరినేకాదు వానరవీరులలోనూ భల్లూకవీరులలోనూ ఎవరు ఎవరు బాణాలు గ్రుచ్చుకొని గాయాలు అయి బాధపడుతూ ఉన్నారో వారిని అందరినీ చూడు. వారికి అందరికీ చికిత్సచేసి వారికి అందరికీ స్వాస్థ్యము చేకూర్చే బాధ్యత నీది" అని చెప్పినాడు.

అంతట ఆ వానరయూధపతి సుషేణుడు రామాజ్ఞను శిరసా వహించి ఒక పరమౌషధిని లక్ష్మణుడికి వాసన చూపించినాడు. ఆ వనమూలికను వాసన చూచీచూడడముతో లక్ష్మణుడి ఒంటిలో దిగబడిపోయిన బాణాల తునకలుఅన్నీ రాలిపోయినవి. బాధ అంతా నివారణ అయింది. గాయాలు అన్నీ ఇట్టే మానిపోయినవి. ఆ తరువాత విభీషణుడికీ అతడి మిత్రులకూ వానరవీరులకూ భల్లూక వీరులకూ సుషేణుడు చికిత్స చేసినాడు. క్షణకాలములో వారి దేహవ్యథ సమసిపోయింది. అప్పుడు లక్ష్మణుడూ విభీషణుడూ వానర భల్లూక వీరులూ ఏబాధా ఏనొప్పి లేకుండా హాయిగా లేవడము

చూచి రాముడూ వానరరాజు సుగ్రీవుడూ భల్లూకరాజు జాంబవంతుడూ ఎంతో సంతోషపడ్డారు.

దేవేంద్రుణ్ణి జయించిన ఇంద్రజిత్తును సంహారము చేయడము అనే దుష్కరకార్యము చేసినందుకు లక్ష్మణుణ్ణి రాముడు ఎంతో మెచ్చుకొన్నాడు. అందుకు వానరయూథపతులు అందరూ ఎంతో సంతోషించినారు.

౯౪

ఇంద్రజిత్తు చచ్చిపోయినాడు అని రావణాసురుడి సచివులు విన్నారు. పోయిచూచి యథార్థమేను అని తెలుసుకొన్నారు. దుఃఖపడ్డారు. అంతట దశగ్రీవుడిదగ్గరికి పోయి దుఃఖపడుతూ "మహారాజా, మేము అందరమూ జీవించేఉన్నాము. ఆ మహాద్యుతిమంతుణ్ణి, నీ పుత్రుణ్ణి, ఇంద్రజిత్తును విభీషణుడి సహాయముతో లక్ష్మణుడు చంపివేసినాడు. దేవేంద్రుణ్ణి జయించిన శూరుడూ నీ కుమారుడూ యుద్ధాలలో అపరాజితుడూ అయిన ఇంద్రజిత్తు లక్ష్మణుడితో పోరాడినాడు. అమోఘము అయిన బాణాలు వదిలి అతనిని తాపము ఎత్తించినాడు. తాను వీరులుపోయే ఉత్తమలోకానికి పోయినాడు" అని చెప్పినారు.

ఇంద్రజిత్తు యుద్ధములో చచ్చిపోయినాడు అన్న భయంకరమూ దారుణమూ ఘోరమూ అయిన వార్త వినీవినడముతో రావణాసురుడు మూర్ఛపోయినాడు. చాలా సేపటికి మూర్ఛ తేరుకొన్నాడు. పుత్రశోకములో చెప్పనలవికాని బాధ పడ్డాడు. వ్యాకులపడిపోయినాడు. దీనుడు అయిపోయినాడు. ఏడ్చినాడు.

"అయ్యో, నీవు రాక్షససైన్యాలకు అన్నిటికీ ముఖ్యుడవు. నాయనా, నీవు మహారథుడవే! దేవేంద్రుణ్ణి జయించినావే! లక్ష్మణుడి చేతిలో నీవు ఎట్లా చిక్కినావు? నాయనా, నీకు కోపమువస్తే కాలస్వరూపుడూ అంతకస్వరూపుడూ అయిన యముణ్ణి నీ బాణాలతో ఛేదించివేయకలవే! మందరపర్వతశిఖరాన్ని నీ బాణాలతో పడకొట్టకలవే! పోరాటములో లక్ష్మణుడు నీకు ఏపాటివాడు! అయ్యో,

"ఓ మహాబాహూ, నీవు ఇప్పుడు కాలధర్మముచేత వైవస్వత రాజును పోయి చేరినావు. అందువల్ల అతడు నాకు ఇప్పుడు పూజ్యుడు అయినాడు. ఆ యమధర్మరాజు దగ్గరికి పోవడానికి మంచి మంచి యోధులకు, యోధులకే కాదు; దేవతలకున్నూ ఇదే (ఈ యుద్ధమే—) తరణోపాయము. తన స్వామి కార్యార్థము యుద్ధములో హతము అయిపోయినవాడు స్వర్గానికి పోతాడు. అందువల్ల నీకోసము నేను దుఃఖపడను. ఇకను ఇప్పుడు దేవతలూ దిక్పాలకులూ, పరమపురుషులూ, ఇంద్రజిత్తు హతుడు అయిపోయినాడు అని వింటారు. నిర్భయముగా సుఖముగా వారు అందరూ నిద్రపోతారు. ఒక ఇంద్రజిత్తు లేనికారణమునుంచి నానావిధకాననసహితము అయిన ఈ పృథ్వి అంతా — ఈ పృథ్వేకాదు — ముల్లోకాలూ శూన్యముగా కనపడుతూ ఉన్నవి. గిరి గుహలో పోతుటేనుగు కోసము ఆడఏనుగులవలె ఇప్పుడు అంతఃపురములో రాక్షసకన్యలు ఏడ్చే ఏడ్పులు వింటాను.

"ఓ పరంతపా, నీవు నీయువరాజ్యాన్నీ, ఈ లంకాపట్టణాన్నీ, రాక్షసులనూ, నీ తల్లినీ, నీ తండ్రినీ, నీ భార్యనూ వదిలిపెట్టి ఎక్కడికి పోయినావు ఓ వీరుడా, నేను చనిపోతే నా ప్రేతకర్మ నీవు చేయవలెను. అటువంటిది నీవు తల్లక్రిందులు చేసివేసినావు. సుగ్రీవుడూ రామలక్ష్మణులూ నా మనశ్శల్యాలు ఆ మనశ్శల్యాలను పెళ్ళగించి వేయకుండానే నన్ను వదిలిపెట్టి నీవు ఎక్కడికి పోయినావు?" అంటూ రావణాసురుడు ఏడ్చినాడు, బాధపడిపోయినాడు. ఆ రాక్షస రాజును రావణాసురుడికి పుత్రవ్యసనమునుంచి అప్పుడు భరింప నలవి కాని కోపము వచ్చింది. సహజముగా తీక్ష్ణకిరణాలతో తేజరిల్లే సూర్యుడు వేసంగిలో మరింత తీక్ష్ణకిరణాలతో ప్రజ్వరిల్లుతాడు. అదేవిధముగా అసలే కోపిష్ఠివాడు అయిన రావణాసురుడు అప్పుడు పుత్రశోకముతో మరింత కుపితుడు అయినాడు. అతని కనుబొమలు ముడిపడిపోయినవి. అప్పుడు ఆ కనుబొమలు ప్రళయకాలాన మహాసముద్రములో అలలతో పైకిలేచిన మొసళ్ళవలె కనిపించినవి. కోపముతో అతడు అప్పుడు ఆవలించినాడు. వృత్రాసురుడి నోటిలోనుంచి వెలువడినట్లు ఆ ఆవలించిన రావణాసురుడి నోటిలోనుంచి అప్పుడు పొగలూ మంటలూ నిప్పులూ వెలువడినవి. పుత్రవధనుంచి

ఆ శూరుడికి తాపము ఎత్తింది. కోపపరవశుడు అయినాడు. మనసా ఆలోచించినాడు. వైదేహిని వధించివేయవలెను అనుకొన్నాడు.

రావణాసురుడి కన్నులు సహజముగా ఎర్రటివి. అప్పుడు కోపాగ్నితో మంటలు మండుతూ ఆ నేత్రాలు మహాభయంకరముగా కనుపించినవి. నేత్రాలే కావు. జన్మతః అతనిది భయంకరము అయిన రూపము. ఆ కోపాగ్ని దేహముఅంతటా వ్యాపించడము చేత అతడు అప్పుడు ప్రళయకాలరుద్రుడివలె దురాసదుడు అయినాడు. జ్వలిస్తున్న దీపములోనుంచి పడుతూ రాలే నూనెబొట్లవలె అప్పుడు ఆ క్రుద్ధుడి నేత్రాలలోనుంచి నెత్తురుబొట్లు రాలినవి. పళ్లు కొరికినాడు. అది రాక్షసులు త్రిప్పే నూనెగానుగ ధ్వనివలె వినిపించింది. ప్రళయకాలాగ్నివలె క్రుద్ధుడు అయిపోయినాడు. ఆ రావణాసురుడు అప్పుడు ఏ యే దిక్కులు చూచినాడో ఆ యా దిక్కులలో ఉన్న రాక్షసులు అందరూ భయపడిపోయినారు. కలవరపడి పోయినారు. భయముతోనూ కలవరపాటుతోనూ స్తంభాల చాటుకు పోయినారు. చరాచరవస్తువులను అన్నిటినీ ప్రళయకాలాన కబళించివేయడానికి చూచే యముడివలె కనపడుతూ అప్పుడు దశదిశలూ చూస్తూఉన్న ఆ రావణాసురుడిదగ్గరకు ఎవరూ పోలేకపోయినారు.

రాక్షసుల మధ్యను ఉన్న ఆ పరమపాపితుడు అప్పుడు యుద్ధము ఆపివేయ తలచుకొని "ఓ రాక్షసయోధులారా, నేను అనేక వేల సంవత్సరాలు అసాధ్యము అయిన తపస్సు చేసినాను. నేను తపస్సు చేసినప్పుడల్లా బ్రహ్మదేవుణ్ణి మెప్పించినాను. నా తపోబలమువల్లనూ, బ్రహ్మానుగ్రహమువల్లనూ, నాకు దేవతలనుంచి కానీ అసురులనుంచికానీ ఎన్నడూ ఏభయమూ లేదు. నాకు బ్రహ్మదేవుడు సూర్యకాంతులతో తేజరిల్లే కవచాన్ని ఇచ్చినాడు. దేవాసురయుద్ధములో వజ్రాయుధముతో కొట్టినా నాకవచము చెక్కు చెదరలేదు. నేను ఆ కవచము తొడుగుకొని యుద్ధానికి రథముమీద పోయేట్లయితే నన్ను ఎవడు ఎదిరించ కలడు! సాక్షాత్తూ దేవేంద్రుడు అయినప్పటికీ నన్ను ఎదిరించలేడు. బ్రహ్మదేవుడు నన్ను అనుగ్రహించి దేవాసురయుద్ధమప్పుడు నాకు ఒక మహా

చాపాన్ని దానితోపాటు ఒక బాణాన్ని ఇచ్చినాడు. ఆ మహా ధనుస్సుతో ఇప్పుడు రామలక్ష్మణులను సంహారించి వేస్తారు. ఆ కార్మకాన్ని మంగళధ్వనులతో తీసుకురండి" అని చెప్పినాడు. అట్లా చెప్పినాడే కాని ఆ కోపపరవశుడు పుత్రుణ్ణి చంపివేసినందుకు సంతాపడుతూఉన్న ఆ శూరుడు ఆలోచించి ఆలోచించి సీతాదేవిని చంపివేయడానికి నిశ్చయించుకొన్నాడు.

అంతట ఆ భయంకరతామ్రాక్షుడు రావణుడు ఇంద్రజిత్తు కోసము దుఃఖపడుతూ ఏడుస్తూ ఎట్టఎదుట ఉన్న తన రాక్షస సచివులు అందరివంక చూస్తూ " ఓ సచివులారా, నాపిల్లవాడు వానరులను వంచనచేయడానికి మాయశక్తితో ఒక స్త్రీని చేసి అదే సీతాదేవి అని చెప్పి చంపివేసినాడు. నేను ఇప్పుడు అది యథార్థము చేసివేస్తాను. అది వాడికి ఇష్టము. ఆ క్షత్రియాధముడిమీద ఇంతా అనురాగముతో ఉన్న ఆ సీతను ఇప్పుడే నాశనము చేసి వేస్తాను," అని చెప్పి ఖడ్గము తీసుకొన్నాడు. పుత్రశోకముతో మనస్సు అంతా వ్యాకులపడిపోయిన ఆ రావణాసురుడు అప్పుడు సచివులనూ తన భార్యలనూ వెంటపెట్టుకొని మైథిలి ఉన్నచోటికి బయలుదేరినాడు. అలంకారముగా పూలదండలుకట్టిన ఆ ఖడ్గాన్ని ఒఱలోనుంచి దూసినాడు. నిర్మలాకాశమువలె తేజరిల్లుతూ ఉన్న ఆ ఖడ్గాన్ని ఎత్తి పట్టుకొని పోతూఉన్న ఆ క్రుద్ధుణ్ణి రావణాసురుణ్ణి లంకాపట్టణములో ఉన్న రాక్షసులు అందరూ చూచి అతడు జయిస్తాడు అనే సంతోషాతిశయముతో సింహనాదాలు చేస్తూ ఒకరిని ఒకరు కౌగలించుకొని "ఇప్పుడు ఈ మన రాజును ఈ భయంకరాకారుణ్ణిచూచి రామలక్ష్మణులు భయపడిపోతారు. ఈతనికి ఇదివరకు కోపము వచ్చి లోకపాలకులు అయిన ఇంద్ర యమ వరుణ కుబేరులను నలుగురిని జయించినాడు. వారినేకాదు, ఇంకా ఎంతోమంది శత్రువులను పోరాటములో పడకొట్టినాడు. ముల్లోకాలలో ఉన్న ఉత్తమోత్తమ వస్తువులను అన్నిటినీ తెచ్చుకొని అనుభవిస్తూఉన్నాడు. పరాక్రమానికీ బలానికీ మన రాజుతో సరిసమానము అయినవాడు మరిఒకడు ఈ భూలోకములో లేడు" అని చెప్పుకొన్నారు.

రావణాసురుడు అశోకవనములోకి పోయినాడు. ఒళ్ళు ఎరుగని కోపముతో సీతాదేవిమీదికి పరుగెత్తినాడు. తన మేలు కొరకే స్నేహితులు "వద్దు" అని ఎంత అడ్డగించినా ఆగకుండా ఆకాశములో అంగారకుడు కోపముతో రోహిణీదేవిమీదికి పోయేట్లు రావణాసురుడు సీతాదేవిమీదికి పోయినాడు. అట్లా ఖడ్గము పట్టుకొని పరుగెత్తుకొని వస్తూఉన్న ఆ క్రుద్ధుణ్ణి రావణాసురుణ్ణి రాక్షసాంగనల కాపలాలో ఉన్న ఆ మహాపతివ్రత మైథిలి చూచింది. వెంటఉన్న స్నేహితులు ఎంత నివారిస్తూ ఉన్నప్పటికిన్నీ ఖడ్గము ఎత్తిపట్టుకొని ఆ కుపితుడు తనమీదికి రావడము చూచి ఆ జనకాత్మజ దిగులుపడిపోయింది. దుఃఖపరవశ అయిపోయింది. ఏడుస్తూ మనస్సులో "ఈ రావణాసురుడు పరమ క్రుద్ధుడు అయి పరుగెత్తుకొని వస్తూవున్నాడు. నా నాథుడు జీవించిఉండగానే ఈ దుర్మతి నన్ను అనాథనువలె చంపివేస్తాడు కాబోలు. వీడు ఇదివరకు ఎన్నోసార్లు నన్ను తనకు భార్యను కమ్మనీ, నన్ను తనతో క్రీడించమనీ యాచించినాడు. ప్రోత్సహించినాడు. నేను నా పాతివ్రత్యమునుంచి గట్టిగా తిరస్కరించినాను. నేను ఒప్పుకోనందువల్ల వీడు నిరాశచేసుకొన్నాడు. ఇప్పుడు వీడు ఒళ్ళుఎరుగని కోపములో ఉన్నాడు. నన్ను చంపివేస్తాడు కాబోలు. నాకోసము వీడు ఈ దుష్టుడు ఆ పురుషోత్తములను రామలక్ష్మణులను చంపివేసినాడేమో! అయ్యో; నానుంచి వారు చచ్చిపోయినారేమో! ఛీ-ఛీ- నేను బ్రతికిఉండడము ఎందుకు!

"ఒకవేళ ఈ క్రూరుడు రామలక్ష్మణులతో పోరాడలేక పుత్రశోకము భరించలేక నన్ను చంపివేయ తలచినాడేమో. వీడు ఎటువంటి పాపకృత్యాలకు అయినా వెనుతీయడు. ఇంతకూ నేను మూఢురాలను. ఆ హనుమంతుడు చెప్పినట్లు నేను చేయలేదు. అప్పుడు ఆ హనుమంతుడి వీపుమీద కూర్చుని పోయిఉన్నట్లయితే ఎప్పుడో నా పెనిమిటిని కలుసుకొని సుఖముగా ఉండేదాన్ని. నాకు ఈ దుఃఖము వచ్చేదికాదు.

"ఆ రామప్రభువు యుద్ధములో హతుడు అయిపోయినాడు అని కౌసల్యాదేవి వింటుంది. ఆ ఏకపుత్ర గుండెపగిలి చచ్చిపోతుంది.

తప్పదు. ఆ పూజ్యుడి పుట్టుక, బాల్యమూ, యౌవనమూ, ధర్మబుద్ధీ, తలచుకొని తలచుకొని ఏడుస్తుంది. ఆ మహాత్ముడికి శ్రాద్ధము పెట్టుతుంది. ఈ ప్రపంచముమీద ఆశలన్నీ వదులుకొంటుంది. దుఃఖముతో మూర్ఛపోతుంది. తెప్పరిల్లినతరువాత అగ్నిహోత్రములోనో జలప్రవాహములోనో పడి ప్రాణాలు వదులుతుంది. అంతే. గూనిమంథరనుంచి ఆ కౌసల్యాదేవికి ఈ ఆపదా, ఇంత దుఃఖమూ వచ్చిపడ్డవి. పాపిష్టిరాలు ఆ దుష్టురాలు మంథర తగులపడి పోవలెను” అనుకొంటూ ఏడ్చింది.

ఈ విధముగా ఏడుస్తూ చంద్రుడు లేనప్పుడు అంగారక గ్రహావశము అయిపోయిన రోహిణివలె దీనురాలు అయిపోయిన ఆ మైథిలిని చూచి బుద్ధిమంతుడూ పరిశుద్ధుడూ మేధావీ రావణాసురుడి అమాత్యుడూ అయిన సుపార్శ్వుడనే సచివుడు, తక్కిన సచివులు ఎంత చెప్పినా వినకుండా సీతాదేవిమీదికి పోతున్న రావణాసురుణ్ణి చూచి “ఓ దశగ్రీవుడా, నీవు మహా దొడ్డవంశములో పుట్టినావు. కుబేరుడికి సాక్షాత్తూ తమ్ముడవు. ఇప్పుడు ధర్మాన్ని ఎందుకు వదలిపెట్టుతావు. కోపమునుంచి ఎందుకు ఈ వైదేహిని చంపుతావు. సమస్త రాక్షసులకూ నీవు రాజువు, వీరుడవు. వేద విద్యావ్రతస్నాతుడవు. స్వకర్మ నిరతుడవు. నీవు ఎందుకు స్త్రీ వధము తలపెట్టినావు.

“ఓ రాజా, ఈ రూపయౌవన సంపన్న మైథిలి నీవశము అయ్యే పద్ధతి చూడు. మాతోకూడా నీ ఈ కోపాన్ని ఆ రాముడిమీద చూపించు. ఈనాడు కృష్ణపక్ష చతుర్దశి. నీవు యుద్ధసన్నద్ధుడవు అయి రాక్షసులను వెంటపెట్టుకొని బయలుదేరు. రేపు అమావాస్య. యుద్ధములో జయించు. నీవు శూరుడవు. బుద్ధిమంతుడవు. మహారథుడవు. మంచి రథముమీద పో. ఆ రాముణ్ణి ఈ ఖడ్గముతో చంపు. తిరిగివచ్చి ఈ సీతను చేపట్టు” అని చెప్పినాడు.

ఇట్లా ధర్మసహితముగా స్నేహితుడు చెప్పిన మాటను ఆ దురాత్ముడు ఆ పరమ పరాక్రమవంతుడు రావణాసురుడు విన్నాడు. వెనుకకు మళ్ళినాడు. అంతట స్నేహితులను వెంటపెట్టుకొని సభామంటపానికి పోయినాడు.

౯౪

రావణాసురుడి గర్వము ఉడిగిపోయింది. పరమదుఃఖముతో సభామంటపములో సింహాసనముమీద కూర్చున్నాడు. కుపితుడు అయి సింహమువలె నిట్టూర్పులు విడుస్తూ పుత్రశోకముతో కుంగి పోయి, ఆ మహాబలవంతుడు రావణాసురుడు చేతులు జోడించి తన సేనాధ్యక్షులను అందరినీ చూచి "మీరు అందరూ ఇప్పుడు మిగిలి ఉన్న గజసాదులతోనూ అశ్వికులతోనూ రథికులతోనూ పదాతుల తోనూ యుద్ధము చేయడానికి బయలుదేరి పోండి. ఒక్క రాముడి మీదికే మీరు పోండి. వాడిచుట్టూ మూగండి. వర్షాకాలమేఘాల వలె వాడిమీద మీరు బాణవర్షము కురిపించండి. వివిధాయుధాలూ ప్రయోగించండి. వాణ్ణి చంపివేసే ప్రయత్నము చేయండి. ఒక వేళ మీరు చంపివేయకపోయినా ఇబ్బంది లేదు మీ తీక్ష్ణ బాణాలకు వాడిదేహముఅంతా తూట్లుపడి పోతుంది. వాడు బలహీనుడు అయిపోతాడు. వాణ్ణి నేను రేపు చంపివేస్తాను. సమస్తలోకాల వాళ్ళూ చూస్తారు" అని చెప్పినాడు.

రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి అప్పటికి అప్పుడు ఆ రాక్షసవీరులు వివిధ సైన్యాలతోనూ బయలుదేరినారు. ప్రాణాలు తీసివేసే ఇనుపగుదియలతోనూ అడ్డకత్తులతోనూ ఖడ్గాలతోనూ గండ్రగొడ్డళ్ళతోనూ బాణాలతోనూ రాక్షసయోధులు పోయి వానరసైన్యముమీద పడ్డారు. వానరవీరులు అప్పుడు వృక్షాలూ శిలలూ రాక్షసయోధులమీద విసరివేసినారు. సూర్యోదయ సమయాన ఆ మహాయుద్ధము రాక్షసులకూ వానరులకూ జరిగింది. ఆ యుద్ధము మహాభయంకరముగానూ దొమ్మిగానూ సాగింది. చిత్ర విచిత్రము అయిన గదలతోనూ ఈటెలతోనూ గండ్రగొడ్డళ్ళతోనూ రాక్షసులు పోరాటము సాగించినారు. ఆ పోరాటములో పైకి లేగిన దుమ్ము అంతా ఏరులు అయి పారిన నెత్తురునుంచి అణిగి పోయింది. ఏనుగులూ రథాలూ గట్లుగానూ తెగిపోయిన గుర్రాలు పెద్దపెద్ద చేపలుగానూ రథధ్వజాలు చెట్లుగానూ శవాలు తెప్ప కొయ్యలుగానూ రక్తము ప్రవాహాలుగానూ ప్రవహించింది. ఆ రక్త ప్రవాహాలలో వానరులు తడిసిపోతూ పదే పదే పైకి ఎగిరి రాక్షసులను

రథాలను విరుగగొట్టినారు. గుర్రాలను పడగొట్టినారు. వివిధాయుధాలనూ విరిచివేసినారు. రాక్షసుల తలవెంట్రుకలను పట్టుకొని కిందికి పడలాగినారు. రాక్షసుల ముక్కులనూ చెవులనూ ముఖాలనూ తమకరజగోళ్ళతో గీరినారు. కోరలతో కొరికివేసినారు. పండ్లు పండిన చెట్టుమీదికి వందలకొద్దీ పక్షులు ఎగిరిపోయేటట్లు ఒక్కొక్క రాక్షసుడిమీదికి వందలకొద్దీ వానరులు ఎగిరిపోయినారు. చుట్టూ మూగి కొట్టినారు. అప్పుడు రాక్షసులు విజృంభించి భయంకరాకారులు అయిన ఆ వానరులను పెద్దపెద్ద గదలతోనూ ఈటెలతోనూ ఖడ్గాలతోనూ గండ్రగొడ్డళ్ళతోనూ కొట్టి చంపివేయసాగినారు. ఆ పర్వతాకారులగు రాక్షసులను అప్పుడు వానరులు తట్టుకొనలేక పోయినారు. ఆ యా ఆయుధాలతో కొట్టి చంపి వేస్తూవుంటే వానరమహాసైన్యము అప్పుడు రాముడి శరణు చొచ్చింది.

అంతట ఆ సర్వలోకశరణ్యుడు ఆ మహాతేజోవంతుడు ఆ అమిత పరాక్రమవంతుడు ధనుస్సును తీసుకొని ఇట్టే రాక్షస సైన్యములో చొరపడి బాణవర్షము కురిపించడము మొదలు పెట్టినాడు. ఆ మహాభంకరుడు గాముడు ఆ రాక్షససైన్యములోకి పోయ్యే పోవడముతో బాణాగ్ని కురిపిస్తూ సమస్తమూ దహించి వేస్తూ ఉంటే గీష్మఋతువులో సూర్యుడి దగ్గరికి మేఘాలు పోలేనట్లు రాక్షసులు ఆ రాముణ్ణి సమీపించలేకపోయినారు. ఎవరూ చేయలేని మహాభయంకరము అయిన పనులు జరగడము చూచినారు. కాని రాక్షసులు రాముణ్ణి చూడలేదు. పెద్దగాలి వీచినప్పుడు వనములో చెట్లు పడిపోవడము కనబడుతుంది. కాని గాలిమాత్రము కంటికి కనబడదు. అదే విధముగా ఆ పోరాటములో రాక్షసుల మహాసైన్యాలు చెల్లాచెదరు అయిపోవటమూ మహారథాలు విరిగి పడిపోవటమూ కనిపించిందే కాని రాముడుమాత్రము రాక్షసులకు కనిపించలేదు. ఆ రామబాణాలకు ఒకవైపున సైన్యము ఛిన్నాభిన్నము అయిపోవడమూ ఇంకొకవైపున సైన్యము తగులపడిపోవడమూ మరిఒక వైపున మహారథములు కూలి పోవడమూ అందరూ బాణాలు గుచ్చుకొని బాధపడడమూ అగుపించింది. కాని అంత వేగముతో అన్ని బాణాలు వదులుతూ ఉన్న

రాముడుమాత్రము ఎవరికీ అగుపించలేదు. శబ్ద స్పర్శ రూప రస గంధాదులను తన దేహేంద్రియాలు అనుభవిస్తూ ఉన్నప్పటికిన్నీ ఆ శబ్దాదులు అనుభవించటానికి కారణభూతము అయిన పరమాత్మ ఆ దేహి కంటికి కనబడనట్లు దెబ్బలు తింటూ బాధపడుతూవున్న రాక్షసులకు ఆ దెబ్బలకూ ఆ బాధలకూ కారణభూతుడు అయిన రాముడుమాత్రము కనిపించలేదు.

"ఇదుగో వీడు ఏనుగులను పడగొట్టుతున్నాడు. ఇదుగో, వీడు మహారథాలను పగులగొట్టుతున్నాడు. ఇదుగో, వీడు తీక్ష్ణ బాణాలతో పదాతులనూ అశ్వికులనూ పడగొట్టుతున్నాడు" అని రాక్షసులు అందరూ కేకలువేస్తూ తమ కంటికి అగుపించిన రాక్షసుణ్ణి ప్రతివాణ్ణీ రాముడు అనుకొని రాక్షసులు అందరూ కుపితులు అయిపోయి రాక్షసులలో రాక్షసులు కొట్టుకొన్నారు. అట్లా గాంధర్వాస్త్ర ప్రభావములో వ్యామోహపెట్టి ఆ శత్రుసైన్యాన్ని దహించి వేస్తూఉంటే రాముణ్ణి వాళ్లు చూడలేకపోయినారు. ఆ పోరాటంలో అప్పుడు రాక్షసులకు అనేకవేలమంది రాములు ఉన్నట్లుగా తోచింది. ఉత్తరక్షణములో రాముడు ఒక్కడే అన్నట్లుగా తోచింది. అలాతచక్రమువలె మండలాకారముగా తిప్పుతూఉన్న రాముడి బంగారు వింటికొనను చూచినారేకాని రాముణ్ణిమాత్రము ఆ రాక్షసులు చూడలేదు. తన శరీరమే నాభిగానూ బలమే జ్వాలలుగానూ బాణాలే ఆకులుగానూ కార్ముకమే అంచుగానూ జ్యాతల ధ్వని జ్వాలల మహాఘోషముగానూ పరాక్రమమే అక్ష ప్రదేశముగానూ శరీరకాంతే వెలుతురుగానూ దివ్యాస్త్రాలే ధారగానూ యుద్ధములో చంపివేస్తూ ఉన్న ఆ రామచక్రము రాక్షసులకు అప్పుడు కాలచక్రమువలె కనిపించింది. వాయువేగముతో పోయే రథాలను ఏడుకోట్ల ఇరవైతొమ్మిదిలక్షలనూ, బలవంతమయినమదపు ఏనుగులను పదమూడుకోట్ల పన్నెండులక్షల ఇరవై వేలనూ, అశ్వికులను అశ్వాలతోకూడా పదికోట్ల ఇరవైలక్షల అరవై వేలనూ, పదాతులను నూటనలభైఅయిదుకోట్ల ఎనభైలక్షలనూ అగ్నిశిఖల వంటి బాణాలు వదలి రాముడు మూడుమ్ముప్పావు గడియలలో సంహారము చేసివేసినాడు. ఆ చతురంగబలాలలో ఉన్న రాక్షసులు

అందరూ కామరూపులు. ఏనుగులూ గుర్రాలూ చచ్చిపోయి, ధ్వజాలు రథాలూ విరిగిపోయి చావగా మిగిలిన రాక్షసులు యుద్ధోత్సాహము ఉడిగిపోయి లంకాపట్టణానికి పరుగెత్తినారు.

చచ్చి పడిపోయిన ఏనుగులతోనూ, గుర్రాలు మొదలైన వాటితోనూ అప్పుడు ఆ యుద్ధభూమి క్రుద్ధుడు అయిన రుద్రదేవుడి క్రీడాభూమివలె కనిపించినది. ఆ ధర్మాత్ముడు రాముడు అప్పుడు తన ప్రక్కన ఉన్న సుగ్రీవుణ్ణీ, విభీషణుణ్ణీ, హనుమంతుణ్ణీ, జాంబవంతుణ్ణీ, మైందద్వివిదులనూ తక్కిన వానరవీరులనూ చూచి "మిత్రులారా, ఈ దివ్యాస్త్రబలము ఆ త్రిలోచనుడికీ నాకూ తప్ప మరివరికీ లేదు" అన్నాడు.

దేవేంద్రుడితో సరిసమానము అయిన ఆ మహాపరాక్రమవంతుణ్ణి రాక్షససైన్యాలను సంహారము చేసివేయడానికి అన్ని అస్త్రశస్త్రాలు ప్రయోగించి అలసిపోని ఆ మహాబలవంతుణ్ణి రాముణ్ణి అప్పుడు దేవతలు అందరూ ప్రశంసించినారు.

౯౪

రావణాసురుడు పంపించిన ఆ చతురంగబలాలూ వేలకువేలు గుర్రపు రౌతులూ గుర్రాలూ, వేలకువేలు అగ్నిహోత్రకాంతులతో ధగధగలాడే మహారథాలూ రథికులూ, తళతళలాడే గదలూ ఇనుప గుదియలూ తీసుకొని పోరాడే శూరులూ కామరూపులూ అయిన యోధులు అందరూ రాముడు వదిలిన తప్తకాంచన బాణాలకు గురిఅయిపోయినారు అని లంకాపట్టణములో అందరికీ తెలిసింది. చావగా మిగిలినవారు రావడము రాక్షసాంగనలు చూచినారు. వారు చెప్పింది విన్నారు. అప్పుడు రాక్షసాంగనలు అందరూ ఏకమై ఏడ్చినారు. మొగుళ్ళుపోయినవాళ్ళూ, పుత్రులుపోయినవాళ్ళూ, తోబుట్టువులు మొదలైన ఆప్తబంధువులు పోయినవాళ్లూ చేరి దుఃఖార్తలు అయి పెద్దపెట్టున ఏడ్చినారు.

"ఈ శూర్పణఖ ముసలిది. వేళ్లాడే పొట్టతో ఈ ముసలిది అడవిలోకి ఎట్లా పోయింది. మూర్తీభవించిన మన్మథుడివంటి ఆ సుకుమారుణ్ణి ఆ మహాబలవంతుణ్ణి ఆ సర్వభూతహితుణ్ణి రాముణ్ణి

ఎట్లా చూచింది. సమస్తలోకాలవారూ అసహ్యించుకునే ఈ కురూపి ఆ రాముణ్ణి కామించిందా! ఎంత చిత్రముగా ఉంది! ఏ ఒక్క సుగుణమూ లేని ఈ దుర్ముఖి ఈ రాక్షసి ఆ సమస్త సద్గుణవంతుణ్ణి ఆ సుముఖుణ్ణి రాముణ్ణి ఎట్లా వలచింది. ఒళ్లంతా ముడతలు పడిపోయిన ఈ ముసలిది తలవెంట్రుకలు అన్నీ తెల్లగా నెరిసిపోయిన ఈ ముసలిది శూర్పణఖ అందరూ మొగతాళి చేసేపని చేసింది. చేయరానిపని చేసింది. సమస్తలోకాలవారూ నిందించేపని చేసింది. ఇది అంతా మన దౌర్భాగ్యవశమువల్ల జరిగింది. ఈ అయోగ్యురాలు ఖరదూషణాదులనూ సమస్తరాక్షసులనూ నాశనము చేసివేయడానికి ఆ మహానుభావుణ్ణి రాముణ్ణి తిరస్కరించింది. ఈ ముసలిదాని నుంచి రావణాసురుడు రాముడితో మహావైరము పెట్టుకొన్నాడు. తన చావుకోసము సీతను తెచ్చుకొన్నాడు. రాముడితో బద్ధవైరము వచ్చింది. ఇంత చేసినా ఆ జనకాత్మజ సీతాదేవి రావణాసురుడికి స్వాధీనము కానేలేదు.

"ఈ సీతను కాంక్షించిన విరాధుణ్ణి రాముడు ఒక్కడే హత: మార్చినాడు. రాక్షసులు అందరూ రాముడిచేతుల్లో నాశనము అయిపోతారు అనడానికి ఆ ఒక నిదర్శనము చాలు. జనస్థానములో భయంకరకర్ములు అయిన రాక్షసులను పధ్నాలుగువేలమందిని అగ్నిశిఖలవంటి బాణాలతో రాముడు సంహారము చేసివేసినాడు. సూర్యసమానము అయిన బాణాలు వదిలి ఖరుణ్ణి, దూషణుణ్ణి, త్రిశిరుణ్ణి, ఒక్క రాముడు చంపివేసినాడు. ఆ నిదర్శనము చాలు. కోపముతో పెద్దపెట్టున కేకలువేస్తూ యోజనము దూరమువరకూ బాహువులుచాచి సమస్తజంతువులనూ పట్టుకొని వాటి నెత్తురు త్రాగి మాంసముతినే కబంధుణ్ణి రాముడు రూపుమాపినాడు. ఆ నిదర్శనము చాలు. మేరువుపర్వతముతో సరిసమానముఅయినవాడూ మహా బలవంతుడూ దేవేంద్రుడికొడుకూ అయిన వాలిని ఒక్క బాణముతో రాముడు కొట్టివేసినాడు. ఆ నిదర్శనము చాలు. గర్వముడిగి, భగ్నమనోరథుడు అయిపోయి ఋశ్యమూకపర్వతముమీద నివాసము పెట్టుకొన్న సుగ్రీవుడికి కిష్కింధారాజ్యము ఒప్పగించినాడు. ఆ నిదర్శనము చాలు.

"ధర్మార్థసహితము అయిన మాట విభీషణుడు చెప్పినాడు. అట్లా చేసిఉన్నట్లయితే రాక్షసులకు అందరికీ మేలు అయ్యేది. ఎంతో బాగుండేది. ఒళ్లుతెలియక రావణాసురుడు అట్లా చేయ లేదు. ఆ మాట రుచించలేదు. కుబేరుడు అంతటివాడికి తమ్ముడుగా పుట్టినాడు. ఏమి ప్రయోజనము ! పైగా తమ్ముడు విభీషణుడు చెప్పినాడు. వినలేదు. ఆ విభీషణుడు చెప్పినట్లు చేసిఉన్నట్లయితే ఈ లంకాపట్టణము ఇప్పుడు ఇట్లా వల్లకాడు అయిపోయి ఉండేది కాదు. ఇంతమంది ఆడవాళ్లు దుఃఖార్తలు అయిపోయేవాళ్లు కారు. మహాబలవంతుడు అయిన కుంభకర్ణుణ్ణి ఆ రాముడు చంపివేసినాడు. ఎదిరించను అలవికాని అతికాయుణ్ణి అందులో తన ప్రియపుత్రుణ్ణి ఇంద్రజిత్తును ఆ లక్ష్మణుడు చంపివేసినాడు. ఇంకా ఈ రావణా సురుడికి తెలియకుండా ఉంది.

"అయ్యో, నా కొడుకు చచ్చిపోయినాడు. అయ్యో, నా తోబుట్టువు చచ్చిపోయినాడు. అయ్యో, నా పెనిమిటి చచ్చి పోయినాడు" అని చెప్పుకొంటూ ఇంటింటా రాక్షసాంగనలు ఏడ్చి నారు.

"ఆ మహాశూరుడు రాముడు యుద్ధములో అన్ని ఏనుగులనూ అన్ని గుర్రాలనూ అన్ని రథాలనూ నాశనము చేసివేసినాడు. లక్ష లకొద్దీ పదాతులను సంహారముచేసివేసినాడు. వాడు రుద్రుడో విష్ణుమూర్తో దేవేంద్రుడో అయిఉంటాడు. కాని సామాన్య మానవుడు కాడు. కాక ఆ యముడే ఈ రామరూపముతో వచ్చి రాక్షసులను అందరినీ సంహారము చేసివేస్తున్నాడేమో? మహా వీరులు అయిన మా వాళ్లు అందరూ నాశనము అయిపోయినారు. మేము జీవించవలెను అనే ఆశ మాకులేదు. ఈ భయానికి అంతము కనపడదము లేదు. అనాథలము అయిపోయినాము" అంటూ ఏడ్చినారు.

"దశగ్రీవుడికి యుద్ధము అంటే భయములేదు. ఎన్నడో వరము సంపాదించినాడు. రాముడివల్ల ఇంత మహాఘోరము జరి గింది అనికానీ మనము ఇంత భయపడుతున్నాము అనికానీ తెలుసుకోలేకుండా ఉన్నాడు. యుద్ధములో రాముడు ఎదుర్కొన్న

వారిని దేవతలు రక్షించలేరు. గంధర్వులు రక్షించలేరు. పిశాచాలు రక్షించలేవు. రాక్షసులసంగతి తెలియనే తెలిసింది. పోరాటానికి బయలుదేరినప్పుడల్లా దుశ్శకునాలు కనపడుతూనే వచ్చినవి. రాముడు రావణాసురుణ్ణి సంహరించి వేస్తాడు అని ఆ దుశ్శకునాలు ఎప్పటికి అప్పుడు సూచిస్తూనే వచ్చినవి.

"పూర్వము బ్రహ్మదేవుడు రావణాసురుడితపస్సుకు మెచ్చుకొన్నాడు. దేవ దానవ రాక్షసులవల్ల చావురాకుండాఉండే వరము ఇచ్చినాడు. అయితే అప్పుడు రావణాసురుడు మనుష్యులనుగురించి అడగనూలేదు, బ్రహ్మదేవుడు రావణాసురుడికి మానవులవల్ల చావు లేకుండా ఉండేవరము ఇవ్వనూలేదు. రావణాసురుడు అప్పుడు అడగనందువల్ల ఇప్పుడు రావణాసురుడికి రాక్షసులకూ మానవుడివల్ల ప్రాణాంతకము అయిన భయము వచ్చిపడ్డది. ఇప్పుడు ఈ ఘోరము జరుగుతున్నది.

"అప్పుడు బ్రహ్మదేవుడు ఇచ్చిన వరమునుంచి రావణాసురుడు మరింతబలవంతుడు అయి పెట్టిన బాధలు దేవతలు భరించలేక పోయినారు. అత్యుగ్రము అయిన తపస్సు చేసినారు. అందుకు ఆ మహాత్ముడు బ్రహ్మదేవుడు సంతోషించి అదిమొదలు ముల్లోకాల లోనూ దానవులూ రాక్షసులూ దేవతలను బాధపెట్టరు అనీ భయముతో సంచరిస్తారు అనీ చెప్పినాడు. ఆమాత్రముతో దేవతలు తృప్తిచెందక దేవేంద్రుడివెంట బయలుదేరి త్రిపురాసురులను సంహారము చేసిన శివుడిదగ్గరికి పోయినారు. ఆ వృషభధ్వజుణ్ణి ప్రార్థించినారు. అందుకు ఆ మహాదేవుడు ప్రసన్నుడు అయి దేవతలను చూచి "ఓ దేవతలారా, రాక్షసులు అందరూ నాశనము అయిపోవడానికి ఒక స్త్రీ జన్మిస్తుంది. ఆమెనుంచి మీరు అందరూ స్వస్థముగా ఉంటారు" అని చెప్పినాడు. ఆ దేవతలకోసము సమస్త రాక్షసులనూ నాశనము చేసివేయడానికి ఈ సీత వచ్చింది. మునుపు ఆకలినుంచి దానవులు అందరూ చచ్చిపోయినారు. ఇప్పుడు ఈ సీతనుంచి రావణాసురుడితోకూడా మనము అందరమూ చచ్చిపోతాము. ఆ దుర్వినీతుడు ఆ దుర్మతి రావణాసురుడు చేసిన దుష్కార్యానికి మనము అందరమూ దుఃఖము అనుభవించవలసి

వచ్చింది. నాశనముఅయిపోవలసివచ్చింది. ప్రళయకాలములో యముడిచేతిలో పడేట్టు ఇప్పుడు మనము అందరమూ రాముడిచేతిలో పడ్డాము. మనలను కాపాడేవాడు ఎవడూ ఇప్పుడు ఈ లోకములో కనపడడములేదు. మనము కార్చిచ్చుమంటలు కమ్ముకొన్న కారడవిలో ఆడఏనుగులవలె అయిపోయినాము. ఈ ఆపత్కాలములో మనలను రక్షించేవాడు ఎవడూ లేడు. ఆ మహాబుద్ధిమంతుడు విభీషణుడు సమయానుకూలముగా ప్రవర్తించినాడు. ఎవడివల్ల భయమో ఆ రాముడికే శరణాగతుడు అయినాడు" అంటూ ఆ రాక్షసాంగనలు అందరూ భయార్తలు అయి, బాహువులు చాచి, పరస్పరమూ కౌగలించుకొని భయంకరముగా ఏడ్చినారు.

౯౫

లంకాపట్టణములో ఇంటింటా రాక్షసాంగనలు పెద్దపెట్టున ఏడ్వడము రావణాసురుడికి వినిపించింది. ఆ భయంకరాకారుడు పెద్ద పెద్ద నిట్టూర్పులు విడుస్తూ ఒక ముహూర్తముసేపు ఆలోచించినాడు. మహోగ్రుడు అయిపోయినాడు. పండ్లతో తన పెదవి కొరుక్కొన్నాడు. కోపావేశపరవశుడు అయి కన్నులు ఎర్రచేసినాడు. ఒళ్ళుఎరుగని కోపములో ప్రళయకాలాగ్నివలె తేజరిల్లినాడు. అప్పుడు ఆ రావణాసురుణ్ణి అతని అనుచరులే తేరిపార చూడలేకపోయినారు. అతడు అప్పుడు తన సమీపములో ఉన్న రాక్షసులను కన్నులతో కాల్చివేసేటట్టుచూస్తూ మాటలు తడబడుతూ మహోదరుణ్ణి మహాపార్శ్వుణ్ణి విరూపాక్షుణ్ణి ఉద్దేశించి "నేను ఆజ్ఞాపిస్తున్నాను. సైన్యాలు వెంటనే బయలుదేరి పోవలెను అని రాక్షసవీరులతో చెప్పండి" అన్నాడు. ఆ మాటలకు వాళ్ళు భయపడ్డారు. రాజాజ్ఞను శిరసావహించి రాజకార్యాలలో ఏమరుపాటు ఎరుగని రాక్షసులను యుద్ధానికి ప్రేరేపించినారు. అప్పుడు ఆ ఘోరాకారులు అందరూ "అట్లాగేను" అన్నారు. రావణాసురుడి ఆశీర్వాదముతో యుద్ధాభిముఖులు అయినారు. అంతట ఆ నిశాచరులు అందరూ యథాన్యాయముగా తమ ఏలికను గౌరవించినారు. అతడు జయించవలెను అని ఆశీర్వదించినారు. అక్కడ నిలుచున్నారు.

ఒళ్లు ఎరగని కోపములో ఉన్న ఆ రావణాసురుడు అప్పుడు మహోదరుణ్ణి మహాపార్శ్వుణ్ణి విరూపాక్షుణ్ణి చూచి నవ్వుతూ "ఓ వీరులారా, ఈవేళ నేను నా ధనుస్సులోనుంచి ప్రళయకాలాదిత్యుడు వంటి బాణాలు వదులుతాను. రామలక్ష్మణులను యమసదనానికి పంపించివేస్తాను. ఖరుణ్ణి కుంభకర్ణుణ్ణి ప్రహస్తుణ్ణి ఇంద్రజిత్తునూ సంహారముచేసివేసిన ఆ శత్రువును చంపివేయడమే ప్రతీకారము. నేను వదిలే బాణాలు మేఘాలవలె కమ్ముకొని అంతరిక్షమూ దిక్కులూ నదులూ సముద్రమూ కనపడకుండా పోతవి. వానర యోధులనూ యోధపతులనూ ప్రత్యేకము ప్రత్యేకముగా సంహారము చేసివేస్తాను. వాయువువలె సంచరించే రథముమీద ధనుస్సు అనే సముద్రములోనుంచి బాణాలు అనే అలలు పైకి లేచి వానర సైన్యాన్ని ముంచివేస్తవి. కొంచెము వికసించిన పద్మమువంటి ముఖాలతోనూ పద్మకింజల్కాలవంటి దేహచ్ఛాయతోనూ కనుపించే వానరయోధకటాకాలను నేను ఏనుగువలె ధ్వంసము చేసివేస్తాను. నేటి యుద్ధములో నా బాణాలు ముఖాలలో గుచ్చుకొని వానర యోధపతులు పడిపోయి తూండ్లతోకూడా పద్మాలవలె ఈ భూమి మీద అలంకారముగా అగుపిస్తారు. నేను వదిలే ఒక్కొక్క బాణానికి వృక్షాలను తీసుకొని ప్రచండముగా పోరాడే వానర యోధులు ఒక్కొక్క వందమంది చొప్పున నేల కూలుతారు. భర్త పోయినాడనీ భ్రాత పోయినాడనీ పుత్రుడు పోయినాడనీ ఏడుస్తూ ఉన్న రాక్షసాంగనల కన్నీళ్లు నేను నేను శత్రువులను వధించివేయడముతో తుడుచుకొనిపోతవి. నా బాణాలతో నేను వానరులను అందరినీ భేదించి ప్రాణాలు పోకొట్టి పడపెట్టి నేల కనపడకుండా చేసివేస్తాను. నేను నా బాణాలకు చచ్చి పడిపోయే శత్రువుల మాంసము నక్కలూ గద్దలూ తనివితీర తింటవి. తృప్తి చెందుతవి.

"ఓ వీరులారా, వెంటనే నారథము అలంకరించండి. ధనుస్సు తీసుకొని రండి. ఇంకా మిగిలిఉన్న రాక్షసులు అందరూ నా వెంట బయలుదేరండి" అని చెప్పినాడు. అంతట మహాపార్శ్వుడు అక్కడ ఉన్న సేనాధ్యక్షులనుచూచి "సేనలను వెంటనే తీసుకొనిరావలసింది" అని ఆజ్ఞాపించినాడు. ఆ మహాబలవంతులు సేనాధ్యక్షులు

అంతట ఇంటింటికీ పోయి ఆ యా రాక్షసులను అందరినీ యుద్ధానికి పురికొల్పుతూ లంకాపట్టణము అంతా తిరిగినారు.

అప్పుడు ఒక ముహూర్తము సేపటిలో ఖడ్గాలూ పట్టిసాలూ శూలాలూ గదలూ ముసలాయుధాలూ హలాయుధాలూ కరుకు అంచుల శక్త్యాయుధాలూ గొప్ప గొప్ప కూటముద్గరాలూ నిర్మలము అయిన చక్రాయుధాలూ వాడి వాడి గండ్రగొడ్డళ్ళూ భిండివాలాలూ శతఘ్నులూ ఇంకా వివిధ ఆయుధాలూ చేతులలో పట్టుకొని భయంకరముగా గర్జిస్తూ భయంకరము అయిన ముఖాలతో భయంకరాకారులు అయిన రాక్షసయోధులు యుద్ధసన్నద్ధులు అయి వచ్చినారు. అప్పుడు సేనాధ్యక్షుడు అక్కడికి ఎనిమిది గుర్రాలు కట్టిన రథాన్ని సారథిచేత తోలించుకొని వచ్చినాడు. దేదీప్యమానముగా తేజరిల్లుతూ ఉన్న ఆ రథముమీద అప్పుడు ఆ భయంకరాకారుడు రావణాసురుడు ఎక్కినాడు. ఆ రథమువెంట రాక్షసయోధులు బయలుదేరినారు. తన బలాతిశయముతో రావణాసురుడు ఈ భూమిని చీల్చివేస్తున్నట్టుగా వడివడిగా రథముమీద సాగిపోయినాడు. ఆ రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి ఎదిరించను అలవికాని మహాపార్శ్వుడూ మహోదరుడూ విరూపాక్షుడూ అతనివెంట రథాలమీద బయలుదేరినారు. వారు అందరూ సంతోషాతిశయముతో ఈ భూమిని బ్రద్దలు చేయటానికి పోయేటట్లు పెడబొబ్బలు పెట్టుతూ జయము కాంక్షిస్తూ ముందుకు సాగిపోయినారు.

రాక్షసయోధగణాలను వెంటపెట్టుకొని ధనుస్సు పైకి ఎత్తిపట్టుకొని ప్రళయకాల మప్పుడు సమస్తప్రాణికోటినీ నాశనము చేసివేసే యముడివలె తేజరిల్లుతూ ఉన్న ఆ మహారథుడు (తననూ, తన సారథినీ, రథాన్నీ, రథధ్వజాన్నీ కాపాడుకొంటూ పదకొండువేల మంది విలుకాండ్రతో ఒంటరిగా పోరాడే) రావణాసురుడు జవనాశ్వాలు పూన్చిన తన రథాన్ని రామలక్ష్మణులు ఉన్న ఉత్తర ద్వారముదగ్గరకు అప్పుడు తోలించినాడు.

ఆ సమయాన సూర్యుడికాంతులు మాసిపోయినవి. దిశలన్నీ చీకట్లు కమ్ముకొన్నవి. భయంకరము అయిన పక్షులు అమంగళముగా అరిచినవి. భూమి కంపించినట్లుగా తోచింది. నెత్తురువాన కురిసింది.

గుఱ్ఱాల కాళ్ళు జారినవి. రథధ్వజాగ్రముమీద గద్ద వాలింది. నక్కలు భయంకరముగా అరిచినవి. అప్పుడు రావణాసురుడి ఎడమ కన్నూ ఎడమభుజమూ అదరినవి. అతని ముఖము వివర్ణము అయి పోయింది. డగ్గుత్తిక పడ్డది. అప్పుడు యుద్ధానికి పోతూఉన్న రావణాసురుడికి చావును సూచించే ఈ దుర్నిమిత్తాలు అన్నీ ఎట్టఎదుట తోచినవి. అంతేకాదు. అప్పుడు అంతరిక్షమునుంచి ఒక కొరవి పిడుగు పడ్డంత ధ్వనితో కింద పడ్డది. కాకులూ గద్దలూ ఏకమై ఎదురుగుండావచ్చి అమంగళముగా అరిచినవి. కాలము ముగించుకొని వస్తూఉన్నందువల్లనూ వధార్హి అయిన రావణాసురుడు ఈ అపశకునాలను ఆలోచించను అయినా ఆలోచించకుండా యుద్ధభూమికి పోయినాడు.

రావణాసురుడి రథఘోషాన్ని వానరులు విన్నారు. మహా దాకారులు అయిన రాక్షసయోధులను చూచినారు. అంతట వానర సైన్యము యుద్ధసన్నద్ధము అయి నిలుచున్నది. అప్పుడు ఆ వానర సైన్యాలను రాక్షససైన్యాలూ, రాక్షససైన్యాలను వానర సైన్యాలూ, అన్యోన్యమూ యుద్ధానికి ఆహ్వానించుకొన్నవి. ఉభయ పక్షాలవారూ జయకాంక్షతో దొమ్మిగా యుద్ధము ఆరంభించినారు.

అప్పుడు దశగ్రీవుడు ఉగ్రుడు అయిపోయి వానరసైన్యాల మీద బంగారు పింజల బాణాలు వదిలినాడు. ఆ బాణాలకు ఆ వానరసైన్యములో కొందరి తలలు తెగి పడిపోయినవి. గుండెకాయలు బద్దలు అయి కొందరు పడిపోయినారు చెవులు తెగి కొందరు పడిపోయినారు. ప్రక్కలు విరిగి కొందరు పడిపోయినారు. కన్నులు పోయి కొందరు పడిపోయినారు. ఉచ్ఛ్వాసనిశ్వాసలు లేకుండా కొందరు పడిపోయినారు.

రావణాసురుడు కోపముతో కనుగుడ్లు తిప్పుతూ ఆ యుద్ధభూమిలో రథముమీద ఏ యే వైపులకు పోతే ఆ యా వైపుల వానరులు అతని బాణాల తీవ్రతను ఓర్చుకోలేకపోయినారు.

౯౬

రావణాసురుడు వదలిన బాణాలకు ఆ విధముగా వానరుల దేహాలు కత్తిరించుకొనిపోయినవి. అప్పుడు ఆ యుద్ధభూమిఅంతా

వానర కళేబరాలతో వెదజల్లినట్లు కనిపించింది. మంటలు మండే అగ్నిహోత్రాన్ని మిడుతలవలె రావణాసురుడు ఒక్కడు వదలిన బాణపాతానికి అంతమంది వానరులూ ఓర్చుకోలేకపోయినారు. చుట్టూ కమ్ముకొన్న మంటలవేడికి ఏనుగులవలె రావణాసురుడి నిశిత బాణాగ్నికి తట్టుకోలేక వానరులు కేకలుపెట్టుతూ పరుగులెత్తినారు. మహామేఘాలను ప్రచండవాయువువలె వానరసైన్యాలను రావణాసురుడు తన బాణాలతో పారదోలినాడు. ఆ రాక్షసరాజు రావణాసురుడు వానరసేనాసమూహాలను అట్లా రూపుమాపి అంతట అమిత వేగముతో రాముడిమీదికి పరుగెత్తినాడు.

ఆ పోరాటములో వానరులు పరాజితులు అయి పరుగులెత్తి పారిపోవడము సుగ్రీవుడు చూచినాడు. అందరూ ఆశ్చర్యపడిపోయే టట్లు తాను ఆ రాక్షసయోధులతో పోరాడవలెను అనుకొన్నాడు. తనతో సరిసమానము అయిన సుషేణుడికి వానరసేనాసమూహాలను ఒప్పగించినాడు. అంతట సుగ్రీవుడు ఒక మహావృక్షాన్ని ఆయుధముగా తీసుకొని రాక్షససైన్యాన్ని ఎదిరించినాడు. వానరయూథపతులు అందరూ స్వయముగా మహాశైలాలనూ వివిధవృక్షాలనూ తీసుకొని పోయి ఆ సుగ్రీవుడికి అందివ్వడానికి అతని ప్రక్కలనూ వెనుకనూ నిలుచున్నారు. ఆ మహాకాయుడు సుగ్రీవుడు మహాభయంకరముగా గర్జిస్తూ రాక్షససైన్యములో చొరబడి వివిధరాక్షసయోధులనూ వధించి మేటి రాక్షసవీరులమీదికి పోయినాడు. యుగాంతకాలాన వాయువువలె సుగ్రీవుడు పెద్ద ఎత్తున పెరిగిన చెట్లను తీసుకొని మహాకాయులు అయిన రాక్షసులను పడగొట్టినాడు. అడవిలో పక్షిసమూహాలమీద రాళ్ళవాన కురిపించే మహామేఘమువలె ఆ రాక్షససైన్యాలమీద సుగ్రీవుడు శిలావర్షము కురిపించినాడు ఆ వానరరాజు కురిపించిన రాళ్లవానకు రాక్షసులు తలలు పగిలిపోయి దేహాలు తెగిపోయి వజ్రాయుధముదెబ్బకు చిందరవందర అయిపోయిన పర్వతాలవలె నేల కూలినారు. చావగా మిగిలిన రాక్షసులు ఆ హింసను భరించలేక అరుస్తూ అన్ని వైపులా పరుగెత్తినారు.

అది విరూపాక్షుడు చూచినాడు. ఎదిరించ నలవికాని ఆ ధానుష్కుడు తన పేరు చాటించుకొంటూ రథముమీదినుంచి

సమీపములో ఉన్న ఏనుగమూపురముమీదికి ఎగిరి దూకి నిలుచొని మహాభయంకరముగా సింహనాదము చేస్తూ మహాఘోరము అయిన బాణాలను సుగ్రీవుడిమీద వదిలి బెదిరిపోతూ ఉన్న రాక్షసులకు ధైర్యము వచ్చేటట్టు చేసినాడు. రాక్షసయోధులను ఉత్సాహపరిచినాడు. వాళ్లు పరుగెత్తి పారిపోకుండా నిలపడేటట్టు చేసినాడు.

ఆ విరూపాక్షుడు వేసిన నిశితబాణాలు సుగ్రీవుడికి గుచ్చుకొన్నవి. అప్పుడు ఆ విరూపాక్షుణ్ణి చంపివేయడానికి సంకల్పించుకొన్నాడు. కోపములో చెలరేగి ఒక మహావృక్షాన్ని పైకిఎత్తి పట్టుకొని విరూపాక్షుడికి ఎదురుగుండా పరుగెత్తిపోయి అతడు ఎక్కిన ఏనుగును తన చేతితో పట్టుకొన్న చెట్టుతో బాదినాడు. ఆ దెబ్బకు ఆ ఏనుగు ఒక ధనుస్సు అంతదూరము వెనుకకు పడి అరిచింది. ప్రాణము వదిలింది. అప్పుడు ఆ వీరుడు విరూపాక్షుడు దెబ్బతిన్న ఆ ఏనుగుమీదినుంచి ఇట్టె దూకినాడు. ఎదురుగుండా స్థిమితముగా నిలుచొని ఉన్న శత్రువును సుగ్రీవుణ్ణి ఎదిరించడానికి ఎద్దుతోలు వేసిన డాలునూ ఖడ్గాన్ని తీసుకొన్నాడు. దగ్గరకు పోయినాడు. సుగ్రీవుడు అప్పుడు పెద్ద మేఘము అంతటి రాతి బండను అందుకొని విరూపాక్షుడిమీద విసరివేసినాడు. ఆ రాతి బండ తనమీద పడకుండా ఆ పరాక్రమవంతుడు విరూపాక్షుడు ఇట్టె పక్కకు తప్పుకొని చేతిలోఉన్న ఖడ్గములో సుగ్రీవుణ్ణి కొట్టినాడు. ఆ బలవంతుడి ఖడ్గప్రహారణానికి సుగ్రీవుడు చేష్టలు తప్పిపోయినాడు ఒక ముహూర్తము సేపటిలో తేరుకొన్నాడు. ఎగిరి విరూపాక్షుడి ఎదురురొమ్ములమీద తన పిడికిటితో ఒక్క పోటు పొడిచినాడు. ఆ పిడికిటిపోటుకు విరూపాక్షుడు మహోగ్రుడు అయిపోయి ఖడ్గముతో సుగ్రీవుడి కవచాన్ని తెగవేసినాడు. ఆ దెబ్బకు సుగ్రీవుడి కాళ్లు తడపడి కిందపడి ఇట్టె పైకిలేచి పిడుగులు పడుతూ ఉన్నట్టు సింహనాదము చేస్తూ ఆ విరూపాక్షుణ్ణి అరచేతితో కొట్టినాడు. ఆ సుగ్రీవుడి దెబ్బను అప్పుడు ఆ విరూపాక్షుడు నిపుణముగా తప్పించుకొని తన పిడికిటితో సుగ్రీవుడి వక్షస్థలముమీద కొట్టినాడు. సుగ్రీవుడు అంతట విరూపాక్షుడి కణతలమీద తన అరచేతితో కొట్టినాడు. దేవేంద్రుడి వజ్రాయుధముదెబ్బవంటి దెబ్బ

కణతలమీద తగలగానే విరూపాక్షుడి ముక్కులలోనుంచి నెత్తురు జలజల కారింది. నోటిలోనుంచి నెత్తురు కక్కినాడు. కొండలలో నుంచి ప్రవహించే సెలయేటివలె నోటిలోనుంచి ముక్కులలోనుంచి నెత్తురు కారింది. ఆ నెత్తురుతో ఒళ్లుఅంతా తడిసిపోయి విరూపాక్షుడు నేల కూలినాడు. నురుగులతో నెత్తురు కారుతూ కనుగుడ్లు తిప్పుతూ మరింత వికృతనేత్రాలతో చూస్తూ ఎగిరిపడుతూ పక్కలకు పొర్లుతూ దేహము అంతా నెత్తురుతో తడిసిపోయి జాలిపుట్టేటట్టు అరుస్తూఉన్న విరూపాక్షుణ్ణి వానరవీరులు అందరూ చూచినారు.

అప్పుడు ఆ రణరంగములో వానర రాక్షస సేనలు రెండున్నూ ఎదుర్కొని చెలియలికట్టలను పొంగిపొర్లిన రెండు మహాసముద్రాల వలె భయంకరము అయిన మహాఘోషము చేసినవి. ఆ మహాబలవంతుణ్ణి విరూపాక్షుణ్ణి వానరరాజు సుగ్రీవుడు చంపివేయడము చూచి వానరసైన్యాలు సంతోషాతిశయముతోనూ రాక్షస సైన్యాలు తమ వీరుడు చచ్చిపోయినాడు అనే దుఃఖమునుంచి వచ్చిన కోపాతిశయముతోనూ ఉప్పొంగిన గంగాప్రవాహమువలె పోరాడడానికి ఒకరిమీదికి ఒకరు పోయినారు.

౬౮

ఆ వానర రాక్షస సైన్యాలు అట్లా పరస్పరమూ పోరాడుతూ ఎండాకాలములో తటాకోదకాలవలె తగ్గిపోయినవి. విరూపాక్షుణ్ణి చంపివేయడమూ తన సైన్యము క్షీణించిపోవడమూ చూచి రావణాసురుడు రెండింతలు కుపితుడు అయినాడు. అది దైవవిపర్యయము అనుకొని దుఃఖపడ్డాడు. తమ సమీపములో ఉన్న మహోదరుణ్ణి చూచి "ఓ మహోదరుడా, నా జయాశ ఈ కాలానికి నీమీద ఆధారపడి ఉంది. ఓ మహాబాహూ, నీవు ఇప్పుడు శత్రువులను సంహరించవలెను. నీ పరాక్రమము చూపించవలెను. నీవు నా అన్నము తింటున్నందుకు నా ఋణము తీర్చుకొనే అవకాశము నీకు ఇప్పుడు వచ్చింది. చక్కగా యుద్ధముచేసి నీవు నాకు ప్రత్యుపకారము చేయవలెను" అని రావణాసురుడు చెప్పినాడు.

"అట్లాగేను" అని చెప్పి మహోదరుడు వానరసైన్యము మీదికి పోయినాడు. భయంకరము అయిన వానరసైన్యములో చొరబడ్డాడు. పెద్దపెద్ద రాళ్లతో రాక్షసులను కొట్టి చంపివేస్తూ ఉన్న వానరులమీద ఆ మహాబలవంతుడు మహోదరుడు బంగారు బాణాలు వదిలి వారి కాళ్లనూ చేతులనూ తొడలనూ తెగవేసినాడు. అప్పుడు మహోదరుణ్ణి చూచి రాక్షసయోధులు ధైర్యము తెచ్చుకొని విజృంభించి వానరయోధులను కొట్టసాగినారు. ఆ రాక్షసుల దెబ్బలకు ఓర్చుకోలేక వానరయోధులు కొందరు అటూ ఇటూ పరుగులెత్తినారు. కొందరు పోయి సుగ్రీవుణ్ణి ఆశ్రయించినారు.

అప్పుడు ఆ మహాపరాక్రమవంతుడు సుగ్రీవుడు మహోదరుణ్ణి చంపివేయవలెను అనుకొని పెద్ద పర్వతమంత రాతిబండను తీసుకొని విసరివేసినాడు. తనమీద వచ్చి పడపోతూఉన్న అంత పెద్ద రాతిబండను చూచి మహోదరుడు కలవరపడకుండా చటుక్కున బాణాలు వదిలినాడు. ఆ బాణాలు తగిలి ఆ రాతిబండ ముక్కలు ముక్కలు అయిపోయింది. అవి గద్దలగుంపులవలె నేలమీద పడ్డవి. ఆ రాతిబండ అట్లా అయిపోవడము చూచి సుగ్రీవుడు ఒక సాల వృక్షాన్ని పెల్లగించి ఆ మహోదరుడిమీద విసరివేసినాడు. ఆ శూరుడు ఆ మహావృక్షాన్నికూడా తన బాణాలతో ముక్కలు ముక్కలుగా నరికివేసినాడు. ఆ వృక్షమున్నూ వ్యర్థము అయిపోవడము చూచి సుగ్రీవుడు కుపితుడు అయిపోయినాడు. అక్కడ నేలమీద పడిఉన్న ఒక పరిఘాయుధాన్ని చూచినాడు. తళతళలాడుతున్న ఆ పరిఘాయుధాన్ని తీసుకొని గిరగిర త్రిప్పి తన బలాన్ని అంతా చూపించడానికి ఆ పరిఘాయుధాగ్రముతో మహోదరుడి రథానికి కట్టిన గుర్రాలను కొట్టినాడు. ఆ గుర్రాలు చచ్చి పడిపోయినవి. ఆ రథముమీదినుంచి ఆ మహాబలవంతుడు క్రిందికి దూకి ఒక గద తీసుకొని సుగ్రీవుణ్ణి ఎదిరించినాడు.

ఆబోతులవంటి ఆ వీరులు ఒకరు పరిఘాయుధముతోనూ ఒకరు గదాయుధముతోనూ మెరుపులు మెరుస్తూ ఉన్న మేఘాలవలె గర్జిస్తూ ఒకరిని ఒకరు ఎదుర్కొన్నారు. కిరణాలతో తేజరిల్లే

సూర్యునివలె తళతళ లాడుతూ ఉన్న గదను మహోదరుడు సుగ్రీవునిమీద విసరివేసినాడు. మహోదరుడు విసరివేసిన ఆ గదాయుధము తనమీద పడకుండా సుగ్రీవుడు తనచేతిలో ఉన్న పరిఘాయుధాన్ని దానిమీదికి విసరివేసినాడు. ఆ గదాయుధమూ పరిఘాయుధమూ అంతరిక్షములో ఒక దానితో ఒకటి కొట్టుకొని విరిగి నేలమీద పడిపోయినవి.

అప్పుడు ఆ తేజోవంతుడు సుగ్రీవుడు అక్కడనే నేలమీద పడిఉన్న మరి ఒక ముసలాయుధాన్ని చూచినాడు. ఇనుములో చేసి బంగారముతో అలంకరించిన ఆ భయంకర ముసలాయుధాన్ని లేవనెత్తి మహోదరునిమీద విసరివేసినాడు. మహోదరుడు అప్పటికి అప్పుడు మరి ఒక గదను అందుకొని ఆ ముసలాయుధముమీద విసరివేసినాడు. ఆ రెండూకూడా విరిగి నేలమీద పడిపోయినవి. తమ తమ ఆయుధాలు విరిగిపోగానే ఆ తేజోబలవంతులు ఉభయులూ అగ్నిహోత్రాలవలె జ్వలిస్తూ ఒకరితో ఒకరు కలియబడి పిడికిళ్ళతో పొడుచుకొన్నారు. పదే పదే పెదబొబ్బలు పెడుతూ ఒకరిని ఒకరు అరచేతులతో బాదుకొన్నారు. ఉభయులూ నేలమీద పడ్డారు. పరాజయము ఎరుగని ఆ వీరులు ఇద్దరున్నూ వెంటనే లేచినారు. మళ్ళీ ఒకరిని ఒకరు కొట్టుకొన్నారు. అంతట ఒకరిని ఒకరు పైకి లేవనెత్తి విసరివేసుకొన్నారు. ఆ పరంతపులు ఉభయులూ బాహు యుద్ధము చేసి అలసిపోయినారు. అప్పుడు ఆ మహావేగవంతుడు మహోదరుడు అక్కడ దగ్గరలో నేలమీద పడివున్న ఒక ఖడ్గాన్ని ఎద్దుతోలుతో చేసిన ఒక డాలునూ తీసుకొన్నాడు. ఆ మహో దరునికన్నా మరింత వేగవంతుడు అయిన సుగ్రీవుడు అదేవిధముగా అక్కడ నేలమీద పడిఉన్న మరిఒక మహాఖడ్గాన్ని డాలునూ తీసు కొన్నాడు. ఆ ఆయుధధారులు ఇద్దరూ సంతోషముతో ఖడ్గాలు ఎత్తి పట్టుకొన్నారు. అట్లా ఖడ్గాలు పట్టుకొని ఆ వీరులు ఉభయు లున్నూ ప్రదక్షిణముగానూ అప్రదక్షిణముగానూ మండలముగానూ ఒకరిచుట్టూ ఒకరు తిరుగుతూ ఒకరిని ఒకరు జయించే ప్రయత్నము చేసినారు. ఆ శూరుడు ఆ వేగవంతుడు ఆ పరాక్రమగర్వి మతి హీనుడు మహోదరుడు తన ఖడ్గముతో సుగ్రీవుణ్ణి పొడవబోయి గురి

తప్పి అతని చేతిలో ఉన్న డాలును పొడిచినాడు. ఆ డాలులో నాటుకొనిపోయిన ఖడ్గాన్ని వెనుకకు లాగుకొనిపోతూఉండగా శిరస్త్రాణముతోనూ చెవులకు పెట్టుకున్న కుండలాలతోనూ ధగధగలాడుతూ ఉన్న మహోదరుడి శిరస్సును సుగ్రీవుడు తన మహాఖడ్గముతో తెగవేసినాడు. తల తెగిపోయి ఇట్టే మహోదరుడు నేల కూలినాడు. అదిచూచి రావణాసురుడి సైన్యము అక్కడ నిలువలేకపోయింది. సైనికులు అన్నివైపులా పరుగులెత్తినారు.

సుగ్రీవుడు మహోదరుణ్ణి చంపివేసిన సంతోషాతిశయముతో వానరులు అందరితోనూ చేరి సింహనాదము చేసినాడు. దశగ్రీవుడికి కోపము వచ్చింది. రాముడు సంతోషముతో తేజరిల్లినాడు. మనోవ్యాకులముతో రాక్షసవీరుల ముఖాలు వెలవెల పోయినవి. భయపడ్డారు. బెదిరిపోయి పరుగులెత్తినారు.

మహాపర్వతంలో ఒక భాగాన్ని పడగొట్టినట్లు సూర్యపుత్రుడు ఎదిరించనలవికాని ఆ సుగ్రీవుడు మహోదరుణ్ణి నేల పడగొట్టి సూర్యుడు తన తేజముతో విరాజిల్లేటట్టు జయలక్ష్మితో తేజరిల్లినాడు.

ఆ యుద్ధములో మహోదరుణ్ణి జయించిన ఆ మహాపరాక్రమవంతుణ్ణి సుగ్రీవుణ్ణి చూచి ఆకాశములోఉన్న సుర యక్ష సిద్ధ సమూహాలూ భూమిమీద ఉన్న ప్రాణికోటులూ మెచ్చుకొన్నవి.

౯౯

మహోదరుడు సుగ్రీవుడిచేతిలో హతుడు అయిపోవడము మహాపార్శ్వుడు చూచినాడు. ఆ మహాబలవంతుడికి కోపము వచ్చింది. కన్నులు కెంపులవలె ఎర్రపడిపోయినవి. అంతట అంగదుడి భయంకర వానరసైన్యముమీద ఆ మహాపార్శ్వుడు బాణాలు వదిలినాడు. గాలి తాకిడికి తొడిమనుంచి పండ్లు రాలిపోయినట్లు ఆ బాణాల తాకిడికి మేటి వానరవీరుల శరీరాలనుంచి తలలు తెగి నేల రాలినవి. అప్పుడు ఆ మహాపార్శ్వుడి బాణాల తాకిడికి కొందరు వానరుల బాహువులు తెగిపోయినవి. కొందరు వానరుల మూపులు విరిగిపోయినవి. కొందరు వానరుల పక్కలు చీలి పోయినవి. ఆ మహాపార్శ్వుడి బాణవర్షానికి వానరయూధులు

అందరూ యమయాతన పడ్డారు. దుఃఖముతో యుద్ధభూమిలో విముఖులు అయినారు. అట్లా బాధపడుతూ భయపడిపోయిన తన సైన్యాన్ని అప్పుడు అంగదుడు చూచినాడు. ఆ మహాబాహువు అంతట పర్వసమయములో మహాసముద్రమువలె చెలరేగినాడు. సూర్యకిరణాలవలె కన్నులు మిరుమిట్లుగొలిపే బంగారుకట్లు వేసిన పరిఘాయుధాన్ని తీసుకొని మహాపార్శ్వుడిమీద విసరివేసినాడు. ఆ పరిఘాయుధము దెబ్బకు ఆ రాక్షసుడు దిమ్మెరపోయినాడు. తెలివి తప్పి సారథితో కూడా రథముమీదనుంచి కింద పడ్డాడు.

కాటుకకొండవంటి మహాబలవంతుడూ మహాపరాక్రమవంతుడూ అయిన గవాక్షుడు కుపితుడు అయిపోయి మహామేఘము వంటి నల్లటి భల్లూకసైన్యములోనుంచి బైటికివచ్చి పర్వతశిఖరము వంటి ఒక పెద్ద రాతిబండను తీసుకొని మహాపార్శ్వుడి గుర్రాలను కొట్టి చంపివేసినాడు. ఆ రథాన్ని నుగ్గునుగ్గు చేసినాడు. మహాపార్శ్వుడు ఒక ముహూర్తముసేపటికి తేరుకొన్నాడు. అంతట గవాక్షుడిమీద అనేకబాణాలు వదిలినాడు. భల్లూకరాజు జాంబవంతుడి వక్షఃస్థలముమీద మూడు బాణాలను వదిలినాడు. బాణాలు గుచ్చుకొని బాధపడుతూఉన్న గవాక్షుణ్ణీ జాంబవంతుణ్ణీ చూచి అంగదుడు పరమకుపితుడు అయిపోయి పరమభయంకరము అయిన పరిఘాయుధాన్ని తీసుకొన్నాడు. బంగారుకట్లతో సూర్యకిరణాలవలె తేజరిల్లుతూ ఉన్న ఆ పరిఘాయుధాన్ని తన రెండుచేతులలోనూ పట్టుకొని బలముకొద్దీ గిరగిరా తిప్పి దూరాన ఉన్న మహాపార్శ్వుడి మీద విసరివేసినాడు. అట్లా ఆ బలవంతుడు అంగదుడు విసరివేసిన ఆ పరిఘాయుధము రివ్వున పోయి మహాపార్శ్వుడు చేతిలో పట్టుకొని ఉన్న ధనుర్బాణాలను విరుగగొట్టి అంతటితో ఆగకుండా ఆ రాక్షసుడి కిరీటాన్ని పడగొట్టింది. అంతట అమితవేగముతో ఆ మహాపార్శ్వుడిమీదికి అంగదుడు పరుగెత్తుకొనిపోయి కుండలాలు పెట్టుకొని ఉన్న అతని గూబ గుయ్యిమనేటట్టు తన అరచేతితో కొట్టినాడు. అప్పుడు మహాపార్శ్వుడు క్రుద్ధుడు అయిపోయినాడు. మహావేగముతో ఒక పెద్ద గండ్రగొడ్డలిని అందుకొన్నాడు. ప్రతిరోజూ నూనె పూయడమునుంచి కిలుము ఎక్కకుండా నిర్మలముగానూ

పలుగురాయివలె గట్టిగా చెక్కుచెదరకుండా ఉన్న గండ్రగొడ్డలిని తన కుడిచేతితో పట్టుకొని మహాపార్శ్వుడు అంగదుని ఎడమ మెడ కొంకులు తెగవేయపోయినాడు. ఆ గండ్రగొడ్డలి దెబ్బ తగులకుండా అప్పుడు అంగదుడు ఇట్టే తప్పించుకొని వజ్రాయుధమువంటి తన పిడికిటితో మహాపార్శ్వుడి వీపుమీద ఒక గుద్దు గుద్దినాడు. ఆయువుపట్లు తెలిసిన ఆ అంగదుడు అంతట చటుక్కున ఎదురుగుండాపోయి ఆ రాక్షసుడి గుండెకాయమీద తన పిడికిటితో ఒక్కపోటు పొడిచినాడు. ఆ పిడికిటిపోటుకు మహాపార్శ్వుడి గుండెకాయ పగిలి పడిపోయినాడు. అట్లా చచ్చి పడిపోయిన మహాపార్శ్వుణ్ణి చూచి రాక్షససైన్యము కలవరపడి కంపించిపోయింది.

అప్పుడు వానరయోధులు సంతోషాతిశయముతో లంకాపుర ద్వారాలూ కోట బురుజులూ పట్టణము అంతామూ పగిలిపోయేటట్లు సింహనాదాలు చేసినారు. ఆ వానరయోధులతోపాటు ఆకాశములో ఉన్న దేవేంద్రుడూ దేవతలూ మహాధ్వనులు చేసినారు.

దేవేంద్రుడితోకూడా ఆకాశములో దేవతలూ భూమిమీద వానరయోధులూ చేసిన మహాధ్వనికి ఆ దేవేంద్రశత్రువు రావణాసురుడు మహోగ్రుడు అయిపోయినాడు. మళ్ళీ యుద్ధము చేయడానికి ఆ వానరసైన్యాలకు ఎదురుగుండాపోయి నిలుచున్నాడు.

౧౦౦

మహాబలవంతులూ పరాక్రమవంతులూ అయిన విరూపాక్ష మహోదర మహాపార్శ్వులు పడిపోవడము చూచి రావణాసురుడు పరమకుపితుడు అయినాడు. అంతట సారథినిచూచి రథము తోలమని చెప్పుతూ "సూతుడా, ఇప్పుడే నేను రామలక్ష్మణులను చంపివేయవలెను. వానరులు నా అమాత్యులను చంపివేసినారు. లంకా పట్టణాన్ని ముట్టడించినారు. నేను ఇప్పుడు అందరి దుఃఖమూ పోగొట్టవలెను. రాముడు అనే వృక్షానికి సుగ్రీవుడూ జాంబవంతుడూ అంగదుడూ హనుమంతుడూ కుముదుడూ నలుడూ గంధమాదనుడూ మైందద్వివిదులూ తక్కిన వానరయూధపతులూ కొమ్మలవంటివాళ్లు. ఆ చెట్టుకు సీత పుష్పమూ ఫలమూ వంటిది. ఇప్పుడు కొమ్మలతో

కూడా రామవృక్షాన్ని పడగొట్టవలెను. అట్లా చేస్తే పుష్పమూ ఫలమూ అయిన సీత నాకు దక్కుతుంది." అంటూ ఆ అతిరథుడు రావణాసురుడు చెప్పినాడు. రథము కదిలింది. ఆ రథఘోషము దశదిశలా మారుమ్రోగింది. ఆ రథఘోషానికి ఈ భూమిమీద ఉన్న పర్వతాలూ నదులూ అడవులూ అడవులలో ఉన్న వరాహాలూ ఏనుగులూ మొదలయిన సమస్త చరాచరాలూ సంచలించిపోయినవి. అంతట రావణాసురుడు వానరసైన్యముమీద మహాఘోరమూ అతితీక్ష్ణమూ అయిన తామసాస్త్రాన్ని వదిలినాడు. ఆ అస్త్ర ప్రభావంవల్ల మంటలు బయలుదేరి వానరయోధులను దగ్ధము చేయ సాగినవి. ఆ తామసాస్త్రాన్ని బ్రహ్మదేవుడు స్వయముగా సృష్టించి నాడు. బ్రహ్మదేవుణ్ణి మెప్పించి రావణాసురుడు దాన్ని అదివరకు తెచ్చుకొన్నాడు. ఆ తామసాస్త్రప్రభావానికి కాలిపోయినవారు పోగా మిగిలిన వానరయోధులు భయపడి పరుగులెత్తుతూఉంటే ఘోరముగా దుమ్ము రేగింది. అట్లా వందలకొద్దీ వానరసేనా సమూహాలు భగ్నముఅయిపోవడము రాముడు చూచినాడు. యుద్ధ సన్నద్ధుడు అయినాడు. ఆ ఆజానుబాహుడు ఆకాశాన్ని ఒరుసుకొని పోతూఉన్న ధనస్సును పట్టుకొన్నాడు. ఉపేంద్రుడితో ఉన్న దేవేం ద్రుడివలె లక్ష్మణుడితో కూడా తేజరిల్లుతూ ఉన్న ఆ అరిందముణ్ణి ఆ పద్మపత్రవిశాలాక్షుణ్ణి, రాముణ్ణి అప్పుడు రావణాసురుడు చూచి నాడు. అట్లా తనమీదికి వస్తూఉన్న రావణాసురుణ్ణి రామలక్ష్మ ణులు చూచినారు. రాముడు సంతోషాతిశయములో తన శార్ఙ్గ కము నడుమ పట్టుకొని ఉత్తమోత్తమము అయిన బాణాన్ని ఎక్కించి అల్లెత్రాడును అమిత వేగముతో లాగినాడు. భూమి బ్రద్దలు అయిపోయేటంత మహాధ్వని అయింది. అప్పుడు రావణాసురుడు ఇట్టె రాముడిమీద బాణాలు వదిలిపెట్టడము మొదలుపెట్టినాడు. రాముడు ధనుస్సు సారించిన మహాధ్వనికి అటు రాక్షసులూ, రావణా సురుడు బాణాలు వదులుతూఉన్న మహాధ్వనికి ఇటు వానరులూ దిమ్మరపోయి వందలకొద్దీ నేలమీద పడ్డారు. అట్లా రామలక్ష్మణుల ఎదటికి వచ్చిన రావణాసురుడు అమావాస్యనాడు సూర్యచంద్రులను పట్టపోయే రాహువువలె కనిపించినాడు. లక్ష్మణుడు ఆ రావణా సురుడితో ముందుగా పోరాడవలెను అనుకొన్నాడు. అందుకు

రాముడు ఒప్పుకొన్నాడు. లక్ష్మణుడు అంతట తన ధనుస్సును వంచి రావణాసురుడిమీద అగ్నిశిఖలవంటి బాణాలను వదిలినాడు. ఆ బాణాలను అన్నిటినీ ఆ మేటివిలుకాడు రావణాసురుడు తన బాణాలతో ఆకాశములోనే కొట్టివేసినాడు. అంతట తన హస్తలాఘవము చూపిస్తూ రావణాసురుడు లక్ష్మణుడు వదిలిన ఒక బాణాన్ని ఒక బాణములోనూ మూడింటిని మూడింటితోనూ పదింటిని పదింటితోనూ అంతరిక్షములోనే నరికివేసినాడు.

అంతట, ఆ శత్రుహంత రావణాసురుడు తన రథముతో లక్ష్మణుణ్ణి ఇట్టే దాటిపోయి పర్వతమువలె అచలముగా నిలుచొని ఉన్న రాముణ్ణి ఎదిరించినాడు. కోపముతో కన్నులు ఎఱ్ఱచేసి బాణవర్షము కురిపించడము మొదలుపెట్టినాడు. అమితవేగముతో జలధారలవలె రావణాసురుడి ధనుస్సులోనుంచి వెలువడుతూఉన్న బాణాలను చూచి రాముడు కత్తివాయిఅమ్ములను తీసినాడు. దేదీప్యమానముగా వెలుగుతూ కుపితవిషసర్పాలవలె భయంకరముగా వస్తూఉన్న ఆ బాణాలను తన కత్తివాయిఅమ్ములతో రాముడు ఖండించివేసినాడు. అప్పుడు రాముడిమీద రావణాసురుడూ, రావణాసురుడిమీద రాముడూ అమితవేగముతో వివిధ తీక్ష్ణబాణాలను వర్షముగా కురిపించుకొన్నారు. అమితవేగముతో వచ్చి పడుతూఉన్న ఆ బాణాలను అన్యోన్యము తప్పించుకుంటూ ఆ అపరాజితులు ఉభయులూ సవ్యాపసవ్యముగానూ గుండ్రముగానూ ఒకరిచుట్టూ ఒకరు తిరుగుతూ చాలసేపు చిత్రవిచిత్రముగా పోరాడినారు. సర్వనాశనము చేసివేసే రుద్రదేవుడివలెనూ యముడివలెనూ రామరావణులు ఉభయులూ ఏకకాలాన ఒకరిమీద ఒకరు భయంకరముగా బాణాలు వదులుకుంటూ పోరాడుతూఉంటే సమస్తప్రాణికోటి భయపడిపోయింది. వర్షాకాలములో మెరుపులతో కమ్ముకొన్న మేఘాలవలె అప్పుడు ధగధగలాడుతూ తళతళలాడుతూ ఉన్న బాణాలతో ఆకాశము అంతా నిండిపోయింది. అట్లా నిండిపోయిన ఆ బాణాలమధ్యను సందులు ఆ ఆకాశానికి కిటికీలవలె కనుపించినవి.

సూర్యాస్తమయము అయిపోయింది. చిమ్మచీకట్లు కలగచేసే మేఘాలవలె రామ రావణులు చెలరేగినారు. గద్దరెక్కలవంటి

మంచి మంచి రెక్కలతో అమితవేగముగా పోయే బాణాలు అన్యోన్యమూ వదులుకొంటూ పోరాడినారు. ఆ బాణపాతము నుంచి భయంకరము అయిన అంధకారము అలముకొన్నది. అప్పుడు రాముణ్ణి చంపివేయవలెను అని రావణుడూ, రావణుణ్ణి చంపివేయవలెను అని రాముడూ వృత్రాసుర దేవేంద్రులవలె మహాఘోరముగా పోరాటము సాగించినారు. ఆ పోరాటము అచింత్యముగానూ ఎవరికీ దగ్గరికిపోవలవికాకుండానూ జరిగింది. ఆ రామరావణులు ఉభయులూ మేటి విలుకాండ్రు. ఉభయులూ శస్త్రవిశారదులు. ఉభయులూ అస్త్రవిదులలో శ్రేష్ఠులు. ఒక్కమాదిరిగా ఒకరిచుట్టూ ఒకరు ఆ పోరాటములో తిరిగినారు. ఆ వీరులు ఇద్దరూ ఏవైపు తిరిగితే ఆవైపునుంచి రెండు సముద్రాలు ఏకము అయినచోట గాలికి రేగే అలలవలె బాణాలు పైకి ఆకాశమువరకూ లేచినవి. లోకాలను అన్నిటినీ గగ్గోలుపెట్టే ఆ రావణాసురుడు అప్పుడు తన బాణప్రయోగచాతుర్యముతో రాముడినుదుట వరుసగా బాణాలు వదిలినాడు. భయంకరము అయిన ధనుస్సులోనుంచి వెలువడిన నల్లకలువరేకులవంటి ఆ బాణాలు రాముడినుదుట గుచ్చుకొన్నవి. అయితే అతడు ఏమాత్రమూ బాధ పడలేదు. కాని ఆ మహాతేజోవంతుడికి మరింత కోపమువచ్చి రుద్రదేవతాకము అయిన మంత్రాలు జపముచేస్తూ అనేకబాణాలను ధనుస్సుకు ఎక్కించి రావణాసురుడిమీద వదిలినాడు. ఆ బాణాలు పోయి రావణాసురుడు తొడుగుకొనిఉన్న మహామేఘమువంటి అభేద్యకవచానికి తగిలినవి. అవి ఏమాత్రమూ అతనిని బాధపెట్టలేకపోయినవి. అదిచూచి ఆ సర్వాస్త్రకుశలుడు రాముడు రథముమీద ఉన్న రావణాసురుడి లలాటాన్ని గురిచేసి పరమాస్త్రమంత్రముతో అభిమంత్రించి బాణాలను మళ్ళీ వదిలినాడు. రావణాసురుడు ఆ బాణాలను తన బాణాలతో అడ్డగించినాడు. అయితే అవి రావణాసురుడు వదిలిన బాణాలను భేదించి బుసలు కొట్టుతూఉన్న అయిదు తలల పాములవలె నేల కూలినవి.

అప్పుడు ఆ మహాపరాక్రమవంతుడు రావణుడు మహోగ్రుడు అయినాడు. కోపముతో రేగి బుసలుకొట్టే పాముపలె నిట్టూర్పులు

విడిచినాడు. అసురదేవతాకము అయిన మహాభయంకరాస్త్రాన్ని అప్పుడు రాముడిమీద వదిలినాడు. ఆ అసురాస్త్రములోనుంచి కొన్ని బాణాలు సింహము ముఖమువలెనూ కొన్ని పెద్దపులి ముఖము వలెనూ కొన్ని రాబందు తలవలెనూ కొన్ని గద్ద తలవలెనూ కొన్ని డేగతలవలెనూ కొన్ని కాకితలవలెనూ కొన్ని కోడితలవలెనూ కొన్ని తోడేలు ముఖమువలెనూ కొన్ని నక్క ముఖమువలెనూ కొన్ని గాడిద ముఖమువలెనూ కొన్ని వరాహ ముఖమువలెనూ కొన్ని కుక్క ముఖమువలెనూ కొన్ని నోరు తెరచిన మొసలి తలవలెనూ కొన్ని భయంకర సర్పాలవలెనూ ఇంకా వివిధ ఆకారాలతోనూ వెలువడినవి.

అట్లా ఆ అసురాస్త్రములోనుంచి వివిధ భయానక రూపాలతో వెలువడిన ఆ బాణాలను అన్నిటినీ అగ్నిహోత్రుడివంటి రాముడు చూచినాడు. అంతట మహోత్సాహముతో ఆ అసురాస్త్రముమీద ఆగ్నేయాస్త్రము వదిలినాడు. మంటలు మండుతూ ఉన్న అగ్నిముఖాలతోనూ సూర్యముఖాలతోనూ చంద్రముఖాలతోనూ అర్ధచంద్రముఖాలతోనూ ధూమకేతుముఖాలతోనూ గ్రహ నక్షత్ర ముఖాలతోనూ బాణాలు వెలువడినవి. అవే కాకుండా పెద్ద పెద్ద కొరవులవలెనూ మెరపుతీగలవలెనూ నిశిత బాణాలు బయలుదేరినవి. రావణాసురుడు వదిలిన భయంకరాసురాస్త్రబాణాలను ఆకాశములోనే ఆ ఆగ్నేయాస్త్రబాణాలు దహించివేసినవి.

ఆ అసురాస్త్రము అట్లా ధ్వంసము అయిపోవడము చూచి కామరూపులు అయిన సుగ్రీవాది వానరవీరులు అందరూ రాముడిచుట్టూ మూగి సంతోషాతిశయములో దిక్కులు పిక్కటిల్లిపోయేట్లు సింహనాదాలు చేసినారు.

౧౦౧

అసురాస్త్రము హతము అయిపోయింది. అందువల్ల రావణాసురుడికి మరింత కోపము వచ్చింది. అంతట ఆ మహాద్యుతిమంతుడు మయుడు సృష్టించిన రౌద్రాస్త్రాన్ని రాముడిమీద వదిలినాడు.

వజ్రాయుధమువంటి శూలాలూ, దేదీప్యమానము అయిన ముసలాయుధాలు, గదలూ, తళతళలాడుతూ ముద్గరాలు, కూటపాశాలూ, ఇంకా వివిధాయుధాలు ఆ రౌద్రాస్త్రప్రభావమువల్ల రావణాసురుడి కార్ముకములోనుంచి ప్రళయకాలవాయువులవలె వెలువడినవి.

ఆ శ్రీమంతుడు రాముడు వాటిని చూచినాడు. ఉత్తమాస్త్రవిదులలో శ్రేష్ఠుడు అయిన ఆ కాంతిమంతుడు రాముడు అంతట గంధర్వదేవతాకము అయిన పరమాస్త్రాన్ని వదిలినాడు. ఆ గాంధర్వాస్త్రము రావణాసురుడు వదిలిన రౌద్రాస్త్రాన్ని కొట్టివేసింది. అప్పుడు రావణాసురుడు కోపముతో కన్నులు ఎర్రచేసి రాముడిమీద సౌరాస్త్రాన్ని వదిలినాడు. మంటలు మండుతూ పెద్ద పెద్ద చక్రాయుధాలు అప్పుడు ఆ దశగ్రీవుడి ధనుస్సులోనుంచి భయంకరవేగముతో బయలుదేరినవి. దేదీప్యమానముగా బయలుదేరివచ్చి అన్నివైపులా పడుతూఉన్న ఆ చక్రాయుధాలు ఆకాశాన్నీ దిశలనూ తేజరిల్లచేసే సూర్యచంద్రులవలెనూ, గ్రహాలవలెనూ కనిపించినవి. చిత్రవిచిత్రముగా తిరుగుతూ మంటలు మండుతూ పడబోతూఉన్న ఆ చక్రాయుధాలను అన్నిటినీ రాముడు తన ఉత్తమోత్తమ బాణాలతో నరికివేసినాడు. తాను వదిలిన సౌరాస్త్రము అట్లా హతము అయిపోవడము చూచి రావణాసురుడు రాముడి ఆయువుపట్లు గురిచేసి, పది బాణాలు వదిలినాడు. ఆ పది బాణాలున్నూ తన మర్మస్థానాలలో గుచ్చుకొన్నప్పటికిన్నీ ఆ మహాతేజోవంతుడు రాముడు ఏమాత్రమూ చలించలేదు. ఎటువంటి కష్టసమయమున అయినా శత్రుసమూహాలను జయించివేసే ఆ రాముడు అప్పుడు రావణాసురుడి సమస్త అవయవాలలోనూ పడేట్టు అనేక బాణాలు వదిలినాడు. ఆ సమయములో తన అన్నగారిని లక్ష్మణుడు చూచినాడు. అతనికి కొంత విరామము ఇవ్వ తలచినాడు. ఆ పరవీరహంత లక్ష్మణుడు అప్పుడు ఏడు బాణాలు వదిలినాడు. అవి అమితవేగముతో పోయి మనుష్యశీర్షము చిత్రించిఉన్న రావణాసురుడి రథధ్వజాన్ని ముక్కలు ముక్కలుగా పడగొట్టింది. అంతట ఆ కాంతిమంతుడు ఆ మహాబలవంతుడు లక్ష్మణుడు రావణాసురుడి రథసారథిని గురిచేసి ఒకే ఒక బాణమును వదిలినాడు.

ధగధగలాడే కుండలాలతో ఉన్న ఆ రథసారథి శిరస్సును ఆ బాణము తెగవేసినది. అప్పుడు ఆ మహాపరాక్రమవంతుడు మరి అయిదు బాణాలు వదిలి ఆ రాక్షసరాజు రావణాసురుడి చేతిలో పట్టుకొని ఉన్న ఏనుగుతొండమువంటి ధనుస్సును నరికివేసినాడు.

అది విభీషణుడు చూచినాడు. లక్ష్మణునికి కొంచెము విరామము ఇవ్వవలెను అనుకొన్నాడు. పైకి ఎగిరి తనచేతిలో ఉన్న గదతో రావణాసురుడి రథానికి కట్టిన గుర్రాలను పడకొట్టినాడు. పర్వతాకారములో ఉన్న నీలమేఘాలవంటి ఆ గుర్రాలు చచ్చి నేల కూలినవి. ఆ గుర్రాలు హతము అయిపోగానే రావణాసురుడు మహావేగముతో రథముమీదినుంచి కిందికి దూకినాడు. తన తమ్ముడు విభీషణుడిమీద తీవ్రకోపము వచ్చింది. ఆ మహాశక్తిమంతుడు శక్త్యాయుధాన్ని తీసుకొని విభీషణుడిమీద విసరివేసినాడు. అది వచ్చి విభీషణుడిమీద పడేలోపలనే లక్ష్మణుడు మూడు బాణాలు గురిచేసి ఆ శక్త్యాయుధముమీద వదిలినాడు. కాంచనమాలలతో జ్వలిస్తూ ఉన్న ఆ శక్త్యాయుధము మూడుచోట్ల విరిగి అగ్నికణాలు రేగుతూ మంటలు మండుతూ ఆకాశమునుంచి రాలే మహోల్కమువలె కింద పడ్డది.

అంతట రావణాసురుడు మరి ఒక శక్త్యాయుధాన్ని తీసుకొన్నాడు. అది అతడు నిత్యమూ పూజించేది. యముడు సహితము దానిని ఎదిరించలేడు. ఎవరూ దానివంక తేరిపార చూడలేరు. అది మహాకాంతివంతము అయిన దేవేంద్రుడి వజ్రాయుధమువంటిది. దానిని రావణాసురుడు తన బలముకొద్దీ గిరగిర తిప్పినాడు. అది అప్పుడు మహాభయంకరముగా మంటలు మండింది. ఆ మహాశక్త్యాయుధమునుంచి ప్రాణసంశయావస్థలో ఉన్న విభీషణుణ్ణి లక్ష్మణుడు చూచినాడు. ఆ మహావీరుడు చటుక్కున పోయి ఆ విభీషణుడికి అడ్డముగా నుంచున్నాడు. ఇట్టె తన ధనుస్సును వంచినాడు. మహాశక్త్యాయుధాన్ని తన చేతులలోనుంచి వదలపోతూఉన్న రావణాసురుడిమీద బాణాలు వదిలిపెట్టినాడు. ఆ విధముగా ఆ మహాధైర్యవంతుడు లక్ష్మణుడు ఎడతెగకుండా బాణాలు వదలిపెట్టుతూ ఉంటే రావణాసురుడి పరాక్రమము పెడతిరిగింది. ఆ మహాశక్త్యాయుధాన్ని విభీషణుడిమీద విసరివేయలేకపోయినాడు.

ఆ మహాశక్త్యాయుధమునుంచి తన తమ్ముణ్ణి తప్పించిన లక్ష్మణునికి ఎదురుగుండా రావణాసురుడు పోయి "ఓ లక్ష్మణా, నీ బలాన్ని మెచ్చుకొన్నాను. నీవు నా తమ్ముణ్ణి నా శక్త్యాయుధము నుంచి తప్పించినావు. కనుక వాణ్ణి వదిలిపెట్టి నీమీదనే ఈ శక్త్యాయుధాన్ని వదులుతాను. ఇనుపగుదియలవంటి నా బాహువులు చూడు. బాహుబలముకొద్దీ ఈ మహాశక్త్యాయుధాన్ని నీమీద విసరివేస్తాను. ఇది నీ గుండెలు పగులకొట్టుతుంది. నీప్రాణాలను ఎత్తుకొనిపోతుంది. నీ నెత్తురుగుర్తులతో తిరిగి నాదగ్గరకు వస్తుంది" అని చెప్పుతూ మయుడు తన మాయాబలముతో సృష్టించిన ఆ మహాశక్త్యాయుధాన్ని లక్ష్మణుడి ఎదురురొమ్మును గురిచేసి విసరివేసినాడు. అంతట రావణాసురుడు సింహనాదము చేసినాడు. శత్రువులను సంహారము చేసివేసే ఆ అమోఘశక్త్యాయుధము ధగ ధగ మంటలు మండుతూనూ దానికి అమర్చిన ఎనిమిది ఘంటలూ మహాభయంకరముగా మోగుతూనూ బయలుదేరింది. వజ్రాయుధము వలె కన్నులు మిరుమిట్లుగొలిపే కాంతులతోనూ చెవులు గింగురులు ఎత్తే మహాధ్వనులతోనూ లక్ష్మణుడి వక్షస్థలముమీద పడపోతూ ఉన్న ఆమహాశక్త్యాయుధాన్ని చూచి రాముడు "ఓ శక్త్యాయుధమా, నీ ఉద్యమము హతము అయిపోవలెను. నాతమ్ముడు లక్ష్మణుడు స్వస్థముగా ఉండవలెను" అని అరచి చెప్పినాడు. ఆ మహాశక్త్యాయుధము అప్పుడు మహాక్రూరవిషసర్పమువలె పోయి నిర్భయముగా నిలుచొనిఉన్న లక్ష్మణుడి వక్షస్థలాన పడ్డది. మహావేగముతో మంటలు మండుతూ కన్నులు మిరుమిట్లుగొలిపే సర్పరాజు (ఆదిశేషుని) నాలుకవలె శక్త్యాయుధము లక్ష్మణుడి విశాలవక్షస్థలముమీద మరీ గాటముగా నాటుకొన్నది. అతని ఎదురురొమ్ములమీద బలమైన గాయము అయింది. అతడు ఒళ్ళు తెలియకుండా నేలమీద పడిపోయినాడు.

ఆ సమీపములోనే ఉన్న మహాతేజోవంతుడు రాముడు లక్ష్మణుడి ఆ దురవస్థను చూచినాడు. విషణ్ణుడు అయిపోయినాడు. కన్నీళ్లు కారుస్తూ ఒక ముహూర్తముసేపు ఆలోచించినాడు. దుఃఖ పడడానికి అది సమయముకాదు అనుకొన్నాడు. ప్రళయకాలాగ్ని

మహోగ్రునివలె రేగినాడు. ఏమి అయినప్పటికిన్నీ ఏవిధముగాను అయినప్పటికిన్నీ రావణాసురుణ్ణి చంపివేయడానికి నిశ్చయించుకొన్నాడు. శక్త్యాయుధము గుచ్చుకొని నెత్తురుతో తడిసిపోయి పడిఉన్న లక్ష్మణుడు పాము చొరబడ్డ పర్వతమువలె కనుపించినాడు. ఆశక్త్యాయుధాన్ని వానరులు లాగివేయడానికి ప్రయత్నము చేసినారు. కాని ఆ బలవంతుడు రావణాసురుడు వదులుతూఉన్న బాణాలు గుచ్చుకొని బాధపడుతూ ఉన్నందువల్ల దానిని వారు లాగివేయలేకపోయినారు. లక్ష్మణుణ్ణి ఛేదించి నేలలో దిగబడిపోయిన ఆ మహాశక్త్యాయుధాన్ని అప్పుడు ఆ బలవంతుడు రాముడు తన రెండుచేతులా పట్టుకొని పైకిలాగి దానిని విరిచివేసినాడు.

ఆ మహాశక్త్యాయుధాన్ని రాముడు పైకిలాగి విరిచివేస్తూ ఉండగా రావణాసురుడు రాముని సమస్త అవయవాలలోనూ బాణాలు వదిలినాడు. అట్లా తన మర్మస్థానాలలో పడుతున్న బాణాలను గురించి ఏమాత్రమూ లక్ష్యముచేయకుండా రాముడు లక్ష్మణుణ్ణి కౌగలించుకొని హనుమంతుణ్ణి సుగ్రీవుణ్ణి తక్కిన వానరవీరులనూ చూచి "ఓ వానరవీరులారా, మీరు ఇక్కడనే ఈ లక్ష్మణునిచుట్టూ కనిపెట్టుకొని ఉండండి. ఎంతో కాలమునుంచీ కోరుకొంటూఉన్న చాతకపక్షికి వేసంగి అయిపోగానే మేఘము అగుపించినట్టు బహుకాలమునుంచీ పరాక్రమించవలెను అనుకొంటూ ఉన్న నాకు ఇప్పుడు ఈ పాపాత్ముడు ఈ ప్రాపనిశ్చయుడు రావణాసురుడు దొరికినాడు. వీణ్ణి నేను చంపివేస్తాను.

"ఓ వానరులారా, ఎంతోసేపు పట్టదు. నేను సత్యప్రమాణము చేసి చెప్పుతున్నాను. ఈ జగత్తులో ఒక్క ముహూర్తము సేపటిలో రావణాసురుడు అయినా ఉండడు. లేదా రాముడు అయినా ఉండడు. ఓ వీరులారా, నాకు రాజ్యము పోయింది. నేను వనవాసము చేసినాను. దండకారణ్యము అంతా తిరిగి చూచినాను. రాక్షసులు నన్ను ఎదిరించినారు. నా భార్యను సీతను పరపురుషుడు తాకినాడు. ఎత్తుకొనిపోయినాడు. ఇన్ని దుఃఖాల పాలు అయినా నేను నిబ్బరించుకొన్నాను. ఇప్పుడు

ఈ లక్ష్మణుడికి తగిలిన దెబ్బనుంచి నేను మహాఘోరనరకబాధ అనుభవిస్తున్నాను. నా దుఃఖము మేర మీరి పోయింది. ఈ దుఃఖము అంతా తీరిపోవడానికి నేను ఈ రావణాసురుణ్ణి సంహారము చేయవలెను. ఈ రావణాసురుడికోసమే నేను పోరాటములో వాలిని చంపివేసినాను. సుగ్రీవుణ్ణి వానరరాజుగా చేసినాను. ఈ దురాత్ముడికోసమే మీ మీ సైన్యాలను ఇక్కడికి తీసుకొని వచ్చినాను. మీచేత మహాసముద్రాన్ని సేతువు కట్టించినాను. వీడు ఈ పాపిష్టివాడు ఈ యుద్ధరంగములో ఇప్పుడు నాకంటికి కనపడుతున్నాడు. విషము చూపు చూచే పాము కంట పడ్డవాడు ఎవడూ బ్రతకడు. వీడు ఇప్పుడు నాకంట పడ్డాడు. ఇక వీణ్ణి నేను జీవించనీయను.

"ఓ వానరవీరులారా, మీరు అందరూ ఎదిరించనలవికాని పరాక్రమవంతులు. నాకు తెలుసును. ఇక్కడ స్వస్థముగా కూర్చొని ఉండండి. నాకూ రావణాసురుడికీ జరిగే యుద్ధము చూడండి. యుద్ధభూమిలో రాముడి రామత్వము ఏమిటో ముల్లోకాలలో ఉన్న దేవతలూ దేవర్షులూ చారణులూ గంధర్వులూ మొదలైనవారు అందరూ ఇప్పుడు చూస్తారు. చరాచరము అయిన సమస్తలోకాలవారూ భూమి ఉండేటంతవరకూ నేను ఎట్లాపోరాడిందీ చెప్పుకొంటారు" అని రాముడు చెప్పినాడు.

అంతట రాముడు హెచ్చరికతో యుద్ధాభిముఖుడు అయినాడు. తప్తకాంచన భూషిత తీక్ష్ణబాణాలు ఇట్టే అమ్ముల పొదిలోనుంచి తీసినాడు. రావణాసురుడిమీద వదిలినాడు. అప్పుడు రాముడిమీద రావణాసురుడు మేఘము జలధారలను వర్షించేటట్లు మంటలు మండుతూ ఉన్న బాణాలనూ భయంకరము అయిన ముసలాయుధాలనూ కురిపించినాడు. రామరావణులు ఉభయులూ వదిలిన బాణాలు పరస్పరము ఆకాశములో కొట్టుకుంటూ ఉంటే మహాధ్వని అయింది. అవి అట్లా కొట్టుకొని విరిగి పోయి కొనలు మంటమండుతూ అంతరిక్షమునుంచి వెదచల్లినట్లు నేలమీద పడ్డవి. ఆ ఉభయ ధనుష్టంకారధ్వనులకూ సమస్త ప్రాణికోటి సంచలించింది. భయపడ్డది. ఆశ్చర్యపడ్డది.

ఆ మహాపరాక్రమవంతుడు రాముడు జ్వలిస్తూ ఉన్న తన ధనుస్సులోనుంచి బాణవర్షము కురిపిస్తూఉంటే ఒంటినిండా ఆ బాణాలు అన్నీ గుచ్చుకొని రావణాసురుడు బాధపడ్డాడు. భయపడ్డాడు. గాలికి మేఘమువలె పరుగులెత్తినాడు.

౧౦౨

రావణాసురుడి మహాశక్త్యాయుధము దెబ్బతిని ఒళ్ళుఅంతా నెత్తురులో తడిసిపోయిన శూరుణ్ణి లక్ష్మణుణ్ణి చూచి రాముడు కోపముతో రేగి ఆ దురాత్ముడితో దొమ్మిగా పోరాటము సాగిస్తూ సుషేణుణ్ణి చూచి "సుషేణుడా, రావణాసురుడి శక్త్యాయుధము దెబ్బకు నేలమీద పడిపోయిన ఈ వీరుడు లక్ష్మణుడు నా తమ్ముడు పామువలె పొర్లాడుతూ ఉన్నాడు. నేను ఈ దుఃఖము భరించలేకుండా ఉన్నాను. వీడు నా ప్రాణముకన్న నాకు ఎంతో ఇష్టుడు. ఈ వీరుణ్ణి చూస్తూఉంటే నా మనస్సు కలవరపడుతూ ఉన్నది. ఈ దురవస్థలో నేను ఎట్లా పోరాడగలను. పోరాడే శక్తి పోతున్నది. ఈ శుభలక్షణుడు లక్ష్మణుడు సమరశ్లాఘి. నా తమ్ముడు చనిపోయేట్టయితే నేను బ్రతికిఉండడము దేనికి! నేను సుఖపడడము ఎందుకు. దురాత్ముడు రావణాసురుడు నా ఎట్టఎదుటనే ఈ నా తమ్ముణ్ణి పడగొట్టినాడు. అందువల్ల నా పరాక్రమము కుంటుబడ్డట్టుగా ఉన్నది. నన్ను చూస్తూఉంటే నాకే సిగ్గువేస్తూ ఉంది. ఇప్పుడు ధనస్సు నా చేతిలోనుంచి జారిపోతూ ఉన్నట్టుగా ఉంది. బాణాలు వెనుకకు లాగుతూ ఉన్నట్టుగా ఉన్నది. కన్నీళ్లు కమ్ముకొన్నందువల్ల నాకు చూపు పోతూఉన్నట్టుగా ఉంది. నిద్రలో పడుస్తున్నవాడివలె నా పాదాది అవయవాలు ఇప్పుడు తడపడుతూ ఉన్నవి. నేను ఇప్పుడు తీవ్రదుఃఖములో ఉన్నాను. నా దుఃఖము హెచ్చుపెరిగిపోతూ ఉన్నది. నాకు ఇప్పుడు చచ్చిపోవలెను అనిపిస్తున్నది" అని చెప్పినాడు. ఆయువుపట్టులో తగిలి యమయాతన అనుభవిస్తూ నిట్టూర్పులు విడుస్తూ ఉన్న తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి చూచి రాముడు దుఃఖపరవశుడు అయినాడు. ఏడ్చినాడు. "ఓ వీరులారా, నా తమ్ముడు పడిపోయినాడు. ఈ

యుద్ధభూమిలో దుమ్ముకొట్టుకొని పొర్లాడుతూ ఉన్నాడు. నాకు ఇక యుద్ధములో పని ఏమి? ప్రాణములతో పని ఏమి? సీతతో పని ఏమి? ఈ యుద్ధభూమిలో నా తమ్ముడు పోయినతరువాత నేను రాజ్యము చేయడము ఎందుకు? యుద్ధమూ చేయడము ఎందుకు! దేశదేశాలలోను భార్యలు దొరుకుతారు. దేశ దేశాలలోనూ మిత్రులూ బంధువులూ దొరుకుతారు. తోడ పుట్టినవాడు తమ్ముడు ఏదేశములో ఎట్లా దొరుకుతాడు" అని ఎలుగెత్తి ఏడ్చినాడు. ఆ దుఃఖముతో అతని దేహేంద్రియాలు స్వాధీనము తప్పిపోయినవి. నేలమీద ఇట్టే చతికిలపడిపోయినాడు. పదే పదే నిట్టూర్పులు విడువసాగినాడు. శోకధ్యానపరాయణుడు అయినాడు. అప్పుడు ఆ మహావీరుణ్ణి సుషేణుడు చూచి "ఓ మహాబాహూ, ఈ లక్ష్మణుడు విజయవర్ధనుడు. ఇతడు చనిపోలేదు. ముఖములో వికారమూ కనిపించటము లేదు. ముఖము వివర్ణము అయిపోలేదు. అంతేకాదు. ఇతని ముఖములో కళ కాంతులు మాసిపోలేదు. పైగా ముఖము ప్రసన్నముగా కనపడు తున్నది. ఇతని అరచేతులు ఎఱ్ఱతామరపూలవలె ఎఱ్ఱగా ఉన్నవి. కన్నులు మూసుకొని ఉన్నప్పటికీ ప్రసన్నముగా కన పడుతూ ఉన్నాడు. ఓ ప్రభూ, ప్రాణముపోయినవాడి రూపము ఇట్లా ఉండదు. ఈ లక్షణాలు దీర్ఘాయుష్కుల ముఖముమీదనే కనపడతవి. ఓ వీరుడా, ఈ లక్ష్మీవర్ధనుడికి ఇంతవరకూ చావు రాలేదు. ఈ అరిందముడు ఇంకా ప్రాణములతోనే ఉన్నాడు. ప్రభూ, నీవు దుఃఖపడవద్దు. ఇతడు మూర్ఛపోయి ఉన్నాడు చూడు. ఇతని గుండె పదే పదే కొట్టుకొంటూ ఉన్నది. నిట్టూర్పులు విడుస్తూ ఉన్నాడు" అని చెప్పి ఊరడించినాడు.

ఆ మాటనేర్పరి సుషేణుడు ఆ విధముగా రాముణ్ణి ఓదార్చి హనుమంతుణ్ణి చూచి "ఓ మారుతీ, నీవు మంచివాడవు. పరమ పరాక్రమవంతుడవు. మంగళకరము అయిన ఓషధీపర్వతాన్ని గురించి నీకు ఇదివరకు జాంబవంతుడు చెప్పిఉన్నాడు. నీవు వెంటనే ఇప్పుడే ఇక్కడనుంచి బయలుదేరి పోవలెను. ఆ పర్వతము దక్షిణశిఖరము మీద ఉన్న మూలికలను పట్టుకొనిరావలెను. ఈ వీరుణ్ణి ఈ

పూజ్యుణ్ణి లక్ష్మణుణ్ణి బ్రతికించవలెను. విశల్యకరణి సువర్ణకరణి సంజీవకరణి సంధానకరణి అనే నాలుగు మూలికలను చప్పున తీసుకొనిరా" అని చెప్పినాడు. ఆ ధైర్యవంతుడు హనుమంతుడు అప్పటికప్పుడు బయలుదేరి ఆ ఓషధీపర్వతముమీదికి పోయినాడు. ఆ చెప్పిన మహౌషధులు ఎట్లా ఉంటవో తెలియక ఆలోచించసాగినాడు. "సుషేణుడు ఈ పర్వతము దక్షిణశిఖరముమీద లక్ష్మణుణ్ణి బ్రతికించే నాలుగు ఓషధులు ఉన్నవని చెప్పినాడు. అవి ఏవో నాకు తెలియదములేదు. ఆ ఓషధులనుగురించి విచారించడానికి మళ్ళీ పోయి వచ్చేట్టయితే కాలాతీతము అవుతుంది. అందువల్ల మహాహాని జరుగవచ్చును. కాబట్టి ఈ పర్వతశిఖరాన్నే పట్టుకొనిపోవడము మంచిది" అనుకొని ఆ అమితతేజోవంతుడు ఆ మహాబలవంతుడు హనుమంతుడు ఆ పర్వతశిఖరముమీదికి పోయి మూడుమార్లు కదిలించినాడు. పూలు విరగపూసిన నానావిధ వృక్షాలతో ఉన్న ఆ పర్వతశిఖరాన్ని పెళ్ళగించి రెండుచేతులా పట్టుకొని పైకి ఎత్తినాడు. జలపూర్ణము అయిన నీలమేఘమువంటి ఆ పర్వతశిఖరాన్ని అట్లా పట్టుకొని ఆకాశమార్గానికి హనుమంతుడు ఎగిరినాడు. మహావేగముతో పోయి యుద్ధరంగములో ఆ పర్వతశిఖరాన్ని దించి కొంచముసేపు అలుపు తీర్చుకొని సుషేణుణ్ణి "ఓ వానరపుంగవా, నీవు చెప్పిన మూలికలు ఎట్లా ఉంటవో నాకు తెలియవు. అందువల్ల ఆ పర్వతశిఖరాన్నే పట్టుకొనివచ్చినాను" అన్నాడు. అందుకు ఆ వాయుపుత్రుణ్ణి ఆ వానరోత్తముడు సుషేణుడు ప్రశంసించినాడు. దేవతలు సహితము చేయలేని పని చేసిన హనుమంతుణ్ణి ఆ యుద్ధభూమిలో వానరులూ రాక్షసులూ చూచి విస్మితులు అయినారు.

అంతట ఆ పర్వతముమీదఉన్న మూలికలను ఆ వానరోత్తముడు సుషేణుడు పెళ్ళగించినాడు. ఒక ఓషధిని నలగకొట్టి మహాతేజోవంతుడు అయిన లక్ష్మణుడి ముక్కుదగ్గర ఉంచినాడు. ఆ మూలికను వాసన చూడగానే ఆ పరవీరహంత దేహములో గుచ్చుకొన్న ఆయుధము అలుగులు అన్నీ రాలి పడిపోయినవి. అంతవరకూ నేలమీద పడిఉన్న లక్ష్మణుడు అప్పుడు ఏబాధాలేకుండా హాయిగా లేచినాడు. చచ్చిపడిపోయినాడు అనుకొన్న లక్ష్మణుడు లేవగానే

వానరులు అందరూ ఎంతో సంతోషపడ్డారు. అందరూ సుషేణుణ్ణి ప్రశంసించినారు.

రాముడు సంతోషములో కనులవెంట నీళ్ళు కారుస్తూ "రా రా తమ్ముడా!" అంటూ ప్రేమాతిశయముతో లక్ష్మణుణ్ణి గట్టిగా కౌగలించుకొని "ఓ వీరుడా, నీవు నా భాగ్యవశమువల్ల మళ్ళీ జీవించినావు. నీవు జీవించియుండకపోయేటట్లయితే నేను జీవించడము ఎందుకు? నాకు సీతతో ప్రయోజనము ఏమిటి? నేను జయించడము ఎందుకు!" అని చెప్పుతూఉంటే లక్ష్మణుడు ఖిన్నుడు అయిపోయి మాటలు తడబడుతూ "అన్నా రామా, నీవు సత్యపరాక్రముడవు, విభీషణుడికి లంకాపట్టణము కట్టుతాను అని నీవు శపథము చేసినావు. ఎవరో బలములేని అల్పుడివలె నీవు ఇప్పుడు ఈ విధముగా చెప్పవద్దు. రామా, నీవు పాపరహితుడవు. సత్పురుషులు ప్రతిజ్ఞ తప్పరు. ప్రతిజ్ఞా పరిపాలనము మహాత్ముల లక్షణము. ఓ పుణ్యాత్ముడా, నాకోసము నీవు నిరాశచెందడము చాలు, ఇక నీవు రావణాసురుణ్ణి సంహారము చేసి నీ ప్రతిజ్ఞ చెల్లించవలెను. తీక్ష్ణదంష్ట్రలతో గర్జిస్తూఉన్న సింహము కంటపడ్డ మహాగజము చావకతప్పదు. అదేవిధముగా నీ బాణపథములోకి వచ్చిన శత్రువు బ్రతికిఉండడము ఉత్తది. సూర్యాస్తమయము అయ్యేలోపల ఆ దురాత్ముణ్ణి రావణాసురుణ్ణి నీవు వధించవలెను. ఇది నా కోరిక.

"ఓ వీరుడా, నీవు లంకాపట్టణానికి విభీషణుణ్ణి రాజునుచేసే ప్రతిజ్ఞ చెల్లించవలెను అనుకొంటున్నట్లయితే ఆ జనకాత్మజను సీతాదేవిని పొందవలెను అనుకొంటూ ఉన్నట్లయితే నీవు ఇప్పుడు పోరాటములో రావణాసురుణ్ణి సంహారము చేయవలెను" అని చెప్పినాడు.

౧౦౩

లక్ష్మణుడు చెప్పినది అంతా విని ఆ పరమపరాక్రమవంతుడు రాముడు ధనుస్సు తీసుకొన్నాడు. భయంకరము అయిన బాణాన్ని సంధించినాడు.

అప్పుడు రావణాసురుడు మరి ఒక రథము ఎక్కి సూర్యుణ్ణి పట్టుకోపోయే రాహువువలె రాముడికి ఎదురుగుండా వచ్చినాడు.

అట్లా రథముమీద వచ్చిన రావణాసురుణ్ణి గురిచేసి రాముడు మహా భయంకరము అయిన వజ్రసారమువంటి బాణవర్షము కురిపించినాడు. జ్వలిస్తూఉన్న అగ్నిహోత్రమువంటి బంగారు బాణాలు యుద్ధములో అరితేరిన ఆ రావణాసురుణ్ణి భేదించినవి. రావణాసురుడు మహోగ్రుడు అయినాడు.

'రాముడు భూమిమీద ఉండీ రావణాసురుడు రథముమీద ఉండీ పోరాడడము సరిగా లేదు' అని దేవతలూ గంధర్వులూ దానవులూ దేవేంద్రుడితో చెప్పినారు. దేవేంద్రుడు అంతట తన రథాన్ని తోలుకొని పొమ్మని తన సారథి మాతలితో చెప్పినాడు. ఆ రథాన్ని దేవలోకములోనుంచి మాతలి రాముడిదగ్గరికి తోలుకొని వచ్చినాడు. ఆ రథభాగాలన్నీ బంగారముతో చేసినవి. దాని నొగ వైడూర్యమయము అయింది. వందలకొద్దీ ఘంటలు కట్టి ఉన్నవి. దానిలో తెల్లని గొడుగు అమర్చి ఉన్నది. అది తరుణాదిత్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్నది. దాని ధ్వజము బంగారుదండము. బంగారు శిరోభూషణాలతోనూ ఒంటినిండా బంగారు ఆభరణాలతోనూ అలంకరించి ఆ రథానికి పూన్చిన ఆకుపచ్చని గుఱ్ఱాలు మిట్టమధ్యాహ్నసూర్యకాంతులతో తేజరిల్లినవి. ఆ రథసారథి మాతలి మునికోలను పట్టుకొని చేతులు జోడించి రాముడితో "ఓ కాంతిమంతుడా, ఓ బలవంతుడా, ఓ శత్రుసంహారకా, నీకు నమస్కారము. నీ విజయముకోసము దేవేంద్రుడు ఈ రథాన్ని ఇచ్చి నన్ను పంపించినాడు. ఇదిగో ఇంద్రధనుస్సు. ఇదిగో అగ్నిహోత్రమువంటి కవచము. ఇవిగో సూర్యసమానము అయిన బాణాలు. ఇవే కాదు, నిర్మలమూ అమితతీక్ష్ణమూ అయిన శక్త్యాయుధము ఇచ్చి పంపించినాడు. నేను నీకు ఈ రథము తోలడానికి వచ్చినాను. ఓ వీరుడా, నీవు ఈ రథము ఎక్కు. దానవులను దేవేంద్రుడివలె రావణాసురుణ్ణి వధించు. నేను ఈ రథము తోలుతాను" అని చెప్పినాడు.

మాతలి చెప్పిన మాటలు విని రాముడు ఆ రథానికి ప్రదక్షిణము చేసినాడు. నమస్కారము చేసినాడు. తన దివ్యకాంతులతో లోకాలను తేజరిల్లచేసే రాముడు అప్పుడు ఆ రథము ఎక్కినాడు.

అంతట ఆ మహా రాహువు రాముడికీ రావణాసురుడికీ మహా భయంకరముగానూ ఒళ్ళు గగుఱు పుట్టించేట్టుగానూ అద్భుతము గానూ యుద్ధము జరిగింది. రాక్షసరాజు రావణాసురుడు గంధర్వాస్త్రాన్ని గంధర్వాస్త్రముతోనూ దైవాస్త్రాన్ని దైవాస్త్రముతోనూ ఆ పరమాస్త్రవేత్త రాముడు కొట్టివేసినాడు. అందుకు ఆ నిశాచరుడు మహోగ్రుడు అయిపోయి మహాభయంకరము అయిన రాక్షసాస్త్రాన్ని రాముడిమీద వదిలినాడు. అప్పుడు రాణాసురుడి ధనుస్సులోనుంచి వెలువడిన బంగారుబాణాలు మహావిషసర్పాల రూపము ధరించినవి. మంటలు మండుతూ ఉన్న నోళ్లతో మంటలు మండుతూ ఉన్న నిప్పులు కక్కుతూ మహాభయంకరగా నోళ్లు తెరిచి అవి రాముణ్ణి పట్టుకోవచ్చినవి. వాసుకితో సరిసమానము అయిన ఆ మహాసర్పాలు మంటలు మండుతూ ఉన్న పడగలతో అన్ని దిక్కులా వ్యాపించినవి. అట్లా తనను చుట్టివేస్తూఉన్న ఆ మహా సర్పాలను చూచి రాముడు భయంకరము అయిన గారుడాస్త్రాన్ని వదిలినాడు. అప్పుడు రాముడి ధనుస్సులోనుంచి వెలువడిన బంగారు బాణాలు అగ్నిహోత్ర కాంతులతో తేజరిల్లుతూ ఇట్టే గరుడపక్షుల రూపము ధరించినవి. గరుడరూపము ధరించిన బాణాలు సర్ప రూపము ధరించిన బాణాలను అన్నిటినీ కొట్టివేసినవి.

రావణాసురుడు తన రాక్షసాస్త్రము హతము అయిపోవడము చూసినాడు. మహాఘోరము అయిన బాణవర్షము రాముడిమీద కురిపించసాగినాడు. వేలకొద్ది బాణాలు వదిలి రాముణ్ణి రథము తోలుతూఉన్న మాతలిని నొప్పించినాడు. అంతట ఒక్కబాణము వదిలి ఆ రథధ్వజాన్ని పడగొట్టినాడు. ఎన్నో బాణాలు వదిలి దేవేంద్రుడి గుర్రాలను నొప్పించినాడు. రావణాసురుడు చేస్తూఉన్న ఆ మహాకార్యానికి దేవతలూ గంధర్వులూ చారణులూ సిద్ధులూ మహర్షులూ విషణ్ణులు అయిపోయినారు. రాముడు బాధపడడము చూచి విభీషణుడూ వానరవీరులూ వ్యథపడిపోయినారు. రావణాసురుడు అనే రాహువు రాముడు అనే చంద్రుణ్ణి పట్టుకోపోవడము చూచి బుధుడు ప్రజలకు అమంగళము చేయడానికోసము ప్రజాపతి దేవతాకమూ చంద్రుడికి ప్రియమూ అయిన రోహిణీనక్షత్రాన్ని

అప్పుడు ఆక్రమించినాడు. అన్నివైపులా పొగలుకమ్ముకొని మహా సముద్రము మంటలు మండుతూ అలలతో సూర్యుణ్ణి పట్టుకోపోతూ ఉన్నట్లు పైకిలేచింది. సూర్యుడి కిరణాల తేజము మందగించింది. ధూమకేతువుతో చేరి సూర్యబింబము ఒక మొండెముగా కనుపించింది. ఆకాశములో స్పష్టముగా కనుపించే ఇంద్రదేవతాకమూ అగ్నిదేవతాకమూ అయిన ఇక్ష్వాకువంశీయుల విశాఖానక్షత్రాన్ని అప్పుడు అంగారకుడు ఆక్రమించినాడు. మహాసముద్రములో మైనాకపర్వతము లేచినట్లు అప్పుడు దశగ్రీవుడు పదితలలతోనూ ఇరవైచేతులతోనూ ధనుర్ధరుడు అయి నిలుచున్నాడు. ఆ రణరంగములో అట్లా లేచిన దశగ్రీవుణ్ణి రాముడు చూచినాడు. తికమక పడ్డాడు. ధనుస్సులో బాణాలను ఎక్కుపెట్టలేకపోయినాడు. క్రుద్ధుడు అయిపోయినాడు. కనుబొమలు ముడిపడిపోయినవి. కన్నులు ఎర్రపడిపోయినవి. చూపులతో దహించివేసేటట్లు పదితలలతో లేచిన రావణాసురుణ్ణి చూచినాడు.

౧౦౪

అప్పుడు పరమ కుపితుడు అయిన రాముడి ముఖము చూచి సర్వభూతకోటి భయపడిపోయింది. భూమీ పర్వతాలూ మహా వనాలూ వణికిపోయినవి. సింహ శార్దూలాలు భయంకరముగా గర్జించినవి. నదులూ మహాసముద్రమూ అల్లకల్లోలము అయినవి. ఆకాశములో సంచరించే పక్షులు భయంకరముగా కూసినవి. మేఘాలు మహోత్పాతసూచకముగా ఉరుములు ఉరుముతూ ఆకాశము అంతటా పరుగులెత్తినవి. మహాదారుణము అయిన ఆ ఉత్పాతాలనూ పరమక్రుద్ధుడు అయిపోయిన రాముణ్ణీ చూచి సమస్తప్రాణులూ భయపడ్డవి. రావణాసురుడున్నూ వెరచినాడు.

ఆ శూరులు రామరావణులు అంతట భయంకరము అయిన నానావిధాయుధాలతోనూ పోరాటము సాగించినారు. ప్రళయము వస్తూఉన్నట్లుగా ఆ మహాయుద్ధము జరుగుతూ ఉంది. దేవతలూ గంధర్వులూ మహోరగులూ మహర్షులూ దానవులూ దైత్యులూ గరుత్మంతులూ ఖేచరులూ పైన విమానాలలోనుంచి చూచినారు.

రాముడిమీద అనురాగముతో సురలూ రావణాసురుడిమీద అనురాగముతో అసురులూ ఆ మహాయుద్ధాన్ని చూస్తూ సంతోషాతిశయముతో అసురులు రావణాసురుడు జయించవలెను అనీ, సురలు రాముడు జయించవలెను అనీ పదే పదే చెప్పుకొన్నారు.

ఆ సమయములో రావణాసురుడు మహాభయంకరము అయిన శూలాయుధాన్ని అందుకొన్నాడు. అది వజ్రమూ వంటిది. మహాధ్వనులు చేస్తూ అంతరిక్షములో పోతుంది. సమస్త శత్రువులనూ సంహారము చేసివేస్తుంది. దాని శిఖరాలు పర్వతశిఖరాల వంటివి. దానిని చూస్తేనే భయము వేస్తుంది. పొగలుకమ్ముకొంటూ ప్రళయ కాలాగ్ని సమూహాలవలె పరమభయంకరము అయినది. యముడు సహితము దానిని సమీపించలేదు. సర్వభూతభయావహము అయిన ఆ శూలము చీల్చివేయకలదు. నరికివేయకలదు. అటువంటి ఆ శూలాన్ని రావణాసురుడు కోపావేశముతో మండిపడుతూ చేతిలో తీసుకొన్నాడు. రాక్షసుల మధ్యలో ఉన్న ఆ పరమకుపితుడు ఆ అమితపరాక్రమవంతుడు రావణాసురుడు ఆ శూలము మధ్యలో పట్టుకొన్నాడు. ఆ మహాకాయుడు కన్నులలోనుంచి నిప్పుకణాలు రాలుస్తూ ఆ మహాశూలాన్ని పైకి ఎత్తినాడు. దానిని అటూ ఇటూ ఊపుతూ తన సైన్యము అంతా సంతోషపడేటట్టు మహాభైరవముగా సింహనాదము చేసినాడు. ఆ దారుణ సింహనాదానికి భూమీ ఆకాశమూ దిక్కులూ విదిక్కులూ కంపించిపోయినవి. సర్వభూతాలూ భయపడిపోయినవి. సముద్రము అల్లకల్లోలము అయింది. అప్పుడు ఆ మహాపరాక్రమవంతుడు రావణాసురుడు రాముణ్ణి చూచి "ఓ రామా, నీకోసము ఇప్పుడు ఈశూలాన్ని ఎత్తినాను. ఇది వజ్రము అంత కఠినమైనది. ఇప్పుడే ఈ మహాశూలము నీ ప్రాణాలను తీసివేస్తుంది. అంతటితో ఊరుకోదు. నీకు తోడుగా ఉండటానికి నీ తమ్ముడి ప్రాణాలనుకూడా తీసివేస్తుంది. ఓ రణశ్లాఘీ, నిన్ను ఇప్పుడే చంపివేస్తాను. ఈ యుద్ధభూమిలో చచ్చిపోయిన రాక్షస శూరులదగ్గరకు పోయి చేరు. ఓ రామా, నిలు" అంటూ ఆ మహాశూలాన్ని విసరివేసినాడు. రావణాసురుడి చేతిలోనుంచి వెలువడిన ఆ మహాశూలము దానికి కట్టిన ఎనిమిది గంటలూ చెవులు బద్దలు

అయిపోయేట్టు మోగుతూ అది మంటలు మండుతూ మెరుపులవలె మెరిసింది. మంటలుమండుతూ అట్లా భయంకరరూపముతో తన మీదికి వస్తూవున్న ఆ మహాశూలాన్ని రాముడు చూచినాడు. తన ధనుస్సును వంచినాడు. ఆ మహాశూలాన్ని గురిచేసినాడు. ప్రళయకాలాగ్నిని చల్లార్చటానికి దేవేంద్రుడు జలప్రవాహాలను వదిలిపెట్టేటట్టు రాముడు బాణప్రవాహాన్ని వదిలినాడు. అవి అన్నీ అగ్నిహోత్రములో పడ్డ మిడుతలదండువలె ఆశూలానికి పోయి తగులుకొని దగ్ధము అయిపోయినవి. అవి ఆ శూలాన్ని తాకే తాకటములో తగులబడి బూడిద అయిపోయినవి. అది రాముడు చూచినాడు. మహోగ్రుడు అయిపోయినాడు. మాతలి రథములో తెచ్చిన దేవేంద్రుడి మహాశక్త్యాయుధాన్ని అందుకొన్నాడు. దానిని ఆ బలవంతుడు రాముడు తన బలముకొద్దీ ఊపినాడు. శూలాయుధము మీద విసరివేసినాడు. దాని గంటలు భయంకరముగా మోగినవి. అది ప్రళయకాల మహోల్కమువలె మంటలు మండింది. ఆ మహా శక్త్యాయుధాన్ని రావణాసురుడు వదిలిన శూలము వచ్చి తాకింది. దాన్ని తాకేతాకటంతో ఆ మహాశూలము విరిగిపోయింది. దాని కాంతులు మాసిపోయినవి. రెండు ముక్కలు అయి క్రింద పడిపోయింది. రాముడు అంతట మహాధ్వనులు చేస్తూ అమిత వేగ ముతో పోయే తీక్ష్ణబాణాలను వదిలి మహావేగముతో పరుగు లెత్తే రావణాసురుడి గుర్రాలను పడగొట్టినాడు. పరమ జాగ రూకతతో రావణాసురుడి వక్షస్థలముమీద బాణాలు వదిలినాడు. మరి మూడు బాణాలను అతని లలాటముమీద వదిలినాడు. రాముడు వదిలిన ఆ బాణాలు అన్నీ గుచ్చుకొని రావణా సురుడి దేహముఅంతా నెత్తురుతో తడిసిపోయింది. ఆ నిశాచర రాజు అప్పుడు పూలు విరగపూసిన అశోకవృక్షమువలె కనుపించి నాడు. అతనికి దిగులువేసింది. పట్టరాని కోపము వచ్చింది.

౧౦౩

పోరాటములో పోగట్టుకొన్న రావణాసురుడు యుద్ధరంగ ములో రాముడి బాణాలను ఓర్చుకోలేకపోయినాడు. బాధపడ్డాడు. మహాకోపము వచ్చింది. కన్నులు జ్యోతులు అయిపోయినవి. ధనుస్సు

వంచి రాముడిమీద బాణాలు కురిపించడము మొదలుపెట్టినాడు. వర్షధారలవలె బాణాలు వచ్చి మీద పడుతూఉంటే రాముడు ఏమాత్రమూ చలించకుండా మహాపర్వతమువలె నిలుచున్నాడు. ఆ బాణధారలను తన బాణాలతో అడ్డగిస్తూ వాటిని సూర్యకిరణాలవలె సహించినాడు. రావణాసురుడు అప్పుడు మహోగ్రుడుఅయి ఒక్కవేయిబాణాలను అమితవేగముతో రాముడిమీద వదిలినాడు. ఆ బాణాలు గుచ్చుకొని దేహము అంతా నెత్తురుతో తడిసిపోయి రాముడు అడవిలో పూలు విరగపూసిన మోదుగుచెట్టువలె కనిపించినాడు.

ఆ మహాతేజోవంతుడు రాముడు ఆ బాణాల దెబ్బలకు మహాకోపముతో రేగి ప్రళయకాల సూర్యుడివంటి తేజోమయము అయిన బాణాలనుతీసి ఇట్టే రావణాసురుడిమీద వదిలినాడు. రావణాసురుడున్నూ అమితవేగముతో పోయే బాణాలను రాముడిమీద వదిలినాడు. అట్లా ఉభయులూ ఒకరిమీద ఒకరు బాణాలు వదులుకొంటూ ఉంటే ఆ ప్రదేశము అంతా బాణాలతో నిండి అంధకారబంధురము అయింది. ఆ చిమ్మచీకటిలో రామరావణులు ఒకరికి ఒకరు కనిపించలేదు. అప్పుడు రాముడు నవ్వుతూ రావణాసురుడితో "ఓ రావణుడా, నీవు రాక్షసులలో అధముడవు. ఎందువల్లనంటే జనస్థానములో నేను లేనప్పుడు ఏమిచేయడానికీ తోచక వివశ అయిపోయిన నా భార్యను నాకు తెలియకుండా నీవు అపహరించుకొని వచ్చినావు. అందువల్ల నీవు రాక్షసులలో అధముడవు అనీ పరాక్రమహీనుడవు అనీ అంటున్నారు. ఆ మహారణ్యమధ్యములో నేను లేనప్పుడు ఒంటరిగా ఉండి నిన్నుచూచి భయపడి దీనురాలు అయిపోయిన నా భార్యను వైదేహిని నీవు బలాత్కారముగా తెచ్చి "నేను శూరుడను" అని నీవు అనుకొంటూ ఉన్నావు. నీవు పరదారలను తవిజే శూరుడవు. తమ భర్తలు దగ్గరలేని స్త్రీల విషయములో కాపురుషులుచేసే పని చేసి "నేను శూరుణ్ణి" అని నీవు తలుస్తూఉన్నావు. నీవు సిగ్గుమాలినవాడవు. నీవు మర్యాద తప్పినావు. సదాచారాన్ని వదిలిపెట్టినావు. కండకావరముతో నీ అంతట నీవు మృత్యువును తెచ్చుకొని "శూరుణ్ణి" అని విర్రవీగుతూ ఉన్నావు. నీవు శూరుడవా! కుబేరుడి తమ్ముడవా! సమస్త బల సంపన్నుడవా! కొనియాడదగిన

పనే చేసినావు. మహాయశస్సు తెచ్చిపెట్టే పనే చేసినావు. ఓ
దుర్మార్గుడా, నీవు గర్వాతిశయముతో మహా పాడుపనిచేసినావు.
లోకము నిందించే పనిచేసినావు. ఆ చేసినపనికి ఇప్పుడు ప్రతిఫలము
అనుభవించు. ఓ దుర్మార్గుడా, నేను శూరుణ్ణి అని నిన్ను గురించి
నీవు చెప్పుకొంటూ ఉన్నావు. సీతను దొంగవలె లాగుకొని
పోయేటప్పుడు నీకు సిగ్గువేయలేదా! సీతను బలవంతముగా ఎత్తు
కొని పోవడానికి నేను ఉండగా నీవు వచ్చిఉన్నట్లయితే నా బాణాలు
నిన్ను ఎత్తుకొనిపోయి నీ తమ్ముణ్ణి ఖరుణ్ణి నీకు చూపించి ఉండేవి.
ఓ దుష్టాత్ముడా, దైవవశమువల్ల నీవు ఇప్పుడు నా కంటపడ్డావు.
నిన్ను ఇప్పుడే నా తీక్ష్ణబాణాలు యమసదనానికి తీసుకొని
పోతవి.

"ఓ రావణుడా, నేను ఇప్పుడు వదిలే బాణాలు నీ కంఠాన్ని
కత్తిరించి వేస్తవి. జ్వలితకుండలాలతో ఉన్న నీ శిరస్సు ఈ యుద్ధ
భూమిలో దుమ్ములో పడుతుంది. నీ శిరస్సును నక్కలు ఈడ్చుకొని
పోతవి. నేలమీద పడే నీ మొండెము ఎదురురొమ్ములపైన
కాకులూ గద్దలూ వాలుతవి. నీ దేహములో బాణాలు గుచ్చుకొన్న
తూట్లలోనుంచి కారే నెత్తురును దప్పికతీర తాగుతవి. నీవు
ప్రాణముపోయి నేలమీద పడగానే పాములను గరుడపక్షులవలె
నీ పేగులను రాంబాదులు ముక్కులతో ఈడ్చివేస్తవి" అంటూ
ఆ రాక్షసరాజుమీద బాణవర్షము కురిపించినాడు. ఆ పరవీరహంత
రాముడి పరాక్రమమూ బలమూ ఉత్సాహమూ అస్త్రబలమూ
అప్పుడు ఇబ్బడి అయినవి. ఆ విదితాత్ముడి ఎట్టఎదుట అప్పుడు
సమస్తఅస్త్రాలూ ఆవిర్భవించినవి. ఆ మహాతేజోవంతుడు సంతోషాతి
శయములో తన హస్తలాఘవముకొద్దీ బాణాలను వదిలినాడు.
తనకు తోచిన శుభచిహ్నాలను గమనించి రాక్షససంహారము చేయ
తలచుకొన్న రాముడు అప్పుడు ఎడతెగకుండా రావణాసురుడి
మీద బాణాలను వదలసాగినాడు. ఆ విధముగా రాముడు కురిపిస్తూ
ఉన్న బాణవర్షాన్ని చూచి వానరయోధులు ఆ రావణాసురుడి
మీద రాళ్లవాన కురిపించటము మొదలుపెట్టినారు. ఆ బాణ
వర్షానికీ ఆరాళ్లవానకూ రాక్షసరాజు చిత్తము భ్రమించింది.

రావణాసురుడి మనస్సు స్వాధీనము తప్పిపోయింది. వైక్లబ్యమువచ్చింది. ఏ ఆయుధాన్నీ ఉపయోగించలేకపోయినాడు. విల్లు ఎక్కుపెట్టలేకపోయినాడు. రాముడు పరాక్రమిస్తూవుంటే తాను తిరిగి పరాక్రమించలేకపోయినాడు. రాముడు వదిలిన బాణాలూ నానావిధాయుధాలూ వచ్చి పడుతూవుంటే ఏమీ తోచక మరణకాలము ఆసన్నము అయినవాడివలె నిలుచుండిపోయినాడు. రావణాసురుడి దురవస్థను రథము నడుపుతూ వున్న సారథి గమనించినాడు. అందుకు అతడు కలవరపడిపోకుండా ఆ రథాన్ని ఆ యుద్ధరంగములోనుంచి మెల్లగా అవతలకు తోలుకొనిపోయినాడు.

౧౦౬

రావణాసురుణ్ణి మృత్యుదేవత ప్రోత్సహించింది. అందువల్ల ఒళ్లుఎరగని కోపము వచ్చింది. కన్నులు ఎర్రచేసి తన రథసారథితో "ఓ సారథీ, నీకు దుర్బుద్ధి పుట్టింది. నేను బలహీనుణ్ణి, అశక్తుణ్ణి అనుకొన్నావు. నేను పౌరుషము లేనివాణ్ణి అనుకొన్నావు. ధైర్యము పోయిందనీ, నాకు పిరికితనము వచ్చిందనీ, ఇక నేను పరాక్రమించలేననీ నీవు అనుకొన్నావు. నాకు అటువంటి సమయములో మాయలు తెలియవనీ అస్త్రబలము లేదనీ అనుకొన్నావు. నీ చిత్తము వచ్చినట్టుగా ఈ రథాన్ని తోలుకొనివచ్చినావు. నన్ను అవమానించినావు. అట్లాకాకపోయినట్లయితే నా అభిప్రాయము తెలుసుకోకుండా శత్రుసమక్షములోనుంచి నా ఈ రథాన్ని ఎందుకు ఇట్లా ఇవతలికి తోలుకొనివచ్చినావు!

"ఓ దుర్మార్గుడా, నేను బలవంతుణ్ణి అనీ, ప్రరాక్రవంతుణ్ణి అనీ ప్రసిద్ధికి ఎక్కినాను. ఎంతోకాలమునుంచి నాకు ఉన్నకీర్తిని పాడుచేసినావు. నేను పోరాటములోనుంచి పారిపోను అని ప్రజలు అందరూ విశ్వసిస్తున్నారు. ఆ నమ్మకాన్ని ఈనాడు నీవు చెడకొట్టినావు. నా శత్రువు తన బలానికి ప్రసిద్ధికెక్కినాడు. తన పరాక్రమముతో ఈ లోకాన్ని మెప్పించినాడు. అటువంటి శత్రువు ఎట్టఎదుట ఉన్న నన్ను యుద్ధప్రియుణ్ణి నీవు ఇట్టే అల్పునిగా చేసివేసినావు. ఓ దుర్మతీ, నీవు నా రథాన్ని శత్రువుకు ఎదురుగుండా

తోలలేదు. నీవు నా శత్రువుదగ్గర లంచము పుచ్చుకొని ఉంటావు. నిజము. నా మేలుకోరే మిత్రుడు ఎవడూ ఇటువంటిపని చేయడు. శత్రువులకు అనుకూలము అయిన పని నీవు చక్కగా నెరవేర్చినావు.

"ఓ సారథీ, నీవు నా దగ్గర చిరకాలమునుంచీ ఉన్నావు. నేను నీకు ఎన్నో మేళ్లు చేసినాను. ఆ మేళ్ళను తలుచుకో. ఇప్పుడు నా శత్రువులు వెనుకకొంటూ వచ్చి నాపైన పడేలోపలనే ఈ రథాన్ని యుద్ధభూమిలోకి తోలుకొనిపో. నేను శత్రువులను ఎదిరిస్తాను" అని నిష్ఠురముగా రావణాసురుడు చెప్పినాడు.

ఆ సారథి తన ఏలిక మేలు కోరేవాడు. కనుక సానునయముగా "రాజా, నన్ను శత్రువులు వశపరచుకోలేదు. వశపరుచుకోలేరు కూడాను. నేను మూర్ఖుణ్ణి కాను. నేను భయపడ లేదు. ఏమర్ల లేదు. నాకు నీమీద స్నేహము లేకపోలేదు. నీవు చేసిన మేళ్లు నేను మరచిపోలేదు. నేను నీకు మంచి చేయవలెను అనుకొన్నాను. నీమీద నాకు ఉన్న స్నేహాతిశయమునుంచి నిష్కల్మషహృదయముతో నిన్ను సంతోషపెట్టవలెను అనుకొని ఇట్లా రథాన్ని తోలుకొని వచ్చినాను. అయితే నేను చేసిన ఈ పని నీకు అప్రియంగా తోచింది.

"రాజా, నేను నీ ప్రయోజనముకోసము నీకు మంచి చేయడానికోసము యుద్ధరంగమునుంచి రథాన్ని తొలగతోలుకొని వచ్చినాను. నన్ను నీచుణ్ణిగానూ దుష్టుణ్ణిగానూ నీవు భావించ వద్దు. ఆ దోషాలు నాలో లేవు. నేను రథాన్ని ఎందుకు మళ్లించుకొని వచ్చిందీ చెపుతాను నీవు విను. ఆలోచించు. చంద్రోదయము అయినప్పుడు సముద్రజలాలు ఉప్పొంగి ఎదురుగా వస్తూఉంటే మహానదీప్రవాహాలు వెనుకకు మళ్లుతవి. ఆ మహాయుద్ధములో నీవు ఎంత అలసిపోయి ఉందీ నాకు తెలుసు. అయితే నీ ఉత్సాహాన్ని యుద్ధానికి నీ సుముఖతనూ నేను గమనించలేకపోయినాను. రథానికి పూన్చిన గుర్రాలు రథాన్ని లాగి లాగి అలసిపోయినవి. బలము ఉడిగిపోయినవి. వానదెబ్బ తిన్న ఎద్దులవలె గుర్రాలు ఎండదెబ్బ తిన్నవి. అందేకాదు, ఏవైపు చూచినా అపశకునాలు కనుపించినవి. అన్నీ ప్రతికూలముగా తోచినవి. రథము నడిపే సారథి శుభా

శుభశకునాలనూ దేశకాలాలనూ గమనించవలెను. తన రథికుడి
మనస్సు కనిపెట్టవలెను. రథికుడు అలసిపోతున్నదీ లేనిదీ తెలుసుకో
వలెను. రథికుడి బలాన్నీ ఎదిరి బలాన్నీ పరిశీలిస్తూ ఉండవలెను. భూమి
మిట్టపల్లాలనూ సమప్రదేశాలనూ సమయాసమయాలనూ తెలుసు
కొంటూ ఉండవలెను. అన్నిటికన్నా ఎక్కువగా ఎదిరి లోపాలను
కనిపెట్టుతూ ఉండవలెను. అందుకు తగినట్టుగా తన రథాన్ని శత్రువు
సమీపానికి తోలుకొనిపోవడమో పక్కకు తోలుకొనిపోవడమో
ఎదురుగుండా తోలుకొనిపోవడమో వెనుకకు తోలుకొనిపోవడమో
చేయవలెను.

"రాజా, నీవు వీరుడవు. నీ అలుపు తీర్చుకో. ఈ గుర్రాలు
అలుపు తీర్చుకొంటవి. సహించరాని దుఃఖము రాకుండా ఉండటా
నికి తగినట్టుగా ఈ రథాన్ని నేను తోలుకొని వచ్చినాను. ప్రభూ,
నీవు నా ఏలికవే కాదు, నా స్నేహితుడవు. నీమీద నాకు ఉన్న
స్నేహాతిశయమునుంచీ గౌరవాతిశయమునుంచీ ఈ రథాన్ని ఇట్లా
తోలుకొనివచ్చినాను. రాజా, నీవు శత్రుసంహారకుడవు. ఇప్పుడు
నీ ఇష్టమువచ్చినట్టు ఆజ్ఞాపించు. నీఆజ్ఞను నేను జవదాటను. నీ
ఋణము నేను తీర్చుకొంటాను" అని చెప్పినాడు.

సారథి చెప్పిన మాటలకు రావణాసురుడు సంతుష్టుడు అయి
నాడు. ఎన్నోవిధాల మెచ్చుకొన్నాడు. అంతట సారథిని చూచి
"ఓ సూతుడా, ఇప్పుడే రాముడికి ఎదురుకుండా ఈ రథాన్ని తోలు.
నేను వాణ్ణి వధించకుండా తిరిగిరాను" అని రావణాసురుడు చెప్పినాడు.
ఒక హస్తాభరణాన్ని బహుమానముగా సారథికి ఇచ్చినాడు. అంతట
సారథి ఆ రథాన్ని యుద్ధాభిముఖంగా తోలుకొని పోయినాడు.

క్షణకాలములో రావణాసురుడి రథము రాముడికి అభిముఖ
ముగా నిలిచింది.

౧౦౪

అప్పుడు ఆ యుద్ధము చూడటానికి దేవతలతోకూడా
మహాత్ముడు అగస్త్యుడు వచ్చినాడు. యుద్ధము చేయటానికి వచ్చి
నిలుచున్న రావణాసురుణ్ణి ఎట్టఎదుట చూచినాడు. అతడు అలుపు

తీర్చుకొని తిరిగి యుద్ధరంగానికి వచ్చినందువల్ల రాముడు అప్పుడు అతనితో ఏవిధముగా పోరాడవలసిందీ ఆలోచిస్తున్నాడు. అప్పుడు అగస్త్యమహర్షి రాముణ్ణి సమీపించి "రామా, రామా, నీవు యుద్ధములో శత్రువులను అందరినీ జయించటానికి 'ఆదిత్య హృదయం' ఉపదేశము చేస్తాను. అది ఉత్తమోత్తమము అయినది. చాలా రహస్యము అయినది. సనాతనము అయినది. అది పరమ పవిత్రము అయినది. ఆ మంత్రాన్ని జపముచేస్తే సర్వశత్రువులూ నాశనము అయిపోతారు. అది శాశ్వతమూ నాశరహితమూ అయిన ఫలాన్ని ఇస్తుంది. నీవు జయిస్తావు. అది సమస్తమంగళాలకూ మంగళ కరము అయినది. ఆధివ్యాధులను పోగొట్టుతుంది. అది ఆయుస్సును వృద్ధిచేస్తుంది" అని చెప్పి ఆదిత్యహృదయమంత్రము ఉపదేశము చేసినాడు.

అంతట "నాయనా, రామా, నీవు ఏకాగ్రచిత్తముతో దేవదేవుడూ జగత్పతి అయిన ఆదిత్యుణ్ణి పూజించు. నేను చెప్పిన ఆదిత్యహృదయ మంత్రాన్ని ముమ్మారు జపించు. నీవు యుద్ధములో జయిస్తావు. ఓ మహాబాహూ, నీవు ఈవేళనే రావణాసురుణ్ణి సంహారము చేస్తావు" అని చెప్పి అక్కడనుంచి అగస్త్య మహర్షి అంతర్ధానము అయిపోయినాడు.

ఆ మహాతేజోవంతుడికి రాముడికి దిగులు అంతా వదిలిపోయింది. సంతుష్టుడు అయినాడు. పరిశుద్ధహృదయముతో ఆదిత్య హృదయాన్ని కంఠస్థము చేసుకొన్నాడు. ముమ్మారు ఆచమించినాడు. శుచి అయి సూర్యుణ్ణి చూచి ఆదిత్యహృదయము జపంచేసినాడు. పరమసంతోషముతో విల్లు చేతిలో పట్టుకొన్నాడు. సంతుష్ట హృదయముతో యుద్ధసన్నద్ధుడు అయినాడు. రావణాసురుణ్ణి సంహారము చేయడానికి దృఢనిశ్చయుడు అయినాడు.

అప్పుడు సూర్యమండలాంతర్గతుడు అయిన హిరణ్మయ పురుషుడు మనసా సంతోషించినాడు. ఆయన దేహము పులకరించింది. దేవగణాలమధ్యనుంచి రాముణ్ణి చూచి "ఓ రామా, నిశాచర రాజు నాశనము అయిపోతాడు. నీవు త్వరపడు" అని చెప్పినాడు.

౧౦౮

అప్పుడు రావణాసురుడి రథసారథి సంతోషముతో యుద్ధరంగానికి రథాన్ని తోలినాడు. అప్పుడు ఆ రథము శత్రుసైన్యాలను చెదరగొట్టే గంధర్వనగరాకారములో కనుపించింది. దానికి ఎత్తిన పతాకాలు ఎంతో ఎత్తున ఎగురుతూ ఉన్నవి. జయము సూచించే బంగారు ఆభరణాలతో గుర్రాలు కనుపించినవి. ఆ రథమునిండా యుద్ధోపకరణాలు అమర్చిఉన్నవి. దాని ధ్వజమూ పతాకమాలలూ ఆకాశాన్ని మింగివేస్తూ ఉన్నట్లుగా కనుపించినవి. ఆ రథధ్వని భూమి అంతటా వినిపించింది. రాక్షససైన్యాలను సంతోషపెట్టుతూ శత్రుసైన్యాలను నాశనము చేసివేసేటట్టు ఆ రథము అప్పుడు నడిచింది.

అట్లా మహాధ్వనులు చేస్తూ అమితవేగముతో వస్తూఉన్న ఆ రాక్షసరాజు రావణాసురుడి రథాన్ని రాముడు చూచినాడు. ఆ రథానికి పూన్చిన గుర్రాలు నల్లటివి. ఆ రథానికి ఎత్తిన జండాలు భయంకరము అయిన కాంతులతో మెరపులవలె మెరిసినవి. అందులో ఉన్న ఆయుధాలు ఇంద్రధనుస్సులవలె ధగధగలాడినవి. ధారలుగా జలము వర్షించే మహామేఘమువలె ఆ రథము శరధారలు కురిపించటానికి వస్తూఉన్నట్లుగా తోచింది. వజ్రాయుధము దెబ్బకు పగిలిపోతూ ఉన్న పర్వతాల ధ్వనులవలె అది ధ్వనులు చేస్తూ రావటము రాముడు చూచినాడు.తన ధనుస్సును బాలచంద్రాకారముగా వంచినాడు. టంకారము చేస్తూ తన రథసారథితో “ఓ మాతలీ, శత్రురథము అమితవేగముతో వస్తూఉంది. చూడు, అప్రదక్షిణముగా అమితవేగముతో శత్రువు మళ్లీ వస్తూవున్నాడు. కాబట్టి వాడు యుద్ధములో హతుడు అయిపోవటము తప్పదు. అయినప్పటికీ నీవు ఏమరపాటు లేకుండా ఉండవలెను. మనరథాన్ని శత్రువునకు ఎదురుగుండా పోనివ్వు. ఆకాశాన్ని ఆవరించిన మేఘాన్ని వాయువువలె ఆ రథముమీద వస్తూవున్న శత్రువును నేను ఎగరగొట్టివేస్తాను. శత్రుసంరంభానికి నీవు భయపడవద్దు, కలవరపడవద్దు, మనస్సు నిబ్బరముగా ఉంచుకో. చూపు చెదరకుండా చూచుకో, పగ్గాలు క్రమముగా లాగుతూ రథాన్ని

వేగముగా పోనివ్వు. నీవు దేవేంద్రుడికి సారథ్యము చేసినవాడవు. నీకు నేను వేరే చెప్పవలసిన పని లేదు. నేను ఏకాగ్రచిత్తముతో యుద్ధము చేయబోతున్నాను. అందువల్ల ఈవిషయాలు నీకు జ్ఞాపకము చేసినాడను. కాని నీకు ఇవి నేర్పటం లేదు''అని రాముడు చెప్పినాడు.

ఈ మాటలకు సురసారథి మాతలి సంతోషముతో ఆ దేవేంద్రరథాన్ని రావణాసురుడి రథానికి అపసవ్యంగా పోనిచ్చి నాడు. అప్పుడు ఆ రథచక్రాలకు లేగిన దుమ్ము రావణాసురుణ్ణి కమ్ముకున్నది. అతడికి ఏమీ కనిపించకుండాపోయింది. అందుకు అతడు కుపితుడు అయినాడు. ఎర్రపడిపోయిన తన కన్నులు ఉరిమి చూచినాడు. తన రథానికి ఎదురుగుండా నిలబడిన రథములో రాముణ్ణి చూచినాడు. అంతట దశగ్రీవుడు రాముడిమీద బాణాలు వదిలినాడు.

ఆ మహాతేజోవంతుడు రాముడు తనమీద రావణాసురుడు బాణాలు వదులుతూ ఉంటే కోపావేశముతో మరింత ధైర్యముగా నిలుచున్నాడు. దేవేంద్రుడి శరాసనాన్ని అందుకొన్నాడు. సూర్య కిరణాలవంటి బాణాలను ఎక్కుపెట్టినాడు. రావణాసురుణ్ణి గురిచేసి వదిలినాడు. ఒకరిని ఒకరు చంపివేయవలెను అనే కాంక్షతో ఒకరికి ఒకరు ఎదురుగుండా నిలుచొని రామరావణులు కోపముతో చెల రేగిన రెండు సింహాలవలె మహాయుద్ధము ఆరంభించినారు.

అప్పుడు దేవతలూ గంధర్వులూ సిద్ధులూ పరమర్షులూ రామరావణ యుద్ధం చూడటానికివచ్చి ఆకాశములో నిలుచున్నారు. రాముడు జయిస్తాడనీ రావణాసురుడు నాశనము అయిపోతాడనీ సూచిస్తూ ఒళ్ళు గగుర్పొడిచే దారుణము అయిన దుర్నిమిత్తాలు కనుపించినవి. అప్పుడు రావణాసురుడి రథముమీద నెత్తురువాన కురిసింది. అప్రదక్షిణముగా తీవ్రమైన సుడిగాలి కొట్టింది. రావణా సురుడి రథము ఏవైపు పోతే ఆకాశములో ఆవైపున గద్దలు గుంపులు కట్టి తిరిగినవి. లంకాపట్టణము అంతటా పట్టపగలు జపాపుష్పకాంతులతో సంధ్యారాగము అలముకొన్నది. భూమి

అంతటా మంటలు మండుతూ ఉన్నట్లు కనిపించింది. ఆకాశములో కొరవులు పిడుగులవలె మహాధ్వనులు చేస్తూ గిర్రున తిరిగినవి. అవి రావణాసురుడికి అహితము సూచిస్తూ ఉన్నవని రాక్షసులు దిగులుపడిపోయినారు. రావణాసురుడి రథము ఎటు తిరిగితే అటు వైపు భూమి కంపించింది. పోరాడుతూ ఉన్న రాక్షసులకు తమ చేతులను ఎవరో పట్టుకున్నట్టుగా తోచింది. సూర్యకిరణాలు ఎరుపూ పసుపూ తెలుపూ నలుపూ రంగులతో రావణాసురుడి దేహము మీద ప్రసరించినవి. అప్పుడు అతడు గైరికాది ధాతువులతో ధగధగ లాడుతూఉన్న పర్వతమువలె కనిపించినాడు. అప్పుడు నక్కలు నోళ్లల్లోనుంచి నిప్పులు కక్కుతూ రావణాసురుడికి ఎదురుగుండా వచ్చి అమంగళముగా అరచినవి. ఆ నక్కలతో పాటు ఆకాశములో గద్దలు రావణాసురుడి ముఖమువంకచూస్తూ భయంకరముగా కూసినవి. అప్పుడు ఆ యుద్ధభూమిలో వాయువు ప్రతికూలముగా వీచింది. ఆ గాలికి లేగిన దుమ్ము రావణాసురుడి ముఖాన్ని కమ్మివేసింది. అప్పుడు ఆ దశగ్రీవుడి కన్నులకు ఏమీ కనబడకుండాపోయింది. మబ్బులు పట్టకుండా ఉరుములు ఉరమకుండా ఆకాశము నుంచి భయంకరాకారముతో మహాధ్వనులు చేస్తూ కొరవులూ పిడుగులూ రావణాసురుడి సైన్యముమీద పడ్డవి. దుమ్మువాన కురవటము మొదలుపెట్టింది. ఆ దుమ్మువాన నుంచి ఆకాశము కనిపించకుండా పోయింది. దిక్కులు అన్నీ చీకట్లు కమ్ముకొన్నవి. అప్పుడు అక్కడ అంతరిక్షములో, గోరువంకలు ఘోరముగా పోట్లాడుకొని దారుణముగా కూస్తూ వందలకొద్దీ వచ్చి రావణాసురుడి రథముమీద పడ్డవి. రావణాసురుడి రథగుర్రాల పిరుదులలోనుంచి అగ్నికణాలు రాలినవి. ఆ గుర్రాల కన్నులలోనుండి కన్నీళ్లు ధారలుగా కారినవి. ఇట్లా భయంకరమూ అతిక్రూరమూ అయిన ఉత్పాతాలు అనేకము అప్పుడు కనుపించినవి.

జయము సూచించే అనేక శుభనిమిత్తాలు రాముడికి తోచినవి. అందుకు అతడు ఎంతో సంతోషించినాడు. రావణాసురుణ్ణి సంహరించినట్లే తలచినాడు.

౧౦౯

తమ తమ రథాలమీద ఉన్న రామరావణులు అతి క్రూరముగా సర్వలోకాలవారూ భయపడిపోయేటట్లుగా మహా యుద్ధము చేయటము మొదలుపెట్టినారు. ఆయుధాలతో యుద్ధ సన్నద్ధము అయిన రాక్షససైన్యము అటూ, వానర సైన్యము ఇటూ రామరావణయుద్ధము చూస్తూ కదలకుండా మెదలకుండా నిలుచున్నవి. చక్కగా పోరాడుతూ ఉన్న మానవుణ్ణీ రాక్షసుణ్ణీ చూచి వానరయోధులూ రాక్షసయోధులూ నివ్వెరపోయినారు. ఆశ్చర్యముగా సాగుతూఉన్న ఆ యుద్ధము అయిపోబోతున్నదని ఆ యోధులు అందరికీ తెలుసును. చేతులలో ఆయుధాలు ఉన్నప్పటికిన్నీ బాహువులు తొందరచేస్తూ ఉన్నప్పటికిన్నీ రాక్షసులు వానరయోధులను కానీ వానరులు రాక్షసయోధులను కానీ ఎదిరించలేదు. చిత్తరువులో చిత్రించిన బొమ్మలవలె రాక్షసయోధులు రావణాసురుణ్ణి చూస్తూనూ వానరయోధులు రాముణ్ణి తేరిపార చూస్తూనూ నిలుచుండిపోయినారు.

ఆ యుద్ధభూమిలో తమకు తమకు తోచిన శుభాశుభనిమిత్తాలనుపట్టి బుద్ధి నిశ్చయము చేసుకొని సుస్థిరము అయిన రోషముతో నిర్భయముగా రామరావణులు యుద్ధము చేయసాగినారు. ఆ యా శుభనిమిత్తాలనుపట్టి రాముడు తనకు జయము తప్పదు అనుకొన్నాడు. రావణాసురుడు ఆ యా దుర్నిమిత్తాలనుపట్టి తనకు చావు తప్పదు అనుకొన్నాడు. అందువల్ల ఉభయులూ తమ తమ పరాక్రమ సర్వస్వాన్నీ కనపరచినారు. అప్పుడు ఆ పరాక్రమవంతుడు రావణాసురుడు ధనుస్సులో బాణాలను ఎక్కించి రాముడి రథధ్వజాన్ని గురిచేసి వదిలినాడు. ఆ బాణాలు పోయి ఆ రథధ్వజాన్ని తాకినవి. అది దేవేంద్రుడి రథధ్వజము అయినందువల్ల ఆ బాణాలు ఏమీ చేయలేక నేలపాలు అయినవి. తన రథధ్వజముమీద బాణాలు వదిలినందుకు రాముడు ప్రతిక్రియ చేయ సంకల్పించుకొన్నాడు. ఆ పరమపరాక్రమవంతుడు తన ధనుస్సును వంచి ఒకే ఒక బాణాన్ని ఎక్కుపెట్టి రావణాసురుడి రథధ్వజాన్ని గురిచేసి వదిలినాడు. సహించనలవికాని మంటలు మండుతూ ఆ తీక్ష్ణ

బాణము మహాసర్పమువలె పోయి రావణాసురుడి రథధ్వజాన్ని పడగొట్టి భూమిలోకి పోయింది. ఆ రథధ్వజము రెండు తునకలు అయి నేలకూలింది. తన రథధ్వజము విరిగిపోయినందుకు ఆ మహా బలవంతుడు రావణాసురుడు ఓర్వలేకపోయినాడు. దగ్గర ఉన్న వాటిని దహించి వేసే అగ్నిహోత్రమువలె మండిపోయినాడు. కోపపారవశ్యముతో బాణవర్షము కురిపించినాడు. మంటలు మండుతూ ఉన్న బాణాలను రాముడి రథాశ్వాలమీద వదిలినాడు ఆ రథానికి పూన్చిన ఆకుపచ్చని గుర్రాలు దేవేంద్రుడివి. రావణాసురుడు వదిలిన బాణాలు ఆ గుర్రాలకు తామరతూండ్లవలె తగిలినవి. అవి మాత్రము చలించలేదు, భయపడలేదు. స్వస్థముగా ఉండిపోయినవి. ఆ గుర్రాలు ఏమాత్రమూ కలవరపడకుండా ఉండటము చూచి రావణాసురుడు మహోగ్రుడు అయిపోయి మళ్లీ బాణవర్షము కురిపించినాడు. గదాయుధాలు పరిఘాయుధాలు చక్రాయుధాలు ముసలాయుధాలు శూలాయుధాలు గండ్రగొడ్డళ్ళు ఇంకా భయంకరము అయిన వివిధాయుధాలు తన ధనుస్సులో నుంచి రాక్షసమాయతో రావణాసురుడు వదులుతూ ఉంటే భయంకరము అయిన ధ్వనులు అయినవి. మహావర్షముగా కురిపించిన ఆ వివిధాయుధాలూ గురితప్పి రాముడి రథముమీద పడకుండా వానరసైన్యముమీద అన్నివైపులా పడ్డవి. మనస్సులో మరి ఏ ఇతరఆలోచనా లేకుండా ఎడతెగని ఉత్సాహముతో రావణాసురుడు వేలకువేలు బాణాలు వదిలినాడు. మహాప్రయత్నముతో రావణాసురుడు అట్లా బాణాలు వదలటము చూచి రాముడు నవ్వుతూ తన ధనుస్సు ఎక్కుపెట్టి లక్షలకొద్దీ తీక్ష్ణ బాణాలను వదిలినాడు. రామరావణులు ఉభయులూ వదిలిన దేదీప్యమానబాణపరంపరలు ఆకాశము అంతటా ఆవరించి మరి ఒక ఆకాశమువలె భాసించింది.

ఆ యుద్ధములో రామరావణులు వదిలిన బాణాలలో ఏ ఒక్కటిన్నీ గురి తప్పిపోలేదు. ఏఒక్కటిన్నీ అనుకొన్నట్టుగా భేదించకుండా పోలేదు. ఏఒక్కటిన్నీ నిష్ఫలము అయిపోలేదు. అయితే ఆ వీరులు ఉభయులూ వదిలిన బాణాలు ఒకదానికి ఒకటి

తగిలి అన్నీ నేల కూలినవి. వారు ఉభయులూ సవ్యాపసవ్యముగా తిరుగుతూ ఎడతెగకుండా బాణాలు వదులుకొంటూ యుద్ధము చేసినారు. గాలి దూరే సందు అయినా లేకుండా ఆ బాణాలు అన్ని వైపులా కమ్ముకొన్నవి. అప్పుడు రాముడు రావణాసురుడి గుర్రాలనూ రావణాసురుడు రాముడిగుర్రాలనూ గురిచేసి బాణాలు వదిలినారు. అట్లా ఒకరు చేసినదానికి ఒకరు ప్రతిక్రియ చేసుకుంటూ ఉభయులూ పరమ క్రుద్ధులు అయిపోయి అద్భుతముగానూ భయంకరముగానూ ఒళ్ళుగగుర్పుట్టించేట్లుగానూ ఒక ముహూర్తము సేపు పోరాడినారు.

౧౧౦

రామరావణులు అట్లా యుద్ధము చేస్తూఉంటే సర్వభూత కోటి ఆశ్చర్యపడిపోయింది. వారి ఉభయుల రథాలు నడుపుతూ ఉన్న సారథుల చాతుర్యమునుంచి ఆ రథాలు అప్పుడు ఒకదానితో ఒకటి ఢీకొట్టపోతూ ఉన్నట్టు ఎదుర్కొన్నవి. మరుక్షణాన మండలాకారముగా తిరిగినవి. వీధులు అనే గతివిశేషాలతో అవి వెనుకకు పోతూనూ ముందుకు వస్తూనూ వివిధవిధాల తిరుగుతూ భయంకరముగా కనుపించినవి. రాముడు రావణాసురుణ్ణి నొప్పిస్తూనూ రావణాసురుడు రాముణ్ణి నొప్పిస్తూనూ ఒకరిమీద ఒకరు బాణాలు వదులుకుంటూ అమిత వేగముతో సమీపిస్తూ వెంటనే వెనుకకు పోతూనూ పోరాటము సాగించినారు. అట్లా వారు ఉభయులూ రథాలలోనుంచి ఒకరిమీద ఒకరు బాణవర్షాలు కురిపించుకొంటూ ఉంటే ఆ యుద్ధభూమిలో ఆ రథాలు బాణాలు కురిపించే మహామేఘాలవలె కనుపించినవి. ఆ యుద్ధరంగములో నానావిధాల తిరుగుతూ ఆ రథాలు అప్పుడు ఒకదానికి ఒకటి ఎదురుగుండావచ్చి నిలుచున్నవి. అట్లా నిలబడిన రథాలు రెండూ కాడితో కాడీ పతాకాలతో పతాకాలూ గుర్రాలముఖాలతో గుర్రాల ముఖాలూ ఢీకొట్టపోయినవి. అప్పుడు రాముడు తన ధనుస్సు ఎక్కుపెట్టి మంటలు మండుతూ ఉన్న నాలుగు బాణాలు వదిలి రావణాసురుడి గుర్రాలను వెనుకకు మళ్ళగొట్టినాడు. అందుకు రావణాసురుడు కోపపరవశుడు అయిపోయి రాముణ్ణి గురిచేసి నిశితబాణాలు వదిలినాడు. ఆ బలవంతుడి

బాణాలు వచ్చి తనను గుచ్చుకొన్నప్పటికిన్నీ రాముడు ఏమాత్రమూ బాధపడలేదు. ఏవికారమూ చెందలేదు. అంతట ఆ నిశాచర రాజు రావణాసురుడు ఆ రథము నడుపుతూవున్న దేవేంద్రుడి సారథి మాతలిని గురిచేసి బాణాలు వదిలినాడు. అవి పిడుగులవలె మహాధ్వనులు చేస్తూ మాతలి దేహముమీద పడ్డవేకాని అతనిని ఏమీ బాధపెట్టలేకపోయినవి. ఆ బాణాలకు అతడు ఏమాత్రమూ కలవరపడలేదు. తనకు అప్పుడు సారథ్యము చేస్తూ ఉన్న మాతలి మీద రావణాసురుడు అట్లా బాణాలు వదిలినందుకు రాముడికి అమిత కోపము వచ్చింది. తనను కొట్టినందుకన్న తన సారథిని కొట్టినందుకు మహాకోపముతో చెలరేగిన రాముడు బాణాలు తదేకముగా వదిలి రావణాసురుణ్ణి తన ఎదుట నిలవకుండా చేసినాడు.

ఆ పరాక్రమవంతుడు రాముడు రావణాసురుడి రథముమీద ఒక ఇరవై బాణాలు వదిలినాడు. ఆ తరువాత ముప్పయి, అరవై, నూరు, వెయ్యి బాణాలు వదిలినాడు. అందుకు రాక్షసరాజు మహోగ్రుడు అయి ప్రతిక్రియగా రాముడిమీద గదాయుధాలూ ముసలాయుధాలూ వింట సంధించి వానగా కురిపించినాడు. ఆ గదాయుధాలూ ముసలాయుధాలూ పరిఘాయుధాలూ వచ్చి పడుతూ ఉంటే ఆ మహాధ్వనులు అయినవి. ఆ మహాధ్వనులకు సప్తసముద్రాలూ క్షుభితము అయినవి. అప్పుడు పాతాళలోకములో నివసిస్తూ ఉన్న పన్నగులూ దానవులూ మొదలైనవా రందరూ బాధపడిపోయినారు. భూమి వణికింది. మహావృక్షాలు పడిపోయినవి. పర్వతాలు కదిలినవి. సూర్యకాంతులు మాసిపోయినవి. గాలి వీచటము ఆగిపోయింది. అప్పుడు దేవతలూ గంధర్వులూ కిన్నరులూ మహోరగులూ సిద్ధులూ మహర్షులూ మొదలైనవా రందరూ భయపడిపోయినారు. ఆ యుద్ధములో రాముడు జయించవలెను అనీ గోవులూ బ్రాహ్మణులూ సుఖముగా ఉండవలెను అనీ సమస్తలోకాలూ చెక్కు చెదరకుండా ఉండవలెను అనీ అప్పుడు దేవతలూ మహర్షులూ జపము చేసినారు. ఆ విధముగా ఆకాశములో దేవతలూ మహర్షులూ జపము చేస్తూ ఉంటే భూమిమీద రామరావణులు మహాభయంకరముగా యుద్ధము చేయసాగినారు. అప్పుడు గంధర్వులూ అప్సరసలూ గుంపులు గుంపులుగా చేరి నిరుపమానము అయిన ఆ రామరావణయుద్ధము

చూస్తూ ఆశ్చర్యపోయినారు. "ఆకాశమువంటిది ఆకాశమే. అటువంటిది మరిఒకటి లేదు. సముద్రమువంటిది సముద్రమే. అటువంటిది మరిఒకటి లేదు. ఆ దేవిధముగా రామరావణులవంటి వారు రామరావణులే. మరిఒకండ్లు లేరు. రామరావణయుద్ధము వంటిది రామరావణయుద్ధమే. మరిఒకటి జరగదు" అని ఆ అప్సరసలూ గంధర్వులూ చెప్పుకొన్నారు.

అప్పుడు ఆ మహాబాహువు రఘువంశకీర్తివర్ధనుడు రాముడు క్రుద్ధుడు అయిపోయి క్రూరవిషసర్పమువంటి బాణాన్ని తన వింట సంధించి రావణాసురుడి కంఠాన్ని గురిచేసి వదిలినాడు. జ్వలిత కుండలాలతో ఉన్న రావణాసురుని శిరస్సు ఆ బాణముదెబ్బకు తెగి నేలమీద పడిపోయింది. అట్లా నేలమీద పడిపోయిన ఆ శిరస్సును అప్పుడు ముల్లోకాలవారూ చూచినారు. అట్లా వారు అందరూ చూస్తూఉండగానే ఆ శిరస్సువంటిదే మరిఒక శిరస్సు రావణాసురుడి మెడమీద మొలిచింది. అట్లా మొలుచుకొని వచ్చిన రావణాసురుడి రెండవ శిరస్సును అప్పటికి అప్పుడు రాముడు తన బాణముతో నరికివేసినాడు. ఆ శిరస్సును నరికీ నరకడముతో మరి ఒక శిరస్సు పుట్టుకొని వచ్చింది. వజ్రాయుధమువంటి బాణముతో రాముడు ఆ మూడవ శిరస్సునుకూడా నరికివేసినాడు. రావణాసురుడికి అట్లా నూట ఒక్క మారులు శిరస్సులు పుట్టుకొని వచ్చినవి. ఆ పుట్టుకొని వచ్చిన శిరస్సులను రాముడు ఎప్పటికి అప్పుడు నరికి వేస్తూ ఉన్నప్పటికిన్నీ రావణాసురుడి ప్రాణము పోయేట్టుకానీ కొత్త శిరస్సులు పుట్టకుండా ఉండేటట్లుకానీ కనపడలేదు.

అప్పుడు ఆ సర్వాస్త్రకోవిదుడు ఆ మహావీరుడు ఎన్నో బాణాలు ఉన్న ఆ రాముడు ఆలోచించసాగినాడు. "ఏ బాణాలకు మారీచుడు చచ్చిపోయినాడో ఏ బాణాలకు దండకారణ్యంలో ఖర దూషణులు చచ్చిపోయినారో ఏ బాణాలకు విరాధుడు చచ్చి పోయినాడో ఏ బాణాలకు క్రౌంచారణ్యములో కబంధుడు చచ్చి పోయినాడో ఆ బాణాలకు ఇప్పుడు రావణాసురుడు ఎందుకు చచ్చిపోలేదు! అవి ఎంతో నమ్మకము అయిన బాణాలు. వాటి శక్తి తగ్గిపోవటానికి కారణము ఏమి అయి ఉంటుంది?" అని ఆలో

చేస్తూ ఏమాత్రమూ ఏమరకుండా రావణాసురుడి వక్షస్థలముమీద రాముడు శరవర్షము కురిపించినాడు. అప్పుడు రాక్షసరాజు రావణాసురుడు రాముడిమీద ప్రతిక్రియగా గదా ముసలాయుధ వర్షము కురిపించినాడు. రామరావణులు ఉభయులూ ఉగ్రహావేశపరవశులు అయి తమ రథాలతోకూడా ఆకాశానికి ఎగిరి కొంతసేపు పోరాడినారు. రథాలతోకూడా నేలమీదికి వచ్చి కొంతసేపు పోరాడినారు. రథాలతోకూడా త్రికూటపర్వతముమీదికి పోయి కొంతసేపు పోరాడినారు. చూచేవారి ఒళ్లు గగురుపుట్టించేటట్టు మహాభయంకరముగా యుద్ధము చేసినారు. అహోరాత్రములు అనే భేదము లేకుండా రామరావణులు, దేవ దానవ యక్ష రాక్షస పిశాచ ఉరగులు చూస్తూ ఉండగా ఆ యుద్ధము సాగించినారు. రాత్రిపూటకానీ పగటిపూట కానీ ఒక ముహూర్తముసేపు అయినా విరామము లేకుండా ఉభయులూ పోరాడినారు.

౧౧౧

ఆ యుద్ధములో ఎంతసేపటికీ రాముడు జయించకపోవటము చూచి సురసారథి అయిన మాతలి రాముడితో "ఓరామా! నీవు వీరుడవు. సమస్తాస్త్రాలూ తెలిసినవాడవు. ఏమీ తెలియనివాడి వలె నీవు ఈ రావణాసురుడు వదిలే బాణాలకు ప్రతిగా ఏవేవో బాణాలు వదలటము ఎందుకు? దేవతలు చెప్పిన వినాశకాలము వీడికి ఇప్పుడు వచ్చింది. వీడిమీద నీవు బ్రహ్మాస్త్రము వదులు. చచ్చిపోతాడు" అని మాతలి జ్ఞాపకము చేసినాడు.

అప్పుడు ఆ పరాక్రమవంతుడు రాముడు దేదీప్యమానముగా భాసిస్తూనూ మహోగ్రసర్పమువలె బుసలు కొట్టుతూనూ ఉన్న బాణాన్ని తీసినాడు.

ముల్లోకాలూ జయించవలెను అనుకొన్న దేవేంద్రుడికోసము పూర్వము బ్రహ్మదేవుడు ఆ బాణాన్ని తన ప్రభావముతో సృష్టించినాడు. ఆ బాణముతో దేవేంద్రుడు ముల్లోకాలూ జయించినాడు. ఆ మహాబాణాన్ని ఆ తరువాత దేవేంద్రుడు అగస్త్యమహర్షికి ఇచ్చినాడు. ఆ అగస్త్యమహర్షి రాముడికి అత్యంత ఆదరముతో

ఆ అమోఘబాణాన్ని దండకారణ్యములో ఇచ్చినాడు. ఆ మహా బాణము అమోఘము అయినది. దాని రెక్కలు వాయుదేవతాకము అయినవి. అందువల్ల అది వాయువేగముతో పోతుంది. దాని ముఖము సూర్యాగ్నిదేవతాకము అయినది. అందువల్ల అది పోయి తాకే తాకటముతో ఏది అయినా సరే భగ్గున మండి బూడిద అయి పోతుంది. దాని శరీరము ఆకాశమయము అయింది. అందువల్ల అది ఆకాశమువలె వ్యాపిస్తుంది. అది గౌరవానికి మేరు మందర పర్వతములవంటిది. అందువల్ల అది ఆ రెండుపర్వతాలంత బరువు అయింది. ముల్లోకాలలో ఉన్న సర్వభూతాల తేజస్సులనూ గ్రహించి బ్రహ్మదేవుడు సృష్టించిన ఆ మహాబాణము కాంచన పుంఖముతోనూ జాజ్వల్యమానము అయిన ఆకారముతోనూ సూర్య తేజముతోనూ పొగలుకమ్ముకొన్న ప్రళయకాలాగ్నిశిఖవలెనూ మంటలు మండుతూ ఉన్న మహావిషసర్పమువలెనూ అమిత వేగముతో పోయి శత్రువుల ఏనుగులనూ గుర్రాలనూ ఇట్టే చీల్చివేస్తుంది. రథాలను విరుగకొట్టుతుంది. శత్రుపురద్వారాలను పడకొట్టుతుంది. అగడ్తలను తెగకొట్టుతుంది. పర్వతాలను అయినా పగలకొట్టు తుంది. వజ్రమువలె అది అభేద్యము అయిన బాణము. ఇదివరకు అది నానావిధ రక్తమాంసాలనూ రుచిచూచింది. కొవ్వు పులుము కొన్నది. యుద్ధరంగములో మహాధ్వనులు చేస్తూ నానావిధ వ్యూహాలనూ రూపుమాపుతుంది. భయంకరముగా బుసలుకొట్టుతూ ఉన్న మహాసర్పమువలె తిరుగుతూ సర్వభూతాలనూ భయపెట్టు తుంది. కంకపక్షులకూ వశిపక్షులకూ గద్దలకూ నక్కలగుంపులకూ రాక్షసగణాలకూ యుద్ధభూమిలో ఎప్పుడూ కావలసినంత ఆహారము పంచిపెట్టుతుంది. భయావహము అయిన యముడికూపముతో యుద్ధరంగములో తిరుగుతుంది. గరుత్మంతునివలె రంగు రంగుల రెక్కలతో ఎక్కడికిపడితే అక్కడికి యథేష్టముగా పోతుంది. అంతకన్నా ఉత్తమోత్తమము అయిన బాణము ముల్లోకాలలోనూ లేదు. వానరులను అందరినీ సంతోషపెట్టటానికీ రాక్షసులను అందరినీ నాశనము చేసివేయటానికీ శత్రువుల కీర్తిని మాపివేయ టానికీ తాను పరమానందము అనుభవించటానికీ రాముడు అప్పుడు ఆ అమోఘబాణాన్ని చేతులో పట్టుకొన్నాడు.

ఆ మహాబలవంతుడు రాముడు వేదములో విధించినట్టుగా ఆ బాణాన్ని అభిమంత్రించినాడు. తన ధనుస్సులో సంధించినాడు. నారి సారించినాడు. ఆ కార్ముకాన్ని తన చెవివరకూ లాగినాడు. రావణాసురుణ్ణి గురిచేసి ఆ బాణాన్ని వదిలినాడు. ఆ మహాధ్వనికి సర్వభూతాలూ సంచలించిపోయినవి.

ఆ మహాబాణము దేవేంద్రుడి చేతులలోనుంచి వెలువడిన వజ్రాయుధమువలె ఎదిరించను అలవికాకుండానూ యముడివలె అడ్డగించను అలవికాకుండానూ అమితవేగముతో పోయి రావణాసురుడి వక్షస్థలాన్ని భేదించింది. ఆ వక్షస్థలములోనుంచి దూసుకొని పోతూ అతని ప్రాణాన్ని హరించింది. నెత్తురుతో తడిసింది. ఆ రాక్షసరాజు దేహములోనుంచి వెలువడి ఆ మహాబాణము భూమిలోకి పోయింది. తన పని నెరవేర్చినందువల్ల ఆ బాణము అంతట భూమిలోనుంచి బయటికివచ్చి వినయవిధేయతలతో తిరిగి రాముడి అంబులపొదిలోకి పోయి నిలిచింది.

ఆ బాణము వక్షస్థలములోనుంచి దూసుకొనిపోతూ ఉండగా తన ప్రాణాన్ని వదిలినట్టు రావణాసురుడు తన చేతిలోఉన్న కార్ముకాన్ని జారవిడిచినాడు. ఆ భయంకర పరాక్రముడు ఆ మహాతేజోవంతుడు రాక్షసరాజు రావణాసురుడు దేవేంద్రుడి వజ్రాయుధముదెబ్బ తిని పడిపోయిన వృత్రాసురుడివలె రథము మీదినుంచి నేల కూలినాడు. ఆ యుద్ధములో చావగా మిగిలిపోయిన రాక్షసులు ప్రాణము కోలుపోయి అట్లా నేలకూలిన తమ ఏలికను చూచి భయపడి అన్నివైపులా పరుగులెత్తినారు. మహావృక్షాలు ఆయుధాలుగా పట్టుకొని ఉన్న వానరయోధులు సంతోషాతిశయములో సింహనాదాలు చేస్తూ రాక్షసయోధులను తరిమికొట్టసాగినారు. రావణాసురుడి చావుకూ రాముడి విజయానికీ సంతోషముతో ఉప్పొంగిపోయి వానరయోధులు అట్లా తమను తరిమికొట్టుతూ ఉంటే రాక్షసయోధులు కన్నీళ్లు కారుస్తూ జాలి పుట్టేటట్టు ఏడుస్తూ భయపడుతూ లంకాపట్టణాభిముఖులు అయి పారిపోయినారు. అప్పుడు వానరవీరులు అందరూ రావణాసురుడి చావునుగురించీ రాముడి విజయాన్నిగురించీ చెప్పుకొంటూ సింహనాదాలు చేసినారు.

దేవతలు అప్పుడు ఆకాశములో మంగళకరముగా దుందుభులు మోగించినారు. భూమిమీద దివ్యగంధము గుబాళించింది. గాలి హాయిగా వీచింది. రాముడి రథంమీద దేవతలు మనోహరము అయిన పూలవాన కురిపించినారు. భూమిమీద వానరులు ప్రశంసించడమే కాకుండా ఆకాశములో ఉన్న మహానుభావులు అయిన దేవతలు అందరూ రాముణ్ణి వివిధవిధాల స్తోత్రము చేసినారు. దేవతల స్తోత్రాలు జగత్తు అంతటా వినిపించినవి. పరమ క్రూరుడూ సర్వలోకభయంకరుడూ అయిన రాక్షసరాజు రావణాసురుడు హతుడు అయిపోయినందుకు దేవతలు అందరూ పరమానంద భరితులు అయినారు.

రాముడున్నూ ఆ రాక్షసరాజును రావణాసురుణ్ణి సంహారము చేసివేసి సంతోషించినాడు. దేవసమూహాల కష్టాలు అన్నీ తీరిపోయినవి. దిశలు అన్నీ ప్రసన్నము అయినవి. ఆకాశము నిర్మలముగా భాసించింది. భూమి ప్రశాంతముగా తోచింది. గాలి హాయిగా వీచింది. సూర్యుడు నిశ్చలకాంతులతో తేజరిల్లినాడు.

అప్పుడు సుగ్రీవ విభీషణాది వీరులూ ఇంకా ఇతర మిత్రులూ లక్ష్మణుడితో కూడా చేరి జగదభిరాముణ్ణి రాముణ్ణి పూజించినారు. దేవసేనల మధ్య దేవేంద్రుడివలె, శత్రుసంహారము చేసి ప్రతిజ్ఞ చెల్లించుకొన్న ఆ మహాతేజోవంతుడు రాముడు అప్పుడు వానర సైన్యాల మధ్యను విరాజిల్లినాడు.

౧౧౨

యుద్ధములో చచ్చి పడిపోయిన తన అన్నను రావణాసురుణ్ణి విభీషణుడు చూచినాడు. ఇట్టే దుఃఖము వచ్చింది. ఏడుస్తూ "ఓ వీరుడా, నీవు పరాక్రమానికి ప్రసిద్ధి కెక్కినావు. సుశిక్షితుడవు. నీతిశాస్త్రము తెలిసినవాడవు. మహార్హశయ్యలమీద పడుకోవలసినవాడవు. ఇప్పుడు చచ్చి ఇట్లా నేలమీద పడిపోయినావా ? అయ్యో! సూర్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్న నీ కిరీటము తొలగిపోయింది. బాహుపురులు పెట్టుకొన్న నీ పొడుగాటి బాహువులు ఇట్లా పారచాచుకొని పడుకొన్నావా! ఓ వీరుడా, నీవు ఇట్లా అయి

పోతావని నేను ఇదివరకే చెప్పినాను. కామపారవశ్యములో ఉన్నందువల్ల నా మాటలు నీకు అప్పుడు రుచించలేదు. ఇప్పుడు ఈ దురవస్థ నీకు సంప్రాప్తము అయింది. ఇట్లా అవుతుందని ప్రహస్తుడు కానీ, ఇంద్రజిత్తు కానీ, మహాకాయుడు కుంభకర్ణుడు కానీ, నరాంతకుడు కానీ, తదితర రాక్షసులు కానీ వాండ్ల మదమునుంచి అనుకోలేదు. సీతాపహరణ పాపము ఇట్లా చేస్తుందని నీకు అయినా తోచలేదు. నేను చెప్పితే నీవు వినలేదు. ఆ పాపఫలము ఇప్పుడు ఇట్లా ప్రాప్తించింది.

"అన్నా! రాజనీతులకు అన్నింటికీ నీవు సేతువువంటివాడవు. అగ్నిహోత్రమూ, జపమూ, తపమూ అనే గృహస్థధర్మము నీ రూపాన అవతరించింది. ఈ జగత్తులో దేహబలము అనేది అంతా నీలో కేంద్రీకరించింది. నీ అంతవాడు లేడు అనిపించుకొన్నావు. నీవు మహావీరుడవు. ఆయుధధారులలో నీవు శ్రేష్ఠుడవు. ఇప్పుడు నీవు నేల కూలితే సూర్యుడు నేల కూలినట్టుగా ఉన్నది. చంద్రుడు చీకటిలో మునిగిపోయినట్టుగా ఉన్నది. అగ్నిహోత్రజ్వాలలు చల్లారి పోయినట్టుగా ఉన్నది. నీవు ఉత్సాహశక్తికి ఆశ్రయానివి. నీవు పోయినందువల్ల జగత్తు అంతా నిర్వ్యాపారముగా ఉంది. నీవు యుద్ధ భూమిలో ఇట్లా దుమ్ముకొట్టుకొని పడిఉన్నందువల్ల ఈ లోకము అంతా శూన్యముగా కనపడుతూ ఉన్నది.

"అయ్యో, ధైర్యమే చిగురుటాకుగానూ, సహనమే పుష్పముగానూ, తపస్సే దార్ఢ్యముగానూ, శౌర్యమే పాదుకొన్న వేరుగానూ పెరిగి పెద్దది అయిన రావణాసురుడు అనే మహావృక్షము రణరంగములో రాముడు అనే పెద్దగాలికి విరిగి పడిపోయింది. పరాక్రమమే దంతాలుగానూ, పితృపితామహాది వర్గమే వెన్నముకగానూ, కోపమే దేహముగానూ, అనుగ్రహమే తొండముగానూ యథేష్టముగా తిరిగిన రావణాసురుడు అనే మదపుటేనుగు రాముడు అనే సింహముచేత చిక్కి నేలకూలింది. పరాక్రమమూ ఉత్సాహమూ భగ్గున మండుతూ ఉన్న మంటలుగానూ, నిట్టూర్పులు పొగలుగానూ, దేహబలము వేడిగానూ, ప్రతాపము తేజస్సుగానూ ప్రజ్వరిల్లిన రావణాసురుడు అనే అగ్నిహోత్రాన్ని రాముడు

అనే మేఘము వర్షించి చల్లార్చివేసింది. రాక్షసులు తోకగానూ, మూపురముగానూ, కొమ్ములుగానూ, తిరిగిన రావణాసురుడు అనే ఆబోతును రాముడు అనే పెద్దపులి చంపివేసింది" అంటూ రోదించినాడు.

ఈవిధముగా రావణాసురుణ్ణిగురించి సహేతుకముగా చెప్పుతూ యుక్తాయుక్తాలు తెలిసిన విభీషణుడు దుఃఖపడుతూ ఉంటే రాముడు "ఓ విభీషణుడా, ఈరావణాసురుడు పిరికివాడివలె చచ్చిపోలేదు. ప్రచండ పరాక్రమముతో అత్యున్నత మహోత్సాహముతో నిర్భయముగా యుద్ధరంగములో పోరాడి పడి పోయినాడు. ఇట్లా యుద్ధరంగములో చనిపోయినవారికి వీర స్వర్గము తప్పదు. శూరధర్మము అవలంబించి నిర్భయముగా చని పోయినవాడికోసము దుఃఖపడకూడదు. దేవేంద్రుడితోకూడా ముల్లోకాలవారూ యుద్ధములో ఈ ధైర్యవంతుడికి భయపడిపోయి నారు. అటువంటివాడికి ఇప్పుడు కాలము ముగించుకొని వచ్చింది. అందువల్ల ఇది నీవు దుఃఖపడవలసిన సమయముకాదు. యుద్ధములో ఎవరు జయించేదీ ఎవరూ చెప్పలేరు. శూరుడు అయినవాడు శత్రువులను చంపివేయను అయినా చంపివేయవచ్చును. లేదా శత్రువులచేతిలో చచ్చిఅయినా పోవచ్చును. ఇదే వీరస్వర్గానికి మార్గము అని పూర్వికులు చెప్పినారు శూరులు అందరూ అంగీక రించినారు. యుద్ధములో చచ్చిపోయిన శూరుడికోసము దుఃఖపడ కూడదు. పుట్టిన ప్రతివాడికీ చావు తప్పదు. ఈ పరమార్థాన్ని గుర్తించు. దుఃఖాన్ని వదిలిపెట్టు. ఇకముందు చేయవలసిన పనిని గురించి ఆలోచించు" అని చెప్పినాడు.

విభీషణుడు దుఃఖతాపముతో "ఓరామా, దేవేంద్రుడితో కూడా దేవతలు అందరూ పోరాడినా ఇతడు ఇతఃపూర్వము పరాజితుడు కాలేదు. సముద్రము చెలియలికట్టను తాకి చెదిరి వెనుకకు పోయేటట్టు ఇతడు నిన్ను తాకి పరాజితుడు అయినాడు. హతుడు అయిపోయినాడు. ఈ రావణుడు అనేక దానాలు చేసినాడు. గురువులనూ దేవతలనూ చక్కగా పూజించినాడు. సమస్తభోగాలూ అనుభవించినాడు. భృత్యులను ఆదరించి పోషించి నాడు. మిత్రులకు కావలసినంత ధనము ఇచ్చినాడు. శత్రువులను

అందరినీ రూపుమాపినాడు. ఇతడు ఆహితాగ్ని. మహాతపస్సు చేసినాడు. వేదాధ్యయనము చేసినాడు. కర్మఠుడు. ఇప్పుడు ఇతని ప్రేతత్వవిముక్తికి చేయవలసిన కర్మలు నీ అనుగ్రహముతో నేను చేయవలెను అనుకొంటున్నాను" అని చెప్పినాడు.

ఇట్లా జాలి పుట్టేటట్టు విభీషణుడు చెప్పిన మాటలు అన్నీ విని ఆ మహాత్ముడు రాముడు రావణాసురుడు స్వర్గానికి పోవటానికి అంత్యేష్టికర్మ చేయవలసింది అని చెప్పుతూ "ఓ విభీషణుడా, చచ్చిపోయేవరకు వైరము. మనము అనుకొన్న పని అయిపోయింది. ఇకను రావణాసురుడికి ఔర్ధ్వదైహికకర్మ నీవు చేయవలెను. స్నేహ విషయములో ఇతడు నీకు ఎటువంటివాడో నాకూ అటువంటివాడే" అని చెప్పినాడు.

౧౧౪

మహాపరాక్రమవంతుడు రాముడు రావణాసురుణ్ణి చంపివేసినాడు అని అతని భార్యలందరూ విన్నారు. దుఃఖముతో కుంగిపోయి నేలమీద పడి దుమ్ములో దొర్లుతూ తలవెంట్రుకలు ముడులు ఊడిపోయి వెంట్రుకలు విరపోసుకొని దూడలు పోయిన ఆవుల మాదిరిగా ఏడుస్తూ ఎవరు ఎంత అడ్డగించినా వినకుండా అంతఃపురములోనుంచి బయలుదేరినారు. ఆ రాక్షసాంగనలు దుఃఖముతో బాధపడుతూ రాక్షసయోధులను వెంటపెట్టుకొని లంకాపట్టణ ఉత్తరద్వారములోనుంచి వెలుపలికి వచ్చి తమ పెనిమిటికోసము మహాభయంకరము అయిన ఆ యుద్ధభూమిలో వెతుకుతూ "ఓ రాజపుత్రా", అని రాముణ్ణి "అయ్యో, నాథా!" అని తమ పెనిమిటినీ సంబోధించి కేకలు పెట్టుతూ నెత్తురుతో బురద బురద అయిపోయిన ఆ యోధుల శవాలను చూస్తూ అన్నివైపులా తిరిగినారు భర్తృదుఃఖము ముంచుకొనిపోయి కన్నులనిండా కన్నీళ్లు క్రమ్ముకొని ఆ రాక్షసాంగనలు పోతుటేనుగ చచ్చిపోతే ఆడఏనుగులవలె గీపెట్టి ఏడ్చినారు.

ఆ యుద్ధభూమిలో నల్లటి కాటుకరాశివలె నేలమీద దుమ్ములో పడిఉన్న ఆ మహాపరాక్రమవంతుణ్ణి ఆ మహాకాయుణ్ణి

తమ పెనిమిటిని రావణాసురుణ్ణి ఆ రాక్షసాంగనలు అందరూ చూచినారు. నరికివేసిన వనలతలవలె వారు అందరూ రావణాసురుడి దేహముమీద వాలినారు. ప్రేమాతిశయముతో ఒకతె ఆ కళేబరాన్ని కౌగలించుకొని ఏడ్చింది. ఒకతె పాదాలు పట్టుకొని ఏడ్చింది. ఒకతె కంఠము పట్టుకొని ఏడ్చింది. ఒకతె భుజాలు ఎత్తిపట్టుకొని ఏడుస్తూ నేలమీద పొర్లాడింది. ఆ చచ్చిపోయిన పెనిమిటి ముఖము వంక చూస్తూ ఒకతె మూర్ఛపోయింది. ఆ పెనిమిటి తలను తన ఒడిలో పెట్టుకొని ఆ ముఖాన్ని చూస్తూ ఒకతె ఏడ్చింది. ఆ ముఖాన్ని తన కన్నీళ్ళతో తడుపుతూ ఒకతె ఏడ్చింది. చచ్చి నేలమీద పడిఉన్న తమ పెనిమిటిని చూచి ఆ స్త్రీలు అందరూ పెద్దపెట్టున పరిపరివిధాల ఏడ్చినారు.

“నాథా, దేవేంద్రుణ్ణి యముణ్ణి భయపెట్టుతూ ఉండేవాడివే! కుబేరుణ్ణి జయించి పుష్పకవిమానము తెచ్చుకొన్నావే! మహాపరాక్రమవంతులు అయిన సురలనూ గంధర్వులనూ గడగడలాడించినావే! అటువంటి నీవు రణరంగములో చచ్చి పడిపోయినావా! అసురులవల్లకానీ దేవతలవల్లకానీ పన్నగులవల్లకానీ ఏభయమూ ఎరుగని నీవు ఒక మానవుడిచేతిలో ఇట్లా అయిపోయినావా! ఇదేమిటి! ఇంత దురవస్థ నీకు ఎట్లా వచ్చింది! దేవ దానవ రాక్షసులు ఎవరూ వధించలేకపోయిన నిన్ను ఒక పదాతి అందులో మానవుడు రణరంగములో కొట్టి చంపివేసినాడా! దేవాసుర యక్షులకు చంపను అలవికాకుండా పోయిన నీవు ఎవడో బలహీనుడివలె ఒకానొక మానవుడి చేతిలో చచ్చిపోయినావా” అని చెప్పుకుంటూ ఆ రావణాసురుడి భార్యలు అందరూ అనేకవిధాల ఏడ్చినారు. దుఃఖార్తలు అయి మరీ మరీ ఏడ్చినారు. “నాథా, నీమేలుకోరేవాడు చెప్పే మాటలు నీవు ఎన్నడూ విని ఎరుగవు. నీ చావుకోసము నీవు సీతాదేవిని తెచ్చుకొన్నావు. నీవు చచ్చిపోవడమే కాకుండా రాక్షసయోధులు అందరూ చచ్చిపోయినారు. మేము ఇప్పుడు ఇట్లా అయిపోయినాము. నీమీది గౌరవాతిశయములో నీ తమ్ముడు విభీషణుడు నీకు హితము చెప్పినాడు. అతడు ఏమిచెప్పినా ప్రయోజనము లేకపోయింది. నీవు కాలపాశవశంగతుడవు అయినావు. అజ్ఞానమువల్ల అతనితో

నిష్ఠురాలు ఆడినావు. పరుషము అయిన మాటలు అన్నావు. ఆతనిని అవమానించినావు.

"ఓ రాజా, ఆ మైథిలిని సీతాదేవిని రాముడిదగ్గరికి నీవే పంపించివేసిఉన్నట్లయితే ఇట్లా సమూలముగా నాశనము అయిపోవడము ఉండేదికాదుగదా! ఈ మహాఘోరదుఃఖము మాకు వచ్చేది కాదుగదా! నీవు అట్లా చేసి ఉన్నట్లయితే నీ తమ్ముడు విభీషణుడి మాటలు చెల్లించినవాడవు అయ్యేవాడవు. నీ వంశానికి రాముడు మిత్రుడు అయ్యేవాడు. మేము విధవలము అయ్యేవాళ్లము కాము. నీ శత్రువులు అయిన దేవేంద్రాదుల కోరిక నెరవేరి ఉండేది కాదు.

"నాథా, నీవు బలవంతముగా సీతను తెచ్చినావు. నీ క్రూరస్వభావముతో నీవు ఆమెను చెరలో ఉంచినావు. అందునుంచే నీవూ అందరురాక్షసులూ ఇట్లా పడిపోయినారు. మాగతి ఇట్లా అయిపోయింది. ఓ రాజా, ఇది అంతా నీ స్వేచ్ఛాచరణమువల్లనే జరుగలేదు. ఇది దైవికము. సమస్తమూ దైవమువల్లనే జరిగింది. దైవమే నిన్ను చంపివేసింది. మరిఒకటి కాదు. ఓ మహాబాహూ, మహాసంగ్రామములో వానరులూ రాక్షసులూ నీవూ దైవయోగము వల్లనే నాశనము అయిపోయినారు. కాని మరి ఒకందువల్ల కాదు. కార్యోన్ముఖము అయిన దైవగతిని అర్థముతో అడ్డగించటము ఉత్తది. స్వేచ్ఛావ్యాపారముతో కానీ పరాక్రమముతో కానీ దానిని నిరోధించటము అశక్యము. రాజాజ్ఞ పనిచేయదు. దైవగతిని ఏదీ తప్పించలేదు. అది జరిగితీరవలసినదేను" అంటూ రావణాసురుడి భార్యలు ఏడుస్తూ కన్నీళ్లు కారుస్తూ దీనలు అయిపోయినారు. దుఃఖార్తలు అయి క్రౌంచపక్షులవలె ఏడ్చినారు.

౧౧౪

ఆ రాక్షసాంగనలు అందరూ అట్లా ఏడుస్తూ ఉండగా రావణాసురుడికి అత్యంత ప్రియురాలూ జ్యేష్ఠపత్నీ అయిన మండోదరి అక్కడికి వచ్చింది. ఊహించ నలవికాని పనులుచేసే రాముడి

చేతిలో చచ్చిపడిఉన్న తన పెనిమిటిని దశగ్రీవుణ్ణి చూచింది. ఆమెకు పట్టరాని దుఃఖము వచ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూ "ప్రభూ, నీవు మహాభాగుడవు. కుబేరుడు అంతటివాడి తమ్ముడవు. నీకు కోపమువస్తే దేవేంద్రుడు అయినప్పటికిన్నీ ఎదుట నిలవకుండా భయపడి పారిపోతాడు. మహాప్రభావము కలవారు అని ప్రసిద్ధికెక్కిన మహర్షులూ బ్రాహ్మణులూ ఆకాశములో తిరిగే చారణులూ గంధర్వులూ నీకు భయపడి దిక్కులు తెలియకుండా పారిపోతారే. రాజా, ఇది ఏమిటి! నీవు యుద్ధములో ఒక మనుష్యమాత్రుడి చేతిలో పడిపోవటము ఏమిటి! రాజా, నీవు నీ పరాక్రమములో ముల్లోకాలూ ఆక్రమించుకొన్న కాంతిమంతుడవు. దేవేంద్రాదులు ఎవ్వరూ ఎదిరించలేని బలవంతుడవు. నిన్ను ఒక అడవిమనిషి ఎట్లా చంపివేసినాడు. మానవుడు తిరుగలేనిచోట్ల నీవు తిరుగకలవే. కావలెను అనుకొన్న ఆకారము నీవు ధరించకలవే. యుద్ధములో నీవు రాముడిచేతిలో చచ్చిపోవటము ఎట్లా సాధ్యము అయింది. సైన్యాలూ సమస్త యుద్ధోపకరణాలూ ఉన్న నిన్ను రాముడు అనే మనుష్యమాత్రుడు యుద్ధములో చంపివేసినాడు అంటే నేను నమ్మలేకుండా ఉన్నాను.

"రాజా, జనస్థానములో అంతమంది రాక్షసులతో ఉన్న నీ తమ్ముణ్ణి ఖరుణ్ణి చంపివేసినాడు అని తెలిసినప్పుడే రాముడు మనుష్య మాత్రుడు కాడు అని నాకు తోచింది. నేను ఆ సంగతి నీతో చెప్పినాను. దేవతలకు అయినా అడుగుపెట్టడానికి అలవికాని మన లంకాపట్టణానికి హనుమంతుడు వచ్చినప్పుడు అందరమూ ఆశ్చర్యపడి పోయినాము. అతని పరాక్రమానికి వ్యథపడిపోయినాము. భయంక రాకారులు అయిన వానరులు మహాసముద్రానికి సేతువు కట్టినారు అని తెలిసినప్పుడు నా మనస్సులో రాముడు మానవమాత్రుడు కాడు అనుకొన్నాను. నిన్ను చంపివేయటానికి ఊహించ నలవికాని మాయతో సీతను సృష్టించి యముడు స్వయముగా రాముడిరూపము ధరించివచ్చి ఉండవలెను. లేదా దేవేంద్రుడు అయినా వచ్చిఉండ వలెను. అయితే యముడికికాని దేవేంద్రుడికికాని నీ ఎదుట నిల్చే శక్తి ఎక్కడిది!

"ఈ రాముడు మనుష్యమాత్రుడు కాడు. ఈతడు లోకరక్షణోపాయచింతాపరుడున్నూ ఆత్మలకుఆత్మ అయినవాడున్నూ అక్షయుడున్నూ పుట్టి పెరిగి చావడము లేనివాడున్నూ శాశ్వతుడున్నూ పరిణామము లేనివాడున్నూ బ్రహ్మేంద్రాదులకన్నా గొప్పవాడున్నూ ప్రకృతికి అతీతుడున్నూ జగత్తును పోషించేవాడున్నూ శంఖచక్రధారుడున్నూ శ్రీవత్సము అనే ఎర్రటి మత్స్యాకారము మచ్చ ఎదురురొమ్ము కుడివైపున ఉన్నవాడున్నూ ఎన్నడూ లక్ష్మీదేవిని ఎడబాయనివాడున్నూ అయిన శ్రీమహావిష్ణువు అయి ఉండవలెను. అందువల్లనే అజయ్యుడు అని స్పష్టముగా తెలుస్తూ ఉంది. ఆ మహాద్యుతిమంతుడు ఆ సత్యపరాక్రముడు ఆ సర్వలోకేశ్వరుడు మహావిష్ణువు ప్రత్యక్షముగా లోకాలకు మేలు చేయతలచి మానవాకారము ధరించినాడు. వానరరూపములో ఉన్న దేవతలను అందరినీ వెంటపెట్టుకొని వచ్చినాడు. నీ రాక్షసపరివారాన్ని నిన్నూ వధించివేసినాడు.

"ఓ రాజా, నీవు ఇదివరకు దేహేంద్రియాలను నిగ్రహించి త్రిభువనాలను జయించినావు. అందుకు ఆ ఇంద్రియాలు పగపట్టి నిన్ను జయించినవి. నీవు వాటికి లోబడిపోయినావు. కామపరవశుడవు అయిపోయినావు. త్రిభువనాలను జయించిన నీవు ఒక ఆడదాని కోసము ఇప్పుడు ఇట్లా అయిపోయినావు. అంతేకాని, నిన్ను సర్వేశ్వరుడు చంపివేయలేదు. రాముడితో విరోధము పెట్టుకోవద్దు అని నేను నీతో ఎంతో చెప్పినాను. నీవు నా మాట వినలేదు. దాని ఫలము ఇప్పుడు ఇట్లా నీకు అనుభవానికి వచ్చింది. ఓ రాజా, నీవు సీతాదేవిని కామించినావు. అందువల్ల నీవు పోవడమే కాకుండా నీ బంధు మిత్రులు నిశ్శేషముగా చచ్చిపోయినారు. నిష్కారణముగా నీఐశ్వర్యము నాశనము అయిపోయింది. నీవు అటువంటి పని చేసినావు. ఇంతకూ నీ మతి అప్పుడు చెడిపోయింది. పాతివ్రత్యములో అరుంధతీదేవికన్నా రోహిణీదేవికన్నా అధికురాలూ పూజ్యురాలూ అయిన సీతాదేవిని నీవు అవమానించినావు. చెయ్యకూడని పని చేసినావు. ఓ ప్రభూ, నీ భార్యలు సౌందర్యవతులు కారు అనుకొన్నావు. ఓర్పుకు భూమికన్నా ఎక్కువఅయినదానిని

సంపదకు లక్ష్మీదేవికన్నా ఎక్కువఅయినదానిని, మహాపతివ్రత అయినదానిని, సర్వాంగసుందరి అయినదానిని, కల్యాణస్వరూపిణి అయినదానిని సీతాదేవిని నిర్జనారణ్యములో ఒంటరిగా ఉన్నప్పుడు కపటోపాయముతో లేవనెత్తుకొని వచ్చినావు. ఆమెను పొందవలెను అనుకొన్నావు. ఆ కోరిక నెరవేరనే లేదు. ఆ మహాపతివ్రత తపోగ్నికి నీవు తగలపడిపోయినావు. సందేహము లేదు. ఆ తనుమధ్యను సీతాదేవిని అవమానించినప్పుడే నీవు దగ్ధము అయిపోయిఉండవలసింది. అట్లా జరుగలేదు. అది నీ మహాత్తు. అందుకు అగ్నిహోత్రాది దేవతలు ఆశ్చర్యపడిపోయినారు. భయపడిపోయినారు. పాపకర్మ చేసినవాడు కాలపరిపాకము అయినప్పుడు భయంకరము అయిన ఫలము అవశ్యమూ అనుభవిస్తాడు. ఎంతమాత్రమూ సందేహము లేదు. శుభకర్మలు చేసినవాడు శుభఫలమూ పాపకర్మలు చేసినవాడు పాపఫలమూ అనుభవించకతప్పదు. రాజా, నీ తమ్ముడు విభీషణుడు రాముణ్ణి ఆశ్రయించినాడు. మంచిపని చేసినాడు అందువల్ల అతడు సుఖము అనుభవిస్తూఉన్నాడు. ఇక ముందునూ సుఖమే అనుభవిస్తాడు. నీవు పాపిష్టిపని చేసినావు. ఇట్లా అయిపోయినావు.

"ఓ రాజా, సౌందర్యానికి ఆ సీతాదేవిని మించిన ఇతర స్త్రీలు ఎంతోమంది ఉన్నారు. కాని నీవు కామపారవశ్యమువల్ల అజ్ఞానివి అయి ఆ విషయము తెలుసుకోలేకపోయినావు. ప్రభూ, వంశగౌరవములోకానీ సౌందర్యములోకానీ చాతుర్యములోకానీ ఆ మైథిలి నాకన్నా ఎక్కువ అయిందికాదు. నాతో సరిసమానము అయింది అయినా కాదు. నీ అవివేకమువల్ల నీకు ఆమాత్రము తెలియలేదు. ఇతరూ సకలప్రాణులూ ఏదో ఒక నిమిత్తమునుంచి చచ్చిపోతూ ఉంటవి. అదేవిధముగా నీవు ఆ సీత నిమిత్తమునుంచి చనిపోవలసివచ్చింది. ఆమెనూలాగ నీవు మృత్యువును దూరదేశమునుంచి తెచ్చుకొన్నావు. రాజా, ఇకను ఆ సీతాదేవి స్వేచ్ఛాచారముగా రాముడితో విహరిస్తుంది. నేను మందభాగ్యను. ఘోరమైన శోకసాగరములో పడ్డాను.

"ఓ శూరుడా, కైలాసపర్వతముమీదనూ మేరు మందర పర్వతాలమీదనూ చైత్రరథము అనే కుబేరుని ఉద్యానవనములోనూ

సమస్త దేవోద్యానవనాలలోనూ చిత్రవిచిత్రములయిన పూలదండలతో అలంకరించుకొని అమూల్యము అయిన వస్త్రాలు ధరించి నీతో కూడా విహరించినాను. సాటిలేని సంపదలతో మనకు అనురూపము అయిన విమానము ఎక్కి పోయి వివిధదేశాలూ చూస్తూ కోరుకొన్న భోగాలు అన్నీ నీతో అనుభవించినాను. ఇప్పుడు నీవు చని పోయినందువల్ల ఆ భోగాలు అన్నీ అయిపోయినవి. అటువంటి రాజభోగాలు అనుభవించిన నేను ఇప్పుడు అభాగ్యను అయినాను. రాజుల భోగభోగ్యాలు నిలకడ లేనివి; ఛీ!

"రాజా, నీముఖము చంద్రునివలె ప్రసన్నము అయినది. పద్మమువలె అందము అయినది. సూర్యునివలె తేజోవంతము అయినది నీ కనుబొమలు కోమలము అయినవి. నీ ముక్కు పొడుగాటిది. నీది నున్నటి దేహము. ధగధగలాడే కుండలాలతోనూ ఉజ్జ్వలము అయిన కిరీటాగ్రముతోనూ పూలదండలు అలంకరించుకున్న కంఠముతోనూ పానశాలలో కైపుఎక్కి కన్నులు తేలి పోతూ నీ ఎర్రటి పెదవులతో మనోహరముగా చిరునవ్వులు నవ్వుతూ మధురముగా మాట్లాడుతూ మంగళకరముగా కనుపించే నీ ముఖము ఇప్పుడు రామబాణము దెబ్బకు వెల్లువలుఅయి పారిన నెత్తురులో తడిసిపోయి మెదడూ మాంసమూ కమ్ముకొని దుమ్ముకొట్టుకొని అమంగళముగా మాసిపోయినది. అయ్యో, నేను మందభాగ్యను. నీకు ఈ చరమావస్థ వస్తుంది అనీ నేను విధవను అవుతాను అనీ ఎన్నడూ అనుకోలేదు. నా తండ్రి దానవరాజు అనీ నా పెనిమిటి రాక్షసరాజు అనీ నా కొడుకు దేవేంద్రుణ్ణి జయించిన పరాక్రమవంతుడు అనీ నేను విర్రవీగినాను. నా రక్షకులు నా తండ్రీ, నా పెనిమిటీ, నా కొడుకూ గర్వించిన శత్రువులను మర్దించినారు అనీ శూరులు అనీ బలపౌరుషాలకు ప్రసిద్ధికి ఎక్కినారు అనీ ఎవరివల్లనూ భయమూ లేనివారు అనీ నేను గట్టిగా నమ్మినాను. ఓ రాజా, ఇటువంటి ప్రభావములకల మీరూ మీ కొమారుడూ అదివరకు ఎన్నడూ ఊహించని ఒక మనుష్యునిచేతిలో ఎట్లా పడిపోయినారు.

"ఓ రాజా, నీ కాయము నల్లని నిగనిగలతో ఇంద్రనీలమణివలెనూ ఎత్తు అయిన పర్వతమువలెనూ తేజరిల్లుతూ ఉండేది. చేతు

లకు పెట్టుకున్న బంగారు బాహుపురులతోనూ మెడలో వేసుకొన్న వైడూర్యమణిఖచితముక్తాహారాలతోనూ రంగురంగుల పూలదండల తోనూ నీ దేహయష్టి విహారస్థలాలలో మనోహరముగా తేజరిల్లేది. ధగధగలాడే ఆభరణాలతో మెరుపులు మెరుస్తూ ఉన్న నీలమేఘము వలె నీ మహాకాయము సంగ్రామరంగములో కన్నులు మిరుమిట్లు గొల్పేది. అటువంటి నీ మహాకాయములో సందులేకుండా తీక్ష్ణ బాణాలు ఎన్నో గుచ్చుకొన్నవి. నాథా, అందువల్ల నిన్ను కౌగ లించుకోటానికి కానీ చివరకు తాకటానికి కానీ అలవికాకుండా ఉంది. రాజా, నీ దేహము అంతటానూ నీ ఆయువుపట్టులలోనూ ఏదుపంది ముళ్ళవలె చోటులేకుండా బాణాలు గుచ్చుకొన్నవి. నరాల ముళ్ళు అన్నీ తెగిపోయినవి. నీ దేహము అంతా నెత్తుటితో తడిసి కపిలవర్ణముతో వజ్రాయుధముదెబ్బ తిన్న పర్వతమువలె ఈ నేలమీద పడిపోయింది. అయ్యో, ఈ చూస్తూన్నది అంతా స్వప్నమా! యథార్థమా! రాజా, నీవు మృత్యువుకు మృత్యువవే! నీవు ఎట్లా మృత్యువశము అయినావు. రాముడు నిన్ను ఎట్లా చంపి వేయ కలిగినాడు.

"రాజా, ముల్లోకాలలో అమూల్యపదార్థాలను అన్నిటినీ తెచ్చుకొని అనుభవించినావు. ముల్లోకాలవారిని గడగడలాడించి నావు. లోకపాలకుల జయించినావు. కోపమువచ్చి శివుడితోకూడా కైలాసపర్వతాన్ని ఎగురవేసినావు. గర్వించినవాళ్ళను అందరినీ నిగ్రహించినావు. సమస్త లోకాలవారికీ నీ పరాక్రమాన్ని చూపించి నావు. సమస్తలోకాలనూ క్షోభ పెట్టినావు. నీ మహానాదముతో భూతకోటిని అంతా ఏడ్పించినావు. శత్రుసన్నిధానములో నీవు దర్పములో గర్వోక్తులు పలికినావు. భయంకరకర్ములు అయిన బంధువులనూ భృత్యులనూ పరిపాలించినావు. రక్షించినావు. వేనకు వేలు దానవవీరులను సంహారము చేసివేసినావు. యక్షులను హాత మార్చినావు. నివాతకవచులు అనే రాక్షసులను భయపెట్టి స్నేహము చేసుకొన్నావు. నీవు ముల్లోకాలకూ నియామకుడవు అయి ఎన్నో యజ్ఞాలను చెడగొట్టినావు. ధర్మవ్యవస్థను ఛేదించినావు. స్వజనాన్ని కాపాడినావు. యుద్ధములో మాయలు పన్నేవాడవు. అక్కడక్కడ

నుంచి దేవకన్యలనూ అసురకన్యలనూ మానవకన్యలనూ అపహరించుకొని వచ్చేవాడవు. శత్రువులభార్యలను దుఃఖపెట్టే వాడవు. స్వజనులకు నాయకుడవు అయినావు. లంకాద్వీపాన్ని కాపాడినావు. భయంకరకృత్యాలకు అన్నిటికీ నీవే కర్తవు. మనుష్యులను కామభోగాలలో ముంచినావు. నీవు రథికులలో శ్రేష్ఠుడవు. ఇంత ప్రభావముకల నిన్ను నాపెనిమిటిని రాముడు పడగొట్టితే నాప్రియుడు చచ్చిపోతే చూస్తూ నేను ఇంకా చావకుండా బ్రతికిఉన్నాను. ఏమిటి నేను వజ్రశిలనో ఏమో!

"ఓ రాజా, మహార్హశయ్యలమీద పడుకొని నిద్రపోయే నీవు ఎందుకు ఇక్కడ ఈ నేలమీద ఎర్రటి దుమ్ముకొట్టుకొని నిద్రపోతున్నావు. నా కొడుకును ఇంద్రజిత్తును లక్ష్మణుడు యుద్ధములో చంపివేసినప్పుడే నాకు దెబ్బతగిలింది. సగముప్రాణము పోయింది. నాథా, ఇప్పుడు నీ చావుతో నేను సంపూర్ణముగా చచ్చిపోయినట్లే అయిపోయింది. నీవు జీవించి ఉన్నట్లయితే బంధుజనులూ నా బిడ్డలూ చనిపోయినందుకు నేను దుఃఖపడను. నా పెనిమిటివి నీవు నన్ను విడిచిపెట్టిపోయినావు. నేను ఎన్ని సంవత్సరాలు అయినా దుఃఖము అనుభవించవలసినదే. రాజా, నీవు ఇప్పుడు దుర్గమము అయిన దూరదేశము పోతున్నావు. నేను దుఃఖార్తను. నన్నుకూడా నీతో తీసుకొనిపో. నిన్ను వదిలిపెట్టి నేను జీవించి ఉండలేను. నా గర్వము ఉడిగిపోయింది. పరమదుఃఖముతో విలపిస్తున్నాను. నేను మందభాగ్యను. నన్ను వదిలిపెట్టి నీవు ఒక్కడవే ఎందుకు పోతున్నావు. నాతో పలకనుఅయినా పలకవు ఏమిటి.

"ప్రభూ, నేను వస్త్రము పైన కప్పుకోకుండా నగరద్వారములోనుంచి వెలుపలికి వచ్చి ఇక్కడికి ఇట్లా కాలినడకను వస్తే నన్ను చూచి నీవు కోపపడకుండా ఉన్నావు ఎందువల్ల. వీరు అందరూ నీ ప్రియభార్యలు. వీళ్లు అందరూ సిగ్గు వదిలిపెట్టి పైన గుడ్డలు కప్పుకోకుండా బయటికి వచ్చినారు. వీళ్లనుచూచి నీవు కోపపడకుండా ఉన్నావే. రాజా, నీ క్రీడాసహాయులు అయిన

భార్యలు అందరూ అనాథలు అయి ఇట్లా విలపిస్తూ ఉంటే నీవు ఆశ్వాసించవు, ఆదరించవు. ఎందువల్ల?

"రాజా, నీవు పరమధర్మపరాయణలూ గురుజనసేవాసక్తలూ పరమపతివ్రతలూ అయిన కులాంగనలను అనేకమందిని విధవలను చేసినావు. వాళ్లు అందరూ దుఃఖతాపముతో నిన్ను శపించినారు. అందువల్ల నీవు ఇప్పుడు ఇట్లా శత్రువుచేతిలో చిక్కిపోయినావు. నీవు బాధపెట్టిన పతివ్రతల శాపమువల్లనే నీకు ఇప్పుడు ఇటువంటి చావు వచ్చింది. పతివ్రతలు కార్చిన కన్నీళ్లు వ్యర్థము అయిపోవు అనే జనశ్రుతి నీవిషయములో యథార్థము అయింది. రాజా, నీవు నీ పరాక్రమముతో ముల్లోకాలనూ జయించినావు. శౌర్యములో గర్వించినావు. నీవు నీచముఅయిన స్త్రీచౌర్యము చేసినావు. ఏమిటి, నీవు మృగమాయతో రాముణ్ణి ఆశ్రమములోనుంచి అవతలకు పంపించివేసి అతని భార్యను తెచ్చుకోవడము నీ పిరికితనానికి నిదర్శనము అయింది. నీకు యుద్ధములో ఒకానొకప్పుడు అయినా పిరికితనము వచ్చినట్లు నాకు జ్ఞాపకము లేదు. ఇంతకూ నీ భాగ్య విపర్యయకాలము దాపురించింది. ఆ పిరికిపని చేసినావు. నీవు తెచ్చిన సీతాదేవిని చూచి నీ తమ్ముడు నా మరది విభీషణుడు ఆలోచించినాడు. పెద్ద పెద్ద నిట్టూర్పులు విడిచినాడు. అతడు భూతభవిష్యద్వర్తమానాలు అన్నీ తెలిసినవాడు. వర్తమాన విషయాలు పరిశీలించే సామర్థ్యము కలవాడు. అబద్ధము ఆడేవాడు కాడు. అతడు మహాపూజ్యుడు. అప్పుడు అతడు చెప్పినాడు. నీ కామక్రోధవ్యసనాలవల్ల రాక్షసవీరులు అందరూ నాశనము అయిపోయినారు. కూకటివేళ్లతోకూడా సర్వనాశనము అయిపోయిన ఈ మహానర్థము నీ ఒక్కడినుంచే జరిగింది. నీనుంచే రాక్షసవంశము దిక్కుమాలింది అయిపోయింది. అయితే నేమిటి నీవు బలానికీ పౌరుషానికీ ప్రసిద్ధికి ఎక్కినావు. యుద్ధములో చచ్చిపోయినావు. నీకోసము నేను దుఃఖపడకూడదు. అయితే నేను ఆడుదాన్ని. మనస్సు నిలవక ఏడుస్తూ ఉన్నాను.

"ప్రభూ, నీవు సుకృతాన్నీ దుష్కృతాన్నీ మూటకట్టుకొని నీవు నీదారిన పోతూఉన్నావు. అందుకోసము నేను దుఃఖపడటము

లేదు. నీ ఎడపాటు నేను సహించలేను. భరించలేను. నన్ను గురించి నేను దుఃఖపడుతున్నాను. ఓ పుణ్యాత్ముడా, నీ మేలుకోరి నీ మిత్రులు చెప్పిన మాటలు నీవు వినలేదు. నీ తమ్ముడు విభీషణుడు సర్వవిధాలా నీ మేలుకోరి సహేతుకముగానూ అర్థయుక్తముగానూ యథాశాస్త్రముగానూ శ్రేయస్కరముగానూ ఎంతో మృదువుగా చెప్పినాడు. నీవు వినలేదు. విభీషణుడు ఏమిటి, నీకు మారీచుడే చెప్పినాడు. నీ తమ్ముడు కుంభకర్ణుడు చెప్పినాడు. నా తండ్రి చెప్పినాడు. నీవు నీ పరాక్రమమదమునుంచి ఎవరిమాటలూ వినలేదు. ఇప్పుడు ఈ ఫలము ప్రాప్తము అయింది.

"ఓ నీలమేఘవర్ణుడా, పసుపువస్త్రము కట్టుకొని అందము అయిన బాహుపురులతో అలంకరించుకొన్న నీవు నెత్తుటితో తడిసి నేలమీద కాళ్ళూచేతులూ పారచాచుకొని నిద్రపోతున్నవాడివలె పడుకొన్నావు ఏమిటి! దుఃఖార్తను అయిన నాతో మాట్లాడవు ఏమిటి! నేను మహాపరాక్రమవంతుడూ సమర్థుడూ యుద్ధములో అపరాజితుడూ అయిన మాల్యవంతుడి మనుమరాలిని. నన్ను కన్నెత్తిచూడవు ఎందువల్ల ప్రభూ. ఎందుకు ఇట్లా పడుకొంటావు. నీవు ఇప్పుడు లేవవలెను. లే. మారతనము అయిన అవమానము సంప్రాప్తము అయింది. లంకాపట్టణముమీద ఇప్పుడు నిర్భయముగా సూర్యకిరణాలు వచ్చి పడుతున్నవి. నీవు లే. అయ్యో, సూర్యకాంతులతో తేజరిల్లే నీ పరిఘాయుధము రామబాణాలకు ముక్కలుముక్కలు అయిపోయిందే. దేవేంద్రుడు తన వజ్రాయుధాన్నివలె బంగారు కట్లువేసిన నీ పరిఘాయుధాన్ని నీవు నిత్యమూ పూజిస్తూ ఉండేవాడివి. యుద్ధాలలో ఎంతమంది శత్రువులనో నీవు ఈ పరిఘాయుధముతో సంహారము చేసివేసినావు. అయ్యో, నీ పరిఘాయుధము ముక్కలు ముక్కలు అయిపోయిందే. నీవు నీ ప్రియురాలినివలె యుద్ధభూమిలో ఈ నేలను కౌగలించుకొని పడుకొని ఉన్నావు. ఆ ప్రియురాలితో మాట్లాడినట్టు నాతో మాట్లాడకుండా ఉన్నావు.

"రాజా, నీవు పంచత్వము చెందితే నా గుండె ముక్కలు ముక్కలుగా పగిలిపోలేదు. ఎందువల్ల. ఛీ. ఛీ" అంటూ ఏడ్చింది.

ఇట్లా మండోదరి ఏడుస్తూఉంటే కన్నులు కలకబారి పోయినవి. ఆమె హృదయము కుమిలిపోయింది. ఏడ్చి ఏడ్చి ఒళ్లు తెలియకుండా రావణాసురుడి వక్షఃస్థలముమీద పడి మూర్ఛపోయింది. అప్పుడు ఆమె సంధ్యారాగము అలముకొన్న నీలమేఘముమీద మెరుపుతీగ మాదిరిగా మెరిసింది. ఆమెతోపాటు ఏడుస్తూఉన్న ఆమె సవతులు అప్పుడు గబగబా ఆమెను లేవదీసి కూర్చుండ పెట్టి "ఓ దేవీ, ప్రతిప్రాణికీ బాల్య, కౌమార, యౌవన, వార్థక్య దశాభేదాలనుపట్టి మార్పు తప్పదు. రాజుల వైభవానికీ ఒక నిలకడ ఉండదు. ఈ విషయము నీకు తెలియనిది ఏమీలేదు. ఎందుకు దుఃఖపడతావు" అంటూ ఊరడించినారు. ఇట్లా సవతులు ఊరడిస్తూఉంటే మండోదరి కన్నీటి కాలవలతో తన ఉన్నతస్తనాలు తడిసిపోయేటట్లు పెద్దపెట్టున ఏడ్చింది.

ఇట్లా రావణాసురుడి భార్యలు ఇటువైపున ఏడుస్తూవుంటే అటువైపున రాముడు విభీషణుణ్ణి చూచి "ఓ మిత్రుడా, నీ అన్నకు దహనసంస్కారము చేయవలసివుంది. ఈ స్త్రీలను అందరినీ వెనుకకు పంపించు" అని చెప్పినాడు. ఇట్లా ధర్మార్థసహితముగా రాముడు చెప్పిన మాటను విని ఆ వినయసంపన్నుడు ఆ ధర్మజ్ఞుడు విభీషణుడు మనసా ఆలోచించినాడు. రాముడు చెప్పినట్లే అనుసరించ తలచుకొన్నాడు. కాని, పైకి ఇట్లా అన్నాడు: "రామా, ఈ రావణుడు ధర్మము తప్పినాడు. వ్రతానుష్ఠానము వదిలిపెట్టినాడు. వీడు క్రూరుడు, ఘాతుకుడు. అనృతములు ఆడేవాడు. పరదారలను తడివేవాడు. వీడికి దహనసంస్కారము చేయడానికి నేను తగినవాణ్ణి కాను. వీడు ఈ రావణాసురుడు నాకు భ్రాతృరూపశత్రువు. సర్వము అయినవాటికీ వీడు అపకారము చేసినాడు. జ్యేష్ఠుడు అనే గౌరవాన్నిపట్టి నాకు పూజ్యుడు అయినప్పటికిన్నీ నేను పూజించతగినవాడు కాడు. జ్యేష్ఠుడికి ఉత్తరక్రియలు చేయలేదని లోకులు నన్ను వారి చిత్తమువచ్చినట్టు దూషిస్తారు. ఆ తరువాత ఆతడి గుణగణాలనుగురించి తెలుసుకొంటారు. నేను మంచిపనే చేసినాను అని మెచ్చుకొంటారు" అని విభీషణుడు చెప్పినాడు.

ఆ వాక్యకోవిదుడు విభీషణుడు ఇట్లా చెప్పింది విని ఆ ధర్మజ్ఞుడు ఆ వాక్యజ్ఞుడు రాముడు "ఓ విభీషణుడా, నీవు రాక్షసేశ్వరుడవు. నీవు నన్ను సంతోషపెట్టవలెను. నీ సహాయమువల్లనే నేను జయించినాను. కాబట్టి నేను అవశ్యము నీకు మేలుఅయ్యేదే చెప్పవలెను. ఈ నిశాచరుడు అధర్మమూ అనృతమూ అవలంబించినాడు. సరే, అది అట్లా ఉండనివ్వు. వీడు పరమ పరాక్రమవంతుడు, అమితబలవంతుడు, యుద్ధాలలో అపజయము ఎరుగని శూరుడు. దేవేంద్రుడూ మొదలైన దేవతలవల్లకూడా అపజయము ఎరుగనివాడు. మహాప్రభావము కలవాడు, సమస్తలోకాలనూ గగ్గోలు పెట్టినాడు. మరణమువరకే వైరము. మన ప్రయోజనము నెరవేరింది. ఇతడు స్నేహవిషయంలో నీకు ఎటువంటివాడో నాకున్నూ అటువంటివాడే. అయితే, ఇతడు నీ జ్యేష్ఠభ్రాత. కాబట్టి ఇతడి ఉత్తరక్రియలు నీవుచేయవలెను. నీవు సమస్తధర్మాలూ తెలిసినవాడవు. ఈ దశగ్రీవుడికి నీవు కర్మచేయటము శాస్త్రచోదితము అయిన పద్ధతి. అందువల్ల నీకు కీర్తి వస్తుంది" అని చెప్పినాడు.

ఈ విధముగా రాముడు చెప్పగానే రావణాసురుడి యోగ్యతకు తగినట్టుగా అంతట దహనసంస్కారము చేయటానికి విభీషణుడు తొందరపడ్డాడు. వట్టివేళ్లూ పద్మకము అనే సుగంధ ద్రవ్యాలు వేసి చందనపు కట్టెలతో వేదోక్తపద్ధతిని చితిపేర్చినారు. ఆ చితిమీద తెల్లజింకతోలు కప్పినారు. వేదవిహితముగా రావణాసురుడికి అంత్యేష్టిని జరిపినారు. ఆ రాక్షసేంద్రుడికి యథాక్రమముగా పితృమేధసంస్కారము చేసినారు.

ముందుగా ఆ చితికి ఆగ్నేయభాగాన అగ్నివేదిని ఏర్పాటు చేసినారు. ఆ వేదిలో స్థానాలు తప్పకుండా త్రేతాగ్నులను (అంటే, పడమటి దిక్కున గార్హపత్యాగ్నినీ, తూర్పు దిక్కున ఆహవనీయాగ్నినీ, దక్షిణ దిక్కున దక్షిణాగ్నినీ) స్థాపించినారు. హేమపాత్రలనిండా పెరుగుతో కలిపిన నెయ్యిని పోసి ఋత్విజులు అందరూ అగ్నిహోత్రాన్ని వేల్చినారు. అప్పుడు ఆ రావణాసురుడి పాదాలనడుమ సోమలతను తెచ్చే బండినీ తొడల నడుమ యజ్ఞానికి కావలసిన ధాన్యము దంచుకొనే రోటినీ రోకలినీ ఇంకా

ఆ యా స్థానాలలో దారుపాత్రలనూ, స్థాలినీ అరణికట్టెనూ ఉత్తరారణికట్టెనూ శాస్త్రములో చెప్పినట్టుగానూ స్మృతులలో విధించి నట్టుగానూ క్రమము తప్పకుండా ఉంచినారు. ఆ చితిసమీపములో పవిత్రము అయిన యజ్ఞపశువును (మేకను) చంపి అగ్నిహోత్రములో వేల్చినారు. అంతట నేతితో తడిపిన దర్భలు రావణాసురుడికి అన్నివైపులా పరచినారు. విభీషణుడికి సహాయులు అయిన ఋత్విజులు గంధముతోనూ పూలదండలతోనూ నానావిధ వస్త్రాలతోనూ రావణాసురుడి శవాన్ని అలంకరించినారు. అప్పుడు ఆ రాక్షస ఋత్విజులు అందరూ దీనమనస్కులు అయి, కన్నీళ్లు కారుస్తూ ఆ చితిమీద పేలాలు చల్లినారు. విభీషణుడు అప్పుడు మంత్రయుక్తముగా ఆ రావణాసురుడి చితికి నిప్పు పెట్టినాడు.

ఆ తరువాత విభీషణుడు స్నానము చేసి తడిగుడ్డలతో గరిక పోచలు వేసిన తిలోదకాలు భూమిమీద వదిలినాడు. ప్రేతావాహనము చేసి రావణాసురుడికోసము ఉదకదానం చేసినాడు. అంతట శిరసా నమస్కారము చేసినాడు. రావణాసురుడి భార్యలను అందరినీ మంచిమాటలతో పదే పదే ఓదార్చి లంకాపట్టణములోనికి పొమ్మని చెప్పినాడు.

ఆ రాక్షసాంగనలు అందరినీ లంకాపట్టణానికి పంపించి వేసిన తరువాత విభీషణుడు రాముడిదగ్గరకు పోయి వినయము ఉట్టిపడుతూ నిలుచున్నాడు.

వృత్రాసురుణ్ణి సంహారము చేసిన దేవేంద్రుడివలె శత్రుసంహారము చేసిన రాముడు అప్పుడు సుగ్రీవలక్ష్మణసహితముగా వానరసైన్యాల మధ్య ఎంతో సంతోషముతో తేజరిల్లినాడు.

౧౧౩

ఆ యుద్ధము చూడడానికి వచ్చిన దేవతలూ గంధర్వులూ దానవులూ భయంకరము అయిన రావణసంహారాన్ని చూచి రాముడి పరాక్రమాన్ని గురించీ వానరవీరుల మహాయుద్ధాన్ని గురించీ సుగ్రీవుడి మంత్రాంగాన్ని గురించీ లక్ష్మణుడి అనురాగపరాక్రమాలనుగురించీ ఆటువంటి పుత్రులకన్న కౌసల్యా సుమిత్రలనుగురించీ మంగళ

కరముగా చెప్పుకుంటూ తమ తమ విమానాలు ఎక్కి తమ తమ తావులకు వెళ్ళిపోయినారు.

ఆ మహాభాగుడు రాముడు అప్పుడు దేవేంద్రసారథిని సన్మానించినాడు. అగ్నిహోత్ర కాంతులతో తేజరిల్లుతూ ఉన్న దేవేంద్రుడి దివ్యరథాన్ని తిరిగి తీసుకొనిపోవడానికి అనుమతించినాడు. అంతట మాతలి ఆ దివ్యరథము ఎక్కి దేవలోకానికి ప్రయాణమైపోయినాడు. మాతలి వెళ్లిపోగానే రాముడు పరమ సంతోషముతో సుగ్రీవుణ్ణి గట్టిగా కౌగలించుకొని గౌరవించినాడు. అప్పుడు లక్ష్మణుడు తమ శిబిరానికి పోదాము అని రాముడితో చెప్పినాడు. వానరవీరుల పూజలు అందుకొంటూ రాముడు తన శిబిరానికి పోయినాడు.

రాముడు అక్కడ అప్పుడు తన సమీపములో తేజస్సుతో జ్వలిస్తూ ఉన్న లక్ష్మణుణ్ణి చూచి "నాయనా, ఈ విభీషణుడు మన స్నేహితుడు, నాకు భక్తుడు, మనకు ఉపకారము చేసినాడు. లంకాపట్టణములో నీవు ఇతనికి రాజ్యాభిషేకము చేయవలెను. ఇప్పుడు ఇది నా ముఖ్యమైన కోరిక" అని చెప్పినాడు. "అట్లాగేను" అని చెప్పి లక్ష్మణుడు విభీషణుణ్ణి వెంటపెట్టుకొని లంకాపట్టణానికి పోయినాడు. మనోవేగముతో పోయే మహాబలవంతులు అయిన వానరముఖ్యులకు బంగారుకుండలు తెప్పించి ఇచ్చి వెంటనే సప్త సముద్ర జలాలు తెమ్మని ఆజ్ఞాపించినాడు. ఆ వానరోత్తములు అప్పటికి అప్పుడు పోయి సప్తసముద్ర జలాలనూ తెచ్చినారు. అంతట లక్ష్మణుడు విభీషణుణ్ణి సింహాసనముమీద కూర్చుండబెట్టినాడు. ఆ సింహాసనము చుట్టూ విభీషణుడి మిత్రులూ రాక్షసముఖ్యులూ కూర్చొన్నారు. అప్పుడు ఆ పరిశుద్ధాత్ముడికి ఆ విభీషణుడికి బంగారు కలశములో ఉన్న నీటితో లక్ష్మణుడు రాజ్యాభిషేకము చేసినాడు. అందుకు విభీషణుడి అమాత్యులూ తక్కిన రాక్షసులూ ఎంతో సంతోషించినారు. లంకాపట్టణములో ఉన్న పౌరముఖ్యులు అక్షతలూ మోదకాలూ పేలాలూ దివ్యమైన పుష్పాలూ ఇంకా అనేక సుగంధ ద్రవ్యాలూ విభీషణుడికి సమర్పించినారు. రామానుగ్రహమువల్ల లంకారాజ్యానికి విభీషణుడు అప్పుడు రాజు అయినాడు. అప్పుడు

అతడు ప్రజలకు అందరికీ మంచిమాటలు చెప్పి సంతోషపెట్టినాడు. పట్టాభిషేకము అయిపోయినతరువాత విభీషణుడు మళ్ళీ రాముడి దగ్గరకు పోయినాడు. నిశాచరపౌరులు అందరూ తనకు సమర్పించిన మంగళద్రవ్యాలను అన్నిటినీ ఆ దుర్ధర్షుడు విభీషణుడు రామలక్ష్మణులకు సమర్పించినాడు. కృతార్థుడూ పరిపూర్ణమనోరథుడూ అయిన విభీషణుడు సమర్పించిన మంగళద్రవ్యాలను రామలక్ష్మణులు సంతోషముగా స్వీకరించినారు.

రాముడు అప్పుడు తనపక్కను చేతులుజోడించి నిలుచొని ఉన్న పరమపరాక్రమవంతుణ్ణి హనుమంతుణ్ణి చూచి, "ఓ మారుతీ, ఇదుగో, ఈమహారాజును విభీషణుణ్ణి చూడు. ఈయన అనుమతిని సంపాదించి నీవు లంకాపట్టణానికి ఇప్పుడే పోవలెను. రావణాలయములో ఉన్న వైదేహిని చూచి నావిజయాన్నిగురించి చెప్పు. ఆమెను సంతోషపెట్టు. సుగ్రీవుడూ నా తమ్ముడు లక్ష్మణుడూ నేనూ కుశలముగా ఉన్నాము అని చెప్పు. నేనే రావణాసురుణ్ణి సంహారము చేసివేసినాని చెప్పు. ఓ హనుమంతుడా, ఆ మైథిలి సంతోషించే విషయము అంతా చెప్పి ఆమె ఏమి చెప్పుతుందో విను. తిరిగివచ్చి ఆమెమాటలు నాతో చెప్పు" అన్నాడు.

౧౧౬

రామాజ్ఞను శిరసావహించి హనుమంతుడు లంకాపట్టణానికి పోయినాడు. అక్కడ రాక్షసులు అందరూ అతనిని గౌరవించినారు. ఆ మహాతేజోవంతుడు హనుమంతుడు అంతట రావణాసురుడి నివేశనములోనికి పోయినాడు. అక్కడ చెట్టుక్రింద రాక్షసాంగనల అందరి మధ్యనూ గ్రహబాధ అనుభవిస్తూ ఉన్న రోహిణీదేవివలె స్నానాది దేహసంస్కారాదులు లేకుండా నిరానందంగా కూర్చొని ఉన్న సీతాదేవిని చూచినాడు. ఆమెను సమీపించినాడు. తన పేరు చెప్పుకొని హనుమంతుడు ఆమెకు నమస్కారము చేసినాడు. నిశ్చలుడుగా వినమ్రుడుగా నిలుచున్నాడు. ఆ మహాబలవంతుణ్ణి సీతాదేవి చూచింది. ఈగాలేశము ఊరకున్నది. చప్పున స్ఫురించింది. ఆ వచ్చినవాడు హనుమంతుడు అని తెలుసుకొన్నది. ఆమె

ముఖము ఇట్లా వికసించింది. అదిచూచి హనుమంతుడు "ఓ వైదేహీ, రాముడు రావణాసురుణ్ణి సంహారము చేసివేసినాడు. ఆ అరిందముడు కృతకృత్యుడు అయినాడు. తనకుశలము నీతో చెప్పమని నన్ను పంపించినాడు. లక్ష్మణ సుగ్రీవ విభీషణులతోనూ వానర సైన్యాలతోనూ ఇప్పుడు స్వస్థముగా ఉన్నాడు.

"ఓ దేవీ, వానరసైన్యాలు భయంకరముగా పోరాడినవి. విభీషణుడు సహాయము చేసినాడు. లక్ష్మణుడు తన రాజనీతి నైపుణ్యాన్నీ పరాక్రమాన్నీ చూపించినాడు. రాముడే రావణాసురుణ్ణి చంపివేసినాడు. ఆ వీరుడు ఆ రఘుకుల దీపకుడు ఇప్పుడు కృతార్థుడు అయినాడు. నీ కుశలము అడిగి తెలుసుకొని రమ్మన్నాడు. ఇంకా నీతో ఇట్లా చెప్పమన్నాడు.

"ఓ దేవీ, నీకు సంతోషవార్త చెప్పుతూఉన్నాను. నిన్ను మరింత సంతోషపెట్టుతాను. నీవు పాతివ్రత్యధర్మము తెలిసిన దానవు. నాభాగ్యవశమువల్ల నీవు ఇంతవరకూ జీవించి ఉన్నావు. ఓ సీతా, నేను యుద్ధములో గెలిచినాను. ఇంతటితో నీవ్యథ అంతా తీరిపోయింది. ఇక నీవు స్వస్థముగా ఉండు. మన శత్రువు రావణాసురుడు చచ్చిపోయినాడు. నిన్ను శత్రువు చేతిలోనుంచి విడిపించటానికి నేను దృఢముగా సంకల్పించుకొన్నాను. నేను నిద్ర పోలేదు. మహోదధిలో సేతువు కట్టించినాను. రావణాసురుణ్ణి సంహారము చేసివేస్తాను అన్న నా ప్రతిజ్ఞను చెల్లించుకొన్నాను. ఈ లంకారాజ్యము అంతా నా వశము అయింది. నేను ఈ లంకా రాజ్యాన్ని అంతా ఇప్పుడు విభీషణుడి అధీనము చేసివేసినాను. నీవు ఇంకా రావణాలయములో ఉన్నందుకు కలవరపడ నవసరము లేదు. నేను లంకారాజ్యాన్ని విభీషణుడికి ఇచ్చివేసినందువల్ల నీవు స్వగృహములోనే ఉన్నట్లు భావించు. నీవు దుఃఖపడవద్దు. విభీషణుడు సంతోషముతోనూ ఉత్సాహముతోనూ నీ దర్శనము చేయడానికి వస్తాడు.

"ఈ విధముగా రాముడు చెప్పమన్నాడు" అని హనుమంతుడు సీతాదేవితో చెప్పినాడు. ఆ శశినిభానన సీతాదేవి లేచి నిలుచొన్నది. సంతోషముతో ఉప్పొంగిపోయింది. ఏమీ మాట్లాడ

లేకపోయింది. ఉత్ఫుల్లనేత్రాలతో చూస్తూ ఊరకున్నది. బదులు చెప్పకుండా ఉన్న ఆ సీతాదేవిని చూచి ఆ వానరోత్తముడు హను మంతుడు "ఓ దేవీ, ఏమిటి ఆలోచిస్తున్నావు! ఏమీ మాట్లాడవు ఏమిటి!" అని అడిగినాడు. ఆ మహాపతివ్రత సీతాదేవి అప్పుడు హర్షగద్గదకంఠముతో "ఓ హనుమంతుడా. నా పెనిమిటి విజయము నీవు చెప్పినావు. నాకు పట్టరాని సంతోషము వచ్చింది. నాకు ఇంత సంతోషవార్త చెప్పిన నీకు ఏమని బదులు చెప్పటమూ అని ఒక క్షణము ఆలోచించినాను. నా సంతోషాన్ని ఎట్లా వెల్లడించవలెనో నాకు తోచలేదు. అందువల్ల ఊరకున్నాను ఓ హనుమంతుడా, యింత సంతోషవార్త నీవు చెప్పినావు. ఏది అయినా నీకు యిచ్చి నిన్ను సంతోషపెట్టవలెను అనుకున్నాను. అయితే నీవు చెప్పిన సంతోషవార్తకు ఇవ్వతగిన వస్తువు ఈ భూలోకములో ఏదీ నాకు కనపడలేదు. నీకు ఇవ్వతగిన వస్తువు ఈ భూలోకములోనే కాదు; ముల్లోకాలలోనూ లేదు. ఉన్న వెండి అంతా ఇచ్చినా చాలదు. ఉన్న బంగారము అంతా ఇచ్చినా చాలదు. నానావిధ రత్నరాసులు అన్నీ ఇచ్చినా చాలదు. త్రైలోక్యాధిపత్యము యిచ్చినా చాలదు. నీవు చెప్పిన సంతోషవార్తకు ఇవ్వతగిన వస్తువు ఏదీ ఈ జగత్తులో లేదు" అని చెప్పింది.

ఈ విధముగా సీతాదేవి చెప్పిన మాటలకు చేతులు జోడించి ఆమె ఎట్టఎదుట నిలుచొనిఉన్న హనుమంతుడు "ఓ దేవీ, నీకు కావలసింది నీ పెనిమిటి సంతోషము. నీ పెనిమిటి శ్రేయస్సు. నిరంత రమూ నీ భర్త విజయాన్ని కాంక్షించినావు. నామీద నీకు ఉన్న వాత్సల్యమునుంచి ఈ విధముగా అంటున్నావు. ఓ ప్రసన్నురాలా, నేను చెప్పిన వార్తకు నీ సంతోషము మేరమీరింది. నన్ను సంతోష పెట్టడానికి ఒక బదులుమాటకానీ వస్తువుకానీ లేదు అన్నావు. ఎంతో ప్రేమతో నీవు మహాతాత్పర్యము అయిన మాట అన్నావు. నానావిధరత్నరాసులకన్ననూ, దేవరాజ్యముకన్ననూ నీవు అన్న మాట విలువఅయింది. ఆ మహానుభావుడు శత్రుసంహారము చేసి నాడు, జయించినాడు, స్వస్థముగా ఉన్నాడు. నేను చూస్తూ ఉన్నాను. అదే నాకు పరమార్థము. దేవరాజ్యముకన్నా, నానావిధ

రత్నరాసులకన్నా నాకు ఎక్కువ అయిన సంపద సమకూరినట్లుగా ఉన్నది" అన్నాడు.

హనుమంతుడు అన్న ఈ మాటలు విని ఆ జనకాత్మజ మైథిలి మరింత మంగళకరముగా "ఓ హనుమంతుడా, నీవు కాబట్టి సుశబ్దసంపన్నముగానూ శ్రవణపేయముగానూ గ్రహణ ధారణాది సమర్థము అయిన బుద్ధితో రామ విజయవార్త చెప్పకలిగినావు. ఓ వాయుపుత్రుడా, నీవు నీ తండ్రిని మించిన శ్లాఘనీయుడవు. నీవు పరమధార్మికుడవు. నీ యుద్ధోత్సాహమూ నీ శరీరదార్ఢ్యమూ నీ పరాక్రమమూ నీ క్షమాగుణమూ నీ ధైర్యమూ నీ వినయమూ నీ శాస్త్రజ్ఞానమూ ఉత్తమము అయినవి. నీలో ఇంకా ఎన్నో మంగళకరము అయిన గుణాలు మూర్తీభవించినవి. సందేహము లేదు. లేని గుణాలు ఉన్నవి అని నేను నిన్ను స్తోత్రము చేయడము లేదు" అని చెప్పింది. ఈ మాటలకు హనుమంతుడు చలించలేదు. చేతులు కట్టుకొని నిలుచొనిఉన్న హనుమంతుడు సవినయముగా సంతోషముగా "ఓ దేవీ, నీవు ఇప్పుడు అనుమతించేట్లయితే నిన్ను ఇదివరకు బెదిరించిన ఈ రాక్షసాంగనలు అందరినీ హతమార్చి వేస్తాను. నీవు దైవముగా భావించిన పెనిమిటిని ఎడబాసి అశోక వనములో దుఃఖపడుతూ ఉంటే ఈ భయంకరాకారలు ఈ భయంకరాచారలు ఈ భయంకర నేత్రలు ఈ క్రూరరాక్షసాంగనలు నిన్ను దారుణము అయిన మాటలు అన్నారు. కాబట్టి నా కోరిక నీవు మన్నించవలెను.

"ఓ మంగళస్వరూపిణీ, నీకు అప్రియము చేసిన ఈ ఘోరాకారలను అందరినీ నా పిడికిళ్ళతో పొడిచివేస్తాను. అరచేతులతో చరుస్తాను. పాదాలతో తన్నుతాను. భయంకరముగా వీళ్ళ మోకాళ్లను విరుగగొట్టుతాను. వీళ్ల పళ్లు ఊడగొట్టుతాను. చెవులూ ముక్కులూ కొరికివేస్తాను. తలవెంట్రుకలు పెరికివేస్తాను. వాడివాడి గోళ్లతో వీళ్ళను చీల్చివేస్తాను. ఎగిరి వీళ్లమీద దూకి వీళ్ళను అందరినీ పడగొట్టుతాను. వివిధవిధాలా వీళ్ళను చంపివేయవలెను అనుకొంటున్నాను. ఓ యశస్వినీ, ఈ రాక్షసాంగనలు అందరూ

నీకు అపకారము చేసినారు. నేను వీళ్ళను వివిధవిధాలా పీడించవలెను అనుకొంటున్నాను. ఇది నా కోరిక" అని చెప్పినాడు.

ఈ మాటలను ఆ జనకాత్మజ ఆ వైదేహి ఆ యశస్విని సీతాదేవి హనుమంతుణ్ణి చూచి ధర్మయుక్తముగా "ఓ వానరోత్తమా, ఈ రాక్షసాంగనలు అందరూ రాజసేవాపరతంత్రలు. రావణాసురుడి దాసీలు. రాజు ఆజ్ఞను శిరసావహించినారు. వీళ్లమీద కోపము ఎందుకు ! ఓ హనుమంతుడా, నా భాగ్యవైపరీత్యమువల్లనూ నేను అదివరకు చేసిన పాపకర్మలవల్లనూ నాకు ఈ కష్టము అంతా వచ్చింది. ఈ కష్టము అంతా నా పూర్వకర్మఫలము అని నేను నమ్ముతున్నాను. ఈ రాక్షసదాసీల దోషము ఏమీ లేదు. అందువల్ల వీళ్లను నేను మన్నిస్తున్నాను. రావణాసురుడు ఆజ్ఞాపించినందువల్ల ఈ రాక్షస స్త్రీలు నన్ను అట్లా బెదిరించినారు. ఇప్పుడు ఆ రావణాసురుడే చచ్చిపోయినాడు. ఇకను వీళ్లు నన్ను ఎందుకు బెదిరిస్తారు. ఎందుకు నన్ను బాధిస్తారు.

"ఓ హనుమంతుడా, ఒకవేళ ఈ రాక్షసస్త్రీలు స్వతంత్రించి నన్ను బాధపెట్టిఉన్నప్పటికిన్నీ ఇప్పుడు వీళ్లకు నేను అపకారము చేయను. చేయనీయను. ఇందుకు ఒక కథ చెప్తాను విను. ఒకానొక అడవిలో ఒక వేటకాణ్ణి పెద్దపులి తరుముకొని వస్తూఉంటే చెట్టు ఎక్కినాడు. ఆ చెట్టుమీద ఒక ఎలుగుబంటి ఉన్నది. పెద్దపులి ఆ ఎలుగుబంటిని చూచి "ఈ చెట్టుఎక్కిన మానవుడు మన వన్యమృగాలకు అన్నిటికీ శత్రువు. కాబట్టి వీణ్ణి క్రిందికి పడద్రోయ"మని చెప్పింది. "శత్రువు అయినప్పటికిన్నీ నా దగ్గరకు వచ్చినవాణ్ణి కాపాడడమే నా ధర్మము" అని ఆ ఎలుగుబంటి చెప్పింది. అంతట అది నిద్రపోయింది. అప్పుడు ఆ చెట్టుక్రింద ఉన్న పెద్దపులి వేటకాణ్ణి చూసి "నిన్ను వదిలిపెట్టిపోతాను. ఎలుగుబంటిని పడద్రోయ" మని చెప్పింది. ఆ వేటకాడు అందుకు ఒప్పుకొని ఆ ఎలుగుబంటిని పడద్రోసినాడు. ఆ ఎలుగుబంటికి చటుక్కున నిద్ర మెలకువ వచ్చి అలవాటుచొప్పున మరిఒకకొమ్మ పట్టుకొని క్రింద పడకుండా తప్పించుకొన్నది. అప్పుడు ఆ పెద్దపులి ఎలుగుబంటిని చూచి "ఓ భల్లూకమా, చూడు. ఈ మానవుడు ఉపకారికి

అపకారము చేసినాడు. ఈ దుష్టుణ్ణి ఇప్పుడు అయినా నీవు క్రిందపడద్రోయవలెను" అని చెప్పింది. "వీడు నాకు ఎంత అపకారముచేసినా వీడికి నేనుతిరిగి అపకారముచేయను" అని ఆ ఎలుగుబంటి పెద్దపులితో ఖచ్చితముగా చెప్పింది.

ఆ భల్లూకము ఆ పెద్దపులితో ఇంకా ఈ విధముగా ఒక పద్యము చెప్పింది :

"ప్రాజ్ఞుడు అయినవాడు తనకు అపకారము చేసినవారికి ప్రత్యపకారము చేయడు. అపకారము చేసినవారికి ఉపకారము చేయడమే సత్పురుషుల సదాచారము. సదాచారమే సత్పురుషులకు ఆభరణము." ఓ హనుమంతుడా, ఎదుటివారు పాపకర్ములు అయినా వధార్హులు అయినా సత్పురుషులు కారుణ్యము చూపిస్తారు. ఏమంటే, ఈ లోకములో అపరాధము చేయనివాడు ఎవడూ లేడు అని వారి అభిప్రాయము. లోకాన్ని హింసించడము రాక్షసులకు ఒక వినోదము. వాళ్లు పాపకర్మలు చేస్తూ ఉంటారు. కామరూపులు. అది వాళ్ళ స్వభావము. వాళ్లకు కీడు చేయడము తగిన పని కాదు" అని సీతాదేవి చెప్పింది.

ఈ మాటలకు ఆ వాక్యకోవిదుడు హనుమంతుడు "ఓ దేవీ, నీవు ఆ రాముడికి తగిన ధర్మపత్నివి. ఓ యశస్వినీ, ఇక నాకు బదులు చెప్పి పంపించు. నేను రాముడిదగ్గరకు పోవలెను" అని చెప్పినాడు.

"ఓ హనుమంతుడా, నేను నా పెనిమిటిని చూడవలెను అనుకొంటున్నాను. ఇదే నా కోరిక" అని ఆ వైదేహి హనుమంతుడితో చెప్పింది. అంతట ఆ మహాద్యుతిమంతుడు ఆ మారుతాత్మజుడు హనుమంతుడు ఆ మైథిలితో "ఓ పూజ్యురాలా, స్థిరచిత్తులను మిత్రులనుగా చేసికొన్నాడు. శత్రువులను అందరినీ సంహారము చేసివేసినాడు. ఇప్పుడు తన తమ్ముడు లక్ష్మణుడితోకూడా స్వస్థముగా ఉన్న ఆ పూర్ణచంద్రాననుణ్ణి రాముణ్ణి శచీదేవి దేవేంద్రుణ్ణి వలె నీవు చూడగలవు." అని సాక్షాన్మహాలక్ష్మీదేవివలె విరాజిల్లుతూ ఉన్న ఆ సీతాదేవితో చెప్పినాడు.

అంతట హనుమంతుడు అమిత వేగముతో రాముడిదగ్గరకు పోయినాడు.

౧౧౪

కార్యసాధనోపాయాలు అన్నీ తెలిసిన ఆ హనుమంతుడు అప్పుడు ఆ మహాధానుష్కుణ్ణి ఆ మహాప్రాజ్ఞుణ్ణి రాముణ్ణి చూచి "ఓ ప్రభూ, నీవు ఎవరికోసము ఇంత ప్రయత్నము చేసినావో ఎవరికోసము సేతుబంధనాది రావణసంహారపర్యంతమూ పాటు పడినావో ఆ శోకసంతప్తను సీతాదేవిని నీవు ఇప్పుడు చూడవలసి ఉంది. దుఃఖపరవశ అయిపోయి కన్నీళ్లతో కన్నులు కలకపారి పోయిన ఆ మైథిలి నీ విజయాన్ని గురించి నేను చెప్పగానే సంతోష ముతో ఉప్పొంగిపోయింది. అదివరకు ఆమె నన్ను ఎరిగిఉన్న కారణమునుంచీ నామీద ఆమెకు ఉన్న నమ్మకమునుంచీ నాతో "ఓ హనుమంతుడా, కృతార్థుడు అయిన నా పెనిమిటిని ఆ రామప్రభువును నేను దర్శనము చేయవలెను అనుకొంటున్నాను. ఎప్పుడూ ఆయనవెంట ఉండే నా మరదిని లక్ష్మణుణ్ణి చూడవలెను అనుకొంటున్నాను. ఇదే నా కోరిక" అని చెప్పింది అన్నాడు.

హనుమంతుడు చెప్పిన ఈ మాటలు వినీవినడముతో ఆ పరమ ధార్మికుడు రాముడు ఆలోచించినాడు. (అంతకాలము రావణా సురుడి ఇంట్లో ఉన్న సీతాదేవిని స్వీకరించేట్లయితే మహాలోకాప వాదము వస్తుంది అనీ ఆమె నిర్దోషిఅయినందువల్ల పరిత్యజించే ట్లయితే మహాదోషమువస్తుంది అనీ తోచింది.) కొంచముగా కన్నీళ్లు కమ్ముకొన్నవి. పెద్ద పెద్ద వేడి వేడి నిట్టూర్పులు విడిచినాడు. నేలవంక చూస్తూ తన సమీపములో ఉన్న నీలమేఘమువంటి విభీషణుడితో "ఓ మిత్రుడా, సీతను అభ్యంగనస్నానము చేయించి దివ్యాంగరాగాలు పూయించి దివ్యాభరణాలు పెట్టించి నీవు ఇక్కడికి తీసుకొనిరావలెను. ఆలస్యము చేయవద్దు" అని రాముడు చెప్పి నాడు.

రామాజ్ఞను శిరసావహించి విభీషణుడు త్వరత్వరగా లంకా పట్టణములో తన అంతఃపురానికి పోయి తన స్త్రీలచేత సీతాదేవికి ఈవిధముగా చెప్పించినాడు;

"ఓ దేవీ, నీకు శుభము అవుతుంది. నీ పెనిమిటి రాముడు నిన్ను చూడవలెను అనుకొంటున్నాడు. నీవు చక్కగా అభ్యంగన స్నానముచేసి దివ్యాంగరాగము అద్దుకొని దివ్యాభరణాలు పెట్టుకొని వాహనము ఎక్కి పోవలెను."

ఈవిధముగా చెప్పిన స్త్రీలచేతనే ఆవైదేహి "నేను స్నానము చేయకుండానే ఈవిధముగానే నా భర్తను చూడవలెను అనుకొంటున్నాను" అని విభీషణుడికి చెప్పించింది.

"ఓ దేవీ, రాముడు నీ పెనిమిటి. అంతేకాదు; ఆయన రాజు. అతడు ఎట్లా చెప్పితే నీవు అట్లా చేయవలెను" అని విభీషణుడు చెప్పినాడు.

ఆమె తనభర్తనే దేవతగా భావించింది. ఆమె భర్తృభక్తివ్రత. ఆ సాధ్వి అంతట "అట్లాగేను. బాగుంది" అని చెప్పింది. అప్పుడు రాక్షసయువతులు ఆమెను అభ్యంగనస్నానము చేయించినారు. ఆమెను అలంకరించినారు. మహార్హమైన ఆభరణాలు పెట్టుకొని మహార్హమైన వస్త్రము కట్టుకొని మహాశ్రేష్ఠము అయిన వస్త్రము కప్పుకొని దివ్యతేజముతో సీతాదేవి శిబికను ఎక్కింది. విభీషణుడు ముందు నడిచాడు. అతనివెనుక రాక్షసరాజభటుల రక్షణతో సీతఎక్కిన శిబికను మోసుకొనిపోయినారు.

విభీషణుడు అట్లా వస్తూఉన్నాడు అని రాముడికి తెలిసింది. అతడు ఆలోచించసాగినాడు. అప్పుడు విభీషణుడు వచ్చి, నమస్కారముచేసి సీతాదేవిని తీసుకువచ్చినట్టు సంతోషముగా రాముడితో విన్నవించినాడు. చాలాకాలము రాక్షసగృహములో ఉన్న సీతాదేవి "వచ్చింది" అని చెప్పగానే రాముడు సంతోషించినాడు, ఉత్తరక్షణాన దీనుడు అయిపోయినాడు. రోషమువచ్చింది. అతని మనస్సులో సంతోషమూ, దైన్యమూ, కోపమూ, ముట్లు తిరిగినవి. సవిమర్శముగా ఆలోచించినాడు. ముఖాన సంతోష చిహ్నాలు లేకుండా తనపక్కన ఉన్న విభీషణుణ్ణిచూచి "రాక్షస రాజా, నీవు మంచివాడవు. సీతాదేవిని వెంటనే నాదగ్గరకు రానివ్వు. ఆమె ఎప్పుడూ నేను జయించవలెను అనుకుంటూ ఉంటుంది" అని చెప్పినాడు.

ఇట్లా రాముడు చెప్పింది విభీషణుడు విన్నాడు. వెంటనే అక్కడినుంచి అందరినీ వెళ్లగొట్టే ఏర్పాటు చేసినాడు. కంచుకాలూ శిరోవేష్టాలూ ధరించిన రాక్షసరాజభటులు బెత్తాలు ఝడిపిస్తూ అక్కడఉన్న వారిని అందరినీ అవతలకు వెళ్ళగొట్టుతూ అన్ని వైపులా తిరుగసాగినారు. అట్లా తరిమివేస్తూ ఉంటే అప్పుడు అక్కడ ఉన్న భల్లూకవీరులూ వానరయోధులూ రాక్షస యోధులూ గుంపులు గుంపులుగా పరుగులెత్తిన మహాధ్వని సముద్ర ఘోషమువలె వినిపించింది. ఆ మహాసంభ్రమాన్ని రాముడు చూచినాడు. అతనికి జాలి వేసింది. అట్లా అందరినీ తరిమి వేయడము సహించలేకపోయినాడు. కోపము వచ్చింది. మహా ప్రాజ్ఞుడు అయిన విభీషణుణ్ణి పిలిపించినాడు. అతనిని చూపులతో దహించి వేసేటట్టు చూస్తూ నిందాగర్భముగా "ఓ విభీషణుడా, నీవు నన్ను అనాదరముతో చూస్తున్నావు. ఎందుకు వీళ్ళను అందరినీ బాధపెట్టుతావు! వీళ్లు అందరూ నా స్వజనము. నీ ఈ ఏర్పాట్లు అన్నీ కట్టిపెట్టు. స్త్రీలకు ఇండ్లు కానీ వస్త్రాలుకానీ గోడలు కానీ తెరలుకానీ ఆవరణలు కావు. ఈ రాజగౌరవాలు ఎంతమాత్రమూ ఆవరణలు కావు. స్త్రీల సచ్చరిత్రమే ఆవరణము. వారివారుపోయిన దుఃఖసమయాల్లోనూ రాజ్యక్షోభమూ మొదలైన సంకటసమయాలలోనూ యుద్ధభూములలోనూ యజ్ఞాదులలోనూ స్వయంవరసమయాలలోనూ వివాహసమయాలలోనూ స్త్రీలు పర పురుషులకు అగపడడము దోషముకాదు. సీతాదేవి ఇప్పుడు యుద్ధభూమికి వచ్చింది. మహాకష్టస్థితిలో ఉన్నది. పైగా నా సమీపానికి వస్తున్నది. ఆమెను ఇతరులు చూచినందువల్ల దోషము ఏమీ లేదు. ఓ విభీషణుడా, నీవు ఆమెను వెంటనే నాదగ్గరకు తీసుకొనిరా. నా చుట్టూ మిత్రులు అందరూ ఉండగానే ఆమె నన్ను చూస్తుంది. అని చెప్పినాడు.

ఈ విధముగా రాముడు అన్న మాటలకు విభీషణుడు విచారం పడ్డాడు. వినయములో వెళ్లిపోయినాడు. రాముడు అన్న మాటలకు విభీషణుడే కాకుండా లక్ష్మణుడూ సుగ్రీవుడూ హనుమంతుడూ మనస్సులో చాలా బాధపడ్డారు. భార్యమీద అపేక్షలేని దారుణ

మైన ఇంగితాలను రాముడిలో వారు చూచినారు. అతనికి సీతాదేవి మీద ప్రేమ తప్పినట్లు ఊహించినారు.

అప్పుడు విభీషణుడి వెనుక సీతాదేవి సిగ్గుతో తన దేహావయవాలను అన్నిటినీ ముడుచుకొంటూ వచ్చి రాముడి ఎట్టఎదుట నిలుచొన్నది. ఆమె ఆ జనసమూహములో సిగ్గుపడుతూ ముఖము కనపడకుండా వస్త్రము కప్పుకొని రాముణ్ణి సమీపిస్తూ "ఓ పూజ్యుడా" అని సంబోధించి ఏడ్చింది.

పతినే దేవతగా ఆరాధించే ఆమహాప్రసన్నముఖి సీతాదేవి అప్పుడు విస్మయపడుతూనూ సంతోషపడుతూనూ అనురాగము ఉట్టిపడుతూనూ ఆ ప్రసన్నముఖుణ్ణి తన భర్తను రాముణ్ణి చూచింది.

ఆ నిర్మలచంద్రబింబానన సీతాదేవి బహుకాలమునుంచీ కనపడకుండా అప్పుడే ఉదయిస్తూ ఉన్న పూర్ణచంద్రబింబమువంటి మనోహరము అయిన తన పెనిమిటి ముఖబింబాన్ని చూచి మనస్సులో ఉన్న దుఃఖాన్ని అంతా వదిలిపెట్టింది.

౧౧౮

రాముడు తనమనస్సులో ఉన్నకోపాన్ని అంతా తెలియచెప్పటానికి ఎట్టఎదుట వినయవిధేయతలతో నిలుచొనిఉన్న మైథిలినిచూచి "ఓమంగళస్వరూపిణీ, నేను యుద్ధములో శత్రువును జయించి నిన్ను సంపాదించుకొన్నాను. పౌరుషములో చేయవలసింది అంతా చేయడము అయిపోయింది. నా కోపము సార్థకము అయింది. శత్రుతిరస్కారాన్ని తుడిచివేసినాను. నాకు జరిగిన అవమానాన్నీ నా శత్రువునూ ఏకకాలాన నిర్మూలనము చేసివేసినాను. ఇప్పుడు నా పౌరుషము బైటపడ్డది. నేను పడ్డ కష్టము అంతా సఫలము అయింది. నా ప్రతిజ్ఞ నెరవేరింది. నేను ఇప్పుడు స్వతంత్రుణ్ణి.

"ఓ మైథిలీ, నేను లేనప్పుడు నిన్ను చలచిత్తపు రాక్షసుడు ఎత్తుకొని వచ్చినాడు. దైవికముగా నాకు అవమానము అయింది. ఆ అవమానాన్ని నేను పురుషప్రయత్నముతో పోగొట్టుకొన్నాను. అవమానాన్ని తనపరాక్రమముతో పోగొట్టుకొని పరాక్రమహీనుడికి

పౌరుషార్థమూ చేకూరదు. హనుమంతుడు సముద్రలంఘనము చేసి లంకాపట్టణాన్ని గగ్గోలుపరిచినాడు అతడు చేసిన ఆ శ్లాఘనీయము అయిన పని ఇప్పుడు సఫలము అయింది. సుగ్రీవుడు యుద్ధములో తన పరాక్రమము చూపిస్తూ నాకు మేలు అయ్యే పద్ధతులు అన్నీ ఆలోచిస్తూ తన సైన్యాలతో పడ్డ పాటుఅంతా ఇప్పుడు సఫలము అయింది. గుణహీనుడు అయిన తన అన్నను వదిలిపెట్టి విభీషణుడు స్వయముగా నాదగ్గరకు వచ్చి నాకు భక్తుడు అయి పడ్డ ప్రయాసము అంతా ఇప్పుడు సఫలము అయింది” అని చెప్పుతూవుంటే లేడిపిల్లవంటి సీతాదేవి ఉత్ఫుల్లనేత్రాలనిండా కన్నీళ్లు కమ్ముకొన్నవి.

కన్నీళ్లు కారుస్తూఉన్న సీతాదేవిని రాముడు చూచినాడు. మంటలు మండుతూ ఉన్న అగ్నిహోత్రములో మరి కాస్త నెయ్యి పోసినట్టు అతని కోపము మరింత అయింది. కనుబొమలు ముడి వేసి పక్కకు చూస్తూ ఆ వానర రాక్షసులు అందరి మధ్యనూ సీతాదేవితో కఠినముగా “ఓ సీతా, అవమానము పోగొట్టు కోవడానికి మనుష్యుడు చేయవలసింది అంతా చేయడము అయి పోయింది. ఆత్మజ్ఞానసంపన్నుడు అయిన అగస్త్యముని తన తపో బలముతో ప్రాణికోటికి అడుగుపెట్టడానికి అలవికాకుండా ఉన్న దక్షిణదిక్కును జయించినాడు. అదే విధముగా నిన్ను ఎత్తుకొని వచ్చిన రావణాసురుణ్ణి నా పరాక్రమముతో సంహారము చేసివేసి నేను నిన్ను జయించుకొన్నాను.

“ఓ మంగళ స్వరూపిణీ, ఈ యుద్ధములో నేను పడ్డ పాటూ, నామిత్రుల పరాక్రమముతో నేను జయించడమూ, నీకోసము కాదు అని నీకు ఇదివరకు తెలియకపోతే నేను ఇప్పుడు చెప్పుతున్నాను కాబట్టి తెలుసుకో. సదాచారము కాపాడటానికిన్ని సర్వవిధాలా ప్రసిద్ధికెక్కిన నా వంశానికి అపవాదమూ అపకీర్తి రాకుండా ఉండటానికిన్ని నేను యుద్ధముచేసినాను. నీ నడవడి సందేహాస్పదము అయింది. నీవు నాఎదుట నిలుచొనిఉంటే నేత్రరోగికి దీపమువలె నీవు నాకు ప్రతికూలవుగా కనపడుతున్నావు. ఓ భాగ్యవతీ నీవు జనకమహారాజు కూతురివి. ఇప్పుడు దశదిశలలో నీ చిత్రము

వచ్చిన చోటికి పో. నేను అనుమతిస్తున్నాను. నీతో నాకు పనిలేదు. సత్కులములో పుట్టినవాడూ అందులో పరాక్రమవంతుడు అయినవాడూ ఎవడుఅయినా పరగృహములో నివసించిన భార్యను సుహృల్లేఖము అయిన మనస్సుతో స్వీకరిస్తాడా! ఓ సీతా, నీవు రావణాసురుడి ఒడిలోనుంచి జారినావు. నీమీద దుష్టము అయిన చూపులు పడ్డవి. నేను సద్వంశములో పుట్టినాను. ఆ వంశానికి నేను కీర్తి తేవలసిఉంది. నిన్ను ఎట్లా పరిగ్రహిస్తాను? అవమానము పోగొట్టుకోడానికి యుద్ధము చేసి నిన్ను సాధించుకొన్నాను. మళ్ళీ కీర్తి సంపాదించుకొన్నాను. నీమీద నాకు ఆసక్తిలేదు. నీ ఇష్టము వచ్చిన చోటికి నీవు పో.

"ఓ భాగ్యవతీ, నేను ఇది చక్కగా ఆలోచించి చెప్పుతూ ఉన్నాను. నీ ఆత్మపోషణార్థము లక్ష్మణుడిదగ్గరకానీ, భరతుడిదగ్గరకానీ ఎక్కడ ఉంటే సుఖముగా ఉంటుంది అని నీవు అనుకుంటావో అక్కడ ఉండు. లేదా వానరరాజు అయిన సుగ్రీవుడిదగ్గర ఉండు. అట్లా కాకపోయేటట్లయితే రాక్షసరాజు అయిన విభీషణుడిదగ్గర ఉండు. ఓ సీతా, నీ రూపము దివ్యము అయినది. నీవు మనోహరము అయిన దానవు. రావణాసురుడి స్వగృహములో ఉన్నావు. అతడు నిన్ను చూస్తూ బహుకాలము సహించి ఉండడు" అని రాముడు చెప్పినాడు.

చెవులారా ప్రియవచనాలు వినవలసిన ఆ మైథిలి చిరకాలానికి కనిపించిన ప్రియుడు అప్రియాలాడుతూఉంటే విని మదపుటేనుగు తొండము దెబ్బతిన్న అందుగు తీగవలె గజగజ వణుకుతూ కన్నీళ్లు కార్చింది.

౧౧౮

రాముడు అట్లా కోపముతో పరుషముగా మాట్లాడుతూ ఉంటే వైదేహి ఉలిక్కిపడ్డది. ఆమెకు పరమదుఃఖము వచ్చింది. ఆ మహాజన మధ్యములో తనభర్త తనను అదివరకు ఎన్నడూ అని ఎరుగని మాటలు అంటూవుంటే, విని ఆ మైథిలి సిగ్గుపడిపోయింది. తలవంచుకొన్నది. రాముడి వాక్శల్యాలు విని ఒంటి

నిండా శల్యాలు గుచ్చుకొన్నదానివలె బాధపడుతూ సంతత ధారగా కన్నీళ్లు కార్చింది. ఆ కన్నీళ్లతో ఆమె ముఖముఅంతా తడిసిపోయింది. ఆ కన్నీళ్లు తుడుచుకొంటూ, మెల్లగా గద్గద స్వరముతో "ఓ వీరుడా, పామరుడు పామరస్త్రీని అన్నట్లు మీరు నన్ను ఇటువంటి అనరాని శ్రవణదారుణము అయిన మాటలు ఎందుకు అంటున్నారు. ఓ మహాబాహూ, నేను మీరు అనుకొంటూ ఉన్నటువంటిదానను కాను. నేను నా సచ్చరిత్రముమీద ఒట్టు పెట్టుకొంటున్నాను. నామాట నమ్మండి. అట్లాకాకపోయేటట్లయితే మీరు ఏప్రమాణము చేయమంటే అది చేస్తాను. ఎవరు ఎవరో స్త్రీల దుర్వృత్తినిబట్టి నన్ను సందేహించవద్దు. మీరు నన్ను పరీక్షించండి. మీ సందేహము వదిలిపోతుంది.

"ప్రభూ, నేను వివశను అయి ఉన్నప్పుడు రావణుడు నా దేహాన్ని స్పృశించినాడు. అప్పుడు అయినా నేను అందుకు అంగీకరించలేదు. ఆ అపరాధము దైవానిది. నాది కాదు. నా అధీనములో ఉన్న నా మనస్సుమాత్రము మీమీదనే నిలచిఉన్నది. పరాధీనము అయిపోయిన నేను నా దేహవిషయములో నేను అప్పుడు అస్వతంత్రురాలను. నేను ఏమి చేసేది! ఓ మానవుడా, నేను మీతో కూడా పెరిగి పెద్దదానను అయినాను. మిమ్ములను ఎడబాయకుండ మీతో ఎప్పుడూ కలిసిమెలిసి తిరిగినాను. నన్నుగురించి మీరు తెలియక పోయినట్లయితే ఇక దేనివల్లను నన్నుగురించి మీరు తెలియదు. నేను శాశ్వతముగా హతము అయిపోయినాను.

"ఓ ప్రభూ, అప్పుడు నన్ను చూచిరావటానికి ఆ వీరుణ్ణి హనుమంతుణ్ణి మీరు పంపించినారే, అప్పుడే నేను లంకలో ఉన్నప్పుడే మీరు నన్ను ఎందుకు వదిలిపెట్టలేదు! మీరు వదిలిపెట్టినట్లు చెప్పి ఉన్నట్లయితే ఆ హనుమంతుడిఎదుటనే నా ప్రాణాలు వదిలిపెట్టి ఉండేదానిని. అట్లా జరిగిఉన్నట్లయితే ప్రాణ సంశయము అయిన్ను యీ వృథాశ్రమ మీకు లేకుండా పోయేది. నిష్ప్రయోజనముగా మీ మిత్రులు అందరూ కష్టపడవలసిన పనే లేకుండాపోయేది.

"ఓ నరశార్దూలమా, కోపములో ఉన్న మీరు ఒక అల్పుడివలె స్త్రీత్వాన్ని పురస్కరించుకొని నన్ను మాటలు అన్నారు.

మీరు అందరి నడకా తెలిసినవారు. నేను జనకమహారాజు కూతురినే, కాని వాస్తవానికి భూమిలోనుంచి పుట్టినదానను. అది మీరు ఆలోచించలేదు. నా సద్వర్తనాన్ని మీరు గమనించలేదు. మీరు చిన్నవారుగా ఉన్నప్పుడు నా పాణిగ్రహణము చేసినారు అప్పుడు మీరు చేసిన ప్రమాణము మీకు ఇప్పుడు కాకుండా ఉన్నది. మీ మీద నాకు ఉన్న భక్తినీ, నా శీలాన్నీ, నా సర్వాన్నీ మీరు ఇప్పుడు వెనుకకు తోసివేస్తూ ఉన్నారు" అని చెప్పి సీతాదేవి ఏడ్చింది.

ఆమె కన్నీళ్ళు కారుస్తూ, అక్కడ దీనుడు అయి ఆలోచిస్తూ నిలుచొనిఉన్న లక్ష్మణుణ్ణి చూచి గద్గదస్వరముతో "ఓ సౌమిత్రీ, నా ఈ దుఃఖానికి ఔషధము ఒక చితి. నేను మిథ్యాపవాదముతో హతము అయిపోయినాను. నీవు నాకు చితిని పేర్చిపెట్టు. ఇంకా జీవించిఉండటానికి నాకు ఇష్టములేదు. నా పాతివ్రత్యాది గుణాలకు సంతోషించకుండానూ నన్ను మెచ్చుకోకుండానూ నన్ను ఈ మహాజనమధ్యములో నా పెనిమిటి వదిలిపెట్టినారు. అగ్నిప్రవేశము చేయుటముకన్నా నాకు ఇప్పుడు వేరే గతి లేదు" అని చెప్పింది.

సీతాదేవి చెప్పిన ఈ మాటలు విని ఆ పరవీరహంత లక్ష్మణుడు పరమదీనుడు అయిపోయి రాముడి ముఖమువంక చూచినాడు. అతని అభిమతాన్ని తెలుసుకొన్నాడు. అంతట రాముడి సమ్మతితో చితిని పేర్చినాడు.

అప్పుడు ఆ వైదేహి తలవంచుకొని మెల్ల మెల్లగా రాముడికి ప్రదక్షిణము చేసింది. భగ భగ మంటలు మండుతూ ఉన్న ఆ చితిదగ్గరకు పోయింది. అప్పుడు ఆ మైథిలి దేవబ్రాహ్మణులను ఉద్దేశించి నమస్కారము చేసింది. చేతులు జోడించి అగ్నిహోత్రాన్ని సమీపించి "ఓ అగ్నిహోత్రుడా, నీవు లోకసాక్షివి. నా మనస్సు ఎప్పుడూ నా పెనిమిటిమీదనే నిలిచి ఉన్నది. అన్యత్రా చలించలేదు. ఇది వాస్తవము అయినట్లయితే నన్ను నీవు అన్నివిధాలా రక్షించు. ఓ లోకసాక్షీ, నా ప్రవర్తనము పరిశుద్ధము అయినది అయినట్లయితే రామప్రభువు నన్నుగురించి

అనుకొంటూఉన్న దోషము నాలో లేకపోయినట్లయితే నన్ను అన్నివిధాల రక్షించు. మనసా వాచా కర్మణా నేను ఆ సర్వ ధర్మజ్ఞుణ్ణి రామప్రభువును అతిక్రమించకుండా ఉన్నట్లయితే ఓ అగ్నిహోత్రుడా, నన్ను అన్నివిధాల రక్షించు. భగవంతుడు అయిన సూర్యుడూ చంద్రుడూ వాయువూ దశదిశలూ అహో రాత్రములూ ప్రాతఃస్సాయంసంధ్యలూ ఈ పృథివీ, నేను పతివ్రతను అని నమ్మినట్లయితే ఓ అగ్నిహోత్రుడా, నన్ను అన్నివిధాలా రక్షించు" అని చెప్పుతూ ఆ అగ్నిహోత్రానికి ప్రదక్షిణము చేసింది.

అంతట ఆ వైదేహి తన దేహముమీద ఏమాత్రమూ ఆసక్తిలేని అంతరాత్మతో భగ భగ మంటలు మండుతూఉన్న అగ్నిహోత్రములో ప్రవేశించింది.

తప్తకాంచనభూషణాలు ధరించిన ఆ తప్తనవహేమాభ, సీతాదేవి సమస్తలోకాలవారూ చూస్తూఉండగా భగ భగ మంటలు మండుతూఉన్న అగ్నిహోత్రములో పడిపోయింది. పవిత్రము అయిన ఆజ్యాహుతివలె అగ్నిహోత్రములో పడుతూ ఉన్న ఆ మహాభాగను సీతాదేవిని ముల్లోకాలవారూ చూచి నారు. యజ్ఞములో మంత్రపూర్వకముగా వేల్చే నిరంతరాజ్యధార వలె మంటలు మండుతూఉన్న అగ్నిహోత్రములో ఆ పూజ్యురాలు సీతాదేవి పడటము చూచి దేవాంగనలు అందరూ పెడబొబ్బలు పెట్టినారు. ఎలుగెత్తి ఏడ్చినారు. శాపగ్రస్త అయి స్వర్గలోకములో నుంచి భూమిమీద పడుతూఉన్న దేవాంగనవలె అగ్నిహోత్రములో పడుతూ ఉన్న ఆ సీతాదేవిని ముల్లోకాలలో ఉన్న దేవ దానవ గంధర్వులు అందరూ చూచినారు.

సీతాదేవి అగ్నిప్రవేశము చూచి అక్కడి జనసమూహము భయపడి పోయింది. వ్యాకులపడిపోయింది. బాలురూ వృద్ధులూ కూడలిపోయినారు. రాక్షసులూ వానరులూ ఆశ్చర్యపడిపోయి పెద్దపెట్టున హాహాకారాలు చేసినారు.

౧౨౦

అందరి హాహాకారాలూ అందరూ చెప్పుకొంటున్న మాటలూ ఆ ధర్మాత్ముడు రాముడు విన్నాడు. మనస్సులో బాధపడ్డాడు.

కన్నీళ్ళతో అతని కన్నులు కలకబారినవి. ఒక కొంచెముసేపు ఆలోచించినాడు.

అప్పుడు అక్కడికి రాజరాజు అయిన కుబేరుడూ, సర్వ సంహారకుడు అయిన యమధర్మరాజూ, సహస్రాక్షుడు అయిన దేవేంద్రుడూ, పరంతపుడు అయిన వరుణుడూ, వృషభధ్వజుడూ త్రిలోచనుడూ శ్రీమంతుడూ అయిన మహాదేవుడూ, సర్వలోక కర్త అయిన బ్రహ్మదేవుడూ సూర్యసమానము అయిన విమానాలలో వచ్చినారు. ఆ దేవోత్తములకు రాముడు చేతులు జోడించి నమస్కారము చేసినాడు. వారు అందరూ కంకణాద్యాభరణాలు పెట్టుకొన్న తమ తమ దీర్ఘబాహువులు ఎత్తి "ఓ రామా, నీవు సర్వలోక కర్తవు. సర్వోత్తముడవు. జ్ఞానవంతులలో శ్రేష్ఠుడవు. ఇటువంటి నీవు సీతాదేవి అగ్నిహోత్రములో పడుతూఉంటే ఎట్లా ఉపేక్షించినావు. నీవు దేవగణాలకు అన్నిటికీ ఉత్తమోత్తముడవు. నీకు ఈ సంగతి ఎట్లా తెలియకుండా పోయింది. అష్టవసువులలో నీవు పూర్వము ఋతధాముడు అనే ప్రజాపతివి. నీవు ముల్లోకాలకూ ఆదికర్తవు. సర్వ నియామకుడవు. రుద్రుని అష్టమూర్తులలో నీవు ఎనిమిదవవాడవు. పన్నెండుమంది సాధ్యులలో నీవు అయిదవవాడవు. ఓ పరంతపా, నీ చెవులు అశ్వినీదేవతలు, నీ కన్నులు సూర్యచంద్రులు. సర్వ లోకాలూ సృష్టించడానికి పూర్వము ఉన్నవాడవు నీవు ఒక్కడవే. ప్రళయకాలములో నీవు కనపడతావు. నీవు సర్వశక్తిమంతుడవు. సర్వజ్ఞుడవు. సర్వేశ్వరుడవు. ఏమీ ఎరుగని పామరుడివలె నీవు వైదేహిని ఎందుకు ఉపేక్షించినావు" అని అడిగినారు.

ఇట్లా అడిగిన లోకపాలకులను చూచి ఆ పరమధార్మికుడు, ఆ రఘుకులదీపకుడు, ఆ లోకనాథుడు, రాముడు "ఓ దేవతలారా, నేను దశరథ మహారాజు కొమారుడ్ని, రాముణ్ణి అనుకొంటున్నాను. మీరు ఏమేమో చెప్పుతున్నారు. నేను ఎవడనో ఏమి ప్రయోజనము కోసము పుట్టినానో అది అంతా ఈ మహాత్ముడు బ్రహ్మదేవుడు నాకు చెప్పవలెను. చెప్పితే సంతోషిస్తాను." అని అడిగినాడు.

బ్రహ్మదేవుడు "ఓ రామా, నీవు సాక్షాత్తూ శ్రీమన్నారాయణమూర్తివి. అంటూ (20శ్లోకాలలో) రాముణ్ణి స్తోత్రము చేసినాడు.

౧౨౧

బ్రహ్మదేవుడు చేసిన రామస్తోత్రము అంతా విని అగ్నిహోత్రుడు మనుష్యాకారముతో ఆ చితిని అంతా విదిలించివేస్తూ సీతాదేవిని ఎత్తుకొని పైకి లేచినాడు. తప్తకాంచనాభరణాలతోనూ వాడిపోని పూలదండలతోనూ ఉంగరాలు తిరిగిన నల్లటి తల వెంట్రుకలతోనూ రక్తాంబరముతోనూ అగ్ని ప్రవేశానికి పూర్వము ఏరూపములో ఉన్నదో ఆ రూపములోనే ఆ యౌవన మధ్యస్థను, బాలసూర్యప్రభలతో వెలుగొందుతూ ఉన్న ఆ ప్రసన్న హృదయను సీతాదేవిని ఆ లోకసాక్షి అగ్నిహోత్రుడు రాముడికి ఒప్పగించి, ఓ రామా, ఇదిగో, నీ భార్య వైదేహి. ఈమె ఏ పాపమూ ఎరుగదు. ఈమె సువృత్త. వాచా, మనసా, కర్మణా నిన్ను ఎన్నడూ మీరలేదు. ఓ సచ్చరిత్రుడా, ఈమె నిన్ను మీరి మరిఒకరిని కంటితో చూడడముకానీ మనసా ఆలోచించడము కానీ ఎన్నడూ చేసిఎరుగదు. నీవులేనప్పుడు నిర్జనారణ్యములో ఈమె దీన అయిపోయినప్పుడు, వివశ అయిపోయినప్పుడు రావణాసురుడు తన పరాక్రమముతో బలవంతముగా ఎత్తుకొని పోయినాడు. ఈమెను తన అంతఃపురములో నిర్బంధించినాడు. పరమభయంకరముగా కనుపించే వికారముఖాల రాక్షసాంగనలను అనేకమందిని ఈమెకు కావలి ఉంచినాడు. ఎంత నిర్బంధించినా ఈమె తన మనస్సును అంతా నీమీదనే ఉంచింది. నిన్నే పరమగతిగా విశ్వసించింది. ఈమెను వివిధవిధాల ప్రలోభ పెట్టినాడు. ఇంకా ఎన్నోవిధాల బెదిరించినాడు. ఎన్ని ఆశలు పెట్టినా, ఎంత బెదిరించినా ఈమె నిన్నే ధ్యానిస్తూ తన మనస్సు అంతా నీమీదనే లగ్నము చేసింది. ఆ రావణాసురుణ్ణిగురించి ఆలోచించనయినా లేదు. ఈమె పరిశుద్ధహృదయ. పాప రహిత. ఈమెను తిరిగి స్వీకరించు. నేను నిన్ను ఆజ్ఞాపిస్తున్నాను. నామాటకు నీవు బదులు చెప్ప వద్దు" అన్నాడు.

ఈ మాటలకు ఆ ధర్మాత్ముడు రాముడు సంతోషపడ్డాడు. అతని కన్నులవెంట ఆనందబాష్పాలు దొర్లినవి. క్షణకాలము ఆలోచించినాడు. అంతట ఆ మహాపరాక్రమవంతుడు, ఆ మహా ద్యుతిమంతుడు రాముడు బ్రహ్మదేవుణ్ణి చూచి "ఓ దేవా, ఈ సీత ఏపాపమూ ఎరుగదు అని ముల్లోకాలవారికీ తెలియవలెను. ఏమంటే ఈ మంగళకరి బహుకాలము రావణాసురుని ఇంట్లో ఉన్నది. నేను ఈ జానకిని పరీక్షించకపోయేటట్లయితే ఈ దశరథ రాముడు మూఢుడూ కాముకుడూ అని నన్ను అందరూ అంటారు. ఈమె జనకాత్మజ మైథిలి. అందువల్ల ఈమె సద్వృత్తము నేను ఎరుగుదును. ఈమె మనస్సు అంతా నామీదనే ఉంచింది అనీ, ఈమె నా భక్తురాలు అనీ, నాచిత్తాన్ని అనుసరించి ఉంటుంది అనీ నాకు తెలుసు. నేను సత్యము నమ్మినాను ముల్లోకాలవారి నమ్మకంకోసము ఈమె అగ్నిహోత్రములో పడుతూఉంటే నేను ఉపేక్షించినాను. ఈమె తన పాతివ్రత్యప్రభావముతో తనను కాపాడుకోకలదు. చెలియలికట్టను మహాసముద్రము అతిక్రమించలేను. అదేవిధంగా ఈ విశాలాక్షిని ఆ రావణాసురుడు అవమానించలేడు. మంటలు మండుతూ ఉన్న అగ్నిశిఖనువలె పొందనలవికాని ఈ మైథిలిని మనస్సులో అయినా అతిక్రమించే శక్తి ఆ దురాత్ముడు రావణాసురుడికి లేదు. ఈ శుభాంగి రావణాంతఃపురవైభవాన్ని కోరదు. సూర్యుడిలో కాంతివలె ఈమె నాలో నా నీడగా ఉంటుంది. ఈ జనకాత్మజ ముల్లోకాలలోనూ పరిశుద్ధురాలు. ప్రజ్ఞావంతుణ్ణి కీర్తివలె నన్ను ఈమె వదిలి ఉండదు.

"ఓ దేవతలారా, మీరు లోకపూజ్యులు. మీకు అందరికీ నామీద ఉన్న స్నేహాతిశయమునుంచి నాకు హితము చెప్పినారు. మీరు అందరూ చెప్పే మంచిమాటలు నేను అవశ్యమూ వినవలెను. మీరు చెప్పినట్లు చేయవలెను." అని చెప్పినాడు.

ఆ మహాబలవంతుడు ఆ రఘుకులదీపకుడు సుఖము అనుభవించవలసిన ఆ రాముడు తనకు తెలిసింది అంతా చెప్పి తానుచేసిన పనికి మహాత్ములు అయిన బ్రహ్మాదులు పొగుడుతూ ఉంటే సీతాదేవిని దగ్గరకు చేరతీసుకొన్నాడు.

౧౨౨

ఆవిధముగా రాముడు ఎంతో చక్కగా చెప్పినాడు. అది విని మహేశ్వరుడు అంతకన్నా చక్కగానూ మంగళకరము గానూ, "రామా, నీవు పుండరీకాక్షుడవు. మా భాగ్యవశము వల్ల నీవు రావణాసురుణ్ణి సంహారము చేసివేసినావు. ఈ పనిని నీవుతప్ప ఇంకి ఎవ్వరూ చేయలేరు. ఆ రావణాసురుడి భయము సర్వలోకాలవారినీ గాఢాంధకారమువలె ఆవరించింది. నీవు కాబట్టి ఆ రావణాసురుడితో యుద్ధముచేసి వాణ్ణి వధించివేయ కలిగినావు. ఇది మా భాగ్యము.

"ఓ మహాబలవంతుడా, నీవు ఇక అయోధ్యానగరానికి పో. నీ రాకకై ఎదురుచూస్తూ భరతుడు దిగులుపడుతూ ఉన్నాడు. అతణ్ణి ఊరడించు. ఆ భాగ్యశాలిని కౌసల్యాదేవినీ కైకేయీదేవినీ సుమిత్రాదేవినీ సందర్శించి సంతోషపెట్టు. రాజ్యాభిషేకము చేసుకో. నీ బంధువులనూ నీ మిత్రులనూ హాయిగా పోషించు. ఇక్ష్వాకువంశము సుస్థిరముగా ఉండడానికి పుత్రులను కను. అశ్వమేధము చేసి దేవతలను ఆరాధించు, బ్రాహ్మణులకు ధనము దానము ఇవ్వు. కీర్తి సంపాదించు. బహుకాలము జీవించు. ఆ తరువాత స్వర్గలోకనివాసానికి ప్రయాణము అయి పో.

"రామా, ఇదుగో, మహాయశుడూ మానవలోకములో నీ తండ్రి అయిన దశరథమహారాజు—ఈ విమానములో కూర్చున్నాడు. పుత్రుడవు అయిన నీవల్ల ఈ శ్రీమంతుడు తరించినాడు. ఇంద్ర లోకములో నివసిస్తున్నాడు. నీవూ సీతమ్మాదూ పోయి ఆయనకు నమస్కారము చేయండి" అని చెప్పినాడు.

ఈ విధముగా శివదేవుడు చెప్పిన మాటలు రామలక్ష్మణులు విన్నారు. ఆశ్చర్యపోయినారు. అక్కడ విమానములో ఉన్న ఆసనముమీద దివ్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్న తమ తండ్రిని దశరథమహారాజును సందర్శించినారు. నిర్మలవస్త్రాలు ధరించిన ఆ మహీపతి దశరథమహారాజు తనపుత్రులను చూచి మహా సంతోషపడ్డాడు. తన ప్రాణాలకన్న ఎక్కువగా ప్రేమించే రాముణ్ణి దగ్గరకు లాగుకొని తన ఒడిలో కూర్చుండబెట్టుకొని

గట్టిగా కౌగలించుకొని "రామా! నిన్ను అయోధ్యాపురములో వదలిపెట్టి వచ్చినాను. నేను ఉంటూ ఉన్నది స్వర్గములోనే; అయినప్పటికీ స్వర్గసౌఖ్యాలు నన్ను సంతోషపెట్టడము లేదు. నన్ను ఇక్కడ ఎప్పుడూ దేవర్షులు సమ్మానిస్తూనే ఉన్నారు. కాని నాకు మనశ్శాంతి లేదు. నేను నిజము చెప్పుతూ ఉన్నాను. ఒట్టు పెట్టు కొని చెప్పుతూ ఉన్నాను. నాయనా, నీవు ఇప్పుడు శత్రుసంహారము చేసినావు. నీ మనోరథము ఈడేరింది. నీ వనవాస గడువుకాలము అయిపోయింది. నాకు ఇప్పుడు సంతోషముగా ఉంది. రామా, నీవు మాట నెరవేర్చితివి. నిన్ను అడవికి పంపించడానికి కైకేయీదేవి ఏ యే మాటలు చెప్పిందో అవిఅన్నీ నాకు జ్ఞాపకము ఉన్నవి. నీవు లక్ష్మణునితోకూడా క్షేమముగా ఉన్నావు. అదే నాకు చాలు. మిమ్ములను చూచినాను. నిన్ను కౌగలించుకొన్నాను. సూర్యోదయములో మంచు వదలిపోయినట్లు నిన్ను చూడడముతో నా దుఃఖము అంతా వదలిపోయింది.

"నాయనా, పూర్వము జనకమహారాజు సభలో పరమ ధర్మాత్ముడు అయిన ఏకపాదుడు అనే బ్రాహ్మణుణ్ణి వరుణపుత్రుడు వంది అనేవాడు శాస్త్రవాదములో జయించినాడు. అప్పుడు ఆ వందిని శాస్త్రవాదములో ఏకపాదుడి పుత్రుడు అష్టావక్రుడు ఓడించి తనతండ్రిని తరింపచేసినాడు. నాయనా, అదేవిధముగా నీవు నీ పరమపూజ్యము అయిన స్వభావములో నన్ను తరింపచేసినావు.

"ఓ ప్రసన్నుడా, రావణసంహారముకోసము నీ రాజ్యాభిషేకానికి దేవేంద్రాదులు ఎట్లా విఘ్నాలు కలుగచేసింది నాకు ఇప్పుడు తెలిసింది. రామా, నీవు పురుషోత్తముడవు. అరినిషూదనుడవు. నీవు ఇక్కడనుంచి అయోధ్యానగరానికి పో. కౌసల్య నిన్ను చూసి ఎంతో సంతోషపడుతుంది. నాయనా, ఇంతకూ ఆమె కృతార్థురాలు. ఆమే కాదు, అయోధ్యానగరములో నీ రాజ్యాభిషేకము చూసే రాజులు అందరూ కృతార్థులే. వారే కాదు, నీ రాజ్యాభిషేకముచూసే ప్రతివాడూ కృతార్థుడే.

"రామా, ఆ బలవంతుణ్ణి ఆ పరిశుద్ధుణ్ణి ఆ పరమధార్మికుణ్ణి నీమీద ఎంతో అనురాగముతో ఉంటూఉన్న ఆ భరతుణ్ణి నీవు అయోధ్యానగరములో కలుసుకొన్నప్పుడు మిమ్ములను నేను

చూడవలెను. ఇది నా కోరిక. నాయనా, నీవు సీతతోనూ బుద్ధిమంతుడు అయిన ఈ లక్ష్మణుడితోనూ పద్నాలుగు సంవత్సరాలు అడవిలో కడపివేసినావు. నీ వనవాసము పూర్తిచేసినావు. నీ ప్రతిజ్ఞ సఫలము అయింది. యుద్ధములో రావణాసురుణ్ణి సంహారము చేసివేసి దేవతలను అందరినీ మెప్పించినావు. ముల్లోకాలవారూ కొనియాడే పని చేసినావు. అఖండయశస్సు సంపాదించినావు. నాయనా, ఇక నీవు రాజ్యపాలనముచేస్తూ నీ తమ్ములతోకూడా బహుకాలము జీవించు" అని ఆశీర్వదించినాడు.

రాముడు అప్పుడు చేతులు జోడించి "ఓ తండ్రీ, నీవు సమస్తధర్మాలూ తెలిసినవాడవు. నేను అడుగుతున్నాను. నన్ను అనుగ్రహించు. నీవు అప్పుడు కైకేయీదేవిని భరతుడితోకూడా పరిత్యజించినాను అని చెప్పినావు. ప్రభూ, అది ఘోరము అయిన శాపము. నీవు ఇప్పుడు వారిని అనుగ్రహించు. ఆ భయంకర శాపము వారిని అంటకుండా నీవు కాపాడవలెను" అని వేడుకొన్నాడు.

"అట్లాగేను" అని రాముడితో చెప్పి అంతట దశరథ మహారాజు లక్ష్మణుణ్ణి కౌగలించుకొని "నాయనా లక్ష్మణా, నీవు సీతారాములకు భక్తితో సేవ చేసినావు. అందుకు నేను ఎంతో సంతోషపడుతూ ఉన్నాను. అందువల్ల నీకు గొప్ప పురుషార్థము లభ్యము అయింది. నాయనా, నీవు ధర్మజ్ఞుడవు. నేను చెప్పవలసిన పనిలేదు. రాముడు ప్రసన్నుడు అయ్యేట్లయితే నీకు ఈ భూమి మీద సమస్త ధర్మఫలాలూ సంప్రాప్తము అవుతవి. నీవు గొప్ప వాడవు అవుతావు. అఖండము అయిన యశస్సు వస్తుంది. ఆ తరువాత స్వర్గసౌఖ్యాలు అనుభవిస్తావు. నీవు సుమిత్రానంద వర్ధనుడవు. నాయనా లక్ష్మణా, బ్రహ్మ నాశరహితము అయినది. అది రహస్యముగా ఉంటుంది. దేవతల హృదయాంతర్యామి. చిత్తశుద్ధి లేనివారు దాన్ని తెలుసుకోలేరు. ఆ బ్రహ్మమే శత్రువులను తాపము ఎత్తించే ఈ రాముడి రూపాన భూలోకంలో అవతరించింది అని బ్రహ్మాదులు చెప్పినారు. నీవూ విన్నావు. కాబట్టి నీవు ఈ సీతారాములకు భక్తితో సేవ చేస్తూ ఉండు" అని తన ఎదుట చేతులు జోడించి నిలుచొని ఉన్న లక్ష్మణుడితో చెప్పినాడు.

అంతట ఆ దశరథమహారాజు సీతాదేవిని చూచి "ఓ వైదేహీ, నిన్ను రాముడు వదిలిపెట్టుతాను అన్నాడు. అందుకు వాడిమీద నీకు కోపమువద్దు. నీ మేలు కోరి నీ పవిత్రచరిత్రము లోకానికి వెల్లడించడానికి అట్లా నీతో చెప్పినాడు. అంతే. ఓ సుభ్రూ, పతిసేవనుగురించి నేను నీకు చెప్పవలసిన పని ఏమీలేదు. అయినప్పటికిన్నీ నేను నీ మామగారిని కాబట్టి అవశ్యమూ చెప్ప వలెను. నీ భర్త ఈ రాముడే నీకు పరమదైవము" అని చెప్పినాడు.

ఈవిధముగా దశరథమహారాజు రామలక్ష్మణులతోనూ తనకోడలు సీతాదేవితోనూ చెప్పి దివ్యకాంతులతో విరాజిల్లుతూ విమానముమీద దేవేంద్రలోకానికి వెళ్ళిపోయినాడు.

౧౨౩

పాకాసురుణ్ణి సంహారము చేసిన దేవేంద్రుడు అప్పుడు తన ఎదుట చేతులు జోడించి నిలుచొనివున్న రాముణ్ణి చూచి "ఓ రామా, నిన్ను మేము చూడడానికి వ్యర్థముగా రాలేదు. నీవు మా దర్శనము చేయడము వ్యర్థము కాకూడదు. కాబట్టి నీ మన స్సులో ఉన్న కోరిక చెప్పు. మేము సంతోషంగా నెరవేరుస్తాము" అని చెప్పినాడు.

ఈ మాటలకు సీతారామలక్ష్మణులు ముగ్గురూ దేవేంద్రుడికి నమస్కారము చేసినారు. అంతట రాముడు "ఓ సురేశ్వరా, నీవు మాట నేర్పరివి. నీకు నామీద ప్రేమ ఉన్నట్లయితే నేను కోరేది యథార్థముగా చేసిపెట్టవలెను. నా నిమిత్తము వానర యోధులు అందరూ తమ భార్యాపుత్రులను వదలుకొని సంతోష ముగా నావెంట వచ్చి తమప్రాణాలను అయినా లెక్క చేయకుండా పరమపరాక్రమముతో యుద్ధము చేసినారు. కొంతమంది ప్రాణాలు కోల్పోయినారు. నీవు అనుగ్రహించి వాళ్ళను అందరినీ బ్రతికించవలెను. ఓదేవేంద్రుడా, నీవు ఆశ్రితుల గౌరవాన్ని కాపాడే వాడవు. వానరవీరులతోపాటు గోలాంగూలవీరులూ భల్లూకవీరులూ కొంతమంది చనిపోయినారు. చనిపోయిన నాయోధులు అందరూ ఏబాధా లేకుండా వ్రణాలు అన్నీ నయము అయిపోయి ఎప్పటి

బలపరాక్రమాలతో బ్రతికి లేవవలెను. ఇదే నా కోరిక. మరి ఒక చిన్నకోరిక ఉన్నది. వానరులు నివసించే ప్రదేశాలలో అకాలములో అయినా ముఖ్యము అయిన కందమూలాలు, వివిధఫలాలూ పండుతూ ఉండవలెను. నదులు నిర్మల జలాలతో అక్కడ ప్రవహించవలెను. ఇదే నేను కోరే వరము" అని అడిగినాడు.

ఇందుకు దేవేంద్రుడు సంతోషముగా "నాయనా, నీవు అడిగిన వరము గొప్పది. అయినా నేను మాట తప్పను. రెండు మాటలవాణ్ణి కాను. నీవు కోరినట్లుగా అవుతుంది. యుద్ధములో రాక్షసుల దెబ్బలకు చేతులూ కాళ్ళూ తలలూ తెగి చచ్చిపోయిన వానరులూ, గోలాంగూలులూ, భల్లూకవీరులూ అందరూ ప్రాణాలతో లేస్తారు. వాళ్ల గాయాలు అన్నీ నయము అయిపోయి ఏ రుగ్మతా లేకుండా ఎప్పటిమాదిరిగా బలపరాక్రమాలతో ఉంటారు. నిద్ర మేల్కొన్నట్లుగా లేస్తారు. వాళ్లు అందరూ లేచి పరమ సంతోషముతో పోయి వాండ్ల వాండ్ల స్నేహితులనూ బంధువులనూ జ్ఞాతులనూ స్వజనులనూ కలుసుకొంటారు. ఓ ధనుర్ధారీ, నీవు కోరినట్టుగా వానరులు నివసించే ప్రదేశాలలో వివిధవర్ణాలతో ఎప్పుడూ పూలుపూస్తూ వృక్షాలు ఫలవంతముగా ఉంటవి. కందమూలాలు ఎప్పుడూ సమృద్ధముగా దొరుకుతూ ఉంటవి. నదులు నిర్మలోదకాలతో ఎప్పుడూ ప్రవహిస్తూ ఉంటవి" అని చెప్పినాడు. ఈ వరము దేవేంద్రుడు అనుగ్రహించగానే గాయాలు అయిన గాత్రాలతో చచ్చి పడిఉన్న వానర గోలాంగూల భల్లూక వీరులు అందరూ గాయాలులేని దేహాలతో నిద్రపోయి లేచినవారి మాదిరిగా లేచి నుంచొన్నారు. అందుకు అందరూ ఆశ్చర్యపోయినారు. చచ్చి బ్రతికిన ఆ వీరులు అందరూ అప్పుడు రాముడికి సాష్టాంగనమస్కారములు చేసినారు.

అంతట అక్కడఉన్న దేవోత్తములు అందరూ సమస్తార్థాలూ సమకూరిన రామలక్ష్మణులనుచూచి ముందుగా స్తోత్రము చేసినారు. దేవేంద్రుడు రాముణ్ణి ఉద్దేశించి "ఓ వీరుడా, నీవు ఈ వానర వీరులను అందరినీ వారి వారి తావులకు పంపించు. ఈ మైథిలిని సమాధానపరుచు. ఇక్కడినుంచి అయోధ్యకు పో. నీ తల్లులు అందరికీ కనపడు. నిన్ను ఎడబాసిన దుఃఖములో నియమవ్రతు

డుగా ఉన్న నీ తమ్ముణ్ణి భరతుణ్ణి సంతోషపెట్టు. పూజ్యస్వభావుణ్ణి నీ తమ్ముణ్ణి శత్రుఘ్నుణ్ణి ఆదరించు. నీవు రాజ్యాభిషేకము చేసుకో. అయోధ్యా పౌరులను అందరినీ సంతోషపెట్టు" అని చెప్పినాడు.

అంతట సీతారామలక్ష్మణులు ఆ దేవోత్తములకు అందరికీ నమస్కారము చేసినారు. ఆ దేవతలు వారికి వీడ్కోలుచెప్పి సూర్యకాంతులతో తేజరిల్లుతూ ఉన్న వారి వారి విమానాలమీద స్వర్గలోకానికి ప్రయాణము అయి పోయినారు.

పూర్ణచంద్ర కాంతులతో తేజరిల్లే రాత్రివలె రామ లక్ష్మణులు కాపాడుతూ ఉన్న ఆ మహాసేనాసమూహము ఎంతో యశస్సు సంపాదించిన సంతోషముతో అక్కడ అంతటా విరాజిల్లింది.

౧౨౪

ఆరాత్రి అంతా అక్కడ హాయిగా నిద్రపోయి లేచిన ఆ అరిందముణ్ణి రాముణ్ణి చూచి విభీషణుడు చేతులు జోడించి జయా శీర్వాదము చెప్పి "రామా, స్నానయోగ్యము అయిన జలాలూ అంగరాగాలూ నానావిధ పుష్పమాలలూ ఆభరణాలూ దివ్యచంద నాలూ నూతనవస్త్రాలూ సిద్ధముచేయడము అయింది. ఇదుగో కమలనేత్రలు. ఈ యువతులు స్నానము చేయించడములోనూ అలంకరించడములోనూ ఆరితేరినారు. నీకు యథాశాస్త్రముగా మంగళస్నానము చేయించడానికి వీళ్ళు వచ్చినారు. నాకోరిక అనుగ్రహించు" అని అడిగినాడు.

అందుకు రాముడు "మిత్రుడా, నీవు సుగ్రీవుడూ మొదలు అయిన వానరవీరులను మంగళస్నానము చేయమని చెప్పు. నేను ఇప్పుడు మంగళస్నానము చేయను. ఆ మహాబాహువు ఆ ధర్మా త్ముడు సుఖము అనుభవించవలసిన ఆ సుకుమారుడు ఆ చిన్నవాడు నా తమ్ముడు భరతుడు నానుంచి అయోధ్యలో పరితపిస్తూఉన్నాడు. ఆ కైకేయీ పుత్రుణ్ణి ప్రతిజ్ఞతప్పని నా తమ్ముణ్ణి చూడకుండా మంగళస్నానము చేయను. నేను నూతనవస్త్రాలు ధరించను. ఆభర ణాలు పెట్టుకోను. నేను అయోధ్యాపట్టణానికి వెంటనే వెళ్ళిపో

వలెను. ఆ పట్టణము ఇక్కడికి చాలాదూరాన ఉన్నది. నేను సరాసరి అక్కడికి పోవలసిఉంది" అని చెప్పినాడు.

"ఓ రాజా, నిన్ను ఒక్కరోజులో అయోధ్యాపట్టణానికి చేరుస్తాను. నీకు శుభము అవుతుంది. సూర్యసమాన కాంతులతో తేజరిల్లే పుష్పకవిమానము ఇక్కడ లంకాపట్టణములో ఉన్నది. అది శ్రేష్ఠము అయినది. దేవలోకములోది. కోరుకొన్న చోటికి కోరుకొన్న వేగముతో తీసుకొనిపోతుంది. అది మా అన్న కుబేరుడిది. రావణాసురుడు యుద్ధములో జయించి దాన్ని కుబేరుడి దగ్గరనుంచి తీసుకొనివచ్చినాడు. ఇప్పుడు ఇక్కడికివచ్చిన కుబేరుడికి నేను ఆ విమానాన్ని ఇవ్వకుండా నీకోసమే అట్టిపెట్టినాను. ఆకాశములో అది మహామేఘమువలె పోతుంది. నీవు ఆందోళనపడవద్దు. దానిమీద నీవు హాయిగా అయోధ్యానగరానికి పోవచ్చును.

"ప్రభూ, నీవు సర్వమూ తెలిసినవాడవు. నామీద నీకు అనుగ్రహము ఉన్నట్లయితే నా భక్త్యాదిగుణాలను నీవు మెచ్చుకొంటూ ఉన్నట్లయితే, నామీద నీకు వాత్సల్యము ఉన్నట్లయితే నీవు ఇక్కడ మంగళస్నానముచేసుకపోయినప్పటికిన్నీ నీవు నీ భార్య వైదేహితోనూ నీ తమ్ముడు లక్ష్మణుడితోనూ ఒక్కరోజుఅయినా ఇక్కడఉండు. నాకోరిక తీర మిమ్ములను నేను సత్కరిస్తాను. ఆ తరువాత మీరు వెళ్ళిపోవచ్చును.

"రామా, నేను నిన్నే కాదు. నీ సైన్యాలనూ నీ సుహృద్గణాలనూ నేను సంతోషముగా సత్కరిస్తాను. అందుకు అవసరము అయిన ప్రయత్నాలను అన్నిటినీ చేసినాను. నీవు అంగీకరించవలెను. రామా, నీవు నన్ను గౌరవించినావు. ప్రేమించినావు. నేను నీ భృత్యుణ్ణి. కాబట్టి నేను నిన్ను ఆజ్ఞాపించలేనుకదా, స్నేహపూర్వకముగా నిన్ను వేడుకొంటున్నాను. నీవు ఇక్కడ ఒక్కరోజు అయినా ఉండి పోవలెను" అని విభీషణుడు చెప్పినాడు.

అప్పుడు రాముడు రాక్షసులూ వానరులూ మొదలు అయినవారు అందరూ వింటూ ఉండగా "ఓప్రసన్నుడా, నీవు పరంతపుడవు. నీవు నాకు సాహాయ్యము చేసినావు. నాకోసము నీవు నీ పరాక్రమాన్ని చూపించినావు. నాతో ఉత్తమము అయిన స్నేహము చేసినావు. సర్వాత్మనా నీవు నన్ను సత్కరించినావు.

ఓ రాక్షసరాజా, నీవు చెప్పినట్లు నేను చేయకుండా ఉండదగు అనేది లేదు. అయితే, నేను ఇప్పుడు అయోధ్యకు పోవలెను. నేను అరణ్యవాసము ఆరంభించినప్పుడు, నన్ను మళ్ళీ అయోధ్యకు తీసుకొనిపోవలెను అనుకొని . నా తమ్ముడు భరతుడు చిత్రకూట పర్వతానికి వచ్చినాడు. నన్ను శిరసా యాచించినాడు. నేను అందుకు అప్పుడు ఒప్పుకోలేదు. పధ్నాలుగు సంవత్సరాలూ అయిపోగానే వస్తాను అని చెప్పినాను. ఆ నా తమ్ముణ్ణి చూడవలెను అని నా మనస్సు నన్ను తొందరచేస్తూ ఉన్నది. ఆ కీర్తిశాలిని మా అమ్మను కౌసల్యాదేవిని నేను చూడవలెను. ఈ లక్ష్మణుడి తల్లిని సుమిత్రాదేవినీ ఆ భరతుడి తల్లిని కైకేయీదేవినీ మా గురువులనూ నేను చూడవలెను. నా స్నేహితులనూ వారి బిడ్డలనూ పాపలనూ అయోధ్యపౌరులనూ ఎప్పుడు ఎప్పుడు చూడడమా అని నామనస్సు తహతహ లాడుచున్నది. ఓ రాక్షసేంద్రా ఇప్పుడే విమానము తెప్పించు. నేను చేయవలసిన పనులు అన్నీ అయిపోయినవి. ఇకను నేను ఇక్కడ ఉండలేను. ఓ ప్రసన్నుడా నేను వెళ్ళిపోతాను. అనుమతించు. ఓ విభీషణుడా, నీవు నన్ను చక్కగా సత్కరించినావు. నీకు కోపమువద్దు. నేను వెళ్ళిపోవలెను. త్వరగా అనుమతించు" అని చెప్పినాడు.

అంతట విభీషణుడు లంకాపట్టణానికి పోయి పుష్పకవిమానాన్ని తీసుకొని తిరిగి వచ్చినాడు.

ఆ విమానము మేరుశిఖరాకారాన ఉన్నది. దానిని విశ్వకర్మ నిర్మించినాడు. దాని అవయవాలు అన్నీ బంగారముతో చిత్రవిచిత్రముగా అమర్చి ఉన్నవి. అది స్వచ్ఛకాంతులతో తేజరిల్లుతూ ఉంది. ఆ విమానములో వైడూర్యమణిమయము అయిన వేదికలూ మంటపాలూ ఉన్నవి. అంతే కాదు. ఆ విమానములో కాంచన హర్మ్యాలు నిర్మించి ఉన్నవి. ఆ హర్మ్యతలాలు స్ఫటికాలతోనూ వైడూర్యాలతోనూ తాపటము చేసిఉన్నవి. అంతటా ఉత్తమ ఆస్తరణాలు పరిచి ఉన్నవి. ఆహర్మ్యాలలో ఎంతో విలువ అయిన వరాసనాలు ఉన్నవి. బంగారు పద్మాలు అలంకారముగా పెట్టి ఉన్నవి. ఆ హర్మ్యాల కిటికీలకు ముత్యాలూ మణులూ పొదిగి ఉన్నవి. దానిమీద బంగారుధ్వజాలూ తెల్లటిపతాకాలూ శోభాయ

మానముగా ఉన్నవి. ఆ విమానము ఆకాశములో మధురధ్వనులు చేస్తూ దానికి కట్టి ఉన్న చిన్నచిన్న గంటలూ పెద్ద పెద్ద గంటలూ గణగణ మోగుతూ అది ఏఅడ్డూ లేకుండా మనోవేగముతో పోతుంది.

ఆ పుష్పకవిమానాన్ని రాముడికి సమర్పించి, విభీషణుడు అక్కడ నిలుచున్నాడు.

౧౨౩

ఆ పుష్పకవిమానాన్ని రాముడు చూచినాడు. విభీషణుడు అప్పుడు వినయముతో తలవంచి, చేతులు జోడించి "ప్రభూ, నేను ఇప్పుడు ఏమి చేయవలెను" అని రాముణ్ణి అడిగినాడు.

ఆ మహాతేజోవంతుడు రాముడు లక్ష్మణుడితో కూడా ఆలోచించి విభీషణుడితో స్నేహపూర్వకముగా "ఓ మిత్రుడా, ఈ వానరవీరులు అందరూ చేయవలసిన ప్రయత్నము అంతా చేసినారు. మనకు కార్యసాధకులు అయినారు. నీవు వీరిని సత్కరించు. వివిధ వస్తువులూ వస్త్రాలూ రత్నాద్యాభరణాలూ ఇచ్చి వీరిని సంతోష పెట్టు. దేవతలు సహితము యుద్ధము చేసి ఈ లంకాపట్టణాన్ని స్వాధీనము చేసుకోలేకపోయినారు. ఈ వానరవీరులు తమ ప్రాణాలకు తెగించి పరమోత్సాహముతో పోరాడినారు. అందువల్లనే మనము జయించకలిగినాము. జయప్రదముగా యుద్ధము చేసిన ఈ వానరవీరులను అందరినీ నీవు సత్కరించవలెను.

"ఓ మిత్రుడా, నీవు మర్యాదలు అన్నీ తెలిసినవాడవు. సమ్మానార్హులు అయిన ఈ వానరులను నీవు కృతజ్ఞతతో సమ్మానించేటట్లయితే వీళ్లు అందరూ ఎంతో సంతోషపడతారు. నీవు త్యాగశీలుడవు అనీ దయాపరుడవు అనీ స్నేహపాత్రుడవు అనీ తెలుసుకొంటారు. నిన్ను వీళ్లు అందరూ మెచ్చుకొంటారు. నీవు యశస్వివి అవుతావు. అందుకోసము నేను నీకు ఈ విషయము చెప్పుతున్నాను. రాజు తన ఔదర్యాదిగుణాలతో అందరినీ సంతోషపెట్టుతూ ఉండవలెను. క్రోధమే ప్రధానముగా భావించే రాజును చూచి సైన్యాలు విసుగుచెందుతవి. అటువంటి రాజును యుద్ధములో వదిలిపెట్టి ఆ సైన్యాలు పారిపోతవి" అని చెప్పినాడు.

రాముడు ఈ విధముగా చెప్పగానే విభీషణుడు వానరవీరులను అందరినీ యథార్హముగా రత్నాద్యాభరణాలు ఇచ్చి సమ్మానించి సంతోషపెట్టినాడు.

అంతట రాముడు ధనుర్ధరుడు అయిన తన తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి వైదేహినీ వెంటపెట్టుకొని ఆ పుష్పకవిమానము ఎక్కినాడు. సిగ్గుపడుతూ ఉన్న ఆ యశస్విని సీతాదేవిని తన ఒడిలో కూర్చుండపెట్టుకొన్నాడు. అప్పుడు ఆ మహాపరాక్రమ వంతుడు రాముడు సుగ్రీవుణ్ణీ విభీషణుణ్ణీ వానరవీరులను అందరినీ సమ్మానిస్తూ "ఓ వీరోత్తములారా, మీరు మీ మిత్రకార్యము నెరవేర్చినారు. ఇకను యథేష్టముగా మీ మీ తావులకు పొండి. నేను అనుమతిస్తున్నాను."

"ఓ సుగ్రీవుడా, నీవు పరంతపుడవు. నీవు నా స్నేహితుడవు. ప్రతిఫలాపేక్ష లేకుండా ఆపత్కాలములో ఆదుకొని సుహృదుడి వలెనూ మంత్రిసత్తముడి వలెనూ నీవు నాకు పని చేసిపెట్టినావు. నీకు అధర్మము అంటే ఎంతభయమో నాకు తెలుసును. నీవు పరమధార్మికుడవు. ఇక నీవు నీ సైన్యాలను వెంటపెట్టుకొని కిష్కింధానగరానికి వేగముగా పో.

"ఓ విభీషణుడా, నీ రాజ్యాన్ని నీకు ఇచ్చివేసినాను. నీవు ఇక హాయిగా లంకాపట్టణములో నివసించు. దేవేంద్రుడితో కూడా దేవతలు అందరూ ఎత్తివచ్చినా నిన్ను జయించలేరు. మిత్రుడా, నేను మా తండ్రిగారి రాజధానీనగరానికి పోతున్నాను. నాకు మీరు అనుజ్ఞ ఇవ్వండి. మిమ్ములను అందరినీ అడుగు తున్నాను. నేను అయోధ్యానగరము పోవడానికి మీరు అందరూ అనుమతించండి" అన్నాడు.

ఈ విధముగా రాముడు అడుగగానే రాక్షసరాజు విభీషణుడున్నూ, వానరరాజు సుగ్రీవుడున్నూ మహాబలవంతులు అయిన వానరవీరులు అందరున్నూ చేతులుజోడించి "ఓ రామప్రభూ, మేము అందరమూ అయోధ్యానగరానికి రావలెను అనుకొంటు న్నాము. నీవు మమ్ములను అందరినీ తీసుకొనిపోవలెను. మేము అక్కడివారికి ఎవరికీ ఇబ్బంది కలుగచేయము. హెచ్చరికతో మీ మహానగరములలోనూ మీ ఉద్యానవనాలలోనూ సంచరిస్తాము.

ఓ రాజా, నీవు మంగళస్నానముచేసి రాజ్యాభిషిక్తుడవు కావడము మేము అందరమున్నూ కన్నులారా చూస్తాము. ఓ రామప్రభూ, నిన్నుకన్న మీ అమ్మకు కౌసల్యాదేవికి మేము అందరమూ నమస్కారము చేయవలెను. ఆ తరువాత వెంటనే మేము అందరమూ మా మా తావులకు వెళ్లిపోతాము'' అని చెప్పినారు. ఈ విధముగా విభీషణాదులు చెప్పగానే ఆ ధర్మాత్ముడు, ఆ శ్రీమంతుడు, రాముడు సుగ్రీవుణ్ణీ విభీషణుణ్ణీ చూచి ''ఓ మిత్రులారా, సీతాసమాగమము నుంచి నేను సంతోషపడ్డాను. భరతుణ్ణీ చూడపోతున్నానని అంతకన్నా సంతోషపడ్డాను. ఇప్పుడు మీరు అందరూ నావెంట వస్తాము అని అంటూంటే నేను అన్నిటికన్నా ఎక్కువగా సంతోషపడుతున్నాను. ఓ సుగ్రీవుడా, నీవు నీ వానర వీరులతో ఈ విమానము ఎక్కు. ఓ విభీషణుడా, నీవు నీ అమాత్యులతో కూడా రా'' అని చెప్పినాడు.

అంతట సుగ్రీవుడు వానరసమూహాలతో గబ గబా ఆ దివ్య విమానము ఎక్కి కూర్చున్నాడు. విభీషణుడు తన అమాత్యులతో ఆ విమానము ఎక్కినాడు. హంసప్రతిమలతో భాసిస్తూఉన్న ఆ పుష్పకవిమానములో రాముడు పరమసంతోషముతో కూర్చొని, అందరి పొగడ్తలూ వింటూ కుబేరునివలె విరాజిల్లినాడు.

మహాబలవంతులు అయిన వానర రాక్షసవీరులు అందరూ ఆ దివ్యవిమానములో ఇరుకులేకుండా యథాసుఖముగా సంతోషముగా కూర్చున్నారు.

అప్పుడు రాముని అనుజ్ఞతో ఆ పుష్పకవిమానము ఆకాశానికి ఎగిరింది.

౧౨౬

రాముడు అనుమతించగానే వాయువేగానికి మహామేఘమువలె ఆ ఉత్తమోత్తమ విమానము ఆకాశానికి ఎగిరిపోయింది. రాముడు అప్పుడు ఆ విమానములోనుంచి అన్నివైపులా తన దృష్టి సారిస్తూ ఆ శశినిభానన సీతాదేవిని చూచి ''ఓ వైదేహీ, చూడు; కైలాసశిఖరాకారాన లంకాపట్టణము త్రికూటపర్వతశిఖరముమీద ఉన్నది. ఈ పట్టణాన్ని విశ్వకర్మ నిర్మించినాడు. ఇదిగో,

ఈ యుద్ధభూమి చూడు. నెత్తురుతోనూ, మాంసముతోనూ బురద అయిపోయింది. రాక్షసులూ వానరులూ ఎంతోమంది ఇక్కడనే చచ్చి పడిపోయినారు.

“ఓ విశాలాక్షీ, బ్రహ్మదేవుడి వరము సంపాదించిన ఆ లోకహింసకుణ్ణి, రావణాసురుణ్ణి నీకోసము నేను వధించింది ఇక్కడనే. నేను కుంభకర్ణుణ్ణి కొట్టిందికూడా ఇక్కడనే. ఆ నిశాచరుడు ప్రహస్తుడు హతుడు అయిపోయింది ఇక్కడనే. హనుమంతుడు ధూమ్రాక్షుణ్ణి సంహారము చేసివేసిందిన్నీ, రావణాసురుడికొడుకు ఇంద్రజిత్తుతో లక్ష్మణుడు పోరాడిందిన్నీ ఇక్కడనే. ఆ ఇంద్రజిత్తు ఇక్కడనే చచ్చి పడిపోయినాడు. వికటుడు అనే రాక్షసవీరుణ్ణి అంగదుడూ, విద్యున్మాలి అనే రాక్షసుణ్ణి సుషేణుడూ చంపివేసింది ఇక్కడనే. ఎదిరించ నలవికాని విరూపాక్షుడూ మహాపార్శ్వ మహోదరులూ అకంపనుడూ ఇంకా బలవంతులు అయిన రాక్షస వీరులు ఎంతోమంది హతము అయిపోయింది ఇక్కడనే. ఈ యుద్ధ భూమిలోనే, రావణాసురుడి శ్రేష్ఠభార్య మండోదరిన్నీ ఆమె సవతులు వెయ్యిమందిన్నీ వచ్చి చనిపోయిన తమ పెనిమిటిని రావణాసురుణ్ణి చూచి ఏడ్చినారు.

“ఓ వరాననా, అదుగో, మేము సముద్రముదాటి ఆ రాత్రి అంతా కడపిన చోటు. చూడు ఈ సముద్రతీరము. ఇదిగో సేతువు. ఈ సముద్రజలాలలో నేను నలుడిచేత నీకోసము ఈ సేతువు కట్టించినాను. ఇటువంటి సేతువును ఇదివరకు ఎవ్వరూ కట్టలేదు. ఓ వైదేహీ, చూడు, క్షోభపెట్ట నలవికాని అపారము అయిన ఈ సముద్రాన్ని చూడు. ఇది ఎంత భయంకరముగా గర్జిస్తూ ఉన్నదో గమనించు. ఓ మైథిలీ, నీకోసము హనుమంతుడు ఈ సముద్రాన్ని దాటి వచ్చేటప్పుడు అతడు విశ్రమించటానికి ఈ సముద్రాన్ని భేదించుకొని పైకి లేచి వచ్చిన కాంచనశైలము; ఇదిగో, ఇదే, మైనాకపర్వతము. సముద్రము కడుపులో ఉన్న ఈ మైనాక పర్వతము వానర దండుకు విడిదిపట్టు అయింది. ఓ సీతా, ఇదుగో చూడు ఈ తీర్థము. శంఖాలతోనూ ముత్తెపుచిప్పలతోనూ ఉన్న మహాప్రభావము కల ఈ సముద్రతీరమే సేతుబంధనము అని ప్రసిద్ధికి ఎక్కింది. ఇది పరమపవిత్రము అయినది. ఇది పుణ్యక్షేత్రము.

ఈ తీర్థములో స్నానము చేసేవారి మహాపాతకాలు అన్నీ నాశనము అయిపోతవి. ఈ తీర్థాన్ని ముల్లోకాలవారూ పూజించినారు. ఇక్కడ పూర్వము ఆ ప్రభువు మహాదేవుడు (ముల్లోకాలవారికి) ప్రసన్నుడు అయినాడు. ఇక్కడనే రాక్షసరాజు విభీషణుడు నన్ను కలుసుకొన్నాడు.

"సీతా, ఈ విమానము అమితవేగముతో పోతున్నది. చూడు. ఆ కనపడుతున్నదే కిష్కింధానగరము. అదే సుగ్రీవుని రాజధానీనగరము. అది అందము అయిన పట్టణము. ఇవిగో చిత్రవిచిత్రము అయిన వనాలు. నేను వాలిని సంహారము చేసి వేసింది ఇక్కడనే" అని చెప్పినాడు.

వాలి పరిపాలించిన కిష్కింధానగరాన్ని సీతాదేవి చూచింది. అంతట ఆమె రాముడితో సవినయముగా సంతోషాతిశయముతో "ఓ పుణ్యపురుషుడా, తార మొదలైన సుగ్రీవుని ప్రియభార్యలనూ తక్కిన వానరవీరుల భార్యలనూ మనము వెంటపెట్టుకొని మన రాజధానీనగరానికి పోదాము. ఇది నా కోరిక" అని చెప్పింది.

"అట్లాగేను" అని రాముడు ఆ పుష్పకవిమానాన్ని కిష్కింధాపట్టణముదగ్గర ఆపించి సుగ్రీవుణ్ణి చూచి "ఓ వానర శార్దూలమా, వానరవీరులు అందరిభార్యలనూ వెంటపెట్టుకొని అయోధ్యానగరానికి పోవలెను అని సీతాదేవి కోరుతూ ఉన్నది. ఇది వానరవీరులు అందరితో చెప్పు. నీవు పోయి నీ భార్యలను, అందరి భార్యలను వెంటపెట్టుకొనిరా. వేగిరముగా పోయి రా. ఆలస్యము చేయవద్దు" అని చెప్పినాడు.

అంతట ఆ శ్రీమంతుడు సుగ్రీవుడు ఆ యా వానరవీరులు అందరితోను చెప్పి కిష్కింధానగరానికి పోయినాడు. సుగ్రీవుడు తన అంతఃపురములోకి పోయి తారను చూచి "ఓ ప్రియురాలా, వానరవీరుల భార్యలను అందరినీ వెంటతీసుకొని అయోధ్యానగరము పోవలెను అని సీతాదేవి సంతోషముతో కోరుకొన్నది. అందుకు రాముడు అంగీకరించినాడు. నీవు త్వరగా లే. వానరవీరులు భార్యలను అందరినీ తీసుకుపోదాము. అయోధ్యానగరములో దశరథమహారాజు భార్యలను అందరినీ చూచి వద్దాము" అని చెప్పినాడు.

సుగ్రీవుడు చెప్పింది విని వినడముతో తార సంతోషముతో
ఉప్పొంగిపోయింది. శోభాయమానముగా సర్వాంగాలూ అలంక
రించుకొన్నది. తక్కిన వానరవీరుల ఇల్లాండ్రను అందరినీ పిలిపిం
చింది, వాళ్లను చూచి "మనము మన మగవాళ్లను వెంబడించ
డానికి సుగ్రీవుడు అనుమతించినాడు. అయోధ్యానగరము చూడ
గలము అని నేను సంతోషపడుతున్నాను. మనము అందరమూ
పోదాము. రాముడు అయోధ్యానగరము చేరడమూ ఆయనకు
అక్కడిపౌరులూ జానపదులూ ఎదురుకోలు చెప్పడమూ చూద్దాము.
దశరథమహారాజు భార్యలను చూద్దాము" అని చెప్పింది.

అంతట వానరవీరుల భార్యలు అందరూ యథావిధిగా అలంక
రించుకొని తారవెంట బయలుదేరినారు. వారు అందరూ ఆ
విమానానికి ప్రదక్షిణముగా పోయినారు. ఆ విమానము ఎక్కినారు.
వానరాంగనలు అందరూ కూర్చున్నతరువాత ఆవిమానము పైకి
ఎగిరింది. అది ఋష్యమూకపర్వతాన్ని సమీపిస్తూ ఉండగా
రాముడు "ఓ సీతా, చూడు. ఆ పర్వతము బంగారుకాంతుల
తోనూ గైరికాదిధాతువులతోనూ ధగధగలాడుతూ ఉన్నది.
మెరుపులు మెరుస్తూఉన్న మేఘమువలె కనబడుతున్నది. ఇదే
ఋష్యమూకపర్వతము. ఇక్కడనే నేను వానరరాజును సుగ్రీవుణ్ణి
కలుసుకొన్నాను. వాలిని వధించివేస్తాను అని నేను ప్రతిజ్ఞ చేసిందిన్నీ
ఇక్కడనే.

"ఇదుగో, చూడు, చిత్రవిచిత్రముఅయిన వనాలతో పంపా
సరస్సు కనపడుతున్నది. నీ ఎడబాటునుంచి నాకు పట్టరాని
దుఃఖమువచ్చి నీకోసము నేను విలపించింది ఇక్కడనే. ఈ పంపా
తీరాననే ఆ తాపసిని శబరిని చూచినాను. యోజన దూరము
బాహువులు చాచే కబంధుణ్ణి నేను చంపివేసింది ఇదుగో ఇక్కడనే.

"ఓ విలాసినీ, ఈ ప్రదేశము చూడు. ఆ ఘాతుకుడు రావణా
సురుడు నీనుంచి ఘోరముగా పోరాడి జటాయువును చంపివేసింది.
శ్రీమంతముఅయిన ఈ వృక్షము దగ్గరనే. ఇదుగో, చూడు, జన
స్థానము. ఓ వరవర్ణినీ, మహాపరాక్రమవంతులు అయిన ఖర దూషణ
త్రిశిరులను సూటిగాపోయే బాణాలు వదిలి నేను సంహారముచేసి
వేసింది ఇక్కడనే. ఇదుగో, ఇదే మనోహరముఅయిన మన

ఆశ్రమపదము. ఇదుగో, అందముఅయిన మన పర్ణశాల. రావణాసురుడు నిన్ను బలవంతముగా ఎత్తుకొనిపోయింది ఇక్కడనుంచే.

“ఓ మైథిలీ, మనోహరమూ, మంగళకరమూ అయిన గోదావరీనది! ప్రసన్నోదకాలతో ప్రవహిస్తూ ఉన్నది చూడు. అదుగో అగస్త్యమహర్షి ఆశ్రమపదము. ఇదుగో సుతీక్ష్ణమహర్షి ఆశ్రమము! దివ్యకాంతులతో తేజరిల్లుతూ ఉంది చూడు. ఓ వైదేహీ, ఇదుగో శరభంగాశ్రమము. మనము ఇక్కడికి చేరినప్పుడే ఆ సహస్రాక్షుడు దేవేంద్రుడు ఇక్కడికి వచ్చిపోయినాడు. ఓ మైథిలీ, ఆ మహాకాయుణ్ణి విరాధుణ్ణి నేను వధించింది ఇదుగో ఈ ప్రదేశములోనే. అదుగో, సూర్యవైశ్వానర ప్రభలతో తేజరిల్లుతూ ఉన్న అత్రిమహర్షి ఆశ్రమపదము. ఇవిగో, ఋష్యాశ్రమపదాలు; కనపడుతున్నవి చూడు. ఓ సుతనూ, నన్ను ప్రసన్నుణ్ణి చేసుకొని తిరిగీ అయోధ్యకు తీసుకొనిపోవలెను అనుకొని కైకేయీపుత్రుడు భరతుడు వచ్చిన చిత్రకూటపర్వతము ఇదుగో, చూడు.

“అదుగో దూరముగా కనపడుతూ ఉన్నది సుందరవనాలతో యమునానది. అదుగో మనము చూచిన భరద్వాజాశ్రమము. శ్రీమంతముగా తేజరిల్లుతూ ఉన్నది. అదుగో చూడు. స్వర్గమర్త్యపాతాళలోకాలలో మూడు పాయలుగా ప్రవహించిన గంగానది. నానావిధ పక్షులు గుంపులుగా తిరుగుతూ ఉన్నవి. అవిగో, విరగపూసిన అడవులు. గుహుడు వచ్చి మనలను కలుసుకొన్న శృంగిబేరపురము అదుగో, దూరముగా కనుపడుతున్నది. సీతా, చూడు. నానావిధ వృక్షాలతో ఉన్న ఆ అడవులు. చెట్లు అన్నీ పూలు పూసినవి. అవిగో, యజ్ఞాలు చేసిన యూపస్తంభాల పంక్తులు. అదుగో, సరయూనది. అదిగో, చూడు, దూరముగా మానాయన గారి రాజధానీనగరము అయోధ్య కనపడుతున్నది. ఓ వైదేహీ, మళ్ళీ మనము వస్తూ ఉన్నాము. నీవు ఆ అయోధ్యానగరానికి నమస్కారము చేయవలెను” అని చెప్పినాడు.

ఇట్లా రాముడు చెప్పగానే వానరులూ రాక్షసులూ విభీషణుడూ సుగ్రీవుడూ మొదలైనవారు అందరూ సంతోషముతో ఎగిరి ఎగిరి మంగళకరము అయిన ఆ మహానగరాన్ని చూచినారు. దేవేంద్రుడి అమరావతీ పట్టణమువలె విశాలము అయిన కక్ష్యలు

ఉన్న తెల్లటి హార్మ్యాలతోనూ గుర్రాలతోనూ ఏనుగులతోనూ కిటకిటలాడుతూ ఉన్న అయోధ్యానగరము వారికి కనిపించింది.

౧౨౮

ఆనాడు పంచమి తిథి. నాటితో పధ్నాలుగవ సంవత్సరము అయిపోయింది. ఆనాడు రామలక్ష్మణులు భరద్వాజాశ్రమములోనికి పోయినారు. నియమబద్ధులుగా ఆ మహామునికి ఆ తపోధనుడికి భరద్వాజమహర్షికి నమస్కారము చేసినారు. అంతట రాముడు 'ఓ మహాత్ముడా, అయోధ్యానగరము సుఖితముగా ఉంటూఉన్నదా! అందరూ ఆరోగ్యముగా ఉంటూఉన్నారా! ఈ విషయము మీరు వింటూఉన్నారా? భరతుడు చక్కగా రాజ్యపాలనము చేస్తూఉన్నాడా? మాతల్లులు అందరూ క్షేమముగా ఉన్నారా!'' అని అడిగినాడు.

ఆ మహాముని భరద్వాజుడు రాముడు అడిగిన ప్రశ్నలకు పరమ సంతుష్టుడు అయినాడు. చిరునవ్వు నవ్వుతూ "రామా, నీ ఇంట్లో అందరూ కుశలముగా ఉన్నారు. నీ పాదుకలను ముందు పెట్టుకొని భరతుడు రాజ్యపాలనము చేస్తూ ఉన్నాడు. అతని తలనిండా జడలు పెరిగిపోయినవి. దేహసంస్కారాదులు లేనందువల్లనూ, కటిక నేలమీద పడుకొంటూ ఉన్నందువల్లనూ దుమ్ముకొట్టుకొన్న శరీరంతో ఉన్నాడు. నీరాక ఎదురు చూస్తూ ఉన్నాడు.

"ఓ సమితింజయా, నీవు పితృవాక్యపరిపాలనముకోసము కైకేయీదేవి మాటకు కట్టుపడిపోయి రాజ్యమూ సర్వభోగాలు సర్వస్వమూ వదలుకొని కేవలమూ ధర్మాన్నే శిరసావహించి వల్కలాలు కట్టుకొని మహారణ్యములో కందమూలఫలాదులు తింటూ కాలము కడపటానికి నీ భార్యను వెంటపెట్టుకొని నీ తమ్ముణ్ణి తోడుచేసుకొని పాదచారుడవుఅయి స్వర్గలోకములోనుంచి జారిపోయిన దేవతవలె పూర్వము నా ఆశ్రమానికి వచ్చినప్పుడు నిన్ను చూచినాను. అప్పుడు నిన్ను చూడగానే నాకు జాలివేసింది.

"రామా, ఇప్పుడు నీవు శత్రువులను అందరినీ జయించి సమస్తకార్యాలూ సాధించుకొని నీ మిత్రసమూహాలతోనూ నీ

భార్యతోనూ నీ తమ్మునితోనూ నన్ను చూడవచ్చినావు. ఇప్పుడు నిన్ను చూస్తూఉంటే నాకు పరమసంతోషము వేస్తూఉన్నది. రామా, వనవాసములో నీవు అనుభవించిన సమస్త సుఖ దుఃఖాలూ నేను ఎరుగుదును.

"ఓ ధర్మవత్సలా, నీవు జనస్థానములో రాక్షసులను అందరినీ సంహారము చేసివేయడమూ మహర్షులు ప్రార్థించినందువల్ల నీవు తాపసులను అందరినీ కాపాడటమూ ఆ అనిందితను నీ భార్యను సీతను రావణాసురుడు అపహరించవలెను అనుకోవడమూ మారీచుడు జింకరూపాన రావడమూ అప్పుడు సీతాదేవిని రావణాసురుడు ఎత్తుకొనిపోవడమూ, నీవు కబంధుణ్ణి చూడడమూ, పంపా సరస్సుకు పోవడమూ, సుగ్రీవుడితో సఖ్యము చేయడమూ వాలిని హతమార్చి వేయడమూ, వైదేహిని వెతికించడమూ, మారుతాత్మజుడు హనుమంతుడు సముద్రలంఘనము చేయడమూ, లంకను దహించివేయడమూ, సీతాదేవి వృత్తాంతము నీకు తెలియ చెప్పడమూ, నీవు నలుడిచేత సేతువు కట్టించడమూ, వానరవీరులు ఉత్సాహముతో లంకాపట్టణాన్ని దహించి వేయడమూ, దేవకంటకుడు అయిన రావణాసురుణ్ణి పుత్రులతో బంధువులతో సర్వసైన్యాలతో నీవు సంహారము చేయడమూ దేవతలు అందరూ వచ్చి నిన్ను చూడడమూ, దేవేంద్రుడు నీకు వరకు ఇవ్వడమూ ఈ మొదలైన వృత్తాంతము అంతా నేను నా తపోబలముతో తెలుసుకొన్నాను.

"ఓ రామా, నేనూ నీకు వరము ఇవ్వతలచినాను. అడుగు ఇస్తాను. అంతేకాదు. నేను నీకు ఈవేళ అతిథిసత్కారము చేస్తాను. నా సత్కారాన్ని పొంది రేపు అయోధ్యానగరానికి పో" అని చెప్పినాడు.

భరద్వాజుడు చెప్పిన ఈ మాటలకు ఆ ధీమంతుడు రాముడు శిరసా నమస్కారముచేసి "బాగుంది; బాగుంది" అంటూ 'ఓ మహాత్ముడా, నేను ఇప్పుడు అయోధ్యానగరానికి పోతున్నాను. నేను పోయే దారిలో వృక్షాలు అన్నీ కాలముకాని కాలములో కూడా ఫలప్రదముగా ఉండవలెను. ఆ వృక్షాలకు మధువు స్రవించవలెను. వివిధ ఫలాలూ అమృతమువంటి రుచితో పండవలెను. ఇదే నేను అడిగే వరము" అన్నాడు.

"అట్లాగేను" అని భరద్వాజుడు అన్నాడు. ఆ మహర్షి మాట తప్పిపోదు. అప్పటికి అప్పుడు అక్కడఉన్న వృక్షాలుఅన్నీ స్వర్గములో కల్పవృక్షాలవలె కోరుకొన్న పండ్లు పండేవి అయినవి. అంతవరకూ పండ్లు పండకుండాఉన్న చెట్లమీది కాయలు అప్పటికి అప్పుడు పండిపోయినవి. అంతవరకూ పూలు పూయకుండాఉన్న చెట్లు అన్నీ అప్పటికి అప్పుడు విరగపూసినవి. ఎండిపోయిన చెట్లు ఆకులు వేసినవి. పెద్దగా పెరిగిన చెట్లకు తేనెలు కారినవి. అక్కడనుంచీ అయోధ్యానగరానికిపోయే మూడు యోజనాల దూరములోఉన్న చెట్లు అన్నీ పుష్ప ఫల మధు ప్రదాలు అయినవి.

అప్పుడు ఆ వానరవీరులు అందరూ పరమసంతోషముతో నానావిధ ఫలాలనూ కోరుకొన్నన్ని లెక్కలేకుండా తిని స్వర్గాన్ని జయించినవారివలె విర్రవీగినారు.

౧౨౫

రాముడు అయోధ్యనుగురించి ఆలోచించినాడు. హనుమంతుణ్ణి చూచి "వాయుపుత్రుడా, నీవు ఇప్పుడు అయోధ్యానగరానికి పోవలెను. అక్కడ రాజభవనములో ఉంటూఉన్న వారి అందరి కుశలమూ తెలుసుకొని రావలెను. నీవు ముందుగా శృంగిబేరపురము పో. అక్కడ నిషధాధిపతిని గుహుణ్ణి చూడు. అతడు నా స్నేహితుడు. ఆ వనచరుడికి నా కుశలము చెప్పు. నా కోసము అతడు విచారపడుతూ ఉంటాడు. నా క్షేమము తెలుసుకొని ఎంతో సంతోషిస్తాడు. అయోధ్యాపట్టణము పోవటానికి నీకు దారి చూపిస్తాడు. భరతుడి వృత్తాంతము నీకు తెలియచెప్పుతాడు. అక్కడినుంచి నీవు భరతుడిదగ్గరకు పో. ఆ నా తమ్ముడితో నేనూ నా భార్య సీతాదేవీ నా తమ్ముడు లక్ష్మణుడూ కుశలముగా ఉన్నాము అనీ, నేను కృతార్థుణ్ణి అయినాను అనీ చెప్పు. బలవంతుడు అయిన రావణాసురుడు సీతాదేవిని అపహరించుకొని పోవడమూ నేను సుగ్రీవుణ్ణి కలుసుకోవడమూ వాలిని సంహరించి వేయడమూ సీతాదేవికోసము మీరు వానరులు అందరూ వెతకడమూ అవ్యయము అయిన మహాసముద్రాన్ని నీవు లంఘించడమూ నీవు సీతాదేవిని చూచి రావడమూ ఆ తరువాత మనము

అందరమూ ఆ సముద్రతీరానికి పోవటమూ నాకు సముద్రుడు దర్శనము ఇవ్వడమూ మీరు అందరూ సముద్రానికి సేతువుకట్టడమూ రావణాసురుణ్ణి నేను సంహారముచేయడమూ దేవేంద్రుడు బ్రహ్మ వరుణదేవులను ఆలోచించి నాకు వరము ఇవ్వడమూ మహాదేవుడి అనుగ్రహమువల్ల మా తండ్రి దశరథమహారాజు మమ్ములనుచూచి మాట్లాడడమూ నేను రాక్షసరాజు విభీషణుడితోనూ వానరరాజు సుగ్రీవుడితోనూ ఇక్కడికి రావడమూ నీవు మెల్లగా భరతుడితో చెప్పు.

"ఓ హనుమంతుడా, నీవు చెప్పినది అంతా వినగానే భరతుడి ముఖవైఖరి చూడు. నన్ను గురించి అతని మనోగతాన్ని కనిపెట్టు. ఎట్లాగు అంటే రాముడు శత్రుసమూహాలను సంహారము చేసివేసినాడు అనీ అఖండయశస్సు సంపాదించినాడు అనీ పరిపూర్ణ మనోరథుడు అయినాడు అనీ మహాబలవంతులు అయిన మిత్రులను వెంటపెట్టుకొని వస్తూ ఉన్నాడు అనీ చెప్పు. ఆ భరతుడి ముఖము వంకచూడు. అతని ముఖవర్ణమువల్లనూ అతని చూపులవల్లనూ అతని మాటలవల్లనూ అతడి మనోభావాలను నీవు కనిపెట్టవచ్చును. అతడి వృత్తాంతము అంతా యథార్థముగా తెలుసుకో. పితృపైతామహము అయిన రాజ్యము అందులో ఏనుగులతోనూ గుర్రాలతోనూ రథాలతోనూ చేరికివచ్చి సమస్తకోర్కెలూ సమృద్ధముగా సమకూడుతూ ఉంటే ఎటువంటివాడి మనస్సు అయినా తిరిగిపోకుండా ఉంటుందా. ఆ శ్రీమంతుడు భరతుడు ముల్లోకాలూ ఏలగల రఘువంశములో పుట్టినాడు. పధ్నాలుగు సంవత్సరాలు రాజ్యము ఏలినాడు. ఆ అనుభవమువల్ల వాడే రాజ్యపాలనము అపేక్షించేటట్లయితే ఈ భూమిని అంతా వాణ్ణే ఏలనీ.

ఓ హనుమంతుడా, భరతుడి అభిప్రాయము తెలుసుకో. అతని ప్రయత్నము ఏమిటో తెలుసుకో. మేము ఇక్కడినుంచి అట్టే దూరము రాకపూర్వమే నీవువచ్చి మమ్ములను కలుసుకో. నేనే రాజ్యము ఏలవలెను అని వాడు అనుకొంటూ ఉన్నట్లయితే నీవు రా నక్కరలేదు" అని చెప్పినాడు.

అంతట హనుమంతుడు రామాజ్ఞను శిరసావహించి అయోధ్యానగరానికి ప్రయాణము అయినాడు. మనుష్యరూపము ధరించినాడు. మహాసర్పాలను పట్టడానికి అమిత వేగముతో ఆకాశానికి

ఎగిరే గరుత్మంతుడివలె ఆ మారుతాత్మజుడు హనుమంతుడు పైకి ఎగిరినాడు. ఆ పరమపరాక్రమవంతుడు తనతండ్రి వాయుదేవుడు సంచరించే ఆకాశమార్గాన పోయి మంగళకరమూ మహాసర్పాలకు వాసస్థానమూ అయిన గంగా యమునా మధ్యప్రదేశము దాటి శృంగిబేరపురము చేరినాడు. గుహుణ్ణిచూచి సంతోషాతిశయముతో మంగళకరముగా "ఓ నిషాదుడా, నీ స్నేహితుడు రఘువంశలలాముడు రాముడు సీతాలక్ష్మణ సహితముగా కుశలముగా ఉన్నట్టు నీతో చెప్పమన్నాడు. ఈనాడు పంచమి తిథి. భరద్వాజమహర్షి కోరినందువల్ల ఈరాత్రి అంతా ఆ మహర్షి ఆశ్రమములో గడుపుతాడు. ఆ మహర్షి అనుజ్ఞతో రేపు ఉదయము బయలుదేరుతాడు. నీ స్నేహితుణ్ణి రాముణ్ణి ఇంక త్వరలో చూస్తావు" అని చెప్పినాడు.

అంతట ఆ మహాతేజోవంతుడు ఆ మహావేగవంతుడు హనుమంతుడు రాముడి మిత్రుడికి రాముడి క్షేమవృత్తాంతము చెప్పినాడు అనే పరమసంతోషముతో దేహము పులకలెత్తి అక్కడి వనపర్వతాదుల రామణీయకాన్ని అయినా గమనించకుండా అమిత వేగముతో ఆకాశానికి ఎగిరినాడు. అట్లా ఆకాశమార్గాన పోతూ దారిలో పరశురామతీర్థాన్నీ వాలుకీనదినీ గోమతీనదినీ భయంకరము అయిన సాలవనాన్నీ సస్యసమృద్ధముగా ఉన్న జనపదాలనూ, ఆ జనపదాలలో ఉన్న వేలకొద్దీ ప్రజలనూ చూస్తూ పోయి పోయి నందిగ్రామ సమీపము చేరినాడు. అక్కడ ఉద్యానవనాలలో వృద్ధులూ, స్త్రీలూ తమ తమ బిడ్డలతో విహరించడము చూచినాడు. విరగపూసిన చెట్లతోనూ లతలతోనూ ఆ ఉద్యానవనాలు దేవేంద్రుడి నందనోద్యానవనమువలెనూ కుబేరుడి చైత్రరథ వనము వలెనూ కనిపించినవి.

అక్కడికి అయోధ్యానగరము క్రోశెడు దూరములో ఉన్నది. ఆ నందిగ్రామములో భరతుడు నివసిస్తూఉన్న ఆశ్రమపదానికి హనుమంతుడు పోయినాడు. అక్కడ వల్కలాలు కట్టుకొని కృష్ణాజినము కప్పుకొని దిగులుతో చిక్కిపోయి తలనిండా జడలు పెరిగి ఒంటినిండా మురికిపట్టి తన అన్న రాముణ్ణిగురించిన దుఃఖముతో బాధపడుతూ ఫలమూలాదులు తింటూ దేహేంద్రియాలను నిగ్ర

హించి ధర్మానుష్ఠానములో, తపోనిష్ఠలో, వాక్నియమములో మనోనియమములో బ్రహ్మర్షివలె తేజరిల్లుతూ రాముడి పాదుకలను ముందుపెట్టుకొని రాజ్యము ఏలుతూ చతుర్వర్ణాలవారికిన్ని ఏ ఇబ్బందీ కలగకుండా కాపాడుతూ పరిశుద్ధులూ కాషాయాంబర ధారులూ అయిన అమాత్యులతోనూ, పురోహితులతోనూ, సేనాధ్యక్షులతోనూ ఉంటూ ఉన్న భరతుణ్ణి హనుమంతుడు చూచినాడు. మంత్రులూ మొదలైన అయోధ్యాపౌరముఖ్యులు అందరూ పరమధార్మికులు. రాజపుత్రుడు భరతుడు వల్కలాజినాలు ధరించినందువల్ల వారు అందరూ తమ తమ వస్త్రాద్యాభరణాలను ధరించటము మానివేసినారు.

ధర్మము మూర్తీభవించినట్టుగా ఉన్న ఆ ధర్మజ్ఞుడికి భరతుడికి హనుమంతుడు చేతులు జోడించి "ఓ దేవా, వల్కలాజినాలు ధరించి దండకారణ్యములో నివసిస్తూఉన్న ఎవరికోసము నీవు దుఃఖ పడుతున్నావో ఆ రాముడు నీ అన్న నీ కుశలము అడగమన్నాడు. ఓ ప్రభూ, నిన్ను సంతోషపెట్టే వృత్తాంతము చెప్పుతాను. విను. దారుణమైన నీ దుఃఖాన్ని వదిలిపెట్టు. నీవు మీ అన్న రాముణ్ణి ఈ ముహూర్తాన కలుసుకొన్నట్టే భావించు.

"ఓ రాజా, రామప్రభువు రావణాసురుణ్ణి సంహారము చేసి వేసినాడు. మైథిలిని తెచ్చుకొన్నాడు. పరిపూర్ణమనోరథుడు అయినాడు. మహాబలవంతులు అయిన మిత్రులను వెంటపెట్టు కొని వస్తున్నాడు. దేవేంద్రుడివెంట శచీదేవివలె ఆ రామప్రభువు వెంట ఆ పరమయశస్విని సీతాదేవి వస్తూవున్నది. వారివెంట ఆ మహాతేజోవంతుడు నీ తమ్ముడు లక్ష్మణుడు వస్తూవున్నాడు." అని చెప్పినాడు.

హనుమంతుడు చెప్పిన ఈ మాటలు ఆ భ్రాతృవత్సలుడు భరతుడు విన్నాడు. సంతోషము అతిశయించింది. తటాలున పడిపోయినాడు. అత్యుత్కటసంతోషములో మూర్ఛపోయినాడు. ఒక ముహూర్తము సేపటికి తెప్పిరిల్లినాడు. లేచినాడు. స్వస్థ చిత్తముతో హనుమంతుణ్ణి చూచినాడు. ఆ శ్రీమంతుడు భరతుడు హనుమంతుణ్ణి గబుక్కున గట్టిగా కౌగలించుకొన్నాడు. సంతో షములో వెల్లువలై పారుతున్న కన్నీళ్ళతో హనుమంతుణ్ణి తడిపి

వేస్తూ "ఓ ప్రసన్నుడా, నీవు ఎవరవు! నీవు దేవుడవా! మనుష్యుడవా! నామీద ఎంతో దయతో ఇక్కడికి వచ్చినావు. నాకు సంతోషవార్త చెప్పినావు. ఇందుకు నీకు ఒక లక్ష గోవులనూ, ఒక నూరు గ్రామాలను కానుకగా ఇస్తున్నాను. ఇంతేకాదు. చక్కని కుండలాలతో, బంగారు వన్నెతో, చంద్రబింబాలవంటి ముఖాలతో వుండే సర్వాభరణ సంపన్నలను శుభాచారలను కులశీలవతులను పదహారుమంది కన్యలను నీకు భార్యలుగా యిస్తాను." అని చెప్పినాడు.

నిరుపమానముగా ఆ వానరోత్తముడు చెప్పిన రామాగమన వార్తను విని భరతుడు సంతోషముతో ఉప్పొంగిపోయినాడు. రాముణ్ణి చూడపోతూఉన్న సంతోషాతిశయముతో హనుమంతుణ్ణి చూచి భరతుడు ఈ విధముగా చెప్పడము మొదలు పెట్టినాడు.

౧౨౯

"ఓయీ, రాముడు నా ప్రభువు. ఎన్నో సంవత్సరాలు మహారణ్యవాసము చేసినాడు. నీవు ఇప్పుడు సంతోషకరము అయిన సంగతి చెప్పినావు. నేను విన్నాను. "బ్రతికిఉంటే నూరు సంవత్సరాలు అయిపోయినతరువాతను అయినా మానవుడు సంతోషము అనుభవిస్తాడు" అనే లోకోక్తి యథార్థము అని తోస్తూఉన్నది. చిత్రమే.

"ఓ వానరుడా, రాముడూ వానరులూ ఎట్లా కలుసుకొన్నారు! ఏ దేశములో దేనికోసము స్నేహము చేసినారు! నేను అడుగుతున్నాను. జరిగింది జరిగినట్లు చెప్పు" అని అడిగి హనుమంతుడు కూర్చుండటానికి భరతుడు ఒక బ్రుసిని (ఋషులు కూర్చుండే పీటను) ఇచ్చినాడు. హనుమంతుడు ఆ బ్రుసిమీద హాయిగా కూర్చొని "ఓ ప్రభూ, రాముణ్ణి ఎట్లా వనవాసానికి పంపించిందీ, నీ తల్లి కైకేయీదేవికి నీ తండ్రి దశరథమహారాజు ఎట్లా వరాలు ఇచ్చిందీ, నీ తండ్రి పుత్రశోకముతో ఎట్లా చనిపోయిందీ, రాజగృహపట్టణములో ఉన్న నిన్ను దూతలు వెంటనే అయోధ్యకు ఎట్లా పిలుచుకొని వచ్చిందీ రాజ్యపాలనము చేయడము నీకు ఎట్లా ఇష్టములేక పోయిందీ సత్పురుషులు ఆచరించే ధర్మముకోసము నీవు చిత్రకూట

పర్వతానికి ఎట్లావచ్చింది, రాజ్యపాలనము చేయడానికి రాముణ్ణి రమ్మని నీవు ఎట్లాఅడిగిందీ దశరథమహారాజుకు ఇచ్చిన మాటమీద నిలిచి రాముడు రాజ్యపాలనము చేయడము ఎట్లా వదులుకొన్నదీ ఆ పూజ్యుడి పాదుకలు తీసుకొని నీవు తిరిగి ఎట్లా వచ్చిందీ నా కన్నా నీకు ఎక్కువ బాగా తెలుసు.

"ఓ మహాబాహూ, నీవు రాముడి పాదుకలను తీసుకొని వెళ్లిపోయిన తరువాత జరిగిందంతా నేను చెప్పతాను. విను. నీ సైన్యాలను చూచి అక్కడ చిత్రకూటపర్వతముమీద ఉంటూ ఉన్న మృగాలూ పక్షులూ కలవరపడిపోయినవి. నీ సైన్యాల రాకపోకలవల్ల ఆ వనము అంతా గలిబిలి అయిపోయింది. సీతా రామలక్ష్మణులకు అక్కడ ఉండటానికి ఇష్టము లేకపోయింది. వారు అక్కడినుంచి బయలుదేరి దండకారణ్యానికి పోయినారు. అది జనసంచారములేని ఘోరారణ్యము. అక్కడ మదపుటేనుగులు చెట్లను విరిచి వేస్తూనూ లతలను తొక్కివేస్తూనూ తిరుగుతున్నవి. సింహాలూ,పెద్దపులులూ, జింకలూ, యథేష్టముగా విహరిస్తూ ఉన్నవి. సీతారామలక్ష్మణులు ఆ విజనారణ్యములో నడిచిపోతూ ఉండగా చేతులు పైకిఎత్తి తలవంచుకొని పెద్దపెట్టున కేకలు పెట్టుతూ ఉన్న విరాధుడు అనే రాక్షసుణ్ణి ఎట్టఎదుట చూచినారు. ఆ బలవంతుడు ఆరాక్షసుడు విరాధుడు వారిని అడ్డగించినాడు, రామలక్ష్మణులు ఆ రాక్షసుణ్ణి, అరుస్తూఉన్న ఏనుగునువలె ఒక గుంటలో పడత్రోసి, పాతిపెట్టినారు. అటువంటి దుష్కరకార్యము చేసి ఆ అన్నదమ్ములు రామలక్ష్మణులు సీతాదేవిని వెంటపెట్టుకొని అక్కడినుంచి బయలుదేరి ఆ సాయంత్రానికి శరభంగమహర్షి ఆశ్రమానికి చేరినారు. అది మనోహరము అయిన ఆశ్రమపదము. ఆనాడు శరభంగ మహాముని తన శరీరాన్ని వదిలిపెట్టి స్వర్గానికి పోవడము సీతారామలక్ష్మణులు చూచినారు. అప్పుడు అక్కడికి వచ్చిన మహర్షులకు అందరికి నమస్కారము చేసి వారివెంట బయలుదేరి జనస్థానానికి పోయినారు.

"సీతారామలక్ష్మణులు జనస్థానములో ఉంటూ ఉండగా ఒకనాడు శూర్పణఖ అనే రాక్షసి రాముడిదగ్గరికి వచ్చింది. ఆ రాక్షసి సీతాదేవిని చంపివేయపోయింది. అప్పుడు రాముడు ఆజ్ఞాపించి

వందువల్ల మహాబలవంతుడు లక్ష్మణుడు లేచి ఖడ్గము అందుకొని ఇట్టే ఆ శూర్పణఖ ముక్కూ చెవులూ తెగవేసినాడు. అందుకు అప్పుడు ఆ జనస్థానములో ఉంటూ ఉన్న భయంకరకర్ములు అయిన పధ్నాలుగు వేలమంది రాక్షసులు ఎత్తివచ్చినారు. ఆ మహాత్ముడు రాముడు ఒక్కడే ఒక్కజాము సేపటిలో (మూడు ఘడియల కాలము) వారిని అందరినీ సంహారము చేసినాడు. తపోవిఘ్నము చేస్తూ దండకారణ్యములో నివసించిన ఆ పధ్నాలుగు వేలమంది రాక్షసులు మహా బలవంతులు. అమిత పరాక్రమవంతులు. వాళ్లను అందరినీ చంపివేయడమే కాకుండా వాళ్ళరాజు అయిన ఖరుణ్ణికూడా రాముడు ఆ యుద్ధములో చంపివేసినాడు.

"చెవులూ ముక్కులూ తెగిపోయిన అమార్థురాలు శూర్పణఖ అప్పుడు లంకాపట్టణములో ఉన్న తన అన్న రావణాసురుడి దగ్గరకు పోయి జరిగింది అంతా చెప్పింది. అతడు జనస్థానానికి బయలుదేరి వచ్చినాడు. ఆ రావణాసురుడి అనుచరుడూ భయంకరుడూ అయిన మారీచుడు అనే రాక్షసుడు అప్పుడు రత్నమయము అయిన మృగరూపము ధరించి వైదేహిని వ్యామోహపెట్టినాడు. ఆమెకు ఆ జింకమీద మోజుపుట్టి దాన్ని పట్టుకోవలసిందనీ, అది తమ ఆశ్రమములో ఉండేటట్లయితే మనోహరముగా ఉంటుందిఅనీ రాముడితో చెప్పింది. అప్పుడు రాముడు ధనుర్ధరుడు అయినాడు. పరుగెత్తుతూ ఉన్న ఆ జింకవెంట పడ్డాడు. అది ఎంతసేపటికీ చిక్కకుండా పరుగెత్తుతూ ఉన్నందువల్ల రాముడు నున్నటి కణుపుల బాణము ఆ జింకమీద వదలినాడు.

"ఓ ప్రసన్నుడా, రాముడు ఆ జింకను తరుముకొని పోతూ ఉండగా రాముడికోసము లక్ష్మణుడున్నూ ఆ ఆశ్రమపదములో నుంచి వెళ్లిపోయినాడు. అప్పుడు ఎవరూ లేని ఆ సమయములో రావణాసురుడు ఆ ఆశ్రమములో చొరపడ్డాడు. ఆకాశములో అంగారకగ్రహము రోహిణిని పట్టుకొన్నట్టు, ఆ ఆశ్రమపదములో రావణాసురుడు సీతాదేవిని బలవంతముగా పట్టుకొన్నాడు. అప్పుడు ఆ సీతాదేవిని కాపాడటానికి జటాయువు అనే గద్దలరాజు అడ్డము పోయినాడు. ఆ జటాయువును రావణాసురుడు పోరాటములో చంపివేసి సీతాదేవిని బలవంతముగా ఎత్తుకొనిపోయినాడు.

"రావణాసురుడు సీతాదేవిని అట్లా ఆకాశమార్గమున ఎత్తుకొనిపోతూఉండగా ఋశ్యమూకపర్వతముమీద ఉన్న మేము వానరులము చూచినాము. ఆ లోకరావణుడు రావణుడు సీతాదేవితో లంకాపట్టణానికి పోయినాడు. సుందరమూ విశాలమూ అయిన కాంచనగృహములో ఆమెను ఉంచినాడు. మంచి మాటలు చెప్పి చూచినాడు. ఆమె అతని మాటలను గడ్డిపోచలకన్న తక్కువగా గణించింది. అతనిని ఆమె ఏమాత్రమూ లెక్కచేయలేదు. అందుకు ఆ రాక్షసరాజు ఆమెను అశోకవనములో ఉంచినాడు.

"ఆ మహారణ్యములో అప్పుడు రాముడు ఆ మాయామృగాన్ని చంపివేసి వెనుకకు మళ్లినాడు. తన ఆశ్రమపదానికి సమీపములో చచ్చి పడిఉన్న జటాయువును చూచినాడు. మహావ్యథ పడ్డాడు. సీతాదేవి ఆశ్రమములో కనబడలేదు. ఖేద పడ్డాడు. తన తండ్రికి ప్రియసఖుడు అయిన ఆ జటాయువుకు దహనసంస్కారము చేసినాడు. అంతట రాముడు లక్ష్మణుణ్ణి వెంటపెట్టుకొని సీతాదేవి కోసము గోదవరీనదీతీరాన ఉన్న పుష్పితారణ్యాలను అన్నిటినీ వెతకి చూచినాడు. ఆ సీతాదేవి వారికి కనిపించలేదు. వారు ఆ యా మహారణ్యాలను అన్నిటినీ వెతకుతూ ఉండగా కబంధుడు అనే రాక్షసుడు ఆ అన్నదమ్ములను రామలక్ష్మణులను అడ్డగించినాడు. ఆ కబంధుడు చచ్చిపోతూ చెప్పినందువల్ల రామలక్ష్మణులు ఋశ్యమూకపర్వతానికి వచ్చినారు. రాముడు సుగ్రీవుణ్ణి కలుసుకొన్నాడు. రామసుగ్రీవులు ఉభయులూ కలవకపూర్వమే వారి మనస్సులలో ఒకరిమీద ఒకరికి స్నేహము కుదిరింది. సుగ్రీవుడి అన్న వాలి. ఆ వాలికి అదివరకు కోపము వచ్చి సుగ్రీవుణ్ణి వెళ్ళకొట్టినాడు. రాముడూ సుగ్రీవుడూ పరస్పరము మాట్లాడుకొన్నారు. వారు గాఢస్నేహితులు అయినారు. అప్పుడు రాముడు తన భుజపరాక్రమముతో సుగ్రీవుడికి వానరరాజ్యము ఇప్పిస్తాను అని వాగ్దానము చేసినాడు. అంతట రాముడు ఆ మహాబలవంతుణ్ణి మహాకాయుణ్ణి వాలిని యుద్ధములో చంపివేసినాడు. వానరరాజుగా సుగ్రీవుణ్ణి రాముడు స్థాపించినాడు. అంతట సుగ్రీవుడు సీతాదేవిని వెదకవలసింది అని పదికోట్లమంది వానరవీరులను

ఆజ్ఞాపించినాడు. ఆ వానరవీరులు ఆ యా దిక్కులలో సీతాదేవిని వెదకటానికి పోయినారు.

"మేము వింధ్యపర్వతానికి దక్షిణదిక్కున చాలాదూరము పోయినాము. కాలము గతించిపోయింది. మేము దిగులుతో బాధ పడుతూ ఉండగా జటాయువు అన్న సంపాతి మాకు కనిపించినాడు. సీతాదేవి లంకాపట్టణములో రావణాసురుడి ఇంట్లో ఉంది అని ఆ సంపాతివల్ల మాకు తెలిసింది. నావాళ్ళ దిగులు నేను పోగొట్ట తలచినాను. నేను అప్పుడు నా పరాక్రమముతో విజృంభించి నూరు యోజనాల సముద్రాన్ని లంఘించినాను. లంకాపట్టణము చేరినాను. అశోకవనములోకి పోయినాను. అదివరకు ఆశ్రమములో కట్టుకొని ఉన్న పట్టుచీరతోనే సీతాదేవి అక్కడ కనిపించింది. నిరానంద గానూ మలినాంగిగానూ దృఢవ్రతగానూ ఉన్న ఆ సీతాదేవిని నేను చూచినాను.

"నేను ఆమెను యథావిధిగా సందర్శించినాను. రాముడు నాచేతికి ఇచ్చి పంపించిన కాంతిమంతమూ మహామణిమయమూ అయిన ఉంగరాన్ని ఆమెకు గుర్తుగా ఇచ్చినాను. ఆ అనిందితు రాలిని అడిగి సమస్తమూ తెలుసుకొన్నాను. ఆమె నాకు గుర్తుగా ఇచ్చిన చూడామణిని తీసుకొని చరితార్థుణ్ణి అయి తిరిగి వచ్చినాను. ఆమె గుర్తుగా ఇచ్చిన కాంతిమంతయు అయిన ఆ చూడామణిని రాముడికి ఇచ్చినాను. సీతాదేవి క్షేమము రాముడు విన్నాడు. ప్రాణము పోతున్నవాడు అమృతము తాగి జీవించినట్టు సీతాదేవి క్షేమవృత్తాంతము విని రాముడు సంతోషాతిశయములో విజృం భించినాడు. రావణాసురుణ్ణి సంహారము చేసివేయడానికి యుద్ధ ప్రయత్నాలు అన్నీ చేసినాడు. ప్రళయకాలములో సమస్త లోకాలనూ దహించివేసే అగ్నిహోత్రుడివలె రాముడు శత్రు సంహారానికి బయలుదేరినాడు. వానరసైన్యాలతో సముద్రతీరానికి చేరినాడు. ఆ సముద్రానికి నలుడిచేత సేతువు కట్టించినాడు. ఆ సేతువుమీద మనుష్యులను అందరినీ దాటించి తీసుకొనిపోయి లంకా పట్టణాన్ని ముట్టడించినాడు. రాక్షస సేనానాయకుణ్ణి ప్రహస్తుణ్ణి వానరవీరుడు నీలుడూ కుంభకర్ణుణ్ణి రాముడూ ఇంద్రజిత్తును లక్ష్మ

గుడూ సంహారము చేసివేసినాడు. ఆ తరువాత రావణాసురుణ్ణి రాముడే సంహారించివేసినాడు.

౧౩౦

హనుమంతుడు పరమానందకరముగా చెప్పింది అంతా ఆ పర వీరహంత ఆ అమోఘపరాక్రమవంతుడు భరతుడు విని తనవలె సంతోషపడుతూవున్న శత్రుఘ్నుణ్ణి చూచి "తమ్ముడా, ఇప్పుడు అయోధ్యానగర దేవాలయాలలో దేవతలను పూలదండలతో అలంకరించవలెను. సుగంధధూపాలు వేయవలెను. మంగళ వాద్యాలు మోగించవలెను. పరిశుద్ధులు అయిన బ్రాహ్మణులను అర్చించవలెను. పురాణజ్ఞులూ, స్తోత్రపాఠకులూ అయిన సూతులూ మేలుకొలుపులు పాడే వైతాళికులూ వివిధవాద్యగాండ్రూ ఆట కత్తెలు అయిన నట్టువరాండ్రూ సమూహాలు సమూహాలుగా రామ ప్రభువును సందర్శించటానికి బయలుదేరి రావలెను" అని చెప్పి నాడు.

అంతట శత్రుసంహారకుడు శత్రుఘ్నుడు రామసందర్శనానికి ఆ యా ఏర్పాట్లను చేయించటానికి మొదలుపెట్టినాడు. అనేక వేలమంది కూలివాండ్లను పిలిపించినాడు. నందిగ్రామమునుంచి అయోధ్యానగరమువరకున్నూ చతురంగబలాలూ, మహాజన సమూహాలూ హాయిగా నడవటానికి మిట్టపల్లాలు సమమట్టము చేసేటందుకు కొంతమందిని నియోగించాడు. మార్గము అంతటా మంచువంటి చల్లని నీళ్లతో తడపటానికి కొంతమందినీ ఆ మార్గములో పేలాలు చల్లి పూలతో అలంకరించటానికి మరికొంతమందినీ నియ మించినాడు. సూర్యోదయము అయ్యేలోపల అయోధ్యానగర రథ్యలలోనూ, రాజవీధులలోనూ పతాకాలు ఎత్తవలసింది అనీ ప్రతిగృహాన్నీ శోభాయమానముగా అలంకరించవలసింది అనీ, రాజ వీధిలో పూలదండల తోరణాలు కట్టి, విడిపూలు అలంకారముగా చల్లి అయిదురంగుల ముగ్గులు పెట్టవలసింది అనీ, సుగంధధూపాలు పట్టణముఅంతటా వేయవలసింది అనీ అయోధ్యావాసులకు అప్పుడు శత్రుఘ్నుడు తెలియచేసినాడు.

ఆ తెల్లవారుజామున అయోధ్యాపట్టణమునుంచి దశరథ మహారాజు భార్యలూ అమాత్యులూ సైనికులూ సైనికులభార్యలూ రాజన్యులూ బ్రాహ్మణులూ శ్రేణీముఖ్యులూ రామదర్శనము చేయటానికి గుంపులు గుంపులుగా బయలుదేరినారు. అమాత్యులు అయిన ధృష్టి జయంతుడూ సిద్ధార్థుడూ అర్థసాధకుడూ అశోకుడూ మంత్రపాలుడూ సుమంతుడూ బంగారు ఆభరణాలతో అలంకరించిన మదపుటేనుగులమీద బయలుదేరినారు. బంగారు మోకులు నడుములకు కట్టినారు. మదపుటేనుగులమీదనూ, వాటి పార్శ్వాన ఆడ ఏనుగు గున్నలమీదనూ రాజపురుషులూ మంచి మంచి గుర్రాలు కట్టిన రథాలమీద మహారథులూ బయలుదేరినారు. శక్తులూ అష్టులూ ప్రాసాలూ అనే ఆయుధాలు చేతుల్లో పట్టుకొని వీర పురుషులూ ధ్వజాలూ పతాకాలూ పట్టుకొని వేలకువేలు పదాతులూ వారివెంట మంచి మంచి గుర్రాలమీద అశ్వికులూ బయలుదేరినారు. కౌసల్యా సుమిత్రలూ వారితోపాటు కైకేయీదేవీ వాహనాలమీద బయలుదేరినారు. వారివెనుక వాహనాలమీద దశరథమహారాజు తక్కినభార్యలుఅందరూ నందిగ్రామానికిపోయినారు. అప్పుడు నడచిన గుర్రాల గిట్టల చప్పుళ్ళూ రథచక్రాల ధ్వనులకూ శంఖదుందుభుల మోతలకూ భూమి అంతా కంపించిపోతూఉన్నట్లుగా తోచింది.

శంఖాలు పూరిస్తూ భేరీలు మోగిస్తూఉంటే వందిమాగధులు మంగళగానము చేస్తూ ముందు బయలుదేరినారు. వారివెనుక వల్కలాలు కట్టుకొని కృష్ణాజినము కప్పుకొన్న ఆ ధర్మకోవిదుడు, ఉపవాసాలతో కృశించిపోయిన ఆ దీనుడు, అంతకుముందు రామాగమనవార్త విన్న ఆ మహాత్ముడు భరతుడు రామపాదుకలు శిరస్సున పెట్టుకొని రామదర్శనార్థము బయలుదేరినాడు. తెల్లని పూలదండలతో శోభిస్తూన్న శ్వేతఛత్రాన్నీ రాజార్హమూ హేమభూషితమూ అయిన వింజామరలనూ తీసుకొని రాజపురుషులూ పూలదండలూ మోదకాలూ చేతులలో పట్టుకొని అమాత్యులూ బ్రాహ్మణ ముఖ్యులూ వర్తక శ్రేష్ఠులూ శ్రేణీముఖ్యులూ రామదర్శనార్థము భరతుడివెంట నడిచినారు.

తెల్లవార వచ్చింది. రాముడిజాడ ఏమీ కనిపించలేదు. అందరూ ఆతురపడసాగినారు. భరతుడున్నూ నిరీక్షించి ప్రక్కను

ఉన్న హనుమంతుణ్ణి చూచి "ఓ వాయుపుత్రుడా, ఆ పూజ్యుడు ఆ పరంతపుడు రాముడు వస్తూ ఉన్నజాడ తెలియడము లేదు. కామరూపులైన వానరులు అయినా కనపడటము లేదే. నాయనా, నీవు వానరసంబంధము అయిన చలచిత్తముతో రాముడు వస్తూ ఉన్నాడని నాతో చెప్పలేదుకదా" అని అడిగినాడు.

రామాదులు రావటానికి ఎందుకు ఆలస్యము అయిందీ చెప్ప తలచుకొని హనుమంతుడు "ఓ పరంతపా, చూడు, భరద్వాజుడు అనుగ్రహించినందువల్ల వృక్షాలు అన్నీ ఇప్పుడు పూలు పూస్తున్నవి. పండ్లు పండుతున్నవి. ఆ యా చెట్లనుంచి తేనెలు కారుతున్నవి. తుమ్మెదలు మత్తెక్కి ఝంకారము చేస్తున్నవి. రాముడు అడిగినందువల్ల భరద్వాజమహర్షే కాకుండా దేవేంద్రుడున్నూ వానరులు ఎక్కడఉంటే అక్కడ అన్ని వృక్షాలూ అన్ని కాలాలలోను పుష్పఫలప్రదము అయ్యే వరము ఇచ్చినాడు. ఆ యా చెట్లపండ్లకు ఆశపడి వానరులు ఆలస్యము చేసి ఉండవచ్చును. అంతేకాదు, భరద్వాజమహర్షి రాముడికి సైన్యసమేతంగా అతిథి సత్కారము చేస్తాను అని చెప్పినాడు. అందుకే నిన్నటి దినము ప్రయాణము కాకుండా రామాదులను ఆపివేసినాడు. ఒకవేళ ఆ కారణమువల్ల ఆలస్యము అయి ఉండవచ్చును.

"ఓ పరంతపా, అదుగో విను. వానరులు ఎంత భయంకరముగా గర్జిస్తున్నారో, ఆలకించు, అవి వానరుల సంతోషధ్వనులు. వానరసైన్యము ఇప్పుడు గోమతీనదిని దాటుతున్నది అనితోస్తున్నది. అదుగో చూడు, పైకి ఎంతో ఎత్తున దుమ్ము రేగింది. దుమ్మువాన కురుస్తున్నట్టుగా కనపడుతున్నది. ఇప్పుడు వాలుకీనదిని వానరసైన్యము దాటుతున్నది అనుకొంటాను. అదుగో, అదుగో చూడు. వానరసైన్యము సాలవనములో ప్రవేశించింది. ఆకాశవీధిలో నిర్మలముగా చంద్రమండలమువలె అదుగో దూరముగా కనుపడుతున్నది చూడు. అదే పుష్పకవిమానము. దానిని పూర్వము విశ్వకర్మ బ్రహ్మదేవుడి కోసము నిర్మించినాడు. దానిని ఆ బ్రహ్మదేవుడు కుబేరుడికి అనుగ్రహించినాడు. ఆ కుబేరుణ్ణి కొట్టి రావణాసురుడు తనకోసము లంకాపట్టణానికి ఆ దివ్యవిమానాన్ని ఎత్తుకొనివచ్చినాడు. ఆ రావణాసురుణ్ణి సబాంధవముగా సంహారము చేసి రాముడు ఇప్పుడు ఆ

విమానముమీద వస్తూఉన్నాడు. చూడు. అది తరుణాదిత్య కాంతులతో తేజరిల్లుతూ మనోవేగముతో వస్తున్నది. అదుగో ఆ విమానములో సీతారామలక్ష్మణులు. అదుగో వారి ప్రక్కను మహాతేజోవంతుడు వానరరాజు సుగ్రీవుడూ రాక్షసరాజు విభీషణుడూ ఉన్నారు'' అని చెప్పినాడు.

ఇట్లా హనుమంతుడు భరతుడితో చెప్తూఉండగా అందరూ ఆ విమానమువంక చూచి ''అదుగో రామప్రభువు! అదుగో రామప్రభువు'' అంటూ కేకలువేసినారు. స్త్రీలూ పిల్లలూ యువకులూ వృద్ధులూ సంతోషాతిశయముతో ''రాముడు వస్తూఉన్నాడు. రాముడు వస్తూఉన్నాడు'' అంటూ ఆకాశము అంటేట్టు కేకలుపెట్టినారు. అంతట ఆ యోధులు రథాలమీదినుంచీ గుర్రాలమీదినుంచీ ఏనుగులమీదినుంచీ దిగి నేలమీద నిలుచొని ఆకాశములో చంద్రునివలె విమానములో ఉన్న రాముణ్ణి చూచినారు.

నేలమీదికి దిగుతూ ఉన్న ఆ విమానములో రాముణ్ణి చూచి ''అన్నా, నీవు నీప్రతిజ్ఞ తప్పకుండా వచ్చినావు'' అంటూ, భరతుడు సంతోషాతిశయముతో చేతులు జోడించి స్వాగతము చెప్పినాడు. ఆ విశాల దీర్ఘ నేత్రుడు రాముడు అప్పుడు ఆ దివ్యవిమానములో దేవేంద్రుడివలె తేజరిల్లినాడు. ఆ విమానములో ఉన్న రాముడు అప్పుడు మేరుపర్వతముమీద సూర్యుడివలె విరాజిల్లినాడు. అమిత వేగముతో ఆకాశములో పోయే ఆ విమానము హంస ప్రతిమలతో భాసిస్తూ అప్పుడు నేలమీద వాలింది. ఆ అమోఘ పరాక్రమవంతుడు భరతుడు అంతట ఆ విమానము ఎక్కి రాముణ్ణి సమీపించి సంతోషాతిశయముతో సాష్టాంగనమస్కారము చేసినాడు. అంతకాలానికి కనిపించిన ఆ తమ్ముణ్ణి భరతుణ్ణి రాముడు లేవనెత్తి కౌగలించుకొన్నాడు. ఆ తరువాత భరతుడు లక్ష్మణుణ్ణి సంభాషించినాడు. సంతోషాతిశయముతో తనపేరు చెప్పుకొని సీతాదేవికి నమస్కారము చేసినాడు.

ఆ కైకేయీపుత్రుడు భరతుడు అంతట సుగ్రీవుణ్ణి జాంబవంతుణ్ణి అంగదుణ్ణి మైందద్వివిదులనూ నీలుణ్ణి ఋషభుణ్ణి శరభుణ్ణి పనసుణ్ణి సుషేణుణ్ణి సంభావించి వరుసగా వారిని కౌగలించుకొన్నాడు. మానవరూపము ధరించిన ఆ కామరూపులు వానరులు

అందరూ సంతోషాతిశయముతో భరతుణ్ణి కుశలప్రశ్న చేసినారు. అప్పుడు భరతుడు వానరరాజు సుగ్రీవుణ్ణి కౌగలించుకొని "ఓ సుగ్రీవుడా, మా నలుగురి అన్నతమ్ములకున్నూ నీవు అయిదవవాడవు. ఆపత్కాలములో సాయపడ్డవాడే మిత్రుడూ స్నేహితుడూన్నూ. అపకారము చేసినవాడు శత్రువు అవుతాడు" అని చెప్పినాడు. అంత విభీషణ్ణి చూచి ఎంతో మంచిగా "ఓ మిత్రుడా నీవు, దైవవశమువల్ల మాఅన్నకు సహాయపడ్డావు దుష్కరమైనకార్యము చేసినావు" అని చెప్పినాడు.

శత్రుఘ్నుడు అప్పుడు రామలక్ష్మణులకు నమస్కారము చేసి అణకువతో సీతాదేవి పాదాలకు ప్రణమిల్లినాడు. రాముడు అప్పుడు దిగులుతో చిక్కిపోయిన తన తల్లిని కౌసల్యాదేవిని చూచి ఆమె మనస్సు ప్రసన్నము అయ్యేట్టుగా సాష్టాంగనమస్కారము చేసినాడు. ఆ తరువాత సుమిత్రాదేవికిన్నీ ఆ యశస్వినికి కైకేయీదేవికిన్నీ తక్కిన తల్లులకున్నూ నమస్కారము చేసినాడు. అక్కడికి వచ్చిన పురోహితుడికి వశిష్ఠమహర్షికి పాదాభివందనము చేసినాడు.

అప్పుడు అయోధ్యాపౌరులు అందరూ రాముడిదగ్గరికి పోయి చేతులు జోడించి "ఓ మహాభాగా, ఓ కౌసల్యానందవర్ధనా, నీకు స్వాగతము" అని చెప్పినారు. అట్లా చెప్పి తామరమొగ్గలవలె చేతులు జోడించి అట్లా నిలుచుని ఉన్న వేలకొద్దీ ఆ పౌరులను రాముడు ప్రసన్నముగా చూచినాడు.

ఆ ధర్మవిదుడు భరతుడు అప్పుడు రామపాదుకలను స్వయముగా రాముడి పాదాలకు తొడిగి చేతులు జోడించి "ఓ రాజా, నీ రాజ్యాన్ని నేను ఇల్లడముగా కాపాడినాను. నీరాజ్యాన్ని నీకు ఇప్పుడు మళ్లీ ఒప్పగించినాను. నీవు మళ్లీ అయోధ్యానగరానికి రాజుగా వచ్చినావు. ఇప్పుడు నా జన్మ సఫలమైంది. నా మనోరథము ఈడేరింది. ఓ ప్రభూ, నీ పట్టణాన్ని, నీ సైన్యాన్ని చూచుకో. నీ కోశాగారాన్ని నీ ధాన్యాగారాన్ని పరిశీలించు. నేను నీ ప్రభావమువల్ల సమస్తాన్ని పదింతలుగా పెంచినాను" అని విన్నవించినాడు.

ఆ భ్రాతృవత్సలుణ్ణి భరతుణ్ణి చూచి వానరులూ రాక్షసరాజు విభీషణుడూ ఆనందబాష్పాలు వదిలినారు. అప్పుడు రాముడు సంతో

నముతో భరతుణ్ణి దగ్గరకు తీసుకొని ఒడిలో కూర్చుండ పెట్టుకొని తన పరివారముతో కూడా ఆ పుష్పకవిమానముమీద భరతాశ్రమానికి పోయినాడు. నందిగ్రామములో భరతాశ్రమము దగ్గరకు పోగానే రాముడు తనపరివారముతో కూడా ఆ విమానములో నుంచి దిగి భూమిమీద నిల్చున్నాడు. అంతట ఆ పుష్పకవిమానమువంక చూచి "ఓ విమానమా, నీకు నేను అనుజ్ఞ ఇస్తున్నాను. ఇక నీవు పోయి ఆ కుబేరుడికి వాహనముగా ఉండు" అని రాముడు అన్నాడు. రామానుజ్ఞతో ఆ విమానము అప్పుడు ఉత్తర దిక్కుగా పోయి కుబేర భవనము చేరింది.

బృహస్పతి పాదాలకు నమస్కారముచేసి ఆ దేవపురోహితుణ్ణి కూర్చుండ పెట్టి తాను శుభాసనముమీద కూర్చుండే దేవప్రభువు దేవేంద్రుడివలె అప్పుడు తనకు అనురూపపురోహితుడు అయిన వశిష్ఠమహర్షి పాదాలకు నమస్కారము చేసి ఆయనను ఒక శుభాసనముమీద కూర్చుండపెట్టి మరిఒక సుభాసనముమీద రాముడు కూర్చొన్నాడు.

౧౩౧

కైకేయ్యానందవర్ధనుడు భరతుడు శిరస్సున చేతులు జోడించి ఆ అమోఘపరాక్రముణ్ణి తన జ్యేష్ఠభ్రాతను రాముణ్ణి చూచి "ఓరామా, నీవు మా అమ్మను గౌరవించినావు. అందు కోసము వనవాసము చేసినావు. నాకు ఈ రాజ్యము ఇచ్చినావు. నీవు నాకు ఎట్లా ఇచ్చినావో అట్లాగే నీ రాజ్యాన్ని ఇప్పుడు నీకు నేను ఇచ్చివేస్తున్నాను. పెద్దబలవంతమైన ఒక ఎద్దు మోసే భారాన్ని ఒక లేగదూడ మోయలేదు. రాజ్యపాలనము అనే ఈ మహాభారాన్ని మోసేశక్తి నాకు లేదు. మహాజలప్రవాహ వేగానికి గండ్లుపడి కారిపోతున్న ఆనకట్టకు ఆకులూ చెట్లకొమ్మలూ ఇంత గడ్డీ వేసి అడ్డగిస్తేనే ఆ ఆనకట్ట నిలుస్తుంది. అదేవిధముగా ఎన్నో ఛిద్రాలతో కూడుకొన్న ఈ రాజ్యాన్ని మంత్రమూ గోపనమూ మొదలైన శక్తులతో పరిపాలిస్తేనే నిలుస్తుంది. నాకు అంతశక్తి లేదు. నీకున్న సామర్థ్యము నాకు లేదు. హంస మాదిరిగా కాకి ఎగిరిపోలేదు. గుర్రము మాదిరిగా గాడిద

పనిగత్తలేదు. ఓ రామా, నీవు అరిందముడవు. మహాప్రభావము కలవాడవు. నీమాదిరిగా రాజ్యపాలనముచేసే శక్తికానీ సామర్థ్యముకానీ నాకు లేదు.

“ఓ మహాబాహూ, ఇంట్లో ఒక చెట్టునాటితే అది పెరిగి పెద్దదిఅయి పెద్దమానుకట్టి పెద్ద పెద్ద కొమ్మలు వేసి పూలు పూసి ఆ తరువాత పండ్లు పండకపోయేటట్లయితే, ఆ చెట్టువేసినవాడివలెనే ఇప్పుడు నీవు మమ్ములను రాజ్యపాలనము చేయకపోయినట్లయితే మేమూ అయిపోతాము. ఇది ఉపమానముగా చెప్పుతున్నాను. దీని అర్థము నీకు నేను వివరించనక్కరలేదు. మేము నీభక్తులము. నీ భృత్యులము. మమ్ములను నీవు పరిపాలించవలెను. కాపాడవలెను.

“ఓ రాజా, నీవు ఇప్పుడు రాజ్యాభిషేకము చేసుకొని మట్ట మధ్యాహ్న సూర్యునివలె మహాతేజముతో తేజరిల్లడము ఈ లోకము అంతా చూడవలెను. ఓ రామా, నీవు ఇంతవరకూ ఘోరారణ్యాలలో భయంకర మృగారావాలకు మేలుకొంటూ వచ్చినావు. ఇకనుంచి వివిధవాద్యాలు మోగుతూ ఉంటే, స్త్రీలు అందెల చప్పుళ్ళూ, మొలనూళ్ళ చప్పుళ్ళూ చేస్తూఉంటే, మనోహర సంగీతాలాపాలు వింటూ మేలుకొనవలెను. జ్యోతిశ్చక్రము ఎంతకాలము తిరుగుతూ ఉంటుందో ఈ భూమి ఎంత కాలము ఉంటుందో అంతకాలమూ నీవు ఇక్కడ ప్రభువుగా సమస్తమూ పరిపాలించవలెను” అని చెప్పినాడు.

భరతుడు చెప్పిన ఈ మాటలకు పరపురంజయుడు ఆ రాముడు “అట్లాగేను” అన్నాడు. అంతవరకూ చేతులు జోడించి నిలుచొని ఉన్న భరతుడు అప్పుడు ఒక శుభాసనముమీద కూర్చొన్నాడు.

అంతట శత్రుఘ్నుడి ఆజ్ఞను శిరసావహించి సుఖముగానూ వేగముగానూ పనిచేసే క్షౌరకులు వచ్చినారు. వారు పట్టాభిషేక సమయము అతిక్రమించకుండా రామలక్ష్మణభరతుల గడ్డాలనూ మీసాలనూ తీర్చి దిద్దినారు. ముందుగా భరతుడు మంగళ స్నానము చేసినాడు. ఆ తరువాత మహాబలవంతుడు లక్ష్మణుడూ అతని తరువాత వానరరాజు సుగ్రీవుడూ రాక్షసరాజు విభీషణుడూ మంగళస్నానాలు చేసినారు. జడలు కట్టుకొని పోయిన తల

వెంద్రుకలు అన్నీ చిక్కుతీసిన తరువాత రాముడు మంగళ స్నానము చేసినాడు. చందనాది మైపూతలతోనూ రంగు రంగుల పూలదండలతోనూ మహార్హవస్త్రాలతోనూ రాముణ్ణి అలంకరించినారు. అప్పుడు దివ్యకాంతులతో జ్వలిస్తూ ఉన్న సింహాసనము మీద రాముడుకూర్చున్నాడు. శత్రుఘ్నుడు రామలక్ష్మణభరతులకు హారకేయూరాదులతో అలంకారము చేయించినాడు. దశరథ మహారాజు భార్యలు అందరూ మంచిమనస్సుతో సీతాదేవిని స్నానము చేయించి స్వయముగా అలంకరించినారు పుత్రలాలస అయిన కౌసల్యాదేవి అంతట ఎంతో సంతోషముతో అవసరము అయిన ఏర్పాట్లుఅన్నీ చేయించి వానరాంగనలకు అందరికీ శోభాయమానము అయిన అలంకారాలు చేయించింది.

శత్రుఘ్నుడి ఆజ్ఞను అనుసరించి సుమంత్రుడు గుర్రాలు పూన్చి సర్వాంగసుందరము అయిన రథాన్ని తోలుకొని వచ్చినాడు. సూర్యమండలము వంటి ఆ దేదీప్యమాన దివ్యరథము మీద ఆ మహాబాహువు ఆ అమోఘపరాక్రమవంతుడు రాముడు ఎక్కినాడు. దివ్యవస్త్రాలు ధరించి ధగధగలాడే కుండలాలు పెట్టుకొని దేవేంద్రుడివంటి కాంతులతో తేజరిల్లుతూ హనుమంతుడూ సుగ్రీవుడూ ఆ రథము వెంట అయోధ్యకు బయలుదేరినారు. వారి వెనుక సీతాదేవితో, అందమైన కుండలాలు పెట్టుకొన్న వరాభరణ సంపన్నలు సుగ్రీవుడి భార్యలు అందరూ అయోధ్యానగరము చూడపోతూ ఉన్న వేడుకతో బయలుదేరినారు.

సీతారామలక్ష్మణభరతశత్రుఘ్నులకన్నా ముందుగా దశరథమహారాజుభార్యలు అందరూ మంత్రులు అందరితోనూ కలసి అయోధ్యాపట్టణానికి పోయినారు. అప్పుడు దశరథ మహారాజుమంత్రులు అశోకుడూ విజయుడూ సుమంత్రుడూ వసిష్ఠ మహర్షిని పురస్కరించుకొని ఇక నప్పుడు చేయవలసిన పనులను గురించీ రామాభివృద్ధినిగురించీ అయోధ్యానగరాభివృద్ధినిగురించీ ఆలోచించినారు. ఆ మహాత్ములు రాముడి అభిషేకముకోసము ముందుగా ఏ యే శుభకర్మలు చేయవలెనో వాటిని అన్నిటినీ చేయించవలసింది అని వసిష్ఠమహర్షితో చెప్పి మంత్రులు అందరూ

మళ్ళీ అయోధ్యాపట్టణము నుంచి బయలుదేరి రాముడికి ఎదురుకోలు చెప్పటానికి పోయినారు.

ఆకుపచ్చని గుర్రాలు పూన్చిన రథముమీద వచ్చే సహస్రాక్షుడు దేవేంద్రుడివలె అప్పుడు రాముడు రథముమీద అయోధ్యానగరానికి వస్తూ ఉన్నాడు. ఆ రథసారథ్యము చేయటానికి గుర్రాల పగ్గాలు భరతుడు పట్టుకొన్నాడు. శత్రుఘ్నుడు రాముడికి గొడుగు వేసినాడు. లక్ష్మణుడు ముందర నిలుచొని విసనకర్రతో రాముడి శిరస్సుమీద విసురుతూ రెండవ చేతిలో ఒక వింజామరను పట్టుకొన్నాడు. చంద్రుడివంటి మరిఒక వింజామరను రాక్షసరాజు విభీషణుడు పట్టుకొన్నాడు. అప్పుడు ఆకాశములో మహర్షిగణాలూ, మరుద్గణాలు, దేవగణాలు, రాముణ్ణిగురించి చేసిన మనోహరస్తోత్రధ్వనులు వినిపించినవి. వానరరాజు సుగ్రీవుడు పర్వతము అంత ఎత్తుగఉన్న శత్రుంజయుడు అనే ఏనుగును ఎక్కి ఆ రథమువెంట పోయినాడు. మానవరూపము ధరించి సమస్తాభరణాలతో అలంకరించుకొన్న వానరవీరులు తొమ్మిదివేల ఏనుగుల మీద ఆ రథమువెంట బయలుదేరినారు. అప్పుడు ప్రజలు సంతోషాతిశయముతో శంఖాలు పూరిస్తూ దుందుభులు మోగిస్తూ ఉంటే ఆ పురుషశార్దూలము రాముడు రమ్యహర్మ్యపంక్తులు చూస్తూ అయోధ్యానగరము ప్రవేశించినాడు. పరివారపురస్సరముగా రథముమీద వస్తూఉన్న ఆ అతిరథుణ్ణి రాముణ్ణి అప్పుడు మంత్రులు అందరూ చూచినారు. జయము ఆశీర్వదించినారు. ఆ మంత్రులను అందరినీ అభినందించి వారివెంట ఆ మహాత్ముడు రాముడు తన తమ్ములతో అయోధ్యాపట్టణములోకి పోయినాడు. మంత్రులూ బ్రాహ్మణులూ ప్రజలూ మొదలైనవారి అందరి మధ్యను అప్పుడు రాముడు నక్షత్రాలమధ్యను ఉన్న చంద్రుడివలె విరాజిల్లినాడు.

చతుర్విధ వాద్యాలు మోగిస్తూ కొందరూ తాళాలూ స్వస్తికాలూ చేతులతో మోగిస్తూ కొందరూ మంగళగానము చేస్తూ కొందరూ మోదకాలు తీసుకొని రాజపురుషులూ పసుపురంగు అక్షతలు తీసుకొని బ్రాహ్మణులూ కన్నెపడుచులూ రాముడి ముందుగా నడచినారు. ఆవులున్నూ రాముడి ముందు నడచినవి. సుగ్రీవుడి

సఖ్యాన్ని గురించీ హనుమంతుడి ప్రభావాన్ని గురించీ వానరులు చేసిన మహత్తర కార్యాలనుగురించీ రాక్షసుల బలాతిశయాన్ని గురించీ విభీషణుడు వచ్చి తనతో చేరడాన్ని గురించీ రాముడు అప్పుడు తన వెంటవున్న మంత్రులతో చెప్పినాడు. ఆ వృత్తాంతము అంతా విని ఆ మంత్రులూ అయోధ్యాపౌరులూ ఆశ్చర్యపోయినారు. అట్లా ఆ యా విషయాలు అన్నీ చెప్పుతూ రాముడు వానరవీరులను వెంట పెట్టుకొని పౌరులు అందరూ సంతోషముతో ఓలలాడుతున్న అయోధ్యానగరములోకి వచ్చినాడు. అయోధ్యలో ఇంటింటా పతాకలు ఎత్తినారు. ఇక్ష్వాకువంశీయులు తన పితృపితామహులు నివసించిన రాజభవనములోకి అప్పుడు ఆ రఘువంశలలాముడు రాముడు పోయినాడు. ఆ రాజభవనములోకి పోయే పోవడముతో కౌసల్యా సుమిత్రా కైకేయీలకు నమస్కారము చేసినాడు. పరమ ధార్మికుడు అయిన తన తమ్ముణ్ణి భరతుణ్ణి చూచి అర్థవంతముగా "తమ్ముడా, మన ఆవరణలో అశోకవనముప్రక్కను ముత్యాలు వైదూర్యమణిఖచితమైన నా మందిరములో ఈ సుగ్రీవుణ్ణి విడిది చేయించు." అని చెప్పినాడు.

ఆ సత్యపరాక్రముడు భరతుడు సుగ్రీవుడి చెయ్యిపట్టుకొని ఆ రామమందిరానికి తీసుకొనిపోయినాడు. అప్పుడు ఆ మందిరంలో శత్రుఘ్నుడు తైలదీపాలూ పర్యంకాలూ వాటిమీద పరిచే ఆస్తరణాలూ అమర్చినాడు. సుగ్రీవుడు ఆ భవనములో సుఖముగా విడిది చేసినాడు.

ఆ మహాతేజోవంతుడు భరతుడు ఆ తరువాత కొంతసేపటికి ఆ భవనములో సుగ్రీవుణ్ణి చూచి "ఓ వానరరాజా, నీవు రామాభిషేకముకోసము ఇప్పుడు సముద్రజలాలు తెప్పించవలెను" అని చెప్పినాడు. అప్పుడు సుగ్రీవుడు నలుగురు వానరవీరులను పిలిచినాడు. నానారత్నభూషిత కాంచనకలశాలను నాలుగింటిని ఆ నలుగురి చేతికి ఇచ్చి తెల్లవారేలోపల నాలుగు సముద్రాల జలాలనూ తెమ్మని ఆజ్ఞాపించినాడు. వారికోసము అందరూ ఎదురు చూస్తూ ఉంటారు అని కూడా ఆ వానరవీరులతో చెప్పినాడు. అది సుగ్రీవాజ్ఞ. పెద్ద పెద్ద ఏనుగులవంటి ఆ నలుగురు వానరవీరులు గరుత్మంతుడి

వలె అప్పటికి అప్పుడు ఆకాశానికి ఎగిరి నాలుగు దిక్కులకూ సముద్ర జలాలు తేవడానికి పోయినారు.

ఆ నలుగురే కాకుండా అప్పుడు జాంబవంతుడూ, హనుమంతుడూ ఋషభుడూ వేగదర్శి పోయి ఐదువందల నదులజలాలను కాంచనకలశాలలో పట్టుకొని వచ్చినారు. సత్వసంపన్నుడు సుషేణుడు రత్నభూషిత కాంచనకలశమునిండా పూర్వసముద్ర జలాన్ని తీసుకొనివచ్చినాడు. ఋషభుడు (నదీజలాలు తెచ్చిన ఋషభుడు కాడు) బంగారుకలశమునిండా దక్షిణసముద్రజలాలను ముంచుకొని అవి చిందిపోకుండా రక్తచందన వృక్షశాఖలు ఆ కలశానికి మూతగా పెట్టి అమిత వేగముతో వచ్చినాడు. వాయువేగముతో పోయే గవయుడు రత్నఖచిత కాంచనకలశమునిండా పశ్చిమ సముద్రము నుంచి శీతలోదకాలను తెచ్చినాడు. గరుత్మంతుడి వేగముతోనూ వాయువేగముతోనూ పోయే నలుడు బంగారుకలశము నిండా ఉత్తరసముద్రజలాలను తెచ్చినాడు.

రామాభిషేకముకోసము వానరవీరులు బంగారుకలశాల నిండా పుణ్యోదకాలు తేవడముచూచి శత్రుఘ్నుడు ఆ విషయము వసిష్ఠమహర్షికిన్నీ బంధుజనులకున్నూ విన్నవించినాడు.

అంతట వసిష్ఠమహర్షి బ్రాహ్మణులను వెంటపెట్టుకొని సీతాసమేతముగా రాముణ్ణి రత్నమయపీఠముమీద కూర్చుండ పెట్టినాడు. అష్టవసువులు దేవేంద్రుణ్ణి అభిషేకించినట్టుగా అప్పుడు వసిష్ఠుడూ వామదేవుడూ జాబాలీ కాశ్యపుడూ కాత్యాయనుడూ సుయజ్ఞుడూ గౌతముడూ విజయుడూ అనే ఎనిమిదిమంది మహర్షులూ సుగంధము గుబాళిస్తూ ఉన్న నిర్మలోదకాలతో ఆ నరశార్దూలానికి రాముడికి అభిషేకము చేసినారు. ఆ తరువాత ఋత్విక్కులచేతనూ బ్రాహ్మణోత్తముల చేతనూ పెండ్లికాని కన్యపడుచుల చేతనూ మంత్రులచేతనూ వర్తకుల చేతనూ పౌరముఖ్యులచేతనూ యోధులచేతనూ సంతోషముగా వసిష్ఠాది మహర్షులు రాముడికి అభిషేకము చేయించినారు. దేవతలు అందరూ నలుగురు దిక్పాలకులతో చేరి ఆకాశములో నిలుచుండి దేవలోకసంబంధము అయిన సర్వౌషధరసాలతో రాముడికి అభిషేకము చేసినారు. అప్పుడు రాముడికి మంగళకరము అయిన శ్వేతచ్ఛత్రాన్ని శత్రుఘ్నుడు పట్టి

నాడు. వానరరాజు అయిన సుగ్రీవుడు ఒక తెల్లటి వింజామరతోనూ రాక్షసరాజు అయిన విభీషణుడు చంద్రబింబమువంటి మరి ఒక తెల్లటి వింజామరతోనూ రాముడికి వీచినారు. అప్పుడు దేవేంద్రుడు చెప్పినందువల్ల వాయుదేవుడు నూరుకమలాలతో జ్వలిస్తూ ఉన్న ఒక కాంచనహారాన్ని తీసుకొనివచ్చి రాముడికి ఇచ్చినాడు. దేవేంద్రుడు మళ్ళీ ప్రోత్సహించినందువల్ల వాయుదేవుడు నవరత్నాలతోనూ నడుమ నాయకమణితోనూ అలంకరించినముత్యాలహారాన్ని తెచ్చి రాముడికి ఇచ్చినాడు. ఆ ధీమంతుడికి రాజ్యాభిషేకము జరుగవలసిన ఆ రాముడికి రాజ్యాభిషేకము జరుగుతూ ఉన్న ఆ సమయాన దేవ గంధర్వులు సంగీతము ఆలాపించినారు, అప్సరసలు నాట్యము ఆడినారు.

రామ రాజ్యాభిషేకసమయాన ఈ భూమిమీద పయిర్లు అన్నీ చక్కగా పండినవి. చెట్లు అన్నీ కాయలు కాచి పండ్లు పండినవి. పూలు ఘుమ ఘుమ వాసనలు గుబాళించినవి.

ఆ పురుషోత్తముడు రాముడు అప్పుడు ముందుగా బ్రాహ్మణోత్తములకు ఒక లక్ష గుర్రాలనూ క్రొత్తగా ఈనిన ఒక లక్ష గోవులనూ ఒక నూరు ఆబోతులనూ ఇచ్చినాడు. అంతేకాదు. ఆ బ్రాహ్మణోత్తములకు రాముడు ముప్పయి కోట్ల బంగారు నాణ్యాలనూ మహార్హములుఅయిన వస్త్రాలనూ వరాభరణాలనూ దానము ఇచ్చినాడు. సూర్యకిరణాలవలె కన్నులు మిరుమిట్లు గొలిపే మణిమయదివ్యకాంచనమాలను ఆ మానవేంద్రుడు రాముడు అప్పుడు సుగ్రీవుడికి బహుమానముగా ఇచ్చినాడు. ఎంతో అందముగా వైడూర్యమణులూ వజ్రాలూ పొదిగిన బంగారు బాహుపురులను ఆ ధృతిమంతుడు రాముడు అంగదుడికి బహుమానముగా ఇచ్చినాడు. చంద్రకిరణాలవంటి కాంతులతో విరాజిల్లుతూ ఉన్న మణిమయముక్తాహారాన్ని రాముడు అప్పుడు సీతాదేవికి ఇచ్చినాడు ఆ వైదేహి తన భర్త చూస్తూవుండగా అప్పుడు రెండు నిర్మలదివ్యవస్త్రాలనూ అందముఅయిన ఆభరణాలనూ హనుమంతుడికి బహుమానముగా ఇచ్చింది. అంతట ఆ జనకనందిని సీతాదేవి తనకు రాముడు ఇచ్చిన మణిమయముక్తాహారాన్ని మెడలోనుంచి తీసి తన భర్తవంకనూ వానరులు అందరివంకనూ పదేపదే చూచింది.

మనోగతాలనుబట్టి కనిపెట్టే రాముడు అప్పుడు ఆ జనకాత్మజను సీతాదేవిని చూచి "ఓ భామినీ, ఎవడు తన పౌరుషముతో తన పరాక్రమముతో తన బుద్ధిబలముతో నిన్ను సంతోషపెట్టినాడో నీవు ఆ బుద్ధిమంతుడికి నేను నీకు ఇచ్చిన ముక్తాహారాన్ని బహుమానముగా ఇవ్వు" అని చెప్పినాడు.

అప్పుడు ఆ అసితేక్షణ సీతాదేవి ఆ ముక్తాహారాన్ని హనుమంతుడికి ఇచ్చింది. చంద్రకిరణాలవంటి తెల్లని ఆమనోజ్ఞ ముక్తాహారాన్ని హనుమంతుడు పెట్టుకొన్నాడు. అప్పుడు ఆ హనుమంతుడు తెల్లటి మేఘము ఆవరించిన పర్వతమువలె శోభాయమానముగా కనిపించినాడు.

ఆ పరంతపుడు ఆ భూనాథుడు రాముడు అప్పుడు మైంద ద్వివిదులకూ నీలుడికీ వారి వారి కోరికలను గమనించి బహూకరించినాడు. ఇంకా తక్కిన వానరవీరులకు అందరికిన్నీ వానరవృద్ధులకు అందరికిన్నీ వారి వారి యోగ్యతలనుపట్టి ఆభరణాలనూ, వస్త్రాలనూ బహుమానముగా ఇచ్చినాడు. ఈ విధముగా విభీషణుడికీ సుగ్రీవుడికీ హనుమంతుడికీ జాంబవంతుడికీ తక్కిన వానర వీరులకు అందరికీ వారి వారి యోగ్యతలకు తగినట్టుగా పుష్కలముగా రత్నాద్యాభరణాలు ఇచ్చి రాముడు సంతోషపెట్టినాడు. వారి వారి కోర్కెలు చెల్లించినాడు. వారిని అందరినీ సత్కరించినాడు. అప్పుడు వానరోత్తములు అందరూ సంతుష్టులు అయి ఆ పూజ్యుడికి వీడ్కోలు చెప్పి సుగ్రీవుడివెంట కిష్కింధానగరానికి ప్రయాణమై పోయినారు. ఆ తరువాత రాక్షసరాజు విభీషణుడు రాముడికి వీడ్కోలు చెప్పి తన కులధనముఅయిన లంకారాజ్యానికి ప్రయాణము అయి పోయినాడు.

శత్రువులను అందరినీ సంహారము చేసివేసిన ఆ మహాశయుడు ఆ పరమోదారుడు రాముడు పరమ సంతోషముతో తన రాజ్యాన్ని పరిపాలించడము మొదలుపెట్టినాడు. ఆ ధర్మవత్సలుడు రాముడు సమస్తధర్మాలూ తెలిసిన తన తమ్ముణ్ణి లక్ష్మణుణ్ణి చూచి "ఓ ధర్మజ్ఞుడా, మన పూర్వికులుఅయిన రాజులు అందరూ తమ సామర్థ్యముతో ఈభూమిని ఏలినారు. ఇప్పుడు నీవున్నూ నాతోకూడా ఈరాజ్యము ఏలవలెను. పితృపితామహులు అయిన ఈ రాజ్య

భారాన్ని నేను ఒక్కడనే భరించలేను, కాబట్టి నీవు యువరాజుగా ఉండవలెను'' అని చెప్పినాడు. అందుకు లక్ష్మణుడు ఎంత మాత్రమూ ఒప్పుకోలేదు. అప్పుడు ఆ పరమపూజ్యుడు రాముడు భరతుణ్ణి యువరాజుగా అభిషేకము చేసినాడు.

రాముడు రాజ్యపాలనము ఆరంభించినతరువాత పౌండరీకమూ అశ్వమేధమూ వాజపేయమూ ఇంకా వివిధయజ్ఞాలూ చేసినాడు. భూరిదక్షిణలు బ్రాహ్మణులకు ఇచ్చి నూరు అశ్వమేధ యాగాలు చేసినాడు. ఆ ధర్మాత్ముడు రాముడు తన స్నేహితులతోనూ దాయాదులతోనూ బంధువులతోనూ వివిధ యజ్ఞాలూ చేసి దేవతలను పూజించినాడు. లక్ష్మణుడి సహాయంతో రాముడు పదకొండువేల సంవత్సరాలు రాజ్యపాలనము చేసినాడు.

రాముడు రాజ్యపాలనము చేస్తూ ఉన్న కాలములో దుష్ట మృగభయముకానీ చోరభయముకానీ రోగభయముకానీ ఎవరూ ఎరుగరు. ఎవరూ ఆపదలుఎరుగరు. స్త్రీలు వైధవ్యదుఃఖము ఎరుగరు. వృద్ధులకన్నా ముందుగా చిన్నవాళ్లు ఎవరూ చనిపోయి ఎరుగరు. సమస్త ప్రాణికోటీ సంతోషములో ఓలలాడింది. సమస్తజనులూ ధర్మపరులుగా జీవించినారు. ఒకరిని ఒకరు హింసించి ఎరగరు. ఆరోగ్యులుగానూ దృఢగాత్రులుగానూ వేలకొద్దీ పుత్రులతో ప్రతివారూ అనేకవేల సంవత్సరాలు జీవించినారు. ప్రతివారూ ఏవిషయానికి అయినా రాముణ్ణిగురించి చెప్పుకొంటూ, అనుక్షణమూ "రామా రామా" అని స్మరిస్తూ ఈ జగత్తును అంతా రామమయము చేసివేసినారు.

రామరాజ్యములో ప్రతివృక్షమూ ఆ ఈ కాలము అనే భేదము లేకుండా మానుకట్టి, కొమ్మలు విస్తరించి పూలు పూస్తూనూ పిందెలు కట్టుతూనూ కాయలు కాసి పండ్లు పండుతూనూ ఉండేవి. కాలము తప్పకుండా మేఘాలు వర్షిస్తూ ఉండేవి సర్వకాలాలలోనూ గాలి హాయిగా వీస్తూ ఉండేది. సర్వజనులూ ధర్మరతులు. ఎవరూ అనృతమాడి ఎరుగరు. సర్వజనులూ సమస్త సల్లక్షణసంపన్నులు. ధర్మపరాయణులు.

ఆ శ్రీమంతుడు రాముడు తమ్ముళ్లతోకూడా ఆవిధముగా పదకొండువేల సంవత్సరాలు రాజ్యపాలనము చేసినాడు.

ఫలశ్రుతి

ఇది ఆదికావ్యము. వేదార్థాన్ని వివరిస్తూ కవులు ఎవ్వరూ పుట్టకపూర్వము వాల్మీకిమహర్షి ఈ మహాకావ్యాన్ని చెప్పినాడు. దీనిని చదివినా, విన్నా సమస్తపాపాలూ నాశనము అయిపోతవి. ఈ పుణ్యకావ్యమువల్ల జీవితము ధన్యము అవుతుంది. ఆయువు వృద్ధి అవుతుంది. రాజులు అయినవారు చదివినా, విన్నా ఈ భూమిని అంతా జయిస్తారు. రామరాజ్యాభిషేకమువరకూ ఉన్న ఈ గ్రంథాన్ని విన్నవారూ, చదివినవారూ పుత్రులను కోరుకొంటే పుత్రులు పుట్టుతారు. ధనము కోరుకొంటే ధనము వస్తుంది. రాజులు విన్నా, చదివినా శత్రువులను అందరినీ జయించి ఈ భూమిని అంతా ఏలుతారు.

ఈ ఆదికావ్యాన్ని స్త్రీలు వినేటట్లయితే రాముణ్ణి కన్న కౌసల్యాదేవివలెనూ లక్ష్మణశత్రుఘ్నులను కన్న సుమిత్రాదేవి వలెనూ భరతుణ్ణి కన్న కైకేయీదేవివలెనూ దీర్ఘాయువులుగా ఉండే పుత్రులను కని సుఖపడతారు.

ఈ రామాయణము విన్నవాడు దీర్ఘాయుష్మంతుడు అవుతాడు. వేదార్థాన్ని ప్రతిపాదిస్తూ వాల్మీకిమహర్షి చెప్పిన ఈ ఆదికావ్యాన్ని శ్రద్ధతో విని ప్రతివాడూ కోపాన్ని జయిస్తాడు. కష్టాలలోనుంచి తరిస్తాడు. విదేశవాసము చేస్తూ ఉన్న బంధువులు అందరూ దగ్గరకువచ్చి సహాయపడతారు. రామానుగ్రహమువల్ల సమస్తకోరికలూ సఫలము అవుతవి.

ఈ రామాయణాన్ని చక్కగా వింటే దేవతలు అందరూ సంతోషిస్తారు. ఆ విన్నవారి ఇండ్లలో విఘ్నాలు కలుగచేసే భూతాలు అన్నీ శమించిపోతవి. విదేశము పోయినవాడు స్వస్థముగా తిరిగి స్వస్థానానికి వస్తాడు. పుష్పవతులు అయిన స్త్రీలు ఈ రామాయణ మహాకావ్యాన్ని వినేటట్లయితే సర్వోత్తములు అయిన పుత్రులను కంటారు.

ఈ ఆదికావ్యము పురాతనము అయిన ఇతిహాసము. దీనిని పూజిస్తూ పఠించేవారి సమస్తపాపాలు పరిహారము అయిపోతవి. అంతేకాదు. దీర్ఘాయుష్మంతులు అవుతారు. ఈ రామాయణాన్ని

ఎప్పుడూ చదువుతూ ఉన్నా వింటూఉన్నా రాముడు సంతోషిస్తాడు. రాముడు నిత్యుడు. ఆదిదేవుడు. సమస్తపాపాలనూ హరించివేసే శ్రీహరి. సృష్టికిపూర్వము జలము నివాసస్థానముగా చేసుకొన్న శ్రీమన్నారాయణమూర్తి. సర్వేశ్వరుడు. మహావిష్ణువు.

ఈ మహాకావ్యము మహాఅర్థవంతము అయినది. సమస్త శుభాలనూ ఇస్తుంది. దీనిని విన్నవారి కుటుంబము వృద్ధి అవుతుంది. ధనధాన్యాలు వృద్ధి అవుతవి. వారి ఇండ్లలో స్త్రీలు ఉత్తమోత్తములుగా ఉంటారు. ఉత్తమోత్తమ సౌఖ్యము అనుభవిస్తారు. వారికి కార్యసిద్ధి అవుతుంది. ఈ భూమిమీద సమస్త వైభవాలు సమకూరుతవి.

ఈ రామాయణాఖ్యానాన్ని సంపదలు కోరే సత్పురుషులు నియమముతో వినవలెను. అట్లా నియమముతో వినేవారికి ఈపుణ్యకావ్యము ఆయువునూ ఆరోగ్యాన్ని సత్కీర్తిని మంచి మంచి తోబుట్టువులనూ సౌఖ్యాన్ని జ్ఞానాన్ని తేజస్సునూ ఇస్తుంది.

ఇది ఇట్లా పూర్వముజరిగిన ఆఖ్యానము. దీనిని శ్రద్ధతో చదవండి. మీకు మేలు అవుతుంది. మీకు విష్ణుబలము వృద్ధి అవుతుంది. ఈ రామాయణ శ్రవణమువల్ల దేవతలు అందరూ సంతోషించడమే కాకుండా మీ పితృదేవతలు అందరూ తృప్తి చెందుతారు.

వాల్మీకిమహర్షి చేసిన ఈ రామాయణసంహితను భక్తితో వ్రాయించేవారూ వ్రాసేవారూ (ప్రకటించేవారూ) ఇహలోక సౌఖ్యాలే కాకుండా పునరావృత్తిరహితము అయిన స్వర్గలోక సౌఖ్యము అనుభవిస్తారు.

వాల్మీకి రామాయణము ఇంతటితో సమాప్తము.

శ్రీరామచంద్ర శ్రితపారిజాతః
సమస్తకల్యాణగుణాభిరామః
సీతాముఖాంభోరుహచంచరీకో
నిరంతరం మంగళమాతనోతు.

శ్రీరామచంద్రార్పణమస్తు.

త్రివేణి పబ్లిషర్సు, మచిలీపట్టణము

మా ప్రచురణలు

కాటూరి వేంకటేశ్వరరావు

పౌలస్త్యహృదయము-గుడిగంటలు (ద్వితీయముద్రణ)	రు. 1-50
మువ్వగోపాల (రేడియో నాటికలు)	2-00
గాంధీజీ స్వీయచరిత్ర (సంక్షిప్తము 330 పుటలు) బైండు	6-00
సాదా	5-00
సత్యశోధన (గాంధీజీ స్వీయచరిత్ర సంగ్రహము 153 పుటలు)	2-00

పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వేంకటేశ్వరరావు

తొలకరి (ద్వితీయముద్రణ)	1-25

'కులపతి' శ్రీ అడివి బాపిరాజు

నారాయణరావు (సప్తమ ముద్రణ)	7-50
ఆంధ్ర విశ్వకళాపరిషత్తువారి బహుమతిపొందిన సాంఘిక నవల	
హిమబిందు - ఉత్తమ చరిత్రాత్మక నవల (తృతీయముద్రణ)	6-00
తుపాను - సాంఘిక నవల (తృతీయముద్రణ)	5-00
గోనగన్నారెడ్డి - చరిత్రాత్మక నవల (తృతీయ ముద్రణ)	6-00
అడవి శాంతిశ్రీ - చరిత్రాత్మక నవల (ద్వితీయముద్రణ)	5-00
కోనంగి - సాంఘిక నవల (ఆరవముద్రణ)	6-00
అంశుమతి - చరిత్రాత్మక నవల (సప్తమముద్రణ)	1-00
వింధ్యాచలం - కథల సంపుటి	1-50
రేడియో నాటికలు (అచ్చులో)	
లలితకళలు (వ్యాససంపుటి) ..	
రేడియోప్రసంగములు ..	

'కవి సమ్రాట్' శ్రీ నోరి నరసింహశాస్త్రి

మల్లారెడ్డి - చరిత్రాత్మక నవల (ద్వితీయ ముద్రణ)	6-50
నారాయణభట్టు - చరిత్రాత్మక నవల. (తృతీయ ముద్రణ)	6-50

శ్రీ చింతా దీక్షితులు

శబరి (నాటకం)	2-50
మారి - పీతి - వెంకి (కథలు)	2-50
లీలాసుందరి (బాలసాహిత్యం)	0-50
బంగారు పిలక (బాలసాహిత్యం)	0-37
శరబాల (బాలసాహిత్యం)	0-60

వాల్మీకి రామాయణము

అనువాదకుడు : శ్రీ శ్రీనివాస శిరోమణి

బాలకాండ	3-00
అయోధ్యకాండ (రెండు భాగములు)	6-00
అరణ్యకాండ	3-00
కిష్కింధాకాండ	3-00
సుందరకాండ	3-00
యుద్ధకాండ (రెండు భాగములు)	6-00
శ్రీరామచంద్ర విద్యార్థికోశము (తెలుగు నిఘంటువు)	5-00

పూతలపట్టు శ్రీరాములురెడ్డి, శాక్యారి ఆర్మొగంపిళ్ల

మాలపల్లి	12-00

శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ

మానవులందఱు సోదరులు (గాంధీజీ రచనలనుండి సంకలితము)	5-50

సంకలనము: కృష్ణ కృపలాని, అనువాదము: పింగళి లక్ష్మీకాంతం

కావ్యదర్శనము (ఆంధ్ర సారస్వత విమర్శక వ్యాసములు) ధూవతి లక్ష్మీనారాయణరావు	2-50
బానిస బ్రతుకులు ("Uncle Tom's Cabin" in Telugu) నాయని సుబ్బారావు	2-00
సారస్వతాలోకము-(చతుర్థ ముద్రణ) రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ	3-00
విద్య-జీవితార్థము—జె. కృష్ణమూర్తి	2-00
కథాలహరి—పాలంకి వెంకట రామచంద్రమూర్తి	1-00
సర్దార్ పటేల్—కొడాలి ఆంజనేయులు	0-94